# "కవిశేఖర"

# శ్రీ గురుజాడ రాఘవశర్మ రచనలు – పరిశీలన

# "KAVISEKHARA"

## SRI GURUZADA RAGHAVA SARMA RACHANALU - PARISEELANA


పరిశోధకురాలు

**గురుజాడ. రాజరాజేశ్వరి** ఎమ్.ఏ., ఎమ్.ఫిల్.

పర్యవేక్షకులు

**డా॥ మన్నవ సత్యనారాయణ,** ఎమ్.ఏ., పి హెచ్.డి.

తెలుగు & ప్రాచ్య భాషా విభాగము

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయము

నాగార్జున నగర్ - 522510


పి హెచ్.డి. పట్టము కొరకు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయమునకు తెలుగు & ప్రాచ్య భాషా

విభాగము నుండి సమర్పింపబడిన సిద్ధాంత వ్యాసము

సెప్టెంబరు 2010

# వాఙ్మూలము

"కవిశేఖర" శ్రీ గురుజాడ రాఘవశర్మ రచనలు - పరిశీలన అను ఈ సిద్ధాంత వ్యాసాన్ని డా॥ ఎమ్. సత్యనారాయణ గారి పర్యవేక్షణలో రచించి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి పిహెచ్.డి. పట్టా నిమిత్తం సమర్పించుచున్నాను.

ఈ సిద్ధాంత వ్యాసము మరే ఇతర గ్రంథాలకు అనుకరణ గానీ, అనువాదం కానీ గాదు. దీనిని ఏ ఇతర పట్టం కొరకు గాని, డిప్లొమా కొరకు గానీ, ఇతర బిరుదుల కొరకు గానీ ఇంతకు పూర్వం యే ఇతర విశ్వవిద్యాలయానికి/సంస్థకు సమర్పించలేదని ఇందుమూలముగా తెలియజేయుచున్నాను.

నాగార్జున నగర్ : గురుజాడ రాజరాజేశ్వరి

తారీఖు :

# ధ్రువీకరణ

"కవిశేఖర" శ్రీ గురుజాడ రాఘవ శర్మ రచనలు - పరిశీలన అను ఈ సిద్ధాంత వ్యాసాన్ని శ్రీమతి గురుజాడ రాజరాజేశ్వరి నా పర్యవేక్షణలో రూపొందించి పిహెచ్.డి పట్టం కొరకు నాగార్జున విశ్వవిద్యాలయానికి సమర్పించుచున్నారు. ఈ పరిశోధన ఆమె స్వయంకృషి అని ధ్రువీకరిస్తున్నాను.

నాగార్జుననగర్ :

తారీఖు :

డా॥ మన్నవ సత్యనారాయణ
తెలుగు శాఖాధిపతి
తెలుగు & ప్రాచ్య భాషా విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయము
నాగార్జుననగర్ - 522 510

# కృతజ్ఞతాంజలి

నాకు తెలుగు భాషా మాధుర్యాన్ని చవి చూపించి అభిమానమేర్పడేటట్లుగా అను నిత్యము ప్రోత్సహిస్తూ పాఠాలు బోధించిన మా గురువర్యులు కీ॥శే॥ శ్రీ అద్దేపల్లి లక్ష్మణస్వామి గారికి, శ్రీ దైతా శివరామ శాస్త్రి గారికి నా కృతజ్ఞతా పూర్వక అభివందనములు.

నా చేత ఎమ్.ఏ చదివించి, ఎమ్.ఫిల్ చేయుటకు ప్రోత్సహించి కావలసిన అంశము నిచ్చిన మా తాతగారు కీ॥శే॥ కవిశేఖర శ్రీ గురుజాడ రాఘవ శర్మగారికి నా శిరస్సు వంచి పాదాభివందనము చేయుచున్నాను.

నన్ను కని, పెంచి, విద్యాబుద్ధులు నేర్పి, నా యీ పి.హెచ్.డి పరిశోధనకు చేయూత నిచ్చి ఆశీర్వదిస్తున్న నా జననీ జనకులు శ్రీమతి గురుజాడ సరస్వతి, చిరంజీవి గారికి నా అభివందనములు. పరిశోధన చేయుటకు అనుమతించిన ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖాధికారులకు కృతజ్ఞతలు.

“కవిశేఖర” శ్రీ గురుజాడ రాఘవ శర్మ రచనలు - పరిశీలన” అను శీర్షిక పై పరిశోధన జరుపుటకు అవకాశము కల్పించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అధికారులకు తెలుగు ప్రాచ్య భాషా విభాగము బోధనావర్గ సభ్యులు ఆచార్య టి. సత్యవతి, ఆచార్య పి. వరప్రసాదమూర్తి, ఆచార్య జి. వై ప్రభావతి దేవి, డా॥ కె. సత్యనారాయణ, డా॥ఎన్.వి కృష్ణారావు, శ్రీమతి ఇ. మాధవి గార్లకు కార్యాలయ విభాగం నిర్వాహకులకు నా కృతజ్ఞతలు.

గురుజాడ రాఘవ శర్మ గారిమీద వారి మనుమరాలుగా నేనే ఈ పరిశోధన చేస్తే బాగుంటుందని సలహా యిచ్చి, నా పరిశోధనకు మార్గదర్శకులుగా వ్యవహరించి తమ అమూల్యమైన సూచనలను, సలహాలను అందించిన డా॥మన్నవ సత్యనారాయణగారికి నా హృదయపూర్వక కృతజ్ఞతాభివాదములు.

నా పరిశోధనాంశము నామూలాగ్రముగా చూచి తమ అమూల్య సలహాలనందించిన పూజ్యులు శ్రీ యడవల్లి రమణరావు గారికి, బ్రహ్మశ్రీ చిట్టావూరి శివరామకృష్ణశర్మగారికి, కూచిభట్ల చంద్రశేఖర శర్మగారికి, శ్రీ రావి రంగారావు గారికి వ్యక్తిగత సమాచార సేకరణలో శ్రీ రాఘవ శర్మగారి కుమారులు శ్రీ గురుజాడ చిరంజీవి (దుర్గా నాగేశ్వర శర్మ) గారికి "ముఖాముఖి" లో పాల్గొన్న వారి కుటుంబసభ్యులు శ్రీ గురుజాడ వేంకటేశ్వరరావు గారికి, వారి సహచరులు శ్రీ కూచిభట్ల వారికి, జ్యోతిష విభాగములో నాతో సహకరించిన శ్రీ అద్దేపల్లి వేంకట రమణ గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

నా సిద్ధాంతవ్యాసమును దిద్దుటకు సహాయము చేసిన శ్రీయుతులు కె.వై.ఎల్. నరసింహం గారికి వడ్లమన్నాటి ఉమామహేశ్వర ప్రభూజీ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

శ్రీ శర్మగారు రచించిన స్వాతంత్రోద్యమ గేయాలను శ్రావ్యంగా పాడి రికార్డుచేసిన వడ్లమన్నాటి గాయత్రి మహేష్ బృందము వారికి నమస్సుమాంజలులు.

నా పరిశోధనకు ప్రారంభము నుండి ఉత్సాహాన్ని, ఆర్థిక హార్థిక సహాయ సహకారములందిస్తున్న నా భర్త శ్రీ తాళ్ళూరి రామకృష్ణ ప్రసాద్ గారికి నా నమస్కారములు. మా పుత్ర ద్వయము ఫణిమాధవ్, ఆదిత్యసాయిలకు ఆశీస్సులు.

సకాలములో అందముగా డి.టి.పి చేసి ఇచ్చిన కూచిభట్ల వసుంధర రామకృష్ణ దంపతులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. పరిశోధన గ్రంథాన్ని అందముగా అలంకరించి తీర్చి దిద్దిన మా తమ్ముళ్ళు చి॥ రామకృష్ణ సుందర నారాయణశర్మ దంపతులు బృందావన్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ మచిలీపట్నము వారికి, ఇండియన్ ప్రింటర్స్ విజయవాడ వారికి, చి॥ పూర్ణాంజనేయశర్మ దంపతులు విష్ణు ఏజన్సీస్ విజయవాడ వారికి నా ప్రేమ పూర్వక ఆశీస్సులు. ఈ పరిశోధన గ్రంథము సర్వాంగ సుందరముగా రూపొందుటకు, వ్రాయుటకు ప్రేరణ కలిగించిన ఆ తల్లి శ్రీ శారదామాత పాదార విందములకు మా ఇంటి ఇలువేల్పుఅయిన ఆ శ్రీకృష్ణ పరమాత్మకు, శ్రీకృష్ణోపాసకులైన మా నాయనమ్మతాత గార్లకు సాష్టాంగ నమస్కారములు చేయుచున్నాను.

# విషయసూచిక


**1. జీవిత విశేషాలు** ............................................ **1 - 137**

1.1 ఉపోద్ఘాతము
1.2 వంశచరిత్ర
1.3 బాల్యము
1.4 విద్యాభ్యాసము
1.5 వివాహము
1.6 సంతానము
1.7 గురుపరంపర
1.8 గురుసాధకులు
1.9 శ్రీ కృష్ణోపాసకులు
1.10 వ్యక్తిత్వము
1.11 నిత్యకర్మిష్ఠి
1.12 సంగీతజ్ఞులు
1.13 నటులు
1.14 వాస్తు శాస్త్రవేత్త
1.15 జ్యోతిశ్శాస్త్రవేత్త
1.16 నిర్వహించిన పదవులు
1.17 ప్రసంగాలు
1.18 సభలు - సన్మానములు
1.19 కవిశేఖర బిరుదు - కవి
1.20 ఇతర కవులు - సాన్నిహిత్యము
1.21 స్వాతంత్ర్య సమరయోధులు
1.22 మహాప్రస్థానము

**అనుబంధాలు** ............................................ **138 - 185**

**2. ప్రకృతి పరిశీలకుడు - కాళరాత్రి** ............................................ **186 - 209**

**అనుబంధాలు** ............................................ **210**

**3. కల్పలత ఖండకావ్య సమీక్ష** ............................................ **211 - 270**

3.1 వినతి
3.2 సందర్శనము
3.3 వాత్సల్యము

3.4 పోతనామాత్యుడు

3.5 గోపికాహృదయము

3.6 వేడ్కోలు

3.7 శ్రద్ధాంజలి

3.8 గ్రహస్తవము

3.9 కల్పలత

**అనుబంధాలు** ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ...271 - 277

**4. అనువాదములు - భక్తిసాహిత్యము** ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... 278 - 345

4.1 ముకుందమాల

4.2 శ్రీ సూక్తము

4.3 శ్రీ గాయత్రి మంత్రార్థము

4.4 శ్రీ లక్ష్మీదివ్యగుణ వైశిష్ట్యము

4.5 శ్రీ వాసుదేవనామ శతకము

4.6 అంజలి

4.7 శ్రీ సువర్చలాంజనేయమ్

**అనుబంధాలు** ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ...346 - 353

**5. జాతీయోద్యమ స్ఫూర్తి** ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... 354 - 435

5.1 జాతీయ గీతములు

5.2 స్వాతంత్ర్యపథము

5.3 గాంధేయవాది

5.4 ఆంధ్రదేశాభిమాని

5.5 ఆంధ్ర భాషాభిమాని

5.6 తోటి నాయకాభిమాని

**అనుబంధాలు** ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... 436 - 460

**6. అముద్రిత గ్రంథములు** ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... 461 - 528

6.1 ఉత్తర దక్షిణదేశ పవిత్రయాత్రా స్థలములు

6.2 జగన్మోహన శతకము

6.3 కృష్ణ శతకము

6.4 మేనక - విశ్వామిత్ర నృత్యనాటిక

6.5 భ్రమరగీతలు

6.6 సిద్ధేంద్రయోగి నాటకము

# జీవిత విశేషాలు

# జీవిత విశేషాలు

## 1.1 ఉపోద్ఘాతము: -

**"అంతటనున్నవాడు, హృదయాంతరమందు, (జెలంగువాడు; కా**
**లాంతర భేదమున్ గనకహర్నిశమున్ వెలుగొందు వాడి కిం**
**తింతయనంగ రాక, యణువై, ఘనమేరువునై, జగమ్మునై**
**వింతలు సేయువాడు, కనువిచ్చిన మూసిన, దోచునీయెడన్"[1]** కల్పలత-వేడికోలు1వ పద్యం

అగాధమైన అపారపారావారములో అమూల్యమైన ముత్యాలు అట్టడుగున అణగియుండును. మేలి వజ్రాలు కఠిన శిలాగర్భమున, కానరాక యొదిగి యుండును. మచ్చలేని మాణిక్యాలు ధూళిధూసరితమై మట్టిలో గుట్టగా బడి యుండును. అట్లే మహానుభావులు మారుమూల ఊరు పేరు లేని ఉపాధులలో అనంతకాంతి పుంజముల ప్రసరించు జీవన్మణులుగా ప్రభవించి, స్వప్రకాశమున అసాధారణముగ విరాజిల్లుచు అకళంకమైన కీర్తి చంద్రికలను విరజిమ్ముచు భావాంబర వీధులలో ధ్రువతారలుగా భాసిల్లుదురు. అట్టి పురాకృత సుకృత జీవులలో కీ॥శే॥ కవిశేఖర శ్రీ గురుజాడ రాఘవశర్మగారొకరు.

**"యదాయదాహి ధర్మస్య గ్లా నిర్భవతి భారత।**
**అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్"[2]** భగవద్గీత చతుర్థోధ్యాయ:7వ శ్లో॥

ఈ భూమిపై అధర్మము ప్రబలినప్పుడు ధర్మప్రతిష్ఠాపనకై భగవంతుడు ఏదో ఒక రూపములో అవతరించునని

**"పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్**
**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" [3]** భగవద్గీత చతుర్థోధ్యాయ:8వ శ్లో॥

గీతాకారుడు చెప్పినట్లుగా,సుమారు రెండున్నర శతాబ్దముల కాలము పరాయి పరిపాలన క్రింద దాస్య శృంఖలములలో బందీకృతయైన భరతమాతను విముక్తి నొందించుటకు భారతావనికి ఏడుగడయై

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట 57
2. శ్రీ మద్భగవద్గీత చతుర్థో2ధ్యాయ: - జ్ఞానకర్మసన్యాసయోగ: 7వ శ్లో॥
3. శ్రీ మద్భగవద్గీత చతుర్థో2ధ్యాయ: - జ్ఞానకర్మసన్యాసయోగ: 8వ శ్లో॥

మహాత్మాగాంధీ అవతరించెను. గాంధీజీ స్వాతంత్ర్య సంగ్రామములో అడుగు పెట్టినది మొదలు ఆయన నాయకత్వంలో ఎందరో మహానాయకులు ఒక్క త్రాటిపై నడిచి గాంధీ అడుగు జాడయే తమ అడుగు జాడగా భావించి సంచరించిన వారు కలరు. వారిలో శ్రీ గురుజాడ రాఘవ శర్మగారు ఒకరు. వీరు తమ కమనీయమగు కవితల ద్వారా, ఉత్తేజకరమగు గేయముల ద్వారా దేశప్రజలలో స్వాతంత్ర్యాభిలాషను రేకెత్తించి వారిలో అకుంఠిత దేశ భక్తిని ప్రేరేపించిన మహాకవి, స్వాతంత్ర్య సమరవీరులు, భారత ప్రభుత్వ తామ్రపత్ర గ్రహీత, నిస్వార్థ దేశ భక్తులు, నిరంతర శ్రీకృష్ణ పదసేవాను రక్తులు, నిస్తుల వాస్తు, జ్యోతిశ్శాస్త్ర పారంగతులు, ప్రథిత బహుగ్రంథకర్త, నిరంతర నిష్కామ కర్మశీలి, నైష్ఠిక వరిష్ఠులు. నాడు భారత దేశములో ప్రతి ప్రాంతములోను ఎవరో ఒక దేశ భక్తుని నాయకత్వములో స్వాతంత్ర్యోద్యమము కొనసాగినది. చరిత్ర ప్రసిద్ధి గాంచిన బందరు పట్టణము డాక్టరు పట్టాభి, చెఱకువాడ, కోపల్లె, ముట్నూరి,కౌతాశ్రీరామశాస్త్రి, గురుజాడ, రాఘవశర్మ వంటి మహాను భావులకు నెలవై ఆకాలము స్వర్ణయుగముగా భాసిల్లినది.

మానవసమాజములో నాలుగు వర్ణాలున్నాయని తెలియుచున్నది.

**"చాతుర్వర్ణ్యం మయాసృష్టంగుణకర్మవిభాగశ:**
**తస్యకర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్"[1]** భగవద్గీత చతుర్థోధ్యాయ:13వ శ్లో।

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను నాలుగు వర్ణములు సత్వాదిగుణముల యొక్కయు, ఆ గుణములచే చేయబడు కర్మల యొక్కయు విభాగము ననుసరించి నాచే సృజింప బడినవి" అని శ్రీకృష్ణ పరమాత్మ సకల ఉపనిషత్సారమైన భగవద్గీత యందు చెప్పియున్నాడు.

ఇట్టి బ్రాహ్మణవంశములో ఆరువేల నియోగి శాఖలోజన్మించినవారు శ్రీరాఘవశర్మ.వీరి వంశమును గురించి పరిశీలిద్దాము.

## 1.2 గురుజాడ వంశచరిత్ర: -

గురుజాడ గ్రామమునకు, గురుజాడ వంశీయులకు బంధము అనేక విధములుగా పెనవేసుకున్నట్లుగా చరిత్ర గోచరించుచున్నది. ఈ గురుజాడ గ్రామములోనే గురుజాడ వారు మూడు

1. శ్రీ మద్భగవద్గీత చతుర్థో2ధ్యాయ: - జ్ఞానకర్మసన్యాసయోగ: 13వ శ్లో॥

కుదుళ్ళుగా 10, 15 కుటుంబములవారు 1980సం॥ వరకు ఉన్నట్లు తెలియ జేయుటకు సంతోషించు చున్నాను.

1. మొదటి కుదుర్లోని గురుజాడ వీర్రాజు శరభరాజు, ఆదెయ్య, సాళ్వాపతి, త్ర్యయంబకం, కామేశ్వరరావు మున్నగువారు కలరు. వారిలో శ్రీ త్ర్యయంబకంగారి జేష్ఠ పుత్రులే శ్రీ రాఘవశర్మ. ఈ కుదుర్లోని వారే గ్రామకరణంగా, గ్రామ పెత్తందార్లుగా ఉండేవారు.

2. గురుజాడ భానుమూర్తిగారు, విజయరామయ్యగారు సుబ్బారావుగారు, మరికొందరు యీ కుదుర్లోనివారే. వీరి పెద్దల్లో అనగా పైతరంవారు మహాకవి గురుజాడ అప్పారావు గారు రామదాసు పంతులుగారు ఉండిరి. మూడు తరములకు ముందుగా అప్పారావు గారి, పూర్వీకులు విజయనగరం వెళ్ళినట్లు చరిత్ర తెలియజేయుచున్నది. గురుజాడ సుబ్బారావుగారు వారి కుమారులు గురుజాడ భానుమూర్తి గ్రామ మునసబుగా, గ్రామపెత్తందారీ వ్యవహారములు చక్కదిద్దేవారు.

3. మూడవ కుదుర్లోని గురుజాడ, రామన్న, లక్ష్మన్న వంశీయులలో గురుజాడ నరసింహారావు గారు, సీతారామయ్యగారు, గురుజాడ రామచంద్రయ్య పంతులుగారు, భాస్కరరావుగార్లు, గురుజాడ గ్రామములో శ్రీ కృష్ణానంద పరపతి సహకార సంఘమును 1918వ సం॥లో స్థాపించి ప్రక్క గ్రామములలో కూడా సహకార పరపతి సౌకర్యమును అందించినారు మరియు 1930 సం॥లో గురుజాడ రామచంద్రయ్య పంతులుగారు గురుజాడలో గ్రామ పంచాయతి ఏర్పాటు చేసి చుట్టుప్రక్కల గ్రామస్థుల సమస్యలు పంచాయతీ చేసి ఎనలేని సేవలందించారు. వీరు స్వాతంత్ర్య సమరంలో కూడా పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు. గ్రామకరణము, మునసబు పంచాయతి మరియు సహకార సంఘ ప్రెసిడెంట్లుగా గురుజాడ వంశీయులే నిర్వహించిరి. (తదుపరి ప్రభుత్వము వారు చేసిన కొత్త చట్టం ప్రకారము రిజర్వేషన్ పాలనా పద్ధతి మారినది.) గురుజాడలో గురుజాడ వెంకటేశ్వరరావుగారు పంచాయతీ ప్రెసిడెంటుగా నుండగా గురుజాడ గ్రామము ఉత్తమ పంచాయతీగా ప్రభుత్వము ప్రశంసలనందుకున్నది. వీరి పాలనలో యితోధిక సేవలందించి గ్రామ ప్రజలతోనేగాక చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలతో విశేష మన్ననలు పొంది ఆదర్శవంతముగాను, గౌరవముగా జీవనము గడిపి ప్రజలలో ఆదర్శప్రాయులుగా చెరగని ముద్ర పొందినారు. ఈ వంశములోని వారే హరిజనోద్ధరణ, సామాజిక సంస్కరణలు, వరకట్న నిషేధము మున్నగునవి ఎన్నో తెచ్చినారు.

"గురుజాడ గ్రామములో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయము పశ్చిమ ముఖద్వారము ఉండుటచే పరశురామ ప్రతిష్ఠ అని చెప్పబడుచున్నది. తరువాత కొంత కాలమునకు శిథిలమై మరుగున పడియున్న శివలింగము ఒకరోజున రాత్రి గురుజాడ వంశములోని వృద్ధ మాతకు స్వప్నములో శ్రీవారు రెండు జమ్మి వృక్షముల మధ్యప్రదేశములో లింగ రూపములో ఉన్నట్లు తెలుపుట వలన అప్పటి గురుజాడ వంశీయులు, పెద్దలు వెళ్ళి త్రవ్వి శ్రీ స్వామివారిని గుర్తించి, చిన్న ఆలయము ఏర్పాటు చేసి ధూపదీప నైవేద్యములు జరుపుచుండెడివారు. స్వప్న దర్శనము పొందిన వృద్ధమాత శ్రీ రాఘవ శర్మగారి వంశములోని పూర్వీకులే. ఈ వంశమువారు ఈశ్వర ఆరాధన భక్తులు అగుట వలన నాటినుండి ఈ వంశమువారిలో త్ర్యయంబకము, సాళ్వాపతి, కామేశ్వర, శ్రీ త్రిపురసుందరి, కామేశ్వరి, శ్రీరాజరాజేశ్వరి, అన్నపూర్ణ మున్నగు వివిధ నామములు కలవు. ఈ వంశము వారిలో పంచాయతన, దేవతార్చన, అగ్నికార్యం, (వైశ్వదేవం) కూడా నేటికి జరుగుచున్నవి. అందుమూలముననే కాబోలు శ్రీరాఘవశర్మ పెద్దనాన్నగారు, స్వాతంత్ర్య సమరయోధులైనను, అంతర్ముఖముగా గొప్ప ఉపాసనాపరులు"[1] అని శ్రీరాఘవశర్మగారికి పినతండ్రిగారి తనయులు - పంచాయతీ ప్రెసిడెంటు శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానము ధర్మకర్త అయిన శ్రీ గురుజాడ వేంకటేశ్వరరావుగారు శ్రీ గురుజాడ రాఘవశర్మగారి శతజయంత్యుత్సవ సంచికలో తెలియజేసిరి.

"ఈ గురుజాడ గ్రామము కృష్ణాజిల్లా (గన్నవరంతాలూకా) మచిలీపట్నము - విజయవాడ రోడ్డు (42 మైళ్ళు) పై మచిలీపట్నము నుండి 22 మైలులో, గురుజాడ, తాడంకి, మంటాడ కూడలి గ్రామములలో ఒకటి. గురుజాడ వంశము గురుజాడలో విస్తరించుటచే విద్యలకై జీవనోపాధులకై గురుజాడ వంశీయులు కృష్ణాజిల్లా శేరీ దగ్గుమిల్లి, తామర కొల్లు, కొండూరు, ఆల్లూరు - బొమ్మినంపాడు, గురుజాడలోను, కాకినాడ, పార్వతీపురం, రాజమహేంద్రవరము, విజయనగరము, నాగపురము, బరంపురము, ఆస్కా, చెన్నపురి, బొంబాయి పట్టణములకు తరలి కీర్తి ప్రతిష్ఠలు సంపాదించుకొని కుటుంబములతో వెలయుచున్నారు"[2].

"పూర్వము గోత్రాలేగాని గృహనామములు లేవు. క్రీ॥శ॥12,13,14 శతాబ్దములలో అవి ఏర్పడినట్లుగా ఉన్నవి. గృహనామము లేర్పడేనాటికి ఏ గ్రామము నుండి వచ్చినవారిని ఆయా గ్రామనామాలతో పిలిచెడివారు. ఉదాహరణకు చింతలపాడు అనే ఊరినుండి వస్తే చింతలపాటి వారని, కాజ అనే ఊరి నుండి వస్తే

1. గురుజాడ వెంకటేశ్వరరావుగారు 'మా పెద్దనాన్నగారు-గురుజాడ', శ్రీ గురుజాడ రాఘవశర్మగారి శతజయంత్యుత్సవసంచిక పుట28
2. గురుజాడ వంశీయులకు విజ్ఞాపన - కరపత్రము - గురుజాడ - రాఘవశర్మ

కాజవారని పిలుచుట పరిపాటి. ఈ వాడుక అన్నికులాలలోను, తెగలలోను కూడ కన్పించుచున్నది. శ్రీ శర్మగారి ఇంటిపేరు కూడా అట్లాగే ఊరును బట్టి గురుజాడగా వ్యవహరింపబడినది. గురుజాడ అప్పారావుగారి స్వగ్రామము కూడా ఈ గురుజాడయే కాని తమ తండ్రిగారి కాలములో విజయనగర సంస్థానములో ఉద్యోగరీత్యా స్థిరపడినారు. అప్పారావుగారి సొంత ఇల్లు కూడా గురుజాడలో ఉండేదట. ఈ విషయములు శ్రీశర్మగారే పండితులు శ్రీమాన్ ఈయుణ్ణి వీరరాఘవాచార్యులుగారికి సమాధానం వ్రాస్తు ఒక చోట వ్రాసిరి".[1]

క॥ "గురుజాడయె, స్వగ్రామము
గురుజాడయె, యింటిపేరు, గురుకోవిదులౌ
గురుజాడ అప్పరాయఁడు
మఱియును శ్రీరామమూర్తి, మా వంశజులౌన్"[2].

క॥ "ఇమ్ముగ, యశమున్గను, వం
శమ్మిది గురుజాడ, పూర్ణచంద్రకవి యు, మా
తమ్ముఁడు శ్రీ శివ భాగవ
తమ్మున్ రచియించె, బుధహితమ్ముగ భక్తిన్"[3].

క॥ "అఱువది రెండవ సంవ
త్సరమిది జన్మించి, బుధులసాంగత్యమునన్
గఱచిన విద్యలచే, ఁబదు
గుఱు, మన్నన సేయ గంటి గురుకృపగంటిన్"[4]

క॥ "జాతీయోద్యమ, హేతువు
చేతన్ మచిలీపురమ్ము జేరితి, సాగెన్
గైతయు, జ్యోతిషమున్ వి
ఖ్యాతిగ, బృందావనమ్మె, కాపురమాయెన్"[5]

క॥ "శ్రీ కౌండిన్యస గోత్రుఁడ
శ్రీ కృష్ణ పదారవింద సేవకుఁడ, బుధ
శ్లోకుండు, పోతరాజు, మ
హాకవి చరణా శ్రయుడనయా ! రాఘవుడన్"[6].

1. గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.
శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 2,3,4,5,6 పద్యాలు

గురుజాడ వీరి స్వగ్రామమని, గురుజాడయె ఇంటి పేరని, గురుకోవిదులైన అప్పరాయడు, శ్రీరామమూర్తి మా వంశజులని మిక్కిలి యశస్సు నార్జించిన వంశము గురుజాడయని వీరి తమ్ముడు పూర్ణ చంద్రకవి శ్రీ శివ భాగవతమును భక్తితో రచియించెనని చెప్పుకొనిరి. జన్మించిన తరువాత అరువది రెండవ ఏట నుండి పండితుల సాంగత్యముచే, విద్యచే గురుకృప వలన పదుగుఱు మన్ననలందితిని. జాతీయోద్యమ కారణముగా మచిలీపట్టణము వచ్చితినని, కవిత్వము, జ్యోతిషము విఖ్యాతిగ చేయుచు బృందావనములోనే ఉంటినని, కౌండిన్యస గోత్రములో పుట్టిన వాడినని, శ్రీ కృష్ణ పదారవింద సేవకుడనని, పోతరాజు మహాకవి చరణముల నాశ్రయించిన వాడినని రాఘవుడనని చెప్పుకొనిరి. దీనిని బట్టి వీరి వంశీకుల యెడ వీరి గల భక్తి, గోత్రభక్తి వెల్లడియగుచున్నది.

ఎవరైనను పొరపాటున గురుజాడ పదమును "గురజాడ" గా ఉచ్చరించినచో శ్రీ శర్మగారు మేము "గురువు" ల "జాడ" లలో నడుచువారమేగాని 'గుర' జాడలో పోవు వారము కాదు అని హెచ్చరించెడివారు. అప్పారావు గారి యింటి పేరు గురుజాడయే కానీ ఆయన భాష వ్యవహార భాషయగుటచే గురుజాడను సరళము చేసినందున గురజాడ అయినది.

శ్రీ శర్మ గారి బాల్య స్నేహితులు, సహాధ్యాయి - తురీయాశ్రమ స్వీకారము చేసి కాశీలో ఆంధ్రాశ్రమము నిర్వహించి అచ్చటనే సిద్ధి పొందిన సిద్ధపురుషులు, ప్రసిద్ధ పండితులు బ్రహ్మశ్రీ వేమూరి సీతారామ శాస్త్రి గారు వీరిని ప్రశంసించుచు,

**"గురుజాడ అప్పరాయని**
**గుఱుతించెం, జనిన పదప గొలువం జొచ్చెన్**
**గురుజాడ రాఘవ కవిన్**
**గుఱుతించెన్మనెడు తఱిన కొలిచెన్ ముదమౌ "[1]**

**"గురజాడ ' కొలముగాదిది**
**'గురుజాడ ' కులమ్ము కాదగున్ వీరు జగ**
**ద్గురు జాడఁగొల్వ బడుచుం**
**డిరి, కరమానంద మయ్యె డెందమ్మునకున్"[2]**

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1,2 పద్యాలు

'కవిశేఖర' శ్రీ గురుజాడ రాఘవశర్మ గురుజాడ వారి వంశవృక్షమును సేకరించుటకు అనేక గ్రామములు, పట్టణములు, అనేక ప్రదేశాలకు ముఖ్యముగా తామరకొలను, వెణుతురుమిల్లి, కైకలూరు, కాకినాడ, విజయనగరము, బరంపురము, హైదరాబాదు, బొంబాయి మొదలగు ప్రాంతాలకు వెళ్ళి, ఉత్తరములు వ్రాసి తొమ్మిది తరములు గల గురుజాడ వారి వంశము శాఖోపశాఖలుగా విస్తరించిన దానిని వ్రాయుట జరిగినది. అంతేగాక గురుజాడ అప్పారావు గారింటికి వెళ్ళుట - వారి పుట్టిన విషయాలు - వారిని గురించిన వివరాలు సేకరించుటయే గాక వాటిని గ్రంథస్థము చేయుట - వీరిది విడిగా వంశవృక్షము గురుజాడ శ్రీ రాఘవశర్మ గారి వంశ వృక్షము - విడివిడిగా వ్రాసిరి. ఆ అన్వయ క్రమమును పద్యములలో కూడ వివరించిరి. అవి ఇవి.

**సీ॥ "కామేశ్వరీ కటాక్ష గురుజాడాన్వయము మూల పురుషుడక్కిరాజు**
**తన్మూల పురుషు, తనయుడుదార, శౌర్య గుణుండు సూరపరాజ విభుడు**
**సప్త సంతానముల్ స్థాపించె, దేవీ ప్రసాదుండు, మంత్రియే శరభరాజు**
**అతండు గాంచె విఖ్యాత వీర్రాజు, సాళ్వపతి యచ్చన్న పుత్రత్రయమ్ము**
**అందు సాళ్వపతి, త్ర్యయంబక, మురహరి**
**పుత్రు లిర్వురగాంచె పుజ్యయశుల**
**పుట్టె వరమ్ముగ మురహరి కంత్యకా**
**లమునకు నాది నారాయణుండు**
**అతని సుతులు త్ర్యయంబక సాళ్వప**
**తుల్ దానధర్మ సద్గుణ విభవులు"[1].**

**"తఱుగని వితరణోదారులై ఖ్యాతి గన్నారట గురుజాడవారుమున్ను**
**సకల సాహిత్య విశారదులౌచు మన్నారలు గురుజాడవారుమున్ను**
**ప్రాభవస్వామి కార్య ధురంధరులయి మన్నారట గురుజాడ వారుమున్ను**
**కామేశ్వరీ కృపాకలన విజయమ్ముగన్నారట గురుజాడ వారుమున్ను"[2]**

**గీ॥ "అట్టి గురుజాడ వారిలో నలఘుకీర్తి**
**గన్న వారలలో పేరుగన్నవారు**
**అపరశారద అప్పరాయండొకడు**
**పండబారిన కవితల్లజుండతండు"[3]**
**(వంశ మర్యాద నిల్పిన పండితుండు)**

1. గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1,2,3 పద్యాలు

గీ॥ "విన్నవింపరు, పెరవారు తన్నుగూర్చి
చెప్పకొన్నను తెలియద స్వీయ చరిత
సత్కవిత్వమునకు ప్రకాశమ్ము వలదె
తానె స్వయమ్ముగ జెప్ప జుల్కనగనెంత్రు
చెప్పియున్ జెప్పకున్నెటు వచింపనౌనో!"[1]

గీ॥ "మిన్నకుండిన కవితకేమిటగొరంత
పల్కుటయెవంతు సహజప్రభావమద్ది
అనుచుబల్కిన పల్కుల నణచుకొన్న
భావమున జీర్ణమగునుగాని పల్కు వినెడు
భాగ్యముండదు తొలిజన్మ భాగ్యమునర
చింపగలిగినయది వమ్ము చేయనౌనె
తీర్పగా నౌనె ధర్మసందేహమౌర!"[2]

"శ్రీ గురుజాడ రాఘవశర్మగారి పేరులో రాసినప్పుడు వీరరాఘవశర్మ అని ఉన్నది. అది తరువాత వ్యవహారములో రాఘవశర్మ అయినదని వారే వ్రాసికొనిరి[3] వీరు తమ వంశవృక్షములో మూల పురుషుడు అక్కిరాజు అని, వారికుమారుడు శౌర్యగుణుడు సూరపరాజని, దేవీప్రసాదము వలన లభించినవాడు శరభరాజని, వారికి వీర్రాజు, సాళ్వపతి, అచ్చన్న అను పుత్రులు ముగ్గురు ఉదయించిరి అని వారిలో సాళ్వపతి గారికి త్ర్యయంబక, మురహరి పుత్రులిద్దరని అందులో మురహరి గారికి ఆదినారాయణుడు అను కుమారుడుదయించెనని - ఆదినారాయణ గారి కుమారులు ఇద్దరు - వారు 1.త్రయంబకరావు 2. సాళ్వపతి అని వీరు దాన ధర్మ గుణులు అని త్రయంబకరావు గారికి ఏడుగురు కుమారులు. వీరిలో జ్యేష్ఠులు వీరరాఘవశర్మ అను పేరుతో గల రాఘవశర్మగారు. 2. మురహరిరావు గారు 3. కుటుంబరావు గారు 4. వేంకటేశ్వరరావుగారు 5. సూర్యనారాయణరావుగారు 6. సత్యనారాయణగారు 7. గోపాలకృష్ణమూర్తిగారు .

సాళ్వాపతిగారికి పూర్ణ చంద్రరావు (కవి) గారు, వెంకటాచలపతిరావు - వెంకట్రావు ముగ్గురు కుమారులు. వీరి వంశములో గురుజాడ అప్పారావుగారు అలఘు కీర్తిగన్నవారు పూర్ణ చంద్రరావు గారు కవి. ఈయన ఒక చోట

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

“అప్పరాయస్తు సంస్కార్తా
రామమూర్తిశ్చరిత్రక:
కవీ రాఘవ శర్మాఖ్య:
పూర్ణ చంద్రస్తు పండితః”[1]

అని వ్రాసిరి. దీనికి తెలుగులో అనువాదము చేయుచు శ్రీ గురుజాడ రాఘవ శర్మ,

సీ॥ “జాతీయ భావముల్ చాటిన ‘అప్పరా
ట్కవి మేటి సంఘు సంస్కర్తయతఁడు
చక్కని నుడితీర్చి సాహితీ చారిత్ర
ముల దిద్దె శ్రీరామమూర్తి సుకవి
సంస్కృతాంధ్రముల, లెస్సగ గైతవల్కునే
ర్పరి పూర్ణ చంద్రుండు పండితుండు
సత్కవి జాతీయ సమరయోధుండు, శా
స్త్రజ్ఞుండు రాఘవ శర్మ యొకడు

గీ॥ కలరు కలరిందునందు, సత్కవులు, గ్రంథ
కర్తలున్ గార్యశూరులు, కీర్తికాక
రమ్ము శ్రీ గురుజాడ వంశ, మ్మికట్టి
వంశజుల మౌట, మాతప: ఫలముకాదె!”[2]

“జాతీయ భావముల చాటిన శ్రీ గురజాడ అప్పారావు గారు మేటి సంఘసంస్కర్త. చక్కని నుడి తీర్చిన సాహితీ చరిత్రుడు శ్రీ రామమూర్తి, సంస్కృతాంధ్రములలో చక్కని కవిత్వము చెప్పు నేర్పరి. పండితుడైన పూర్ణ చంద్రుడు. సత్కవి జాతీయ స్వాతంత్ర్య సమరయోధుడు - జ్యోతిష శాస్త్ర పండితుడైన రాఘవశర్మ అనువాడు ఒకడు కలడు. కలరు. సత్కవులు, గ్రంథకర్తలు, కార్యశురులు. కీర్తికి నిలయమైనవారు. అట్టిది మా గురుజాడవంశము అని చెప్పి, ఆ గురుజాడ వంశములో జన్మించుట మా పూర్వజన్మ తప: ఫలము అని నుడివిరి. దీనినిబట్టి వీరికి వీరి వంశముపై పూర్వీకులపై ఎంతటి గౌరవ భావములున్నవో వ్యక్తమగుచున్నది. ఇదియే గురుజాడ అప్పారావుగారిది, గురుజాడ శ్రీరామమూర్తి గారిది, గురుజాడ పూర్ణచంద్రరావుగారిది, తనది వంశవృక్షము సేకరించుటకు కారణమైనది. ఇది ఎంతయో ప్రయాసతో కూడిన

1. శ్రీ గురుజాడ పూర్ణ చంద్రరావు గారి వ్రాతప్రతి
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

విషయము. అయినను శ్రమ యని తలంపక వ్రాసి భావితరాల వారికి అందించిరి. వారి వంశ వృక్షముతో బాటు, "అప్పటివరకు గల ఆయా కుటుంబము చరిత్ర వంశవివరములు కావాలి. వానిని అందించ గోరెద. ఇప్పుడు గురుజాడ వంశవృక్షము సమూలముగా లభ్యమైనంత వరకు ముద్రింపదలచితిని. వయోధర్మముచే మీ దగ్గఱకు రాజాలక అర్థించుచున్నాను. శ్రద్ధతో మీ కుటుంబ పుట్టు పూర్వోత్తరములు నాకు పంపిన, ముద్రించబోవు వంశవృక్షములో జేర్చి ముద్రింపదలచితిని. మీరేగాక, మీకు తెలిసిన మన వంశీయుల చరిత్రలు కూడ అందించిన కృతజ్ఞుడను"[1] అని ఒక కరపత్రము 1985 సం॥లో వేసియుండిరి.

శ్రీ గురుజాడ వెంకట అప్పారావుగారిది వారి భార్య కొండమ్మగారిది జాతకచక్రములువేసి దానిపై గ్రహస్థితిని వివరముగా వ్రాసిరి. ఇది జ్యోతిషములో చెప్పితిని. ఇక అప్పారావుగారి జనన విషయమై కొన్ని అభిప్రాయ భేదములు గలవు. దీని పై వీరి వివరణ:

**'మహాకవి' గురుజాడ జననం విషయమై వ్రాతలు: -**

ఆంధ్ర దేశంలో పుస్తక ప్రచురణ, శ్రద్ధాసక్తులతో వెలువరించిన వారిలో ముఖ్యులు "శ్రీ వావిళ్ళ" వారు. వారి ముద్రాణాలయములో ముద్రింపబడిన పుస్తకము గురించి మరుమాట లేకుండా చలామణి అగుట చూస్తున్నాం.

అట్లనే 1950వ సం॥లో కీ॥శే॥ గురుజాడ అప్పరాయకవిగారి గురించి రెండు చిన్నపుస్తకాలు, కథల సంపుటి గేయసంపుటిగా ముద్రించారు. దానికి పీఠిక, జగమెఱిగిన విమర్శక శిరోమణి శ్రీ నిడుదవోలు వారు వ్రాశారు. వారిమాట వారివ్రాతకు సాహిత్య ప్రపంచములో ఎదురు లేదు కదా! కాని వారు అప్పారావుగారి జననం గురించి యీ ప్రకారము వ్రాశారు. శ్రీ దుందుభి భాద్రపదశుద్ధ 13 భానువారము 30-11-1861 జననం అని - నిర్యాణము 9.11.1915 అని వ్రాశారు"[2].

"ఈ రెండు పొరపాట్లే

వీరి వ్రాతల ఆధారముగా తరువాతవారలు వారిజననం తేదీ గురించి 30.11.1861 అని వ్రాశారు.

1. 'మహాకవి - మహాపురుషులు' గురుజాడ అప్పారావు విశాలాంధ్ర ప్రచురణ.
2. 'ముత్యాలసరాలు' - ప్రజాశక్తి ప్రచురణాలయము.

---

1. గురుజాడ వంశీయులకు విజ్ఞాపన - కరపత్రము.
2. గురుజాడ రాఘవశర్మ - వ్రాతప్రతి.

3. “మాట-మంతి - అవి-యివి” - అవసరాలు విశాలాంధ్ర ప్రచురణ - 4వ వాల్యూమ్.

4. ‘ముత్యాలసరాలు’ పీఠిక శ్రీ రమణారెడ్డిగారు.

5. జెంషెడ్ పూర్ - ప్రవాస ఆంధ్రుల సంచికలో - అప్పారావుగారు

6. ఖమ్మం వారి సంచికలో - అప్పారావుగారు

7. గురుజాడ - వెలుగుజాడ - శ్రీరమణారెడ్డిగారు మొదలగువారి వ్రాతలు - జననం విషయమై - ఇవి సరియైనవి కావు”.[1]

**“అసలు-జననం** శ్రీ దుందుభి నామ సం॥ర భాద్రపద బ13 భానువారము 1862-9-21 తెల్లవారు ఝామున వేగుచుక్క పొడిచిన వేళ - జననం.

**నిర్యాణము: -** శ్రీ రాక్షస నామ సం॥ బహుళ కార్తీక జయవారము ఉదయము 8.20 ని॥ వేళ 1915.11.30. జీవితము మొత్తము 54 యేండ్లు

ఈ ప్రకారము సరియైన జననము గురించి ఉదహరించినవారు

1. ఆణిముత్యాలు - శ్రీ వేమూరి రాధాకృష్ణమూర్తిగారు

2. Life and great ness of Guruzada by Sri Peri Suryanarayana Garu BA.B.L

3. శ్రీ అబ్బూరి రామకృష్ణారావుగారు ఢిల్లీ సంచికలో గెర్‌హార్డు హప్టమన్-జర్మన్ రచయిత జననం Nov. 1862 అప్పారావు గారు ఆసంవత్సరమే నవంబరు 1862, 21.9.1862.

4. వారికుమారులు కీ॥శే॥ వెంకటరామదాసు పంతులుగారు ‘విశాఖ సంచికలో’ ‘మా నాయనగారు’ శీర్షికలో జననం - 21.9.1862 అని - వ్రాసిరి.

| | | |
|---|---|---|
| 1. శ్రీ కందుకూరి వీరేశలింగంగారు 1863వ సం॥ | } | |
| 2. శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు 1866 సం॥ | } | జననం |
| 3. శ్రీ గురుజాడ అప్పారావుగారు 1862 సం॥ | } | |

అని వ్రాసియున్నారు”[2]. శ్రీ గురుజాడ అప్పారావుగారి తొమ్మది తరాల వంశవృక్షమును

1. గురుజాడ - రాఘవశర్మ వ్రాతప్రతి.
2. పైదే.

అనుబంధములో చేర్చితిని.

2. పండితుడు, కవి, చరిత్రకారుడు శ్రీ గురుజాడ శ్రీ రామమూర్తిగారు.

శ్రీరామమూర్తిగారు ప్రథమ కవి, జీవిత చరిత్రకారులు. 1851వ సం॥లో తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం గ్రామములో జననం (శ్రీ అయోధ్య రామయ్యగారి మనుమలు) శ్రీ పంతయ శ్రీరామలక్ష్మీ దంపతుల తనయులని 1951వ సం॥లో వావిళ్ళ వెంకటేశ్వర్లుగారి ప్రకటన సరియైనదికాదు.

**తండ్రిగారు:** శ్రీ దుర్గా ప్రసాదరాయ దీక్షితులు తాతగారు: పారుపల్లి లక్ష్మీనారాయణగారి కుమార్తె శ్రీరామమూర్తిగారు ధనవంతులు

ఆంధ్ర సాహిత్య పరిషత్తుకు వ్యవహర్తగా నున్న కీ॥శే॥ శ్రీ కొత్తపల్లి సూర్యారావుగారికి శ్రీరామమూర్తిగారు కావ్య పాఠములు చెప్పి వృద్ధిలోనికి తెచ్చిన గురువులు. స్వయంకృషిచే - సంస్కృతాంధ్ర ఆంగ్ల భాషలు నేర్చిరి. 1871వ సం॥లో ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులు 1872వ సం॥లో వణిక్పుర వర్తకోదంతము Merchant of Vennice కు భాషాంతరీ కరణము - ఆంగ్లనాటకముల నుండి ఆంధ్రీకరించిన తొలినాటకములలో మొదటిది. 'చిత్రరత్నాకరములో ప్రకటింపబడిన (శ్రీ నిడదవోలు వేంకటరావుగారిచే) శ్రీ గురుజాడ, శ్రీరామమూర్తిగారి జీవిత చరిత్ర

1. రావువంశ చరిత్ర
2. రాయన భాస్కర మంత్రి చరిత్ర
3. తిమ్మరుసు చరిత్ర
4. అప్పయ్యదీక్షిత చరిత్ర
5. విద్యారణ్య చరిత్రలు / రచించారని
6. సామదేవ రాజీయము కూడా

పత్రిక - 'ప్రబంధకల్పవల్లి' మాసపత్రిక 'రాజయోగి' పత్రిక కాకినాడ నుంచి ప్రకటించి, అందులో ప్రబోధచంద్రోదయములు మొదలగు ప్రబంధములు ముద్రించిరి. 'కవి కావ్య ప్రశంసాచంద్రిక' యను మహాగ్రంథమును నిడుదవోలు సుందరము పంతులుగారి సహాయమున రచించిరి. అవి అముద్రితము అని 1951వ సం॥లో వావిళ్ళ వేంకటేశ్వర్లుగారు ప్రకటించిరి.

1876-కవి జీవితముల రచనా ప్రారంభము -

1878-1880లో చిన్నగ్రంథముగా ప్రకటించిరి

1880సం॥ లో చిత్ర రత్నాకరము-

1882వ సంవత్సరములో బి.ఎ. పరీక్షకు పఠనీయగ్రంథము కవి జీవితము 2వ భాగమును యేర్పరచినారు.

<u>శ్రీరామమూర్తిగారి కుమారులు</u>

గురుజాడ దుర్గా ప్రసాదరావు పంతులు బి.ఏ.బి.యల్. 1850-1897 ఆనంద గజపతి - విజయనగరం మహారాజుగారి ఆస్థానమునకు వెళ్ళి ఆ రాజేంద్రుని ఆదరముతో 1893వ సం॥ న

<u>కవి జీవితములను</u> : 1. భారతాంధ్ర కవులు

2. ద్వర్థి కావ్య కవులు

3. ప్రౌఢ ప్రబంధకవులు

4. ఆంధ్రపంచకావ్యములు

అను పేర్లతో సంపుటములుగా ప్రకటించిరి.

1. అడిదంసూరకవి, 2. ఏనుగు లక్ష్మణకవి, 3. కూచిమంచి తిమ్మకవి, 4. కూచిమంచి జగ్గకవి, 5. కాకునూరి అప్పకవి, 6. అభినవదండి కేతనల జీవితములు చిన్న చిన్న గ్రంథములుగా ప్రకటించిరి. ఇవి 1915 సం॥లో కవి జీవితములు ప్రకటన నాటికి లభ్యముకాలేదని ముద్రాపకులు తెల్పిరి"[1]. "కవి కావ్యప్రశంసా చంద్రిక అను గ్రంథముకూడ లభ్యము కాలేదని ముద్రాపకులు వ్రాసిరి.

అనుబంధ గ్రంథము పుట586 పంతులుగారు, ఆంధ్ర గీర్వాణ భాషా పాండిత్యము గలవారు 'శ్రీకృష్ణరాయ చరిత్రను రచించినట్టు - కవి జీవితములు 570 పుటలో వ్రాసికొనినారు. (14-4-1964లో శ్రీ గురుజాడ భాస్కరరావుగారి స్వదస్తూరి కాగితము నుంచి యెత్తి వ్రాయడమైనది.) .

శ్రీ గురుజాడ శ్రీరామమూర్తిగారి జీవిత చరిత్ర గురించి శ్రీ నిడుదవోలు వెంకట్రావుగారు 'చిత్ర రత్నాకరం'లో వ్రాసిన పీఠిక పొరపాట్లు"[2].

---

1. గురుజాడ - రాఘవశర్మ వ్రాతప్రతి.
2. పైదే.

ఆయన కథనం

"1883వ సం॥న కాకినాడలో శ్రీ బాలా త్రిపురసుందరీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయమునకు శిలామయ ముఖ మంటపము కళ్యాణ మంటపములు గట్టించిరి.

అసలు నాకు లభ్యమైన గురుజాడ వారి సంపూర్ణ వంశవృక్షము - దాఖలా

1. గురుజాడ వారి వంశవృక్షములో ఐదవ తరములో - కాకినాడలో సూర్యరావుపేటలో శ్రీ రామమూర్తిగారు బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయము కట్టిరని ఉన్నది.

శాసనము "అయోధ్య రామయ్యగారి పౌత్రులు రామలక్ష్మణ సహిత పంతయ్యగారి పుత్రులు - సుందరాంబ సమేత - రామమూర్తిగారును (మరి ఇద్దరితో కలిసి) శిలామయ ఆలయమును కట్టించి ప్రతిష్ఠ గావించి సమర్పించిరి."[1]

ఈ భాగమునే నిడుదవోలు వెంకట్రావుగారు ఉదాహరించిరి. శ్రీరామమూర్తిగారి మామగారు పారుపల్లి లక్ష్మీనారాయణగారు బ్రాహ్మణ బాలురకు విద్యాభ్యాసాదికములు గావించిన నెఱదాతలని.

2. వంశవృక్షము ప్రకారము కవి జీవితముల శ్రీరామమూర్తిగారు 7వ తరంవారు, వారి తండ్రి దుర్గాప్రసాదరాయ దీక్షితులు వారి కుమారువి కూడా దుర్గాప్రసాదరావు (వకీలు) అందుచే ఈ శ్రీరామమూర్తిగారు వేరైయుండవలె.

3వ తరము --- పంతులు

4 వ తరము --- కుమారుడు లింగయ్య
↓
5 వ తరము --- ఆయన కుమార్లు

1. వీరయ్య 2. పంతులు ↓
కుమార్లు అయోధ్య
↓ రామునకు దత్తు

6 వ తరము --- కుమారుడు శ్రీరామమూర్తిగారి తండ్రి
దుర్గా ప్రసాదరాయ దీక్షితులు

1. గురుజాడ - రాఘవశర్మ వ్రాతప్రతి.

7 వ తరము --- శ్రీ రామమూర్తి గారు

"అందుచే శ్రీనిడుదవోలు వారి కథనము సరికాదని నిర్ధారణ చేయవలసి వచ్చినది

--- అచట, సూర్యారావు పేట దేవాలయము మంటప నిర్మాత రామమూర్తి గారి వంశ వివరణ,

3 వ తరము --- అయోధ్యరాముడు

↓

4 వ తరము --- కుమారుడు పంతయ్య (లింగయ్య కొడుకు దత్తు)

5 వ తరము --- 1. అయోధ్యరాముడు

2. లింగయ్య (నిస్సంతు) 3. జానకీ రామయ్య

4. శ్రీరామమూర్తి 5. వీరభద్రుడు (నిస్సంతు)

↓

శ్రీ బాల త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర ఆలయ ధర్మ కర్త

6 వ తరము --- సాంబన్న (నిస్సంతు)

↓

నాగభూషణం(నిస్సంతు) చలపతి రావు (నిస్సంతు) రామలింగం

↓

దత్తు రామమూర్తి

ములకలలంక, తటవర్తి, లంకరాజు

గారి అబ్బాయి - దొడ్డంపేట అత్తవారు

ఈ రామమూర్తి గారు వేరు కవి శ్రీరామమూర్తి గారు కారు.[1]

1. గురుజాడ - రాఘవశర్మ వ్రాతప్రతి.

## కవి - పండితుడు - గురుజాడ - పూర్ణ చంద్రకవి:

సంస్కృతాంధ్రముల పండితుడు - కవి - ఉభయ భాషాప్రవీణ గురుజాడ - పూర్ణ చంద్రకవి -వీరు శ్రీ సౌమ్య చైత్ర శుద్ధ స్థిరవారము రాత్రి రెండు ఝాముల వేళ జననము - 23.4.1910.

### వంశవృక్షము

1వ తరము — గురుజాడ అక్కిరాజు
↓
2వ తరము — సూరపరాజు
↓
3వ తరము — శరభరాజు
↓
4వ తరము — సాల్వాపతి
↓
5వ తరము — మురహరి
↓
6వ తరము — ఆదినారాయణ
↓
7వ తరము — త్ర్యయంబకరావు | సాళ్వపతిరావు

8వ తరము:
- త్ర్యయంబకరావు ↓ వీరరాఘవశర్మ 6గురు సోదరులు
- సాళ్వపతిరావు ↓ పూర్ణచంద్రశర్మ | వెంకట చలపతిరావు | వెంకట్రావు

గురుజాడ పూర్ణ చంద్రకవిగారు శ్రీ పూర్ణచంద్ర రామాయణము అచ్చ తెలుగు పార్వతీ పరిణయములను వ్రాసిరి. ఇవి ముద్రితములు 1. అనంగదహనము 2. పుష్పకము 3. శివలీలా తరంగిణిని సంస్కృత భాషలో వ్రాసిరి. ఇంకొక నాటకమును గూడా వ్రాసిరి. శివభాగవతమును తెలుగులో వ్రాసిరి. ఇవి అముద్రితములు"[1].

1. గురుజాడ - రాఘవశర్మ వ్రాతప్రతి.

## శ్రీ గురుజాడ వీరరాఘవశర్మ

↓

వ్యవహారము

రాఘవశర్మ

<u>వంశవృక్షము</u>[1]

మూలపురుషుడు

అక్కిరాజు

సూరపరాజు

↓

శరభరాజు

↓

సాళ్వపతి

↓

మురహరి

↓

ఆదినారాయణ

↓

త్ర్యయంబకరావు

↓

(1) వీరరాఘవశర్మ - రాఘవశర్మ

(2) మురహరిరావు

(3) కుటుంబరావు

(4) వెంకటేశ్వరరావు

(5) సూర్యనారాయణ

(6) సత్యనారాయణ

(7) గోపాలకృష్ణమూర్తి

సాళ్వపతి

↓

1. పూర్ణచంద్ర కవి

2. వెంకటా చలపతిరావు

3. వెంకటరావు

1. గురుజాడ - రాఘవశర్మ వ్రాతప్రతి.

## 1.3 బాల్యము: -

శ్రీ శర్మ గారి బాల్యమును గూర్చి ఆలోచించినప్పుడు కుతూహలమును కలిగించు అనేక విషయములు మన దృష్టికి రాగలవు. వీరు స్వస్తి శ్రీ చాంద్రమాన విళంబినామ సం॥ర మాఘ శుద్ధస్థిరవారము రాత్రి 12.00 వేళ అనగా ది:11.2.1899వ తేదీన పసుమఱ్ఱు గ్రామములో మాతామహుల ఇంట జన్మించిరి. వీరు ఆరువేల నియోగి బ్రాహ్మణులు. కౌండిన్యసగోత్రులు. వీరి తల్లి పేరు వెంకమ్మ గారు. తండ్రి త్ర్యయంబక శర్మగారు. ఏడుగురు అన్నదమ్ములు, ఇద్దరు అప్పసెల్లెండ్రలో వీరే జ్యేష్ఠులు. గురుజాడయే వీరి స్వగ్రామము. తల్లిదండ్రులు వీరికి వీర రాఘవశర్మ అని నామకరణము గావించిరి.

## 1.4 విద్యాభ్యాసము: -

"శ్రీ శర్మ గారు చంద్రాల నుండి మూడు పంట కాలువలు దాటి అంగలూరు ప్రాథమిక పాఠశాలకు వెళ్ళి చదువుకొనేవారట. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంచి అనుభవము బోధనా పాటవముగల శ్రీ వేంకట రమణయ్య గారు. వారి బావగారు నందగిరి శేషగిరిరావుగారు మంచి కవి. వారి సహాయముతో శ్రీ వేంకట రమణయ్య గారు తెలుగులో నించుక తెలివి తేటలుగల కుఱ్ఱవాళ్ళకు ఛందస్సు నేర్పటం ప్రారంభించినారు. శర్మ గారు నాలుగయిదు తరగతులలో ఉన్నప్పుడే గణ, యతి ప్రాసలు, ఛందస్సు తెలిసికొనినారు. అచ్చట నేర్చిన ఆ ఛందస్సు తరువాత తరగతికి వచ్చు సరికి మంచి కవిత్వం వ్రాయించినది. శ్రీ నందగిరి వేంకటప్పయ్య గారు శేషగిరిరావుగారల కవితా ప్రభావము, సారస్వతాభిమానము, వేంకట రమణయ్య గారి ఆధిపత్యము - ఇవన్నియు అంగలూరులో నెంత మందినో కవులుగా, పండితులుగా, విమర్శకులుగా తీర్చి దిద్దినవని వీరే ఒక చోట స్వయముగా వ్రాసికొన్నారు.[1] అంగలూరులో ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని, బందరు హిందూ హైస్కూల్‌లో ఫస్టుఫారంలో చేరిరి. వీరిది మధ్య తరగతి కుటుంబం. బందరులో ఖొజ్జిల్లిపేటలోనున్న రాయపాటి హనుమంతరావు గారు వీరి తాతగారి మేనమామ. వీరిదీ పేద కుటుంబమే. వారి ఇంట్లో చేరి చదువుకొనుచు, ఒక పూట తిని, ఒక పూట తినక, కాలక్షేపము చేయుచూ జీవితం గడిపిరి.

1. గురుజాడ - రాఘవశర్మ వ్రాతప్రతి.

## 1.5 వివాహము: -

శ్రీ శర్మ గారికి పదమూడవ సంవత్సరము ప్రవేశించగానే వివాహ ప్రయత్నములు సాగినాయట. వీరి మామగారు కిండి వెంకట్రామయ్య గారు వారి స్వగ్రామం వీరంకిలాకు దగ్గర మేడూరు గ్రామం. వారు ఆ గ్రామములో గ్రామకరణం కూడా. ఆస్తి పరులు. నిత్యాన్న దాత. వారిల్లు కృష్ణానదీ తీరములో గల మధునాపూర అగ్రహారమునకు వెళ్ళు త్రోవలో ఉన్నది. బస్సు సౌకర్యములు లేని ఆ రోజులలో తెనాలి, రేపల్లె వెళ్ళుటకు కృష్ణనది దాటవలెనన్న ఐలూరు మీదుగాగాని, ఇటు మధునాపురం మీదుగా గాని వెళ్ళవలసి యున్నది. వీరు తమ భోజన సమయమునకు ముందుగా వీధిలోనికి వచ్చి మార్గాయాసముచే ఎంత మంది వాకిట్లో ఉన్నను. వారందరికీ భోజనము పెట్టించి తరువాతనే తాను భుజించెడివారు. ఈ నియమమును వారు జీవితాంతము నెరపిరి. ఉభయ రామేశ్వర క్షేత్రమని ప్రసిద్ధి చెందిన ఐలూరు వీరికి సమీప గ్రామము. ఈ క్షేత్రమునకు శివరాత్రికి వచ్చు భక్తులకు అన్నదానమునకై వారు ఒక సత్రము నేర్పాటు చేసి కొంత భూవసతిని కూడా కల్పించినారు. రాఘవ శర్మ గారి బావమరిది అయిన వేంకటరంగయ్యగారు వేంకట రామయ్యగారికి ఏకైక పురుష సంతానము. ప్రభుత్వముతో పోరాడి ఎంతో కృషి చేసి "ఈస్ట్ కెనాల్" కాలువను ఆ ప్రాంతానికి తెప్పించిన వారు వారే. ఆ వంశము నందు వేంకట్రామయ్యగారికి ఏడుగురు ఆడపిల్లలు. ఒక మగపిల్లవాడు. ఆరవ సంతానమైన మల్లికార్జునమ్మ గారిని రాఘవశర్మగారికి ఇచ్చి వివాహం చేసినారు.

"వేంకటరామయ్య గారి స్వగ్రామమైన మేడూరులో దుర్గా నాగేశ్వర స్వామి దేవాలయము గలదు. వేంకట రామయ్య గారు గొప్ప దేవీభక్తులు వారికి అమ్మవారి పేరు చెప్పిన భక్తి శ్రద్ధలుప్పొంగేవి. అందుచే తమ కుమార్తెకు మల్లికార్జునమ్మ అని నామకరణము చేసిరి. ఆమె పెండ్లి అయిన తరువాత మల్లికాంబగా వ్యవహరింపబడిరి. ఈ మల్లికార్జునమ్మ గారిని రాఘవ శర్మగారు వివాహము చేసికొను నాటికి ఏడున్నర సంవత్సరములు మాత్రమే శ్రీ శర్మ గారికి వారి పినమామ గారగు వియన్న గారి చేతుల మీదుగా వివాహము జరిగినది. వియన్న గారు చిన్న వయస్సు వారయిన అల్లుళ్ళను ఎంతయో అచ్చట ముచ్చటలతో ఆనందపరుస్తూ ఉండేవారు. అదీగాక ఒక సంవత్సరము పరీక్ష తప్పినందున మరుసటి సంవత్సరము జీతములు వారే చెల్లించి విద్యను పూర్తి చేయుటకు శ్రీ శర్మగారికి తోడ్పడిరి".[1]

1. గురుజాడ - రాఘవశర్మ వ్రాతప్రతి.

శ్రీ శర్మ గారి భార్యయైన మల్లికార్జునమ్మ గారు రాముని వెంట నడచిన సీతవలె పరమ శివుని అర్ధాంగియైన పార్వతి వలె వీరికి చేదోడు వాదోడుగా నిలిచిరి. స్వాతంత్ర్యోద్యమములో రేయి అనక పగలనక తిరుగుచున్న శర్మ గారికి చేయూతనిస్తూ, ఇంటికి వచ్చిన అతిధి, అభ్యాగతులకు, బంధువులకు మర్యాదగా, ప్రేమ పూర్వకమైన పలకరింపుతో గూడి ఇచ్చే ఆతిథ్యము మరువలేనిది. షష్ఠి పూర్తి మొదలు ఎనుబది రెండవ ఏట చాంద్రమానము ప్రకారము వెయ్యి మాసములు పూర్తి అయిన సందర్భములో చేయు సహస్ర చాంద్రమాస పూర్త్యుత్సవమును మాఘ శు॥ స్థిరవారము 19.1.1980వ తేదీన జరుపుకొనిరి. గృహములో ప్రతి సంవత్సరము శ్రీ కృష్ణాష్టమి, శ్రీరామనవమి, హనుమజ్జయంతి, దసరా మొదలగు పర్వదినములు ఎంతో వైభవోపేతముగా నిర్వహించెడివారు. మల్లికార్జునమ్మ గారు బాల్యము నుండి లలితా పరాభట్టారిక ఆరాధ్య దేవత. వారు ఆ తల్లి అనుగ్రహమునకు పాత్రులైన వారు. శ్రీ శర్మగారు శ్రీ కృష్ణోపాసకులు. వారి ఇంటి ప్రాంగణములో ది.7.9.1985వ సం॥లో స్థిరవారము నాడు ఉదయము 7.45ని॥లకు శ్రీ కృష్ణ విగ్రహమును యంత్రసహితముగా ప్రతిష్ఠ చేసిరి. శ్రీ కృష్ణాష్టమి రోజున తెల్లవార్లు భజన కార్యక్రమములతో ఇల్లు మారుమ్రోగిపోయెడిది.

మా బామ్మగారు చనిపోయినప్పుడు ఆమెను స్మరిస్తూ మా తాతగారు వ్రాసిన "సతీమల్లికాంబ స్మృతి" నేటికీ కంటతడి పెట్టించక మానదు.

**"లేదనకెప్పుడున్ బలుక లేకయె, నర్థికినిచ్చు, భర్త సం**
**పాదన నుండి, యేవెలితి మాట, కనంబడనీక, సర్దు, న**
**త్యాదరభాషణమ్ముల, సుధామృతమున్ వెలయించు మంచిము**
**త్తైదువ దాటిపోయినదిరా! కనరండని వచ్చినారికన్**
**లేదుగ, యట్టి పల్కువినలేముగదా! యిక జన్మజన్మకున్ "**[1] "సతీ మల్లికాంబ స్మృతి" 9పద్యము

శ్రీ శర్మగారు ఆర్థికముగా ఎంతో అవస్థపడుతున్నప్పుడు కూడా లేదని చెప్పకుండా ఉన్నదాంట్లో ఇచ్చే మహా ఇల్లాలు. సంపాదనలోనే అన్ని సర్దుకొనుచు జీవితం గడిపిన వారు. సుధామృతమునొలుకు వాక్కులతో అత్యాదరణముగా జీవించిన మంచి ముత్తైదువ దాటిపోయినది అని దుఃఖించిరి శ్రీ శర్మ. శ్రీ లలితా దేవిని ప్రత్యక్షమొనర్చు కొన్నవారు మా బామ్మగారు. వారి జీవితములో జరిగిన అనేక సంఘటనలు మాతో చెప్పుచుండెడివారు. శ్రీ శర్మగారు,

1. శ్రీగురుజాడ రాఘవశర్మ సతీ మల్లికాంబ స్మృతి-శ్రీ గురుజాడ రాఘవశర్మ శతజయంత్యుత్సవ సంచిక పుట 83, 84

"దేవీ నామ మహాత్మ్య మేమనుదు సందేహమ్ములే, దామెయే
దేవీ, శ్రీ లలితాంబ రూపమున, నెంతేగాంచుడిందందు, శ్రీ
దేవీ భక్తులు, రాఘవాన్వయ మృదూక్తిన్‌లో దలంపన్ పరా
దేవీ సత్కృప సద్గతిన్ గని, విముక్తింజెంది తీ లోకమున్"[1] "సతీ మల్లికాంబస్మృతి"6వ పద్యము

అని చెప్పిన పద్యము వలన ఆమె ఎంతటి లలితా ఉపాసకురాలో తెలియుచున్నది.

గీ॥ " వసుధ శ్రీ రుధిరోద్గారివత్సరమున
విమల, కార్తీక కృష్ణపక్షమున, షష్ఠి
నెలమి, స్థిరవాస రాశ్రేష ఋక్షమందు
ఉదయ కాలమున, బ్రశాంత యోగనిద్ర
గ్రమ్మ: విడనాడి, తనువు, దివమ్ముఁ జేరె
పుత్ర పౌత్ర సపౌత్ర సమూహమందు
భర్తృసన్నిధి "బంగరు" పట్టణమున
మానినీ సాధ్వి గురుజాడ - మల్లికాంబ"[2] "సతీ మల్లికాంబస్మృతి" 1వ పద్యము

శ్రీ రుధిరోద్గారి సం॥ కార్తీక బహుళ షష్ఠి తిథి యందు, శని వారము నాడు ఉదయకాలములో పుత్ర, పౌత్ర, సపౌత్రుల నడుమ బందరు పట్టణములో భర్తృ సన్నిధిని విడనాడిన మానినీ సాధ్వియని శ్రీ శర్మగారే వ్రాసిరి. 1983 నవంబరు 23వ తేదీన మల్లికాంబ పరాంబికలో లీనమైపోయిరి.

## 1.6 సంతానము: -

శ్రీ గురుజాడ రాఘవ శర్మ గారికి ఎంతో మంది ఆడపిల్లలు, మగపిల్లలు నష్టం కలిగిరి. వీరి అష్టమగర్భము మా నాన్నగారైన చిరంజీవి గారు. పైన సప్తమ గర్భము గూడ ఎనిమిది సంవత్సరములు జీవించి కాలము చేసిరి. వారు భగవదను గ్రహము కూడ కలిగిన వారని చెప్పెడివారు. (రామకృష్ణ అని పేరు పెట్టారని తాతగారు, బామ్మగారు చెప్పెడివారు). శ్రీ చిరంజీవి గారిని (మా నాన్నగారు) దేవరకోట కరణము గారైన వీరి పెద తండ్రిగారి దగ్గర షుమారుగా 8 సం॥లు ఉంచి రక్షించడం జరిగినది. తరువాత బందరు బుట్టాయిపేటలో వేంచేసియున్న శ్రీ అన్నపూర్ణ లక్ష్మీనృసింహ స్వామి వారికి దత్తతనిస్తానన్న

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ సతీ మల్లికాంబ స్మృతి - శ్రీ గురుజాడ రాఘవశర్మ శతజయంత్యుత్సవ సంచిక పుట 83, 84
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ సతీ మల్లికాంబ స్మృతి - శ్రీ గురుజాడ రాఘవశర్మ శతజయంత్యుత్సవ సంచిక.

వాగ్దానము మేరకు ఆ స్వామి అనుగ్రహముచే కలిగిన వీరికి (మానాన్నగారికి) దుర్గా నాగేశ్వరశర్మ అని నామకరణము చేసిరి. దీర్ఘాయుష్మంతుడగుటకు స్వామి పేరు పెట్టి పిలువక చిరంజీవి అని పిలుచుట జరిగెను. తదాది ఆ అన్నపూర్ణ లక్ష్మీ నృసింహ ఆశ్రమ సంస్థ నిర్వాహకులైనారు.

ఇచ్చట శ్రీ మదన్నపూర్ణ లక్ష్మీ నృసింహస్వామిని గూర్చి కొంత క్లుప్తముగా చెప్పక తప్పదు.

"శ్రీ అమ్మ గారు గొప్ప మహనీయురాలు. సిద్ధ సంకల్పులు. త్రికాలవేదులు వారిని గూర్చి బయటకు ప్రచారము చేయుట కిష్ట పడెడివారు కాదు. వీరు తమ భౌతిక దేహము చాలించు సమయమున శిష్యులను పిలిచి, "భవిష్యత్తులో తమ ఆశ్రమ స్థానములో శ్రీ స్వామి వార్లకు గాను, భక్త కోటిచే గోపుర ప్రాకారాదులతో గొప్ప దేవాలయము నిర్మింపబడుననియు, మన స్వామి వారు భక్త జనులను సంరక్షించుచూ శ్రీ తిరుపతి వేంకటేశ్వరుని వలె మహావైభవముతో తులతూగుచుందురనియు, ఆశ్రమమునకు, శిష్యులకు, శిష్య సంతతికి ఈ లోపల కష్టపరంపరలు రానున్న వనియు శ్రీ స్వామి వార్లను భక్తి శ్రద్ధలతో సేవించుట మానవలదనియు ఆదేశించి దేహమును చాలించిరి. ఇది 1925 సం॥ శ్రావణ శుద్ధ తదియ నాటిమాట. అప్పటికి మిగిలిన వారు తంగిరాల వేంకటేశ్వర్లు గారు, కలవగుంట రాజ్యలక్ష్మమ్మగారు, అర్చకులైన దివి రాఘవాచార్యులు గారు, శ్రీ గురుజాడ రాఘవ శర్మగారు"[1] అని అమ్మ దివ్య చరిత్రలో చెప్పబడినది. శ్రీ శర్మ గారు 1925 సం॥ పూర్వమే ఈ ఆశ్రమ సంస్థను దర్శించుట అచ్చటి స్వామి వారి పట్ల అత్యంత భక్తి శ్రద్ధలు నమ్మకము కలిగియున్నట్లుగా తెలియుచున్నది. అందుకని వీరికి కలిగిన సంతానమును దత్తతనిస్తానని వాగ్దానము చేసిరి.

"ఇక ఈ అమ్మగారు: శ్రీ కృత్తివెంటి వారి సంస్థానములో గుమాస్తాగా పనిచేయుచున్న శ్రీ భట్టిప్రోలు సుబ్బన్న పంతులు గారి ఏకైక పుత్రిక. పేరు 'అన్నపూర్ణ' ఎనిమిదవ ఏటనే వివాహమైనది. సం॥లోపునే భర్తను కోల్పోయిన ఈ మహత్తర యోగిని బందరు బుట్టాయిపేటలోని శ్రీశ్రీ సీతారామస్వామి వారి కోవెల ఎదుట మండువా పెంకుటింటిలో తన జీవితము ప్రారంభించిరి. మాతాపితలు, మేనత్త పరమపదించిన తదుపరి ఏకాకినియై ఇక్కడ జీవితము గడుపుచూ నిరంతరము శ్రీరామ పాద పంకజ బంభరమై విరాజిల్లుచుండెను. నిరంతర ధ్యాన దీక్షతో సామీప్య సారూప్య సాయుజ్యములను పొందుచు సమైక్యమును సాధింపగల్గు స్థితికి వచ్చెను. బాహ్య కీర్తి కండూతికి లోనుగాక స్వార్థరహితయై వ్యక్తిత్వరహితయై, తాను

1. కందికొండ సత్యనారాయణ శాస్త్రి - అమ్మ దివ్య చరిత్ర పుట 4

చేయు సర్వకార్యములు "తత్ సత్ బ్రహ్మార్పణమస్తు" గా సర్వసంగపరిత్యాగినియై కాలము గడుపుచుండెను. ఈ జ్యోతిర్మయి మౌనముద్రాలంకార. ఈమె.35, 40, సం॥ల వయస్సు సమయములో ఒకనాడు ధ్యానతత్పరయైయుండగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, భావదృగ్గోచరుడై తన్ను సేవింపవలసినదిగా ఆదేశించినందున అప్పటి నుండి తారక మంత్రానుష్ఠానమును, అంతర్గతముగా చేసికొని, సద్యోఫల ప్రదమును, సంపూర్ణ ప్రథమావతారమునైన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారిని, ప్రజాబాహుళ్యమునకు అందుబాటులో నుండునట్లుగా తన గృహమున గృహ దేవతగా నావిర్భవింపజేసెను. ఆంజనేయ స్వామి వారిని ఉపదేవతగా నావిర్భవింపజేసెను"[1] "శ్రీ రామ చంద్ర రావుగారికి సుస్తీ చేసిన సమయములో శ్రీ అమ్మ గారి దయవలననో శ్రీ స్వామి వారి ప్రేరణ ప్రభావము వలననో చక్కని యూహస్ఫురించెను. శ్రీ అమ్మ గారి గృహదేవతయైన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారికి శ్రీ అన్నపూర్ణ లక్ష్మీ నృసింహ స్వామిగ తిరిగి నామకరణము చేసి, శ్రీ స్వామి వారితో బాటు శ్రీ అమ్మ గారి పేరును కూడా ఆ చంద్రార్కము భక్తులు స్మరించునట్లు చేయవచ్చునని, వారుసూచించిరి. తదాది శ్రీ అమ్మగారి గృహమునందలి గృహదేవత శ్రీ అన్నపూర్ణ లక్ష్మీ నృసింహ స్వామిగా వ్యవహరింపబడుచున్నది"[2].

"ప్రసిద్ధ దైవజ్ఞులును, కవిశేఖరులునునైన శ్రీ గురుజాడ రాఘవశర్మగారు బహు సంతాన నష్ట జనిత దు:ఖ భారమును సహింపజాలక ఆర్ద్ర హృదయముతో, శ్రీ అన్నపూర్ణ లక్ష్మీ నృసింహ స్వామిని సేవించి, తన వంశోద్ధారకుడైన "చిరంజీవి"ని పుత్రునిగా బడసిరి. ఇది శ్రీ అమ్మగారి భక్తులందరకు ప్రత్యక్షనిదర్శనము"[3] అని అమ్మదివ్య చరిత్ర వ్రాసిన శ్రీ కందికొండ సత్యనారాయణ శాస్త్రి గారు వ్రాసిరి. శ్రీ శర్మ గారే ఈ ఆశ్రమ మహాత్మ్యమును గురించి చెప్పుచు

**"శ్రీ నిలయంబు, మౌనిపరిసేవిత పద్మము, దేవతాళికిం**
**పూనినతావు వైరిని కరోగ్రశరాళికి డాలు, అంజనీ**
**సూనుడు పేర్మిమై తిరుగుచోటు, నిజాశ్రిత భక్త కోటి, సం**
**త్రాణము, నీ మహాస్థలము, నాయన, చేర్చితి వన్నపూర్ణ ల**
**క్ష్మీనరసింహ దేవ, దయసేయగదే స్థిరభక్తి నీపయిన్ "[4]** అని వ్రాసిరి

1. కందికొండ సత్యనారాయణ శాస్త్రి - అమ్మ దివ్య చరిత్ర పుట 17
2. కందికొండ సత్యనారాయణ శాస్త్రి - అమ్మ దివ్య చరిత్ర పుట 72
3. కందికొండ సత్యనారాయణ శాస్త్రి - అమ్మ దివ్య చరిత్ర పుట 73
4. కందికొండ సత్యనారాయణ శాస్త్రి - అమ్మ దివ్య చరిత్ర పుట 76

"శ్రీ గురుజాడ రాఘవ  శర్మ గారి కుమారులైన చిరంజీవి అనే దుర్గా నాగేశ్వర శర్మ గారు వృద్ధాప్య దశలోనున్న శ్రీ స్వామి వార్ల అర్చకులైన శ్రీ రాఘవాచార్యులు గారికి శ్రీ స్వామి వార్ల అర్చనా విధానములో సహకరించుటయే గాక, ఆశ్రమ గృహ పునర్నిర్మాణములోను శ్రీ స్వామి వార్ల తాలూకు ముంజులూరు భూముల అభివృద్ధి కృషిలోను ఎక్కువగా సహకరించుచు ప్రస్తుతం శ్రీ అమ్మగారి ఆశ్రమ సంస్థ యొక్క అధ్యక్షులుగా నున్నారు".[1] (ఆంధ్రా బ్యాంక్‌లో బ్రాంచి మేనేజర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసినారు) వీరికి మేము ఐదుగురము సంతానము. ముగ్గురు ఆడపిల్లలు ఇద్దరు మగపిల్లలు. వీరికి ప్రథమ సంతానము నేను. (గురుజాడ రాజరాజేశ్వరి) ఆడపిల్లలు లేని లోటు తీర్చుకొనుటకు మా ఇంటి ఇలవేల్పు కామేశ్వరి

**"తరతరంబుల నుండి తరుగని మనపాలి**
**పంట కామేశ్వరి ఇంటివేల్పు"[2]** కల్పలత 20వ పద్యము

అని వారే కల్పలతలో చెప్పినట్లుగా నాకు

రాజరాజేశ్వరి అని మా తాత గారే పేరు పెట్టి ఎంతో అల్లారు ముద్దుగా పెంచి పెద్ద జేసిరి. నా తెలుగు చదువు (ఎమ్.ఎ) కు కూడా వీరే మూల కారణము. నా యమ్.ఫిల్ వస్తువైన కాళకవి విరచిత "శ్రీరాజగోపాల విలాసము - ఒక పరిశీలన' అనే అంశాన్ని సూచించినది కూడా వీరే. తరువాత ఇద్దరు మనుమలలో పెద్దవాడు గురుజాడ రామకృష్ణ సుందర నారాయణ శర్మ. వానికి మా తండ్రి గారైన చిరంజీవి గారు, అష్టాక్షరీ మంత్రోపాసకులగుట చేత నారాయణ పదమును, మా తాతగారి గురువుగారగు శివ సుందరరావు గారి పేరు నందలి సుందర పదమును, మా తాతగారు నష్టపోయిన సంతానములో ప్రముఖుడైన వాని పేరు 'రామకృష్ణ"ను కలిపి "రామకృష్ణ సుందర నారాయణ శర్మ" అని నామకరణమొనరించిరి. తాతగారి గురువులైన శ్రీ భాగవతుల అన్నపూర్ణ శాస్త్రులు గారు ప్రముఖ ఆంజనేయోపాసకులు. వారి దగ్గర శిష్యరికం చేస్తూ ఆ ఆంజనేయ స్వామి యందలి నిర్వ్యాజమైన భక్తి భావముతో గురువునందలి అపార భక్తితో మా రెండవ తమ్మునికి "పూర్ణాంజనేయ శర్మ" అని పేరు పెట్టిరి. మా పెద్ద చెల్లెలికి శ్రీ అన్నపూర్ణ లక్ష్మీ నృసింహ స్వామి వారి పేరులోని 'లక్ష్మీ' అను పదముతో జోడించి లక్ష్మీ అన్నపూర్ణ అని పేరు పెట్టిరి. మా రెండవ చెల్లెలు పేరు మల్లికార్జునమ్మ. ఇది మా బామ్మ గారి పేరే. ఆమె మీద ఉండే ప్రేమాభిమానములకు నిదర్శనముగా మా తాతగారు పెట్టిన పేరే అది.

---

1. కందికొండ సత్యనారాయణ శాస్త్రి - అమ్మ దివ్య చరిత్ర పుట 83
2. గురుజాడ రాఘవశర్మ - కల్పలత పుట 80

కల్పలత మహాకావ్యమును భగవదర్పణ చేస్తూ వీరు వ్రాసిన

**"పితృ దేవుండవు, మాతవున్ గురుడవీవే సచ్చిదానంద సం**
**స్థితి ( జే కూర భవత్పదాబ్జముల ( దండ్రీ! చేర్చెదన్ సత్కృపా**
**మతినందించిన, కావ్యకల్పలత రెమ్మల్ కొమ్మలున్ బాకి, సం**
**తతసర్వార్థ సమున్నతంబయి చిరస్థాయిన్ బ్రకాశింపగన్"[1]**

"కల్పలత కృతిసమర్పణ"పద్యము 3

ఈ పద్యము నందలి వారి ఆశయము, ఆశీర్వచనములు సఫలమై వారి వంశాకురములమైన మేము రెమ్మలు, కొమ్మలునై, మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాండ్రుగా విరాజిల్లుచున్నాము.

## 1.7 గురుపరంపర: -

ప్రతి జీవికి ఊపిరి ఎంత అవసరమో సద్గురువు కూడ అంత అవసరమే. గురువు లేకుండా నేర్చుకున్న విద్య రాణించదు. గురుతత్త్వం ఎంత తెలిసికున్నా ఇంకా వినాలి, తెలుసుకోవాలి అనే జిజ్ఞాస ఉన్నవారు దేన్నైనా జీవితంలో సాధించగలుగుతారు.

**"గుకారశ్చాంధ కారస్తురుకారస్తన్నిరోధకః**
**అంధకార వినిశిత్వాత్ గురురిత్యభి ధీయతే"[2]** గురుగీత 31 శ్లో॥

'గు' అనగా చీకటి, 'రు' అనగా దానిని పోగొట్టేది. అజ్ఞానమనే చీకటిని పారద్రోలుతాడు గనుక "గురువు" అని పేరు వచ్చినది. అట్టి గురువును ఆశ్రయించినవాడు సాధించలేనిది ఏమి ఉండదు. శ్రీ గురుజాడ రాఘవశర్మ గారు తమ "గురుమండలి" అని ఒక చోట వ్రాసికొనిరి.

**సీ॥ "హనుమదుపాసియౌ అన్నపూర్ణయ్య, ప్రా**
**థమిక మార్గాను సంధానగురు(డు**
**జన్మ తారక రహస్యముల ( బాలించు శ్రీ**
**శివ సుందరేశ దేశిక విభుండు**

1. గురుజాడ రాఘవశర్మ - కల్పలత పుట 1
2. శ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ - గురుగీతా పుట 35

జ్యౌతిష శాస్త్రవిఖ్యాత 'ఈరంకి సీ

తారామబుధు (డు, విద్యాగురుండు

జ్యౌతిషమంత్ర శాస్త్రమనీషి, నారాయ

ణాచార్యు ( డమల విద్యాగురుండు

సహజపాండిత్య విశారదు(డాత్మసం

వేదిపోతన్న కవిత్వగురు(డు"

"తర్క వేదాంతశాస్త్రమనీషి వేంకట

శాస్త్రి యాధ్యాత్మిక శాస్త్రగురు(డు

రాజకీయ జ్ఞాన తేజులు 'పట్టాభి'

'చెఱకువాడ'లు సుప్రసిద్ధ గురులు

త్యాగమోర్మి జీవితానుభవమ్మున

నిల్పబోధించె 'గాంధీజి గురు(డు."

గీ॥ "జన్మ తరియింప నుత్తమ జన్మ మొస(గి

నట్టి గురుజాడ వంశ విఖ్యాత యశులు

వేంకమాంబా త్రయంబకుల్, స్వీయమాన్య

మాతృ పితృమూర్తులీ మండలిని, స్మ

రింతు సంతతమున్, శుభశ్రీల మనుప"॥ [1]

హనుమదుపాసకులైన శ్రీ తెనాలి అన్నపూర్ణ శాస్త్రులు గారు ప్రాథమిక మార్గానుసంధానులు గనుక గురువు. దైవాంశ సంభూతులు, శ్రీ రాజరాజేశ్వరీ భక్తులు, శ్రీ లలితాదేవిని ప్రత్యక్ష మొనరించుకొనుటయేగాక, దృశ్య శ్రవణ శక్తి మంతులైన ఉపాసకులు శ్రీ జొన్నలగడ్డ శివ సుందరరావుగారు వీరు గురువులు. జ్యోతిషశాస్త్రములో ప్రఖ్యాతివహించిన ఈరంకి సీతారామయ్య పండితులు విద్యా గురువు-జ్యోతిషమంత్ర శాస్త్ర పండితులు సుదర్శనం నారాయణాచార్యులు గారు విద్యా గురువులు. సహజ పాండిత్యుడైన పోతన్న కవిత్వ గురువు. తర్క, వేదాంత శాస్త్ర పండితులైన శ్రీ మండలీక వేంకటశాస్త్రిగారు, ఆధ్యాత్మిక శాస్త్ర గురువులు. రాజకీయ జ్ఞాన తేజస్సంపన్నులైన పట్టాభి సీతారామయ్య, చెఱుకువాడ నరసింహం పంతులు గార్లు సుప్రసిద్ధమైన గురువులు-జీవితములో త్యాగమును, ఓర్పును జీర్ణించుకొనేటట్లుగా బోధించిన గురువు గాంధీజీ. జన్మతరింపజేయుటకు ఉత్తమ జన్మనిచ్చి, గురుజాడవంశమునకే విఖ్యాతమైన యశస్సునార్జించి

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ, వ్రాతప్రతి

పెట్టిన వేంకమాంబ త్రయంబకులైన మా మాతాపితలు గురువులు. ఎల్లప్పుడు శుభములను, సంపదల నిచ్చుచు జీవితము గడుపునట్లు చేయు వీరిని స్మరింతును. ఇది వీరు ప్రతిరోజు ప్రాత:కాలములో చేసే ప్రార్ధన.

శ్రీ హనుమదుపాసకులు, తెనాలి వాస్తవ్యులునైన శ్రీ భాగవతుల అన్నపూర్ణ శాస్త్రులు గారు ప్రాథమిక మార్గాను సంధాన గురువులు. వీరి దగ్గర శ్రీ శర్మ గారు

**"అది జన్మాంతర పుణ్యలబ్ధమయిలభ్యం బాయెగా, నిర్వదె**

**న్మిదివర్షమ్ములు, నీ మహోత్సవములన్ సేవించు భాగ్యమ్ము"** [2]

శ్రీ సువర్చలాంజనేయమ్ పుట 19

సుమారుగా ఇరవై ఎనిమిది సంవత్సరములు ఆంజనేయుని ఉత్సవాలను - కళ్యాణములను గురువుగారితో కలసి ఎంతో వైభవముగా నిర్వహించారని చెప్పెడివారు. వీరే శ్రీ సువర్చలాంజనేయములో చెప్పుకొన్నట్లుగా అట్లా సేవ చేసే భాగ్యము లభించుట జన్మాంతర పుణ్యము. దీనికి కారకులు వారి గురువులైన శ్రీ భాగవతుల అన్నపూర్ణ శాస్త్రిగారు. వీరే ప్రార్ధనలో భాగవతవంశ స్వామియైన నిన్ను కొల్చెదను అంటారు. వీరి దగ్గర ఎన్నో ఆంజనేయ మంత్రములను కూడా ఉపదేశము పొందినట్లుగా చెప్పేవారు.

జన్మతారక రహస్యములఁబాలించిన వారు శ్రీ శివ సుందర దేశికులు - వీరు తమకి ఏదైనా సందేహము కలిగినా - బాధ కలిగినా తమ గురువుల దగ్గరకి వెళ్ళి వారితో చర్చించి వారి ఆశీర్వచనములు పొంది ప్రశాంతత పొందేవారు. వీరి భార్య, కుమార్తె రాజరాజేశ్వరి కూడ భక్తులే. వీరిరువురు ఉపాసనాపరులు - పరమనైష్ఠికులు. వీరు దసరా ఉత్సవాలు ఎంతో వైభవోపేతముగా చేసెడివారు. ప్రతి సంవత్సరము మా తాతగారు ఒక్క రోజైనా వెళ్ళటం వారితో బాటు నన్ను కూడా తీసికొని వెళ్ళటం జరిగేది. శ్రీమతి శివ సుందరరావుగారి దర్శన భాగ్యం నాకు కూడా కలిగినది. శ్రీ శర్మ గారే తమ గురువును గూర్చి ఈ విధముగా వ్రాసికొనిరి.

**"సంతతతోషిత సుమన**

**స్వాంతులు, సజ్ఞాన తిమిర సంతతికిన్ భా**

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - శ్రీ సువర్చలాంజనేయమ్ పుట 19

**స్వంతులు, సద్గుణవంతులు**
**శాంత దయా క్రాంతులు సద్గురుమూర్తుల్"** [1]

**"ఆనంద నాథు, నన్మ**
**న్మానస ఫుల్లారవింద మానిత పీఠా**
**సీను, ప్రసన్న ముఖాబ్జున్**
**జ్ఞానున్, శివసుందర గురునాథున్ దలతున్"** [2]

**"శ్రీ శివ సుందర! హృత్సం**
**కాశా! పరిశుద్ధ, స్వప్రకాశా! కరుణా**
**రాశీ! గుణరాశీ! హృద**
**యేశా! గురునాథ! నిన్స్మరించెద సతమున్ "** [3]

సద్గురు మూర్తులు ఎల్లప్పుడు మంచి మనస్సుతో సంతోషముగా ఉండి అజ్ఞానమనెడి చీకటిని పారద్రోలువారట. శాంత దయా క్రాంతులట. ప్రసన్న ముఖాబ్జులట.

**"ఉరుతర భవసాగర సం**
**తరణమ్ములు స్వీయ భక్త తాపత్రయ సం**
**హరణమ్ములు శ్రీ శివ సుం**
**దర గురుచరణాబ్జములు, జన్మతారక పదముల్"** [4]

శ్రీ గురువుల పాదపద్మములు కష్టాలకడలిని దాటించునవట. భక్తుల తాపత్రయ సంహరణమ్ములట. జన్మతారక పదములట. అట్టి మీ పదములను

**"నమ్మితి మీ పదాబ్జములె నా యెద మూలననంగియున్న, మాం**
**ద్యమ్మును. జీకటుల్ తొలగి, తావక దివ్య కృపాకటాక్ష భా**
**గ్యమ్మది కల్గుగాక, సుకృతాత్ముడనౌదు, ఫలించు జన్మ, నా**
**నమ్మిక లేమి చేసెదవొ! నాథ! గురూ! శివ సుందర ప్రభూ !"** [5]

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3, 4, 5 పద్యాలు

"ఏ జన్మ సుకృతమో
యీ జన్మకు లభ్యమయ్యె యెనలేని మహా
తేజో సంకలిత, పదాం
భోజులు, సద్గురులు, కల్పభూజమునోజన్ "[1]

"క్రీగంటి ప్రసాదమునన్
లాగెడి మానసిక వృత్తులన్ విడివడగా
లోగొను 'శక్తి నొసంగెడి
నాగురు మూర్తిని మనమ్మునన్ బూజింతున్"[2]

అని అంటారు. క్రీగంటి చూపులచేతనే వారి మానసిక ప్రవృత్తులను విడగొట్టి హాయిగా నుండేటట్లుగా చేయు శక్తి గల తమ గురు దేవుని మనస్సులో పూజిస్తానంటారు.

"పలుకున్ సంతతధారగా నుపనిషద్ వాక్య ప్రసారమ్ములే
చిలుకున్ వాగమృతమ్ము సంతపిత మచ్చిత్తాబ్జమ్మున్విచ్చి రం
జిలఁగా దివ్య కృపాకటాక్ష విజయ శ్రీత్వన్ముఖాబ్జమ్మునన్
వెలుగున్ నిత్య సుఖ ప్రదంబయిన సంవిత్థానమున్ గూర్పగా "[3]

ఎల్లప్పుడు సంతోషిత స్వాంతులైన తమ గురువులు అజ్ఞాన తిమిరమును పోగొట్టుచు శాంత, దయాక్రాంతులై తమ హృదయ పీఠమునలంకరించి, పరిశుద్ధమైన కరుణాగుణ వారాశియై, సంసార సాగర సంతరణులై, భక్త తాపత్రయ సంహరణములు చేయుచున్నారని అటువంటి వారి పాద పద్మములను సేవించు భాగ్యము కల్గినదని, ఇది ఏ జన్మ సుకృతమోనని ఇది సద్గురువుల అనుగ్రహ ఫలమని నమ్మిరి. ఇట్టి సద్గురువుల కొలుచుటయేగాదు వారి హృన్నివాసినియైన రాజరాజేశ్వరిని కూడా కీర్తిస్తారు.

మ॥ "గురు కారుణ్య కటాక్ష లబ్ధ మృదువాగ్భూష ప్రభా
దరహాసోజ్జ్వల సుప్రసన్న వదనా! తాప త్రయోన్మూలినీ!
చిరవాంఛాఫలసిద్ధి దాయిని! కటాక్షింపంగదే! సుందరే
శ్వరసద్దేశిక హృన్నివాసిని మదంబా! రాజరాజేశ్వరీ!"[4]

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3, 4 పద్యాలు

గురువు యొక్క అనుగ్రహము సంపూర్ణముగా లభించినచో ఎట్టి దుష్కరమైన కార్యమునైన అవలీలగా సాధించవచ్చునని మనసా నమ్మినవారు. గురువు వేరు దైవము వేరు కాదు గురువే దైవము అని నమ్మినవారు దానికీ పద్యము ప్రత్యక్ష సాక్ష్యము

**చం॥ "గురు కరుణా కటాక్షమ్మునను౯ సరిగావెవి, ధాత్రి నెట్టిదు**
**ష్కరమగు కార్యమేని, సరిగా ఫలియించు నటంద్రు, సద్గురు**
**స్మరణను దైవమాతడె సుమా! నిజ బంధు వుపాసనాపరం**
**పరలను దాట దర్శకులు, మాదుక భాగ్యముగాగ పొల్చు, సుం**
**దర శివమూర్తి, దివ్య చరణాబ్జములన్ మనసా స్మరించెదన్"[1]**

జ్యోతిష శాస్త్రములో ప్రఖ్యాతి వహించిన ఈరంకి సీతారామయ్యా గారి దగ్గర వీరు జ్యోతిష శాస్త్రమునభ్యసించారు. జ్యోతిషమును ఏదో ఒక గ్రంథము చదివినట్లుగా గాకుండ, వేదములో షడంగము జ్యోతిషమని అది శాస్త్రముగా, ఒక ఉపాసనా గ్రంథముగా భావించారు. ఆరాధించారు. దీనిపై ప్రతిఫలాపేక్షను ఆసించలేదు. శ్రీ కృష్ణోపాసన కూడా దీనికి తోడై మరింత వన్నె దెచ్చినది. వాక్శుద్ధి కలిగించినది. చెప్పకూడని విషయమును సూచన చేయుట - మాత్రమే - జాతకముల పరిశీలనలో ఉన్నది ఉన్నటుల చెప్పటము - బాగుండనిది ఇట్లా చేస్తే బాగుంటుందని సూచించటము - ధర్మ మార్గమనుసరించటమే గాని వీరి పద్ధతిలో వేరొండులేదు.

జ్యోతిష మంత్ర శాస్త్ర పండితులు ముచ్చుమిల్లి సుదర్శనం నారాయణాచార్యులు గారు. వీరి దగ్గర ఎన్నో మంత్రాలను, వాటి రహస్యములను నేర్చుకున్నారు. వీరు పంచాంగ కర్త. సిద్ధాన్తి. జ్యోతిష శాస్త్రములోని మెళకువలను సిద్ధాంతములను వీరి ముఖత: వినటం చర్చించటం జరిగేది. అందువలననే జ్యోతిషమును ఏదో ప్రశ్న అడగటానికి వచ్చాము అని ఎవరైనా అంటే ఇది ఊరకే ప్రశ్న అడిగితే జవాబు చెప్పటం కాదు. ఇది శాస్త్రము - ఇక్కడ చెప్పేది రాఘవ శర్మగాదు అదిగో! ఆ నాయన చెప్పుచున్నారని శ్రీ కృష్ణ పరమాత్మ పటము వైపు చూపించేవారు. కాబట్టి జ్యోతిష్యమును శాస్త్రముగా ఉపాసించారే కాని కావ్యముగా చదువలేదు.

సహజ పాండిత్య విశారదుడైన పోతన్న కవిత్వ గురువు. వీరి భక్తి తత్పరత యసాధారణము. అది వీరి కవితా ప్రసంగములందును, ఇతర ప్రవృత్తులందునను అడుగడుగున గోచరించుచునేయుండును.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1వ పద్యము

ఆంధ్రకవులలో పోతరాజు సుధీవరునెడ వీరికి గురు భావన నెలకొల్పినది. యీ భక్తియే. వీరు శ్రీ కృష్ణోపాసకులగుట కూడ.

**"భాగవతమె వేదపరమార్ధదమునాకు**

**భాగవతులె నాకు। బరమ గురువులు**

**భాగవతపు వేల్పు పరగ నాయిలు వేల్పు**

**భాగవత పదమ్ము పరమ పదము"[1]**

అనునది వీరి సిద్ధాంతము. ఎంతో మంది కవులు భగవదారాధకులు ఉన్నను శ్రీ వాసుదేవ నామశతకమున"

**"వరయోగీంద్రులు ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ...**

**... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ...**

**శుక వాగ్దివ్యామృతాబ్దిందు" సుం**

**దరునిన్ బమ్మెర పోత రాజనుతు ( గృష్ణా వాసుదేవ ప్రభూ"**

శ్రీ వాసుదేవనామశతకము పద్యం 45

అనుటలో కారణము భాగవతాగ్రగణ్యుడైన పోతన్నను ఒక్కరినే వీరు తలంచుకొనుటకు కారణము గురు భావనయే అయి ఉండును[2].

ఇటు వంటి సహజ పాండిత్యము ఆశుకవిత్వముతో బాటు భక్తి పూరితమైన కల్పలత శ్రీ వాసుదేవ నామ శతకముల వంటి గ్రంథములు వ్రాయుటకు కాలము కూడ వీరికెంతో సహకరించినది. ఆ రోజులలో అద్యతనాంధ్ర కవి కుల గురువైన శ్రీ తిరుపతి వేంకట కవులాంధ్ర దేశములో ముఖ్యముగా బృందావన పుర యువకులలో కవితాపిపాసను రేకెత్తించుచున్న మహత్తర సమయము. అప్పుడు శ్రీ శర్మ గారు కూడా నవయువకులు. వేంకట శాస్త్రి గారు దర్శన మాత్రముననే కవితలల్లనేర్చి పెద్దల మన్ననలందగల్గిరి. ఇది నేర్చినంత లభ్యమౌ విద్యగాదు. పూర్వ జన్మ సంస్కారముండవలెను గదా! అది వీరికి లభ్యమైనది.

తర్కవేదాంత శాస్త్రపండితులైన శ్రీ మండలీక వెంకట శాస్త్రి గారు తమ ఆధ్యాత్మిక శాస్త్ర గురువులు అని చెప్పుకొనిరి. వీరి దగ్గర శ్రీ శర్మగారు ప్రస్థానత్రయం భాష్యమును అధ్యయనం చేశారు. శంకర భాష్యమునభ్యసించారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి
2. శ్రీ దువ్వూరి వేంకట రమణ శాస్త్రి ఆశీస్సులు శ్రీ వాసుదేవ నామ శతకము పుట 6

శ్రీ రాఘవ శర్మ గారి శతజయంత్యుత్సవ సంచికకు వ్యాసము వ్రాస్తూ శ్రీ కూచిభొట్ల చంద్రశేఖర శర్మ గారు ఈ విధముగా వ్రాసిరి.

"అది 1946వ సం॥ ప్రాంతమనుకుంటాను. నేను బందరు గొడుగుపేటలోని సాంగవేద పాఠశాలలో సంస్కృతం చదువుకుంటున్న రోజులు. శ్రీ మండలీక వెంకట శాస్త్రి మహోదయులు ఆ పాఠశాలకు ప్రాచ్యాచార్యులుగా ఉండేవారు. శాస్త్రిగారు అపర వ్యాస మహర్షిలాగా వేదాంత పాఠాలు చెపుతుండేవారు. సాయంకాలం భాగవత ప్రవచనం చేసేవారు.

పుంభావ సరస్వతిలాగా ఉండే శాస్త్రి గారి ఉపదేశాలు గంభీరంగా సాగుతుంటే అశేష జనం ఆనందంలో ఓలలాడే వారు. ప్రాతః కాలాన బందరులోని పండితులు, పెద్దపెద్ద ఉద్యోగులు, న్యాయవాదులు మొదలయిన వారెందరో వయోభేదం లేకుండా వచ్చి వెంకట శాస్త్రిగారి వద్ద ప్రస్థాన త్రయం భాష్యం చాలా శ్రద్ధగా అధ్యయనం చేస్తూ ఉండేవారు. అప్పుడు వృద్ధాశ్శిష్యాః గురుర్యువా అన్నట్లు శ్రీ దక్షిణామూర్తి గురు దేవులు మదిలో మెదిలేవారు.

అందరూ సంధ్యావందనాదులు పూర్తి చేసికొని మడిగా వచ్చి సనాతన ధర్మం రూపు ధరించినట్లు కూర్చొని శ్రవణం చేస్తూంటే ఆ పాఠశాల ప్రాంగణం ఒకనాటి ఋషి వాటికలను తలపింపజేస్తూ ఉండేది. ఆ భాష్యాలనధ్యయనం చేసే వారిలో శ్రీ గురుజాడ రాఘవశర్మగారు చాలా ఏకాగ్రతతో వింటూ ముఖ్య విషయాలు వ్రాసుకొంటూ ఉండటం ఇతరులకు ఆదర్శంగా ఉండేది. సాంగవేద భాస్కర కుప్పా లక్ష్మావధాన్లుగారు, 'జ్ఞానఖని" సర్వాశివ రామకృష్ణ శాస్త్రిగారు, ఆంధ్ర సంస్కృత పండితులు జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రిగారు, శ్రీ రాళ్ళబండి సీతారామశాస్త్రి గారు వంటి ఉద్దండుల మధ్య శ్రీ రాఘవ శర్మ గారు వినీత వేషంతో తాను ఒక వేద పండితుని వలె బ్రహ్మతేజో విరాజితులై కనబడుతుండేవారు"[1].

గురుతుల్యులు - శ్రీ గురుజాడ అనువ్యాసము వ్రాయుచు శ్రీ ఆర్.డి.ఎల్. నరసింహమూర్తి గారు, "ఆ రోజులలో బందరు పట్టణము ఆర్షవేద సంస్కృతి పరిరక్షణకు పట్టుగొమ్మ. 1939 సం॥లో బందరులో గొడుగుపేటలో శంకర మఠంలో పాఠశాల భవనాలు ఏర్పాటు చేశారు. ఆ రోజుల్లో ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలకు శంకర మఠం నెలవు. ఉద్దండులైన పండితులు, ఉపాధ్యాయులు ఉండేవారక్కడ. బ్రహ్మశ్రీ మండలీక వేంకట శాస్త్రి గారు ప్రతిరోజూ ఉదయాన శంకర భాష్య ప్రవచనం చేసేవారు. శ్రీ రాఘవ శర్మగారు ఎంతో భక్తి శ్రద్ధలతో పాల్గొనేవారు.[2] అని వ్రాసిరి

1. శ్రీ కూచిభొట్ల చంద్రశేఖర శర్మ "మహోదాత్తవ్యక్తి 'కవిశేఖర శ్రీ గురుజాడ రాఘవశర్మ" శతజయంత్యుత్సవ సంచిక పుట 14
2. ఆర్.డి.యల్. నరసింహ మూర్తి గురుతుల్యులు శ్రీ గురుజాడ రాఘవ శర్మ శతజయంత్యుత్సవ సంచిక పుట 35

రాజకీయ జ్ఞానతేజులైన శ్రీ పట్టాభి సీతారామయ్యా గారు, చెఱుకువాడ నరసింహం పంతులుగారు సుప్రసిద్ధ గురువులని చెప్పుకొనిరి.

బందరు పట్టణము మహోజ్జ్వల కీర్తి కిరణాలనదగు పెద్దలు శ్రీ పట్టాభి సీతారామయ్యా గారు, చెఱుకువాడ నరసింహం పంతులుగారు. వీరే గాక ఇంకా ఎంతో మంది కలరు.

**గీ॥ "ప్రాణి లోకంబుసంసార పతితమగుట**
**వసుధపై, పుట్టి గిట్టనివాడు కలఁడె!**
**వానిజన్మంబు, సఫలమెవ్వాని వలన**
**దేశమధికోన్నతివహించు, దీప్తిదనర"** [1]

"He who Project's his individual self beyond
himself into the wide world around in
some useful public form - is a greatman - నాయకుల లక్షణము" [2]

తమ జీవిత సర్వస్వమును, తమ జాతికై, తమ దేశమునకై తన పొరుగువానికై యేమాత్రమైన వినియోగించినను వారు జీవన్ముక్తులు - ధన్య జీవులు. ఆ కోవకు చెందిన వారే శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్యా గారు. వీరిలోని సత్ప్రవర్తన, సత్యానురక్తి అంచంచల నియమ పాలనా దీక్ష, సర్వసమత్వ దృష్టి, సంతత సేవా నిరతి మొదలగు సద్గుణములను శ్రీ రాఘవశర్మ గారు పుణికిపుచ్చుకొనిరి. అంతేగాదు పట్టాభిగారి వస్త్రధారణ విషయము కూడా వీరలవరుచుకున్నారేమోనని అనిపించును. జరీ అంచు గల ఖద్దరు ధోవతి, ఉత్తరీయము పైన వేసికొని, తలపాగా ధరించి, ఆపాదమస్తకం తెల్లని దుస్తులతో ఎంతటి వారినైన, ముగ్ధుల చేసే ముఖ కాంతికలిగి చకచక నడకతో తిరుగుట పట్టాభిగారిని తలపింపజేయును. పట్టాభిగారి దానగుణము, పెట్టుపోతల గుణము, ఆప్యాయత, త్రికరణ శుద్ధిగా చేసే సహాయము - ఎన్నో సంస్థల స్థాపన - ఉద్యోగాలు కల్పించటం ఇట్లాంటి గుణములెన్నో వీరికి అలవడ్డాయి. ముఖ్యముగా ప్రతి విషయములోను పొదుపు చేసే విధానము వీరికి శరీరమున జీర్ణించుకొని పోయిన పద్ధతి. ప్రతి దానికి జమా ఖర్చులు వ్రాయటము అవసరమైనంత మాత్రమే ఖర్చు పెట్టడము వీరికలవడిన మంచి లక్షణములు. దీని కంటెను మించినది సమయపాలన.

---

1 శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

2. పైదే

సూర్యుడు ఎట్లాగైతే తన విధి సూర్యోదయము - సూరాయస్తమయములను కాలమునతి క్రమించకుండా గడుపునో అట్లే పట్టాభిగారును నియమిత కాలములో ముగించుకునేవారట. ఎంతటి మహానుభావులైన వారి ఆజ్ఞకు లోబడి నడుచుకోవలసినదేట. అట్టి కాల పరిజ్ఞానమును పట్టాభిగారి నుండే గ్రహించిరి. ఉత్తర ప్రత్యుత్తరములు సకాలములో సాగుట - రాట్నము వడుకుతు కూడా తన దగ్గరకు వచ్చిన వారికి సందేహ నివృత్తి చేయుట పట్టాభి గారికి అలవాటట. అదే క్రమములో వీరును నడచుచూ, భగవద్దత్తమైన అనర్గళ వాక్సుధా ధారతో జీవితమును గడపి పట్టాభిగారి వంటి గురువులకు తగ్గ శిష్యులైరి.

ఇటువంటి మహనీయుల కోవకే చెందిన వారు చెఱుకువాడ నరసింహం పంతులుగారు.

శ్రీ శర్మగారే స్వాతంత్ర్య పథములో,

**"ఎవనివర్తనమేలి యొరవడి ప్రజకు**
**ప్రజకు సమ్మోహనాస్త్రమెవ్వాని పలుకు**
**అట్టి శ్రీ చెఱకు వాడ వంశాబ్ధి చంద్రు**
**నారసింహునికివె నమస్కార శతము"** [1] శ్రీచెఱుకువాడ 1వ పద్యం

ప్రజలను సమ్మోహనపరచే వాక్చాతుర్యము అనర్గళ వాక్సుధా ప్రౌఢ, ప్రవర్తన కలిగిన చెఱుకువాడ నరసింహునికి నమస్కార శతమునర్పిస్తాననుటలో వీరి గురు భావము వెల్లడియగుచున్నది.

**"గురుడయిమాకు, ఆంధ్రికనుగుంగొమరుండయి, లక్షలౌ ప్రజల్**
**శిరములు వంచి మ్రొక్క....................................."** [2] శ్రీ చెఱుకువాడ 2వ పద్యం

**"......ప్రచండ వాగ్వితతి, నెల్లరన్ముగ్ధుల జేయుపూజ్యుని**
**బత్తి దలంచెదన్ చెఱుకువాడ నృసింహగురుత్తమున్ సదా"** [3] శ్రీచెఱుకువాడ 5వ పద్యం

అని కీర్తిస్తారు. దీనినిబట్టి శ్రీ పట్టాభిగారనిన, శ్రీ చెఱుకువాడ నరసింహం పంతులు గారనిన వీరికెట్టి గౌరవ భావము కలదో వ్యక్తమగుచున్నది.

త్యాగమును, ఓర్పును జీవితానుభవములో నిలిచిపోయేటట్లుగా బోధించిన గురువు "గాంధీజీ" అని చెప్పకొనిరి.

---

1. గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్య పథము పుట 96ఎ
2. గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్య పథము పుట 96
3. గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్య పథము పుట 96ఎ

స్వాతంత్ర్య సంగ్రామములో గాంధీజీ శంఖారావము విని దేశ భక్తి ప్రపూరితులై సంగ్రామ రంగమున అడుగిడిన మహానాయకులలో శ్రీ శర్మగారొకరు. వీరు గాంధీజీని

**"మన సారథి, మన బంధుడు**
**మన హితుడున్, మన గురుండు మన నాయకుడున్**
**మన భారత సేవకుడున్**
**మన గాంధీ ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ..."॥**[1] సత్యస్మృతి 1వ పద్యం

సంగ్రామ రథ సారథిగా, బంధుడుగా, హితుడుగా, గురుడుగా, నాయకుడుగా, భారతమాత సేవకుడుగా భావించి ఆయన చెప్పినదే వేదవాక్కుగా భావించి, త్యాగగుణమును, అహింసావ్రతమును ధర్మ పరిపాలనా, నేర్పు, ఓర్పును అలవరుచుకొన్న వీరులు - గాంధీయనిన, గాంధీ నివసించిన క్షేత్రమనిన వీరికెంత గురు భావము గలదో ఈ పద్యములే స్పష్టపరుచుచున్నవి.

"శ్రీ గాంధీ పర్వతక్షేత్రము" అను శీర్షికతో వీరే కొన్ని పద్యాలు వ్రాసియుండిరి అవి: -

**సీ॥ "అచల సంకల్ప సత్యాహింస సువ్రతా**
**నియమ తపశ్శాలి, నిలయమనఁగ**
**ప్రకృతి మాతా పూత పాదార విందసే**
**వా పరాయణు సునివాసమనఁగ**
**ఉన్నతా దర్శభావోజ్జ్వల కర్మదీ**
**క్షాయోగి చంద్రు, యాశ్రమమనంగ**
**విస్తృత హృదయారవింద సమున్నత**
**దృక్పథవర్తి ప్రాదేశమనగ**
**నిర్మలానందమూర్తి గాంధీ మహాత్ము**
**జీవితాదర్శ గుణ గణ చిహ్నమనఁగ**
**దనరు, విజయవాడ, సుపవిత్ర స్థలమ్ము**
**శైలరాజమ్ము, కర్మదీక్షాలయమ్ము**
**గంటి, యానందమున్ గంటి, మంటినేడు"**[2]

---

1. గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్య పథము పుట 66
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

సీ॥ "ఖండ ఖండాంతర ఖ్యాతి మహోజ్జ్వల
కాంతి వ్యాపించునాకాశమనఁగ
స్వానుభవైక సత్యాహింస భావముల్
దిట్టమై, పెనుపాదుగట్టెననఁగ
లోకోద్ధరణ కిలనేకైక కర్మయో
గమ్మై, సుస్థిర సత్పథమనంగ
విశ్వకల్యాణ సంవేద్యమ్ము, శ్రీరామ
నామనీమ మచలధామమనగ
వెలసెనా! నేడు శ్రీ దివ్య విజయవాటి
కా మహోన్నత రమ్యశృంగార చిత్ర
చిత్ర విజ్ఞాన మందిర క్షేత్రమగుచు
గాంధి శైలమ్ము, సుజన మోక్ష ప్రదమ్ము."

ఉ॥ "స్వాంతము విస్తృతంబయి, ప్రసన్నతగాంచెడు, మించిభూరిది
గ్భ్రాంతులఁ గ్రమ్ము గాంచనిది, కానురి లక్ష్మణరాయు పూర్వజ
న్మాంతర పుణ్యమేమొకొ, వియత్తల మంటెడు, నింద్రకీలశై
లాంతరమెల్ల గాంధి మయమై, కఁజేసె స్వదీక్ష మిత్రులన్"[1]

వీరు జీవితములో అబద్ధమాడుట గాని - ఒకరికి హానితలపెట్టుట గాని ఎరుగరు. తమ సర్వస్వమును దేశము కోసమే త్యాగము చేసిరి.

జన్మ తరింపఁజేయుటకు ఉత్తమ జన్మనొసగినవారు, గురుజాడ వంశమునకే విఖ్యాతమైన కీర్తినార్జించి పెట్టిన వేంకమాంబత్రయంబకులు మా మాతాపితలు అని చెప్పుకొనిరి. అడుగడుగునా వీరు తమ తల్లిదండ్రుల పట్ల చూపే గౌరవ భావము గురు భావము కన్పించుచుండును. తమ కావ్య కల్పలతను పితృదేవతలకర్పించిన గురు భావమే. అంత్యకాలములో తండ్రికి రామ దర్శనము చేయించిన గురు భక్తియే. దేవతలను కొలిస్తే దయగలుగుతుంది. పితృ దేవతల కొలిచిన వంశ వృద్ధియగును. కోరిన కోరికలెల్ల తీర్చే కల్పలత వలె మా వంశ భూజము పూచిన తంగెడువలె ప్రసిద్ధి గాంచవలెనని కోరుకొనిరి. వీరే కల్పలతలో కృతిసమర్పణ గావించుచు ఈ క్రింది విధముగా వ్రాసిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

**"కొలిచిన ౘగల్గుదేవతలకున్ దయ, యా పితృదేవతావళిన్**

**దలచిన వంశవృద్ధియగు ౘదామరతంపరవోలె, దట్టమై**

**మొలిచిన వంశభూజమటు పూచిన తంగెడు భంగిమా కొలం**

**బెలమి వహింప ౘగల్పలత' నిచ్చెదమా పితృదేవతాళికిన్"[1]** కల్పలత కృతిసమర్పణ పద్యము

జగద్గురువులైన శ్రీ కృష్ణ పరమాత్మ వీరు నమ్మిన దైవము వారిని ఉపాసించుటయే వీరి ఊపిరి. భగవద్గీతయే వీరి మార్గము జీవితాదర్శము. ఇదే అభిప్రాయము వెంపటి పురుషోత్తము గారి మాటలలో చెప్పినచో

What, in life, is Thy ideal dear associate ?
It is the Gita way, as I know quite intimate.
Thy life has seen no clumsy curves,
It is one straight course that never swerves.
It is one upward graph without decline,
Governed by; stem rules of self discipline[2] 35 to 40 Lines.

నీ జీవితా దర్శనమేమిటయ్యా! ప్రియమిత్రమా! అది గీతామార్గము. ఎందుకనగా బాగా కలిసి మెలసి నిన్నెఱింగియున్న వాడనుగాన తెలుసు. నీ జీవితమేనాడు వక్రమార్గముల పట్టలేదు. ఏనాడు తొట్రువడని ఒక సూటిమార్గము నీ జీవిత రేఖ యెంతవరకు ఊర్ధ్వ స్థితికి చేరేదికాని క్రిందికి జారునది కాదు. అది నీ ఖచ్చితమైన క్రమశిక్షణ, గట్టి కట్టుబాటులనంటి నడిచేది! అని శ్రీ శర్మ గారి సన్మాన సందర్భములో వ్రాసిరి.

లోకోత్తర చరిత్రులు, మహిమాన్వితులునైన శ్రీశ్రీశ్రీ జగద్గురు చంద్రశేఖర సరస్వతీ స్వామి వారిని గూడ వీరు గురువులుగా భావించిరి.

**"గీతా చార్యుడె స్వామి, కేవలము శ్రీ కృష్ణుండు, సద్భక్తిత**

**ద్గీతల్ సంశ్రవణమ్ము, జేసిన, మహాధీరుండు, పార్థుండు, య**

**ద్వైతానంద రసప్రపూర్ణమగు గీతల్, శ్రద్ధమైవిన్న, వి**

**ఖ్యాతాౘ మేయ సుఖస్థితిన్, గనఁగ, శ్రేయ:ప్రాప్తిచేకూరెడిన్"[3]**

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత కృతి సమర్పణ పద్యము
2. Sri Vempati Purushotham, "Raghava - Beloved of Gopal on the occasion of sanmanam to him on 8-10-1962
3. శ్రీ గురుజాడ రాఘవశర్మగారి వ్రాతప్రతి

గీతాచార్యుడే స్వామి, భక్తితో చదివినా, వినినా అంతులేని సుఖ సౌఖ్యములొసగునను నమ్మిక గలవారు.

శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి వారు గురుజాడ గ్రామమునకు విచ్చేసినప్పుడు,

**"ఎన్నో నోములు నోచినన్ గలుగునే యీ దొడ్డ భాగ్యమ్ము, మా**
**పున్నెమ్ముల్ వెస, పండెనేటికి, కృపాపూర్ణా! యలభ్యమ్ము, మీ**
**సాన్నిధ్యమ్ము లభించె, మానితగురుస్వామీ! మహాజ్ఞాన సం**
**పన్నా! మా గురుజాడ గ్రామము, తరింపన్ నేడు విచ్చేసితే"[1].**

ఎన్నో నోములు నోచినను ఈ భాగ్యము లభింపదు. ఎవరికీ లభ్యముగాని మీ సాన్నిధ్యము లభించినది. ఓ గురు స్వామి! మీరు మహా జ్ఞాన సంపన్నులు - మా గురుజాడ గ్రామమును తరింపచేయుటకు నేడు విచ్చేసితిరా! అని వ్రాసిరి.

మంచి గురువు లభించుట కూడ పూర్వజన్మ సుకృతము - దుర్లభము అట్టిది నాకు లభించినది అని వీరి కృతజ్ఞతా భావము ఇందు కనబడుచున్నవి. శ్రీ చంద్ర శేఖరులను సాక్షాత్ గురువుగా భావించుటయేగాదు వారిలో సింహవాహినియైన జగదంబను దర్శించగల్గిరి.

**"వరరుద్రాక్ష సరుల్ జడల్వలె, శిరోభాగమ్ము శోభిల్లగా**
**కరమందున్ గల, దండ, మింపు (జెలగంగా త్రిశూలమ్ముగా**
**సరవిన్, వజ్ర కిరీటమున్ వెలయ శీర్షంబందు శ్రీ చంద్ర శే**
**ఖర, కందున్ మిము సింహవాహినిగ శ్రీ కల్యాణ సంపదందున్**
**గురుజాడన్ కరుణాకటాక్ష, మిముగన్గో భాగ్యమున్ గల్గెగా"[2]**

గురు కటాక్షము ఎంతగా వీరిపై ప్రసరించినదో దీనిని బట్టి తెలియుచున్నది.

శ్రీ రాఘవ శర్మ గారికి అరవిందులనినను ఎంతయో గురు భావము: వీరు పుదుచ్చేరి వెళ్ళినప్పుడు,

**"కరుణాలోకనమాత్ర జీవులను యజ్ఞాతమ్ముగా లోపలన్**
**కరుడున్ గట్టిన తొంటి వాసనలవేగన్ క్షాళనన్ జేసి, స**
**ద్గురురూపమ్మున సాకి, సంసరణ ముక్తుజేయు తల్లీ భవ**
**చ్చరణాబ్జమ్ము కనంగరమ్ము, అరవింద జ్యోతివై మాకికన్"[3]**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3 పద్యాలు

అరవిందులు కేవలము తమ చూపులతోనే జీవులలో అజ్ఞాతముగా కరుడుగట్టిన తొంటివాసనలను క్షాళన జేసి సంసరణముక్తులను జేయువారట. సద్గురు రూపములో వారిని అనుగ్రహింపజేయుదురని వ్రాసిరి.

**"మనమూహింపనిశక్తియేదో! కదలింపన్ లోపలన్ జన్మపా**
**వనమున్ జేసెడి మాతృమూర్తి విలసత్ పాదారవింద ద్వయిన్**
**గన విచ్చేసిరి దీక్ష తీఱ జనమానందమ్మునన్, దివ్య ద**
**ర్శన మాత్రాన పునీతమౌదుమని, దేశంబందు నల్మూలలన్"[1]**

దేశం నలుమూలల నుండి కేవలం దర్శించినంత మాత్రముననే పునీతులమౌదుమని అరవిందమాతను దర్శించుటకు ఎంతో మంది విచ్చేసిరి, అని మాతను గూర్చి వ్రాసిరి.

ఇక వీరు దర్శించిన ఆశ్రమము,

**"శ్రమయనుమాటలేదు, బహు శాంతము జీవితమిచ్చట నే బరి**
**శ్రమయనుమాట లేదు, సుకరమ్ము స్వజీవితముల్ తరింప యో**
**గ్యమగు తపోవనమ్మొ, మరియాదలనేర్పెడి పాఠశాల, ర**
**మ్యమగు కళానిధానమొ, మహర్షి రచించిన యాశ్రమంబయా"[2]**

శ్రమ తెలియదు. బహు ప్రశాంతముగానుండును. జీవితమును తరింప చేసికొనుటకు తగిన తపోవనము మర్యాదలను నేర్పెడి పాఠశాల అని చెప్పుటలో వీరి గురు భావము వ్యక్తమగుచున్నది.

లోకములో అత్యంత దివ్య జ్ఞానఖనులు శ్రీతిరువణ్ణామలై నివాసులు శ్రీ రమణులు. శ్రీ శర్మ గారికి వీరును గురువులే నిత్యము వీరిని స్మరించి ప్రార్థించకుండా ఏమియు చేసెడి వారు కాదు.

**"అరుణాచల రమణులు స**
**త్కరుణా మృత దివ్యమూర్తి, జ్ఞానుల్, భవ సం**
**సరణోత్తరణుల్, సద్గురు**
**చరణాబ్జములను భక్తి సంస్మరియింతున్"[3]**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3 పద్యాలు

అరుణాచల రమణులు కరుణామృత హృదయులు - దివ్యమూర్తి గలవారు, జ్ఞాన సంపన్నులు. తలచినంత మాత్రముననే కష్టముల గట్టెక్కించగల మహానుభావులు. అట్టి వీరి పాదాబ్జములను భక్తితోస్మరిస్తాను.

**"పిలిచిన పలుకునటే! లో**
**దలచిన సంసరణ వార్ధిదాటించునటే!**
**నిలుకడవలయునట కృపా**
**నిలయుడు రమణుండు దర్శనీయుఁడటె! సదా!"[1]**

పిలిచినచో పలుకునట. లోపల మనస్సులో తలచుకుంటే చాలు కష్టముల వారినుండి దాటించునట. కృపా సముద్రుడట. అటువంటి రమణులు ఎల్లప్పుడు దర్శనీయులు అని వర్ణించుటలో వీరి గురుభక్తి వెల్లడియగుచున్నది. వీరికి ఈ గురు భక్తి జీవితాంతము తోడుగా నిలచినది. జీవిత చరమాంకములో రమణులు కనబడుతున్నారని మాకు చెప్పేవారు.

పరమ హంస పరివ్రాజకాచార్య శ్రీ జగద్గురు శ్రీ శంకరాచార్య స్వామి వీరి మానసికోల్లాస గురువులు అని చెప్పవచ్చును. వీరు వ్రాసిన సౌందర్యలహరి, శివానందలహరి వంటి స్తోత్రములను శరీరములో జీర్ణింపజేసికొనినారు. దానికి క్రింద పద్యములే ప్రత్యక్ష సాక్ష్యము:

**"కారుణ్యామృత పూర్ణున్**
**ధీరున్, ఘన పూజ్యపాద తీర్థున్, స్వమతో**
**ద్ధారున్, భక్తిన్, దలతున్**
**సారెకు, శంకర యతీంద్ర సద్గురుమూర్తిన్"[2]**

శ్రీ శంకరులు కారుణ్యామృత పూర్ణులు, ధీరులు స్వమతోద్ధారులు. అట్టి సద్గురువుల శ్రీమద్భారత భూమిపై కేరళములో చెన్నొంది, శ్రీ కాలడీ గ్రామమందు జనించి, దుర్మతములను ఖండించి, వేదస్మృతి ప్రమాణంబైన ధర్మబద్ధమైన అద్వైతమును స్థాపించిన సద్గురువులు. వీరి సూక్ష్మ మేధా సంపత్తికి వీరే సాటియట. సాక్షాత్ జగదేక శంకరుడవయ్యా! శంకరా! మద్గురూ! అంటారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

సీ॥ "సౌందర్యలహరి, లోస్నానమాడించునిన్
శాక్తేయుడవటంచు ( జాటనగునా!
వర 'శివానంద లహరి' నోలలాడింప
శివ భక్తుడనుచు, వచింపనగునొ!
కేలూతయొసఁగి రక్షింప శ్రీనరహరి
స్తవము వినంగ, వైష్ణవు ఁడవననో।
తనివిదీరని 'ప్రబోధ సుధాకరము' ద్రావ
కృష్ణ భక్తుఁడని, కీర్తింప నగునొ !
'కనకధారాస్తవంబున ముంచియెత్త,ల
క్ష్మీ కటాక్షముగల, శివుడవననొ।
'బ్రహ్మసూత్రముల సారము పిండి, సచ్చిత్సు
ఖానందముఁదేల్చు జ్ఞాని వననొ!
"ఉపనిషన్మార్గమే, యోగ్య పథంబని
జాగ్రత్తనడపు, దర్శకుండవననొ!
'గీతామృతమ్ము' ద్రాగించి, మోహమార్చి
పాలించు, విశ్వరూపకుడవననొ!"

గీ॥ "ఏదినీమతమనుదు, నీయిష్టదైవ
మేమనందును, నీతత్త్వమేమనందు
సర్వమతముల సామరస్యము గలట్టి
ఘనతరాౖద్వైతమతము స్థాపనచేయు
శంకరాచార్య సద్గురు స్వామివీవ"[1]

ఇట్టి మహానుభావులైన గురువులనాశ్రయించి జన్మతరింపజేసికొనిరి. అందువలననే శ్రీ శర్మగారు మామూలు మనిషి కాదు. ఒక జ్ఞాన తపశ్శక్తి సంపన్నులైన ఋషిపుంగవులు.

1962వ సం॥లో అక్టోబర్ 8వ తేదీన వీరి సన్మాన సందర్భములో వీరి కత్యంత మిత్రులైన శ్రీ వెంపటి పురుషోత్తంగారు,

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

"Bhagavatula and Siva Sundars were thy Gurus great,
Each in his particular style quite first rate.
They on thee have their fruitful blessings con ferrred,
Blest art thou to retain their spiritual powers transfered.
How granti fied in Heaven they feel to day.
To see their spiritual heir honoured thus in his hey - day!
They from heaven their blessings now shower in unison,
It makes us happy they help to deepen thy vision[1] 65 to 70 lines

పూజ్యులు, విజ్ఞులగు శ్రీ భాగవతుల అన్నపూర్ణయ్యగారు, శ్రీ జొన్నలగడ్డ శివసుందరరావుగారు నీ గురువులు. వారి వారి పరిధులలో నడిచే ఉత్తమశ్రేణికి చెందిన గురుద్వయము నీపై వారి పరిపూర్ణానుగ్రహము స్థిరమై ఫలించినది. నీకు సంక్రమింపజేసిన దైవికశక్తులను సదా కాపాడుకొందువుగాత! నేడీ శుభ సమయాన దైవికశక్తి నందిన తమ అనుయాయి యీ ప్రకారము సన్మానింపబడుటకు, వారు స్వర్గలోకము నుండి నీపై తమ ఆశీ:పరంపరల వర్షించుచున్నారు. అది మా కెల్లరకానందము. అవి నీ అంతర్దృష్టిని అభివృద్ధినొందించుగాక అని వ్రాసిరి. సద్గురువులను ఆశ్రయిస్తే ఏ స్థాయికి చేరుకోవచ్చునో వీరిని పరిశీలించిన అర్థమగును.

## 1.8 గురుసాధకులు: -

శ్రీ శర్మ గారు మంచి కర్మయోగ సాధకులు. ప్రాతఃకాలమున 5గం॥లకే దంతధావనమొనర్చి వాలు కుర్చీలో కూర్చుండి భగవంతుని ధ్యానించి గురువుల ప్రతిరూపములను దర్శించి స్తోత్ర పఠనములతో నమస్కారము చేసికొని, తరువాత కాఫీ త్రాగెడివారు. స్టీలు పాత్రను ఉపయోగించెడివారు కాదు. ఈ లోపల దినపత్రిక వస్తే చదివి స్నానం చేసేవారు. పిమ్మట పట్టు బట్ట కట్టుకొని సంధ్యావందనము, పితృదేవతలకు తర్పణములు వదులుట చేసేవారు. ఆయన జీవిత కాలములో ఒక్కరోజు కూడా సంధ్యవార్చుట మాని ఎరుగరు. దీనికొక దృష్టాంతము - వారి అవసానకాల దశకు ముందు బందరు గవర్నమెంటు హాస్పిటల్‌ల్లో అనారోగ్యముతోనున్న సమయమున - ఇరవై ఐదు రోజులు - అపస్మారక దశలో నుండిరి (అని మేము భ్రమసితిమి) కాని అట్టి సమయమున కూడా మా అమ్మగారిని సంజ్ఞచేసి చేతి మీద నీరుపోయించుకొని "అర్ఘ్య ప్రదానము" చేసినారు. ఇదియే గదా కర్మనిష్ఠయనిన. ఇట్టి అపస్మారక స్థితిలో - మధ్య మధ్యలో పైకి చేతులెత్తి నమస్కరించినటుల "ఒరే! అని సంబోధించెడివారు. మా నాన్నగారు

1. Sri Vempati purushottam "Raghava - Beloved of Gopal on the occasion of Sanmanam to him on 8-10-1962

గాని, మా తమ్ములు గాని ఏమిటి తాతగారు! పిల్చారా! అనగా "మిమ్ములను కాదురా! వానిని అని చేయి పైకి ఎత్తి చూపించెడివారు. ఇదియే కదా! మహర్షులు ఒనర్చు జీవైక్య సంధానమనుటకు ఉదాహరణము. వారు అట్టి మహా పురుషులు మహర్షులున్ను "నగాయత్ర్యాః పరం మంత్రం నమాతు: పరదైవతమ్" గాయత్రిని మించిన మంత్రంగాని, తల్లిని మించిన దైవం గాని లేదు అని చెప్పేవారు.

పదకొండు పన్నెండు గంటలకు భోజనము అయిన తరువాత రెండు గంటలు విశ్రాంతి తీసికొనేవారు. పోస్టు రాగానే ఆ ఉత్తరములకు ఆరోజే సమాధానం వ్రాసి పంపేవారు. ఆయనకు తెలుగన్న, తెలుగు నేర్చినవారన్న అభిమానం. అమితమైన వాత్సల్యము నా మీద ప్రసరించటానికి కూడ ఇదే కారణము. వచ్చిన ఉత్తరములు అన్నియు నాకు చూపించెడివారు. తాను వ్రాసిన జవాబులు కూడా నాకు (గురుజాడ రాజరాజేశ్వరి) చూపించకుండా పోస్టుకి పంపేవారు కాదు. ఆరోజుల్లో ఇన్‌లాండ్ కవర్లు లేవు. కార్డు లేక కవరు తనకు వచ్చిన కవరునే చింపి వెనుకవైపు సమాధానం చిత్తు వ్రాసి - సాపు వ్రాసి వెంటనే పోస్టులో వేయించేవారు. ఇది పట్టాభి గారి దగ్గర నేర్చిన పొదుపు ప్రక్రియ. మధ్యాహ్నము 3గం॥ల నుండి జ్యోతిషముపై దృష్టి సారించెడివారు. రోజూ వారి ఖర్చు రోజూ డైరీలో వ్రాసికొనుట వారి నిత్యకృత్యము. స్నానానంతరము వారి బట్టలను వారే ఉతికి ఆరవేసికొనేవారు. ఆహార విషయములో కూడా ఎన్నో నియమాలు పాటించేవారు. వయస్సుకు తగినట్లుగా తీసికొనేవారు. కాఫీ త్రాగక పూర్వమే ఉదయముననే తేనె నిమ్మకాయ రసముతో కలిపిన మాదీఫలరసాయనము సేవించెడివారు. ఇదే జీవన పద్ధతి చివర వరకు కొనసాగించారు.

## 1.9 శ్రీ కృష్ణోపాసకులు: -

శ్రీ గురుజాడ రాఘవ శర్మ శ్రీ కృష్ణోపాసకులు. శ్రీ కృష్ణుని పేరు తలంచినంత మాత్రముననే వీరి హృదయము భక్త్యావేశపూరితమగును. తన ప్రతి కదలిక మాట్లాడినా, ఏ పనైనా చేసినా, ఏ దేవతలనైనా దర్శించినా ప్రతి క్షణం - ప్రతి పనీ పరమాత్మయైన ఆ శ్రీకృష్ణుని అనుగ్రహము లేనిదే జరుగదు. ఆయనే తన వెంట ఉండి తనను ప్రేరేపించి నడిపిస్తున్నవాడు అని శ్రీ కృష్ణుని యందు పూర్తి విశ్వాసము, అచంచలమైన భక్తి గలవారు. కనుకనే ఆ పరమాత్ముని దర్శన భాగ్యము నందగలిగినవారు అని మనకు వారి రచనల ద్వారా సుస్పష్టమగును. వీరి భావములో శివుడు వేరు విష్ణువు వేరు కాదు. ఇరువురు నొకరే. వీరిరువురి కంటే మూలమైన శక్తి ఏదైతే ఉందో ఆవిడే తన కావ్య కవితా కన్యను ఆమెయే పలికిస్తున్నది అని తమ విశ్వాసమును ప్రకటించిరి. కల్పలత కావ్య ఖండము ప్రారంభములో

"అమ్మా! శారదా! తొలి జ
న్మమ్మున, నీ పాద రజము, మామక ఘన శీ
ర్షమ్మున దాకఁ గ జిహ్వా
గ్రమ్మున సమృతాక్షరములు కదలెఁ గదమ్మా"[1] వినతి 1వ పద్యము

వీరే ఒక వ్రాత పుస్తకములో ఒక చోట

"నీదయ, నాపైనిక , రా
నీ, దయ, నీదగనుజేయవే, భవజలధిన్
కాదయ యేదీ, మదిఁ గన
రాదయ, నీవాదు కొనక ప్రతికార్యమ్మున్".[2]

నీదయ నాపై కలుగనీ, ఈ సంసార సముద్రమును నీదయతో దాటునట్లు చెయ్యి. మనస్సులో ఎంత ఆలోచించి చూసిన ప్రతి కార్యము నీవు ఆదుకొని చేయకపోతే నీదయ వలననే గాకపోతే వేరొండు లేదు అని స్పష్టపరుచుకొని,

"భవదవ్యాజకృపన్, వచింపదరబ్బా! మాతృగర్భాంతరో
ద్భవ కాలమ్మున, తల్లితో, శిశువు, గాపాడంగ విచ్చేయుటో!
కవితల్ గూర్చుటో! శైశవమ్ము దొరలంగా, నీడు జోడౌసురూ
పవతన్ బాణిగ్రహింపఁ జేయుటో! సుహృత్ భాగ్యమ్ముల్ కూర్చుటో! "[3]

అంతులేని నీదయను గూర్చి చెప్పుట నాతరముగాదు. మాతృ గర్భము నుండి వెలువడు కాలమున తల్లిని, పిల్లవానిని కాపాడినావా! కవితలు గూర్చుటగాని, శైశవ స్థితి జరిగిపోయి యౌవ్వనంలో ఈడు, జోడైన అందమైన స్త్రీతో పాణి గ్రహింపగల్గుటయా! తరువాత భోగ భాగ్యములు కల్గుటా!

"అలఘు ప్రాభవ కీర్తినింప, పటు ధైర్య స్థైర్యశక్తిన్ సభా
స్థలినెందేని, మధు ప్రసాద కవితా ధారన్ బ్రసంగింప, ని
శ్చల బుద్ధిన్ దయజేసి పల్కెదవు, నాసాహిత్యపున్ లోతు పా
తులు, తెల్లంబక! పల్కునీ వగుచుచిందుల్ ద్రొక్కుచున్ సాగెదా!"[4]

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట 3
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 2, 3, 4 పద్యాలు

కీర్తి ప్రతిష్ఠలు సంపాదించిన తరువాత ధైర్య స్థైర్యములు కలిగి, మధురమైన కవితాధారతో సభలలో ప్రసంగించుట, నాసాహిత్యపు లోతు పాతు నీకే తేటతెల్లము. నిశ్చల బుద్ధితో నీవే పల్కెదవు. నీవే పల్కుతున్నావని చిందులు ద్రొక్కుతు సాగెదవు అని వ్రాసిరి.

ఏ సభా ప్రారంభములోనైనా వీరి ఇష్టదైవమైన శ్రీకృష్ణుని, శారదామాతను, తమ గురుదేవులను స్మరించకుండా ప్రార్థించకుండా తమ ఉపన్యాసము కొనసాగించెడివారుకాదు. వీరు పద్యాలతో ఉపన్యసిస్తున్నంత సేపు శ్రీ కృష్ణుడు చిందులు త్రొక్కుతున్నట్లే ఉండెడిది. హృదయమంతా భక్త్యావేశపూరితమై రాగయుక్తముగా పద్యాలనాలాపిస్తూ ఉపన్యసించెడివారు.

**"స్థిమితంబింతయు లేక, గుందు జనమెంతేపృచ్ఛసేయంగతృ**
**ప్తిమెయిన్ సంతసమొందుచున్ వెడల, జ్యోతిశ్శాస్త్ర వీధి విహా**
**రము సేయంగల ప్రజ్ఞయెంతయు, నపూర్వం, బిబలంబెన్నిజ**
**న్మములన్ జేసిన పుణ్యమో! తెలియ, కృష్ణా! దివ్య వాగ్భూషణా!"[1]**

కొంచెము కూడా స్థిమితము లేక బాధ పడుచు వచ్చి తమ బాధలు చెప్పుకొనగా జ్యోతిష శాస్త్ర ప్రకారము వారిని తృప్తి పరచి సంతోషమొంది వెడలునట్లుగా జ్యోతిషశ్శాస్త్ర వీధి విహారము సేయునీప్రజ్ఞ అపూర్వమైనది. ఇది ఎన్నో జన్మల పుణ్యఫలమునగాని చేకూరదు. ఓ కృష్ణా! నీవు దివ్యమైన వాక్కును భూషణముగా ఇచ్చిన వాడవు. ఇందంతయూ నీ అనుగ్రహమే.

వీరి జ్యోతిష శాస్త్ర ప్రజ్ఞ గురించి విపులముగా ముందు చర్చింపబడినది..

ప్రాణ గండములున్నప్పటికీ భగవంతుని అనుగ్రహముంటే ఎంతటి అపాయమునైనా దాటవచ్చు అని చెప్పిరి.

**"జననీ గర్భము నుండి వెల్వడక, కష్టంబందువేళన్ గృపన్**
**జని రక్షించితి, భారతావని, నిజ స్వాతంత్ర్యపున్ సంగర**
**మ్మున బందెన్, నిశి, మండగబ్బకు, లవమ్ము న్జిక్కనీకే, విప**
**త్తున (గాపాడితి, లాటి పోటులకు ( దోడ్తో స్థైర్యమున్ గూర్చుచున్"[2]**

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

తల్లి గర్భము నుండి వెలువడలేక కష్ట పడుతున్న సమయములో దయతో రక్షించావు. భారత దేశమునకు స్వాతంత్ర్యము తీసికొని వచ్చుటకు చేసిన యుద్ధములో అరెస్టయి జైలులో ఉన్నప్పుడు రాత్రి వేళ మండగబ్బకు కొంచెము కూడా చిక్కనీకుండా రక్షించావు. లాఠీపోటులకు రవ్వంత చెదరిపోకుండా ధైర్యస్థైర్యములు కల్పించావు. అని చెప్పుకొనిరి.

వీరి జననకాలములో తల్లి అవస్థపడుట, స్వాతంత్రోద్యమ కాలములో మండగబ్బ నుండి ప్రమాదము తప్పుట, లాఠీ పోటులకు శరీరము హూనమైపోయినా బాధలు ఎట్లా భరించేవారో సందర్భవశాత్తు మాతో చెప్పుచుండెడివారు.

**మ॥ "ప్రతిభావంతుఁడనన్న నిగ్గగును, సంప్రాప్తించునేనాడు, భా**
**రత రాష్ట్రాధిపతీసమాగమము, తద్రాజ్యాంగనేతా సము**
**న్నతులున్ సంస్థలు, లీవిమైయుచిత సన్మానమ్ముసేయన్గృత**
**జ్ఞతలందించుటలెంత! నీదగు కటాక్ష శ్రీ ప్రభావంబెకా!"** [1]

నేనేదో తెలివిగలవాడిని - గొప్ప చదువున్న వాడినన్న నిగ్గు తేలుటకు అవకాశముండును. నా బోటి, రాజ్యాంగ నేతలతో కూడిన సంస్థలతో రీవిగా పాల్గొనుట, సన్మానాలు పొందుట, వారికి నేను కృతజ్ఞతలు అందించుట ఎంత ఆశ్చర్యకరము! నిజముగా ఇది నీ కటాక్షము వలననే గదా!

వీరు ఆ రోజులలో ఎస్.ఎస్.ఎల్.సి. వరకు మాత్రమే చదివిరి. అటువంటి వారికి మనోహరమైన కవితా శక్తి అబ్బుట, సభలు, సమావేశములలో పాల్గొని తన కవితాఝురిలో నోలలాడించుట, సన్మానాలు పొందుట, అదియు రాజ్యాంగ నేతల సమక్షములో, ఇన్ని పొందినా అది భగవంతుని అనుగ్రహము వలననే సాధ్యము అంతా నీదయయే అనుట వీరికి భగవంతునిపై గల విశ్వాసమును ప్రకటించుచున్నవి.

**మ॥ "గత జన్మాంతర పుణ్యలబ్ధమదియేగా సేతు శీతాచల**
**స్థిత తీర్థంబుల, దేవతా నిలయముల్ సేవించుటల్, తన్మహో**
**న్నత దేవాళికి, తీర్చి, కూర్చిన, వినూత్నం బౌరసః పూర్ణరా**
**జిత సద్వృసుమంబు విచ్చుటలో! వాసిన్ నీ కటాక్షంబెకా!"** [2]

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

ఏదైనా దేవతను దర్శించాలన్నా, దేవాలయాలకి వెళ్ళాలన్నా ఆ దేవతల అనుగ్రహము లేనిదే జరుగదు. భగవంతుడే భక్తులను తన దగ్గరికి పిలిపించుకుంటాడు.

గత జన్మల చేసికున్న పుణ్యఫలితమే గదా! ఆసేతు శీతాచల పర్యంతమునున్న దేవతా నిలయములను దర్శింపగలుగుట, ఆయా దేవతలను రసపరిపూరితములైన పద్యసుమములతో అర్చింపగల్గుట. దీనిలోను ఆధిక్యత అంతయు నీ కటాక్షమే గదా! యనుచున్నారు. వీరు ఉత్తర భారతదేశము, దక్షిణ భారత దేశమునందు గల పవిత్ర యాత్రా స్థలములన్ని దాదాపు దర్శించి ఆయా దేవతలపై ఎన్నో పద్యాలు వ్రాసి పుష్పాలుగా అర్పించారు. అందరు పువ్వులతో అర్చిస్తే - వీరు ఆశు కవి గావున అప్పటికప్పుడు పద్యములు వ్రాసి దేవతలకర్పించుటము జరిగినది. పవిత్రయాత్రావలోకన పద్య సంపుటి (అముద్రిత గ్రంథము) అను పేరుతో గ్రంథరూపముగా భద్రపరచియుంచిరి.

శ్రీకృష్ణుని షోడశోపచారములతో ఎట్లు అర్చించిరో ఈ క్రింది పద్యము వలన తెలియగలదు.

**సీ॥ "ఆసనంబమరింపగా సమర్థత లేదు**
**హృదయపీఠమ్మె "వసింపుమయ్య"**
**గంగాజలాభిషేకము సేయనేర,**
**నానందబాష్పములపై జిందనమ్మ**
**నచ్చిన సరిపూలకెచ్చోటనేవెత**
**కుదునిత్తు నీ నామ కుసుమచయము**
**నైవేద్యమనుచు నేయే వస్తు విచ్చెద**
**నఖిల సమర్పణంబగుదుగాక!**

**గీ॥ తలపు మాత్రన, నెదుట ప్రత్యక్షమౌదు**
**వీ గృహము నీది యజమాని వీవసతము**
**నేను నీ వాడ నావాడవీవు, మనక**
**భేదమె! యితరభయమింకలేదు, కాన**
**రమ్ము! దయసేయుమా! యనుగ్రహము, కృష్ణ"![1]**

ఓ కృష్ణా! నీకు సింహాసన మమరజేయు శక్తి లేదు. నా హృదయ పీఠము నందే నివసింపుము.

1 శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

గంగ ఉదకము తెచ్చి అభిషేకము చేయలేను. నా ఆనంద భాష్పములఁజిందచేసెదను. నీకు నచ్చిన పూలు తీసికొని వచ్చి పూజచేయాలంటే ఎక్కడని వెతకి తీసికొనిరాను. నీ నామములనే కుసుమములుగా చేసి (పద్య కుసుమాలు)ఇచ్చెదను. నైవేద్యమని ఏయే వస్తువులు తీసికొనివచ్చి ఇచ్చెదను! నా సమస్తమూ నీకే అర్పణమౌతాను. తలచుకొన్నంత మాత్రమున ఎట్ట ఎదుటగా నీవు ప్రత్యక్షమౌతావు. ఈ శరీరమనెడి గృహమునీది. ఇందున్న యజమాని (జీవుడు) ఎల్లప్పుడు నీవే. నేను నీవాడను. నీవు నావాడవు. మనకు భేదమా! భేదము లేదు. ఇతర భయమేదియులేదు. కావున రమ్ము! నీయనుగ్రహము దయసేయుము. అని వ్రాసిరి.

ఈ పద్యమును పరిశీలించినచో వీరి పరమాత్మతత్త్వము గోచరించును. భగవంతుడు జ్యోతి స్వరూపుడు. ఆత్మ స్వరూపుడుగా ప్రతిజీవి యందున్నవాడు అని తెలిసినవారు గనుకనే వేరే బంగారమో, వెండి సింహసనమో అమరుస్తాను. దాని మీద ఆసీనుడవుకమ్ము అని చెప్పుట లేదు. తన హృదయమనే సింహాసనముపై కూర్చుండమని పిలుస్తున్నారు. ఇక స్వామికి అభిషేకము చేయుటకు పాలో, నీరో కావాలి. గంగా జలమో కావాలి. అవి తీసికొని వచ్చిచేయలేను అంటున్నారు. మనస్సు భక్తితో పరవశమైయున్నప్పుడు కళ్ళ వెంట ఆనంద బాష్పములు వచ్చుట సహజ స్థితి. ఆ ఆనంద బాష్పములను నీపై చిలకరిస్తానంటున్నారు. ఇక్కడ మరల శివునకు కేశవునకు అభేదము చెప్పుచున్నారు. అర్చన చేయుటకు నీకు నచ్చిన పూలనెక్కడ వెతకి తీసికొని వస్తాను. నీ నామములనెడి పద్య కుసుమములతో అర్చిస్తానంటున్నారు. దీనిని బట్టియే వీరు ఎంత ఆ'శుకవి'యో తెలియుచున్నది. అట్లా వ్రాసి పరమాత్మునకర్పించినదియే శ్రీవాసుదేవ నామశతకము. దీనిలో శ్రీ కృష్ణ అష్టోత్తర శతనామములు 108 నామములను, ఒక్కొక్క నామాన్ని ఒక్కొక్క పద్యములో ఇమిడ్చి మనోహర పద్య కుసుమములుగా అర్పించిరి. నీకు నైవేద్యమని ఈ వస్తువు ఆ వస్తువు అని తీసికొని వచ్చి ఇచ్చుట ఎందులకు? నా సమస్తము నీకే అర్పిస్తాననుటలో సర్వ సమర్పణ భావము వ్యక్తమగుచున్నది.

ఈ శరీరమునీది. నా యందున్న ఆత్మ స్వరూపుడవు నీవే. నేను నీ వాడను. నీవు నావాడవు, మనకు భేదము లేదు అని ఖచ్చితముగా చెప్పుచున్నారు. ఇక్కడ ఆత్మ వేరు, పరమాత్మ వేరు గాదు. రెండు ఒక్కటే అనే అద్వైత భావము స్పష్టమగుచున్నది.

శ్రీ శర్మ గారు శ్రీ కృష్ణుని తన హృదయ పీఠముపై నిల్పి 'శ్యామమురారి' అను శీర్షికతో నాలుగుఅద్భుత

పద్యములను వ్రాసిరి. శ్రీ కృష్ణుడు సహజముగా నల్లని రంగు కలవాడు. దేవకీ వసుదేవులకు కారాగారము నందు జన్మించినవాడు. అందులోను అర్ధరాత్రి సమయంలో. ఈ అర్ధరాత్రి సమయములో! జన్మించినవారు జారులో, చోరులో అవుతారంటారు. ఈయన గోపికా హృదయ విహారుడు - నవనీత చోరుడును కదా! నెమలి పింఛధారి - యమునా విహారి కాళీయ ముఖము నుండి వెలువడిన హాలాహలమును కంఠమునందు ధరించినవాడు - చనువుతో పూతన చనుబాలను ద్రాగినవాడు. కార్చిచ్చు మ్రింగిఁభక్త వ్రాతమును గ్రాచినవాడు - భక్తకిల్బిషహరుడు - ఇన్ని కారణముల చేత నల్లని వాడైనాడట - ఎంత మనోహరము ఆ పద్యాలివి.

## శ్యామమురారి

1. సీ॥ "భక్త కిల్బిషహరవాక్య ప్రసిద్ధతన్
నల్లనివాడవైనావె! కృష్ణ!
జారచోరాది నిశాచరుఁడౌటను
నల్లనివాడవైనావె! కృష్ణ!
పసితనాననెండ ( బశుల కాపరియౌట
నల్లని వాడవైనావె కృష్ణ!
సజ్జన హృదయాబ్జ! షట్పదమౌటను
నల్లని వాడవైనావె కృష్ణ!

గీ॥ కమలనయన! శుద్ధ స్ఫటిక ప్రకాశ
భాసమాన స్వరూప! యో! వాసుదేవ!
నీ సమానమెవరు రా! కృపా సముద్ర!
దోసి లొగ్గితి నీ దాసదాసజనుడ!"[1]

సీ॥ "భూ భారముహరింపఁ బుట్టుట చేతను
నల్లనివాడవైనావె। కృష్ణ।
అర్ధరాత్రి వేళ యావిర్భవించుటన్
నల్లని వాడవైనావె! కృష్ణ!
కృష్ణపక్షమున జనించిన కతమున
నల్లని వాడవైనావె! కృష్ణ!
అంతు జిక్క కనంత మౌరూపు కల్గుటన్
నల్లని వాఁడవైనావె! కృష్ణ!

1 శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

సీ॥ దేవకీ దేవి కాంచిన దివ్య మూర్తి

నందునింటఁ జెలంగు నానందమూర్తి

భక్తులకు కొంగు పసిఁడి గోపాలమూర్తి

కేలుమోడ్చెద, నల్లని కృష్ణమూర్తి"॥[1]

సీ॥ "ఘన తమోపహర భాస్కర మూర్తి యౌటను

నల్లని వాడవైనావె ! కృష్ణ!

అర్ధాంగి భూసతియై వెలుగొందుటన్

నల్లని వాఁడవైనావె ! కృష్ణ!

నెమలి పింఛమ్ము శీర్షమ్మున శోభిల్లుటన్

నల్లని వాడవైనావె ! కృష్ణ!

యమునా నదీ తీర మందున విహరింప

నల్లని వాడవైనావె ! కృష్ణ!

గీ॥ చూడ ఁజూడగ నీరూపెచూడ ఁగోరు

పాడఁ బాడ ఁగఁ నీ కీర్తి పాడ ఁగోరు

వినఁగ వినఁగనీచరితమె వినఁగ గోరు

దయ నొసంగుమ ఁఇవె ప్రసాదమ్ము! కృష్ణ!"[2]

సీ॥ "కాళీయ ముఖ విష జ్వాలసోకినయంత

నల్లని వాడవైనావె! కృష్ణ!

కారాగృహము జన్మ కారణమగుటచే

నల్లని వాడవైనావె! కృష్ణ!

చనవుమై పూతను చనుబాలు జుఱ్ఱుటన్

నల్లని వాడవైనావె! కృష్ణ!

కార్చిచ్చు మ్రింగి, భక్త వ్రాతమున్ గాయ

నల్లని వాడవైనావె! కృష్ణ!

గీ॥ తల్లి ఁ దండ్రివి గురుఁడవు, దైవమయ్య

మురళి మ్రోగించు చక్కని ముద్దులయ్య

సాధు జనులను రక్షించు చల్లనయ్య

నన్ను గనుమయ్య। మాయయ్య ! నల్లనయ్య "![3]

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3 పద్యాలు

ఈ పద్యములను పరిశీలించినచో వీరు తమ తల్లి దండ్రి, గురువు దైవము అన్ని ఆ శ్రీకృష్ణ పరమాత్మయే అని నమ్మిన వారని స్పష్టమగుచున్నది. సాధు జనులను రక్షించు వాడని, భక్తితో నన్ను చూడవయ్యా. మా తండ్రీ ! ఓ నల్లనయ్యా! అని అనుచున్నారు. చూడగా చూడగా ఈ కృష్ణయ్యా రూపమే చూడాలని పిస్తున్నదట. వినగా వినగా ఆయన చరితలే వినాలనిపిస్తున్నదట. పాడగా పాడగా ఆయననే కీర్తించాలనిపిస్తోందట. భక్తులకు కొంగు పసిండి యట. ఆ నల్లని కృష్ణయ్యా ఎంత మందిని రక్షించాడో కీర్తిస్తున్నారు.

**సీ॥ "గురుపుత్రు బ్రతికించు కో గల్గితీవన్న**
**గురుఁడవీవే, పుత్రకుఁ డవు నీవే**
**పార్థసార్థమ్ము, బట్టితి వీవన్న**
**భేదమావంతయు లేదు మీకుఁ**
**అలకుచేలుని, సపర్యలనేలి తీవన్న**
**బాల్యమిత్రుఁడు నిజప్రాణ సముఁడు**
**ద్రౌపది నాపదన్ రక్షించి తీవన్న**
**బందులే తోడు ; యిబ్బంది యందు**
**గీ॥ వారి వీరి నేలుటలు, సకారణములె**
**కాని, నా బోంట్ల నేలుటే ఘనము మీకు**
**దళిత భవతృష్ణ! భక్త సంత్రాణ సుగుణ!**
**పరమకరుణా నిధాన! గోపాలకృష్ణ!" [1]**

అను పద్యములో గురు పుత్రుని బ్రతికించుకోగల్గితిని అని అనుకొన్నచో గురుడవు నీవే. పుత్రుడవు నీవే. పార్ధునకు రధసారథ్యము వహించితివి అంటే మీ ఇద్దరికి భేదము లేదు. కుచేలుని సపర్యల సంతృప్తి బరచితివన్న బాల్య స్నేహితుడు ప్రాణముతో సమానము ద్రౌపదిని ఆపదలో రక్షించావంటే - ఆపత్సమయములో బంధువులే తోడుగా ఉంటారు. వారినేలుటకు కారణమున్నది. నా బోటి వాడిని ఏలుట గొప్ప.

**"దళిత భవతృష్ణ! భక్త సంత్రాణ సుగుణ**
**పరమ కరుణా నిధాన! గోపాల కృష్ణ!" [2]**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1,2 పద్యాలు

అనుమకుటముతో నాలుగు పద్యములలో ఆ శ్రీకృష్ణుని కీర్తించిరి. కాసుల పురుషోత్తమ కవి రచించిన ఆంధ్ర నాయక శతకపు పోకడలు కన్పట్టుచున్నవి.

సీ॥ "భువనమోహన! కృష్ణమూర్తివి నీవేని
బలసముజ్జ్వల కావు పాలు (డ వీవేని
దీవించి యా బల్మి (జూపవలదె ?
వీర నృసింహావతారు (డ వీవేని।
దత్తేజ మింతైన (దాల్పవలదె?

గీ॥ యెంచ దేవర దైవమో యీ వెకాని
చూపఅకు నీదు మహిమను జూపవలదె?
చిత్ర చిత్ర ప్రభావ! దాక్షిణ్య భావ!
హత విమత జీవ! శ్రీకాకుళాంధ్ర దేవ!"[1] ఆంధ్ర నాయక శతకము 91వ పద్యం

సీ॥ "అలగా పరివా(డ ... ...... ... ... శ్రీకాకుళాంధ్ర దేవ"![2] ఆంధ్ర నాయక శతకము 92వ పద్యం

మొదలగు పద్యముల పోకడలు కన్పట్టుచున్నవి.

భక్తి పరాకాష్ఠకు చేరినప్పుడు భగవంతుని పైకి నిందిస్తున్నట్లు కన్పడినా స్తుతిస్తున్నట్లు, పైకి స్తుతించుచున్నట్లు కన్పడినా లోపల నిందిస్తున్నట్లు స్ఫురించును. అదియే నిజమైన భక్తి. ఆ భక్తి భావములో మునిగినప్పుడే భగవంతుడు దగ్గరగును.

సీ॥ "దానవు వేడి రక్తముజుఱ్ఱ(గా నేల
కండచక్కెర పానకమ్ముగొనుమ
కనకకశిపుమేనికండ నంజ (గ నేల
కమ్మని శాక పాకమ్ము లివిగో
దండి రక్కసి ప్రేవునిండ (దాల్చ (గ నేల
మా తులసీ వన మాల లివిగో!
ఉక్కు స్థంభము వాసయోగ్యమా నీకు నీ
కనకరతనంపు పెన్గద్దె నిలుమ!

గీ॥ దుష్ట శిక్షణకై, మించి శిష్ట రక్ష
ణార్ధ మవతారమెత్తు మహానుభావ
దళిత భవతృష్ణ! భక్త సంత్రాణ సుగుణ!
పరమ కరుణా నిధాన! గోపాలకృష్ణ!"[3]

---

1. శ్రీ కాసుల పురుషోత్తమ కవి - ఆంధ్రనాయక శతకము 91, 92 పద్యాలు పుట 42
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

అను పద్యములో రాక్షసుల వేడి వేడి నెత్తురును జుఱ్ఱు దామనుకుంటావెందుకు? కండ చక్కెర పానకము తీసికో! హిరణ్య కశ్యపుని కండ నంజుకొని తిందామనుకుంటావెందుకు ? రుచియైన శాకపాకములివిగో! రాక్షసుని ప్రేగులు మెడలో ధరిస్తా వెందులకు మేము అర్పించే తులసీమాలలివిగో! ఇనుపస్తంభము నీకు నివాస యోగ్యమా నీ బంగారు సింహాసనమునధిరోహింపుము. దుష్ట శిక్షణకై అవతారమెత్తు వాడవు. అంత కంటే మించి శిష్యులను రక్షించువాడవు. అని కీర్తించిరి. దుష్టులను శిక్షిస్తావు - సరే! శిష్టులను రక్షిస్తూ

**సీ॥ "నారదమౌని వీణాగాన మాధురీ**
**పరవశతన్ నన్ను మఱతువేమొ!**
**లక్ష్మీవిమోహ విలాస చాతురి వాక్య**
**సరణిని జిక్కినన్ మఱతువేమొ!**
**ప్రణుత గంధ ర్వాప్సరస దివ్య నృత్యవై**
**ఖరులగాంచుచు నన్ను మఱతువేమొ!**
**ఆ భోగి భోగ పర్యంకంబుపైన, నే**
**మఱక, సుఖించి, నన్ మఱతు వేమొ!**
**గీ॥ వలదు! మీకు పరాకు ; దీనులనుగాచు**
**బిరుదుగలదొర! కరుణింపు! శరణు! శరణు!**
**దళితభవతృష్ణ! భక్త సంత్రాణ సుగుణ!**
**పరమ కరుణా నిధాన! గోపాలకృష్ణ!"[1]**

నారదముని వీణా గానమాధుర్యముతో పరవశమైపోయి నన్ను మరచిపోతావేమొ ! లక్ష్మీ విలాసుడవై గంధర్వాప్సర నృత్య వైఖరుల చూచుచు శేష శయనుడవై నన్ను మఱతువేమో లేదులే! నీవు దీనులను గాచు బిరుదుగల దొరవు గదా! ఓ గోపాల కృష్ణ! నన్ను కరుణించు. శరణు కోరుతున్నాను. అనుచున్నారు.

**సీ॥ "మాతృగర్భమున, మీ మహిమ, నారదులు, ప**
**ల్కవిన ప్రహ్లాదుండ గాను సుమ్ము**
**గర్భ గోళమున, చక్రధరు చే రక్షణ**
**గాంచు, పరీక్షిత్తుగాను సుమ్ము**
**పసి తనమ్మున, మీ ప్రభావమ్ము, ముని, దెల్ప**
**గాఁ గన, ధృవు ఁడనే కాను సుమ్ము**

1 శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

పుట్టి పట్టకమున్న బోధింప తత్త్వవి

జ్ఞాని యౌ (కపిలుండ) శుకుఁడనే గాను సుమ్ము

గీ॥ అవని నాగర్భ హరి భక్తులైనవారె

ధన్యులితరుల భక్తి తత్పరత యెంత

దళిత భవతృష్ణ! భక్త సంత్రాణ సుగుణ

పరమ కరుణా నిధాన! గోపాలకృష్ణ!"[1]

అను పద్యములో తాను పుట్టుక తోడనే నీ భక్తుడను కాదు. అనుచున్నారు.

మాతృ గర్భములో ఉండగానే నీ మహిమ నారదుడు చెప్పగా విన్నటు వంటి ప్రహ్లాదుడను గాను. గర్భములో నుండ గానే నీచక్రాయుధముచే రక్షింపబడిన పరీక్షిత్తును గాను. ధృవుడను అంత కంటే కాదు, తత్త్వ విజ్ఞానియైన శుకుడను కాను. ఈ భూమి మీద పుట్టుకతోనే భక్తి గలిగిన వారే ధన్యులు, ఇతరుల భక్తి తత్పరత నీకెంతలే, అనగా నా భక్తి వీరందరి ముందు ఎంతలే. నీకొక లెక్కా! అనుట. ఈ మహాత్ములంతటి భక్తి కలిగిన వాడిని కాకపోయినా నీవు భక్తులను కాపాడు వాడవు గదా! కావున రక్షింపుమనుట.

భగవంతుడు దేనికి కరుణించినా కరుణించకపోయినా శరణు కోరి పాదముల ( బట్టుకున్న వారిని కాపాడి తీరును. ఆ శరణాగత భావము భక్తునికి కలిగి పరవశత కలిగిన హృదయముతో తపించినప్పుడు ఆ పరమాత్మ ప్రత్యక్షమై తీరును. వీరు ఇంతటి భక్తి కలిగినవారు కనుకనే ఆయన స్వరూపము దర్శించగలిగిరి.

ఒక సారి జరిగిన సంఘటనను వివరించెదను. వారే ఒక పుస్తకములో ఈ విధముగా వ్రాసికొనిరి.

ఈ విధముగా నిరంతరము 'గోపాల' వాసుదేవ' కృష్ణా! అను నామోచ్ఛరణమే వీరినీ స్థితికి తీసికొని వచ్చినది. వీరి మిత్రులైన శ్రీ వెంపటి పురుషోత్తము గారి మాటలలో చెప్పవలెనన్న,

"Hai!, hai! to thee, brother dear,
Raghav, thou calln't they self, Gopal Krishen, thou worships
with every breath of thine Gopala Krishen thou repeatest on thy lips.
God Gopal be with thee!
They Lord give every Strength to thee !
To serve him full and Learn to become free
And why not? for Raghav is Gopal's true Servant,
with all the depth of devotion most consistent.[2] 81 to 88 lines

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

2. Vempati Purushotham, Raghava-Beloved of Gopal on the occasion of sanmanam to him on 8-10-1962

హాయి! హాయి! ప్రియ సోదరా! రాఘవా! నీ ఇష్ట దైవము గోపాల కృష్ణుని నామమే నీ నోటఁబల్కబడుచున్నది. నీ ఉచ్ఛ్వాస నిశ్వాసములో, నీ జిహ్వపై సదా శ్రీ గోపాల కృష్ణ నామమెడ తెగక అనవరత ముచ్చరింప బడుటెంతయదృష్టము.

గోపాల దైవము నీ కండదండయగుగాక ! నీ ప్రభువు నీకు సర్వ శక్తులను గ్రహించు గాక. వానిచే నిండా సేవింప శక్తుడవై బంధవిముక్తుడవగుటకు సాధనమగుగాక. ఎందుకు కావోయి రాఘవుడు నిశ్చల గాఢ భక్తితో నిన్ను సేవించే నిజమైన నీ పద సేవకుడు. అని 8.10.1962 సం॥లో శ్రీ శర్మ గారి సన్మాన సందర్భములో వ్రాసిరి. దీనిని బట్టియు వీరు ఎంతగా ఆ శ్రీకృష్ణుని నిత్యము స్మరించెడి వారో తెలియుచున్నది. నామస్మరణ జీవన్ముక్తిని కలిగించునది. సంసార సముద్రమును దాటించునది.

వీరు శ్రీ కృష్ణోపాసకులు. కావుననే తమ ఆవాస మందిరమునకు "బృందావనం" అని పేరు పెట్టుకొనుటయేగాక శ్రీ కృష్ణ విగ్రహమును గృహ ప్రాంగణములో ఒక మందిరమును కట్టించి ది:7.9.1985 సం॥లో స్థిరవారం ఉదయం 7.45 ని॥లకు వారి చేతుల మీదుగా దానిలో ప్రతిష్ఠ గావించిరి. వారి ఇంటికి వచ్చిన వారెల్లరకు ముంగిట అతిథి మందిరము, అభ్యంతరమన ఉపాసనా మందిరము, నిత్యాగ్ని హోత్ర జపతప సేవాకైంకర్యములతో నా పవిత్ర గృహము ఒక దేవాలయమును తలపింపజేసెడిది. శ్రీ కృష్ణాష్టమి రోజున అర్ధరాత్రి పన్నెండు గంటల సమయానికి శ్రీ కృష్ణ జనన సమయానికి కట్టెకారం నైవేద్యం పెట్టి అర్చన అయి పదునెనిమిది పిండి వంటలనివేదన అయ్యేటప్పటికి తెల్లవారి పోయేది. తెల్ల వార్లు శ్రీ కృష్ణ భజనామృతం సాగేది. వీరి బృందావనంలో ప్రతిదీ శ్రీ కృష్ణ మురళీ రవ మాధుర్యాస్వాదముతో పరిపూతమైనది. వారు మాట్లాడుతూనే " కృష్ణా - వాసుదేవ ప్రభూ" అని నిరంతరం మననం చేస్తూ ఉండేవారు. ఇదే అలవాటు వారిని ప్రథమ శ్రేణికి చెందిన కృష్ణ భక్తులను చేయుటే గాక, భ్రమర గీతికలు, కల్పలత వాసుదేవ నామశతకము, ముకుందమాల వంటి ఉత్తమోత్తమ గ్రంథ రచనకు ఆలవాలమైనది. ఇవి వారి కృష్ణ భక్తికి తార్కాణములు. ముందు పుటలలో వీటి చర్చ రాగలదు. శ్రీకృష్ణుని మీద వీరికి ఎంత విశ్వాసమంటే ఒక సారి ప్రముఖ వైద్యులు బందరు నివాసియైన శ్రీ డా॥ ధన్వంతరి ఆచార్య గారితో మాట్లాడుతూ "మీ ఇంటి పేరు బృందావనమేనయ్యా. మా నివాసం పేరు బృందావనమేనయ్యా, - బృందావనం అందరిదీ అయినా - కృష్ణుడు మాత్రం మా వాడేనయ్యా - మా ఇంట్లోనే ఉన్నాడు"[1] అని అన్నారు.

---

1. డా॥ బి. ధన్వంతరి ఆచార్య, "ప్రజ్ఞాధురీణులు - శ్రీ గురుజాడ". శ్రీ గురుజాడ రాఘవశర్మ శతజయంత్యుత్సవ సంచిక పుట 12

## 1.10 వ్యక్తిత్వము: -

"శ్రీ గురుజాడ రాఘవ శర్మ గారి పేరు వినబడితే చాలు ఆ నాటి యువత హృదయాల్లో దేశభక్తి వెల్లివిరిసేది. "యత్రాకృతి స్తత్ర గుణాభవంతి" అన్నట్లు శ్రీ శర్మ గారి మూర్తిని చూచిన వారికి ఆయన గుణ సంపద మనసుకు తోచేది. ఆయన మాటలు వింటుంటే తేనె వాకలు కట్టేది. ఆపాదమస్తకం ఖద్దరు వస్త్రధారణ ఆయన గాంభీర్యాన్ని యినుమడింపజేసింది. శర్మగారి విశాలమైన నొసట కొట్ట వచ్చినట్లు సుగంధ బంధురమైన పుండ్రం వింత సొగసుతో మెరిసిపోయేది. మనసు నిండా ఎనలేని ఆప్యాయత. ప్రథమ దర్శనంలోనే చిరకాల పరిచయమున్నట్లు అనురాగ స్నేహ పూర్ణమైన పలకరింపు. మామూలు మాటల్లో సయితం కలకండ పలుకులు, కావలసినంత ఉత్సాహం, పాంచజన్యం పూరించినట్లు కంఠనాదం, నవ్వుల వెన్నెలలు కురిపించే ముఖ మండలం, అన్నింటికీ మించినవైదికధర్మం మూర్తీభవించినట్లు కనబడే వేషభాషలు.

విభిన్న రంగాలలో లబ్ధ ప్రతిష్ఠులైనవారి లక్షణాలను పుణికి పుచ్చుకొన్న శ్రీ రాఘవ శర్మగారు అజాత శత్రువు. బోళా శంకరులు. మొగమాటం లేకుండా మాట్లాడే స్వభావము. అల్ప సంతోషి. మాట పడని ఆత్మ గౌరవంతో జీవితాన్ని సాగించారు. ఏ మాత్రం గర్వం లేకుండా గలగలా మాట్లాడే వ్యక్తి. దేశభక్తిని కేంద్రంగా చేసికొని సనాతన ధర్మానికి ఏ మాత్రం ఇబ్బంది కలగకుండా చిన్న వారితోను, పెద్ద వారితోను కలసి మెలసి పోయే స్వభావం శర్మ గారిది. ఇంత ఉద్రిక్త వ్యక్తిత్వం గల వారు కావడమేగాక తన కుటుంబ సభ్యులను కూడా సత్సంప్రదాయ మార్గంలో నడిపించి ఆదర్శ కుటుంబీకులయ్యారు అని శ్రీ కూచిభొట్ల చంద్రశేఖరశర్మగారు శతజయంత్యుత్సవ సంచికలో వీరిని గూర్చి వ్రాస్తూ వ్రాసిరి".[1]

పువ్వాడ తిక్కన సోమయాజి గారు వీరిని గూర్చి వ్రాస్తూ "బందరు పుర ప్రముఖులందరికీ శ్రీ గురుజాడ వారి సాహిత్య విహారం సుపరిచితమే. ముతక ఖద్దరు పంచె, లాల్చీ ధరించి పేటంచు ఉత్తరీయం బుజాన వేసికొని నుదుట విబూది రేఖలతోను నొసట కుంకుమ తోను సాక్షాత్కరిస్తే ఆయనలో దేశీయత ప్రస్ఫుటంగా గోచరించేది. ఆయన అల్ప సంతోషి. బోళా శంకరుడు. వారి మాటల్లో ప్రేమ ఆదరణ, ఆప్యాయత, నిష్కపటత్వం వెల్లివిరిసేవి అని వ్రాసిరి".[2]

కీ॥శే॥ నాదెళ్ల పురుషోత్తమ శాస్త్రి గారు వీరిని గూర్చి వ్రాస్తూ "శ్రీ శర్మ గారు మాటల చమత్కారి. ప్రతి పదానికి నానార్థ భూయిష్టముగా, అక్షరాక్షర విశ్లేషణతో శ్లేషార్థంలో వివరించడం వారి నైజం.

1. శ్రీ కూచిభొట్ల చంద్రశేఖరశర్మ, మహెూదాత్తవ్యక్తి - కవిశేఖర శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ గురుజాడ శతజయంత్యుత్సవ సంచిక
2. శ్రీ పువ్వాడ తిక్కన సోమయాజి, 'గురుజాడ వారిని గుఱించి" శ్రీ గురుజాడ శతజయంత్యుత్సవ సంచిక పుట 30.

ఒక సభలో నన్ను గూర్చి ప్రస్తావిస్తూ, 'నాదెళ్ళ' అంటే 'నాదెల్ల' అనుకునే మనస్తత్వము కావడాన తాను నిర్వహించే ప్రతి కార్యక్రమం తనదైన శైలిలో నడుపగల సమర్థుడు" అన్నారు. శర్మ గారు ఈర్ష్యా ద్వేషాలు లేని వ్యక్తి. 1975 సం॥లో ప్రభుత్వం వారు తొలిగా ప్రపంచ తెలుగు మహా సభలు హైదరాబాదులో నిర్వహించినప్పుడు అందులో ఒకనిగా నాకు లేఖ వస్తే వెంటనే శ్రీ శర్మ గారికి ఫోను చేసి నా ఆనందం వ్యక్తం చేయగా వారు ఎంతో సంబరపడిపోయి నన్ను అభినందించారు. అంతేగాని వారికి రాలేదన్న భావన వారి వాచకంలో ద్యోతకంకాలేదు" అని వ్రాసిరి.[1]

బందరులో బృందావనపుర పౌర సన్మానము జరుపు సందర్భమున, ఆనాటి ఉత్సవ కమిటి సెక్రటరీ అయిన శ్రీ ఆవటపల్లి హనుమంతరావు గారు,

**"తన జ్యోతిష్యఫలంబులెల్లపుడు సత్యస్ఫూర్తి కల్గించుటన్**
**తన కావ్య ప్రతిభావిశేషములు చిత్త స్పందముల్ గొల్పుటన్**
**తన గంభీర మధుస్వనంబు లమృత స్థాయిన్ ప్రసాదించుటన్**
**జనులెల్లన్ గడు మెచ్చుకొందురు నమస్కారంబులన్ రాఘవున్"[2]**

తన జ్యోతిషఫలము ఎప్పుడు సత్యమే వచించుట వలన, తన కావ్య ప్రతిభావిశేషములు మనస్సును స్పందింప జేయునవి అగుట వలన, తన మధురమైన కంఠధ్వని అమృతమును కురిపించుట వలన శ్రీ రాఘవ శర్మను జనులెల్లప్పుడు మెచ్చుకొందురు అని,

**"పైకి కడునిరాడంబరు పగిదిదోచు**
**పెదవి గదపిన వీనుల విందొనర్చు**
**తన వచోడంబరము వియత్తలమునంటు**
**నివురు గప్పిన నిప్పు రాఘవ మనీషి"[3]**

వీరు పైకి చాలా నిరాడంబరముగా కనబడతారు. పెదవి విప్పినచో తన వచో విన్యాసముతో వీనుల విందొనర్చుచు వియత్తలము నంటును - రాఘవ పండితుడు నివురు గప్పిన నిప్పు అని వీరి వ్యక్తిత్వ వచో విలాసములను కొనియాడిరి. మా పెదనాన్నగారు శ్రీ శర్మగారి వ్యక్తిత్వమునిట్లు కీర్తించిరి.

1. నాదెళ్ళ పురుషోత్తమ శాస్త్రి, ఓ తెలుగు వెలుగు గురజాడ శ్రీ గురుజాడ రాఘవశర్మ శతజయంత్యుత్సవ సంచిక పుట 54
2. శ్రీ ఆవటపల్లి హనుమంతరావు - పౌర సన్మానం సందర్భములో వ్రాసిన 3వ పద్యము.
3. శ్రీ ఆవటపల్లి హనుమంతరావు - పౌర సన్మానం సందర్భములో వ్రాసిన 6వ పద్యము.

**"మనసది వెన్న, మాటలొక, మారవి, కర్కశ సదృశంబులై**
**వినుటకు బాధకల్గు, మరివేడిమి తగ్గి సమీక్ష చేయగా**
**అనువగు మార్గమేర్పడును, ఆయన వాక్కులు అమృతంబులై**
**మనలను చేర్చు దగ్గరకు, మాన్యుడు "రాఘశశర్మ" గారిలన్"[1]**

వారి మనస్సు వెన్న. మాటలు ఒక్కొక్కసారి కర్కశముగా ఉండి వినుటకు బాధ కలిగించినా ఆ వేడి తగ్గిన తరువాత సమీక్ష చేసినచో అనువైన మార్గమేర్పడి ఆయన వాక్కులు అమృతము వలె ఉండి మనలను దగ్గరకు చేర్చును.

## 1.11 నిత్యకర్మిష్ఠి: -

"శ్రీ శర్మ గారు ఉపనయనాది సంస్కారములందిన దగ్గర నుండీ సంధ్యావందనము, గాయత్ర్యాది మంత్రానుష్ఠానములను నిత్యము ఆచరించేవారు. తెనాలి వాస్తవ్యులు, హనుమదుపాసకులునైన శ్రీ భాగవతుల అన్నపూర్ణ శాస్త్రులు గారి వద్ద ఉపాసనా క్రమముల నెఱిగి శ్రీ కృష్ణోపాసకులైనారు. శ్రీ శాస్త్రి గారు ప్రతి సంవత్సరము హనుమజ్జయంతికి మూడు రోజులు జరిగే కల్యాణోత్సవాలకు శ్రీ కుప్పా లక్ష్మావధానులు గారు వైదిక కార్యక్రమములను, మా నాయన గారు ఉత్సవ నిర్వహణ, కళ్యాణోత్సవ కార్యక్రమములను నిర్వహించెడివారు. వీరిరువురు శ్రీ శాస్త్రి గారికి ఉభయపార్శ్వములు. సుమారు ఇరువది ఎనిమిది సంవత్సరములు సాగిన ఈ గురుశుశ్రూష, హనుమత్సేవయే వారి హృదయము స్పందించి 'సువర్చలాంజనేయమ్' కావ్య ఖండికగా రూపుదిద్దుకొన్నది"[1]. అని వీరి కుమారులైన గురుజాడ చిరంజీవి గారు "మా నాయన గారు" అను వ్యాసములో వ్రాసియున్నారు. గురువులైన జొన్నలగడ్డ శివ సుందర రావు గారి దగ్గర, బహుమంత్ర శాస్త్రవేత్త, పంచాంగ కర్త అయిన తూర్పుగోదావరి జిల్లా వాస్తవ్యులు శ్రీ మాన్ సుదర్శనం నారాయణాచార్యులు గారి దగ్గర మంత్ర శాస్త్ర రహస్యాలను గ్రహించారు. అంతే గాదు వాటిని జీవితాంతము ఉపాసన చేశారు. నిత్య కర్మానుష్ఠానములో ఎంతో కఠోర నియమాలను పాటించెడి వారు. ఏదైనా పని మీద గ్రామాంతరము వెళ్ళినా, మా బంధువుల ఇండ్లకు వెళ్ళినా మడిగా పట్టుబట్ట కట్టుకొని సంధ్య వార్చుకొని భోజనము చేయవలసినదే. ఇది జీవితాంతము నిష్ఠగా సాగించుకున్నారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ శతజయంత్యుత్సవ సంచిక పుట 98

## 1.12 సంగీతజ్ఞులు: -

శ్రీ శర్మ గారికి సంగీతముతో కూడా పరిచయమున్నట్లుగా కనిపించును. వీరి జాతీయ గీతముల సంకలనమును పరిశీలించినచో కొన్ని గేయముల క్రింద రాగముల ప్రస్తావనగలదు. దీనిని బట్టి వీరికి సంగీత పరిజ్ఞానము కలదని తెలియుచున్నది. వీరు మాటల సందర్భములో ఇరవై ఐదు, ముప్పై రాగాల పేర్లు చెబుతూ ఉండేవారు. వాటిల్లో తన కీర్తనలను, గేయాలను పాడి వినిపించేవారు.

ఉదాహరణకు వీరే వ్రాసిన ఒక కీర్తన హంసధ్వని రాగము అని "వాతాపిగణపతింభజే" వలె పాడాలి అని చెప్పేవారు.

| | | |
|---|---|---|
| పల్లవి: | "మాతా! కనకదుర్గా నమో | |
| | మాతా! కనకదుర్గా నమో | |
| | జయ ! మాతా కనక దుర్గానమో | |
| అను పల్లవి: | మాన్యసేవితా - మనో భావితా " | ॥మాతా॥ |
| చరణములు:1 | భూత కోటి సం - ప్రీత మానసా | |
| | తీతాశక్తి స - మేతా ఉ_ శ్రితనుత॥ | |
| | చేతనాచేత - నా స్వరూపిణీ | ॥మాతా॥ |
| 2. | విజయ వర్షిణీ! విఘ్నహారిణీ! | |
| | వినాయకుని జన -నీ! ప్రమోదినీ | |
| | విద్యాదాయిని - మిమల రూపిణీ | ॥మాతా॥ |
| 3. | దనుజ హారిణీ ! తమో హారిణీ | |
| | తాపత్రయవి - దారిణి - తారిణి - పోషిణి | ॥మాతా॥ |
| 4. | విశ్వ కారిణీ - విశ్వ రూపిణీ | |
| | శాశ్వతైశ్వర్య - శక్తి ధారిణీ | |
| | స్వయం ప్రకాశని - సత్య రూపిణీ | ॥మాతా॥ |
| 5. | శ్రీ శివ సుందర - దేశిక పదరా | |
| | జీవాశ్రితరా - ఘున సన్నుత, బృం | |
| | దావన త్రిపుర - సుందరీ"[1] | ॥ జయ ॥ మాతా ॥ |

1 శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

ఈ గేయము పాడగా నేను విన్నాను. దీనిలో తమ గురువులైన శ్రీ శివ సుందర రావు గారి పేరు-రాఘవ అను తన పేరు ముద్రలతో కీర్తనను రచించిన వీరికి ఖచ్చితముగా రాగాల తాళముల పరిచయముండియే ఉండును. లేనిచో ఇంత మధురమైన కీర్తన రచించుట అసాధ్యము.

బిల్హరి రాగము - జంపెతాళము

శ్రీ హరి హరానంద - శ్రీ సచ్చిదానంద

శ్రీ కరుణాసాంద్ర - శ్రీ దేశికేంద్ర

శ్రీ హరిహరానంద ॥

తీర్థా - సదానంద

**"పరమహంస పరివ్రాజక**
**పాపతిమిర సమూహభంజక**
**పావన శ్రుతిస్మృతి ప్రబోధక**
**భక్త సుమనోరంజక** ॥ శ్రీ హరిహరానంద ॥
**నిరతము స్మరియింతు నీపద**
**సరసిజ యుగళమ్ము నా యెద**
**పరమ పావనసన్ను సత్పథ**
**సరణి నడుప నమస్కరించెద** ॥ శ్రీ హరిహరానంద ॥
**బాల సంయమివర**
**ప్రణవనాద స్వర**
**లోలా శ్రీ శంకర**
**లీలా వ శంకర"**[1] ॥ శ్రీ హరిహరానంద ॥

ఈ కీర్తన బిల్హరిరాగము - జంపె తాళములో రచించిరి. కేవలము భక్తి పూరితములైన కీర్తనలే గాక దేశభక్తి ప్రబోధితములైన దేశ భక్తి గేయాలెన్నో వ్రాసిరి. కొన్నింటిని స్వాతంత్ర్యోద్యమ చరిత్ర అధ్యాయములో వివరించబడును.

అంతర్జాతీయ బాలల దినోత్సవము సందర్భముగా శ్రీ కుంభ కోణం కృష్ణమాచార్య మెమోరియల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్ద తుమ్మిడి కృష్ణాజిల్లా సభలో ది. 14.11.1979సం॥లో ఉపన్యాస

1 శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

సందర్భములో విద్యార్థులను ప్రబోధిస్తూ ఈ గేయమును వ్రాసిరి.

"విద్యార్థీ ! విద్యార్థీ

నీవేనోయ్ ! నీవేనోయ్ ! భావిభారత పౌరుడు వోయ్

విద్యార్థీ ! విద్యార్థీ ! విజయార్థీ ! విశ్వమానవ శ్రేయార్థీ !

1. సేవకావృత్తి జీవించుట - నీ జీవిత లక్ష్యము కాదోయ్

నీ విశాల మేధా సంపదలన్ - సేవ చేయుటే పరమార్థమురా

2. అందచందముల నానందింపకు - పొందగు గుణమే అందం బోయ్

అందరికిన్ తల యందలి నాలుక - నందగు అడకువ అందంబోయ్

3. వెట్టి తొట్టి కాలక్షేపముల - వివేక మింత లేనే లేదోయ్

చిట్టి బుస్సులాడకు, జాతికి - జీవ గట్టి నీవేనోయ్"॥[1] ॥విద్యార్థీ॥

ఈ గేయములో విద్యార్థి యొక్క జీవిత లక్ష్యాన్ని వివరించారు. నీతిగా చెబితే పిల్లలకు తల కెక్కదు. ప్రభోదాత్మకముగా గేయముగా పాడితే అది వారి హృదయాలకు హత్తుకుంటుంది. వ్రాయడమేకాదు పాడి ఆనందపరవశులను చేసేవారు.

గురు భక్తిని ప్రబోధించే చక్కని గేయాన్ని వ్రాశారు.

1. "ఏకలవ్యుని భక్తి - ప్రాకిన గెడ్డ, వా

ల్మీకి వ్యాసాదులు - సాకిన బిడ్డ ॥ మరచితివె దేశికా చరణాబ్జ సేవ ॥

2. కాళిదాసు మురారి - గౌతమ పాణిని

కేలూనగా - ఓనమాలు దిద్దిన బిడ్డ ॥

3. నన్నయ తిక్కన - నాచన, పోతన్న

తిన్నగా ఒరవడి - దిద్దిపెట్టినగెడ్డ"[2] ॥మరచితివె॥

దేశభక్తి ప్రపూరితమైన గేయాన్ని వ్రాసి, దేశికులు, ఉపదేశికులు - సందేశకులు కాల గర్భములో దూరి, భవిష్యత్తును ఊహించి సందేశమిస్తారు. డాక్టరు రాధాకృష్ణ గురు దేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్, స్వామి వివేకానంద మొదలగు వారు అని భావించి ఈ గేయాన్ని వ్రాస్తారు.

1. "దేశకుడ వీవు - సం - దేశకుడవీవు - సం

దిగ్ధమానసనావ - ద్రిప్పచుక్కానివి ॥దేశకుడవీవు॥

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 గేయాలు

2. క్రమ్మిన తమస్సు, పో - జిమ్మగాహృన్మంది
రమ్మున, వెల్గు - పరం జ్యోతి వినీవు ॥దేశకుడవీవు॥

3. జ్ఞానసౌధ పునాది - గట్టు శిల్పివి నీవు
మానిత విజ్ఞాన - మందిర దేవతవు
దేశకుడ వీవు - సం - దేశకుడవీవు"

ఆంధ్ర దేశమన్న ఆంధ్రుడన్నా ఎంతో గౌరవము.

ఆంధ్రుడంటే విన్నావా ! ఆంతర్యము గన్నావా ॥ఆంధ్రుడంటే ॥

1. ఆరంభ శూరత్వం - ఆధిపత్య కాంక్షిత్వం
అందుకొంత కులతత్వం - ఆపై అనైక మత్యం ॥ఆంధ్రు॥

2. పట్టరాని ప్రగల్భత్వం - పల్కులుట్టి పడుపైత్యం
బైటికెంతో శాంతత్వం - పట్టిన యాగ్రహ తత్త్వం ॥ఆంధ్రు॥

3. ఎక్కడిదో సాంగత్యం - ఇంటలేని నీచత్వం
ఎన్నడబ్బునో సమత్వం - ఇరుగు పొరుగు బంధుత్వం ॥

4. తర తరాల త్యాగ తత్త్వం - పరసహనమనస్తత్వం
సర్వభూత దయాళుత్వం - సర్వకార్య నిపుణత్వం ॥ఆంధ్రు॥

5. తెలిసెనోయి నీతత్వం - తెనుగుబిడ్డ యీ సత్యం
తెలిసి కార్యశూరత్వం - కలిసి మనుమ ప్రతి నిత్యం ॥ఆంధ్రు॥

6. "తెలిసెనోయి ఆంధ్రుడంటే! తీసివేత కనుగొంటే
దేశములో ఎవరి కంటె - తీసిపోని మనమంటే ॥తెలిసి॥

7. ఆడితప్పు వాడు కాడు - డూడూ బసవన్న గాడు
స్వార్థంబున కెడ మీడు - సమయానికి చవట కాడు"[1]

అనునది ఆంధ్రుడంటే ఎవరో తెలియచెప్పే గేయము.

"పాడరా। పాడరా ! భవ్యగీతాలు
వాడవాడలను, దూ - గాడ ఆనందాలు ॥పాడరా॥
కలము దింపకు - నీదు కవితా పసందు
గ్రహియించువాడు, రా - గలఁడు ముమ్ముందు ॥పాడరా॥
పూర్వజన్మాంతర - పుణ్యమ్ము సుమ్ము
పొంగిపొరలే కవిత - పోషించు కొమ్ము "[2] ॥పాడరా॥

అనే గేయాన్ని వ్రాసిరి.

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 గేయాలు

ఆంధ్ర రాష్ట్రావతరణ మహోత్సవ సమయమున దీ.1.11.1976 సం॥లో

**"పండుగ రమ్మోయి ! కన్నుల**

**పండుగ కనుమోయి**

**ఆంధ్ర రాష్ట్రావతరణ**

**పండుగనేడోయీ**

**తెనుగుతల్లి"[1]** **॥ పండుగ సుమ్మోయి॥**

అని ఏడుచరణములు గల గేయాన్ని మనోహరముగా వ్రాసిరి. దీనిలో తెలుగు తల్లి వైభవాన్ని వివరించిన ఈ గేయము వలన తెలుగు భాష పట్ల వీరికి గల అభిమానము వ్యక్తమగును.

వీరికి భారత దేశమన్న - భరత మాతయన్న అంత్యంత గౌరవము:- 'పంచ దశ ప్రదేశ విరాజిత - భారతమాత" అను పేరుతో పదిహేను రాష్ట్రాల ఔన్నత్యాన్ని వివరిస్తూ వ్రాసిన ఈ గేయము వారి గౌరవానికి ప్రతీక.

**పల్లవి:** **"నమో భరతమాతా! మాతా! నమో! రాష్ట్రమాతా!**

**నమః పూజ్యమాతా! మాతా! నమః పారిజాత!**

**అనుపల్లవి:** **నమోహిమాచల మేరు - నగశిఖరోన్నత ఖ్యాత! నమో! భరతమాత "![2]**

పంచదశ ప్రదేశ విరాజిత - భారతమాత (గేయము)

అను పల్లవి అనుపల్లవులతో గూడిన వివిధ రాష్ట్రాల ఔన్నత్యాన్ని చాటి చెప్పే పదిహేను రాష్ట్రాలు 1. తేనె పల్కుల - తెనుగు బిడ్డ అని ఆంధ్రప్రదేశ్‌ను 2. గున్న యేనుగు - కొండ కన్నె - అస్సామ్ అని అస్సామ్ రాష్ట్రాన్ని 3. విద్యానలందా - బీహారు మాయి అని బీహార్ రాష్ట్రాన్ని 4. మంగళ మహాలక్ష్మి - మహా రాష్ట్రం అని మహా రాష్ట్రాన్ని, 5. శిక్షణా దక్ష - శేముషీగుజరాత్ అని గుజరాత్ రాష్ట్రాన్ని, 6. ప్రకృతి సుందరీ - విలసిత కాశ్మీర్ అని కాశ్మీర్ నగరాన్ని, 7. కళా సుందరీ - కేరళ నారీ అని కేరళ రాష్ట్రాన్ని 8. భారతీ - సుమధ్యకాంచనదామం అని మధ్యప్రదేశ్ రాష్రాన్ని, 9. మేధా విరాజిత - ద్రావిడ దేశమ్ అని ద్రావిడ దేశాన్ని, 10. హాట ఖని కర్ణాట ప్రదేశమ్ అని మైసూర్ రాష్ట్రాన్ని, 11. ధాన్యలక్ష్మీ - మాన్య ఒరిస్సా అని ఒరిస్సా రాష్ట్రాన్ని 12. పౌరుష జాతీయ - పాంచాల కిశోర్ అని పంజాబ్ ప్రాంతాన్ని, 13. వీర ఝాన్సీ - విహారస్థాన్ అని రాజస్థాన్ ప్రాంతాన్ని, 14. పవిత్ర కాశీ - పాప వినాశీ అని ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాన్ని, 15. విప్లవ రంగ - విశ్రుత వంగ అని పశ్చిమ వంగ రాష్ట్రాన్ని వర్ణించారు. ఇవి నృత్య రూపకముగా అభినయించబడి ప్రదర్శించబడి పలువురు మన్ననలందుకొన్నది.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ, స్వాతంత్ర్య పథము పుట 125

"స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత ప్రతి సంవత్సరము ఆగష్టు 15వ తేదీన బందరు పార్కు నుండి ప్రభాత సేవ క్రింద వారు వ్రాసిన ఎన్నో జాతీయ గీతాలను శ్రావ్యంగా ఆలపించడం నేనెరుగుదును. సభలలో ఆశువుగా చదివే పద్యాలన్నింటినీ శ్రావ్యంగా ఎలుగెత్తి పాడేవారు.[1] అని వీరి శతజయంత్యుత్సవ సంచికలో మా నాన్నగారు వ్రాసియున్నారు.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఏ గేయాలు ఏఏ రంగాల్లో పాడేవారో తెలిసికోవడానికి, ఆలిండియా రేడియో వాళ్ళు విజయవాడ నుండి మా ఇంటికి వచ్చి వీరి చేత పాడించుకొని, రికార్డు చేసికొని వెళ్ళుట నేనెరుగుదును. వాటిని ఇప్పటికీ స్వాతంత్ర్య దినోత్సవము, రిపబ్లిక్ డే, గాంధీ జయంతి వంటి జాతీయ పర్వ దినములందు ప్రసారము చేయుచున్నారు.

## 1.13 నటులు: -

శ్రీ గురుజాడ రాఘవ శర్మ గారు పదునాలుగు పదునైదేళ్ళ ప్రాయముననే వెణుతురుమిల్లి సత్యనారాయణ గారికి జంట కవులై అష్టావధాన శతావధానములు చేయవలెననెడి కుతూహలము, ఆశయాలతో ప్రారంభమైనది వీరి కవితా తపస్సు. వీరు నాట్య కళోపాసకులై ఆంధ్ర నాటక రంగములో 'ఆంధ్ర సభ' మొదలగు పేరొందిన సంస్థల చేరి నటించిన నటులు. పింగళి లక్ష్మీ కాంతము గారితో కలసి చెళ్ళపిళ్ళ వారి పాండవోద్యోగ విజయాలులోని కొన్ని రంగాలు ప్రదర్శించామని చెప్తుండేవారు.

శ్రీ రాఘవ శర్మ గారి శత జయంత్యుత్సవ సంచికకు వ్యాసం వ్రాస్తూ కీ॥శే॥ మల్లాది సూరి బాబుగారు సుమారు 50 సం॥ల క్రితము బందరు టౌను హాలు వెనుక ప్రస్తుత టెలిఫోన్ ఎక్స్చేంజి ఉన్న ప్రదేశంలో బుట్టాయి పేటలోని "నాటకశాల" అని ఉండేది. అందులో చాలా కాలము క్రితము లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుట్టాయిపేటలో నాటకం హాలులో "భువన విజయ ప్రదర్శన జరిగింది. ఆ సభలో శ్రీ శర్మ గారు అష్ట దిగ్గజకవులలో ఒకరు"[2] అని వ్రాసిరి.

డాక్టర్ శ్రీ జొన్నల గడ్డ రామకృష్ణ మూర్తి గారు 'గురుజాడలో గురుజాడ' అను వ్యాసం వ్రాస్తూ "శ్రీ రాఘవ శర్మ గారు భువన విజయంలో అల్లసాని పెద్దన్నగా, రామరాజ భూషణుడు పాత్రను అద్భుతంగా నిర్వర్తించిరి"[3] అని వ్రాసిరి.

1. గురుజాడ చిరంజీవి "మా నాయనగారు" - శ్రీ గురుజాడ రాఘవశర్మ శతజయంత్యుత్సవ సంచిక పుట 110
2. కీ॥శే॥ మల్లాది సూరిబాబు "నాలుగు తరాల గురువు" శ్రీ గురుజాడ రాఘవశర్మ శతజయంత్యుత్సవ సంచిక పుట 33
3. డా॥ జొన్నలగడ్డ రామకృష్ణమూర్తిగారు "గురుజాడలో - గురుజాడ" శ్రీ గురుజాడ రాఘవశర్మ శతజయంత్యుత్సవ సంచిక పుట 38

శ్రీ శర్మ గారు ది:29.03.1968 సం॥లో శుక్రవారం సాయంత్రము 4. గం॥లకు భువన విజయ సభా మండపములో రామరాజభూషణుడు (భట్టుమూర్తి) పాత్రను నిర్వహించిరి. దీనిలో

| **ఆనాటి పాత్రలు** | | **పాత్రధారులు** |
|---|---|---|
| శ్రీ కృష్ణ దేవరాయలు | : | శ్రీ ఆవట పల్లె హనుమంతరావు గారు |
| తిమ్మరుసు | : | శ్రీ మల్లా ప్రగడ శ్రీ రంగారావుగారు |
| రాజగురువు | : | శ్రీ నాదెళ్ళ దక్షిణామూర్తి శాస్త్రిగారు |

**అష్టదిగ్గజములు: -**

| | | | |
|---|---|---|---|
| 1. | పెద్దన | : | 'కవిపాదుషా' పువ్వాడ శేషగిరిరావు గారు |
| 2. | రామకృష్ణ | : | 'అభినవరామకృష్ణ' - శ్రీ అద్దేపల్లి లక్ష్మణస్వామిగారు |
| 3. | భట్టుమూర్తి | : | 'కవి శేఖర' శ్రీ గురుజాడ రాఘవ శర్మగారు |
| 4. | సూరన | : | 'మధురకవి' - కాకాని నరసింహారావు గారు |
| 5. | ధూర్జటి | : | చి॥ కాజ లక్ష్మీ నరసింహారావు |
| 6. | నంది తిమ్మన | : | చి॥ యడవల్లి రమణారావు |
| 7. | రామభద్రుడు | : | చి॥ దేవరకొండ సనత్కుమారశర్మ |
| 8. | మల్లన | : | చి॥ అద్దేపల్లి రామమోహనరావు |

నిర్వహణ: కేసరీ సమాజము - మచిలీపట్నం.

Lions Club of Machilipatnam.

వీరు రామ రాజ భూషణుడు (భట్టుమూర్తి)గా వేషము ధరించి సభలోనికి ప్రవేశించునప్పుడు

**మ॥ "స్తవనీయమ్ము, నమూల్యమౌ యుపనిషద్ వాక్యార్థముల్, పూర్వజ**
**న్మవి శేషమ్మునఁ బల్కి, శిష్యతతినిన్ సంసారఘోరాంబు రా**
**శి, విడంజేసి తరింప ( జేయుఘనునిన్ శ్రీ సచ్చిదానంద రా**
**జ్యవిభున్, శ్రీ శివ సుందరేశ్వర గురుస్వామిన్ స్మరింతున్, మదిన్"[1]**

అని తమ గురువులను తలచుకొని, సభలో ప్రారంభముగా,

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ, వ్రాతప్రతి

ఉ॥ “ఏ కవి క్రింద మిమ్ము గణియించిరటంచు ( ద లంతురేమొ, నే
నే కవి క్రింద లేను, వచియింప ( గరా, నిది భట్టుమూర్తి వే
షాకృతి, రామ భూషణు ( డనై। వచియించెద, వాని పోకడల్
చే కొను(డీ ! రసజ్ఞుల విలేని యెడన్ సయిరింపు ( డెంతయున్ ”[1]

మ॥ “స్తవనీయంబసమానమై, పరగు విద్యా గోష్ఠికింబిల్వ ( బం
చె, మాన్యుండు, బుధోత్తముండు, సుకవి శ్రేష్ఠుండు, ధాత్రీ రమా
ధవు డౌరాయలు, కొల్వు దీర్చె, జనముత్సాహమ్ము బొంగన్ మహో
త్సమున్ గాంచ ( గనేగు దెంచిరిట, నా శక్తిన్ బ్రశంసించెదన్,”[2]

ఏ కవి క్రింద మిమ్ము గణియించి రని అంటారేమొ ! నేనే కవి క్రింద లేను. భట్టు మూర్తి వేషములో రామరాజభూషణుడనని చెప్పెదను. ఆ పోకడలు లేనిచో రసజ్ఞులు మమ్మల్ని ఎదుర్కొనవచ్చును.

గొప్పదగు ఈ విద్వత్సభకు పిల్వగా వదాన్యుడు, బుధోత్తముడు, సుకవి శ్రేష్ఠుడు అయిన శ్రీ కృష్ణ దేవరాయల వారు కొలువు దీర్చియున్నారు. జనులు ఉత్సాహముప్పొంగగా దీనిని తిలకించుట కిచట కరుగుదెంచిరి. నా శక్తిని ప్రదర్శించెదను. అని

కం॥ “భాషింతురు, నను , సత్కవి
భూషణ! సత్కీర్తి రామ భూషణ! విద్యా
భూషాభి రామ భూషణ
పోషితక వి రామ రాజ భూషణయనుచున్”.[3]

ఈ పద్యమును చదివిరి. దీనిలో వీరి కవితానైపుణ్యము తెలియుచున్నది. మంచి కవులకు ఆ భరణమైన వాడు, మంచి కీర్తి గల రామభూషణుడని, విద్యాభూషాభి రామ భూషణుడని, పోషితకవి రామరాజ భూషణుడని - ఒక పదానికి ముందు ఉపసర్గలు చేర్చటం వలన - వేరు వేరు అర్థాల నైపుణ్యమును చాటుచు చెప్పిన పద్యమ మనోహరము. అట్లే ఇంకొక పద్యము.

కం॥ “రాజులము, సుకవికుల భ
ట్రాజులము, రస ప్ర బంధ రచనాసుమనో
భ్రాజులము, నవ్యభావో
త్తేజులమయ్యది జగత్ప్రతిష్టతహితమున్”[4]

శ్రీ గురుజాడ రాఘవశర్మ, వ్రాతప్రతి 1, 2, 3, 4 పద్యాలు

మ॥ "సరసోదార మధు ప్రసాద కవితా సంగీత సాహిత్య న
వ్య రసానంద కళా ప్రపూర్ణ హృదయా। వాగ్విభవోల్లాససు
స్వర సంశోభిత జిత్ విరోధికృత రాజ్య శ్రీ వశీకృత్సుజాం
తరశౌర్యాంకిత కృష్ణరాయనృప చంద్రా ! నీకు దీర్ఘాయువౌన్".[1]

అని ఈ విధముగా భువన విజయ సభా మంటపమును తన కవిత్వ దుందుభులతో మారు మ్రోగు నట్లు చేసిరి.

వీరికి కూచిపూడి నాట్యము పట్ల అత్యంత ఇష్టము గలవారు. సిద్ధేంద్రయోగియన్న అమిత గురు భావము.

మ॥ "భరతాచార్య కళాసరస్వతి కపూర్వం బౌయశో భాసమా
నరుచుల్ జిందు పసందగున్ దొడవులా నందమ్ముగా గూర్చునే
ర్పరి, సిద్ధేంద్ర కవీంద్రు, నిందలచి ప్రారంభింతు నా యోగి రా
డ్వరు చారిత్రము రూపకంబగుచు విశ్వవ్యాప్తి పెంపొందగన్."[2]

భరతాచార్యులు కళా సరస్వతికి అంతులేని యశస్సును సమకూర్చిన వాడు. పసందైన ఆభరణములు అందముగా గూర్చిన వాడు. నేర్పరియైన సిద్ధేంద్ర యోగిని దలచుకొని ఆ యోగిరాడ్వరుని చారిత్రమును రూపకంబగుచు విశ్వవ్యాప్తమై వెలుగొందాలని కాంక్షించుచు వీరు సిద్ధేంద్రయోగి నాటకమును రచించిరి. దీనిలో నాలుగు అంకములు కలవు. నాటక లక్షణములు అన్ని పాటిస్తూ వ్రాసిరి. ఈ నాటకము అముద్రితము.

మేనకా విశ్వామిత్ర అను ఒక నృత్య నాటికను కూడా వ్రాసిరి. ఇది అముద్రితము.

వీరు నటులు గనుకనే సహజముగా అనుభవైక వేద్యమైనదిగా ఉండేటట్లుగా సిద్ధేంద్ర యోగినాటకము, మేనకా విశ్వా మిత్ర నృత్య నాటికను రచింపగలిగిరి.

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ, వ్రాతప్రతి 1, 2 పద్యాలు

## 1.14 వాస్తు శాస్త్రవేత్త: -

శ్రీ గురుజాడ రాఘవ శర్మ గారు వాస్తు శాస్త్ర ప్రవీణులు. ఈ శాస్త్రమును క్షుణ్ణముగా పరిశీలించిన మహాను భావులు. ఎన్నో వందల గృహముల నిర్మాణమునకు శంఖుస్థాపన, గృహ ప్రవేశ ముహూర్త నిర్ణయము చేసి యుండిరి. 1980సం॥లో దైవజ్ఞులు, వాస్తు, జ్యోతిష శాస్త్ర ప్రవీణులు, బహు గ్రంథ కర్తలు అయిన శ్రీ శ్రీరామ కవచం వేంకటేశ్వర సిద్ధాంతి గారిచే విరచితమైన "సమీక్షా వాస్తు మయూఖమ్" అను వాస్తు శాస్త్ర విమర్శనాత్మక గ్రంథ ఆవిష్కరణ మహోత్సవ సందర్భములో వీరి ఉపన్యాసము పలువురు ప్రశంసల నందుకొన్నది. వాస్తు జ్యోతిషములను కేవలము తెలిసికొనుటే గాదు అందు నిరంతర పరిశోధన చేయుచూ ఊరూర తిరిగి ఎన్నియో గ్రంథములను సేకరించిరి. ఇవియేగాక సాహిత్యానికి సంబంధించినవి మొత్తం తొమ్మిది బీరువాల పుస్తకాలు మా ఇంటిలో ఉన్నాయంటే అతిశయోక్తి గాదు. ఇంటి దగ్గర కాగితాలపై ప్లాను వేసి చూసికొని మరల ఆయా స్థలములకు వెళ్ళి దిక్సూచి ఆధారంగా ప్లాను గీసి ఎట్లా కట్టుకోవాలో నిర్ణయించి, చెప్పేవారు. శంఖుస్థాపన, గృహ ప్రవేశ, వివాహాది శుభ కార్యములకు ముహూర్తం వ్రాసి శ్రీకారం చుట్టి పసుపు, కుంకుమ, పూవులతో పండ్లతో శ్రీ కృష్ణ పాదార విందముల చెంత బెట్టి వారిని తీసికోమని చెప్పేవారు. ఆయన చేతుల మీదుగా ఇచ్చేవారు కాదు. ఎవరైనను పండ్లు తెచ్చినను భగవంతుని పాదాల ముందే పెట్టాలి. తన పాదాలకు నమస్కరించడానికి కూడా ఒప్పుకునే వారు కాదు. "ఇక్కడ రాఘవ శర్మ కాదు మాట్లాడేది. అదిగో! ఆ కృష్ణ పరమాత్మయే మాట్లాడుతున్నాడనే వారు. వివాహ ముహూర్తమైనా ఏదైనా సరే వ్రాసి ఇస్తే ఏ ఇబ్బందియు లేకుండా ఆ శుభకార్యం నిర్విఘ్నంగా కొనసాగేది అడ్డువచ్చి ఆగిపోయినది ఒక్కటి కూడా లేదు.

ఎన్నో సంస్థలు స్వయముగా వీరి చేతి మీదుగానే ప్రారంభింపబడి నేటికీ దేదీప్యమానముగా నడుపబడుచున్నవి కలవు. బందరులో కృష్ణ కిషోర్, సరస్వతి, సాగర్ టాకీస్‌లు, గుడివాడ ఎ.ఎన్.ఆర్. కాలేజి, శరత్ టాకీస్, జగ్గయ్య పేటలో అమలేశ్వరీ సిమెంట్స్, బిర్లా సిరమిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏలూరులో పింగాణి వస్తువులు తయారు చేయు ఫ్యాక్టరీ ఇట్లా ఎన్నెన్నో సంస్థలు ఈ నాటికీ వైభవముగా నడుచుచున్నవి. బందరులో మూడు వంతులు రైస్‌మిల్లుల దస్త్రాలన్నీ మా తాత గారే ప్రతి సంవత్సరము ప్రారంభం చేసేవారు. ఈ విధముగా ప్రజాపయోగకరముగా ఎన్నో సంస్థల నెలకొల్పి ఎంతో మంది అభిమానమును చూరగొన్నారు. ఆ అభిమానమే ఆయన జీవితంలో మరుపురాని, మరచిపోలేని సహాయాన్ని అందింపజేసింది.

ఆయన కష్టించి, శ్రమ కోర్చి కట్టిన ఇల్లు ఆర్థికమైన ఇబ్బందుల వల్ల వేలం పాటకు వచ్చినది. ఆ కష్టం నుండి వీరిని కాపాడుటకు పుర ప్రముఖులందరు కలసి "పౌర సన్మానము" అను పేర రూ.3,200/-లు పోగుచేసిరి. పింగళి లక్ష్మీ కాంతం గారి అధ్యక్షతను 1972 సం॥లో బందరు ఖొజ్జిల్లి పేట నాగేశ్వర స్వామి దేవాలయంలో సన్మాన సభను ఏర్పాటు చేసి సన్మానించిరి. ఈ విషయము తెలిసి - శ్రీ నాగేశ్వర స్వామి దేవాలయం ధర్మకర్త శ్రీ ఆవటుపల్లి హనుమంతరావుగారు, రైసుమిల్లి వ్యాపారస్థులు శ్రీ తాడేపల్లి బసవయ్యగారు పండితులు బ్రహ్మశ్రీ మల్లాప్రగడ శ్రీ రంగారావుగారు - ఆనాటి సైంటిఫిక్ కంపెనీ (నేటి బెల్) జనరల్ మేనేజరు వై.యస్. నారాయణ గారు - వర్క్స్ మేనేజరు శ్రీ జె. ఉమా మహేశ్వరరావు గారు మరికొంత మంది పురప్రముఖులు వీరి వద్దకు వచ్చి ఆ యింటి బాకీని చందాలు వేసి తీర్చెదమని కోరినారు. అందుకు మా తాత గారు అంగీకరించలేదు. పైగా "బృందావనం" అని పేరు పెట్టి ఇల్లు కట్టి అందులో నా ఇష్ట దైవం శ్రీ కృష్ణపరమాత్మను ప్రతిష్ఠించినాను. ఆయన ఈ యింటిలో ఉండవలెనన్న ఉండును! లేనిచో ఆయనతోనే నేను, నా కుటుంబమున్ను వెడలెదము" అని చెప్పియుండిరి. దానికి స్పందించిన వీరు వీరికి సన్మానమును ఏర్పాటు చేసి రూ.3,200/-లు ప్రోగు చేసి అదీ వీరికి తెలియకుండా ఆ ఋణమునుఁదీర్చి యింటి కాగితాలు వీరి చేతిలో పెట్టిరి. ఈ విధముగా పుర ప్రముఖులు వారియందలి గురుభక్తిని గురుదక్షిణ రూపములో చాటుకొనిరి.

## 1.15 జ్యోతిష శాస్త్రవేత్త: -

"కవిశేఖర శ్రీ గురుజాడ. రాఘవ శర్మ గొప్ప జ్యోతిష శాస్త్రవేత్త. కృష్ణా జిల్లా నెమ్మలూరు వాస్తవ్యులైన శ్రీ ఈరంకి సీతారామయ్య గారి వద్ద జ్యోతిష వాస్తు ముహూర్తాది శాస్త్రములను అధ్యయనం చేసిరి. వారి శిష్యరికం చేసి అనేకానేక గ్రంథ పరిశీలన చేసి జ్యోతిష శాస్త్ర మందు నిష్ణాతులైనారు. వారి శాస్త్ర విజ్ఞానానికి శ్రీకృష్ణోపాసన, అనుష్ఠాన అనుగ్రహమునకు తోడు శారదాను గ్రహ సిద్ధమైన వాక్సుద్ధి వారిని దైవజ్ఞులను చేసినది".[1] మధ్యాహ్నము 3గం॥లకు ప్రారంభమైన వీరి జ్యోతిష దృష్టి ఒక్కొక్క సారి రాత్రి 12 గం॥లు కూడా అయ్యేది. జాతకములు చూపించుకొనుటకు వచ్చిన వారి జాతకములను పరిశీలించి, వారు అడుగు ప్రశ్నలకు సమాధానములు విసుగుకొనకుండ చెప్పేవారు. ఎక్కడికైనా బయటకు వెళ్ళినప్పుడు కూడా అచ్చటి వారు అడిగిన ఎన్నో సందేహాలను తీర్చేవారు. శర్మగారు వచ్చారంటే జనం తండోపతండాలుగా మూగి వారి బాధలను చెప్పుకునేవారు. వారి జాతకరీత్యా ఏమైనా దోషాలుంటే వానిని నివృత్తి చేసుకొనుటకు

1 శ్రీ గురుజాడ రాఘవశర్మ, వ్రాతప్రతి

శర్మ గారే ఏదైనా మార్గమును సూచించేవారు. ఇందులకొక ఉదాహరణ: మాటలే రాని ఒక పిల్లవాని జాతకము చూపించుకొని, అతనికి మాటలు రావడానికి ఏం చేయాలో చెప్పండి అని అడిగితే, "ఆరు మంగళ వారాలు మోపిదేవి వెళ్ళి ఆ స్వామిని దర్శించి అభిషేకము చేసికొని రమ్మని చెప్పినారు. అతడికి తరువాత మాటలు వచ్చినాయి. ఎవరికి పోస్టులో జాతకములను గురించి మాట్లాడుటగాని ఇంటికి వెళ్ళి ముహూర్తములు వ్రాసి యిచ్చుటగాని చేసెడివారు కాదు.

**చి॥ గబ్బిట గురునాథం జాతకములు వ్రాసి, ఫలితములు వ్రాసి**
**పంపవలసినదిగా - ఖాళీ పుస్తకము కూడా పంపినాడు.**
అతనికి సమాధానం ఇట్లా వ్రాసినాను - అని వారే ఈ క్రింది పద్యాలలో

<u>జాతకములు</u> - జ్యోతిషము అను శీర్షిక పెట్టి ఈ సమాధానం వ్రాసారు.

**కం॥ "వేదషడంగము, జ్యోతిష**
**మాదియు, సంతమ్ము దెలియనట్టిడ లు వల్కన్**
**సోదెయగు గాని, సత్యం**
**బాదైవజ్ఞుండెఱు ( గుసన్న యాతడెవరయా "![1]**

**కం॥ "లోకం బేదో తెలియక**
**వాకొన, తన చుట్టు మూగ, భ్రమకానీ, తా**
**నా కర్మ ఫలము దెలియునా।**
**వో ! కాలజ్ఞుండె ! యూహకున్ దెలియునయా !"[2]**

**ఉ॥ "సూచన సేయవచ్చు, మఱి సూటిగ ( బల్క ( గరాదు, బుద్ధికిన్**
**దోచిన శాస్త్రమెంతయిన, తొందరపాటగు, మించి, లోన, సం**
**కోచముదీర, దిర్వురను, గూడ, మరల్పక కాదు నిర్ణయం**
**బాచరణన్ గనంబడు, ప్రయాసమ, తీరిచి విప్పి చెప్పగా !"[3]**

**ఉ॥ "కర్మ రహస్యమున్ దెలియగా నగునే ! తనలోనతట్టు యే**
**మర్మ మెఱింగి యొక్క రని వాకొన మాటలె ! లేకయిద్దనీ**
**కర్మ మిటన్నచో యెదిరికర్మము, తాబయి వేసికొన్నటుల్**
**ధర్మ మిదొక్కటే, తగు విధానము, శాంతి పథమ్ము దెల్పుటల్"[4]**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ, వ్రాతప్రతి 1, 2, 3, 4 పద్యాలు

ఉ॥ "వ్రాతకు, బెండువోని, తన వాక్కునకున్నదమోఘశక్తి దా
చేతము బ్రిప్పినట్టుల వచింప, వృధాగద ! తొంటి కర్మ యే
రీతిని కర్మ రూపము ధరించునో ! తద్గత శక్తి బొల్చు, ద
ద్ర్వాతయు వాక్కు జాగ్రత్త గ వాడుకొనన్ వలె, లేనిచో మహా
భీతి, యనర్థముల్ వెస, శపించిన యట్లు వరంబొసంగిన
ట్లా తతనొండొరుల్ నడుపు, నయ్యదివారల కర్మ భోగ్యమై
జాతకమర్మమిద్ధి పురుషమ్మనృతమ్ము పల్కునన్
వ్రాతనొకించుకేన్ విడువరాదు, వృధా యగుశక్తియుక్తియున్"[1]

ఉ॥ "మంచి వచింనన్ మదము, మానక, కాగల కష్టమెంత సూ
చించినలో దిగుల్ పడు నిసీ । యిటు, మంచియు, జెడ్డలన్నియో
చించి, యెదెంత మెట్టుల, స్పృశించునటం,
చనుగాని, యద్దిశాంతించు పథమ్ము గుర్తెరుగనేరడొకించుక మాయగ్రమ్మగా
కావున ముందు రాగలుగు కార్యము, పత్రముపై లిఖించి, పల్కనెం
తేవశమయ్య । యెంతటి మనీషికినైన యొకింత పల్కవి
ద్యావినయైక శీలికి, యథా తథాగ గ్రహింప సాధ్యమే
యావలవాని సమ్ముఖమునందు లిఖించిన నొప్పు తద్గతిన్"[2]

ఏ ముహూర్తము వ్రాసినా శ్రీ కారం చుట్టి పసుపు కుంకుమ పెట్టి శ్రీ కృష్ణ పాదార విందముల చెంత బెట్టి వారిని తీసికొనమని చెప్పేవారు. ఆయన చేతి మీదుగా ఇచ్చే వారు కాదు. ఎవరైనను పండ్లు తెచ్చినను చేతితో స్పృశింపక శ్రీ కృష్ణుని పాదముల చెంత సమర్పించుట - నివేదన - వినియోగము. శుభకార్యములకు వెళ్ళినప్పుడు ఎవరైనా తాంబూలమిస్తే దక్షిణ లేదు కదా అని పరిశీలించి ఆ తరువాత మాత్రమే స్వీకరించెడివారు.

శ్రీ శర్మ గారి శాస్త్ర పరిశీలన ఎంత నిశితముగా ఉండేదంటే మేము చదువుకునే రోజులలో, మేము వ్రాసే పరీక్ష పేపర్లు వాటిలో ఇచ్చే ప్రశ్నల తీరు వివరించి చెబితే ఏ పశ్నలకు ఎంత వరకు మేము సమాధానమీయగలము, ఎంత వరకు మార్కులు వస్తాయో చెబితే సరిగ్గా అట్లాగే వచ్చేవి. ప్రతి పరీక్షకు ముందు వారిని అడిగి బాగా వ్రాస్తావని ధైర్యం చెబితే వెళ్ళి వ్రాసి వచ్చేవారము. అట్లాగే నా వివాహ విషయములో భర్త పేరుతో సహా చెప్పిన సంఘటనలు రుజువైనవి. జ్యోతిష శాస్త్రమును కేవలం శాస్త్రముగా

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ, వ్రాతప్రతి 1, 2 పద్యాలు

గాక ఉపాసనా శాస్త్ర గ్రంథముగా భావించి తరించిన వ్యక్తి వీరు. దీనిలో ప్రతి ఫలాపేక్షలేదు. 1929 సం॥లో వీరి జీవనోపాధికి కడు గడ్డుకాలమైన సమయములో శ్రీ పట్టాభి సీతారామయ్య గారు నీవు కటిక దారిద్ర్యమునైన అనుభవింతువేగాని జ్యోతిషమును నీ ఉపాధికి వినియోగించుకొనవు గదా! అని ఉత్తరము వ్రాయగా "షడంగమైన జ్యోతిషమును తన పొట్ట కూటికై వినియోగించుకొనననని, తాను నమ్మిన ఆ శ్రీ కృష్ణ పరమాత్మయే తనకు అన్నం పెట్టు"నని తిరిగి ప్రత్యుత్తరమిచ్చిన ధీరోదాత్తులు. నిత్య సంతుష్టులు వీరు.

గీతాచార్యుడు చెప్పినట్లుగా

**"అనన్యాశ్చింతయంతోమాంయే జనాః పర్యుపాసతే**

**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమంవహామ్యహమ్"** [1] శ్రీమద్భగవద్గీత 22వశ్లో॥

అనే వాగ్దానాన్ని అక్షరాల నమ్మి ఆచరించిన వ్యక్తి. జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఒక్క పైసా తీసికోకుండా జీవితం గడిపిన వారు. ఆ సమయంలో వీరి దుర్భర జీవితమును చూచి బాధ పడి, ప్రముఖ పండితులు హిందూ కాలేజీలో ప్రాచ్య భాషా శాఖాధిపతియైన శ్రీ చోడవరపు జానకి రామయ్య గారు వీరు వ్రాసిన కల్పలతయను గ్రంథమును ఆంధ్రా యూనివర్సిటీ బి.ఎ. పాఠ్యాంశముగా (Modern Poetry) నియోగింపఁజేసిరి. ఆ కావ్యము యొక్క అమ్మకపు ప్రతిఫలమే వారి జీవనాధారమైనది. ఆ శ్రీ కృష్ణ పరమాత్మయే తనకు జీవనోపాధి కల్పించునను తన ధ్యేయాన్ని నిరూపించుకొనిరి గదా ! 'కృష్ణం వందే జగద్గురం'. వారినోటి వెంట వెలువడిన ప్రతి మాటా - శాస్త్రమో - దైవ వాక్కో సత్యమై జరిగెడిది. 'ఋషీణాంవాచమర్థాను ధావతి' కదా! ఇట్లా జరిగిన సంఘటనలెన్నో గలవు. 1931 సం॥లో డా॥పట్టాభి సీతారామయ్య గారు, వీరు ఒకే జైలులో ఉన్నారు. అయ్యా, ! మీరు ఎల్లుండి జనవరి ఒకటవ తేదీన విడుదల అవుతారు అని చెప్పగా శర్మా! అది ఎట్లా సాధ్యం? అని ప్రశ్నిస్తే "ఏమో శాస్త్రం చెబుతున్నది" అని సమాధానమిచ్చిరి. అట్లాగే డా॥ పట్టాభి సీతారామయ్య గారు విడుదల తేదీ కాకపోయినా విడుదల అయ్యారు. దానికి పట్టాభి సీతారామయ్య గారు ఆశ్చర్యపోయి వీరిని ప్రశంసిస్తూ ఢిల్లీ నుండి వెలువడే న్యూలైఫ్ అనే పత్రికలో ఒక వ్యాసం వ్రాసిరి.

బందరు శంకరమఠంలో ఏ కార్యక్రమం జరిగినా దానికి మంచి ముహూర్తం పెట్టడం వీరి వంతు. శ్రీ సీతారామ శాస్త్రి గారికి శర్మ గారి మీద అంతటి గురి. "ఒకసారి కార్యక్రమానికి కవి సమ్రాట్ శ్రీ విశ్వనాథ

1. శ్రీ మద్భగవద్గీత నవమో2ధ్యాయ రాజ విద్యారాజ గుహ్యయోగ 22వ శ్లో॥ పుట 138

సత్యనారాయణ గారు ముఖ్య అతిథిగా విజయవాడ నుండి రావాలి. ఆలస్యమౌతోంది. వెంటనే శ్రీ శాస్త్రి గారు రాఘవ శర్మ గారిని ప్రశ్నవేశారు. ఆయన లెక్క వేసి ఇప్పుడు రావలసిన ప్రధాన వక్త "రామశబ్దం" పలుకుతోంది. సత్యనారాయణ గారికి అవకాశం లేదు అన్నారు. ఆశ్చర్యం చివరకు కంభంపాటి రామమూర్తి శాస్త్రి గారిని నిర్ణయించడం జరిగింది."[1]

"విశ్వనాథసత్యనారాయణ గారి మామగారికి మీ అమ్మాయికి సాహిత్యవేత్త, గొప్ప పండితుడు, సత్యనారాయణ అనే పేరు గల వ్యక్తి భర్త అవుతాడని చెప్పారట. ఆ విధంగానే విశ్వనాథ వారితో వివాహం అయినది. ఆ తర్వాత సభాముఖంగా ఎన్నో సార్లు వీరిని ప్రశ్నించడం జరిగింది."

మరొక సారి చోరపంచకం అయ్యింది. జాగ్రత్త అని సూచించారు. అట్లే వివాహం జరుగుతుండగా దొంగ పెండ్లి పెట్టె ఎత్తుకుపోయినాడు. ఇంకొక సారి ముహూర్తంలో అగ్ని పంచకం జాగ్రత్తగా ఉండండి అని చెప్పారు. అట్లాగే అలంకారానికి వ్రేలాడ దీసిన రంగు కాగితాలు వీడియో లైట్లకు అంటుకున్నాయి. ఇట్లా అక్షరాల జరిగిన సంఘటలెన్నెన్నో".[2]

మృత్యువు గురించి చెప్పుట గాని, నోటి మీద అపశబ్దం పలుకుట గాని మేము ఎరుగము. ఒక నాటి ఉదయము సంధ్యా వందనము చేసికుంటూ మా బామ్మ గారితో "ఏమే ఈ రోజు కర్మ చేయు రోజుగా కనిపిస్తోంది" - అదేమిటండీ! శుక్రవారం పూట నట్టింట్లో అపశకునం పల్కులు. అని ఆవిడ అనటం - కొద్ది సేపట్లో మా చిన్న తాతయ్య గారు వచ్చి - అన్నయ్యా ! నాన్నకు బాగాలేదు. నిన్ను తీసికొని రమ్మన్నారు అని చెప్పటం వీరు వెళ్ళటం జరిగినది. వీరి తండ్రి ఆనందంతో వచ్చావా! రాఘవా! ఏదీ ఒకసారి బాలకృష్ణుడు - శివుని వేషంలో బైరాగి - ఆ పద్యాలు మరొక్కసారి చదువు నాయనా! అని అడగడము వీరు ఆ సందర్భన ఘట్టాన్ని చదివి వినిపించటము. అది వింటూ కన్నీరొలికిస్తూ సాయంత్రం సూర్యాస్తమయ సమయాన స్వర్గస్థులైనారు. శ్రీ శర్మ గారు తాను ఆపరమాత్మను దర్శించుకొనటమేగాక, తన తండ్రికి కూడా దర్శన భాగ్యం కలిగించి పితృఋణం దీర్చుకున్నారు.

**"కావ్యం యశసే ఉ ర్థకృతే వ్యవహార విదేశివేత రక్షతయే**
**సద్యఃపరనిర్వృతయే కాంతా సమ్మితతయో పదేశయుజే"[3]**

కావ్యాలంకార సంగ్రహము ద్వితీయాశ్వాసము పుట 116

---

1. ఆర్.డి.ఎల్. నరసింహమూర్తి "గురుతుల్యులు-శ్రీ గురుజాడ" శ్రీ గురుజాడ రాఘవశర్మ శతజయంత్యుత్సవ సంచిక పుట 35
2. మా తండ్రిగారితో ముఖాముఖి చర్చ మచిలీపట్టణము 27-8-2009
3. శ్రీ సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి వివరణ కర్త, కావ్యాలంకార సంగ్రహము పుట 116

అట్లాగే వీరి తల్లి మరణాన్ని కూడా సూచించారు.

ఆ తర్వాత మా బామ్మ గారికి సుస్తీ చేసి ఉస్మానియా హాస్పిటల్‌లో నలభై ఐదు రోజులు ఉంచి యింటికి తీసికొని వచ్చాము. మా నాన్న గారితో, నాన్నా! అమ్మకు మారకం, నాకు పత్నీ వియోగం - నీకు తిలలు - దర్భలు తాకి కర్మ జేసెడి రోజులు వస్తున్నాయి అన్నారు. నెల రోజుల అనంతరం మా బామ్మ గారు స్వర్గస్థురాలైనారు. చివరకు ఆయన విషయంలో కూడా క్యాలెండర్‌లో తేదీ సున్న చుట్టబడి ఉండటం ఆయన పోయిన తరువాత మేము చూడటం జరిగినది. దీనిని బట్టి వీరికెంతటి వాక్సుద్ధి గలదో తెలియుచున్నది. ఇట్లా షుమారుగా 75,000 జాతకములు పరిశీలించినవి అవి వాల్యూములుగా రికార్డు చేయబడి వున్నాయి. సుమారు వంద సంవత్సరాల పంచాంగాలు ఇప్పటికీ ఉన్నాయి.


"ఇక వీరు నేర్చిన జ్యోతిష విద్యను మా నాన్న గారైన చిరంజీవి గారికి నేర్పటం జరిగింది. వీరి క్రమ శిక్షణ, శాస్త్ర శిక్షణ ఎట్లా ఉండేదంటే, ముహూర్త దర్పణంలో సంజ్ఞా ప్రకరణములు కంఠస్థం కావాలి. తారాబలం చూడాలంటే వ్రేళ్ళ మీద లెక్క చేయరాదు. ఆ నక్షత్రం ఎన్నోదో చెప్పి వెంటనే తారాబలం చెప్పాలి. వేళ్ళ మీద లెక్క పెడితే వేళ్ళపై కొడతానని కోప్పడేవారట. దశా అంతర్దశలు టేబుల్స్ చూసి వేయరాదు 9×9=81 స్టెప్స్ కూడా నోటికి వచ్చి వేయాలి. విదశలు సరేసరి. ఇట్లా మాకు శాస్త్రాన్ని బోధించేవారని మా నాన్న గారు చెప్పారు."[1] శ్రీ గురుజాడ వారి శతజయంత్యుత్సవ సంచికకు 'నాలుగు తరాల గురువు' అనే పేరుతో వ్యాసం వ్రాయుచు కీర్తి శేషులు శ్రీ మల్లాది సూరిబాబు గారు "వారు పరిశీలించిన జాతకాలు, వాటి వివరాలు వారు నిర్ణయించిన శుభ ముహూర్తాలు, తేదీల వారీగా ప్రారంభ కాలం నుండి శ్రీ శర్మ గారు అవతారము చాలించే దాకా క్రమబద్ధమైన పద్ధతిలో వారు గ్రంథస్థం చేయడం - ఆ గ్రంథాలలో సామాన్యుల జాతకాలతో బాటు నాయకులు, దేవతలు, అవతార పురుషుల జాతకాలు ఉండటం విశేషం అనీ, ఇదే వారు జ్యోతిష్యంలో చేసిన నిరంతర కృషి అని వ్రాసిరి"[2]. శ్రీశ్రీ ప.ప.శ్రీ. జగద్గురువులు శ్రీ కంచి కామకోటి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి వారి - ఆవిర్భావము:


**మ॥ "కరుణామూర్తులు యోగివర్యులు, జయాఖ్య శ్రీ విరాజిల్లువ**
**త్సరవైశాఖమునందునన్, వృషభమాసంబందు మైత్రిన్ ప్రభా**
**కరరాశిన్ ప్రభవమ్ము జెందిరి జగత్కల్యాణమూర్తుల్, జగ**
**ద్గురులౌశ్రీ కర చంద్రశేఖర యతీంద్రుల్ భానువారమ్మునన్ (ధర్మ సంస్థాపకుల్)"[3]**

1. గురుజాడ చిరంజీవిగారితో ముఖాముఖి - మచిలీపట్టణం 8-12-2009.
2. కీ॥శే॥ మల్లాది సూరిబాబు "నాలుగు తరాల గురువు" శ్రీ గురుజాడ రాఘవశర్మ శతజయంత్యుత్సవ సంచిక పుట 34
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

మ॥ “రవి సౌమ్యుండు, గురుండునున్ దశమకేంద్రం బందుశోభిల్ల భా
ర్గవుడున్ రాహువుతోడ, న ష్టమునసన్ రాజిల్లగా సౌరి, కే
తువు రెండింటను జేర సప్తమమునందున్ గూడ భౌముండు నా
ల్గవ యింటన్ శశిభాసిలంగ మృగరాట్ లగ్నమ్మునన్ ధాత్రి, ను
ద్భవమున్ జెందిరి, చంద్రశేఖర యతీంద్రస్వామి, తేజో నిధుల్.”[1]

జనన కాల శని శేషం
3-5-18
వర్తమానం
1980-4-18 నుండి
1981-10-18 వరకు
రా.చ.





1894 - 5 - 20 భానువారం 1.00 పి.యమ్. లకు జననము

ది. 6.2.1965 సం॥లో ఆగిరిపల్లిలో గీర్వాణ వాణీ ప్రచార సమితి వార్షికోత్సవములో పాల్గొని తిరిగి వస్తుండగా వీరి పుస్తకములు బట్టలు పెట్టు కున్న పెట్టె మాయమైనది. ఆ రాత్రి అంతా బాధపడి నాయన అనుగ్రహము ఎట్లా ఉందో అని బాధతో ఎన్నో పద్యాలు వ్రాశారు. ది:7.2.1965 ఆదివారం ఉదయం 8.00 గం॥లకు లేవలేక ఒడలు తిరుగుచు, చెమటలు గారుచుండగా,

మ॥ “గురు ( డొక్కండనుకూలు ( డై, నడచు, నాగోచార మందందం
దతె, జన్మర్క్షమునందు మందుడు, వ్యయస్థానమ్మునన్ సౌమ్య, భా
స్కర,శుక్రుల్, కుజు ( డష్టమమ్మునను, సౌఖ్య స్థానపున్ రాహు, వి
క్కరణిన్ గల్గు, గ్రహమ్ములన్ గలదె, సౌఖ్యంబేరికిన్, మత్ప భూ !”

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

గురుడు ఒక్కడు అనుకూలుడుగా నడుచుచున్నాడు. నా గోచారములో అందరు అందరే. జన్మ నక్షత్రములో వీరిది శతభిషా నక్షత్రము. శని ఉన్నాడుట. మూడవ సారి ఏలినాటి శనియట. వ్యయమందు బుధుడు, రవి, శుక్రులున్నారట. అష్టమములో కుజుడున్నాడట. అర్ధాష్టమములో రాహువట. కేతు స్థిత స్థానాధిపతి కుజుడు అష్టమము. చంద్రుడు అను కూలము - ప్రతికూలుడు 2 1/4 రోజులకొక తూరి. గురుడు తృతీయము. ఇదిగో భారము.




"నేటి ఉదయము చంద్రుడు రేవతి 4వ పాదము బస్సుపై పెట్టి వేసినది పోయినది సమయము 7.30 పి.యమ్. నుండి 9.00 పి.యమ్. ది:5.2.65 శుక్రవారం శు 4 ఉ.భా - నక్షత్రం అని వీరే ఒక పుస్తకములో వ్రాసికొనిరి."[1]

## 1.16 నిర్వహించిన పదవులు: -

"శ్రీ గురుజాడ రాఘవశర్మగారు చిరుత ప్రాయములోనే 1917 సం॥లో పామఱ్ఱులో రెండు నెలలు డిప్యూటీ తహశీల్దారుగా ఉద్యోగము చేసిరి. తరువాత దానికి స్వస్తి చెప్పి పామర్రులోనే మూడు సంవత్సరములు టీచరుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిరి. అనంతరం వానపాములలో ఆర్.ఎస్.స్కూల్లో టీచరుగా ఉన్న సమయములో ఆర్జనతో కూడిన మార్గములన్నిటిని త్యజించి అంగరకా విసర్జించి కేవలము కట్టుబట్టతో పూర్తిగా నిర్వీరామ సత్యాగ్రహోద్యమములో పాల్గొని శాంతి సైనికుడై గాంధీ గారి శిష్యులైనారు. 1921 సం॥ నుండి 1927వ సం॥ వరకు కలంకారీ అద్దకపు పరిశ్రమకు పేరొందిన మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాలలో డయింగ్ అండ్ ప్రింటింగ్ వర్క్సు సంస్థకు మేనేజరుగా వ్యవహరించిరి. 1923వ సం॥లో జిల్లా

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

కాంగ్రెస్ వలంటీర్ బోర్డు మెంబరుగా ఉండి 1923 సం॥ నుండి 1924 సం॥ వరకు మచిలీపట్నం కాంగ్రెస్ కమిటీ సెక్రటరీగా సేవ చేసిరి. 1922 వ సం॥ ఏప్రిల్ లో బొంబాయిలో ఆ ప్రాంతానికి సంబంధించి ప్రదర్శింపబడిన ఎగ్జిబిషన్‌కి మానేజరుగా వ్యవహరించిరి. 1928 వ సం॥ జనవరి నెలలో మద్రాసులోని అఖిల భారత ఖాదీ ప్రదర్శనలో ఖాదీ పై అద్దకము నందు వీరి ప్రావీణ్యమును గుర్తించి అఖిల భారత స్థాయిలో ప్రథమ స్థానము నొసంగి బంగారు పతకము నిచ్చిరి. 08-01-1928 సం॥ నుండి 31-08-1933 వ సం॥ వరకు మద్రాసులో సహకార శిక్షణ కేంద్రంలో నిష్ణాతులై వివిధ సహకారోద్యమములలో పర్యవేక్షకులుగా వ్యవహరించుచూ గుడ్లవల్లేరులోని సహకార సంస్థ సూపర్ వైజర్‌గా పనిచేసిరి. 1941 వ సం॥ వరకు సౌత్ ఇండియా కోపరేటివ్ ఇన్సూరెన్స్ ప్రచారమును చేపట్టి కృష్ణా, గుంటూరు జిల్లాల ఆఫీస్ ఇన్‌చార్జిగా విజయవాడలో పనిచేసిరి. ఈ మధ్య కాలంలోనే గాంధీ గారి పిలుపు మేరకు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 1930 వ సం॥ మే 16 వ తేదీన అరెస్టు చేయబడి 1931 వ సం॥ జనవరి 12వ తేదీన విడుదల చేయబడిరి. 12-09-1941 వ సం॥ స్థాపించబడిన అఖిల భారత చర్ఖా సంఘం బందరు శాఖలో క్యాషియర్‌గా ఎక్కౌంటెంటుగా డా॥ పట్టాభి గారిచే నియమితులై నెలకు 599/- రు॥ లకు పనిచేసిరి. 15-08-1947 సం॥లో స్థానికంగా జరిగిన ప్రథమ స్వాతంత్ర్య దినోత్సవపు వేడుకల్లో పాల్గొనిరి. 1953 వ సం॥ నుండి 1956 వ సం॥ వరకు ఆంధ్రాబ్యాంకు ఎంప్లాయీస్ కోపరేటివ్ బ్యాంకు ఇన్‌చార్జిగా మానేజరుగా పనిచేసి తన 58 వ ఏట పదవీ విరమణ చేసిరి. తరువాత కొంత కాలం మచిలీపట్నం లోని హిందూప్రెస్‌లో పండితునిగా అనేక సాహిత్య గ్రంథాలకు పరిష్కర్తగా వ్యవహరించిరి."[1]

## 1.17 ప్రసంగాలు: -

శ్రీ శర్మగారు పాల్గొని ప్రసంగించని సభ అంటూ లేదు. వారు అధ్యక్షులుగానో, ముఖ్య అతిథిగానో, గ్రంథావిష్కర్తగానో, ఉపన్యాసకుడుగానో ఎప్పుడు ఏదో ఒక సభలో పాల్గొంటూ ఉండేవారు. ఆ సభలకు కూడా సమయపాలన పాటిస్తూ వెళ్ళేవారు. కార్యకర్తలు తీసికొని వెళ్ళటానికి సమయానికి రాకపోయినచో తానే మా చేత రిక్షా తెప్పించుకొని సరిగా 5గం॥లకు సభ అంటే అరగంట ముందుగా అక్కడ ఉండేటట్లుగా వెళ్ళేవారు. కొన్ని సమయములలో ఆ సమయానికి సభా నిర్వాహకులు కూడా రాని సందర్భములుండేవి. నేను పట్టాభిగారి శిష్యుడనయ్యా Punctuality (సమయపాలన) ముఖ్యం అని మందలించేవారు. వీరు వెణుతురు మిల్లి సత్యనారాయణగారితో కలిసి జంటగా కవిత్వం చెప్పుటయేగాక - అష్టావధాన ప్రక్రియలును

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

ప్రారంభించిరి. సభలో ఆశువుగా పద్యాలలోనే ప్రసంగాలు చేయుట, పండితులకు వ్రాసే ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా పద్యాలలోనే ఉండేవి.

"పింగళి లక్ష్మీకాంతంగారు ఆకాశవాణి విజయవాడలో సాహిత్య విభాగమునకు ప్రయోక్తగా ఉన్నారు. వీరు మా తాతగారు బాల్యస్నేహితులు, బంధువులు, ఇరువురు సాహితీవేత్తలు. మా తాతగారి చేత ముఖాముఖి పరిచయములు, ప్రసంగములు, జాతీయ గీతాలు, పాటలు బాణీకట్టి ఆకాశవాణిలో పాడించినారు. ఆ తర్వాత రావూరి భరద్వాజ,ఉషశ్రీ ప్రయాగ రామకృష్ణల వంటివారు ఆకాశవాణిలో వీరి చేత పాడించి రికార్డు చేయించినారు. నేటికిని అప్పుడప్పుడు ఆకాశవాణి వారు ప్రసారము చేయుచున్నారు. 1947సం॥ ఆగష్టు 15 వ తేదీ ప్రథమ స్వాతంత్ర్య దినోత్సవ సభలో వీరు వ్రాసిన పద్యాలను అప్పటి కృష్ణాజిల్లా కలెక్టరుగారు ముందుగా పాడించుకుని వీరి కవితాగాన మాధుర్యమునకు అచ్చెరువంది ఆనాటి సభా కార్యక్రమములో చేర్పించినారు. తాను కన్నకలలు ఉద్యమస్ఫూర్తి, ఫలించిన రోజు, ఆయన ఆనందము అంతులేనిది. సభలో పద్యాలు చదువుతుంటే ఆయనలో ఉప్పొంగిన భావోద్వేగము వర్ణనాతీతము[1] అని వారి కుమారుడే "మానాయనగారు" శీర్షికలో వ్రాసి యుండిరి. హైదరాబాదులో త్యాగరాజగాన కళాసమితిలో జరిగిన సాహిత్య సభావేదికపై ప్రసంగించిరి. ఆకాశవాణి హైదరాబాద్, విజయవాడ కేంద్రం వారు రాత్రి 9.15 నుండి 9.30ని॥ వరకు సాహిత్యనందినీ కార్యక్రమములో "భ్రమరగీతాలు, పోతనామాత్యుడు, వీరప్రభాతమ్, గాంధీకథ, దేశరక్షణ మనకర్తవ్యమ్' మొదలగు అంశములపై ప్రసంగములు చేసిరి.'మన కవితాజగత్తు - స్వాతంత్రోద్యమ రేఖలు' అను పేరుతో కవితా సంకలనము చేసిరి. దీనిని ఆకాశవాణి విజయవాడ కేంద్రము వారు ప్రసారం చేశారు.

బందరులో శ్రీ కొమరిగిరి కృష్ణమోహనరావుగారు వ్రాసిన " రామాయణ పాత్రలు" గ్రంథా విష్కరణ సభలో పాల్గొని ప్రసంగించిరి.

బందరులోనే ఆంధ్రా సైంటిఫిక్ కంపెనీ (ప్రస్తుతం BEL) ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించిరి. ఈ వేదికపై జనరల్ మేనేజర్ వై.యస్.నారాయణగారు వర్క్సు మేనేజర్ టి. ఉమామహేశ్వర రావుగారు కూడా గలరు.

స్థానిక మచిలీపట్టణము లేడియాంప్థిల్ జూనియర్ కాలేజిలో ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భముగా ప్రసంగించిరి.

1. శ్రీ గురుజాడ చిరంజీవి "మా నాయనగారు" శ్రీ గురజాడ రాఘవశర్మ శతజయంత్యుత్సవ సంచిక పుట 110

ఇదే విషయమును వీరి షష్ఠిపూర్తి జరిపిన సమయములో ఆనాటి ఉత్సవ కమిటీ సెక్రటరీ అయిన శ్రీ ఆవటపల్లి హనుమంతరావుగారే.

**ఉ॥ "ఏ ఘన రాజకీయ సభనేని, కవీంద్రుల గోష్ఠినేని, భ**
**క్తౌ ఘము జేరి సేయు పరతత్త్వ విచారములందునేని, ప్ర**
**జ్ఞా ఘనులుండు శిష్ట పరిషత్తునేని మఱే సదస్సునేన్**
**రాఘవశర్మలేని సభ రంజిలదీ మచిలీపురంబునన్"[1] 4వ పద్యము.**

ఏ గొప్ప రాజకీయ సభలలోనేని, కవీంద్రుల గోష్ఠులలోనేని, భక్త సంఘములు చేయు పరతత్త్వ విచారములలోనేని, శిష్ట పరిషత్తులలోనేని ఏ సదస్సులలోనేని రాఘవశర్మలేని సభ ఈ మచిలీపురములో రంజిల్లదు. అని కీర్తించిరి. దీనిని బట్టి వీరి కవితా గోష్ఠులు శ్రావ్యమైన కంఠధ్వనితో ఏ విధముగా మారుమ్రోగి పోయేవో తెలియుచున్నది.

శ్రీ గురుజాడ వారి శతజయంత్యుత్సవ సంచికకు వ్యాసం వ్రాస్తూ శ్రీ మండలి బుద్ధ ప్రసాద్‌గారు, అవనిగడ్డలో మా గాంధీ క్షేత్రంలో జరిగిన ఎన్నో సాహిత్య రాజకీయ కార్యక్రమాలు ఏర్పాటు చేసి పిలిస్తే కాదనకుండా వచ్చేవారు. మా నాన్నగారైన మండలి వెంకట కృష్ణారావుగారి షష్ఠిపూర్తికి వచ్చి వారిని, మమ్మల్ని అందరిని ఆశీర్వదించారు.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఆవుల సాంబశివరావుగారి అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనములో మా దంపతులపై కవితాశీస్సులు అందించి ఆశీర్వదించారు.

బందరులో గొట్టిపాటి బ్రహ్మయ్యగారి షష్ఠిపూర్తి జరిగింది. ఆ కార్యక్రమానికి మండలి వెంకట కృష్ణారావుగారు, సంజీవరెడ్డి కళావెంకట్రావుగారు, చాపరాల బ్రహ్మానందంగారు, చిట్టయ్యగారు మొదలైనవారు నిర్వహించారు. ఆ సభా నిర్వహణకు శ్రీ శర్మగారి ముఖ్య పాత్ర కూడా ఉన్నది[2] అని వ్రాసిరి.

అంతర్జాతీయ బాలల సంక్షేమదినోత్సవము సందర్భముగా 14-11-1979 వ తేదీ సా॥ 2 గం॥లకు శ్రీ కుంభకోణం కృష్ణమాచార్య మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - పెద్దతుమ్మిడి - బందరు తాలూకా కృష్ణాజిల్లా - సభలో ఉపన్యసించిరి.

---

1. శ్రీ ఆవటపల్లి హనుమంతరావుగారు, శ్రీ రాఘవశర్మగారికి బృందావనపుర పౌరసన్మాన సందర్భమున సమర్పింపబడిన పద్యరత్నములు - 4 వ పద్యము
2. మండలిబుద్ధప్రసాద్ "శతజయంతి నివాళి" శ్రీ రాఘవశర్మ శతజయంత్యుత్సవ సంచిక - పుట 18

సభా ప్రారంభములో శ్రీ సరస్వతీ దేవిని

ఉ॥ **"వాలు కనుల్ వెలార్చి, వెసపల్కుమ, తేనె పదాలు, శారదా**

**బాల! ప్రభావిశాల! సుమఫాల! మనోజ్ఞ సువర్ణ డోలికా**

**లాలిత భావశీల! పదలాలిత గుణ విలోల బాలికా**

**బాలుర పాలి వెన్నెలుగ, భాసిలుతల్లి మహెూజ్జ్వల ప్రభన్."[1]**

అని ప్రార్థన చేసిరి. తరువాత మన దేశ సంస్కృతీ సంప్రదాయములను గూర్చి జాతీయ పతాక ఔన్నత్యమును ప్రసంగించిరి. విద్యార్థులలవరచుకోవలసిన ఎన్నో మంచి విషయాలను గూర్చి ముచ్చటించిరి. దీనిలో భాగముగా గట్టిగా పైకి చదవటము, దస్తూరిని శ్రద్ధబట్టి వ్రాయడము, ధారణ మననము, పెద్దలయెడ, గురువుల యెడ నడచుకోవలసిన విధానము గురించి వివరించిరి. బాలల దినోత్సవము, సర్వేపల్లి రాధాకృష్ణ, నెహ్రూ జన్మదినోత్సవములు, ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవము వేడుకలు జరుపుకొనుటకు కారణాలు, ఫలితాలు వివరించిరి. ఇంత గొప్ప సంస్కృతి గలది మన భారత జాతి అని తెలియ జెప్పిరి.

విద్యార్థీ! విద్యార్థీ! అను గేయమును గురు భక్తిని వివరిస్తూ ఒక గేయమును, దేశకుడవీవు - సందేశకుడ వీవు అను గేయాలను అప్పటి కప్పుడు వ్రాసి సభా ముఖముగా పాడి వినిపించాను అని ఒక చోట వ్రాసిరి[2] బాలలు భావిభారత పౌరులు వారు చక్కని సంస్కృతీ సంప్రదాయాలతో తీర్చి దిద్దబడాలని ఉత్తేజకరముగా ఉపన్యసించిరి.

స్వస్తిశ్రీ వికారి నామ సం॥ ఆశ్వయుజ బహుళ బుధవారము 28-10-1959 సం॥ సాయంత్రము 6 గం॥లకు శ్రీ సరస్వతీ కళాసమితి సారస్వత శాఖా ప్రారంభోత్సవ సభలో పాల్గొని తమ అభినందనలు తెలియజేసిరి. ఈ సభకు శ్రీ కోలవెన్ను రామకోటేశ్వర రావుగారు అధ్యక్షులు. శ్రీ కాటూరి వేంకటేశ్వరరావుగారు ఈ సభా నిర్వాహకులు. ఆ అభినందనము పద్యాలలో ఈ విధముగా తెలియజేసిరి.

సీ॥ **"పై బడ ఝల్లను పన్నీటి జల్లుల**

**గుబిపించు కానని కొంటెదనము**

**ప్రోవిడి సత్కవితా వస్తులంగడి**

**రకరకం బమ్ము వర్తకపు సరళి**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.
2. పైదే

వింతవింతైన సంక్రాంతి లక్ష్మిని గని
గిలిగింత నవ్వించు కులుకుదనము
భోగపరాయణు యోగపరాయణు
డై యొప్ప ( జేయు సంయమనశక్తి
తొలకరించెను బాల్యమందున ( గవిత్వ
పటలి శ్రీ హైందవోన్నత పాఠశాల
బెరిగె సౌందర నందన వీథి మిగుల
సత్కళా పూర్ణ ! యిపుడు సాక్షాత్కరించె"॥[1]

మ॥ "గత జన్మాంతర పుణ్యశేషమున, సత్కావ్య ప్రపంచ ప్రచో
దిత గూడార్థములన్ గ్రహించి, సహజోక్తిన్ పల్కెదౌరా! రసో
చిత గంభీర పరిస్ఫుటానుభవ రాశీ భూత భావ ప్రమో
దితులై శ్రోతలు, నీదు వాగమృత వార్థిన్ మున్గ నిశ్చేష్టులై "[2]

శా॥ "పౌలస్త్యుండన పంచభూతములె, చేవల్ దక్కి స్తంభించు, నీ
పౌలస్త్యున్ సృజియించి తెట్టుల ! స్వరూప జ్ఞాన మిట్లుండెన
య్యా, ! లోనన్ బ్రకటించి తీ హృదయ సౌహార్దమ్ము శ్రీ వేంకటే
శా ! లెక్కింప సమంబె, నీ కిడెడి, యేసన్మానమున్ మాన్యమున్"[3]

సౌందరనందనము, పౌలస్త్య హృదయము కాటూరి వారి హృదయ సౌహార్దమును ప్రకటించునట. వీటి ముందు మీకిచ్చెడి సన్మానము సమానమా అంటారు.

శా॥ "గంటల్ కొట్టి తమః ప్రపూర్ణ హృదయ గ్రంథుల్ విడంజేసి, చే
గంటన్ దీనుల మేలుకొల్పి, కరుగంగా వేంకటేశుండు, క్రీ
గంటన్ వెంటననుగ్రహించి పలుకంగా దీవనల్, కొండపై
వింటే ! దేవళమై మనమ్మునను శబ్ద భూత సాదృశ్యముల్."[4]

చం॥ "తెలియుదుశబ్ద మార్దవము, తీరిచి తూచి నియుక్తమైన స్వ
స్థలమున నేర్పుమై పొదుగ జాలెద, వన్వయ దూరమింతయున్
బొలయక, దీటుగా (సూటిగా) విషయమున్ ముడి వెట్టెదు, జాను తెన్గునన్
బలుకు బడుల్ వెలార్చు ప్రతిభా సరసజ్ఞుడ ! వేంకటేశ్వరా !"[5]

అని వారి కవితా వైభవమును కొనియాడిరి.

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3, 4, 5 పద్యాలు

శా॥ "నీవెవ్వారిని, ద్రోసి వేయక, మహా నిష్ణాత సుస్మిత ౘడం
చేవో చిత్ర విచిత్ర సంగతులనెంతే పల్కనుప్పొంగు, నీ
భావాంతర్గత సత్యమున్ దెలియ ౘడబ్బా! యెట్టి మేధావియున్
వక్రోక్తికి, వేంకటేశ్వర కవీ! నీరాజనం బిచ్చెదన్"[1]

కం॥ "సిద్ధహస్తుండవు, మఱి, ప్రాచీ న నవ్య
సరస కవితారసజ్ఞ శేఖరు ౘ డ వీవు
వృద్ధి నొందంగ సంస్థ దీవింపుమయ్యగ!
వేంకటేశ్వర! ప్రారంభ వేళ, నేఁడు!"[2]

తన దరిజేరిన తోటి కవులనుగాని, వ్యక్తులనుగాని ఎవరినైన త్రోసివేయకుండా మహానిష్ణాతుడితడు అని ఏవేవో చిత్రవిచిత్ర సంగతులు పల్కి పంపించే వారట.

ఆ వచ్చిన వ్యక్తి బాధపడకుండా వెళ్ళేవాడు. ఆయన హృదయాంతర్గతమైన భావం ఏమిటో తెలిసికో లేకపోయేవారట. అట్టి నీ మేధా శక్తికి వక్రోక్తికి నీరాజనమంటారు. దీని వలన ఇతరుల నొప్పించని స్వభావం కలవారని స్పష్టమగుచున్నది.

శ్రీ వాసుదేవ అష్టోత్తర శత నామములు - శ్రీ కృష్ణతత్త్వము అంశము పై 25-6-1958 సాయంత్రం 5.30 ని॥లకు శ్రీ విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవర్తక సంఘము చతుర్థ వార్షికోత్సవ సందర్భముగా ఉపన్యసించిరి.

మ॥ "స్మరియింతున్ దొలుదొల్త సద్గురు పదబ్జద్వందమున్ భక్తి త
త్పరతన్ నాయిలు వేల్పు, కృష్ణ పరమాత్మన్, సన్నుతి జేసి, బం
దరు నందీపుర మందిరాంతర సభాధ్యక్షున్, బుధాళిన్, గవీ
శ్వరులన్ భక్తుల, గారవించెద, నమస్కారమ్ములన్ జే కొనన్."[3]

మ॥ "నరజన్మంబది దుర్లభంబు దరియన్ సాధ్యంబుగా దొక్క శ్రీ
హరి సేవావిధి మాత్రమే యను విశిష్టాద్వైత సిద్ధాంతముల్
స్థిరమై, భక్తహృదబ్జ పీఠిని, బ్రవర్తింపగన్ బ్రయత్నించు నీ
సరసజ్ఞుల్ బిలువంగ కాదనక నా శక్తిన్ బ్రసంగించెదన్"[4]

ప్రార్థనతో మొదలు పెట్టి వాసుదేవ నామ శతకము నందలి కొన్ని నామాలకు వ్రాసిన పద్యాలతో ఉపన్యసించిరి. వీరి ఉపన్యాసము విని ఆనందభరితులై ఆ సభకధ్యక్షులైన కవిరత్న సుధీమణి గుదిమెళ్ల రామానుజాచార్యులుగారు వీరిని ప్రశంసించుచు

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3, 4 పద్యాలు

ఉ॥ "శ్రీ గురుజాడ వంశ్య కవిశేఖర రాఘవశర్మగారు స
ద్వాగ భినందనీయులు, సుధార సపేయ కవిత్వ ధోరణీ
భాగులు, వాసుదేవ నుతి పద్యములన్, పఠియించి గోష్ఠిలో
బాగనిపించినారు, భగవంతుడు వీరి కనుగ్రహించుతన్"[1]

కం॥ "శర్మగారు నేడు శతకంబు వినిపింప
సభ్యులార ! మనసు చల్లపడియె
వాసుదేవునందు భక్తితో నుండుడు
భక్తి వాసుదేవనుతిని వదల వలదు."[2]

అని పద్యములు చెప్పిరి. దీనినిబట్టి వీరి ఉపన్యాసమెట్లుండునో తెలియగలదు.

ఆంధ్ర నలంద, గుడివాడ మకర సంక్రమణ మహోత్సవ కార్యక్రమములో 14-1-1957 సాయంత్రం ఈ క్రింది పద్యాలు వ్రాసి చదివిరి

"స్తనీయంబగు శ్రీ నలంద సభ కధ్యక్షుండనై, పుజ్యు డౌ
శివరామ ప్రభు సమ్ముదమ్మున బ్రశంసింతున్, మహాభక్తి స
త్కవులన్ సన్నుతి జేసి పండితుల సత్కారమ్ము గావించి, యు
త్సవ సందర్శన భాగ్య శీలుర సదస్య వ్రాతమున్ మ్రొక్కెదన్."[3]

"వందిత బుధ చందాంధ్ర స
లంద, మహత్తర యశో విలాస శ్రీమా
రంద రసామృత పద వా
క్సుందరి సన్మందిరమ్మగుచు వర్ధిల్లుతన్."[4]

"మొగ్గతొడిగినవి - మూలనా మూల గ
 ల్పన జేసి మంచి యాశలను గొన్ని
అరవిచ్చినవి కొన్ని పరిమళమున్ జిమ్మి
 హృదయాను రాగ మోహితుల జేసి
నిండార విచ్చి, వెన్నెలకుప్పవోసి, న
 వ్వుల గుల్కుచున్న వావలనుగొన్ని

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి1, 2, 3, 4 పద్యాలు

అందమైనట్టి యాంధ్రనలంద పుష్ప
వాటి వృక్షాల దివ్య పుష్పాలివన్ని
దోహద మొనర్చు చక్కని తోట మాలి
దొఱక, తోట పసందు, గందుము కదయ్య।"[1]

"ఇది యెనలంద తోట, యితడే ! యొక్క చక్కని తోటమాలి, స
మ్ము దమున ఁ బెంపగా విరియ బూచి ఫలించెనునేడు దివ్యసం
పదలను దెస్గునాట, పరవల్ల వెలార్పనుపక్రమించె, ని
య్యది కదలించుగా, చలనమందని భావ మనోజ్ఞ కూటముల్."[2]

చల్లపల్లి నూత్న హైందవోన్నత పాఠశాల వార్షికోత్సవ సభలో 8-3-1957 సంవత్సరం శుక్రవారం సాయంత్రం 4 గం॥లకు జరిగిన దానిలో వీరు ఉపన్యసించిరి: -

"ప్రభుల కావాస మగు చల్ల పల్లి వెలయు
ప్రాధమిక పాఠశాల, హర్షమ్ము తోడ
వార్షికోత్సవమున్ సలుపంగ నెంచి
నెమ్మి బిలువంగగంటిని, మిమ్ముగంటి॥"[3]

"ఊరక నాల్గు ముక్కలెవియో, యిట బల్కుట పాడిగాదు, వి
స్తారము జెప్ప, బాలురు పసందన, రా పయి పూజ్యు లౌ సభా
స్తారులు మేటి యౌ మధు రసప్రచురాంచిత భాషణల్ ; వినన్
గోరుదు, రౌట, నెట్టులననున్ బలికింతువౌ! నేడు శారదా!"[4]

అని ప్రార్ధనా పద్యము ఆశువుగా అప్పటికప్పుడు వ్రాసి బలికి తరువాత ఏ ఏ విషయాలు గూర్చి ముఖ్యముగా ప్రస్తావన చెయ్యాలో

"వీలయినంత ప్రాథమిక విద్యలగూర్చి చిపల్కువాడ, మున్
బాలురు దక్షులైన, క్రమ పద్ధతి గూరిచి ముచ్చటించి, యీ
కాలమునందొసంగ, నధికారులముద్ర భరించి జీవముల్
దాలిచి వ్యాప్తి నొందిన విధానము గూరిచి పల్క మేలగున్."[5]

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3, 4, 5 పద్యాలు

వీలయినంత వరకు ప్రాథమిక విద్యను గూర్చి చెప్పి సమర్థులైన విద్యార్థులు పాటింపదగు క్రమ పద్ధతిని వివరించి, ఈ కాలమునకు సంబంధించిన అధికారులు, విద్యా విధానము మొదలైన విషయాలను ముచ్చటించిరి.

**"ప్రతిలేనట్టిది హైందవోన్నత చిరప్రాశస్త్య విజ్ఞాన సం**
**స్మృతి, పాశ్చాత్య మహానుభావుల కర శ్రీ భాగ్యమో భారత**
**క్షితి దౌర్భాగ్యమొ, సన్నగిల్లి, యెటొ నిల్చెన్ మూలలన్ తొంటి యో**
**గ్యత చే కూఱ శ్రమింత్రుగాక, మన విద్యాశాఖయున్, దేశజుల్"[1]**

అని హిందూ సంస్కృతీ - సంప్రదాయము ఎంత గొప్పదో వివరించి దానిని కాపాడవలసిన బాధ్యత విద్యాశాఖాధికారులకు, దేశజులకు కలదని వారి బాధ్యతను గుర్తు చేసిరి.

ఉపాధ్యాయులనుద్దేశించి ప్రత్యేకముగా ఉపన్యసించిరి. వీరే తమ వ్రాత ప్రతిలో ఈ విధముగా వ్రాసికొనిరి[1] ఒక సారీ విషయమును సమన్వయముచేసికొందము. విద్యయే సంపాదించదగినది. విద్యార్థుల కొఱకే ఉపాధ్యాయులు, మంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు కలది పాఠశాల. ఈ విద్యార్థులు మన బిడ్డలనేదిగాక, ఈ ఉపాధ్యాయులే మన బిడ్డలపాలిటి కామధేనువులని, తల్లిదండ్రులు పరస్పర హృదయము కలిగి ఉండవలె. అజమాయిషీ వర్గము అధికారులమనే విషయముకంటే వీరి నందరినేకోన్ముఖముగా నడిపించే సహృదయము త్యాగబుద్ధి కలిగి ఉండవలె. అప్పుడే ఆదర్శవిద్య. ఆదర్శ పాఠశాలలు మనము చూడగలుగుతాము. జాతి ఔన్నత్యము ప్రపంచము గ్రహిస్తుంది. ఛాందోగ్యోపనిషత్తులోని ఒక ఆఖ్యాయిక మనవి చేస్తాను. ఉపకోసలుడనే విద్యార్థి గురువుగారి వద్ద విద్యా భ్యాసము కొఱకు వచ్చి 12 సం॥లయ్యింది. ఇంత వరకు ఇంటి పనులు, అగ్నికార్యములు చేయుటేగాని, విద్యయే మాత్రము అనుగ్రహించలేదు. కడమ శిష్యులు ఆరితేరి అప్పుడే యిండ్లకు వెళ్ళి పోయారు కూడ. ఒకనాడితనిలో ఒక ఉద్రేకం బయలుదేరింది. తహతహ పడ్డాడు. ఒక పాఠమైనా చెప్పినారు కారు. సద్గురువులని వారి నడిగే సాహసంలేక, గురువుగారి భార్యతో యేకాంతంగా మనవి చేశాడు తన హీనస్థితి. ఆమెయు నారాత్రి గురువుగారైన భర్తగారితో, ఏమండీ! ఇక నుంచి మీ అగ్నిహోత్రాలు, మమ్మాగ్రహించకుండా చూచుకొనండి అన్నది. గురువుగారు గ్రహించినారు అంతరార్థము. తెల్లవారకడనే విద్యార్థికి చెప్పకుండా గ్రామాంతరము వెళ్ళినారు. ఉదయం విద్యార్థిలో మరీ తహతహ బయలుదేరి అమ్మగారితో మనవి చెయ్యడం అనర్థకం అయ్యింది. ప్రతిరోజు

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

గురువుగారి దర్శన భాగ్యమన్నా ఉంటే అది కూడలేదని గది విడచి రాడు భోజనానికి. గురువుగారి భార్య బ్రతిమాలింది. అమ్మా ! ఆకలి లేదంటాడు. కడుపు ఖాళీ లేదన్నాడు. పరితాపంతో నిండిపోయినదని ఆక్రోశించాడు. పరమేశ్వరునికి దయ కలిగి అగ్నిహోత్ర స్వరూపముగా బోధించారు. కం బ్రహ్మ, ఖం బ్రహ్మప్రాణమే బ్రహ్మ అని మొదలగు బ్రహ్మవిద్యారహస్యములు బోధించబడినాయి. నూతన బ్రహ్మ తేజస్సు ముఖాన్ని ఆవహించినది. బ్రహ్మవిద్య కరతలామలకం అయ్యింది. ఇది గురువుగారికి విన్నవించేది ఎట్లా? అని సద్గురువులు గృహోన్ముఖులై ప్రవేశించబోతూ, బయటనుంచి ఉపకోసలా! ఉపకోసలా! అని కేక వేశారు. ఒడలు ఝల్లుమంది. అగ్నిహోత్రాలు ఒణికాయి. గురువుగారి ఆజ్ఞలేకుండా ఉపదేశించాము ఏమి శపిస్తారో అని, శిష్యుని ముఖాన బ్రహ్మ తేజస్సు చూచి, కావలసినది అయినది అనుకొనుచుండగానే శిష్యుడు గురువుగారిని సంబోధిస్తు స్వామీ ! తాము మమ్ము, గృహాన్ని విడిచి వెళ్ళితే అగ్ని హోత్రాలు తప్ప గతియేమున్నాయి అన్నాడు. గురువుగారు సంతోషించారు. గురుభక్తి ప్రభావము, యింతయని చెప్పరానిది. దీనికి ముందు శ్రద్ధ సద్గురువు వాక్యముల యందు విశ్వాసం, అవసరం. గురు భక్తి యే సమస్తము అనుగ్రహిస్తుంది. ఈ విధముగా వీరి ఉపన్యాస పరంపర కొనసాగేది.

ది. 26-1-1957 శనివారం సా॥ 3.00 నుంచి మహాత్మాగాంధీ బోర్డు ఉన్నత పాఠశాల వార్షికోత్సవ సభ - ఘంటసాల లో ప్రసంగించిరి.

**మ॥ "అతులశ్రీయుతసేతు శీత నగమధ్యస్థమ్ము నౌభారత**
**క్షితివ్యాపించి, మహత్తరంబుగను, ప్రాకెన్ ఖండ ఖండాంతర**
**స్థితముఖ్యంబగు పల్లెపత్తనములన్ దేదీప్యమై బౌద్ధ సం**
**స్కృతి వైజ్ఞానిక కేంద్రముల్ నిలిపివాసిన్ జెందెమున్నెన్నడో."[1]**

**మ॥ "స్తవనీయంబగునట్టి కేంద్రమిట సంస్థాపింపగానోపు, నీ**
**దివి సీమాంతర ఘంటశాలపురి, జాతీయ ప్రభావోద్దీప్తవా**
**యువులన్ బిలిచి, నిల్వ ద్రొక్కుకొని, నూత్నోత్సాహచైతన్య వై**
**భవముల్ గ్రమ్మఅ నిండ వెల్గెను కళా ప్రాశస్త్య సంస్థాళిచే ॥"[2]**

**చ॥ "ప్రవిమల శీలురున్ సహజ పాండితియున్ గలమేటి దేశిక**
**ప్రరువలుగల్గు సంస్థ, ప్రతిభాసముపేత కళా సరస్వతీ**
**భవనము పాఠశాలయిది, పండుగగా నిటనేడు వార్షికో**
**త్సవమును సల్పుచుండిన బుధప్రవరుల్ పిలువంగ వచ్చితిన్."[3]**

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3 పద్యాలు

అని పలికి ఉపన్యాసము చివరలో కవుల గురించి ఒక గేయము వ్రాసి పాడిరి.

**“తఅలిరావయ్య - మా - దరికీవుసత్కవీ**
**పఅుగిడిపోవ - నం - బర వీథిరాలేము** ॥తఅలి॥
**చరచరాభావ సంచారమ్ము సేయమె**
**చ్చరురమ్ము, కష్టని - ష్ఠురముల నాలింప** ॥తఅలి॥
**నీలమేఘాలలో - పాలవెన్నెలలో**
**తేలియాడెదుకవీ - ఓలలాడెదు సుమీ।**
**ఏలోకమున నుంటివో - నీ భావ**
**నాలోకమునకేము - నడచి రాలేము** ॥తఅలి॥
**భావసామ్రాజ్యాన - పట్నమ్ము గట్టుకొని**
**పల్లకీ నూరేగ - పలువరించెదుకవీ !**
**రావయ్య! స్వీయ సామ్రాజ్యంబునన్ బ్రజా**
**సేవ చేసి తరింప - నీ విశాల జగాన ”[1]** ॥తఅలి॥

ఈ కవులు పండితులు, చారిత్రకులు మనకోసం వ్రాయాలి. లేకపోయిన లాభంలేదు. మనదాంధ్రదేశం. ఇప్పుడు విశాలాంధ్రమై, ఆంధ్రప్రదేశ్ అనే పేరు క్రింద వ్యవహరింప బడుచున్నాము. మన జాతికి ప్రత్యేక జాతీయ సంస్కృతి ఉన్నది అదిపోనీయక, విద్యార్థి దశ నుంచి కట్టుకు రావాలి. అప్పుడు సరియైన ఆంధ్రులము. అని ఈ విధంగా ఉపన్యసించిరి.

హిందూ మత బాల సమాజము - వివేకానంద మందిరము మచిలీపట్టణము వారి ఆధ్వర్యములో స్వస్తి శ్రీ హేవళంబి నామ సంవత్సర మార్గశిర శుద్ధ ౧౦ ఆదివారం 1-12-1957 సా॥ 4.00గం॥లకు గీతాజయంత్యుత్సవ సందర్భములో ఉపన్యసించిరి.

ది.10-8-1979 శ్రావణ శుక్రవారం సాయంత్రము 6 గం॥లకు బందరు ఖొజ్జిల్లిపేట శ్రీ నాగేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణములో ‘శ్రీ మంజీరము’ గ్రంథావిష్కరణ సభలో ఉపన్యసించిరి[2].

దానిలో వీరు ప్రారంభములో

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి - గేయము

"స్మరియింతున్ తొలుదొల్త, చెళ్ళపిళ్ళ వంశస్వామి, శ్రీ వేంకటే
శ్వరపాదాంబుజ కావ్య సేవఫలమై సారస్వతౌన్నత్య, సు
స్థిర కీర్తిన్ మనినట్టి, సత్కవుల, లక్ష్మీకాంతునిన్, వేంకటే
శ్వరునిన్, మాన్యుని విశ్వనాథుని సభా ప్రారంభకాలమ్మునన్."[1]

అని ప్రార్థన చేసి, ఈ మంజీరము గ్రంథకర్త శ్రీ భమిడిపాటి లక్ష్మీ నృసింహశాస్త్రిగారు వారితో గ్రంథములోని విషయాలను ప్రస్తుతిస్తూ,

గీ॥ "సహజవంశాను పూర్విక సాహితీ వి
శేష, సుకవిత్వ ధారా విశేష మివ్వి
పట్టువడె, పూర్వజన్మ సంపదగనేడు
జేతికందె సువర్ణ మంజీరమొండు"[2]

ఆమంజీరమా !

క॥ "శ్రీ మంజీరము, లలితాం
బా మృదు పదయుగళ భక్తమందారము, చి
త్సీ మాష్టాదశ పీఠ శ్రీ
ధామము, భావితము, సేవితము, తారకమున్"[3]

"ధీరా! రమ్యామృతపద
ధారన్, తన్మయత, దేవతా పీఠములన్
శ్రీ రాజిలు, దేవీ మం
జీరము రచియింప నారసింహ మేలయెన్."[4]

"పేశల ఫణితిన్ భక్త్యా
వేశమున, సమాసమింతవీడక, పటు మే
ధా శక్తి గ్రుక్క ద్రిప్ప కే
ఆశువుగా పల్క తరమయా ! నరసింహా !"[5]

"సుందరతరమగు అందెయ, యిది
అందము చందముల వర్ణనాతీతము, పే
రందిన పదునెనిమిది పీ
ఠేందిర సుందర విభూషలివి, కనుమనుదే !"[6]

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3, 4, 5, 6 పద్యాలు

**"నూపురమున్ గొని, దేవీ**

**గోపురములు జుట్టి, చూడగోరు కవి యితం**

**డే పూజారి యొ, మరి లే**

**దా! పారాణిని రచించు తరుణీ మణియో! (ధన్యాత్మ యొకో!)"[1]**

అని పద్యములు వ్రాసి చదివి, ఈ అష్టాదశ పీఠేశ్వర పూజారి మృదు వాగమృతముగా జారిన యీ మంజుల మంజీర ఝుణ ఝుణ ధ్వనులను, శ్రవణానందముగా గ్రహిద్దాము - తరిద్దాము అని తమ ప్రసంగమును ముగించిరి.

ఉత్కళ విశ్వకళాపరిషత్తు - శ్రీ కళ్ళికోట కళాశాల ఆంధ్ర తెలుగు విద్యార్థి సారస్వత సంఘ ప్రారంభోత్సవ సభలో 29-11-1963 శుక్రవారం సా॥ 5.30 గం॥లకు ఉపన్యసించిరి. ఈ సభకు అధ్యక్షులు బ్రహ్మశ్రీ విశ్వనాథ వరాహ నరసింహ శాస్త్రి గారు. కులపతి శ్రీ నరసింహపాడ్ గారు.

ఉత్కళ ప్రాభవ శ్రీ కి నమో వాకములర్పించి,

**సీ॥ " చిలక సరోవర జలపూర్ణ**

**శాలరాజాన్న ప్రదాత్రి సౌఖ్య ప్రదాత్రి**

**నిర్మల మందాకినీ సమదివ్య**

**మహానదీపూత విద్యాప్రదాత్రి.**

**అరివీర కంఠీ రవా శోక నృప వీర**

**సామ్రాజ్యలక్ష్మీ ప్రసన్న నేత్రి**

**జయదేవ సంగీత లయ నృత్య**

**నిర్ఘరీనాద సంగీత గాంధర్వగాత్రి**

**శ్రీ జగన్నాథ దేవరక్షిత ధరిత్రి**

**పూజ్య భువనేశ్వరీ పూరీ భూషణమ్ము**

**ఉత్తమ కళా నిధానమ్ము, ఉత్కళ ప్రదేశ**

**మాతకు, నానమస్కృతులు నేడు."[2]**

కావేరి అరవలకు, గోదావరి రాజరాజనరేంద్రాది కళాదిగ్దంతులకు, కృష్ణ పట్టాభి, ప్రకాశం, వెంకటప్పయ్యల వంటి మేధావులకు, గంగ సమస్త మేధావులకు, యీ మహానదీ జలము మేధా వంతులైన,

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

ఉత్కళ మణి గోపబంధుదాసు, ఉపేంద్ర మంజు, వి.జి. పట్నాయక్, చిరస్మిత్ర, మా పట్టాభి గారి మిత్రులు, మెహతాబ్, మా జైలు మిత్రులు శశిభూషణరథో, మహాదాత విద్యా ప్రసాద్, విక్రమ దేవ వర్మలకు పూజ్యస్థానము. 'అని శ్రీ శర్మగారే ఈ పద్యాల క్రింద వ్రాసి ఉండిరి ఉత్కళ అదృష్టము. ఈ ఏడు కాంగ్రెస్ సమావేశము - భువనేశ్వర్‌లో' అని వ్రాసి యుండిరి.

**"అరి రక్తసిక్త ఖడ్గాయుధకరము**
**సంధించె భిక్షాన్నమర్థించు పాత్ర**
**సన్నని పట్టు వస్త్రములు ధరించెడి.**
**తనువు కాషాయ వస్త్రములు దాల్చె**
**రత్నకిరీట విరాజిత శిరము**
**ముండనమయి ముసుగు నిండార దొడగె**
**పదమింత ధాత్రి మోపని పుట్టుభోగి**
**ప్రాసాదము దిగి, పాదచారియయ్యె**

**సర్వసర్వం సహారాజ చక్రవర్తి**
**త్యాగమొనరించి బౌద్ధ సన్యాసియయ్యె**
**నట్టి పుణ్య యశోకు ( గన్నట్టి కీర్తి**
**వల్లి శ్రీ కళింగ ధరిత్రీమ తల్లి**
**దర్శనము సేయగంటి! వందనము గొమ్ము ॥"[1]**

తన సర్వస్వము త్యాగమొనరించిన బౌద్ధ సన్యాసియైన అశోకుని కన్నట్టి కీర్తి వల్లి శ్రీ కళింగ ధరిత్రీమ తల్లిని వీరు దర్శించుట వందనమాచరించుటలో వీరి దేశ భక్తి వెల్లడియగుచున్నది. మన మాతృదేశము పట్ల ఎంత గౌరవముగలదో కళింగ దేశముపట్ల కూడ వీరికి అంతే గౌరవము కలదని స్పష్టమగుచున్నది. వీరికి తన, మన అను భేదములు లేవు.

అంతేగాదు ఈ నాడు ఆంధ్రులలోగల ప్రాంతీయ భేదాలు ఆనాడు లేవని ఈ క్రింది విధముగా స్పష్టపరచుచున్నారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

"ఏక గర్భ సంజాతులైయింపు మీఱ
నాంధ్రు లుత్కళులొకట సమైక్యమైచ
రించిరీ పుణ్య భూమి, వారికి మదీయ
హృదయ పూర్వక పుష్పాంజలిదియె నేడు ॥"[1]

ఒకే గర్భమున పుట్టిన వారి కంటె కూడ ఆంధ్రులు, ఉత్కళులు సమైక్య భావముతో మెలగుచున్నారట. కనుక ఉత్కళ పుణ్యభూమియట. అందుకని తాను హృదయ పూర్వకముగా పుష్పాంజలి సమర్పిస్తున్నానన్నారు.

"సకల ప్రాభవ వైభవోన్నత కళా సంపత్తితో, కల్లికో
ట కళాశాల సరస్వతీ సతికి కంఠ శ్రీమణీ భూషమై
యకలంకోజ్జ్వల సాహితీ హృదయ నిత్యానందమున్ ధాత్రిఁబా
యక, విద్యార్థులు, గాంత్రుగావు తసదా। యధ్యాపకాశీస్సులన్."[2]

సారస్వతము గద్యముగా, పద్యముగా, గేయముగా పదముగా మనలనుత్తేజ పరుస్తుంది. సారస్వతం, సంస్కృతం, కావచ్చు. తెలుగుకావచ్చు. ఉత్కళ (ఒరియా) కావచ్చు, హిందీకావచ్చు. పంజాబీ కావచ్చు. యింగ్లీషు కావచ్చు కాని అన్నిట భావము సార్వకాలికముగా, సర్వగుణ సంపత్తితో, సకలానంద ప్రదాయిగా రూపొందుతుంది.అని మాట్లాడి వీరి ఉపన్యాసమును ముగించిరి. వీరికి దేశంపట్ల తరతమ భేదములెట్లు లేవో భాషపట్లకూడ తనమాతృభాష - పరాయి భాష అనే భేదభావములులేవని తెలియుచున్నది. భాష వేరైన వారు వ్యక్తముచేసే భావం ఒకటే. భావము మనకు ముఖ్యముకాని అది ఏ భాష అయితేనేమి అనేది వీరి భావన.

శ్రీ రాఘవశర్మగారు తన కవితాగానముచే సభికులను ఎంతగా రంజింపచేసెడి వారంటే అందుకు ఉదాహరణముగా శ్రీ కౌముదీ పరిషత్ సమావేశము-విజయనగరంలో ఉపనిషద్ విహార్‌లో 3-12-1963సం॥ సాయంత్రం 5.30ని॥లకు జరిగిన విద్వజ్జనసభలో శ్రీ గురుజాడ అప్పరాయ మహాకవి గురించిన ప్రశంసచేసిరి. ఆ కవితాగానమునకు పరవశులై శ్రీ రాఘవశర్మగారిని గూర్చి శ్రీపంతుల లక్ష్మీ నారాయణశాస్త్రిగారు,

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

"కౌముదీ పరిషత్సభాంగణము నందు
కలిగెనేటికి గురుజాడ కవన గోష్ఠి
ఇట్టి గోష్ఠులు నాకు లభించునెడల
నెన్ని జన్మలనైన నేనెత్తగలను
వలదు స్వర్గమ్ము, మోక్షమ్మువలదు నాకు".[1]

అని కీర్తించినారు దీనిని బట్టి శ్రీ శర్మగారి సభానిర్వహణ, కవితాగానము ఎట్లుండెడిదో తెలియుచున్నది.

న్యూఢిల్లీలో 10-9-1964 సం॥లో సా॥ 4గం॥లకు కవితా గోష్ఠిలో ఆంధ్రవనితా మండలి తరుపున పాల్గొనిరి. అక్కడ వ్రాసిన

గీ॥ "భర్తతోడిదె లోకమ్ము, భారతీయ
యువతి ధర్మమ్మునాగ, నుద్యోగ ధర్మ
పాలకుండయి, కదలెడి, భర్తవెంట
ననుగమించు, మాణిక్యాంబ అమలసతికి
వీడుకోలొసగుట లు చూడ, వేడుకగద."[2]

అంటారు. వీరు వ్రాసే పద్యములలో భారత దేశ స్త్రీ ధర్మము దీని యందు చెప్పడినది.

"ఐక్యత లేదటంచు పరిహాసము జేతురు, ఆంధ్రులందు, నీ
వాక్యము సర్వదా కడు అబద్ధము కాదది కానిపట్టగా
శక్యము గాని తెల్విగలజాతి, మఱందున, బెక్కురైన నీ
యైక్యత యెట్లు సేకుఱునటెన్నో యనుటల్ సహ జమ్మది వేఱు స్త్రీలలో"[3]

ఆంధ్రులలో ఐకమత్యము లేదని పరిహాసము చేస్తారు. ఇది అబద్ధము. పట్టుటకు శక్యముగాని అంత తెలివి గల జాతియట భారతజాతి. ఇది స్త్రీల విషయము వేరు. అని స్పష్ట పరచిరి. ఎందుకనగా స్త్రీలు సహజము ముగ్గురు ఒక చోట కలవరనునది నిర్వివాదాంశము. ఇంత మాత్రము చేత ఆంధ్రులలో ఐక్యమత్యములేదని అనకూడదు. అది అబద్ధము అని నొక్కి వక్కాణించిరి.

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3 పద్యాలు

ఢిల్లీలోనే 1964సం॥ సెప్టెంబరు 21వ తేదీ సోమవారం సాయంత్రం 6-15ని॥లకు రసనా సమావేశములో వీరు పాల్గొనిరి. ఈ సభకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డాక్టరు బెజవాడ. గోపాలరెడ్డిగారు. ఈ సభలో ఆంధ్రమాతను, ఆంధ్రదేశాన్ని ప్రశంసిస్తూ ఎన్నో పద్యాలు వ్రాసిరి. అందులో వీరు నివసించిన బందరు పట్టణమంటే మరీ అభిమాన మెక్కువ.

**"తన యద్వితీయ మేధా శ్రీల శ్రితపాళి**
**బూర్ణ కాముల జేయు భోగరాజు**
**తన దివ్యపూర్ణ బోధా సమలక్షణా**
**కృతుల నాకర్షించు కృష్ణరావు**
**తన దివ్యదేశ విద్యా వైభవ శ్రీల**
**మహిమజాటిన హనుమంతరావు**
**తన వాక్సుధాధార ఘనరాజకీయమ్ము**
**జిప్పిల వర్షించు, చెఱకువాడ**
**గీ॥ ఇట్టి వారెందరినొ, గన్నయట్టితల్లి,**
**ధన్యురాలవు నీవు బందరు పురమ్మ!**
**ధన్యులము మేము నీదు సంతానమగుట**
**స్వీకరింపుమ, మా నమస్కృతులు నేఁడు!"[1]**

భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు, ముట్నూరి కృష్ణారావుగారు, చెఱకువాడ నరసింహం పంతులు మొదలగు వారెందరినో కన్నతల్లి. ఓ బందరు పురమ్మ నీవు ధన్యురాలవు. నీ సంతానమగుట వలన మేము ధన్యులము అని నమస్కృతులొనరించుచున్నారు. దీనినిబట్టి వీరు నివసించిన బందరు పట్టణము అంటే, ఎంత ప్రేమయో వెల్లడి యగుచున్నది.

6-12-1965 సం॥లో గీర్వాణ వాణీ ప్రచార సమితి - ఆగిరిపల్లి వారి వార్షికోత్సవ సభలో ప్రసంగించిరి

**"వాణీ! వీణా పుస్తక**
**పాణీ! విద్యా ప్రపూర్ణా! భావిత ఘనక**
**ల్యాణీ! వనరుహసంభవు**
**రాణీ! గీర్వాణపాణి! ప్రార్థింతుమదిన్."[2]**

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

అని ప్రార్థన చేసి ఎన్నో పద్యాలు వ్రాసిచదివిరి. వానిలో శ్రీ ఆగిరిపల్లిలో విలసిల్లుచున్న శోభనా చలపతిని గూర్చిన ప్రశంస

**"సులలిత మందహాస! పరిశోభిత దివ్యముఖాబ్జ! సత్కృపా**
**కవిత కటాక్ష వీక్ష! యరికంఠ విలుంఠనదక్ష! కాంచనా**
**చలసమవక్ష! భక్త జనసన్నుత! ఆగిరిపల్లి శైల స**
**ద్విలసిత శోభనా చలపతీ! నిను సన్నుతి (జేతు శ్రీపతీ!"[1]**

**"స్థిరభక్తిన్ భజియించు భక్తులకు లక్ష్మీనారసింహుండవై**
**యరి వర్గంబునకున్ భయంకరము నౌ వ్యా ఘ్రుంబ వౌదీవు ఆ**
**గిరిపల్లీ నిలయా! కృపానిలయ! నిన్ గీర్తించెదన్, దివ్య ర**
**మ్య రమాశోభిత దేహ! వ్యాఘ్రు నరసింహా! శోభనాద్రిప్రభూ!"[2]**

ఈ విధముగా ఆగిరిపల్లియందున్న నారసింహ ప్రభుని నుతించి కార్యక్రమము ముగిసి ఇంటికి వచ్చుచుండగా దారిలో కాగితాలు, బట్టలు పెట్టుకొని తీసికొని వెళ్ళిన పెట్టెపోయింది. దానికి బాధ పడిన వీరి హృదయము భక్తిపూరితమై వెలువడిన పద్యామృత గుళికలు:

**"అమ్మా! శారద! త్వత్స్వరూపమును నిత్యమ్మున్ స్మరింతున్ గవి**
**త్వమ్మై, నా హృదిజాలువారినవె; గ్రంథమ్ముల్, కనంగల్గు భా**
**గ్యమ్మున్ గల్గినవారు, గౌరవమిడంగా (బొంగితిన్ వేగ రా**
**వమ్మా! దాగుడుమూతలాడక, మదీయ ప్రాణ మీవే కదా!"[3]**

ఓ తల్లీ! శారద! కవిత్వ రూపములో నీ స్వరూపమును నిత్యము స్మరించుచుంటాను. నీ స్వరూపమును తలంచుట చేతనే అది కవిత్వమై జాలువారి గ్రంథరూపము పొందినది. ఆగ్రంథములు చూడగలిగిన భాగ్యము గలవారు గౌరవిస్తాము రమ్మంటే సంతోషించితిని. నీవు నాతో దాగుడుమూతలాడక వేగమే రమ్మ తల్లీ! అంటారు. పుస్తకములు పోవటం ఆ తల్లి వీరితో ఆడుకునే దాగుడుమూతలాటట. ఎంత చక్కని మనోహర భావము. వేగమే రావమ్మా అని ప్రార్థించిరి.

ఇక ఆగిరిపల్లిలోనున్న నరసింహస్వామిని,

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3 పద్యాలు

"కరుణాలుండు, శుభప్రదుండు, నిజ భక్త ప్రేరకుండైన ఆ
గిరిపల్లీ నరసింహమూర్తి, యనురక్తిన్ బిల్చి రావించె, ద
త్పురగీర్వాణ సరస్వతీ నిలయమందున్ గోష్ఠిగా వింప, స
చ్చెరు వొకాంచగ వాని లీలలు, పరీక్షింపన్ననున్ జీరెనే!"[1]

"తానొక దొడ్డకొండయని, తద్గిరియెంతొ పవిత్రమంచుఁ దత్
స్థానము జేర జన్మమది ధన్యమటంచు ఁ దలంచు ఁ బొంగితిన్
మానసమందు, తత్పురమునన్ గల పండిత కోటి యెంతొ, స
మ్మానముతోడ ఁ బిల్వన్ నభిమానముకల్మి, బ్రయాణమైతిఁగా."[2]

కరుణా సముద్రుడైనవాడు, శుభప్రదుడైనవాడు తన భక్తులను ప్రేరేపించి నడిపించువాడునైన శ్రీ ఆగిరిపల్లినారసింహస్వామి తన పట్టణములో జరుగు గీర్వాణ వాణీ నిలయములో కవితాగోష్ఠి గావించుటకు ఎంతో ప్రేమతో ఆహ్వానిస్తే వచ్చాను. పరిశీలించినచో ఆయన లీలలు చాలా అద్భుతముగా నున్నాయి. పరీక్షించుటకు నన్ను జీరెనా?

భగవంతుడు భక్తులను పరీక్షించిగాని వదలడు. ఎట్టి పరీక్షలకైనా తట్టుకోగలవారే భక్తులు. పుట్టుక నుండి విష్ణు భక్తి గలిగిన ప్రహ్లాదుని భగవంతుడు పరీక్షించి యే రక్షించినాడు గదా! 'జీరెనా' అను పదము వాడుకలో హిరణ్య కశ్యపుని విష్ణుమూర్తి ప్రేగులు చీల్చిన సన్నివేశమును కళ్ళకు కట్టించును. ప్రేగులు చీల్చినంత బాధకలిగినది గావుననే ఈ పద్యములో 'జీరెనా' అను పదము ఆశువుగా దానంతట అది పడియుండి ఉండును. భక్తికి పరాకాష్ఠ ఇదియేనేమో!

ఆయన ఒక దొడ్డ కొండ అని, ఆగిరి ఎంతో పవిత్రమైనదని, ఆ స్థానమునకు వెళ్ళుట జన్మధన్యమని తలంచి పొంగిపోయాను. పైగా ఆపట్టణమందలి పండితులు ఎంతో గౌరవముతో అభిమానముగా పిల్వగానే ప్రయాణమైవచ్చాను.

"పయనింపన్ దొరకొంటి, పుస్తకములున్ వస్త్రమ్ములున్ బెట్టెనెం
తయు జాగ్రత్తగ నింపి, వాహనముపైనన్ వైచి నిర్దేశ ప
ల్లియకున్ జేరితి!గందుకంబెచట దొర్లెన్ జెప్పలే వైతివే
మయ! నీకున్ జెలగాటమాయిది! యిటుల్ మాయింప ధర్మంబయా !"[3]

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3 పద్యాలు

పుస్తకములు, వస్త్రములు పెట్టెలో జాగ్రత్తగా నింపి వాహనముపై వేసి ఈ ఆగిరిపల్లివచ్చాను. ఎచ్చట దోషమున్నదో చెప్పకుంటివి. నీకు చెలగాటమా! ఈ విధంగా మాయజేయుట ధర్మమా!

**"దోసంబేమి యొనర్చినాడనయ! నాతో వాదయా! నీకిటుల్**
**దాసుండన్ గద! గంపెడాస నిను సందర్శింపనేతేర నీ**
**మోసంబేమయ! గాసి జెంద యిది యేమీ నీకు మర్యాదయా!**
**కాసంతైన విడంగ బోరు నిను, బల్కంగా, కథల్ కట్టుచున్."[1]**

నేను ఏం తప్పు చేశాను ? నాతో వాదులాట యా! నీ దాసుడను గదా! గంపెడాసతో నిన్ను చూడాలని వచ్చిన నన్ను ఇట్లా మోసం చేస్తావా! నేను బాధచెందితే నీకు మర్యాదయా? నీ గురించి చెప్పుకొనేటప్పుడు కథలుకట్టి కొంచెమైన చెప్పుకోకుండా ఉండరులే! ఇక్కడ వ్యాజనిందాస్తుతి కన్పడుచున్నది.

భగవంతుడు తనను స్మరించకపోయినా ఊరుకుంటాడుటగాని తన భక్తులను బాధపెడితే ఊరుకోడంటారు. మరి ఇది యదార్థమైతే నేను నీ భక్తుడినే కదా! అని చెప్పటం జనులు కథలు కథలుగా చెప్పుకొనేటప్పుడు నిన్ను స్మరిస్తూ నీ చేత ఒక భక్తుడు మోసగింపబడ్డాడని నన్ను కూడ చెప్పుకుంటారులే అని ఒక భావన. ఈ పద్యములో దాసుండన్ అంటారు. వీరిలోని దాసభక్తి స్పష్టమగుచున్నది.

ఏదో మహానుభావులనాశ్రయించే వరము లభించి ఈ మానవ జన్మకలిగెను. అందునా కవితా ప్రవాహమది సంపాదించుట ఈ సారస్వతపు నిధిని పెక్కు గ్రంథాల రూపములో నిల్పుట, నేడు ఈ సాధించిన గ్రంథములు కళ్ళకు కనబడకుండా చేయుట ధర్మమా! అనుచున్నారు.

పూర్వజన్మ పుణ్యావశమున సత్పురుషుల సాంగత్యము లభించును. ఆ పుణ్య వశముచేతనే మానవ జన్మ లభ్యమైనది. అందులోను కవిత్వము వ్రాయగల్గు అదృష్టము నీ అనుగ్రహము వలననే లభ్యమైనది. ఇన్ని గ్రంథాలు వెలువడినాయి లోకంలో నిలిచినాయి అంటే అంతా నీ అనుగ్రహమే. ఈ రోజు అవే గ్రంథాలు కళ్ళకు కనబడకుండా చేసినవాడివే నీవే సుమా! శివుని ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదంటారు గదా! గ్రంథాలు కనబడకుండా చేయటముకూడా ఆ పరమాత్మ వంతే అనుట.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

గీ॥ "ఏమి పున్నెమ్మొ నర్చితి నేమొ! మున్న
సరస సారస్వత ధనమ్ము ప్రాప్తమాయె,
సంగ్రహింప (దలంప, దోసమ్ముకాదె!
మాది మాకివ్వ మర్యాదగాదె నీకు,
భక్తమందార! నరసింహ! భవ విదూర!"[1]

ఏమి పుణ్యము చేశానో ఏమో! సరస సారస్వత మనెడి ధనము లభించినది. అది నీవు దొంగిలించాలని తలంచుట దోషమ్ము కదా! మా వస్తువు మా కివ్వటం నీకు మర్యాద కదా! అంటారు.

వీరి కృష్ణ భక్తి యిందు వెల్లడియగుచున్నది. నీవు వెన్ననే దొంగిలించావంటే ఈ రోజు సారస్వతాన్ని కూడా దొంగిలించావు. అయినా నా వస్తువు నా కివ్వు అని తాను నమ్మిన దైవాన్ని స్వతంత్రముగా అడుగుట. ఒక పిల్లవాడు తల్లిని మాత్రమే ఇట్లా అడుగగలడు. మరల భక్తుడు భగవంతుని అడుగ గలడు. ఎంతో భక్తి లేకపోతే ఈ మాటలు దొర్లవు. చక్కని నుడికారముగల ఈ పద్యము మనోహరము.

3-8-1965 సం॥లో మంగళవారం సాయంత్రము 4.40ని॥లకు శ్రీ కోనసీమ భానోజీ రామర్సు కళాశాలలో జరిగిన సాహితీ సమితి సమావేశంలో పాల్గొని పద్యాలతో ప్రశంసించిరి. దీనిలో ఆ కోనసీమ వైభవాన్ని చక్కగా వర్ణించిరి

"ప్రాణి సంజీవన పావన శ్రీ గౌత
మీనదీ జలపూర్ణ కోనసీమ।
సత్కళారాజిత సంతతా నంద ల
క్ష్మీ నివాసమ్ము శ్రీ కోనసీమ
వేద విద్వద్గణా న్వితము, సారస్వత
కోవిద నిలయమ్ము కోనసీమ
ప్రథిత నారికేళ రంభా మ్ర తరుఫలో
ద్యానవనమ్ము శ్రీ కోనసీమ
రమ్యతరము, సస్యశ్యామలమ్ము, శార
దానివాస ప్రదేశమ్ము కోనసీమ
తనరు తత్సీమ కెల్ల భూషణ మనంగ
ప్రవిమలానంద పురమమలా పురమ్ము
కంటి యానందమున్ గంటి, మంటినేడు."[2]

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

విశ్వహిందూ పరిషత్ అమలా పురంశాఖ ప్రారంభోత్సవ సభ 19-12-1965 వ సంవత్సరంలో సాయంత్రం 5.30ని॥లకు వీరి అధ్యక్షతలో జరిగినది. వీరు అధ్యక్ష స్థానంలో నుండి పల్కినదీ క్రింది పద్యము".

**"ప్రాపయి ఋష్య సంతతికి, ప్రాజ్ఞులకున్, నిగమ స్వధర్మ సం**
**స్థాపన కాది మూలము, సనాతనమై, సకలార్థ సాధకం**
**బై, పరమోత్తమంబయి, శుభప్రదమై, చెలువారు, విశ్వహిం**
**దూ పరిషత్ ప్రజాహితతతో హితమై యిల వ్యాప్తి, జెందుతన్."[1]**

ఋష్య సమూహమునకు, ప్రాజ్ఞులకు స్వధర్మములకు మూలమైనది. సనాతనమైనది. సకలార్థ సాధకం బైనది. పరమోత్తమమై శుభప్రదమై చెలువొందు విశ్వహిందూ పరిషత్ ప్రజాహితోపకారకమై ఇల వ్యాప్తి చెందుగాక అని ఆశీర్వదించిరి. ఒక సంస్థ అందులోను సనాతన ధార్మిక సంస్థ నిత్యనూత్నముగా వెలుగొందాలని వీరు మన స్ఫూర్తిగా కోరుకొనిరని తెలియుచున్నది.

కైకలూరులో జరిగిన సభలో వీరిని గురించి శ్రీమాన్ ఎస్.టి.పి.వి. రాఘవాచార్యులు,

**"తిరిగితి నేను పంతమున దేశములెల్లను అందునందు, న**
**బ్బుర మొనరించు పండితుల పూజ్యుల సత్కవులన్ సధర్మ వి**
**స్ఫురితుల దాన శీలురను చూచితి గొప్పవారి మీ**
**పటువము వారిలోన గను పట్టదు శ్రీ గురుజాడ రాఘవా!"[2]**

నేను పంతముతో ఎన్నో దేశాలు తిరిగాను. ఆశ్చర్యము కలుగునట్లుగా పండితులను, సత్కవులను, ధర్మసంచారులను, దాన శీలురను, గొప్పవారి నెందరినో చూచాను. మీ పటువము వారిలో కనబడదు అని ప్రశంసించిరి.

దీనిని బట్టి వీరు సభలనెట్లా తన కవిత్వముతో రంజింప జేసెడి వారో తెలియుచున్నది. వీరి వయస్సు కంటే ముందుగా పరుగులు తీస్తుంది. వీరి కావ్య కన్యక. ఆశువుగా అప్పటి కప్పుడు వ్రాసి పద్యాలతో నోలలాడించడమే వీరి సభా రంజకత్వము.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

**"కూడికలైన సంపదల క్రొంజిగురాకులఁ బూలుగాయలై**
**వాడని పండ్లు నై సుకవి వర్గము (గ్రోలెడి తేనె బావులై**
**పోడిమి నూత్న హర్షములు మూసలు పోసిన మంగళమ్ము లై**
**యోడికలై భవత్ప్రతిభ నొప్పనుగాత దిగంతరమ్ములన్.**
**ఆదరణీయ ధర్మసుపథాను గతుల్ స్వమత ప్రచారవీ**
**క్షాదృతులుంగ వీంద్రులు, యశః పరిపూర్ణ దిగంతరుల్ సు పౌ**
**త్రాది సమాన సంపదల నంది సుఖింతురుగాత, మీరు, ల**
**క్ష్మీదరహాస కాంతి వెలికించితముల్‌సొగసుల్ వెలార్చుచున్."[1]**

అని వీరిని ఆశీర్వదించిరి.

ఈ విధముగా వీరి అధ్యక్షతతో జరిగిన సభలు, వీరు పాల్గొని ఉపన్యసించిన సభలు ఎన్నో. ప్రతి సభలోను, సందర్శించిన ప్రదేశములోను, సందర్శించిన వ్యక్తిని, సందర్శించిన దేవతలను గూర్చి వ్రాసిన పద్యాలు, సందర్శించిన క్షేత్రములు, ఆ దేవతల కర్పించిన పద్య సుమహారములు, కృతజ్ఞతలు అన్నియు ఛందో బద్ధమైన కవిత్వములోనే. శ్రీ సరస్వతీ దేవి వీరి నాలుకపై నడయాడేది. సుమధురమైన కవిత్వము, గొంతు, వాక్కు అన్నీ కూడ ఆ తల్లిదయయే అని వీరి నమ్మకము.

## 1.18 సభలు - సన్మానములు: -

కవిశేఖర శ్రీ గురుజాడ రాఘవశర్మ ఎన్నో సభలలో పాల్గొని సన్మానములు పొందిన మహోన్నత కవి, పండితులు. వీరు 1964 సంవత్సరంలో సెప్టెంబరు 21 సోమవారం సాయంత్రము 6-15 నిIIలకు ఢిల్లీలో బెజవాడ గోపాలరెడ్డిగారి అధ్యక్షత క్రింద ఏర్పాటు చేసిన సభలో సన్మానింపబడిరి. శ్రీ బెజవాడ గోపాలరెడ్డి తమ అధ్యక్షోపన్యాసము చేస్తూ వీరి గురించి, " శ్రీ శర్మగారు బందరులో శ్రీ పట్టాభిగారు, కోపల్లె హనుమంతరావు పంతులుగారు, చెఱుకువాడ నరసింహం పంతులుగారి వంటి పెద్దల క్రింద ఉత్సాహముతో పనిచేసి ఉత్తేజకరమైన రాజకీయ జీవితం గడిపారు. ఆ రోజులలో శ్రీ శర్మగారు, దేశోద్ధరణ కార్యక్రమములో నిర్మాణ క్రమములో పనిచేసినవారు. వాలంటీయరుగా నిర్మాణాత్మక కార్యరంగంలో ప్రముఖ పాత్రగా పనిచేస్తూ ఉండేవారు. ఈయన మంచి కవి. కవియేగాదు, కవిశేఖరుడు కూడ. వీరు ఎన్నో కావ్యాలు వ్రాశారు. శ్రీ కృష్ణభక్తుడు. పోతన్నగారి వలె కవిత్వం వ్రాస్తాడు. ఆ రోజుల్లో ఒంటిపై చొక్కాలేకుండా ఖద్దరు బట్టలు

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

భుజాన వేసికొని , వాడ వాడల తిరిగిన కార్యశూరుడు. నిరాడంబరజీవి. ఆధిపత్య అధికారాలు కాంక్షించిన వాడుకాడు. నేనీ సభకు సాహిత్య అకాడమీ అధ్యక్షులుగా రాలేదు. శ్రీ శర్మగారి కావ్య, గానం విని వెళ్ళాలని వచ్చినాను." అని ఉపన్యసించి, సన్మానము సందర్భములో, ఈయన దేశం కోసం ఖద్దరుబట్టలు భుజానవేసికొని తిరిగారు. కాబట్టి ఈయనకు మణిల కానుకగా ఈ ఖద్దరు బట్టలు భుజాల మీద అలంకరిద్దాం అని చెప్పుచూ ఖద్దరు వస్త్రాలు ద్రవ్యముతో బహూకరించుచు ఖద్దరు వస్త్రములేగాక, యిట్టికవులకు ప్రోత్సాహ పూర్వకముగా, వాడని పూలుగా పూజకై యీ రూప్యములు కూడ స్వీకరించుడని యిచ్చుచున్నానని" ద్రవ్యము వస్త్రములు పెట్టిన పళ్ళెమివ్వగా స్వీకరించిరి. ఈ విషయములు శ్రీ శర్మగారే ఒక పుస్తకములో వ్రాసికొనిరి.[1]

ఈ సందర్భములో వీరు చేసిన సన్మానమునకు కృతజ్ఞతలు తెలుపుతు శ్రీ శర్మగారు,

**"సరస 'రసనా' ధురీణు లిందఱు మదీయ**
**సరస కవితా స్రవంతి సంబరమునన్ గ్ర**
**హింప జేరిరి, వారికి హృదయ పూర్వ**
**కమగు నా నమస్కృతి 'గృతజ్ఞత నేనొర్తు!"[2]**

**"తిక్కన ఓనమాల్ దిద్దిన నెల్లూరు**
**మండలెవ్వానికి మాతృభూమి**
**సహజ పరాక్రమ శాలురీమను, రెడ్డి**
**వంశమెవ్వాని పావనకులమ్ము**
**ఆంధ్రజాతీయ కళాలయ మెవని బా**
**ల్యమున బందరున విద్యాలయమ్ము**
**విశ్వకవీంద్రు, సువిఖ్యాత గురుపీఠ**
**మే సాధకునకు - విశ్వాసభూమి**

**తెలుగు తల్లికెవాడు, తీర్చినసుతుండు**
**భరత మాతకెవాడు, కావలయు ధనము**
**ప్రథిత సాహిత్య సేవ యెవ్వనికి సుఖము**
**మాన్యతగనె నెవనిచే అమాత్య పదవి**
**అట్టి గోపాలరెడ్డి అధ్యక్షు డాయె ॥"[3]**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి
2. శ్రీ గురుజాడ రాఘవ శర్మ వ్రాతప్రతి 2, 3 పద్యాలు

అని బెజవాడ గోపాలరెడ్డిగారిని ప్రస్తుతించిరి. ఆంధ్రుల గొప్పదనము ఆంధ్ర మాత వైభవాన్ని కొనియాడిరి. ఈ సభలో వీరికి చేసిన సన్మానమునకు ఆనందపడి,

**"సరసులు, పండితోత్తములు, సద్గుణ శీలురు, పూజ్యులీ**
**సభాంతరమున నేడు నాదు, కవితా రసమున్ గ్రహియించి, మించి సా**
**దరమున సత్కరించిరి, కృతజ్ఞుడ, ప్రేరణ గొల్పి వీరినం**
**దఱి సమకూర్చి నట్టి, 'రసనా' బుధమండలికిన్ జయమ్మగున్"[1]**

**"శ్రమసంసేవ యొనర్చు, రమ్య రసనా సామర్థ్య సాహిత్య సం**
**ఘములెన్నో కలవీపురాన, మఱి మృగ్యంబాంధ్రులందైకమ**
**త్యమటన్నన్ సహియింపబోము, సకలాంధ్ర శ్రీకళాపూర్ణ యౌ**
**సమయంబెంతటి దవ్వుకాదు, కలుగన్ సంకల్పమున్ గావలెన్."[2]**

**"ఇందరనేక భంగుల, వచించిరి పెక్కులు, నన్ను గూర్చి, ప్రే**
**మందల పోసి, కాంచన సమాన మనందగు గౌరవమ్మునన్**
**పొందుగ పద్యముల్, వచనముల్ ధనమున్ వెలయించి నారలా**
**నందమునన్, గృతజ్ఞుడ, ఘనంబగు, నా కిడినట్టి సేతకున్"[3]**

అని తమ కృతజ్ఞతలు తెలియజేసిరి.

1964 సం॥ సెప్టెంబరు 3వ తేదీన రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణగారిచే సన్మానము పొందిరి.

**"నీవు భారత రాష్ట్రాధినేతవు**
**భరత మాతృ పదాబ్జ సేవకు (డనేను**
**ఆంధ్రరత్నం బవీవు నేనాంధ్ర సుతు (డ**
**ప్రణతులివె, కొమ్ము! గురుజాడ రాఘవుండ**
**భవ్యచరిత! రాధాకృష్ణ పండితేంద్ర!"[4]**

అని ప్రస్తుతించిరి.

30-10-1965 వ తేదీ సాయంత్రము 4.00 గం॥ల వేళ కైకలూరు పంచాయతీ సమితి ఆఫీసు ఆవరణలో సన్మానముపొందిరి. ఈ సభకు కృష్ణాజిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీ పిన్నమనేని కోటేశ్వరరావుగారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3, 4 పద్యాలు

ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ - మధ్యనిషేధ, సాంస్కృతిక శాఖామాత్యులు శ్రీ ఎం.ఆర్. అప్పారావుగారు కాశ్మీరు శాలువ రూ.1,116/- ల రొక్కముతో వీరిని సన్మానించిరి. ఎం.ఆర్ అప్పారావుగారితో మాట్లాడుతూ, "ఈ కవిశేఖర రాఘవశర్మగారు సద్భక్తులు, పండితులు, కవులు. వీరి గ్రంథములు చదువ మొదలిడినాను. 9గం॥ల నుండి 2గం॥ల వరకు తీయకుండా అట్లాగే చదువ నాకర్షించింది. విడువ లేదు. వారిది ప్రజా కవిత్వము. పోతనగారి యొరవడి. వీరు 20వ శతాబ్దపు పోతన. ఇట్టి కవిని సన్మానించుట ఎంతయో ఆనందము. ప్రజలనుత్తేజ పరచేదే నిజమైన కవిత్వమ"ని చెప్పుచు సన్మానించిరి.[1]

**"సరసులు పండితుల్ కవులు, సద్గుణ భూరివ దాన్యముఖ్యులెం**
**దఱో దయజేసినారు, కవితల్ ప్రియమారగ నాలకించి సం**
**బరమున నెంతయేని బహుమాన పురస్సర దృష్టిగార విం**
**చిరినను, వారి సత్కృతి కశేష శుభమ్ముల కృష్ణు డోముతన్."[2]**

వీరు సన్మానము ను స్వీకరించిన పిమ్మట వారు చేసిన సత్కృతికి అశేష శుభమ్ములను శ్రీకృష్ణుడు కలిగించాలని ఆశీర్వదించి తమ కృతజ్ఞతలు తెలియజేసిరి.

**"అవనిన్ మానవజన్మ దుర్లభము, లభ్యంబైన, తజ్జన్మ భా**
**గ్య విశేషమ్ముగ , బెద్దలన్ గొలిచి విద్యాబుద్ధులన్ నేర్చి గౌ**
**రవమే పారగ, జీవితమ్ముగడుపన్ బ్రాప్తించు నొక్కప్డు పు**
**ణ్య విశేషమ్ముగ జీవికిన్ మిగుల సన్మానమ్ము లేనాటికో !"[3]**

ఈ భూమిపై మానవ జన్మ లభించుట దుర్లభము. ఒకవేళ మానవ జన్మలభించినా అదృష్టవశమున పెద్దలను కొలిచే భాగ్యము, విద్యా బుద్ధులు నేర్చి గౌరవము సంపాదించుకొని జీవితము గడుపుట ఎక్కడో ఒకప్పుడు సంప్రాప్తించును. అందులో ఇటువంటి సన్మానములు పొందగల్గుట నిజముగా జీవికి పూర్వజన్మ సుకృతము అని భావించిరి.

1965సం॥ డిశెంబరు 3వ తేదీ శుక్రవారం సాయంత్రము 6.00గం॥లకు ఘనస్వస్తి వాచకుల సన్మానసభ. దీనిలో వారి ప్రసంగము.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి
2. శ్రీ గురుజాడ రాఘవ శర్మ వ్రాతప్రతి 2, 3 పద్యాలు

**"వినదగు నెవ్వరు చెప్పిన - అదివేదము**

**శృతి - శ్రవణముచే హృదయానికి హత్తుకొనేది. వేదము.**

**శ్రేయోదాయకమౌ భవచ్చరణ రాజీవమ్ములర్థింతు ౘదం**

**డ్రీ ! యీ జన్మ తరింపనే పురుషు గీర్తింపంగనౌ! నట్టి శ్రీ**

**గాయత్రీ ప్రతిపాద్య వస్తువగు, సుజ్ఞానమ్ము నీవే వరా**

**మ్నాయోపాసితః సద్గురూత్తముడ! కృష్ణా! శ్రీ జగన్మోహనా!"[1]**

**"శ్రీయోగ ప్రతిపాద్య**

**శ్రీయుత సుజ్ఞాన నిలయ! చిన్మయకారీ!**

**మాయా విచ్ఛేదిత! శ్రీ**

**గాయత్రీ! వేదమాత! కరుణింపు ననున్!"[2]**

శ్రేయోదాయకములైన నీ పాదములందు ఈ జన్మతరింప జేయుటకు ఏ పురుషుని కీర్తింపవలెను. అట్టి శ్రీ గాయత్రీ ప్రతిపాద్యమైన వస్తువు, సుజ్ఞానము నీవే కదా! నీవే సద్గురూత్తముడవు. లేదా ప్రతిపాదితమైన మంచి జ్ఞానము నిచ్చుదానివి, మాయావిచ్ఛేదితము ఓ గాయత్రీ మాత ! నన్ను కరుణింపుము. అని ప్రార్థించిరి. వీరు చాలా ఛాందసులు. ప్రపంచ ప్రవృత్తి వీరికి తెలియదు. వేదములలో వీరెరుగని విషయాలెన్నో రహస్య విషయాలున్నాయి. వేదము సువేద్యమై ఎప్పుడు ఆనందమునే చేకూర్చును. వారు ఘనాపాఠులు ఎప్పుడు లోపల మననము చేస్తూ ఉండి అంతులేని ఆనందమును పొందు సరసజ్ఞులు. అజ్ఞానులు ఇది గుర్తిస్తారా అని అంటారు.

వేదము, క్షుత్పిపాస, మరపించు, సుధామృత వృష్టి కురిపించునది. జీవన ప్రదము. మంగళమార్గము. సర్వ సందేహములను నివృత్తి జేయునది. మోదము గలిగించునది. పండితవరేణ్యులకు ఆనంద ప్రదము. అని వేదము యొక్క గొప్పతనాన్ని ఉద్ఘాటించిరి.

2-12-1963 సం॥లో బ్రహ్మపురాంధ్ర సంస్కృతీ సమితి వారు బ్రహ్మపురంలో సన్మానం చేసి అర్ధనూట పదహార్లు, ఖద్దరు శాలువా బహూకరించిరి. దానికి శ్రీ శర్మగారు

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

**"సరసులు, పండితుల్, కవులు, సద్గుణ భూరి వదాన్య చిత్తులెం**

**దఱొ, దయజేసినారు, కవితల్ ప్రియమా రగనాలకించి, సం**

**బరమున నెంతయేని, బహుమాన పురస్సర దృష్టిగారవిం**

**చిరినను, మీదు సత్కృతికి సేతు నమస్కృతినే గృతజ్ఞతన్."**

అని కృతజ్ఞతలు తెలియజేసిరి".[1]

8-10-1962వ సంIIలో బందరు, ఖొజ్జిల్లిపేటలోని శ్రీ నాగేశ్వరస్వామి వారి దేవస్థానములో, బృందావన పురవాసులు, వాణిజ్య ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు, రాజకీయ దురంధరులు, కవులు, గాయకులు, కళాకారులు మొదలైన ఎంతో మంది కలిసి వీరి షష్ఠిపూర్త్యుత్సవమును జరిపిరి. ఆనాటి ఆ ఉత్సవ కమిటీ సెక్రటరీ శ్రీ ఆవటపల్లి హనుమంతరావుగారు వీరు శ్రీ శర్మగారిని గురించి,

**"కవి, దైవజ్ఞుడు, దేశసేవకుడు, వాక్చాతుర్య సౌజన్యుడున్**

**నవనీత ప్రియకృష్ణ భక్తుడును, ప్రజ్ఞాశాలి, యుత్సాహి, గౌ**

**రవసత్కాంక్షి, వయోధికుం, డతి పవిత్ర శ్రౌత చారిత్రుడున్**

**స్తవనీయుండగు రాఘవుండె తగు మా సన్మానమున్ పొందగన్"[2]**

కవి, దైవజ్ఞులు, దేశసేవకులు, వాక్చాతుర్య సౌజన్యం గల వారు, కృష్ణభక్తులు, ప్రజ్ఞాశాలి, ఉత్సాహి, గౌరవకాంక్ష గలవారు. వయోవృద్ధులు, పరమ పవిత్రమైన శ్రౌత చరిత్రగలవారు. మేము చేయు సన్మానమును పొందుటకు రాఘవుడే తగును అని ప్రశంసిస్తూ సన్మానించిరి. వీరు కేవలము సన్మానములను పొందుటయేగాదు తమ చేతుల మీదుగా ఎందరినో సత్కరించిరి కూడ. వీరి శతజయంత్యుత్సవ సంచికకు వ్యాసం వ్రాస్తూ శ్రీ పువ్వాడ తిక్కన సోమయాజి గారు, "ఆయన సాహిత్య ఉపన్యాసాలు, కవి సమ్మేళనాలు నేను వినే అవకాశం కలిగేది. గురుజాడ వారి షష్టిపూర్తి మహోత్సవం ఆవటపల్లి హనుమంతరావుగారి ఆధ్వర్యములో ఖొజ్జిల్లిపేట, నాగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణములో జరిగింది. ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు అధ్యక్షత వహించారు. విశేషమేమిటంటే, గురుజాడవారు తన షష్ఠిపూర్తి మహాసభలో చాలా మంది సహకవులను గౌరవ భావంతో వస్త్రాలతోను, శాలువాలతోను సత్కారం చేశారు[3] అని వ్రాసిరి.

స్వాతంత్ర్య సిద్ధి రజతోత్సవ సందర్భముగా ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్యగారిచే సన్మానము పొందిరి. ది.6-7-1975 ఆదివారం సాయంత్రము విజయవాడ రాజకుమారి టాకీస్‌లో జరిగిన 'ప్రపంచ

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

3. శ్రీ పువ్వాడ తిక్కన సోమయాజి "శ్రీ గురుజాడ వారిని గుఱించి" శ్రీ గురుజాడ రాఘవశర్మగారి శతజయంత్యుత్సవ సంచిక పుట 31

తెలుగు మహాసభల సందర్భమున యేర్పరచిన సమావేశ వేదికపై ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావుగారు, విద్యామంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు కలిసి స్వాతంత్ర్య సమర యోధునిగా, వక్తగా, కవిశేఖరునిగా, జాతీయ కవిగా, పండితునిగా తెలుగువారి మన్ననలు పొందుచున్న నిరాడంబరులు శ్రీ గురుజాడ రాఘవ శర్మగారు అని పరిచయం చేసి సన్మానించిరి.

ది. 2-12-1973సం॥లో బందరు పట్టణములోని ఆంధ్ర సారస్వత సమితి 6వ వార్షికోత్సవ సందర్భముగా శ్రీ గురుజాడ వారిని సన్మానించిరి.

తాడంకి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సాహిత్యోపన్యాసానంతరము ఆనాటి సభాధ్యక్షులు కవి, పండితులు శ్రీ జోస్యుల సూర్యనారాయణమూర్తిగారు వీరిని సన్మానించి ఈ విధముగా ప్రశంసించిరి.

**"వచనమొ, పద్యమో, యెఱుగవచ్చునె! నీవు నుపన్యసించు వా**
**క్యచయములోని, ధోరణి యనంత మహత్తర ధారణా బలం**
**బచలిత సుందరంబుగ, విహాయసవీథిని, శబ్ద మాధురీ**
**విచలితమైనవోయి! కవి విద్వదధీశ! సెబాసు! రాఘవా!"[1]**

**"నీ దేశ భక్తి యుతమగు**
**వాదనలో చాకచక్య వైఖరియు, కవి**
**త్వాద ర భావము మహా నీ**
**యా దర్శములగుత మాకుననిశము, సుకవీ!"[2]**

వీరి కవిత్వము నిజానికి వచనమో, పద్యమో తేడా తెలియనంత తేలికగా ఉంటుంది. వారి ఉపన్యాస పరంపరలోని ధోరణి వియత్తలము నంటి ప్రవహించును. వారి దేశ భక్తి పూరితమైన వాదనలోని చాకచక్య వైఖరి, కవిత్వాదర భావములు తోటి కవులకు మా వంటి వారికి ఆదర్శప్రాయమని ఒక మహాకవి వాకృచ్చుట మనోహరము.

ఇన్ని సన్మానములు వీరి నలంకరించినను, వీరిలో ఆవంతయైన గర్వము పొడసూపకపోవుట ఆశ్చర్యము.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

**"స్తవనీయంబ సమానమై వరలు యీ సంఘమ్ము దా జేయు నీ**
**కవి సమ్మానము నాకె జే సిరని యే గర్వమ్ము నుం జెంద, నీ**
**కవి సమ్మానము సర్వ పూజ్య కవిలో కమ్మున్ బ్రశంసించు న**
**ట్లవుగా! యిట్టు లె స్వీకరించెదను మీ రందించు సమ్మానమున్॥"[1]**

ఇది అంతయు ఆ శ్రీ కృష్ణుని అనుగ్రహమే అనుచున్నారు.

**"ఇది నీవిచ్చిన యట్టి గౌరవము తండ్రీ! నాదు సామర్థ్య మె**
**ట్టిదో! నీకున్ మఱి నాకు దెల్లమది! కంటే! వారు వీరిట్లు స**
**మ్ముదమారన్ సుధ జారనిచ్చిన వచః పుష్పాళి, వీరెల్ల పూ**
**ర్ణ దయాంతః కరణుల్ కదా! తెలియ గృష్ణా! శ్రీ జగన్మోహనా!"[2]**

**"కవియగుటను కాదిల, శా**
**స్త్ర విదుండని కాదు దేశ సేవా సౌభా**
**గ్య విరాజితు (డనికాదిది**
**భవదవ్యాజానురాగ భాగ్యమె! కృష్ణా!"[3]**

ఇది శ్రీ కృష్ణుడే కలుగజేసిన గౌరవమట. నా సామర్థ్యము ఎట్టిదో నీకు తెలియును గదా! చూచావా! వీరు, వారు సంతోషముతో పలికిన పుష్పావళి, వీరందరు పరిపూర్ణ దయాంతః కరుణులు కదా! కవి అగుట చేత కాదు, శాస్త్రము తెలిసిన వాడనని కాదు, దేశసేవా సౌభాగ్య విరాజితుడనని కాదు ఓ కృష్ణా! ఇందంతయు నీ అవ్యాజానురాగ భాగ్యమే ! అనుట వలన వీరి కృష్ణ భక్తి వెల్లడి యగుచున్నది.

గొప్పదగు ఈ సన్మానము ఈ సంఘమువారు చేసే ఈ కవి సన్మానము నాకే చేస్తున్నారని గర్వము చెందను. నాకు చేసే ఈ సన్మానము సర్వ కవులనెడి లోకమునకు చెందు సన్మానముగా భావించి స్వీకరించెదను అని పలుకుచు సాహిత్య సంఘము వారు చేయు సన్మానమును స్వీకరించిరి.

జాతీయగీతాలు సంకలనగ్రంథ ఆవిష్కరణము సందర్భముగా ఆంధ్ర సారస్వత సమితి. మచిలీపట్టణమువారు సత్కరించిరి.

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3 పద్యాలు

రోటరీక్లబ్ ద్వారా జిల్లా జడ్జియైన శ్రీ వెంకట రామశాస్త్రిగారిచేత మచిలీపట్టణంలోని ఒక గుర్తింపు పొందిన వ్యక్తిగా సన్మానింపబడిరి.

26-1-1973 సంవత్సరంలో రిపబ్లిక్ డే సందర్భముగా జగ్గయ్యపేట శంకుతలమ్మ కాలేజీలో జరిగిన కవి సమ్మేళనానికి వీరు అధ్యక్షత వహించుటయేగాక సన్మానింపబడిరి.

రాజకీయ నాయకుడుగా కేంద్రప్రభుత్వమునుండి మరణించే వరకు పెన్షన్‌ను గ్రహించారు.

## 1.19 కవిశేఖర బిరుదు : కవి : -

"కవిశేఖర" శ్రీ గురుజాడ రాఘవశర్మగారు స్వయముగా కవి. ''నానృషిః కురుతే కావ్యమ్, కవయః క్రాంత దర్శనః" అనునట్లుగానే వీరు ఋషి తుల్యులు క్రాంత దర్శనులు. కావుననే కల్పలత, వాసుదేవనామ శతకము, శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము, శ్రీ సువర్చలాంజనేయమ్, అంజలి మొదలగు భక్తితత్త్వముతో గూడిన గ్రంథములేగాక, స్వాతంత్ర్య పథము, నవకాళీ, బాపూజీ, కాళరాత్రి మొదలగు స్వాతంత్ర్య ప్రబోధితమైన గ్రంథాలుకూడ రచించ గల్గిరి. వీరు శ్రీ కృష్ణోపాసకులు. ముకుందమాల వీరి అనువాద గ్రంథమైనను సహజత్వమును సంపాదించుకున్నది. వీరు పరమ పవిత్రులై నిరంతర పార మార్థిక చింతనతో జీవయాత్రను సాగించిన భక్త్యా వేశ పూరిత హృదయము గలవారు. హృదయము భావ పరిపూర్ణ మైనప్పుడు ముక్త కంఠముతో పద్యగానము చేయుచు తనను తానే మరచి పోయేటంతటి శ్రీ కృష్ణ భక్తిలోలురు. అట్టి భక్త్యా వేశములో నుండి వెలువడినవే కల్పలత, వాసుదేవ నామ శతకము, శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము, అంజలి మొదలైన గ్రంథములు. వీటిని గురించిన ప్రస్తావన ముందు పుటలలో తెలియజేయబడును.

వీరు ఆశుకవి, ఏ సాహిత్య సభలలో పాల్గొన్నా, ఏ మహాత్ములను సందర్శించినా, ఏ మహాక్షేత్రాలు సందర్శించినా అప్పటికప్పుడు పద్యాలు వ్రాసి ఆయా దేవతలకు సుమహారములుగా అర్పించిరి. సభలలో పాల్గొని ఉపన్యాసములు ఇచ్చినపుడు సభాధ్యక్షుడుగా గౌరవము పొందినపుడు, ఉపన్యాసకుడుగా తన వాక్చాతుర్యముతో సభలను రంజింపజేసినపుడు సన్మానములు పొందినపుడు వారందరికి పద్యములలోనే కృతజ్ఞతలను తెలియజెప్పిరి. సభలలో అప్పటికప్పుడు పద్యములు వ్రాసి తమకంఠముతో మనోహరముగా పాడి వినిపించెడివారు. వీరి కవిత్వము మృదు మధురమై మనసును రంజింపజేయును. వీరి కల్పలత కావ్యమునకు తమ అభిప్రాయమును తెలియజేయుచు పూజ్యశ్రీ విస్సా అప్పారావు పంతులు గారు, "మీ

రచనలో భావమును తరుముకొని భాషయును, భాషను తరుముకొని భావమును, నేను నేనని బరుగు లిడుచున్నవి"[1] అని వ్రాసిరి.

వీరి కవిత్వమును గూర్చి పూజ్యులు శ్రీ ఈశ్వర సత్యనారాయణగారు,

**"కవిత తెనుంగున నిగ్గతి**
**నివెలయదగు, జూడు, డంచు నేర్పెడు గురుజా**
**డ వెలయు నీతీయ నుడుల్**
**రవళిం బొలుచు గురుజాడ రాఘవ శర్మా!"**

**"స్ఖాలిత్యంబులు లేని వాడెవడు! నీ కావ్యంబు, గై కొన్నచో**
**దోలాం దోలిత బాలుడై సుఖఝురిన్ దోగాడుచున్నాధకుం**
**డేలీలంబడు రంధ్రమార్గణము నం, దోనీ కవిత్వము వా**
**గ్జాలాంచ త్సుధ గ్రోలి యంటి స్తవ వాక్యం బింతయున్ గాదు సూ"**

తెలుగులో కవిత్వమంటే ఇట్లా ఉండాలని చూడమని చూపిస్తుందట వీరి కవిత్వము. చక్కని నుడికారము కలిగిన వీరి కవిత్వము సుధా రసాస్వాద భరితమై యొప్పారుననని ప్రశంసించిరి. "రససిద్ధాః కవీశ్వరాః" అనునది వీరిపట్ల అన్వర్థమై ఒప్పారుచున్నది.[2]

బ్రహ్మశ్రీ మండలీక వేంకట శాస్త్రిగారు కల్పలత కావ్యమునకు అభిప్రాయమును వ్రాయుచు, "మీ సహజమగు మృదు మధుర కవితా శైలికి తోడుగ, భక్తి రసముప్పొంగ జేయు, మీ కావ్య కల్పలత, యే సహృదయుల మనః పద్మముల వికసింప నానంద ఫలముల నీయకుండును!"[3] అని వ్రాసిరి.

శ్రీ శర్మగారే ఒక చోట కవి - కవిత్వము ఎట్లా ఉండాలో వ్రాసిరి.

**"తెలియుదు శబ్ద మార్దవము, తీరిచిచూచి నియుక్త మైన స్వ**
**స్థలమున నేర్పుమై, పొదుగ, జాలె దవన్వయ దూరమెంతయున్**
**బొదలక, దీటుగా విషయమున్ ముడివెట్టెదు జానుతెన్గునన్**
**పలుకు బడుల్ వెలార్చు ప్రతిభా సరసుజ్ఞుడు! సత్కవీశ్వరా!"[4]**

---

1. పూజ్యశ్రీ విస్సా అప్పారావు పంతులుగారు కల్పలత పుట 11
2. పూజ్యులు శ్రీ ఈశ్వర సత్యనారాయణగారు కల్పలత పుట 10
3. కల్పలత మండలీక వెంకట శాస్త్రి గారు కల్పలత పండితాభిప్రాయము పుట 1
4. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

తాను శబ్ద మార్దవమును తెలిసికొని ఎక్కడ ఏ శబ్దము వేయాలో ఆ శబ్దమును నేర్పుతో అన్వయ క్రమము చెడిపోకుండా ప్రయోగించెదను అని జాను తెన్గులో విషయమును సూటిగా చెప్పెదను అని పలుకుబడులు వెలార్చు ప్రతిభా సరసజ్ఞుడనని చెప్పుకొనిరి.

కవులు - కాల ప్రతిబింబాలుట.

**"కవులం గూరిచి పోల్చి, తూచి, కొలువంగారాదు, దివ్యాంశసం**
**భవులీ లోకమునుద్ధరింప గల సామర్థ్యమ్ము తోడన్, మహా**
**కవులాత్మీయ కళారహస్యముల, నుద్ఘాటించుచున్ వెల్గుచుం**
**ద్రు, విలోకించిన స్వీయకావ్యముల వారున్, భూరిచారిత్రులై॥"[1]**

కవులను చూసి ఇంకొకరితో పోల్చి, తూచి కొలువ గూడదు. దివ్యాంశ సంభవులు, లోకము నుద్ధరింప గల సామర్థ్యముతో మహాకవులైనవారు తమ కావ్య కళారహస్యములను చెప్పుచు తమ కార్యములచేత గొప్ప చరిత్ర కలవారై వెలుగుచుందురు.

**మ॥ "కవి నంచున్ గరు వింప ( బోకు మెపుడో, కాల ప్రవాహమ్ము నం**
**దు, పడిన్ గొట్టుక పోదు, వాపయిని నిన్నున్ స్మరింపంగ రా**
**డెవడున్, నీకృత కావ్యమే నిలుపు నోయీ, జీవమున్ గల్గు స**
**త్కవితల్ పల్కెడి భాగ్యమున్న యెడనిన్ దత్కర్త వై యుండుటన్"[2]**

నేనే కవిని కదా అని గర్వించకు. కాలప్రవాహములో పడి ఎపుడో కొట్టుకుపోదువు. ఆపై నిన్నెవరు తలచుకొనరు. జీవము గల్గిన సత్కవితలు పల్కెడునటువంటి అదృష్టమున్నచో నీవు ఆ కార్యకర్తవగుట వలన నీ కావ్యమే నిన్ను చిరస్థాయిగా లోకములో నిలుపును. అని చెప్పి

కవి నోటి వెంట కవిత్వము ఎట్లా (జాలువారాలో) ఈ విధముగా చెబుతారు.

**క॥ "అనుకొనవలె ( బల్కు మన**
**మ్మున ( గలమున్ బూన భావములు దొర్లవలెన్**
**దొన దొన పద్దెమ్ములు, చ**
**క్కని ధారన్ వీయ ( దీయ(గా ( దేనెవలెన్"[3]**

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3 పద్యాలు

మ॥ "కవితల్ సెప్ప (దలంప, వస్తు వెదొసాక్షాత్కారమై, బుద్ధి, దో
పవలెన్, భావ పరంపరల్ పయి (బయిన్ బ్రాకన్ వలెన్ ; జేత బూ
నవలెన్ లేఖిని, శారదాసతి, మహానందమ్మునన్ బ్రేమ (జి
ల్కవలెన్, సత్కవితా ప్రవాహ మొకలెక్కా! పల్క (గా నా పయిన్"[1]

"మీదకు మీదకున్ దొరలి మించెడి శబ్దములన్ గ్రహించి, యౌ (
గాదను వాదమున్ విడి, చకాచక లేఖిని సాగి, శాబ్దిక
శ్రీ దళు కొత్తగా రస ఝరిన్ జెలు వార (గ ముంచి యెత్తుమా!
మోదమునన్ బుధుల్ పలుకు పోడిమి కచ్చెఱు వొంది మెచ్చగన్"[2]

మనస్సులో చెప్పాలని అనుకొనగానే కలము పట్టుకోగానే చక చకా పద్యములలో భావములు దొర్లవలెనట. అది ఎట్లా తేనె ధారలు స్రవించు నట్లుగానట. కవిత్వము చెప్పాలనుకొనగానే మనస్సులో వస్తు సాక్షాత్కారము జరిగి, బుద్ధికి దోచి, పై పై భావ పరంపరలు, బ్రాకి చేతితో కలము పట్టుకుంటే శారదాసతి మహానందముతో ప్రేమ చిల్కరించాలేగాని ఆ పై (పద్యములు) సత్కవితా ప్రవాహమును ప్రవహింప జేయుట ఒక లెక్కా ? ఒక దాని తర్వాత ఒక శబ్దము స్ఫురిస్తూ ఉంటే, ఇది యౌను ఇది గాదు అని మనస్సులో వాదనను విడిచి పెట్టి, చకా చక లేఖిని సాగగా, శాబ్దిక శ్రీ అందముగా రసఝరిలో నోలలాడుతుంటే ఆనందముతో పండితులు శబ్ద మాధుర్యమునకు అచ్చెరువొంది మెచ్చుకుంటారుట. ఇవి శ్రీ శర్మగారు, ఎంతో అనుభవముతో చెప్పినమాటలు. వీరికి పరమాత్మయైన ఆ శ్రీ కృష్ణుని యొక్క అనుగ్రహమును పొందిన వారు కనుక ఆయన దయామృత వర్షము పై చిలకరింపబడి, శారదా కరుణా కటాక్ష వీక్షణములకు లోనై వ్రాయబడినవి గావుననే వారి కావ్యములు చదువుతున్నప్పుడు పాఠకుడు ఆనందాబ్ధిలో ఓలలాడును. వీరు సామాన్య కవులు గాదు. తపస్సిద్ధి గల ఉపాసకులు. వీరి కల్పలతా కావ్యఖండికకు తమ అభినందనలు తెలియజేయుచు 'విద్యారత్న' శ్రీ ఆకిలి శ్రీ రామశర్మ గారు, "రససిద్ధులగు కవీశ్వరులు సర్వోత్కృష్టులై వెలయుచున్నారని భర్తృహరి పల్కిన పలుకులు, అక్షరములా పరమ సత్యము. కేవల గణబద్ధమగు నక్కరముల కూర్చే కవిత్వ మెట్లు కాజాలదో, అట్లే శబ్దాలంకారములయు, పదములయు, నాటోపము కవిత కేక దేశీయమగు శోభ గూర్చునేగాని, రససిద్ధికి సంపూర్ణోపస్కారకము గాజాలదు. పదబంధ సౌష్ఠవము శబ్దాలంకారములు అర్థాలంకారములు లేకయు ఒకప్పుడు రసవ్యంజకమగు రచన సాగుట మనకు అనుభవ సిద్ధమే.

---

శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

కవి తన అనుభూతిని భావుకుల మనస్సున అచ్చు గ్రుద్దినట్లు స్ఫురింపజేయుటకు బ్రయత్నించును. అతడు తన మనః పరిభావితమగు విషయమును సంపూర్ణముగ నితరుల మనః ఫలకముల బ్రతిబింబితమగుతునట్లు చేయదగిన శబ్ద బ్రహ్మపుటా విష్కరణకై తపించును. తపస్సిద్ధి గల యుపాసకుడందు కృత కృత్యుడగును. రసామ్నాయ మహితుడగునట్టి రచయిత యే రస సిద్ధుడు. అతడే వాఙ్మయాకాశమున ధ్రువ స్థాయి నందుకొనగలవాడు.

పై నిర్ణయమున కనుగుణముగా గలము నడిపిన వాడు, మా గురుజాడ రాఘవశర్మ[1]." అని పేర్కొనిరి.

**"ఆటలు కావు మాటలన, హాయిగ నాటవలెన్ మనమ్మునన్**
**మీటవలెన్ సుభావములు, మేనులుపై పయి (బుల్కరింప, స**
**య్యాటలు గాగ, నందన మహా వన సీమకు జేర్ప (గల్గు, స**
**త్పాటవమున్ గలట్టి, పరువమ్మును జిమ్మమృతంపు తేటలున్."[1]**

మాటలు అంటే ఆటలు కావు. అవి హాయిగా మనస్సులో మంచి భావాలు కలిగించి మేను పులకరించునట్లు, నందన వన సీమకు చేర్చునట్లుగా సత్పాటవము గలిగి, అమృతంపు తేటల వలె ఉండాలి అని అంటారు. వీరి కల్పలతలో "తమ్ములనేలు కన్నులు" "ద్వారమ్ముదెఱువ" "ధన్యంబైనది" మొదలైన రసగుళికల వంటి కళాకళికలు గలవు.

**"మము, మీరల్ కదలింపరాదు, కదలింపన్ బూన శ్రీ భారతీ**
**రమణీ దివ్య కటాక్ష వీక్షణ లపారప్రాభవ శ్రీ సమే**
**తములై, సత్కవితా స్రవంతి తనయంతన్ జాలువారున్ బ్రసా**
**దమరందమ్మగుచున్, గ్రహింప (గల, శ్రోతల్ లీనమై పొంగగన్"[2]**

మమ్మల్ని మీరు కదలించరాదు. కదలించాలని ప్రయత్నిస్తే అపారమైన శ్రీ శారదా కటాక్ష వీక్షణములకు లోనై సత్కవితా స్రవంతి తనంతట తానుగా జాలువారి ప్రసాద మాధుర్యమై గ్రహింపగలిగిన శ్రోతలు దానిలో లీనమై పొంగిపోయేటంతటి స్థితికి లోనవుదురు. అని చెప్పిరి. ఇది వీరి కవిత్వ శైలి. వీరి పద్యము నడక ప్రసాద మాధుర్య గుణ సంయుతమై రసాబ్ధి నోల లాడించును. ఎంతటి వారైనను భక్తి పారవశ్యులగుదురు.

1. కల్పలత 'విద్యారత్న' శ్రీ ఆకిలి శ్రీరామశర్మగారు కల్పలతాభినందనము కల్పలత పుట 6
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి1, 2 పద్యాలు

ఇంతటి అనన్య సామాన్యమైన కవితాశక్తి గల వారు గనుకనే వీరికి పరిషదధ్యక్షులు, సంగీత సాహిత్యాచార్యులునగు సాహితీ వల్లభ శ్రీ శ్రీ రాజా వేంకటాద్రి అప్పారావు బహద్దరు (ఉయ్యూరు జమీన్దారులు, నూజివీడు, కృష్ణా మండలము) వారి యధ్యక్షతను 15-2-1952వ తేదీ సాయంకాలము 4గం॥లకు జరిగిన పరిషత్కార్య సభ (Working Committee)లో పారిషదులు, పరిషత్సంప్రదాయము ననుసరించి వీరికి గల ప్రజ్ఞాప్రాభవ కీర్తుల గమనించి "కవిశేఖర" బిరుదమును సమర్పించి తమ్ముఁదాము గౌరవించుకొనిరి. ఈ విషయమును ఆనాటి పరిషత్కార్యదర్శులు అయిన డా॥ మారేమండ రామారావుగారు, కోన వేంకటరాయశర్మగారు వీరికి తెలియజేసిరి.

దానికి కృతజ్ఞతగా వీరే తమ కల్పలత కావ్య ఖండికలో,

**"కవిశేఖర" బిరుదము గౌ**
**రవముగ, నా కొసఁగఁ బూను, ప్రాజ్ఞజనుల్, సం**
**స్తవనీయు లెంతయును శుభ**
**మవు, సారస్వత మనీషులే వీరికిలన్[1]"** విసతి 3వ పద్యము

కవి శేఖర బిరుదు నా కొసగిన ప్రాజ్ఞజనులందరుకొనియాడ దగినవారు. వీరికి సారస్వత పండితులైన వారికిల సర్వశుభములు కలుగు గాక యని ఆశీర్వదించిరి.

**"బిరుదులకేమి! నీ వొసగుభిక్షయె, యక్షయమై, తరింప నా**
**దరువయి, దివ్యమంగళ పదస్థితి, జేర్చిన నాడె, మేటి సం**
**బరమగుగాని, యిట్టి బహుమానములన్ బడి తృప్తి నీ హృదం**
**తరమున జెంద, భవ్య పద దాసుడ నన్ గృప (జూడు భారతీ!"[2]** **విసతి 4వ పద్యము**

బిరుదులకేమిగాని, నీ వొసగిన భిక్ష అక్షయమై తరింపజేసి జీవితా ధారమై దివ్యమంగళ పదస్థితికి చేర్చినప్పుడే నాకు ఆనందము గలుగును. ఇటువంటి బిరుదులకు, బహుమానములకు పరితృప్తి చెందను. నీ హృదయానికి చేర్చుకో. నీ పద దాసుడను. నన్ను దయ జూడుము అంటారు. లోకములో సహజముగా బిరుదులకు, సన్మానములకు, జన బాహుళ్యములో పేరు తెచ్చుకోవాలని తాపత్రయము చెందుతారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట 3
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట 4

ఇవి ఇహలోక సౌఖ్యమును, ఆనందమును గూర్చునవి. పార లౌకికమైన ఆనందమును గూర్చు వాటిని గూర్చి ఆ వంతయైన ఆలోచించరు. వీరు అద్వైతానందము చేత పరవశులైనవారు గనుక ఈ బిరుదులకేమి! ఇస్తే ఇచ్చావు గాని, నీవు ఇచ్చే భిక్షయె అక్షయమై తరింపజేయును అనుటలోని అంతరార్థము, లౌకికమైన ఈ బిరుదులు, సన్మానములు శాశ్వతములుగావు. అలౌకికమైన బ్రహ్మానందము, మోక్షము ఏ దైతే ఉందో అదే శాశ్వతము అనే జ్ఞాన భిక్షను ప్రసాదించమని. అట్లే మంగళమైన దివ్యపద స్థితికి చేర్చినప్పుడే తనకు నిజమైన సంబరమని అనుచున్నారు. ఆ పరమాత్మ దివ్య చరణములనే నమ్ముకొన్నానని స్పష్టపరచినారు. దీనిలో వీరి దాసభక్తి వెల్లడి యగుచున్నది.

ఈ విధముగా శ్రీ శర్మగారు తన కవితా సరస్వతికి సాహిత్య లోకములో అత్యున్నత స్థానము నలంకరింపఁజేసిరి. కవి లోకమున కంతటికి కవిశేఖరులు కాగలిగిరి.

## 1.20 ఇతర కవులు - సాన్నిహిత్యము: -

### 1. శ్రీ దువ్వూరు వేంకట రమణశాస్త్రిగారు: -

దువ్వూరి కులార్ణవ చంద్రుడు, శబ్దశాస్త్ర రమ్యవచో వైభవుడు అయిన వేంకట రమణశాస్త్రిగారు "రమణీయము" అను గ్రంథాన్ని వ్రాసిరి. శ్రీ శర్మగారు "రమణీయమును" చదివి దానిపై చక్కని పద్యాలు వ్రాసిరి.

**"ప్రవిమల 'దువ్వూరి' కులా**
**ర్ణవ చంద్రుడు, శబ్దశాస్త్రరమ్యవచోవై**
**భవు, వేంకట రమణులు గౌ**
**రవనీయులు బల్క వెలసె, రమణీయమ్మున్."[1]**

**"నలుబది యేండ్లనుభవమున్**
**మలచి, గ్రహింపగఁదెనుఁగు నాడు రచించెన్**
**సులభ వ్యాకరణమ్మున్**
**దెలుఁగున, నుడికారమెల్ల తీర్చి సొబగులన్"[2]**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

నలుబది ఏండ్ల అనుభవముతో తెలుగు నాట సులభమైన వ్యాకరణమును, తెలుగు నుడికారము, సొబగులు తీర్చిదిద్ది వెలయించెను.

**"రమణీయ శబ్దశాస్త్రము**
**సుమనఃపరితోషితము, విశుద్ధపదన్యా**
**సము, చిన్నయసూరి బుధో**
**త్తమ రచనావ్యాఖ్య, భాషితము, సరళమ్మున్"[1]**

ఈ రమణీయమనెడి శబ్దశాస్త్రము సుమనస్సులకు సంతోషము కలిగించునది. విశుద్ధ పదన్యాసము గలిగినది. చిన్నయసూరి వ్యాఖ్యానము సరళమునైనది.

**"నన్నయ పల్కెన్, పిమ్మట**
**చిన్నయ వ్యాకరణమున్ వచించెన్ వానిన్**
**దిన్నగఁ దేర్చి వచించెన్**
**మిన్నగ, రమణీయముగ, శ్రమించి, రమణులున్"[2]**

నన్నయ పల్కినాడు. పిమ్మట చిన్నయసూరి వ్యాకరణము రచించెను. వాటిని మరల దిన్నగాఁదీర్చి మిన్నగా రమణీయము అను పేరుతో శ్రమించి వేంకట రమణశాస్త్రి వచించెను. ఈ రమణీయము ఎటువంటిదనగా,

**"రమణీయము, సాధితపద**
**రమణీయము, శబ్దశాస్త్ర రమణీయము, ధీ**
**రమణీ! మననీయ వచో**
**రమణీయము, మీదు రమ్య రమణీయమ్మున్".[3]**

దువ్వూరి వేంకట రమణ శాస్త్రిగారు ఈ గ్రంథానికి రమణీయము అని పేరు పెట్టుటయే రమణీయముగానున్నది. రమణీయమును పదముతో రమణీయముగా వ్రాసిన ఈ పద్యము అత్యంత రమణీయము. పదముల సాధిత రమణీయము. శబ్ద శాస్త్రముల యొక్క రమణీయము - బుద్ధి రమణీయము

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3 పద్యాలు.

- నివసించుటకు వీలైన మాటల రమణీయము. అంతకంటె మించినది మీ రమ్యమైన రమణీయము అని మనోహరముగా వాకృచ్చిరి.

## 2. శ్రీ గిడుగు సీతాపతిపంతులు గారు: -

8-12-1965వ.సం॥లో శ్రీ గిడుగు సీతాపతిపంతులుగారికి, 'కళాప్రపూర్ణ' బిరుదునిచ్చిన సందర్భములో,

మాన్యా!
పదేడులపై బదేడులుగా నెలకొన్న యీ ప్రాయమ్మున మిమ్ము
"కళాప్రపూర్ణ" బిరుదాంకితులుగా జేయ సంకల్పించిన వారు ధన్యులు,

**"క్రమతన్ మిమ్ము కళాప్రపూర్ణునిగ, లోకంబెన్నడో, మీదుగ్రం**
**థములన్ లెస్సగ్రహించె, మీ యశమనంత వ్యాప్తి ( జెందన్, స్వధ**
**ర్మము నిల్పంగ(కళాప్రపూర్ణ బిరుదున్ ప్రజ్ఞానిధుల్ కూడి, న్యా**
**యము కాదా! యిపుడైన మీ కొన(గ విద్వన్మాన్య! సీతాపతీ".[1]**

విద్వన్మాన్య! సీతాపతీ! మీ గ్రంథముల వలన మిమ్ములను లోకము ఎప్పుడో కళాప్రపూర్ణునిగా గ్రహించినది. మీ కీర్తి అనంతముగా వ్యాప్తి చెందెను. వారి ధర్మము నిలుపుకొనుటకు ప్రజ్ఞానిధులు కూడి ఇప్పటికైన కళాప్రపూర్ణ బిరుదునిచ్చుట న్యాయము కదా! అంటారు.

శ్రీ శర్మగారికి బిరుదులు ఒక లెక్కగాదు. గిడుగు సీతాపతి పంతులుగారికి - ప్రసిద్ధ కవివరేణ్యులకు అంత ఆలస్యముగా "కళాప్రపూర్ణ" బిరుదు నిచ్చినందులకు - పైగా వయస్సు రీత్యా వృద్ధులు - పాండిత్యము రీత్యా వృద్ధులు - ఇది వారు చెప్పిన వ్యంగ్య సమాధానము.

**"రమణీయంబుగ సంస్కృతంబునను, ఆంధ్రంబందు, సారస్వత**
**ప్రముఖుల్ మేలన(గీర్తి(గొంటివిగ సద్వ్యాసంగముల్ జేసిల**
**భ్యమగున్ గాదె, గురుప్రసాద మహిమన్ బాండిత్యమేలా! సమ**
**స్తము, సారస్వతమాననీయ కవితాసామ్రాజ్యమందున్ కవీ!"[2]**

సంస్కృతములోను, ఆంధ్రభాషలోను సారస్వత ప్రముఖులందరు మేలు అనికీర్తిగాంచితిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

సద్వ్యాసంగములనుజేసి, సారస్వత కవితా సామ్రాజ్యమునందు గౌరవమునొందితివి. ఇది గురుప్రసాదమేగా! అని అంటారు.

పూర్వ కాలములో గురుకులములో విద్యనభ్యసించెడివారు. గురుశుశ్రూష చేస్తూ సంస్కృతాంధ్ర భాషలను ఆ భాషలలో ప్రఖ్యాతమైన గ్రంథరాజములను అభ్యసించుట వలన సారస్వత లోకములో ఒక అధికారమేర్పడును. గురువు అనుగ్రహము వలన అది మరింత పాదుకొని కవితాసామ్రాజ్యానికి ఏకచ్ఛత్రాధిపతులగుదురు. ఇట్టివారిని లోకము చాలా ఆలస్యముగా గుర్తించినదని వీరి భావము.

## 3. శ్రీ నండూరి సుబ్రహ్మణ్యం గారు: -

10-11-1966 సం॥ సాయంత్రము బందరు బచ్చుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయములో శ్రీ మద్భగవద్గీత పదునెనిమిది దినములుపన్యసించిన సందర్భములో పౌరాణిక వాచస్పతి, నండూరి సుబ్రహ్మణ్యం గారికి శ్రీ రాఘవశర్మ శుభాశీస్సులు పల్కిరి.

**"అమలస్వాంత! యనేక శాస్త్రముల, వాక్యార్థమ్ములన్ గూర్చి ప**
**ల్కి మమున్, ధన్యులజేసితీవు, భగవద్గీతాంబుధిన్ ద్రచ్చి, సా**
**రము వర్షించితి, తేటతెన్గునను, సుబ్రహ్మణ్య! సత్పండితో**
**త్తమ! నండూరికులాబ్ధిచంద్ర! గుణసాంద్రా! నీకు దీర్ఘాయువౌ".[1]**

సత్పండితోత్తమ! నండూరికులాబ్ధి చంద్ర! గుణసాంద్రా! మీరు అనేక శాస్త్రముల వాక్యార్థములను గూర్చి వివరించి మమ్ములను ధన్యులను జేసితిరి. భగవద్గీతయనెడి అంబుధిని మథించి దానిలోని సారమును చక్కని తేటతెనుగు భాషలో మాపై వర్షింజేసితిరి అని చెప్పిరి.వీరు ఎంత పండితులో దీనిని బట్టి తెలియుచున్నది. భగవద్గీత అనెడి సముద్రమును మథించినవారు దాని సారమును పై బడునట్లు వర్షించుట సామాన్యవిషయము గాదు.

**"ఏ యోగమ్మునుగూర్చి, విస్తృతముగా, నెంతెంత, వేత్వేఱ,య**
**ధ్యాయ శ్లోకములన్, నిగూఢముగ, వ్యక్తంబాయెనో, వాని, నా**
**యా యోగమ్ముల జేర్చి, తద్విషయమున్ వ్యాఖ్యానమున్ జేసిత**
**య్యా! యోగ్యుండవు, సర్వమున్ గరతలంబైనట్లు గీతార్థమున్ ".[2]**

సమస్తము కరతలామలకమైనట్లుగా గీతార్థమును ఏ యోగమును గూర్చి ఆయోగమును ఎంతెంత

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

వేర్వేరుగా అధ్యాయములలో చెప్పబడినదో దానిని నాయా యోగమ్ముల చేర్చి ఆయా విషయములను వ్యాఖ్యానపూర్వకముగా వివరించితిరి. అందులకు తగినవాడవు నీవు అని చెప్పిరి.

**"శ్రుతిపేయముగన్, బ్రవచిం**
**చితి, స్మృతి యుక్తముగ గీత, శ్రీపతి రక్షిం**
**చుత, పౌరాణిక వాచ**
**స్పతి బిరుదా! విబుధ వినుత! పండితవర్యా!"[1]**

స్మృతులలో చెప్పబడిన గీతను శ్రుతిపేయముగ ప్రవచించిరి. పౌరాణిక వాచస్పతి బిరుదుగాంచిన మిమ్ము శ్రీపతి రక్షించుగాక అని ఆశీర్వదించిరి.

## 4. శ్రీ ముదిగొండ పిచ్చయ్యశాస్త్రిగారు: -

ది. 2-12-1966 సం॥ శుక్రవారం నాడు తర్క వేదాంత విశారదులగు బ్రహ్మశ్రీ ముదిగొండ పిచ్చయ్య శాస్త్రి గార్కి పదిహేను దినములు శ్రీ మద్భాగవతోపన్యాసములు చేసిన సందర్భములో శ్రీ శర్మగారు వారిపై వ్రాసిన పద్యములు:

ఉ॥ **"అప్పుడవై, వచింపఁగ, దయామయ! మాకు పదేష్టవైతిలన్**
**సప్తతి దాటియున్ స్వరముజంకదు, పొంకమువోదు, సుంతయున్**
**జ్ఞప్తియుజారదింత, వడిగాబరువెత్తెడి (బూర్వజన్మ సం**
**ప్రాప్తము సర్వమున్, దెలియరాని రహస్యమిదెంత వారికిన్".[2]**

ఓ దయామయా! మాకు అప్పుడవై ఉపదేశించుటకు వచ్చితిరి. డెబ్బది ఏండ్లు వచ్చినను స్వరము మారలేదు. కొంచెము కూడ జ్ఞాపకశక్తి తగ్గలేదు. వేగముగా ఒక విషయము తరువాత ఒక విషయము పరుగులెత్తుచు చెప్పుట పూర్వజన్మ సంస్కారము వలన సంప్రాప్తమైయున్నది. ఎంతటి వారికైనను ఇది తెలియని రహస్యము. అని వారిలోని విద్వత్తును ప్రశంసించిరి.

**"జ్ఞానాజ్ఞానములేవియో, పలుకు బంగారముగా ( దూచెద**
**య్యా! నేర్పొప్పఁగ, గీటురాయి, నిజవాక్య ప్రౌఢి, మా బుద్ధి సం**
**ధా నింపన్ దిగివచ్చి పల్కెదు, మహాత్మా! యొప్పునాలౌకిక**
**జ్ఞానంబింతగ నేతిచవాక్యములెటుల్ గ్రాహ్యమ్మెనీకున్ సదా!"[3]**

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3 పద్యాలు

మీ పరిజ్ఞానమును బట్టి నేర్పొప్పునట్లుగా పలుకుట సహజము. మా బుద్ధికి అందునట్లుగా పల్కెదరు. ఓ మహాత్మా ఆ లౌకిక జ్ఞానమును నీతి వాక్యములుగా అనుసంధించి ఎట్లు గ్రహింపగల్గితిరి అంటారు. ముదిగొండ పిచ్చయ్యశాస్త్రిగారు మహాపండితులు. తాను మహా పండితుడనని తన పరిధిలోనే ఉపన్యసించినచో సామాన్య మానవులకర్థముగాదు - తన కావ్య పరిజ్ఞానమును లోక జ్ఞానముతో అనుసంధించి తేటతెల్లమగు తెలుగుభాషలో శ్రోతలను రంజింపజేయు పద్ధతిలో ఉపన్యసించిరి అని చెప్పుట. అప్పుడు వినువారికి బాగా అర్థమగును. ఇదే భావమును,

**"తెలుపన్ శక్యమె, నీదు శక్తి భగవద్గీతార్థమున్ బ్రేమరా**
**గిలఁగాఁ బల్కెదు, పారిభాషిక పదక్లిష్టాన్వయప్రౌఢ సూ**
**క్తులనెంతే గ్రహియింపఁజాలరని, యెంతో తేటయౌ తెన్గునన్**
**సులభశ్రేణిని, యుక్తయుక్తముగ, సంతోషింపఁగా నెల్లరున్".[1]**

భగవద్గీతార్థమును పారిభాషిక పదముల అన్వయించుకొనుట కష్టమని, తేటతెనుగు భాషలో సులభముగా అందరికి అర్థమగు రీతిలో అందరు సంతోషించునట్లుగా తెలియజేయుట మనోహరము అని కొనియాడిరి. వీరిచ్చిన ఉపన్యాసము శ్రుతిస్మృతి పురాణాంతర్గతమైన వాక్యములను కలయబోసి యుక్తాయుక్తముగా పల్కిరట. ఆ పల్కిన గీతాసారము జగత్కల్యాణ సంధానము, జన్మసార్థకము, మోక్షప్రాప్తిసందేశమును నొసగునదిట.

**"వేద విహితమైన, విస్మృత ధర్మ సి**
**ద్ధాంత పథమెవారు తప్పరాద**
**టంచు భారతీయమౌ సంప్రదాయ సం**
**స్కృతులు వినుచు మిమ్ము నుతియొనర్తు"[2]**

శ్రీ శర్మగారు వేద విహితమైన ధర్మసిద్ధాంతములను తప్పకుండా ఆచరించాలి అని భారతీయ సంప్రదాయ సంస్కృతుల పట్ల గౌరవభావము కలిగినవారు గనుక మీరు చెప్పేవాటిని వింటూ మిమ్ములనుతించెదను అంటారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

**చ॥ "అహమహమంచు, తారహరహమ్ము, గ్రహింపక స్వస్వరూపమున్**
**స్పృహ విడి సంచరింతురు, పవిత్రమగున్ జననమ్ము (గల్గనే।**
**యిహ పర సాధనంబుగ, గ్రహించి, తరింపుడి, నేటిజన్మ(బ్ర**
**త్యహము, శరీరి, క్షేత్రపు రహస్య మెఱుంగుడటంచు(బల్కెదెన్"[1]**

మానవులు నేను-నేను అని ప్రతి నిమిషము తామేమిటో, తమ స్వరూపమేమిటో తెలిసికోలేక స్పృహ విడచి సంచరింతురు. పవిత్రమైన మానవ జన్మ లభించమంటే? లభిస్తుందా? లభించిన ఈ మానవజన్మ ఇహ పరసాధనమని గ్రహించి, తరించవలెను. ప్రతి రోజు కూడ ఈ శరీరములోనున్న మానవుడు ఈ శరీరము ఎందుకు వచ్చినది అను రహస్యము నెఱిగి ప్రవర్తించవలెను. "జంతూనాం నరజన్మదుర్లభమ్." అన్ని జన్మలలోనికి మానవజన్మ ఉత్తమోత్తమమైనది. ఎన్నో జన్మల పుణ్యము చేసికుంటేగాని ఈ మానవజన్మ లభింపదు-కావున అట్టి మానవజన్మను వృధా చేసికొనక ఇహపర సాధనకుపయోగింపవలెనని వీరి ఉద్దేశ్యము.

**ఉ॥ "ఎంతటి పిచ్చివాడవయ! యేమి యెఱుంగని మమ్ము, శుద్ధ వే**
**దాంతుల సేయనెంచెదు, సుధామయ దృష్టిని, పిచ్చయాఖ్య! సు**
**స్వాంత! మనఃప్రశాంత్యుపనిషద్వచనామృత వాగ్విభూష! ధీ**
**మంత! నమస్కరింతు, నసమానయశో విభవ ప్రదీపకా!"[2]**

ఎంత పిచ్చివాడవయ్యా! ఏమి తెలియని మమ్ము శుద్ధ వేదాంతులను చేయాలని ప్రయత్నము చేసెదవు. సుధామయ దృష్టిచే నీవు సుస్వాంతుడవు. నీ ప్రశాంతమైన ఉపనిషద్వచనామృతము చేత అసమాన యశో విభవ ప్రదీప్తుడవై మమ్ములను నీ వచనామృతముచే శుద్ధ వేదాంతుల జేసితివి. అట్టి నీకు నమస్కారము. అని ఒక మహా పండితుని పట్ల తమ గౌరవ ప్రపత్తులను చాటుకొనిరి. శ్రీ శర్మగారిలో ఈర్ష్యా ద్వేషములు కొంచెమైనను కానరావు. తాను కవి - పండితుడైనను చెప్పుకొనక, 'యేమి ఎఱుంగని మమ్ము' అంటారు. తోటి పండితుని గూర్చి ప్రశంసించుట వీరి నిగర్వితనమును సుస్పష్టమొనర్చును.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

## 5. శ్రీ గురుజాడ అప్పారావు: -

శ్రీ గురుజాడ అప్పారావు గారు, శ్రీ గురుజాడ రాఘవశర్మ ఒక వంశములోని వారే. శ్రీ శర్మగారికి వీరి తాతగారంటే అమితమైన ప్రీతి. గౌరవ భక్తి ప్రపత్తులు గలవారు. వీరే అప్పారావు గారిని గురించి ఒక సభలో మాట్లాడమంటే, "ఒక సత్య సంకల్పుడు, స్వాతంత్ర్యప్రియుడు, మేధావి, పండితుడు, బహుముఖ ప్రజ్ఞాధురీణుడు, చారిత్రక పరిశోధకుడుగా, కథానికకు మంచి ఒరవడి పెట్టినవాడుగా, సర్వమత తత్త్వ సమన్వయము చేసికొన్న భాష్యకారుడు. భాషాసంస్కరణవాది, అపహాస్యంగాని హాస్యం, ఆంతర్యము గుర్తెరిగిన నుడికారము ఆయన సొమ్ము. నదురుబెదురు లేని దిట్ట. ఉదారహృదయుడు. విజయనగర మహారాజావారి చలవ వల్ల ప్రఖ్యాతికి వచ్చాడు. నాటకకర్త, రసగ్రహణ పారీణుడు - మహాకవి 54 ఏండ్లు జీవించారు."[1] అని మాట్లాడారు.

1959 వ సం॥లో నవంబరు 30 వ తేదీన బందరులో ఒక సభలో మాట్లాడుతూ,

**"గురుజాడ వంశమున, స**
**చ్చరితా! జనియించి, బుద్ధిసంపదలందున్**
**సురగురుజాడ వెలయు, ధీ**
**వర! తాతా! అప్పరాయ! పండితగేయా!"[2]**

గురుజాడ వంశములో జన్మించి బుద్ధి సంపదలలో సురగురుజాడలో వెలుగుచుండే పండిత గేయ! అప్పరాయ తాతా! అని ఎంతో ఆప్యాయతతో పలికి, సరిక్రొత్త త్రోవలో తెలుగు భాషకు ఒరవడి దిద్దినారట. నీవు కూర్చిన బాణిలోనే దేశము నడచుచున్నది. "నినుఁగూర్చి పల్క, నివ్వెర పడుదున్ బితామహుని, వింత కథల్ విని, అప్పరాట్ప్రభూ" నిన్ను గూర్చిన విశేషములు ప్రజలు చెప్పుకుంటుంటే మా పితామహులు కదా అని నివ్వెరపడుదును అంటారు.

1963 డిశెంబరు 3వ తేదీన విజయనగరములో జరిగిన ఒక సాహిత్యసభలో అప్పారావు గారిని గురించి మాట్లాడుతూ,

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

కం॥ "ఏడ! గురుజాడ, జననం
బేడ! విజయనగరమేడ! ఎట సాహిత్య
క్రీడావిహారము, పలుకు
పోడిమి, గురుజాడ, యశముపొందితి తాతా!"[1]

కం॥ "విజయ నగరవాసిగ, నాం
ధ్రజనుల్ మన్నించుటెల్ల ధర్మము, కానీ
నిజమరయ, నీవుమాదు, గు
రుజాడ వాడవని, నిన్నెఱుంగరు, తాతా!"[2]

అంటారు. గురుజాడ అప్పారావు గారి జన్మస్థలము నిజమునకు విజయవాడ వెళ్ళు దారిలో మంటాడ రోడ్డు నుండి లోపలికి గల గురుజాడ గ్రామమే. వీరు విద్యాభ్యాసము కొరకు, ఉద్యోగరీత్యా విజయనగరము వెళ్ళినారట. చాలా సంవత్సరములు విజయనగరములో గడిపినారు గనుక విజయనగరవాసిగా ఆంధ్రజనులు నిన్ను మన్నించుట ధర్మమే. కాని నిజము పరిశీలించినచో నీవు మా గురుజాడ గ్రామానికి చెందినవాడవని నిన్నెరుగరుతాతా! అంటారు. శ్రీ శర్మగారికి వీరి వంశీకులైన శ్రీ గురుజాడ అప్పారావు గారంటే ఎంతో ప్రేమ. నిజమునకు అప్పారావు గారినిశర్మగారు చూడలేదుట. వారే

"నిన్నుగనంగలేని, దురదృష్టమదొక్కటె, మాటిమాటికిన్
నన్నుఁగలంచు, నీ యశమనంతముగా, నడుగడ్డునన్ గనన్
మన్ననఁగన్న, యీ పురము, మామకభాగ్యముగాగ, మన్న నీ
కన్న కుమారు సంతతినిఁగంటిని, మంటిని నేడు, తాతయా!"[3]

నిన్ను చూడలేని దురదృష్టమొక్కటే మాటిమాటికి నన్ను బాధించుచున్నది. నీ కుమారులను చూచాను. నీవు నివసించిన ఈ పురమును చూచాను. నిజముగా ఇది నా అదృష్టము. అని అంటారు. తాతగారిని స్వయముగా చూడలేక పోయినా వారిల్లు, వారి కుమారులను, వారు సంచరించిన విజయ నగరమును చూచుట తమ అదృష్టముగా భావించిరి. ఇట్టి కవితల్లజుని వంశములో పుట్టినందుకు అదృష్టమే గాదు,

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3 పద్యాలు

**"... ... ... ... ... ... ... సుకృతాత్ముఁడనైతి, వంగడం**
**బందు జనించి, పేర్గనుట, అంతయొ,యింతయొ,**
**తెన్గు పల్కుతియ్యందనమున్ రవంత తెలియన్**
**బలుకన్ మనఁగంటి తాతయా!"[1]**

సుకృతాత్ముడను. నీ వంశములో పుట్టుట వలన పేరు పొందుట, ఏ కొంచెమో తెలుగు తియ్యందనము రవ్వంత తెలియునట్లుగా పలుకుచు బ్రతుకుచున్నాను. అంటారు. దీని వలన వీరికి తమ తాతగారి పట్ల ఎంతటి గౌరవ ప్రపత్తులు గలవో స్పష్టమగుచున్నది.

శ్రీ గురుజాడ అప్పారావు గారి శతజయంత్యుత్సవము విజయనగరములో జరిగినప్పుడు వీరు కూడ పాల్గొనిరి. మీ శతవార్షికోత్సవము దేశము నాల్గుమూలల అందరు నీ సేవ గుర్తెరిగి చేయుచున్నారు. నేటికి నీ ఆశయములు ఫలప్రదములైనవి. దేశము శాశ్వతముగా నీకు ఋణపడెను. నీ యశస్సుకు చిహ్నములైన వాటిని, నీవు నిర్మించిన సౌధములను చూసాను. రాత్రింబవళ్ళు శ్రమించి గడించిన సాహితీ ధనమును చూచితిని. అని ఆనందము పట్టలేక,

ఉ॥ **"తాతవు, తెన్గుసేతకు, సుతారము గూర్చిన నవ్య మార్గ సం**
**ధాతవు, నిత్యనూత్న జనతా హిత రంజిత భావి భావని**
**ర్ణేతవు, స్వీయ దేశ జననీ పద సేవ్య మనోజ్ఞ భావ వి**
**జ్ఞాతవు, తెన్గు పల్కమొనగాడవు, వీడవు జాతి మర్మముల్".[2]**

నీవు తాతవు, తెన్గుసేతకు సుతారము గూర్చి నవ్య మార్గసంధాతవు. జనుల హితమును గూర్చిన భావి నిర్ణేతవు. నీదు దేశ మాత పదసేవ్య మనోజ్ఞ భావ విజ్ఞాతవు. తెలుగు భాష పలుకుటలో నీవే మొనగాడవు. జాతి మర్మములు విడచి పెట్టని వాడివి. అంటారు. నిజముగా అప్పారావుగారు తెలుగు భాష పలుకుటలో మొనగాడే.ఎక్కడను అర్థంగాని పదము ఒక్కటైనా ఉండదు. అలతి అలతి పదాలతో నిండైన భావసంపద వారి సొత్తు. వారి ముత్యాల సరములు నిజముగా శారదామాత గళమున వ్రేలాడు ముత్యాల సరములే. ఇదే పోలిక, అదే కవిత్వ లక్షణములు శ్రీ శర్మగారికి అబ్బి ఉండును.'ఇంగువ కట్టిన గుడ్డ కదా! వంశములో లేని లక్షణములు ఎక్కడ నుండి వచ్చును? తాతను మించిన అనలేముగాని తాతకు దీటైన భావజాలము, పదసంపద పుణికి పుచ్చుకున్నవారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

చ॥ "లలితకళా సరస్వతి గళమ్మున బల్కు పసందుఁజిల్కఁగా
బొలుపుగ ముత్తియంపు సరముల్ ముదమొప్పఁగఁగూర్చినట్టి, వా
గ్విలసిత సద్రసజ్ఞుఁడవు, వీనులవిందుగ నీవు వల్కఁ జెం
గలువలు పూచె వెన్నెలలు కాచె నుడిన్, నవనీత మానసా!"[1]

నీ వాక్కునందు పసందు ఁ జిల్కగా అవి ముత్తియపు సరములై లలితాకళా సరస్వతి గళమున ప్రకాశించినాయి. వీనుల విందుగా నీవు పలుకగానే చెంగలువలు పూచినాయి. వెన్నెలలు కాచినాయి. నవనీత మానసా! అంటారు.

అప్పారావు గారి మనస్సు నవనీతమట. అనగా వెన్న. వెన్న తెల్లగా మృదువుగా ఉండును. అట్టి మనస్సు ఆలోచనలకి కేంద్రము. దాని నుండి జాలువారిన కవిత్వము వీనులకు విందు, పల్కుటకు పసందు గూర్చిన పలుకులు స్వచ్ఛముగా తెల్లనైనవి గనుక ముత్తియపు సరములు. ఆముత్తెపు సరములు లలిత కళా సరస్వతి కంఠసీమనలంకరించుట, ధరించిన సరస్వతీదేవియు యాకుందేందు తుషారహారధవళ. ఎంతటి మనోహర వర్ణన అంతేగాదు. శ్రీశర్మగారు ముత్యాల సరము ఛందస్సులోనే కొన్ని గేయాలు వ్రాసి వారి తాతగారి మెడయందలంకరించిరి. అవి ఇవి:

"నవ మౌక్తిక హారం - స - త్కవి సుమనోహారం
ప్రవిమలఛందస్సారం - నవ కవితకలంకారం.

1. తెనుఁగు తల్లికి ఁ గూర్చితివిగా - తీరుగా ముత్తియసరాలు
తేటగా మాటలను - తీయని - తేనె ఁ జిలుకంగా ॥
2. అమ్మతో మాటాడగా, పె - ద్దన్నతో పలుకాడగా, చిన
తమ్మునితో ఆటాడగా, సూ - త్రాలు గట్టుదుమే॥
3. ఆలితో సరసాలలో ,పసి - బాలురహాస్యాలలో, మొగ
సాల, మెలగు ముచ్చటల, అ - డ్డాలు వెట్టెదమే॥
4. ఊరిలో పొరుగూరిలో, వ్యవ -హారముల, ఆహారములలో
దారిలో, రహదారి, పల్కే - తీరు తీర్చెదమే॥
5. తీయనౌ జాతీయముల, వెను - దీయని భావముల, కర్ణర
సాయనముగా, పాడితివి, మేల్ - గేయములు సుకవీ!

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

6. కులుకుచు ధరియింప గళమున - గూర్చితివి ముత్యాల సరములు
తెలుగు తల్లి వినూత్న కళ, రం - జిలుచు వెలుగంగా

7. మఱపురాడుగా, నీ గిరీశం - మఱపురాదుగ నీదుపూర్ణిమ
మఱతుమే నీ దేశ భక్తిన్ - పౌరలుగీతాలన్

8. గొప్ప చెప్పట కాదు, గురుజా - డప్పరాయ మహాకవీ! రస
ముప్పతిలఁ బల్కితివి, జాతి - చెప్పకొని, మురియన్

9. అందుకొనుమిదె కూర్చితిని ముత్యాలసరము, సరస్వతీ గళ
మందలంకారముగఁదీర్చిన - "అప్పరాట్ సుకవీ!"[1]

ఆనందము పట్టలేక ఈ మాలిక వ్రాసి వారి తాతగారి మెడ నలంకరింపజేస్తే గాని వారు తృప్తి పడలేదు. అంతేగాదు అప్పారావుగారు నడయాడిన స్థలము విజయనగరము - ఎంతో పవిత్రమైనది అని

సీ॥ "అపర సరస్వతి అజ్జాడ కులుని,కా
లందె, చిందిన రసమందిరమ్ము,
పరవశులంజేయు, ద్వారము స్వామి తం
త్రీ నినాద స్రవంతీ ధరిత్రి
సంగీత సాహిత్య సకల విద్యా భోజు
డానంద గజపతి శ్రీ నిలయము
ఆంధ్రభారతికి, ముత్యపు సరుల్ గూర్చిన
గురుజాడ అప్పరాట్ గురుపురమ్ము

గీ॥ సరస సత్కవి బృంద భాసురపురమ్ము
నిఖిల శాస్త్ర విజ్ఞాన పండితపురమ్ము
శ్రీ సమేతమ్ము, సత్కళా భాసురమ్ము
విజయనగరమ్ము సకలార్థ వేదితమ్ము
గంటి, యానందమున్ గంటి, మంటినేడు".[2]

విజయనగరము అపరసరస్వతి యనదగిన అజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసుగారి కాలి అందె చిందిన రసమందిరమట. ద్వారము వెంకట స్వామి నాయుడు గారి తంత్రీ నినాద స్రవంతి జాలువారిన స్థలమట. సంగీత సాహిత్య సకల విద్యాభోజుడానంద గజపతి శ్రీనిలయమట. ఆంధ్రభారతికి ముత్తెపుసరులు

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

గూర్చిన గురుజాడ అప్పారావు గారి పురమట. సకలకళా భాసురమైన విజయ నగర పురమును గంటిని అని ఆనందపడి ధన్యుడనైనానంటారు. ఒక్కొక్క దేవతలకు నిలయమైన ఆలయము ఎట్లా పవిత్రమైనదో ఒక్కొక్క మహామహుడు సంచరించిన స్థలముకూడ అంత పవిత్రమైనది. అప్పారావుగారిని స్వయముగా చూడలేకపోయినా ఆయన నడిచిన స్థలము - కీర్తిగాంచిన ప్రదేశము దర్శించినంత మాత్రము ననే ధన్యత పొందినట్లు భావించుట - వీరికి తమ వంశీకుల పట్ల గల ప్రేమాదరములు వ్యక్తమగుచున్నవి.

గురుజాడ అప్పారావు గారు 1915 సం॥ నవంబరు 30 వ తేదీన స్వర్గస్తులైరి. ఆ సమయములో శ్రీ శర్మగారు గురుజాడ అప్పారావు గారిపై ముత్యాలసరము ఛందస్సులో జోహారులర్పించిరి.

1. "అందుకొనుమి, జోహారులివె, శ్రీ అప్పరాయమహాకవీ! మక
రంద బిందుల చిందుపల్కు ప - సందుగల ప్రాజ్ఞా!

2. దేశమంటే మట్టి కాదోయ్ - దేశమంటే మనుషులని, సం
దేశమిచ్చిన యట్టి ప్రాజ్ఞుఁడ - దేశకుడవయ్యా!

3. ఎంత నేర్చిన, యెట్లు కూర్చిన - సుంతయున్ సమకాలికులు, కని
సంతసింపరు, యెట్టి సద్రస - వంతమౌరచనన్

4. హావభావము తెలియకే, శ - బ్దార్ధమున్ విడఁదీయగా, ని
ర్జీవమగుగాదొక్కొ కీళ్ళన్ - కేవలము త్రుంపన్

5. ధీరుడవు, గంభిరుడవు, పాం - గారు హృదయంబెఱుగకేవెట
కారముగ దూరుదురె! అంతస్సారమెఱుగరుగా॥

6. కాలమున్ దేశంబెఱుంగక - గేలిసేతురు మేలు దెలియక
తూలి నడచితివంట, వారల - తూకమందకయే॥

7. ఎన్నడో నక్షత్రపథి, యెం - తెంతొ కాంతులజిమ్మి సరగున
కన్నుమొఱగినతారపై వ్యా - ఖ్యాన మిప్పటికా॥

8. ఎన్నడో, యొక అంటుమామిడి - గున్నపై యెలు గెత్తిపాడిన
దన్న కోయిల, దానిస్వరము, ప్ర - సన్నముగలేదా!

9. కాకి పొడిచిన యట్టులేరో, ఛి - కాకుగా వాకొనదలంచిరి
కాకి యో కోకిలయొ, తెలియ - లేక యున్నారే".[1]

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

గురుజాడ అప్పారావు గారి రచనలపై ఎన్నో విమర్శలు వెలువడినవి. అది దృష్టిలో పెట్టుకొని దేశమంటే మట్టికాదు - దేశమంటే మనుష్యులు అని సందేశమునిచ్చిన దేశికుడవు. ఎంత రసవంతమైన రచనయైనా సమకాలికులు చూచి కొంచెము కూడా సంతోషింపరు కదా! మీరు ధీరులు, గంభీరులు - లోతైన భావసంపదను తెలియక వెటకారముగా నిందింతురుగదా! అంతస్సారమెరుగరు కదా! కాలమును - దేశమును తెలిసికొనక - కాలానికి తగ్గట్టుగా మేలు చేయు రచన చేశారని తెలియక గేలిచేయుదురు. వారల విమర్శల తూకమునకందక నడచితిరట. అని వాపోతారు. అయినా మీరు ఎంతో కాంతుల విరజిమ్మి నక్షత్ర పథగాములైన వారిపై, కంటికి కనబడకుండా పోయిన తారపై ఇన్ని రోజులకా వ్యాఖ్యానము చేయుట అని ఆశ్చర్యపోతారు. కాకి పొడిచినయట్లుగా చికాకుగా వ్యాఖ్యానించుట ప్రారంభించిరి. వీరు కాకియో, కోకిలయో తెలియలేకున్నారే? ఎప్పుడో ఒక మామిడి గున్నపై యెలుగెత్తి పాడిన కోయిల కంఠస్వరము ప్రసన్నముగా లేదా? అని ఆశ్చర్యపోతారు. దేశకాల మాన పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రచనలు చేసినప్పటికి అవి కొంతమందిని అలరించవచ్చును. కొంతమంది దృష్టిలో దోషభూయిష్టము గావచ్చును. అది కేవలము వారి పట్ల ఈర్ష్యాద్వేషాలకు లోనై చేసినదే గాని వేరుగాదు.

## 6. శ్రీ దివాకర్ల వేంకటావధాని గారు: -

శ్రీ శర్మగారు ఒక సభలో దివాకర్ల వేంకటావధాని గారిని గురించి,

**గీ॥ "శ్రీ దివాకర్ల వంశవార్నిధి శశాంకు**
**డఖిల శాస్త్రజ్ఞుఁడీ, వేంకటావధాని**
**బుధవరేణ్యుడు, స్వీయవాక్సుధవెలార్ప**
**చేరె, నిట గనుడి, వారివాగ్ధార నేఁడు"॥[1]**

శ్రీ దివాకర్ల వేంకటావధాని గారు సమస్త శాస్త్రములు తెలిసినవారు. బుధవరేణ్యులు. తమ వాక్సుధను ప్రదర్శించుటకై ఇక్కడకేతెంచిరి. వారి వాగ్ధారను ఈ రోజు చూడండి అని సభాధ్యక్షుడుగా పల్కిరి.

**ఉ॥ "పుక్కిట పట్టినాడితడపూర్వముగా, కృతపుణ్య మెట్టిదో**
**లెక్కకు మించియెన్నో, యవలీల కవీంద్రుల దివ్య వాక్కులన్**
**చక్కగ నేర్చికూర్చెను, పసందుగ విందొనరింపజొచ్చెగా**
**మక్కువ మీర వారికి, నమస్కృతులిండు కృతజ్ఞతన్ సభన్".[2]**

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

దివాకర్ల వారి పూర్వజన్మసుకృతమేమొ విషయజ్ఞానమునంతా పుక్కిటబట్టినారు. కవీంద్రుల దివ్య వాక్కులను అవలీలగా చక్కగా ఏర్చి కూర్చి పసందైన విందొనరించుటకు విచ్చేసిరి.అది కూడా చాలా ఇష్టపూర్వకముగా వచ్చిరి అని చెప్పారు. ఎన్నో విషయాలను కంఠోపాఠముగా చెప్పుట వారి వైదుష్యానికి ధారణాశక్తికి నిదర్శనము. మనము మామూలు విందు చేస్తే వారు కవిత్వ విందు చేయుట అది షడ్రసోపేతముగా ఉండుట అపూర్వము. ఈ అదృష్టము ఏ ఒక్కరికో గాని లభ్యము గాదు.

ఉ॥ **"కావ్యములెన్నియేన్ చదువగా గల మందలి కొన్ని పద్యముల్**
**శ్రావ్యముగా పఠింపగల శక్తి లభించుట పూర్వమందు సం**
**స్తవ్యమవన్నిజ్ఞప్తిగొని, ధారణ సేయుటప్పగించుటల్**
**దివ్యతపోధనముగ ఫలించుటలెంతయు గాంచుఁడీ కవిన్"[1]**

కావ్యములెన్నియైన చదువగలము. వాటిలో కొన్ని పద్యాలు మాత్రమే శ్రావ్యముగా కంఠోపాఠముగా గానము చేయు శక్తి లభించుట అపూర్వము. అవి అన్నియు గుర్తుంచుకొని ధారణ చేయుట అప్పగించుట నిజముగా గొప్ప తపస్సువంటిది. అట్లాంటి శక్తి గలవానిని, దానిలో సఫలీకృతులైన దివాకర్ల వెంకటావధానిని గారిని చూడండి అని సభకు పరిచయము చేసిరి. దీనిని బట్టి శ్రీ దివాకర్ల వారు ఎంతటి పాండిత్యము, ధారణాశక్తి గలవారో తెలియుచున్నది.

## 7. శ్రీ ఆవుల గోపాలకృష్ణయ్య గారు: -

ఒక సభలో వాఙ్మయాధ్యక్షులైన శ్రీ ఆవుల గోపాలకృష్ణయ్య గారి గురించి ఇట్లు వ్రాస్తారు.

**"ఇతఁడాంధ్రమ్మున, సంస్కృతమునను బ్రత్యేకమ్ముఁగా మంచి పాం**
**డితి నార్జించెను, నేటిదాక, బుధసాన్నిధ్యమ్మునందుండి, చి**
**న్నతనంబందె, రచించి పేరుగొనె, గ్రంథమ్ముల్, మనీషుల్, మహో**
**న్నతి సమ్మానము సేయగంటిని, నలందామందిరంబందునన్".[2]**

శ్రీ ఆవుల గోపాలకృష్ణయ్యగారు తెలుగు భాషలోను, సంస్కృతభాషలోను కూడా మంచి పాండిత్యమునార్జించెను. ఈ రోజువరకు పండితుల సాన్నిధ్యములో ఉండి చిన్నతనము నుండి రచనలు చేసి ప్రఖ్యాతి గాంచెను. అట్టి మహోన్నత వ్యక్తికి నలందామందిరములో పండితులందరు కలసి సన్మానము చేయవలెనని సంకల్పించిరి. శ్రీ శర్మగారు ఎంతటి చిన్న కొద్దిపాటి ప్రశంసనైనా సరే అలతి అలతి పదాలతో

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

పద్యములో మనోహరముగా కూర్చి చెప్పుట ఇది వారి ఆశు కవిత్వమునకుదాహరణ. అదీగాక తనతోడి కవి, పండితునకు సన్మానము జరుగుచున్నదనగా తనకు జరిగినంతగా ఆనందపడిపోయేవారు.

అభినవ తిక్కన బిరుదాంకితులైన శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారి గురించి ఈ విధంగా ఒక చక్కని పద్యమును వ్రాసిరి.

**"కారువాడితఁడు, ముద్దారుకమ్మందన**
**మూరు, పల్కాడు, గంభిరుడితఁడు**
**గట్టివాడౌత, దాకట్టి పదాల, ప**
**ల్కుట్టివడన్ వల్కు దిట్ట యితఁడు**
**మంకు వాడీతడే - జంకులేక వచించు**
**పొంకమ్ము గల్గు మీనాంకుడితఁడు**
**కడు స్వతంత్రుడితఁడు, మడచి పదమ్ముల**
**నడువగలట్టి మున్నుడి గలాడు**
**ఇతడె, యీతఁడె యాంధ్ర భారతికి మేలి**
**తొడవులం గూర్చి సంబరపడు నితండు**
**తెనుఁగుతల్లి, యదృష్టమే మనుదునిట్టి**
**కవుల దివ్య రసార్ద్ర విభవుల గంటి"[1]**

వీరు నల్లగా ఉన్నప్పటికి, ముద్దులొలుకు కమ్మని పలుకులతో రచనచేయు గంభీరుడు. గట్టివాడు కనుకనే తాను పదాల కట్టి పలుకులుట్టిపడునట్లు రచన చేయ గలుగు నేర్పరి. మంకువాడు. ఎటువంటి జంకు లేకుండా మాట్లాడును. పొంకము గలిగిన మీనాంకుడు కడు స్వతంత్రుడు. ఆంధ్రభారతికి మేలైన ఆభరణములు గూర్చి సంబరపడును. తెనుగుతల్లి అదృష్టమేమందును? ఇటువంటి దివ్యమైన రసార్ద్ర విభవులైన కవులను పొందిన ఓ భరతమాత! నీవు ధన్యురాలవు. ఆనాటి కవులు ఒకరు మెచ్చుకోవాలనో, సన్మానము చేయాలనో కవిత్వము చెప్పేవారు కాదు. ఎవరికీ భయపడేవారు కాదు. జంకు, గొంకు లేకుండా చెప్పదలచిన విషయమును ధైర్యంగా చెప్పటమే. తేలిక పదాలతో అందరికి అర్థమగు రీతిలో మనోహరముగా చెప్పిన కవిత్వము ఎంతటి వారినైనా కదలించివేయును. స్వాతంత్ర్యోద్యమ కాలములో శర్మగారు పద్యాలు గొంతెత్తి గానము చేస్తే ప్రజలు ఉత్తేజితులై సంగ్రామ రంగమున అడుగుపెట్టిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

## 8. శ్రీ గుఱ్ఱం జాషువా: -

బందరులో సెంట్ మేరీ పాఠశాల ఆవరణలో సాహితీ సంఘము, నాటక సంఘ ప్రారంభోత్సవ సందర్భముగా గుఱ్ఱం జాషువా కవికి సన్మానము ఏర్పాటు చేసిరి. ఈ సభకు శ్రీ గురుజాడ రాఘవ శర్మ అధ్యక్షులు. సభ ప్రారంభము చేయుచు,

**ఉ॥ "బందరు రాజకీయ జనపాళి వెలింగిన జన్మభూమి, ని**
**ష్యంద మరంద వాగమృతసారము జిందు, కవీంద్రచంద్రులా**
**నందమునన్ జరించు భవనమ్ము, సమస్త కళా సరస్వతీ**
**మందిర, మాంధ్ర సంస్కృతుల మార్గము వీడని ప్రోలు నేటికిన్".[1]**

బందరు రాజకీయ జనపాళిచే వెలుగొందిన మా జన్మభూమి. మధురమైన వాగమృతమును చిందించిన కవీంద్రచంద్రులు ఆనందముతో నడయాడిన భవనము. సమస్త కళలకు సరస్వతీ మందిరము. ఈ రోజుకి ఆంధ్ర సంస్కృతిని విడిచి పెట్టని పట్టణము అని గర్వముగా చెప్పుకొనిరి. ఈ బందరు పట్టణములోనే చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రులుగారి శారదా పీఠముచ్చటలు సాగెను. ఇక్కడనే అందరు ఆశ్చర్యచకితులగునట్లు నటరాజశేఖరుడు నటించెను. అని బందరు వైభవము నుగ్గడించి,

**ఉ॥ "ఈ విపరీతమేమొ! చెవికింపగు, నవ్యవసంత వేళకా**
**దె! వినుపించె శ్రావ్యముగ, తీయని పల్కుల జిల్కు కోకిలా**
**రావమొ! లేక షట్పద సరాగసునాదమొ! కాదదేదియో**
**కావలె, జాషువా కవి పిక స్వరనాద, మశేషమోదమున్"[2]**

ఇది ఏదో వైపరీత్యముగా నున్నది. చెవికి మధురముగానున్నది. ఇది నూతన వసంతవేళా! కాదుగదా! శ్రావ్యముగా వినిపించుచున్నది. తీయని పల్కులఁజిందుచు కోకిల స్వరమా! లేక తుమ్మెదలు సరస సల్లాపములతో చేయు సుమధుర గానమొ! కాదు అది ఏదో అంతకంటె మధురముగానున్నది. ఏదై ఉంటుంది? జాషువాకవి అనెడి చిలుకల నాదము. అందరికి ఆనందమును కలుగజేయుచున్నది.అని చెప్పిరి. నూతన వసంతాగమవేళ కోయిలలు చేయు కుహూ కుహూ ధ్వని కంటెను, తుమ్మెదలు సరాగములాడుకొనుచు చేయు సునాదము కంటెను జాషువా కవి చిలుకల పలుకుల స్వరములు అశేష జనమునకు ఆనందము కలిగించుచున్నదట. వీరి ఈ పద్యమును బట్టి జాషువాకు కవికోకిల బిరుదు ఎంతయో సహజముగానున్నది.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

జనరంజక మంజుల వాగ్విభూషణా! కవి జాషువా! మనస్సునకాహ్లాదమొసంగు ఎన్నో గ్రంథములను వెలయించి గౌరవమనెడి లక్ష్మీదేవిని పొందినాడవు. భారతీదేవి యొక్క యశేష విచిత్ర విలాస భూషలను రాగిలగూర్చితివి. సరసుడైన చెళ్ళపిళ్ళ కవిచంద్రులన్నా లేరు. వారి శిష్యులై ఎందరో గురుపద ప్రతిభాసములై మనుచున్నవారు రసకోవిదులు, అంచిత బుద్ధిగలవాడు, శాంతి కాముకుడు నిన్ను హాయిగా పలకరించుటకు కాటూరి కవి లేడుగా అంటారు. పింగళి, కాటూరి కవులకు ఏ మాత్రము తీసిపోనివాడు జాషువా అని వీరి అభిప్రాయము. సుమధురమైన కవిత్వమును ఆనందముతో ఆస్వాదించే రసహృదయముగల ఆ కవులిద్దరు లేరే! ఉంటే నీకెంతటి గౌరవాస్పదమైన స్థానము నిచ్చేవారోకదా! అని ధ్వని.

ఉ॥ **"మావిచిగుళ్ళనున్ మెసవిమత్తిలి పాడిన పాటలెన్నొ యాం**
**ధ్రావని మాఱుమ్రోగినవి, హాయిగఁగొమ్మలపై గమించు నీ**
**ఠీవియు, రూపురేఖలు, గడించిన భూరియశోధనమ్ము, సం**
**భావనసేయఁబూన తరమా! కవికోకిల జాషువా! యిటన్".[1]**

మామిడి చిగుళ్ళను తిని మత్తెక్కి పాడిన పాటలెన్నో ఆంధ్రావని అంతా మాఱుమ్రోగిపోయినవి. హాయిగా కొమ్మలపై విహరించు నీ ఠీవియు, రూపురేఖలు, పొందిన గొప్ప యశోధనము లెక్కించుట తరమా! అంటారు. జాషువా కవి కవిత్వము ఎంతటి మాధుర్యము గలదనగా మామిడి చిగుళ్ళు తిని, తిని మత్తెక్కి పాడిన కోకిల పాటలవలె ఉంటాయిట. ఆయన తిరిగే స్థలము చెట్ల కొమ్మలట. అనగా జాషువా కవిత్వ వస్తువులు ప్రకృతిలోని వస్తువులే. ఈయన ప్రకృతి ఆరాధకుడు. అందువలన నీవుకొమ్మలపై ఠీవిగా నడయాడటం - నీ రూపురేఖలు గడించిన యశోధనము వర్ణించుట మాతరమగునా! అంటారు. ఆయన కంఠస్వరము

**"ఘన గంగా మధుర ప్రవాహ కవితా గానామృతానంద వా**
**హిని ముంచెత్తు రస ప్రమోదగుణు హాయిన్ జాషువా సత్కవీం**
... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ...
... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... "[2]

గంగా ప్రవాహసదృశమై కవితాగానామృతములో ముంచెత్తు రసప్రవాహమనెడి ఆనంద గుణము చేత అందరికి హాయిని కలిగించునదిట. ఈ లక్షణములుండబట్టే కవి కోకిలయైనాడు. వీరి గుణగణముల వర్ణిస్తూ,

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

ఉ॥ "ఈతఁడొకించుమించుగఁ బదేడులవాడు, పిపీలికాది య
జ్ఞాతులఁ బల్కరించు మొనగాడు రసప్రమదుండు, మించి వి
ఖ్యాతి గలట్టివాడు, బహుగ్రంథములన్ రచియించినాడు, ని
ర్భీతినిఁబల్కువాడు, సుకవీంద్రుడు జాషువ ధన్యుఁడీతడున్"[1]

జాషువా కవి ఇంచుమించు పదిసంవత్సరముల వయస్సువాడు. చిన్న చీమ దగ్గరనుండి అజ్ఞాతముగా నున్న ప్రతి ఒక్కరిని పల్కరించు మొనగాడు. రసప్రమదుఁడు. అంతకంటే మించి ఖ్యాతి గలవాడు. బహుగ్రంథకర్త ఏదైనా ఒక విషయమును చెప్పాలంటే భయపడకుండా చెప్పేవాడు. సుకవీంద్రుడు. నిజముగా ఇతడు ధన్యుడు అని కొనియాడిరి. ఒక కవి సాటి కవిని ఇంతగా సమాదరించడు. సహజమైన ఈర్ష్యాద్వేషాలకు తావు లేదు. ఎంతటి వానినైన ఇట్టే పసిగట్టి వానిలోని గుణములను ప్రశంసించి ఆశీర్వదించే మహోన్నతమైన స్వభావము గలవారు. ఈ సభ చివరలో నవయుగ కవి చక్రవర్తి మానవత, మానవత్వము నిలుపఁగాంక్షించే । మానవయుగ కవి చక్రవర్తి - మా - నవయుగ కవి చక్రవర్తి అతడే -మా నవయుగ - కవి - చక్రవర్తి అగును. కదా! అనగా జాషువా చాలా సంతోషించి, కవి స్ఫూర్తి విశేషం. కవి కాబట్టి యిట్టిది స్ఫురిస్తుందన్నాడు.[2]

తోటి కవుల నాదరించే హృదయముగల శర్మగారు ధన్యులు.

## 9. శ్రీ కాటూరి వేంకటేశ్వరరావు - శ్రీ పింగళి లక్ష్మీకాంత కవులు: -

శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారు శ్రీ కాటూరి వేంకటేశ్వరరావుగారు జంట కవులు. వీరు మహాకవులుగా వెలుగొందు కాలములో శ్రీ గురుజాడ రాఘవ శర్మ తమ కృతులు కొన్నింటికి శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారిచేత కాటూరి వెంకటేశ్వరరావుగారిచేత ఆశీస్సులు స్వీకరించుట జరిగినది. శ్రీ శర్మగారికి వీరిద్దరంటే అమితమైన గౌరవ భావము. వీరితో చాలా సన్నిహితముగా మైత్రీ భావముతో మెలగినవారు. కల్పలత కావ్యఖండికకు తమ ఆశీస్సుల నందజేయుచు, శ్రీ పింగళి లక్ష్మీకాంతము గారు, "స్థిరయశుఁడైన యీతని నూతన రచనలకు ఇతరుల పీఠికలు అనావశ్యకములే గాక అపేక్షణీయములునుగావు. పీఠికయను పేరుతో నాల్గు వాక్యములు వ్రాయించి వానిని తనకు తన కావ్యమునకు దీవెనలుగా గైకొనవలెననియు ఇతనికి కుతూహలము. యీతడు నాయెడ చూపు పెద్దతనమును కాదనలేక మైత్రిని పాటించి యీ పరిచయ వాక్యములను వ్రాయుచున్నాను.[3] అని వ్రాసిరి. దీనిని బట్టి శ్రీ శర్మగారికి లక్ష్మీకాంతంగారి పట్ల గల గౌరవ భావము వ్యక్తమగుచున్నది.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి, 1, 2 పద్యాలు
2. శ్రీ పింగళి లక్ష్మీకాంతం గారు పరిచయము, కల్పలత పుట 1

**"శ్రీ కాటూరి కులాంబుధి**

**రాకేందూ! వేంకటేశ్వరా! ప్రాజ్ఞాల**

**క్ష్మీకాంత కవీంద్ర! నమో**

**వాకములివె, గొనుఁడు, భక్తి భావన నిత్తున్"[1]**

అని వీరే ఒకచోట వ్రాసికొనిరి. దీనివలన వీరి పట్ల భక్తిభావము వెల్లడియగుచున్నది. ఏదైనా ఒక పద్యము గాని, ఏదైనా ఒక కావ్యముగాని ఎవరు వ్రాసారు ఇంత మధురముగా అను శంక ఏర్పడినపుడు లక్ష్మీకాంతంగారు వ్రాసారు. లేదా కాటూరి వేంకటేశ్వరరావుగారు వ్రాసారు అని ఒక పేరే చెప్పాల్సిన పనిలేదు. ఇద్దరు సమానులే అని చెప్పుటకు " ... ... ... ... ... ... ... ... ... కవి

**"త్వాకాశమ్మున వెల్గు వీరు రవిచంద్రాత్ముల్, స్వకీయ ప్రతి**

**ష్ఠాకాంతుల్ వెదఁజల్లదక్షులు, నమస్కారమ్ములీ జంటకున్."[2]**

అని అంటారు. కవిత్వమనెడి ఆకాశములో వెలుగు సూర్యచంద్రులు వీరిద్దరు. ఇద్దరు తమకావ్యముల ద్వారా కీర్తి ప్రతిష్ఠలను వెదఁజల్ల చేయుటలో దక్షులు. సూర్యుడు లేకుండా చంద్రుడు ఉండడు. చంద్రుడు లేకుండా సూర్యుడు ఉండడు. అట్లే పగలు లేకుండా రాత్రి ఉండదు. రాత్రి లేకుండా పగలుఉండదు. సూర్యుడు చంద్రుడు ఇద్దరు ఎట్లా ముఖ్యులో జంట కవులైన కాటూరి పింగళి కవులు కూడా అంతే అని చెప్పుటకు రవి చంద్రాత్ముల్ అని చెప్పిరి. రవి చంద్రులు లోకానికి వెలుగును ఇస్తే కాటూరి పింగళి కవులు కవిత్వలోకానికి కాంతులు వెదజల్లారు. కవిత్వానికి రెండు కళ్ళవంటివారు అని చెప్పుట.

**"తిరుపతి వేంకటేశ్వరులె, దేశికులైచనఁదత్స్వరూపులై**

**కరమను రాగపున్ లతలు గ్రమ్మఁగ, జంట కవీంద్రులైతి, రిం**

**కరుదగునెయ్యమున్, హరిహరాత్మకమై చెలువారుచుండ, ని**

**ర్భరి కవితా ప్రవాహము, లపూర్వముగా స్రవియించెనేకమై"[3]**

చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు, తిరుపతి వేంకట శాస్త్రిగారు జంటకవులై ఆంధ్రదేశమునందు ప్రజలందరిలో కవితాపిపాసను రేకెత్తించుచున్నప్పుడు కాటూరి - పింగళి కవులును వారి శిష్యులై వారియందలి అత్యంతను రాగముతో మసలుచుండిరి. వారి కలము నుండి జాలువారిన కవితా ప్రవాహము అపూర్వముగా అందరకు ఆశ్చర్యము గొల్పునట్లు హరిహరాత్మకమై చెలువారినది. అని చెప్పిరి. హరి అనగా

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3 పద్యాలు.

విష్ణువు - హరుడనగా శివుడు - విష్ణువు వేరు, శివుడు వేరు కాదు - ఇద్దరు ఒక్కటే అని చెప్పే రూపమే హరిహరతత్త్వము - ఆ రూపమే తిరుపతివేంకటకవులు - వారి శిష్యులె పింగళి కాటూరులు. వీరి కవితా ప్రవాహము ఒక్కటై ప్రవహించెను. ఇక ఈ జంటకవుల కీర్తి ఎట్లా వ్యాపించినదో వర్ణిస్తున్నారు.

**"క్రమమేపాఱఁగ, బాల్యమందె కలిగెంగా, శారదా సత్కటా**
**క్షము, శ్రీ సద్గురు దీవనల్ సుకవితా సామ్రాజ్య పట్టాభి షే**
**కముఁగొన్నారలు, సత్కవుల్ వొగడ, సద్గ్రంథ ప్రభాభాసమా**
**నములై ప్రాకె, యశోలతా వితతి, యాంధ్రంబందు దుర్వారమై."[1]**

చిన్నతనముననె శారదాసత్కటాక్షము కలిగినవారలు సద్గురు దీవెనలున్నవారు. సుకవితాసామ్రాజ్య పట్టాభిషేకమును పొందినవారు. సత్కవులు పొగుడునట్లుగా సద్గ్రంథములను వెలయించి వాటి వలన ఆంధ్రకవితా లోకములో ఎవరు పొందనంతటి సత్కీర్తిని పొందినవారు. తిరుపతి వేంకట కవులు అష్టావధాన శతావధానములతో ఆంధ్రదేశము కళకళలాడిపోయెడివేళలా రోజులు. వీరికి దీటైనవారెవ్వరు లేరు. అందువలన కవితాసామ్రాజ్య పట్టాభిషేకము గొన్నవారలు వీరే. ఆంధ్రదేశములో ఎదిరించి నిలబడగల దిట్టలు లేరు. అంతగా వీరి యశశ్చంద్రికలు వ్యాప్తిచెందినవి.

## 10. శ్రీ పువ్వాడ శేషగిరిరావు: -

శ్రీ శర్మగారు, శ్రీ పువ్వాడ శేషగిరిరావుగారు సమకాలికులు. ఇద్దరు ఒక పేట భాస్కరపురంలో నివసించెడివారు. శ్రీ శర్మగారికి మేనత్తకుమారుడని చెప్పేవారు. వీరిని గురించి వ్రాస్తూ ఒకచోట శ్రీ శర్మగారే

**శా॥ "మా మేనత్తకుమారుఁడన్న చిరసంబంధమ్ముదొాగదయా**
**... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ...**
**... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ...**
**... ... ... ... ... ... ... ... ... ... ... ... ... నీకు దీర్ఘాయువౌన్"[2]**

అంటారు. వీరికంటె శేషగిరిరావుగారే చిన్నవారు. ఇతడు నా బంధువు. ఇద్దరము కవులము. ఎల్లప్పుడు మధురప్రసాద కవితా రచనా ఘన సుప్రసన్న వాగ్వితతిచే సరస్వతీదేవి కృప లభించెను. నేను పెద్దవాడనగుట వలన చిరకాలము వర్ధిల్లమని, సుఖింపమని దీవనలిత్తును అని శ్రీ శేషగిరి రావు గారి సన్మాన సందర్భములో పలికిరి. శ్రీ శేషగిరి రావు గారి రచనల గూర్చి,

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

సీ॥ "పోషించితివి, కృపాపూరమ్మువెదజల్ల
బాల్యమ్మునందే "గోవత్స"మెలమి
చిత్ర చిత్రముగ రచించి కూర్చితివి ప్రౌ
ఢ వయస్సునందున 'తాజమహలు'
పాడినాడవుగ,సద్భక్తి పొంగ వయస్సు
మరలంగ వెంకటేశ్వర 'పదమ్ము'
వ్యాప్తి నొందించితి వాకాశ వీథిపై
శ్రోతలెన్న ననేక "రూపకములు".

గీ॥ "తగిన విశ్రాంతి గొనుచు, సౌందర్యమెసఁగ।
దీర్చిదిద్దితి సత్కళా దీప్తి ఖండ
కావ్యముల నెమ్మి మన్నింపగా: జనాళి
దండి కవి 'పాదుషా' బిరుదమ్ముఁ గొంటి
ప్రౌఢ కవి శేషగిరిరాయా! రమ్యగేయ!"[1]

శ్రీ శేషగిరిరావుగారు వయస్సుకు తగ్గట్లుగా రచనలు చేసిరి అని చెప్పిరి. బాల్య వయస్సులో ఉన్నప్పుడు దయారసముప్పతిల్లునట్లు "గోవత్సమను" కావ్యమును వ్రాసిరట. ప్రౌఢ వయస్సులో నుండగా, చిత్ర విచిత్రములుగా రచించి కూర్చినదిట 'తాజమహలు' కావ్యము. ప్రౌఢవయస్సు కొంత దాటిన తరువాత "వెంకటేశ్వర పదము" పాడినారట. శ్రోతలు మెచ్చుకొనునట్లు ఆకాశవాణి లో అనేక రూపకాలువెలువరించారుట. జనులందరు మెచ్చుకొనునట్లుగా సౌందర్యము రూపుదిద్దుకొన్నట్లుగా ఎన్నో కళా ఖండకావ్యముల రచించిరి. వీరు ప్రౌఢ కవియట. రమ్యమైన గేయములను రచించినవారట. 'కవిపాదుషా' బిరుదు గ్రహించిన వారట. కవులకే పాదుషా.అని చెప్పుట వీరి ఉద్దేశ్యము. వీరి రచనలను బట్టి వీరిని కవులకు పాదుషా జేసినది. ఒక వ్యక్తికి వయోధర్మాన్ని బట్టి శరీరములో ఎట్లా మార్పులు వస్తాయో అదే విధముగా రచనలలో కూడా ఆయా వయస్సులో వ్రాసిన దానిని బట్టి ప్రౌఢత్వము సంతరించుకుంటుంది.

వీరి కంఠస్వరము మనోహరమైనది. శ్రావ్యముగా గొంతెత్తి పద్యమును గానము చేయుదురు.

"కావ్యగానమొనర్తు సరస వాక్చాతురి
గళమెత్తి తీర్చి చక్కని స్వరమ్ము

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

పేశల ఫణతిని దేశకుచందాన
తీర్చిదిద్దెదవు, సందియమడంప
రసమునకు దగినట్లు సరసముగదుర
పదములూని వచించు వాక్ప్రాభవమ్ము
నీకు, నీవెగసాటి వాఙ్నిపుణమతివి
సముచిత వచో విశేష! శేషగిరి రాయ!"[1]

సరసముగా వాక్చాతుర్యముతో గొంతెత్తి కావ్యగానమొనర్చు చక్కని కంఠస్వరము - సందేహమును తేలికగా శుకుడవనితీర్చి దిద్దెదవు. రసపోషణకు తగినట్లుగా చక్కని పదములు గూర్చు వాక్ప్రాభవముగలవాడివి. దీనిలో నీకు నీవే సాటివి. వాక్చాతుర్యము గలవాడివి. సమయానికి తగ్గట్టుగా మాట్లాడు విశేష నైపుణ్యము గల వ్యక్తి శ్రీ శేషగిరిరావుగారు. ఈ కావ్యగుణముల చేతనే వీరు కవి పాదుషా కాగలిగిరి. ఇది వారి పూర్వపుణ్యా విశేషము. కవిత్వము చెప్పవచ్చును. మంచి కావ్యములు రచించవచ్చును. మధురమైన పల్కులు పలికే భాగ్యములభించుట ఎవ్వరికో గాని లభ్యము గాదు. మీరు కవులకు 'కవిపాదుషా' గనుక పల్కగలిగిరి. అని అంటారు. దీనిని బట్టి శ్రీ శేషగిరి రావుగారి రచనలకి తెలుగు సాహిత్యములో ఎటువంటి స్థానముగలదో తెలియుచున్నది.

## 1.21 స్వాతంత్ర్య సమర యోధులు: -

మహాత్మాగాంధీజీ నాయకత్వములో నడచిన భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో మచిలీపట్టణము చరిత్ర ప్రసిద్ధికెక్కినది. స్వాతంత్ర్యం కొరకు తమ సర్వస్వమును దేశము కొరకై అర్పించిన మహా వీరుల కెందరికో నివాస యోగ్యమైనదీ మచిలీపట్టణము. డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు, కోపల్లె హనుమంతరావుగారు, ముట్నూరి కృష్ణారావు పంతులు గారు, శ్రీ చెఱకువాడ నరసింహం పంతులుగారు, కాశీనాధుని పూర్ణ మల్లికార్జునుడు గారు శ్రీ కొడాలి ఆంజనేయులుగారు, శ్రీ తంగిరాల వీర రాఘవరావుగారు, శ్రీ పురాణం సూరి శాస్త్రిగారు, మొదలైన మహామహుల కోవలోనికి చెందినవారు శ్రీ రాఘవశర్మగారు. 1916 సం॥లో డా॥ అనీబిసెంట్ మహోపన్యాసమునకు ఉత్తేజితులైరి. ఆంధ్రరత్న శ్రీ దుగ్గిరాల వారి గంభీర వాగ్విలాసము వీరిని ఆకర్షించి 1920 సం॥లో త్రివిధ బహిష్కార ఉద్యమము క్రింద వీరు పని చేయుచున్న పాఠశాల ఉద్యోగమునకు రాజీనామా చేసి ఖద్దరు ధరించి నాయకమణి యైన డాక్టరు పట్టాభి

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

సీతారామయ్యగారిని దర్శించి, కాంగ్రెసు ఉద్యమములో చేరిరి. తరువాత 1921 సం॥ మార్చి 31వ తేదీన ఏప్రిల్ 1వ తేదీన విజయవాడలో జరిగిన గాంధీ గారి ఉపన్యాసములకు ఉత్తేజితులగుట, జాతీయ గేయకవి సార్వభౌముడైన శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణగారి "మా కొద్దీ తెల్లదొరతనము" వంటి గేయాల ప్రభావము వీరిని స్వాతంత్ర్య సమర యోధులను జేసినది. తత్ఫలితముగా ఉద్యమంలో పాల్గొని, ఈ జాతీయోద్యమాన్ని పల్లెలలోనూ, పట్టణాలలోనూ సైకిల్ పై తిరుగుతూ ప్రచారం చేసినారు.

**"నడుములు గట్టి - పదండి**
**ఇంక తడవేల ! బడియక ॥నడుములు॥**
**గడియ - సైపగలేమీ - కఠిన ప్రభుత్వము**
**గడియ సైపగలే మింగ్లాండు ప్రభుత్వము"[1] ॥నడుములు॥**

అని ఊరురా పాడుతూ తిరిగినందుకు 9 నెలలు కఠిన కారాగారి శిక్ష బందరు, కోన చిన్నాపురం తాళ్ళపాలెంలో సముద్రపు నీరు తెచ్చి కాచి ఉప్పు తయారు చేసినారు. అందుకు ప్రతిఫలముగా రాజమండ్రి రాయవేలురు జైలులో శిక్ష ననుభవించరి. ఈ సమయములోనే స్వాతంత్ర్య పథము నవకాళి, బాపూజీ, మొదలగు గ్రంథములను రచించుడే గాక ఎంతోమంది కవులు, రచయితలు వ్రాసిన గేయాలను ఊరూరా తిరిగి ఎంత మందికో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి సేకరించి జాతీయ గీతములు అను 685 పేజీల బృహద్గ్రంథ సంకలనము చేసిరి. ఇందియే వారిని స్వాతంత్ర్య సమరవీరుల వరుసలో నిలబెట్టినది. భారత ప్రభుత్వం తామ్రపత్రమును, స్వాతంత్ర్య సమర యోధుడుగా యావజ్జీవిత పింఛను ఇచ్చి సత్కరించినది. ఈ వివరములు లోపలి పుటలలో విపులీకరించగలను.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట : 16

## 1.22 మహాప్రస్థానము: -

శ్రీ గురుజాడ రాఘవశర్మగారు బృందావనమునకు వెళ్ళినపుడు

> **"ఘనయమునానదీతటి నొకప్పుడు, హాయిగ, గోపగోపికా**
>
> **జనములు సంతసింపఁగడు చల్లని వెన్నెలరేల, వేణువున్**
>
> **గొని, మృదువేణుగానము, నకుంఠితరక్తిని బాడినావటే**
>
> **వినియెద నొక్కసారి, మృదువేణువుఁగ్రమ్మఱఁబల్కఁజేయవే!"[1]**

అని, ఓ కృష్ణా! యమునా నదీతీరములో గోపగోపికా జనము సంతోషించునట్లుగా చల్లని వెన్నెల రాత్రిలో వేణుగాన మొనర్చినావట. ఆ మృదు వేణువునొక్కసారి పల్కఁజేయవా! వినియెదను అంటారు. వీరి కోరిక ఫలించినది. 1987 సంవత్సరము ఆగష్టు ఒకటవ తేదీ తెల్లవారుజామున నాలుగు గంటల సమయములో గట్టిగా దేవతా స్తోత్రములు చేయటము ప్రారంభించారు. నేను వెళ్ళి పిలిచే సరికి మాట్లాడలేక పోయినారు. మేము ఆదుర్దాతో డా॥ అశ్వనీకుమార్ గారిని, డా॥ గోవిందరావుగారిని ఇంటికి పిలిపించి చూస్తే స్ట్రోక్ వస్తుందని హాస్పిటల్‌లో చేర్పించమని చెప్పారు. అదిమొదలు ఇరవై అయిదు రోజులు బందరు గవర్నమెంట్ హాస్పిటల్‌లో ఉన్నారు. ఈ సమయములో ఆగష్టు 15వతేదీన వీరు వ్రాసిన జాతీయగీతము ఆకాశవాణి విజయవాడ కేంద్రములో ప్రసారమగుట యాదృచ్ఛికము. మేము అపస్మారక స్థితిలో నున్నారని భ్రమపడ్డాము. రేడియో చెవిదగ్గర పెడితే విన్నారు. కాని వైద్యులు సేవ చేస్తూనే ఉన్నారు. ఉన్నట్లుండి మధ్యలో 'ఒరేయ్' అని పిలిచేవారు. 'ఏమిటి? నాన్నగారు! పిలిచారా? అని మానాన్నగారు అడిగితే మిమ్ములను కాదురా! వాడిని' అని చేయెత్తి పైకి ఆకాశం వైపుకి చూపించేవారు. మీకేమి కావాలి? అని అడిగితే 'మీరు సేవచేస్తున్నారు కదా! నాకింకా ఏమికావాలి? I am satisfied' అన్నారు. శ్రీ కృష్ణ భక్తి పరవశులైన వీరు శివకేశవా భేదతత్త్వాన్ని ఆ విధముగా 'జీవైక్య సంధానమొనర్చి' భాద్రపద శుద్ధ పాడ్యమినాడు అనగా 25-8-1987 సంవత్సరములో శ్రీ కృష్ణసన్నిధికి చేరినారు. బాహ్య శరీరముగా వారు కనబడక పోయినప్పటికి, వారి వాణి మృదువేణుగాన రవళి మా బృందావనములో మ్రోగుచునే యున్నది వారి జీవిత విశేషాల రూపములో, అదే ఈ సిద్ధాంత వ్యాసము.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

# ప్రకృతి పరిశీలకుడు - కాళరాత్రి

# ప్రకృతి పరిశీలకుడు - కాళరాత్రి

భగవంతుని లీలలు అనంతములు. మానవుని హిమవన్నగాలపై అధిష్ఠించనూగలడు. పాతాళ గహ్వరసీమలో పడత్రోయనూ గలడు. అమృతమును వర్షించి జీవులను చిరంజీవులను చేయగలడు. బడబాగ్నిని ప్రజ్వలింపజేసి జీవకోటిని భస్మీపటలము చేయగలడు. ప్రళయ, ప్రణయములను, సుఖ దుఃఖములను సమదృష్టితో స్వీకరింపగలిగినవారే తపస్వులు, మహర్షులు. కాని సామాన్య మానవులు సుఖములు కలిగినప్పుడు పొంగిపోవుట, దు:ఖములు గలిగినపుడు వ్యాకులత చెంది నిర్వీర్యులగుట సహజము[1]. ఏదైనా ఒక ప్రళయము సంభవించినపుడు ధైర్యముతో ఎదుర్కొనే శక్తిని, యుక్తిని గూడ ప్రసాదించువాడు ఆ భగవంతుడే. మానవ సృష్టి జరిగినట్లే ప్రకృతిలో ప్రతి వస్తువును, చెట్లు, చేమలు, నదులు, సముద్రాలు, పర్వతములు, పశు, పక్షులు, జంతుజాలములను సమస్త ప్రాణికోటిని భగవంతుడే సృష్టించినాడు. పోషిస్తున్నాడు. లయము చేయునది కూడా ఆయనయే. ప్రకృతిలోనున్న ప్రతి అణువులోను పరమాత్మను దర్శించినవారు, ధ్యానము చేసినవారు ఋషులు, మునులే. ఇది సామాన్య మానవునికి అందే భావము కాదు. అట్టి ప్రకృతి ఆరాధకులలో రవీంద్రనాథ్ ఠాగూర్, అరవిందులు మొదలైనవారిని పేర్కొనవచ్చును. భగవంతుని ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదనునట్లు ప్రకృతిలోని ప్రతి వస్తువులోనూ, ప్రతి జీవములోనూ భగవంతుని చూడగలిగినవారు ప్రతి లీల భగవంతుని లీలగా భావించి తన్మయులైనవారు శ్రీ గురుజాడ రాఘవశర్మగారు. వీరు అట్టి తాత్వికులు, యోగనిష్ఠులు గనుకనే "కాళరాత్రి" గ్రంథమును కరుణరస కావ్యముగా వెలువరించగలిగిరి. ఈ కాళరాత్రి గ్రంథానికి మున్నుడి వ్రాసిన శ్రీ ప్రసాదరాయ కులపతి (పూర్వాశ్రమములో) శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వాములవారి మాటలలో చెప్పవలెనన్న, "కాళరాత్రిలోని వర్ణనలు స్వయముగా చూడని వారికి ఆ భీభత్స భయంకర దృశ్యాలను చూపిస్తాయి. సహజసిద్ధమైన వారి సారస్వత శక్తి తా దృశ మహత్వ సముదీరిత. తాత్వికులు, యోగనిష్ఠులునై గురుజాడనెరిగిన గురుజాడ వారికి ఇది నా చిరు కానుక.

**"శబ్ద యోగమ్ములో రహస్యములెరింగి**
**రాజ యోగమ్ములోని, మర్యాద లరసి**
**జననుతుండైన, రాఘవశర్మగారిఁ**
**బ్రస్తుతించెద నభిమాన పరత వెలయ"[2]** అని అంటారు.

---

1. శ్రీ ఎ.వి.ఎస్. రెడ్డి, అభినందన - కాళరాత్రి పుట 13
2. డా॥ ప్రసాదరాయ కులపతి, మున్నుడి - కాళరాత్రి పుట 9

ఈ కాళరాత్రి గ్రంథానికి కరుణరసకావ్యమని తమ అభిప్రాయాలను వెలిబుచ్చుచు డా॥దాశరథి "తెలుగు చరిత్రలో అతి భయంకర విషాదాధ్యాయం ఇటీవల వచ్చిన ఉప్పెన". ఆ జలప్రళయాన్ని గురించి తలచుకుంటే హృదయం జలదరిస్తుంది. ప్రఖ్యాత స్వాతంత్ర్యసమరయోధులు, విఖ్యాత కవినాథులు శ్రీ గురజాడ రాఘవశర్మగారు. ఉప్పెనను గుప్పెట బట్టి కవితలో కుదించి "కాళరాత్రి కావ్యంగా అందించారు. వారి హృదయములోని వేదన ప్రతిపాదమున ప్రతిధ్వనిస్తుంది. ఊహాసౌధముల నివసించుకవి కాకపోవుట వలన శ్రీ రాఘవ శర్మగారి లేఖిని ప్రజావళి అశ్రువులకు అక్షరరూపం ఇవ్వగలిగింది[1]". అని ప్రశంసించిరి.

జలప్రళయము కరాళ నృత్యము చేసిన రాత్రి 1977 సంవత్సరము నవంబరు 19 వ తేదీ శనివారం రాత్రి నిజముగా చరిత్రపుటలలో లిఖింపదగిన "కాళరాత్రి". అసమాన ధైర్యసాహసములు, మనస్థైర్యమును ప్రకటించు వారిని కూడా ఆశ్చర్యభయభ్రాంతులనుగా చేసి నిశ్చేష్ఠులను చేసిన భయంకర దృశ్యమది. వేలాది మనుష్యులను, పశువులను, ఎన్నోవేల క్రిమికీటకాదులను తుడిచిపెట్టి వందల గ్రామాలను భూస్థాపితము చేసిన ఆ పెను ఉప్పెన చేసిన బీభత్సము మరువలేనిది. దీనిని హృదయవిదారకముగా గొప్ప కరుణరస కావ్యముగా తీర్చిదిద్దిరి శ్రీ శర్మగారు.

వారే "కాళరాత్రి" గ్రంథమునకు పరిచయ వాక్యాలు వ్రాస్తూ "ప్రళయ, భీభత్స స్వరూపముగా ఉద్భవించి వేలకొలది జీవుల, జంతుజాలముల, ఆస్తిపాస్తుల, చెట్టుచేమల బలిగొన్న 19-11-1977 నాటి "ఉప్పెన" తలచుకొన్న ఒడలు జలదరించును. ఆనాడుదయము ప్రారంభమై, సాయంత్రము 3-00, 4-00 గం॥లకు ఆకాశము చీకటి కోణముగా, ఎంతో భయానకముగా పొడకట్టినది. మాది బందరు. ఊరికి బయట, బంగరు బైలులో కట్టబడిన చిన్న మేడ. చుట్టూ యే చెట్టుచేమలు, యిండ్లులేని, మా భవనము వైపుగా సాగిన ప్రళయగాలి తాకిడికి, ఆవరణ గోడలు, రేకులు, షెడ్డులు లేచి, త్రోవనడ్డిన కొయ్యగుంజలను రాతి గోడలను చీల్చి, పడగొట్టి ధూళివలె ఆవలకు యెగిరిపోయినవి. ప్రక్కనగల పెంకుటి సావిడిలో మా పశు వులు, బైటవారి పశువులెన్నో బ్రతికి బయటపడినవి[2]". తెరలు తెరలుగా వీచే ఆ ప్రచండ వాయువు మ్రోత, వడి గమనించిన ఎందరో జనులు, భవనమును పైకి ఊపి లేపినట్లుగా పొడగట్టినది. రాత్రి 10-00, 12-00గం॥ల వరకు భయాందోళనలతో ప్రాణములు చిక్కబట్టుకొని, నేడు తెల్లవారునా! బయటి ప్రపంచము చూడగలమా! అనే దిగులు అధికమయ్యెను. రాత్రి రెండు ఝాములకు గాలి వేగము తగ్గి

1. దాశరథి కరుణరస కావ్యం - కాళరాత్రి పుట 10
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ పరిచయము - కాళరాత్రి పుట 5

సూర్యోదయమగుసరికి బ్రతికి బయట పడినామని బైటికి వచ్చి బీభత్సకరమగు చుట్టు ప్రదేశములను చూచి విభ్రాంతులమైనాము. అంతా ఒకే నడుము లోతు పైగా ప్రవాహము. ఆ నీరు, కొట్టుకొనిపోవు యెన్నియో వాహనములు, యింటి కప్పు సామానులు, ఇంటికవతల ఒకేఒక జలప్రవాహము. దాని మధ్య గీచినగీటువలె రైలు రోడ్డు మాత్రము కానవచ్చెను. దానినంటి ఒడ్డునకు కొట్టుకు వచ్చిన ధాన్యపు కుప్పల కట్టలు, జంతు మానవ కళేబరములు, నీరు ఈదుకుంటూ చేరు జనసమూహము, స్వీయపరబేధము లేక అందిన వస్తువుల ఇల్లుజేర్చుకొను జనుల సందడి కాననయ్యెను. నిమిష నిమిషానికి ఆ చెవినుంచి ఆ చెవికందించు ఉప్పెన తాకిడికి గురియైన ప్రళయవార్తలు విని వాపోవు జనఘోష, హృదయవిదారకముగా విననయ్యెను. మా మేడ ఉన్నతస్థలమున కట్టబడినదగుటచే, జలప్రవాహము ప్రహరీ గేటు వరకు మాత్రము వచ్చి నిలచినది. అట్టి భీభత్స స్వరూపములను కండ్లారగాంచినది, విస్త ృతముగా విన్నది ఊహించినది ఒక ఖండకావ్యముగా వెలువరించవలెననే ప్రేరణ లోన కలిగినది[1]" అని వ్రాసిరి.

నేను (గురుజాడ రాజరాజేశ్వరి) అనగా వారి మనుమరాలిని అప్పుడు వారితో మేమంతా కలిసి వారు పైన ఉదహరించిన ఇంటిలోనే ఉంటున్నాము. గాలి తాకిడికి ముందు తలుపులు బోల్టులు వేస్తే వచ్చినట్లు ముందు హాలులో గోడలకు వ్రేలాడ దీసిన పటాలు అన్ని క్రిందపడి బద్దలు అయిన దృశ్యము, కిటికీలో నుండి బడబాగ్ని సముద్రములో నుండి పైకి ప్రజ్వరిల్లినప్పుడు ఆకాశమంత ఎత్తు వచ్చి ఆ ప్రదేశము అంతా ఎర్రగా అయితే అది ఏమిటి అని మేమడిగితే వారు బడబాగ్నిని గురించి వివరించుట, గాలి వేగము ఈ దిక్కుకు మారుతుందని జ్యోతిషశాస్త్రరీత్యా చెప్పుట - కొలదిలో బందరుకు ప్రమాదం తప్పింది. లేకపోతే మొత్తం తుడిచిపెట్టుకుపోయేది అని సూచించడము నేనెరుగుదును. ఇప్పటికీ ఆ భయానక ఉదంతము నా మనస్సుపై చెరగని ముద్ర వేసినది. యావత్ప్రపంచాన్ని భయభ్రాంతులను చేసినది. వీటిని మా తాతగారు ప్రత్యక్షముగా ఆ ప్రళయోగ్ర దారుణ భయంకర దృశ్యాల్ని చూచి అనుభవించారు. మానసవీధిలో కలతనొందారు. గనుకనే ఇంత కరుణరస కావ్యముగా దీనిని తీర్చిదిద్దగలిగారు.

**"త్రావ నీరెచట లేదు, తలదాచుకొనగ**
**కొంపలేదు, తినగ, కూడు లేదింత**
**ఆలించి, రవాల ఆక్రందనమ్ము**
**దేవుడే విని, దిగి రావలె"[2]**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ పరిచయము - కాళరాత్రి పుట 6

నన్న వారి యాక్రందనము వింటుంటే ఒళ్ళు జలదరిస్తుంది[1]". అని శ్రీ ఎమ్.ఆర్. అప్పారావు గారు తమ అభిప్రాయాన్ని వెల్లడించిరి.

ఇది యదార్ధ విషయము. మా తాతగారు ఎంతగా ఆ చూచిన విషయాలను జీర్ణించుకొని ఆవేదన చెందారు అంటే ఆ కావ్యం (కాళరాత్రి) పూర్తియైన ఆ రాత్రి వారు పడుకొంటే శ్వాస పీల్చడం కష్టమై జీవుడు వేదన అనుభవిస్తుంటే కళ్ళారా చూచిన నేను మంచినీళ్ళు ఇచ్చి గుండెలు రాయగా కొంతసేపటికి తెప్పరిల్లిరి. ఇది నిజమైన "కవయ: క్రాంత దర్శన:" అను దానికి అర్ధము.

ఇక వారి కాళరాత్రి కావ్యమును పరిశీలించినచో ప్రతి పద్యము భావగర్భితమే. ప్రారంభములోనే వీరి ఆవేదన వ్యక్తమవుతుంది.

**"కదలదుగా కలమ్మది, వికావికలై సుడిగొన్న, దారుణా**
**స్పదమగు, దీనమౌ చరిత వ్రాయ దలంపగఁ బల్కనేరికిన్‌ఁ**
**మెదలదు నోరు, మూతవడి, మృత్యుముఖమ్మున, ప్రాణమొడ్డి, హీ**
**నదశను, దిక్కుగానని, జనమ్ముల దుస్థితి, పొందు దుర్గతిన్"[2].** కాళరాత్రి 1వ పద్యము

మృత్యువాత పడినవారి హీనస్థితిని, దిక్కులేని జనము ఘోరస్థితిని మాట్లాడడానికి నోరు రావడం లేదని, వ్రాయడానికి కలము కదలడంలేదని వాపోతారు.

అమ్మా! తల్లీ! భారతీ! నిలువ నీడ లేక కనీసం పందిరి కూడా మిగులక, కట్టుకొను బట్టలేక, ఆకలికి రవ్వంత గంజి కూడా దొరకనివారిని, సర్వము జలనిధి కప్పగించిన అనాథల దుస్థితి గూర్చి నేడు పలుకగ తప్పదట. పలుకడానికి కాస్త సహాయము చేయు తల్లీ! అని ప్రార్ధిస్తారు. మంచిని చెప్పడానికి గాని, భక్తిభావముతో పలుకడానికి గాని వెనుకాడని వీరు ఈ దురంతముల గూర్చి వ్రాయటానికి ఎక్కడ అపశబ్దములు దొర్లుతాయనో ఏమో ఇది చెప్పటానికి కూడా ఆ భారతీదేవి అనుగ్రహము లేనిదే వ్రాయ సాధ్యము గాదనే వీరి భక్తిభావము వెల్లడియగుచున్నది.

ఆ దృశ్యము ప్రళయోగ్ర దారుణ భయంకరము. సముద్రము పొంగి, ఆ తరంగముల చేత గాలి తాకిడికి సుళ్ళు తిరుగుచూ జనాలను ముంచెత్తిన తీరు, ప్రాణాలను బలిగొన్న తీరు తలచుకుంటేనే

1. శ్రీ ఎమ్.ఆర్. అప్పారావు అభిప్రాయము - కాళరాత్రి పుట 1
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 13

విచారమగును. మాటలలో చెప్పడానికి సాధ్యము కాదు అని

**"చీకటి కోణమై, పగలు, చెందొవకాంతి, భయస్వరూపమై**
**ఆకసమల్లె, మృత్యుముఖమైనటులుప్పెన సూచకమ్ముగా**
**భీకర కాళరాత్రి వడి వీచు, ప్రభంజన ధాటి కోర్తుమే!**
**చేకుఱునయ్య! భద్రమను చింతలమున్గిరి, సర్వులానిశిన్"[1]** కాళరాత్రి 4వ పద్యము

పగలు కాలములో చిమ్మచీకటి ఆవరించి ఉండటము భయస్వరూపముగా ఉన్నదట. మామూలు చీకటి భయము గొల్పదు. ఇది ప్రళయకాలమందలి కాలుడు చేసే కరాళనృత్యము. అందుకనే ప్రజలందరూ భీతావహులై చింతలమునిగిరి అని వర్ణించిరి. భగవంతుడు కాలస్వరూపుడు. పగలు - రాత్రి, చీకటి - వెలుతురు ఆయన సృష్టిలోని భాగములే. ఈ విషయములో ఎంత శాంత స్వరూపుడో, ప్రళయము సంభవించినపుడు అంతటి రౌద్ర స్వరూపుడు కూడా. ప్రకృతి శక్తి స్వరూపము గనుక కాళీ స్వరూపము కూడా. దీనిని వీరు మనోహరముగా వర్ణించిరి. ఈ ఉప్పెన సమయములో

**చ॥ "ప్రళయ పయోధిలోన బడబాగ్ని జనించి, ప్రచండ వాయు సం**
**కలిత జల్మోర్మికాతతి, ప్రగాఢగతిన్ బయిలేచి, గ్రామ సీ**
**మల జన జంతు జాలముల మారణ కేళిగ, కాళి, వేయి జి**
**హ్వల, బలిగొంచు, చేసెను విహారము, క్షార జల ప్రవాహమై"[2]** కాళరాత్రి 5వ పద్యము

ఆ ప్రళయకాలములో సముద్రములో బడబాగ్ని పుట్టి భయంకరముగా గాలితో కూడిన అలల సమూహము ఉవ్వెత్తున లేచి గ్రామ సీమలను, జనులను, జంతుజాలమును మారణకేళిగా చేసినది. ఇది కాళికాదేవి వేయి జిహ్వలతో జనులను బలి తీసికొనునట్లున్నదని వర్ణించిరి. కాళికాదేవి రౌద్ర స్వరూపమునకు, ఎర్రదనానికి చిహ్నము. బడబాగ్ని ప్రజ్వరిల్లినప్పుడు ఎర్రని కాంతులు వెలువడును గనుకను, అలల సమూహము భీకరముగా గాలి తాకిడికి లేచుట భయానకముగా ఉండును గనుకను, కాళి లయ స్వరూపము గనుక వేయి జిహ్వలతో బలి గొనుచున్నదని వర్ణించుట ఎంతయో సహజసుందరముగానున్నది.

కరుణాసముద్రుడని అంటారు.అటువంటి జలముల తేడు చెలియలి కట్ట దాటడని చెప్పుదురు. దాటుటయేకాదు, అన్నిప్రాంతాలలోనికి చొచ్చుకొని పోవుచు పేదవారి కొంపలను, సంపదలను, పశువులను,

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 13
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 14

పాపలను యేళ్లు కోళ్ళు ఏకమై పోవునట్లుగా ప్రళయకాలమందలి జలార్ణవము వలె నిర్దయగా ప్రవహిస్తున్నాడు. ఆ వేగమునకు చెట్లు వ్రేళ్ళతో సహా కూలెను. గృహములు, పాకలు మూలమట్టముగా ధ్వంసమయ్యెను. అందమైన వనములన్ని తమ రూపాలను కోల్పోయెను. దిక్కులేని ప్రజానీకము క్షోభ వర్ణించుటకు తరము కాదు.

**"కన్నులు విచ్చి చూడ, పొడగానని, భీకర కాళరాత్రిలో**
**మిన్నులు మన్నులేకమయి, మృత్యు విహారము సాగి, జీవులే**
**తెన్నున బైట రాగలుగు, దిక్కు లభింపక, అంత్యకాల మా**
**సన్నముగాగ, కొట్టు కొనుసన్న యెలుంగు వినంగ లేరొరుల్"[1].** కాళరాత్రి 18వ పద్యము

కళ్ళు విప్పి చూస్తే అర్ధముకాని ఆ భయంకర కాళరాత్రిలో భూమ్యాకాశములు ఏకమైపోవునట్లుగా మృత్యువిహారము చేస్తున్న సమయములో జీవులు ఏవిధముగా బయటపడగలము? దిక్కేదియో తెలియని సమయము ఎట్లా ఉంది అంటే అంత్య కాలము సమీపించినప్పుడు జీవుడు కొట్టుకుంటూ పెట్టు (మొర) స్వరములాగా ఉన్నది. అది ఇతరులెవ్వరు వినలేరు అని వర్ణించిరి. మరణము ఆసన్నమైన జీవి తన పూర్వజన్మ పాపము చేత మాట రాక పైకిచెప్పలేక సన్నని మూలుగు వంటి కంఠస్వరముతో బాధపడుతున్నట్లుగా ఉంది ఆ కాళరాత్రి అని వర్ణించిరి. గాలి ప్రచండముగా వీచుచున్నప్పుడు చేసే ధ్వని ఒక విధమైన ఈలలాగా (ఊలవలె) ఉండి భయము గొల్పును. ఈ ధ్వనితో ఆనాటి మానవులు పడిన ప్రళయకాల బాధను పోల్చిచెప్పిరి.

ఆపద సంభవించినపుడు భగవంతుని దలచుకొనుట సహజము. "ఆపదలెంతవారలకొకప్పుడు, సంభవమౌటనైజమే. పాపలు, పిల్లలంచనక, పల్లెజనాళికి, మూక ఉమ్మడిన్ చేపడునయ్య[2]" కష్టములు రావటం సహజమే. చిన్నపిల్లలు, పెద్దవారు, పల్లెజనము, పట్టణజనము అనుమాట లేకుండా ఒక్కసారిగా రావటమా! అని బాధపడిరి. బాధలో ఉన్నప్పుడు భగవంతుని సైతము నిందిస్తాము. ఆ బాధతో ఇంతటి ఆపద వచ్చినది ఇది నాశనమగుటకా? ఆయా జీవులు చేసిన పాపకర్మమా? ఇంతటి దురవస్థ సంభవించినది అని తమని తామే ప్రశ్నించుకొనిరి.

ఆ భయంకర కాళరాత్రిలో జనము తమ ప్రాణాలు నిలబెట్టుకొనుటకు పడిన అవస్థను కళ్ళకు కట్టినట్లు వర్ణించిరి.

---

1, 2 శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 14

“ఎడపెడ వీచెడి, సుడిగాలి పెనుమ్రోత
తట్టుకొనుచు, చెట్లు తప్పుకొనుచు
ఉండుండి, కెరటాల, ఊపుల నిలద్రొక్కు
కొంచు, పట్టుల జిక్కుకొంచు, మధ్య
చుట్టుముట్టిన నీరు, చెట్టెక్కి ప్రాణముల్
నిలుపుకొంచును, శ్వాసగలుపుకొంచు
ఇంటి కప్పులనెక్క, యిల్లు కూల ప్రవాహా
గతి, మున్గితేలుచు, గాలి పీల్చు
తల్లి, దండ్రి, భార్య, తనయుడేమయ్యెనో
తలచుకొనెడి వ్యవధి, తమకు లేక
తామె, తల్లడిల్లుచు, తమ ప్రాణముల్ నిల్వ
పెనుగులాడు, దీనజనుల గంటె”[1]

కాళరాత్రి 10వ పద్యము

ఎడపెడ వీస్తున్న ఆ సుడిగాలిమోతకు చెట్లు సైతము ఎట్లాగో తట్టుకోవాలని ప్రయత్నిస్తున్నాయిట. ఆగి ఆగి వీచే ఆ కెరటాల ఊపులకు చెట్ల కొమ్మల సందున చిక్కుకొని మధ్య మధ్య చుట్టుముట్టిన నీరు చెట్టెక్కి అయినా ప్రాణాలు నిలుపుకుందామని ప్రయత్నిస్తే అవి కూలిపోగా ఎట్లాగో శ్వాస పీల్చుకుంటూ, ఇంటి కప్పులెక్కి ప్రాణాలు రక్షించుకుందామని ఎక్కగా ఇల్లు కూలితే ఆ ప్రవాహములో పడి మునిగి తేలుచు ఎట్లాగో గాలి పీల్చుకోవటానికి ప్రయత్నించుచూ తల్లి, దండ్రి, భార్య, పిల్లలు ఒకరికి ఒకరు ఏమయ్యారో తలచుకొనే వ్యవధికూడ లేక ఎవరికి వారే బాధ పడుతు ప్రాణములు నిలిస్తే చాలు అని పెనుగులాడుచున్నారట.

దీని వలన వీరి నిశిత పరిశీలనా శక్తి తెలియుచున్నది.

వేలకు వేలు జనము ప్రాణములు హరించెను. ఆ ప్రళయ వీచికలచే మైళ్ళకొలది కొట్టుకుపోయి వారు తమ తమ రూపాలను పోగొట్టుకొనిరి. భయంకరమైన ఆ ఉప్పెనయందు ఒకరికొకరు కలయ వీలు లేక వికలాంగులైన వారు కొంతమంది, ప్రాణములు కోల్పోయిన వారు కొంతమంది. ఆ అంగములు ఒడ్డున గుట్టలైనవి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 15

**"చెట్టున పుట్టకొక్కరయి, చిందరవందరయెన్ కుటుంబముల్**

**చెట్టుల బాల్పడెన్ మృత కళేబరముల్, జలధి ప్రవాహికిన్**

**గుట్టల కట్టలన్ పొదల గొట్టుకపోయె, రవంత పోలికల్**

**పట్టగరాక, రూపుచెడె, వారికి తర్పణలెట్లుచేకుఉన్"**[1] కాళరాత్రి 13వ పద్యము

బ్రతికి ఉన్నవారు చెట్టుకొకరు, పుట్టకొకరైరి. కుటుంబములు చిందరవందరయ్యేను.చెట్ల పాల్పడిన మృత కళేబరములు జలప్రవాహమునకు గుట్టలు గుట్టలుగా కొట్టుకుపోయెను. బ్రతికియున్నవారు ఎవరో కూడా కొంచెమైనా తెలియ రాకుండా గుర్తపట్టలేనంతగా రూపాలు కోల్పోయిరి. ఎవరు ఎవరో తెలియని వారికి తర్పణాలు ఎట్లా వదులుతారు అని వాపోయిరి. దీనిని బట్టి వీరు ఎంత కర్మిష్ఠియో తెలియుచున్నది. ఎంత గడ్డు సమస్య వచ్చినా, ఒంట్లో బాగుండకపోయినా ఒక్కరోజు కూడా పితృదేవతలకు తర్పణాలివ్వకుండా వదలలేదు వీరు.

ప్రాణములతో ఎట్లో బయటపడితే ఇంటికి చేరడము ఎంత కష్టమైనదో వర్ణించిరి. అధికమైన చలితో బాధ పడుతూ గ్రామానికి చేరుతూ ఉంటే మధ్యమధ్యలో కాళ్ళకు మృతకళేబరములు, ముళ్ళపొదలను విదిలించుకొనుచు ఎవరైనా కొంచెము సహాయము చేయరే! అనుకొంటూ పల్లెకు చేరి కూలబడిరి.

ఇక బ్రతికియున్నవారి అవస్థనిట్లు వివరించిరి.

**సీ॥ "సతి వివస్త్రగ, ముళ్ళ సందున, బడియుండ**
**కప్పి, పై బట్ట, యొకండు వెడలె**
**తన చంక పసిపిల్ల, పెనుగాలికిన్ దూలి**
**రాల, తల్లిమనసు ఊయి యయ్యె**
**తలిదండ్రి వెల్లువ గలియ అమ్మా! యని**
**తపియించు సుతుని, యోదార్చనెవరు**
**భర్తపిల్లల తోడ పడిపోవ నీటిలో**
**'దేవుడా' యంచు వాపోవునొకతె**

**ఇట్లు, కాళరాత్రి యిల్లిల్లు ,శూన్యమై**
**కానరాడొకండు, కలసి నీట,**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 15

**ఇట్టి ప్రళయకాల మేనాడుగంటిమే**

**వింటిమయ్య! ఎట్టి విడ్డురమ్ము"[1]** కాళరాత్రి 15వ పద్యము

భార్య వివస్త్రగ ఉండి, చనిపోయి పడిపోయి ఉంటే చేసేది లేక తన పైన ఉత్తరీయమును కప్పి ఒకడు వెళ్ళిపోయాడట. తన చంకలో పసిపిల్లనెత్తుకొని వెడుతున్న ఒక స్త్రీ గాలి ప్రవాహ తాకిడికి ఆ పిల్ల కొట్టుకొని పోతే దయగల తల్లి మనసు కూడ ఊయి అయిపోయినదట. తల్లిదండ్రిని కోల్పోయి పిల్లవాడు ఏడుస్తుంటే ఓదార్చేవారు లేరట. భర్త, పిల్లలు నీటిలో మునిగిపోతే 'దేవుడా' నేను బ్రతికి ఏమి చేసేది అని ఇంకొకామె వాపోతున్నదట. ఇట్లు ఆ భయంకర రాత్రివేళ ఒక్క ఇల్లు కూడా మిగులకుండా ఇల్లిల్లు శూన్యమై ఒక్కడు కూడా కనబడకుండా నీటకలిసిపోయినారట. తల్లికి పిల్ల లేదు, తండ్రికి కొడుకు లేడు, పిల్లకు తల్లి లేదు, భార్యకు భర్త లేడు, భర్తకు భార్య లేదు. ఎవరి కొరకు ఎవరు మిగిలారో వాళ్ళు చూచుకొనకమునుపే నీటిలో కలిసిపోయిరి. అని వర్ణించి అశక్యముగా విధి దాటనేరికిన్![2] విధి వ్రాత తప్పించుకొనుట ఎవరి తరముగాదుకదా! అని సమర్థించుకొనిరి. ఈ ప్రళయము దాటి స్థిమితపడిన తరువాత అందరు దిక్కులేని వారై ఒక్కొక్కరు ఎట్లా దుఃఖించారో కళ్ళకు కట్టినట్లు వివరించిరి.

**'మా తల్లిదండ్రిని, మారెమ్మ పొట్టను**
**బెట్టుకొనె, నటంచు తిట్టునొకడు**
**'తన్ననాథ జేసె దైవమ్మ'టంచు తాన్**
**తలబాదుకొనియె ముత్తైదువొకతె**
**'ఏను బ్రతుక లాభమేమిరా! సుతుని మ్రిం**
**గితి' నంచు వాపోవు, పితయొకండు**
**'ఒంటి జేసి, కొలము గంటిడె దైవమ్ము**
**తనువెట్లు మను 'నను' తండ్రియొకడు.**
**కుంటివాడు, దైవమునకు కూడ, గిట్ట**
**డే! యనుచు నేడ్చు, అంగవిహీనుడొకడు.**
**ఇట్టు లొక్కక్కరి స్థితి, నెఱుగ బల్క**
**వనట గుందిరి, వారి జేరిన జనమ్ము"[3]** కాళరాత్రి 17వ పద్యము

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 16
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 17

మా తల్లిదండ్రినిమారెమ్మ పొట్టను బెట్టుకొనెను అని ఒకడు తిడుతున్నాడుట. ఒక ముత్తైదువ తన్ను అనాధను జేసెను దైవము అని తలబాదుకొనుచున్నదట. నేను బ్రతికి ఏమి లాభము కుమారునే మింగేశాడు అని ఒక తండ్రి దు:ఖిస్తున్నాడట. నన్ను ఒంటరి వాడిని చేసాడు భగవంతుడు ఈ శరీరమెట్లు కడతేరునని ఒక తండ్రి బాధపడుతున్నాడట. కుంటివాడు దైవానికి కూడాగిట్టడని ఏడుస్తున్నాడట. ఈ విధముగా ఒక్కొక్కరి స్థితి ఏమిటో జనము తెలిసికొనుచున్నారట. ఇట్టి దుస్థితి ఎక్కడ చూస్తే అక్కడ కనబడుచున్నది. సహింపరాని బాధల కొట్టుకొనుచు, ఆకలి బాధతో అలమటించువారు, త్రావ గంజిలేనివారు, కప్పుకొనుటకు బట్టలేనివారు కనబడుతున్నారు. వారివారి మనోరథములు గ్రహించి ధైర్యము చేకూరునట్లు మాట్లాడే ధీరులు కావలెను. చిందరవందర పడియున్న జీవులను కన్గొనుటకు వచ్చి వారి ఆక్రందన ఘోష విని భరించలేక, నిలిచి, ముందుగా కాఫీ వారికిచ్చి వారిని ప్రాణాలతో ఇంటికి చేర్చుదామని ఎందరో వచ్చిరి.త్రావగనీరు లేదు. చెఱువులలో, బావులలో నీరంతా ఉప్పగా మారిపోయెను. పంటలు అన్నీ నీటిలో మునిగిపోయాయి. నిల్వడానికి ఒక పాకయినా లేదు. పశుసంతతికి తినడానికి గడ్డి లేదు. వారు అవస్థ పడే స్థితి చూస్తే మనస్సు బాధ పడుతోంది. జీవించడానికి ఏది దారియో గదా! పంటకు నూర్చడానికి సిద్ధముగానున్న ధాన్యపు కుప్పలు ప్రవాహధాటికి మూలమట్టముగా కొట్టుకుపోయినాయి.మా ఖర్మ ఇది అంతా అని వాపోయి,

**"ఏ యాపద కలుగన్, నీ**
**వే! యరికట్టంగదగిన వేల్పువటే! నే**
**డీ యాపద నడ్డు పడవు**
**న్యాయమె! యిటులూరకుంటివా! లంకమ్మా"[1]** కాళరాత్రి 23వ పద్యము

ఏ ఆపదకలిగినా నీవే అరికట్ట సమర్థురాలవు. ఈ ఆపదను అరికట్టక చూస్తూ ఊరుకున్నావు. ఇది న్యాయమా! అని గ్రామదేవతను ప్రశ్నిస్తారు.

**"వేలకొలంది జీవుల, నివేశములన్ గల పాడిపంటలన్**
**చేలను, పొట్టబెట్టుకొనె, సింధు సమీరుడికిట్టి దుస్థితిన్**
**లీలగఁ జూడ పాడియె! చలింపవె! హంసలదీవి వేణు గో**
**పాల! నృపాల! ఆపదల బాప సమర్థుడ,వేమి చెప్పుదున్"[2]** కాళరాత్రి 24వ పద్యము

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి 1, 2 పద్యాలు పుట 18

వేలకొలది జీవులను, వాటి నివాస స్థలములను, పాడి, పంటలను, పొట్టబెట్టుకొను ఈ దుస్థితి నీకు చూడగా విలాసముగా నున్నదే! ఓ హంసలదీవి వేణుగోపాల! ఇంత జరుగుతున్నా చలింపవేమి? నీవు ఆపదలను పోగొట్టుటలో సమర్ధుడవే! నీ వాకిట ఆకాశమంత ఎత్తునలేచు అలల సమూహముతో సర్వము కూలునట్లుగా చేస్తున్నావు? ఇది నీకు వినోదమా? నీవు కృపాసముద్రుడివే! లేదు నీవు ఏమి చేయకున్నావు అంటే మేము చేసిన పాపము పండినదా ఏమి? చెప్పుము. దేవతల వంటి బ్రాహ్మణుల దీవెనలు ఎక్కడికి పోయినవి. ఈ రాకాసి తుపాను బాధ పడితే రక్షించు దేవుడెవరు? మేము చేసినపాతకమేమి? అయ్యో! ఈ విధముగా అందరి ప్రాణములు ఒక్కసారిగా బలిగొనడం ఇదెక్కడి కర్మమయ్యా! చెప్పుము. అని వాపోయి చివరికి వైరాగ్య స్థితికి చేరుకొనిరి. మనిషికి ఈ జీవుడు పుట్టుక, మరణము ఈ చక్రము భగవంతుడు ఆడే జగన్నాటకము. ఇది ఆయన మాయ. ఇది శాశ్వతము కాదు అనే జ్ఞానము కలుగకపోతే ఏ వ్యక్తికైనా మిగిలేది దు:ఖమే. ఈ జీవుడు (ఆత్మ) నిత్యము. శరీరము అనిత్యము ఇది చివరకు పంచభూతలయాత్మకమై పోయేది అనే తాదాత్మ్య స్థితికి చేరుకొని, తెలివి గలిగి ప్రవర్తించునట్లుగా చేసిరి.

ఈ పద్యము పరిశీలించినచో

**"ప్రజల కన్నీటి ధారలు, పొంగి ముంచెత్తు**
**జలధి తరంగాల జారిపోయె**
**ప్రాణావసానకాలాక్రందనపు ఘోష**
**కడలి ఘోరార్భటిన్ గలసిపోయె**
**భీతిమై విడిచెడి, వేడి నిట్టూరుపు**
**పెనుగాలిలోన, స్తంభించిపోయె**
**తుది క్షణమ్ము వరకు, పొదలు చైతన్యమ్ము**
**కాలానల జ్యోతి గలసిపోయె**

**ప్రభవమంది ,పెరిగి, ప్రారబ్ధకాయుండు**
**పంచభూతముల, లయించిపోయె**
**చెప్పదరమె! మాయ జీవ రహస్యమ్ము**
**చిత్రమైన, బహు విచిత్రమిద్ది"[1]**

కాళరాత్రి 27వ పద్యము

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 19

అని అంటారు. మానవ శరీరము పంచభూతాత్మకమైనది. చనిపోయిన తరువాత అవి మరల ఆయా స్థానముల జేరును. అట్లే ఆ చనిపోయిన వారి ప్రారబ్ధమనెడి శరీరములు పంచభూతములలో ఎట్లా కలిసినాయి అంటే, ప్రజల కన్నీటి ధారలు పొంగి ముంచెత్తి వేసే సముద్ర తరంగాలలో కలిసిపోయినాయట. ప్రాణములు పోయే సమయములో చేయు ఆక్రందనపు ఘోష కడలి ఘోరార్భటిలో కలసి పోయినదట. భయముతో వారు విడిచే వేడి నిట్టూర్పులు పెనుగాలిలో స్తంభించిపోయినాయట. చివరి క్షణము వరకు ఉన్న చైతన్యము కాలానల జ్యోతిలో కలసిపోయెనట. పుట్టి, పెరిగి పంచభూతములలో లయమైపోయెను. ఈ జీవుల రహస్యమ్ము మాయ, చిత్రము, ఇదిమరీ విచిత్రము, చెప్పదరము కాదు. నవకాళీ ప్రళయోగ్ర దారుణ దురంతములు వినుటకు పల్కుటకు హృదయము ద్రవించును. ఇంతకు ముందు భారతచరిత్రలో నిలచిపోయినాయి. నేడు దివిసీమను, బందరుసీమను సర్వమును గొప్ప ఆర్తిలో ముంచెను. నేడు ఈ జలార్ణవసంక్షోభము భారతదేశ చరిత్రలో మాయబోదు. దివిసీమ, బందరులో పల్లె పల్లె ఊడ్చుకొని పోయెను. గుంటూరు పంట మొదలంట నాశనమైన బ్రతుకు తెఱువు కొఱకు ఇక్కట్లు పడుచున్నారు. ఎప్పటికి కోలుకుంటారో కదా!

**"ఇది నూటపదమూడు యేండ్ల, దీగాధ**
**మించి బాధించిన మృత్యువు వేధ**
**ప్రళయ నిశీథిలో పరతెంచినట్టి**
**బందరు ఉప్పెన, పల్క భారతము**
**ప్రుందిరి వేలకొలందిగా జనము"**
**... ... ... ... ... ... ... ... ... ... ... ...**
**... ... ... ... ... ... ... ... ... ... ... ...**
**... ... ... ... ... ... ... ... ... ... ... ...**
**కలరె ఆపన్న రక్షకులని తూల"**[1] కాళరాత్రి ద్విపద

బందరు ఉప్పెన గురించి చెప్పాలంటే భారతమంత అగును. దివిసీమను ఘోరముగా ముంచివేసెను. ఉప్పెన మరునాటి తిప్పలు ఏమనిచెప్పుదు? త్రాగుటకు నీరు కాని, తల దాచుకొనుటకు కొంపగాని, కూడుగాని లేదు. వారల ఆక్రందనము విని దేవుడే దిగిరావలెను. అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, హంసలదీవి, భావదేవరపల్లి ఆపదలో మున్గెను.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 20

**"కలడు కలడను వాక్యము రూఢిపరుప**

**మున్ గజేంద్రుని, హరి, ప్రోచినయట్లు**

**ప్రవహించె, సర్వమానవ సహాయమ్ము**

**మానక, వెసగు మంత్రిమండలి ఘనుడు**[1] కాళరాత్రి ద్విపద

**దీక్ష బట్టగ, నూర్ధ్వ దేవతల్ గూడ**

**దిగివచ్చి రూప్యముల్ తెగ గ్రుమ్మరించి**

**దీనబాంధవులైరి దేవతల్లాగ**

... ... ... ... ... ... ... ... ... ... ... ...

... ... ... ... ... ... ... ... ... ... ... ...

... ... ... ... ... ... ... ... ... ... ... ...

**సేవచేయు మహానుభావులవ్వారి**

**బ్రోవ విచ్చేసిన దేవతల్గారె"**[2] కాళరాత్రి ద్విపద

దీక్షగా ప్రార్థన చేస్తే కలడు అనేవాక్యమును నిజము చేయుటకు గజేంద్రుని, విష్ణుమూర్తి రక్షించినట్లుగా సర్వమానవ హృదయములు సహాయము చేయుటకుద్యుక్తులైరి. మంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావు, ఇంకా కొంతమంది ప్రభుత్వాధికారులు వచ్చి భోజనము, దుస్తులు, దుప్పట్లు ఇచ్చి పోషించిరి. ఇళ్ళు నిర్మించి, పాకలు నిర్మించి, బాటలను అమర్చి, కూపములు త్రవ్వించిరి. మరల హాయిగా బ్రతుకుటకు ఉత్సాహము, చేయూతనిచ్చి, బ్రతుకుటకు మార్గము చూపినవారు, సేవ చేసిన మహానుభావులు వారిపట్ల రక్షించుటకు వచ్చిన దేవతలు కదా!

**"సాయమ్ముగొనువారి, స్వాంతముల్, వేరు**

... ... ... ... ... ... ... ... ... ... ... ...

... ... ... ... ... ... ... ... ... ... ... ...

... ... ... ... ... ... ... ... ... ... ... ...

**పదుగురుమేల్గోరు, పంటరైతొకడు**

**ప్రళయ తుపానున పంటకోల్పోయి**

**తిన తిండిలేని దుస్థితినతండెట్లు."**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 21
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 22

**"అభిమానమున్ వీడి యాచింపగలడు?**

**మనసు విప్పి, ఉచిత మర్యాద తోడ**

**దరిసి యాతని బాధ లెరిగి సాయమ్ము**

**చేయుట పాడి, దీక్షాయుతులంత"[1]** కాళరాత్రి ద్విపద

ప్రభుత్వము వారు సహాయమందిచ్చినా పొందు వారి మనస్తత్వములు వేరువేరుగా ఉంటాయట. సూక్ష్మగ్రహణ శక్తి యున్న వారిని ఒక కంట కనిపెడుతు మర్యాద గలవారిని ఒక కంట కనిపెట్టి ఉండాలట. అందరూ ఒక గాడి మంద గాదుట సామాన్య జనులు చేయి జాచరుట. అభిమానవంతుడు ఏ ఆపదవచ్చినా ఇంట్లో బియ్యము లేకపోయినా పస్తు ఉండును గాని లేదని చెప్పడట. మర్యాదగా బ్రతికిన మనిషి కట్టుకొనుటకు బట్ట లేకపోతే మన మంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు అది గ్రహించి కట్టుకొనుటకు బట్టనిచ్చెనట. పదిమంది మేలు కోరే పంట రైతు ఒకడు ప్రళయమైన తుఫానులో పంట కోల్పోయి తినుటకు తిండి లేని దుస్థితిలో అభిమానమును విడిచిపెట్టి యాచింపగలడా? అని బాధపడిరి.

తన స్వీయగాథ ఇట్లు ఇక్కడ వివరించిరి.

**"స్వీయగాథ వినుడు, వివరింతు, కొంత**

**ఆనాటి పగలె, జంఝూనిలధాటి**

**... ... ... ... ... ... ... ... ... ... ... ...**

**ఇట్టిదందరి కథ ... ... ... ... ... ... ఇంటింటగోడు**

**విప్పి చెప్పగరాద ఉప్పెనబాధ[2]"**

ఆనాటి పగలే ప్రళయగాలి వేగమునకు పొంగి తరంగ సముద్రుడు పొరలి మా ఇంటి గడపల దాకా మునిగిపోయెను. పెణ్ణెమ్ములు, గోడలు కూలిపోయెను. ఆ రాత్రి ప్రక్క వసారాలో మా పశువు లెట్లాగో మిగతా పశువులతో కలిపి ప్రాణములు దక్కించుకొనెను. ఎట్లా మరల నిర్మించుకోగలుగుతానో అని వ్యధ చెంది ఇది నా ఒక్క గోడు కాదు ఇంటింట గోడు. విప్పి చెప్పుటకు వీలు కాదు ఉప్పెన బాధ అంటారు.

అంత బాధలోను భారతదేశమంటే భారత మాత అంటే అభిమానం వ్యక్తం చేస్తారు. ఇంత కష్టములోను సర్వము పరమాత్మ స్వరూపముగా భావిస్తారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి 1, 2 పద్యాలు పుట 23

"భారతమ్ము, జనని భారతీయుడను
ఆంధ్రమాత సుతుడ - ఆంధ్రుండ నేను
సర్వమానవులు, వాస్తవ సహోదరులు
సౌఖ్యసంపద మనుత సకల జనమ్ము
వాసుదేవ స్వరూపమ్ము సర్వమ్ము
ఆత్మరక్షణయె, నాయాదర్శమెందు"[1]

అంతేకాదు ఇతరులు పచ్చగా ఉండుటకు సహాయపడే జాతి మనది. మన పరమార్థము సంఘుసేవయే. ఆర్తులను రక్షించుటయే మన మేలైన ధర్మము. వీటిని తలదాల్చి దీనజనుల హృదయముప్పొంగునట్లుగా, శక్తికి మించి ద్రవ్యరూపముగా, వస్త్ర రూపముగా, ధాన్య రూపముగా, ఔషధములిచ్చి హాయిగా జీవించునట్లుగా సేవచేసెడి త్యాగశీలురను చూశారా! స్థానికులే గాక తదితర ప్రజలు, ధనవంతులే గాక పేద జనము, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వములు, మంత్రి,సామంత, సామాన్య జనము వారు వీరు అనే బేధభావము లేకుండా కొల్లలు కొల్లలుగా ధనము గుప్పించుచున్నారు. బందరు, దివిసీమ బాధితులకు ఆలస్యము చేయకుండా రాజ్యాంగమ్ము చేయదగినంత సహాయము అందజేసెను.

అందరము కలిసి కష్టసుఖాలలో అండదండగా ఉంటే కులమతములను ప్రసక్తి ఉండదు. ఎక్కడా ఆపదలు సంభవించవు. మానవులకు సేవ అందిస్తే మాధవునకు సేవ చేసినట్లే. ధనము, శక్తి కాయకష్టములందిచ్చుట మన పరమార్థము. ఈశ్వరుడు శాశ్వత సుఖమునిచ్చును. మెచ్చుకొనును. శాశ్వతయశము విశ్రాంతినందిచ్చును.ఈ మహత్కార్యములలో కవుల వాక్కుకు ఆనందము, పూర్ణాయువునిచ్చును. కవి వాక్కులు వినియోగమౌట కవిత్వానికి సార్థకత చేకూరును. అని కవి వాక్కుల అమోఘశక్తిని వివరిస్తారు.

అంతేగాక శారదామాతను, భారతమాతను ప్రార్థిస్తారు. ఈ తుఫాను బాధితులకు సాంత్వన వచనాలతో ధైర్యమునిచ్చి పూర్వపు దారి మళ్ళించి హాయిగా జీవించునట్లు శుభాశీస్సులు ఒసగునట్లుగా దీవించమని ప్రార్థిస్తారు. నిస్స్వార్థసుజనులందరికీ, కవిమిత్రులకు శుభాకాంక్షలర్పింతునంటారు. కవుల వాక్కులకు, కవులకు శాంతి ఎల్లప్పుడు అందరకు విశ్రాంతి అని ఈ కావ్యమునకు చివర శాంతివచనాలు పలికిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 24

## అనుబంధము - 1

## గాలివానలు - వర్షపాతములు

### తుఫానులు - ఉప్పెనలు: -

"శ్రీ శర్మగారు 1977 నవంబరు 19 వ తేదీన సంభవించిన ఉప్పెనను గురించి హృదయవిదారకముగా వర్ణించుటయేకాక, లోగడ వచ్చిన తుఫానులు, గాలివానలు, వర్షపాతములు, ఉప్పెనల గురించిన సమగ్ర చరిత్రను క్రోడీకరించి ఈ కరుణరసకావ్యానికి అనుబంధముగా చేర్చియుండిరి.

కళకళలాడే ప్రకృతిని వికృతము గావించి, సకల జీవగణానికి బాధాకరమై, లయస్వరూపమై హరించుట జగద్విదితము. ఇది ప్రకృతిలో తుఫానులుగానో, వర్షపాతములుగానో, గాలివానలుగానో, ఉప్పెనలుగానో ఉద్భవించి, ప్రకృతిని భీభత్సము చేసిగానిపోవు. ఇది కాలపురుషుడు చేసే కరాళనృత్యము. దీనిఫలితములు ఎల్లరు అనుభవించవలసినదే రాజులు చేసిన పాపములు ప్రజలపైనను, ప్రజలు చేసిన చర్యలు రాజ్యాంగము పైనను ప్రతిఫలించుచుండునని పెద్దలు చెప్పుదురు. ఏదిఏమైనను జీవుల స్వయంకృత సుకృత దుష్కృత పరిణామములుగా కూడ సాక్షీ భూతములై ప్రత్యక్షమగుచుండును"[1].

ఈ చరిత్ర భావితరాలవారికి అవసరముగనుక సంక్షిప్తముగా వివరించుచున్నాను.

తూర్పున సముద్రతీరము ఎన్నోమార్లు తుఫానులకు గురియగుచునేయున్నది. 1679 నుండి 1977 వరకు ఆంధ్రప్రదేశమును తాకిన తుఫాను వివరాలు ఈ క్రింది విధముగానున్నవి.

### 1. 1679 అక్టోబరు 13వ తేదీ : బందరు ప్రళయ ఉప్పెన

"1789 మద్రాసు ప్రభుత్వ జ్యోతిష గణిత శాస్త్రజ్ఞుడు శ్రీ యం. టాపింగు లెక్కల వివరణ వల్ల సముద్ర ప్రవాహము తూర్పుగోదావరి జిల్లా కళింగరేవును చుట్టూ ప్రదేశములను తాకగా విశేష జన నష్టము జరిగినది. అంతే గాక పంటభూములు పాడైపోయినాయి. వృక్షములు వ్రేళ్ళతో కూలబడినాయి. ఇది మచిలీపట్టణము పరిసర ప్రాంతాలను చుట్టుముట్టి షుమారు 20,000 మంది జననష్టం కలిగినది. డచ్చివారి ఫ్యాక్టరీలో 12 అడుగుల లోతునీరునిండినది. అల్లము, వంటవస్తువులు, వస్త్రముల బేళ్ళు దెబ్బతిన్నాయి. పడవలు, ఓడలు దెబ్బతినడమే గాక, మానవ కళేబరములు వీధుల్లో చెల్లాచెదురై వాతావరణము దుర్గంధభూయిష్ఠమైనది అని ఫోర్టుసెంటుజార్జి ప్రభుత్వము వారి లెక్కల వలన బయల్పడిన వివరములివి[2].

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 28
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 29

## 2 1752 ఏప్రిల్ 15 వ తేదీ విశాఖపట్టణ ప్రాంత తుఫాను: -

"1752 ఏప్రిల్ 15 వ తేదీ న సంభవించిన తుఫాను విశాఖపట్టణ ప్రాంతాన్ని తాకింది. అప్పుడు డచ్చివారి కోటలోని భవనాలకు ఎక్కువ నష్టం సంభవించింది. అప్పటి విశాఖ పట్టణ కౌన్సిల్ అధిపతి ఒక సమర్థుడైన వ్యక్తిని పంపి అచ్చటి ఆర్థిక పరిస్థితులను అనుసరించి, తగిన ధనసహాయమును అడగమని పంపిరి"[1].

## 3. 1779 ఉప్పెన: -

"1779 సం॥ లో వచ్చిన ఉప్పెన ప్రళయతాండవము చేసి బందరు ప్రాంతాన్ని ముంచెత్తినది. ఆనాడు 80 వేల పూల వరహాలతో నిర్మించిన డచ్చి వర్తక కళాశాలల సామాగ్రి 12 అడుగుల ఎత్తున ప్రవహించిన సముద్రపు నీటిచే నాశనమైనది. మిరియములు, సుగంధ ద్రవ్యములు మొదలైనవి నాశనమైనాయి. మచిలీపట్టణము చుట్టు ప్రక్కల గ్రామాలతో సహా 20,000 మంది మరణించిరి"[2].

## 4. 1787 మే 20 వ తేదీ - తూర్పుగోదావరి జిల్లా: -

"1787 సం॥ మే 20 వ తేదీన సంభవించిన తుఫాను తూర్పుగోదావరి జిల్లాను బీభత్సము చేసినది. కళింగరేవును, దాని చుట్టుప్రక్కల గ్రామాలు అన్నీ జలమయమైనాయి. జనులకు నిల్వనీడ, తిండితిప్పలు లేకుండా పోయెను. మే 22 వ తేదీన గవర్నర్ ఆర్చి బాల్డు కాంపుబెల్‌కు ఫోర్టు సెంటు జార్జి కౌన్సిల్‌కు పంపిన ఆనాటి తుఫాను రిపోర్టు వలన ఈ విషయాలు తెలియుచున్నవి. కనీసం జీవనాధారములైనవిగాని, ధరించుటకు వస్త్రములు గాని, తలదాచుకొనుటకు పాకలు గాని లేవు. సముద్ర ప్రవాహములో పడి మరణించిన వారి బంధువులను చూచుటకు పరుగులు పెట్టుచు సముద్రము మమ్మల్ని ముంచేస్తుందని భయపడినవారిని కళ్ళారా చూశాను. తాను ఉన్నత స్థలమున కట్టిన పాత ఫ్యాక్టరీలో తలదాచుకున్నాను కనుక ప్రవాహవేగమునకు కొట్టుకొని పోకుండా మిగిలినాను. ఆనాటి సముద్రము 15 అడుగుల వరకు పైకి ఉబికింది అని వ్రాశారు॥"[3].

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 30
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 31
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 32

**5. 1789 డిశెంబరు ఉప్పెన : తూర్పుగోదావరి జిల్లా: -**

"1789 డిశెంబరు లో సంభవించిన ఉప్పెన కళింగ పట్టణాన్ని తుడిచి వేసినది. ఆనాటి జననష్టము 20,000. గోదావరీ ముఖద్వారం వద్ద పడవలు దెబ్బతిని "యానాం" పరిసర ప్రాంతాలు కొట్టుకుకొని పోయినాయి. శ్రీకాకుళం చిందర వందరగా ధ్వంసమయ్యేను. నేతగాంఢ్ర గ్రామాలలో సర్వము నేలమట్టమైపోయెను. 8 మైళ్ళు తిరిగి చూచి వచ్చాను. చెల్లాచెదురై ధ్వంసమైన ఘోరదృశ్యము కాననయింది. అని మద్రాసు రెవెన్యూబోర్డు శ్రీ మైకేల్ కోస్టింగ్ వ్రాతల వలన తెలియుచున్నది"[1].

**6. 1800 అక్టోబరు 28వ తేదీ తుఫాను : -**

"1800 సం॥ అక్టోబరు 28 వ తేదీ న వచ్చిన తుఫాను గుంటూరు జిల్లాను విశేషంగా తాకింది. చెప్పరాని ఘోరవినాశనము సంభవించినది.నవంబరు 7 వ తేదీన చెన్నపురి రెవెన్యూబోర్డు మెంబర్లకు, అధ్యక్షునకు జిల్లా కలెక్టర్ శ్రీ ఆండ్రూస్ స్కాట్ పంపిన రిపోర్టు వలన "సముద్ర తీరమందలి గ్రామములన్నియు కొట్టుకొనిపోయి విశేష జననష్టము కలిగింది. చినగంజాం కంపెనీ వారి రాకపోకలనున్న పడవలన్నియు ధ్వంసమైనవి.

నవంబరు 1వ తేదీన చినగంజాం, ఉప్పు కొఠారు పేష్కారు శ్రీ పయాలి బాపిరాజు కలెక్టరుకు పంపిన రిపోర్టు వలన, "అసంఖ్యాక జననష్టము జరిగింది. కొఠారి నాయకుడు మా మేనల్లుడు, నేను ఆ సముద్ర ప్రవాహములో మునిగి బైటపడినాను. దగ్గరగల ఉన్నత ప్రదేశమున గల దేవాలయములలో తలదాచుకున్నాను"[2]. అని చెప్పాడు.

**7 1832 సం॥ మే 10 వ తేదీ గోదావరి జిల్లా ప్రళయ తుఫాను: -**

"1832 సం॥లో మే నెల 10 వ తేదీన సంభవించిన తుఫాను గోదావరి జిల్లాను తీవ్రంగా నష్టపరచినది. రాజమండ్రి కలెక్టరు శ్రీ ఎ.క్రౌలీ వ్రాసిన ఉత్తరము ప్రకారము, "సముద్రము పొంగి కష్టమ్సుహౌస్ తలుపులయెత్తునకు అలలు లేచి తలుపులు బద్దలు కొట్టినవి. లోపల రికార్డు అన్నియు ధ్వంసమైనవి. చెట్లుచేమలు, పశువులు దెబ్బతిన్నవి. అసంఖ్యాకముగా పశునష్టము వివస్త్రలైన మృతకళేబరములు గురించి రిపోర్టులు చేశారు. లోతట్టు ప్రాంతమగుటచే తీరప్రాంత గ్రామాలకు విశేషముగా నష్టము వాటిల్లెను"[3].

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 32
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 33
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 34

**8. 1839 - తుఫాను (తూర్పుగోదావరి జిల్లా - కోరింగు): -**

"1839 సం॥ లో వచ్చిన తుఫాను తూర్పుగోదావరి జిల్లాలో అందులో కళింగపట్నము దాదాపు తుఫానుకు గురియగుచునే ఉన్నది. ఒక ప్రేక్షకుని కథనం ప్రకారం 30,000 మంది జననష్టము కలిగినట్లుగా తెలియుచున్నది. "వంద, రెండు వందల టన్నుల, అసంఖ్యాకమగు పడవలు దూర ప్రాంతాలకు కొట్టుకొని పోవటమేగాక అవి తలక్రిందై, ఒక దానినొకటి ఢీకొనినట్లు, గుట్టలు గుట్టలుగా పడియున్న చిందరవందర స్థితి చూచిన అది క్రూర రాక్షస గణము చేతలుగా పొడగట్టును[1]. అని చెప్పియున్నాడు.

**9. 1864 నవంబరు 11 వ తేదీ మంగళవారం అర్ధరాత్రి ప్రళయ ఉప్పెన: -**

"చరిత్రలో అప్పటివరకు కనీవినీ ఎరుగనంత భయంకరమైన తుఫాను 1864 నవంబరు 11 వ తేదీ మంగళవారం నాడు సంభవించింది. మచిలీపట్టణమును పూర్తిగా ముంచెత్తి ధ్వంసము చేసెను. సముద్రపు అలలు 13 అడుగుల ఎత్తున లేచినవి. సముద్రతీర ప్రవాహము80 మైళ్ళవరకు బైటి ప్రదేశము 17 మైళ్ళ వరకు వ్యాప్తి చెందెను. 30,000 మంది జననష్టము కలిగినది. అసంఖ్యాకముగా పశునష్టము కలిగెను. బందరు రెవెన్యూసెటిల్‌మెంట్ అసిస్టెంటు ఆఫీసరు శ్రీ. జె. లక్ష్మీకాంతారావుగారు డైరెక్టర్ శ్రీ ఆల్. ఇమాస్టరు గారికి వ్రాసిన 1864 నవంబరు 4వ తేదీ రిపోర్టు వలన ఈ విషయాలు తెలియుచున్నవి: రాత్రి 9.00 గం॥లకు చెలరేగిన ఉప్పెన పట్టణమును తుడిచిపెట్టినది. ఇండ్లు, పశు, జన నష్టము చెప్పతరము గాదు. 'తంతి తపాలా పరికరములు పాడయిపోవుటచే టెలిగ్రాములు పంపవీలైనది కాదు"[2].

"లండన్ చర్చి మిషనరీ సమాచార శాఖకు మచిలీపట్టణ మిషనరీ శ్రీ షార్క్ వ్రాసిన విషయాలు : 10.00 గం॥ప్రారంభమైన ప్రళయగాలికి తలుపులు, కిటికీలు మూసి తట్టుకొనే ప్రయత్నము చేసితిమి. భరింపరాని సముద్ర ఘోషతో పాటు నీరు ఇంటిలోనికి ప్రవేశించినది. తలుపులు ఊడిపోయి చుట్టినగాలికి సముద్రపు నీటిలో మునిగితిమి. మా దైవ ప్రార్థనతో ఓం శాంతి:శాంతి: అని భగవానుకర్పణమైతిమి. సముద్రపు పొంగు ఎంత వేగముగా వచ్చినదో అంత వేగముగా ప్రవాహపు పొంగు వెనక్కు తీసింది. భాస్కరునికి సూర్యోదయమును చూసి కృతజ్ఞతాపూర్వక ప్రణామములు చేశాము"[3].

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 34
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 35
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 36

"ఆనాటి జిల్లా కలెక్టరు శ్రీ జి. థారన్‌హిల్. జిల్లా పోలీసు సూపరింటెండెంటు పి.టి. సిమ్సు రెవెన్యూ బోర్డు సెక్రటరీ శ్రీ డబ్లియూ హడ్లెనన్ గారికి 1864 నవంబరు 10 వ తేదీన పంపిన రిపోర్టు వలన ఈ విషయాలు తెలియుచున్నాయి. ఆనాడు వీచిన ప్రళయ తుఫాను గాలి వలన నష్టమింతయని చెప్పనలవి కాదు. మాట చాలదు. నాల్గవ వంతు జననష్టమైనది. ముప్పాతికవంతు ఆస్తినష్టము. త్రాగే నీటికి సమస్య ఏర్పడినది.మా దొడ్లో నాలుగు శవాలను, దాదాపు 50 జంతు మృత కళేబరాలను పూడ్చిపెట్టితిమి. ప్రక్క దొడ్లో 20 వరకు పూడ్చబడినవి. మిగతా ఊళ్ళల్లో జరిగిన నష్టాన్ని గురించి లెఖ్ఖ ఇచ్చిరి. కొట్టుకు వచ్చిన మృతకళేబరములు గుర్తు పట్టుటకు వీలుగా లేవు. అనేక సామానులు కొట్టుకు వస్తే వాటికి దొంగలు ఆశపడినారు"[1].

"మచిలీపట్టణ మిషనరీ వ్రాసిన ప్రతి రిపోర్టులో ఉప్పు కొఠారులకు కలిగిన నష్టము గురించి వ్రాసినారు. బంటుమిల్లిలో 2,40,000 మణుగుల ఉప్పు కొట్టుకొనిపోయినది. మంగినపూడిలో ఉప్పు మిగులలేదు. నిజాంపట్నం, చినగంజాం ఇదే స్థితిలో ఉన్నవి. ఆనాడు ఉదయం వాన జల్లులతో ప్రారంభమై ఆకాశము దట్టముగా మేఘావృతమై 2-00 గం॥లకు గాలి వర్షపాతము అధికమై, 5-00 గం॥లకు ఆకాశము అంధకార బంధురమై మనిషి కనబడనంతగా చీకటి అలముకున్నది. 11-00 - 11-30 గం॥లకు రాత్రి సముద్రపు పోటు ప్రారంభమై గాలి ఈశాన్య దిశగా మారి వీధులన్నియు జలమయమైనవి. నీటి వేగానికి కాలు నిలద్రొక్కుకొనలేక వెనుకకు నెట్టి పడవేయు ప్రమాదములో జీవికి నిరాశ ఎదురగుచుండెను. ఇండ్ల తలుపులు, కిటికీలు గడియలు విరిగిపోయి, బట్టలు తడిసి ముద్దయి పోయి, చలికి ముద్ద కట్టుకఁబోజొచ్చెను. ప్రాణములు నిలుచునన్న ఆశపోయెను. ఆ సమయములో దేవుడిని ప్రార్థంచుటకు కూడ నోరు మూగవోయెను. ఇండ్లలో దీపములు ఆరిపోయెను. అర్థరాత్రి 12-00 1-00 గం॥సమయములో 13 అడుగుల ఎత్తున లేచిన తరంగాల తాకిడికి ఎంతమంది నిహతులైనారో ఊహింపశక్యముగాదు. భవంతులు, పాకలు, పశువులు, పశువులకొట్టములు, చెట్లు, చేమలు, జీవులు, ఇండ్లు, ఎంతమందియో బలై ప్రవాహవేగమునకు కొట్టుకొనిపోయిరి. 60,000 జనాభాలో నాల్గవవంతు, ఈ ఉప్పెన వాతబడిరి. ఆనాడు దీపావళి పండుగ మూడవ రాత్రి, కొడుకులు - కోడండ్రతో - మనుమలు - మనుమరాండ్రతో విలువగల దుస్తులు, నగలతో నిద్రించువారందరు ఉప్పెనకు హతులైరి. తెల్లవారుసరికి నడుములోతు నీరు, హతులైన మృతకళేబరములు, చెట్లకొమ్మలు, దూలములు,కొట్టుకు వచ్చినిహతులైన తమతమ కుటుంబములకై అల్లాడువారి ఆక్రందనపు ఘోష హృదయ విదారకము. ప్రభుత్వము స్థానిక సంస్థలు పెద్ద ఎత్తున సహాయమందిచ్చిరి. ఉబ్బసము,

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 36

చలిజ్వరము, కీళ్ళనొప్పులు, మొదలగు వ్యాధులు ప్రబలెను. బందరు ఖొజ్జిల్లిపేటలో శ్రీ జోగి జగన్నాథపంతులుగారి మేడపై కొన్నివేలమంది జనము ప్రాణాలు దక్కించుకొనిరి. ఉయ్యాలలో నిద్రించు బిడ్డ ఉయ్యాలతో సహా చెట్టుపైకి కొట్టుకొనిపోయి బ్రతికిన వానికి సముద్రాల నాయ్డు అని పేరు పెట్టిరి. చింతకుంటపాలెంలో పురుషోత్తమ సోమయాజి అనే ఆయన అలల పొంగుకు తాటి మొవ్వులో జిక్కి బ్రతికిన ఉదంతముకూడా కలదు. నందమూరు గ్రామకరణం శ్రీ నందమూరు కామరాజు పంతులుగారు, నాటి ఉప్పెనలో త్రాటి మొవ్వులో చిక్కుకొని బ్రతికిన విషయమును ఈనాటికి చాలమంది చెప్పుకొందురు.

పట్టణ పరిసర ప్రాంతాలైన గిలకలదిండి, నాగాయతిప్ప, గరాల దిబ్బ, జాలరుల సంగతి వేరే చెప్పనక్కరలేదు. 700 మంది జనాభా గల శివగంగలో 70 మందిమాత్రమే మిగిలిరి. 17-9-1914 సం॥లో రాబర్టు యెలిన్ వ్రాతల వలన శిలాశాసనము వలన మరికొన్ని విషయాలు తెలియుచున్నవి"[1].

### 10. 1879 నవంబరు 19 వ తేదీ తుఫాను: -

"1879 సం॥ నవంబరు 19 వ తేదీన వచ్చిన తుఫాను కృష్ణాజిల్లాను ఎక్కువగా సముద్రపు పొంగులో ముంచివేసినది. రేపల్లె విజయవాడ తాలూకాలలో అసంఖ్యాకమైన పశువు, జననష్టములు సంభవించెను. అడ్డదిడ్డముగా కాలువగట్లన్నియు గండ్లు పడినవి. దాదాపు పల్లపు ప్రాంత పంట పూర్తిగా నష్టమైపోయెను"[2].

### 11. 1879 డిసెంబరు 6, 7, 8 తేదీల తుఫాను: -

"1879 డిసెంబరులో వచ్చిన తుఫాను వలన విశాఖపట్నం, గోదావరి జిల్లాలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. 440 మంది జననష్టము. 5,000 వరకు పశు నష్టము 9,000 ఇండ్లు నేలమట్టములైనవి. రోడ్లు, పంటకాలువలు గండ్లు పడి పాడైపోయినాయి[3].

### 12. 1925 - 5 - 15 తేదీ చిన్న ఉప్పెన: -

"1925 సం॥ మే 15వ తేదీన వచ్చిన ఉప్పెన చెట్లు, చేమలు, ఆకులు, అలములు, ప్రళయగాలికి ఛిన్నాభిన్నములైనవి. ఇండ్లకప్పులు ఎగిరిపోయి వికటస్వరూపము కనబడెను. సముద్రము పొంగి, సముద్రపు కయ్యలు, కాలువలు దాటి కొబ్బరితోటల ప్రక్కభూమి ఒక జలార్ణవమై 'కరి' మీద దేవాలయము వరకు

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 41
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 42
3. పైదే

వచ్చి ఆగిపోయినది"[1]. గాలికి గొడ్లపాకలు ఒరగగా ప్రజలంతా కలిసి పశువుల మెడ పలుపులు కోసి వాటిని ప్రాణాలతో బయటకు పంపిరి.

**13. 1927 నవంబరు 1వ తేదీ నెల్లూరు తుఫాను: -**

"1927 సం॥ నవంబరు 1వ తేదీన నెల్లూరుకు భయంకరమైన తుఫాను సంభవించినది. ఉత్తరదక్షిణములుగా 25, 30 మైళ్ళ వరకు వ్యాపించిన తుఫాను భవనములకు నష్టము కలిగెను. 629 మంది చనిపోయిరి. 50,000 పశు నష్టము సంభవించెను"[2].

**14. 22-11-1928 గాలివాన: -**

"1928 సం॥ నవంబరు 22వ తేదీన బందరులో సంభవించిన గాలివానకు పాకలు పూరిండ్లు నేలమట్టమైనవి. పేదప్రజలు తలదాచుకొనుటకు, తినడానికి తిండిలేక బాధలు పడినారు. ఆనాటి మున్సిపల్ ఛైర్మన్ కొల్లిపర వెంకట రమణయ్య నాయుడు గారు, డాక్టరు పట్టాభి గారు ఇంకా కొంతమంది పెద్దలు అప్పటి 'భవానీ శంకర్ లాడ్జి'లో సమావేశమై వీరి పునరావాస చర్యల గురించి చర్చించిరి. రాష్ట్రం నలుమూలల నుండి విరాళములు స్వీకరించి బాధితులకు సహాయపడిరి"[3].

**15. 28-10-1936 గుంటూరు తుఫాను: -**

"1936 సం॥ అక్టోబరు 28వ తేదీన వచ్చిన తుఫాను గుంటూరు జిల్లాకు అందులోను బాపట్లకు విశేష నష్టము కలుగజేసినది. 233 మంది జననష్టము కలిగినది. 32,746 కుటుంబముల వారు నిరాశ్రయులైరి"[4].

**16. 26-10-1949 వర్షపాతముతో కూడిన గాలివాన: -**

"1949 అక్టోబరు 26వ తేదీన కొంతగాలితో కూడిన వర్షపాతము. ఇది పట్టణాన్ని అల్లకల్లోలముచేసినది. 100 కి॥మీ॥ వేగముతో గాలిసాగినది. మొత్తము నష్టము 800 మంది. 10,000 ఎకరముల పంట నష్టము. నాటి మున్సిపల్ ఛైర్మన్ రాళ్ళపల్లి అచ్యుతరామయ్యగారు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పునరావాస కార్యక్రమములు సాగించిరి"[5].

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 43
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 44
3. పైదే
4. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 45
5. పైదే

**17. 8-9-1962 విపరీత గాలివాన: -**

"1962 సం॥లో సెప్టెంబరు 8వ తేదీన విపరీతముగా గాలితో కూడిన వానపడినది. దీనికి ఆనాటి మున్సిపల్ కమీషనర్ శ్రీ మీర్జా అన్వర్ బేగ్ గారు, ఛైర్మన్ శ్రీ సన్నాల వేణుగోపాలరావు గారు తమ సిబ్బందితో పేదజనానికి పునరావాస వసతులు కల్పించి, సేవచేశారు"[1].

**18. 5-11-1968 వర్షపాతము - పెద్దవరద: -**

"1968 సం॥ నవంబరు 5వ తేదీన వచ్చిన అధిక వర్షపాతము వలన బందరు, దివిసీమ, గుడివాడ, కైకలూరు తాలూకా గ్రామాలను ముంచెత్తింది.వర్షము దానికి తోడు గాలి, పొలాలు, గ్రామాలు ఏకమై ముంచెత్తించింది. జననష్టము పశునష్టము విశేషము. గాలితాకిడికి కూలిపోయిన ఇండ్లకు, పాకలకు లెక్కలేదు"[2].

**19. 17-5-1969వ తేదీ - తుఫాను: -**

"1969సం॥ మే 17వ తేదీన వచ్చిన తుఫాను ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరాలన్నింటిని తాకినది. గుంటూరు, కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు నష్టపడినవి. గుంటూరు జిల్లా 606 జననష్టము. కృష్ణాజిల్లా దివితాలూకా గ్రామములో 5 గ్రామాలు దెబ్బతిన్నవి. వరిపంట 20 కోట్ల రూపాయల మేరకు నష్టము"[3].

**20. 8-11-1969 దీపావళి నాటి ఉప్పెన: -**

1969 సం॥ నవంబరు 8వ తేదీన వచ్చిన తుఫాను చిన్న ఉప్పెన మాదిరిగా వచ్చినది. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, కృష్ణా, విశాఖపట్నం జిల్లాలలో ఎక్కువ ప్రాంతాలు గురైనాయి. 10 అడుగుల వరకు లేచిన తుఫాను పొంగు, కొల్లేరు కోట గ్రామాన్ని చుట్టుముట్టెను. 250 మంది జననష్టము. 10,000 పశునష్టము, 4లక్షల ఇండ్లు నేలమట్టమైనవి. 25,000 గొర్రెలు, మేకలు మృతి చెందినవి. 65 కోట్ల విలువగల 18 లక్షల ఎకరాల పంట నష్టము. కైకలూరు తాలూకా పెద్దింటమ్మ గుడివద్ద, ముందు, మంటల వెలుతురు కనిపించినది. తాళ్ళ ఎత్తున అలలు పొంగి జలం నాశనము చేసినది. మున్సిపల్ మేనేజర్ శ్రీ మండల సత్యనారాయణ గారి అకుంఠిత సేవా దీక్ష మరువరానిది[4].

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 46
2. పైదే
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 47
4. పైదే

**21. 4-11-1976వ తేదీ పెను తుఫాను: -**

"1976 సం॥ నవంబరు 4వ తేదీన వచ్చిన తుఫాను ఎడతెరపి లేకుండా కురిసిన కుండపోత వర్షముతో పంటచేలు, కోతకు సిద్ధాన్నమైనది నీటిపాలై, రాలిన గింజలు, మొక్కలు మొలిచినవికూడ. ఈ తుఫాను దెబ్బతీరనిది"[1].

**22. 19-11-1977వ తేదీ - శనివారము - ఉప్పెన: -**

1977 నవంబరు 19వ తేదీ శనివారం నాడు వచ్చిన ఉప్పెన బందరును, చుట్టుప్రక్కల పల్లెలను, గ్రామములను పూర్తిగా నాశనము చేసెను. 10-30 గం॥లకు ప్రళయమైన గాలికి పాకలు, భవనములు, చెట్లు, చేమలు కూలిపోయినవి. సా॥ 3-00, 4-00 గం॥లకు ఆకాశము అంధకార బంధురమైనది. 6-30గం॥, 8-30గం॥, 10-30గం॥లకు క్రమక్రమముగా గాలి తీవ్రమై పెనుగాలి తాకిడికి బందరు, దివిసీమల, గ్రామ గ్రామముల సముద్ర తీరమునగల జాలరుల కొంపలు, పశువుల కొట్టములు నేలకూలినవి. 12, 13 అడుగుల ఎత్తున లేచిన సముద్రకెరటాలకు జనము, జంతుజాలములు కొట్టుకొని పోయినవి. ఇంటి కప్పులు, పాకలు, నీటరాలి కొట్టుకొని పోయినవి. చెల్లాచెదరై అంగవిహీనములైనవి. భీకరదృశ్యములు, బ్రతికినవారి ఆక్రందనపు ఘోష వారి వారి హృదయ విదారకములగు చరిత్రలెంతవారికి వినినంత దు:ఖము పెల్లుబుకుచుండెను. ఆనాటి మంత్రివర్యులు మండలి వెంకట కృష్ణారావుగారు చేసిన సేవలు మరుపురానివి[2].

శ్రీ శర్మగారు కాళరాత్రి అనుబంధం II లో 1864 సం॥ నవంబరు 1వ తేదీ బందరు ఉప్పెన గురించి కవి, దివి తాలూకా, మాచవరం కాపురస్థుడు శ్రీ రాయభట్టు వీరరాఘవ కవి వ్రాసిన సీసమాలికను పొందుపరిచిరి"[3]. 3-2-1978వ తేదీ ఆంధ్రపత్రికలో "సిసలైన - తుఫాను సీసపద్యం" అనే శీర్షిక క్రింద కళాప్రపూర్ణ శ్రీ నిడదవోలు వెంకట్రావు గారు ప్రచురించిన భాగమున్నూ, అవనిగడ్డలో లభ్యమైన శిధిల వ్రాత ప్రతిని వీరు పరిశీలించి కాళరాత్రికి అనుబంధముగా వెలువరించిరి. శ్రీ కళాప్రపూర్ణ శ్రీ నిడదవోలు వెంకట్రావుగారు పత్రికలో ప్రచురించిన దానికి వారి పరిచయమును కూడ చేర్చిరి. 1864 బందరు ఉప్పెన సీసమాలిక పదిపేజీలు దీనిలో పొందుపరిచిరి. 1977 నవంబరు 19వ తేదీన వచ్చిన తుఫానుపై డా॥ బి.వి.ఆర్. ప్రసాదరావు వ్రాసిన సీసమాలికను కూడ జోడించిరి[4].

భావితరాల వారికి చరిత్రలో వచ్చిన గాలివానలు, తుఫానులు, ఉప్పెనల గురించిన వివరములు అందించిన శ్రీ కవిశేఖరులు ధన్యజీవులు - చిరస్మరణీయులు.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 49
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 50
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 63
4. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కాళరాత్రి పుట 74

# కల్పలత ఖండకావ్య సమీక్ష

# కల్పలత ఖండకావ్య సమీక్ష

ఆధునిక సాహిత్య ప్రక్రియలలో ఖండకావ్యం ప్రసిద్ధికెక్కినది. "ఖండకావ్యం భవేత్కావ్యస్యైక దేశానుసారిచ" - అని సాహిత్య దర్పణకారుడైన విశ్వనాథుడు నిర్వచించెను.

కథలోని ఒక సంఘటనను కాని, కథాసంబంధము లేని ఒక రమణీయమైన భావమును గాని ఆధారముగా జేసికొని కవి ఖండకావ్యాన్ని సృష్టించును.

ఒకప్పుడు "చాటువులు" పేర కొన్ని పద్యాలు ప్రచారములో ఉండేవి. నేడు వెలువడుతున్న ఖండకావ్యములు ఇటువంటివే. ఒక భిన్న విషయాన్ని తీసికొని రమణీయమైన భావాలతో కవి ఖండకావ్యసృష్టిగావించును. వీటిల్లో కొన్ని సంఘటనలు ప్రాధాన్యం కలిగి ఉంటాయి. కొన్ని కేవలము ఉదాత్త భావాలతో నిండి ఉంటాయి. ఖండకావ్యములో వ్యర్థమైన పదాలు ఉండకూడదు. ప్రతి పదము రసస్ఫోరకముగా ప్రతి భావము హృదయరంజకముగా ఉండాలి.

ఏదైనా ఒక విషయము కవి మనస్సుకు హత్తుకొని హృదయము పరవశమైతే అది రసవత్తరమైన ఒక కావ్యముగా వెలువడుతుంది. అదే ఖండకావ్యము.

శ్రీ గురుజాడ రాఘవశర్మగారు గొప్ప శ్రీకృష్ణ భక్తులు. వారి హృదయము భక్తి పరవశమైనపుడు వెలువడినదే ఈ కల్పలత ఖండకావ్యము.

## 3.1 వినతి: -

కల్పలత ప్రారంభములో అమ్మా! శారదా నీ అనుగ్రహము వలననే జిహ్వాగ్రమ్మున అమృతాక్షరములు కదలెఁగదమ్మా! అని విన్నవించుకొనిరి.

**"నీ కరుణా విశేషమున నిర్మల గాంగఝురీ సమానమై**
**ప్రాకిన సత్కవిత్వము తిరంబుగ పుస్తక రూపమున్ గొనన్**
**లోకము నేడొకింత యవలోకన ఁజేసి బహూకరించుటల్**
**నీ కృపయే కదమ్మ జననీ! మృదుభాషిణి! భక్తపోషిణీ!"[2]** వినతి 2వ పద్యము

నీ కరుణా విశేషము చేత నిర్మలమైన గంగాఝురీ సమానమై ప్రాకిన కవిత్వము పుస్తకరూపము గొని, లోకము దానిని అవలోకన చేసి బహూకరించుట నీ కృపయే గదా! అని తనకు కవిశేఖర బిరుదు

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 3

నొసగిన వారికి శుభము కలగాలని ఆశీస్సులొసంగిరి. బిరుదులు వీరికి సంతృప్తినొసంగవట. నీవొసగు భిక్ష అక్షయమై తరించి, దివ్య మంగళ పదస్థితికి చేర్చినప్పుడే ఆనందము. నీ పదదాసుడను. ఈ బిరుదులు స్వీకరించుటకు నేనెంతవరకు అర్హుడనో నీకు తెలియును. కవి ప్రకరము గౌరవించునట్లుగా అందఱు తరియించు మేటి కవితలు ఎల్లప్పుడు పలికింపుము అని ఆ శారదామాతకు విన్నవించుకొనిరి.

## 3.2 సందర్శనము : -

శ్రీ శర్మగారు రచించిన ప్రతి కావ్యఖండికయు, ప్రతిగేయమును స్వానుభవజన్యమై, అంతశ్శుద్ధి నావిష్కరించుచు వారి వ్యక్తిత్వమును, వారిమనస్తత్వమును, వారిసాహిత్య లక్ష్యమును ప్రతిబింబించును. వారి కలము నుండి జాలువారిన ప్రతికృతియు నేదేనొక ప్రత్యేకతను సంతరించుకొని వారికి గల "కవిశేఖర" బిరుదమును అన్వర్థమొనర్చుచున్నది.

కల్పలత ప్రారంభములో యశోద పురిటింటియుయ్యాలలో

**"తమ్ములనేలు కన్నులు సుధాకరబింబమునోము మోముచ**
**క్రమ్మును శంఖమున్ గదయుఁగైదువు దాచిన కేలుదోయితో**
**నమ్మధుసూదనుండు శిశువై!"**[1]... ... ... ... ... ... ... ... ...
... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... సందర్శనము1వ పద్యము

జన్మించి కేరింతలు కొట్టుచు "సందర్శన"మిచ్చును. ఈ సందర్శనమొక హృదయంగమమైన కల్పనతో కూడిన ఘట్టము.

కేశవుడు బాలగోపాలుడై యశోద యింట జన్మించినట్లు విని శివుడాతనిని చూడవలెనను కోరిక గలిగి సన్యాసి వేషముతో ఆ యశోద యింటికేగి,

**"తిరిపెమునకేమి పది యిండ్లు తిరిగితెత్తు**
**నీలమణి వోలె నీ యింట డోలనూగు**
**బాలకుని జూచుటయె నాదుపాలి కమృత**
**భిక్షమొసగుము కన్నుల విందునేఁడు"**[2] సందర్శనము7వ పద్యము

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 9
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 10

**"చక్కనివారిలో మిగుల చక్కనివాఁడిటువంటి వానిమే**

**మెక్కడ ( జూడమంచు వచియించెద రెల్లెడ నమ్మలక్కలా**

**చక్కదనాల చుక్క నొకసారి కనుంగొన వచ్చినాడ నో**

**యక్కరో! కాదు కూడదన కాదృతి వీని నను గ్రహింపుమా!"**[1] సందర్భనము10వ పద్యము

అని ప్రార్థించును. ఈతడు వీధియందు తిరుగాడు సాధారణ భిక్షువు అని యెంచి దృష్టిదోషము తగిలి బిడ్డడు కలవరించునని భయమంది,

**"కోరికల కేమి! గొంతెమ్మ కోరికలను**

**దీర్చవచ్చునె! ఎవ్వారి దృష్టి యెట్టి**

**దో యెఱుగరాదు నీ త్రోవఁ బోయెదో! బి**

**కారి! యెద్దు పుండ రయని కాకి వీవు!"**[2] సందర్భనము14వ పద్యము

అని ఆమె బాలుని చూప నిరాకరించును. ఆమాయా వేషధారి శివుడు చేయునది లేక

**"కనులఁ జూతునంటి (గాని యంతకు మించి**

**యడుగ, నింత లోనె బుడుతఁడేమి**

**యరిగి పోవునమ్మ! అయ్యో! నీ కడుపు బం**

**గారుగా, నిదేమి గోరమమ్మ!"**[3] సందర్భనము23వ పద్యము

**"సరిలే! మించిన దేమిలే! యిక, నివాసమ్మున్ వడిన్ జేరెదన్**

**మరియాదన్ గనిపట్ట వించుకయు, మామా తారతమ్యమ్ము; లీ**

**పరి నీవే బ్రతిమాలుకొంచు వడిగాఁబర్వెత్తి రాకుందువే!**

**తరుణీ! నీ దయనాఁటికిన్ మఱలిరాదా! పోయి వత్తుంగదే!"**[4] సందర్భనము24వ పద్యము

అని గొణిగి కొనుచు శరవేగముతో తన నివాసమునకరిగినాడు.

"కాలగళుండు దానిటుల కాలు గదల్చెనొలేదొ డోలిక నున్న బాలుడు కెవ్వుమని గగ్గోలు బెట్టి యేడ్చుచుండెను. దానితో యశోదకు కాలు, చేయి ఆడక (మాన్పడి, పసిబిడ్డను కౌగిట నెత్తుకొని వక్షః

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 11
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 12
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 14
4. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 15

స్థలమున హత్తుకొని ఉసురంచు శిరము మూర్కొనుచు, "అయ్యో! ఇంతలో నెంతగా వసి వాళ్వాడితి! మోము కంది యెటుకెంపై పోయెరా! తండ్రి!" అంటూ దురపిల్లినది. "బాలకుని మరల డోలాంతస్థితున్ జేసి" యూపినది. ఏమి చేసియు ఏడ్పు మాన్పలేక విసిగి వేసారి చివరకు "తాన యేడ్చినది" ఊరకుండలేక "ఎఱ్ఱని నీరు బాలునిపై మూడు సార్లు దిగదుడిచి దూరముగా పోసినది. అయినను కుఱ్ఱడూరకుండక గ్రుక్కపెట్టి యేడ్వదొడంగినాడు. మరలనెత్తుకొని ఇటునటు త్రిప్పి మొగము నందు విభూతి పెట్టినది. తొట్టెలో పరుండబెట్టియూపినది. ఒడిలో నిడుకొని చనుగుడిపినది. వారికి వీరికి చెప్పినది.ఇదెక్కడి పాపమోయని విసిగికొన్నది. జోలపాడినది. ఇట్లు ఎన్నో పడరాని పాట్లు పడినను ఏమి చేసినను బాలుని ఓదార్చలేక 'శివ శివ' యేమిసేతునని వాపోయినది.

**"నా యిలువేల్పులార! తగునా! యిటు లూరకొనంగ మీకులే**
**దాయెనె నాపయిన్ గరుణ తప్పలు గల్గిన సైపరయ్య! మీ**
**దే! యిక భారమయ్య! సరితీర్పగ మ్రొక్కులు మీదు గట్టెదన్"[1]** సందర్భనము 38వ పద్యము

అని గగ్గోలు పెట్టినది.

ఈ మాటలు చెవిని బడినంతనే అంతవరకు గ్రుక్కపెట్టియేడ్చుచున్న బాలకుడేడ్పుమాని నవ్వుచు కేరింతలు గొట్టినాడు. అప్పుడు ఆ తల్లికి వచ్చినవాడు సాధారణ భిక్షువు కాదని, సాక్షాత్తు ఆది భిక్షువైన పరమశివుడేయను జ్ఞానోదయము కలిగినది. ఆ ఊహ కలిగిన మరుక్షణమే ఆమె తటాలున బాలుని నుయ్యేలలో పరుండబెట్టి, శరవేగముతోనూరి బైటనున్న మాయాజంగము కాళ్ళపై పడి,

**"దేవ, నీవంటి 'వీకూనదేవు'డనుచు**
**దేవుఁడగునేని పోర్వెట్టు నే వచింపు,**
**మకట! నీ రాకకే యీతఁడడలునేమొ!**
**రమ్ము! నా సామి! యోదార్చు కొమ్ము వీని"[2]** అని బ్రతిమాలినది. సందర్భనము 40వ పద్యము

**"ఐన మఱొక్క యూహ, హృదయమ్ముఁ గలంచెడిఁ బోరుపెట్టునే**
**రేని భవత్కరమ్ము స్పృశియింప, విభూతి నిడన్ దురాయియై**
**మానుదురంచు నీవనిన మాటలబద్ధముకావుఁ నేడు దూ**
**రానకు బోయి వత్తుననరాదు, దురాయి నను గ్రహింపుమా!"[3]** సందర్భనము 48వ పద్యము

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 19
2. పైదే
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 21

అని వేడుకొను యశోదతో తురాయి కట్టెదను బాలుని తీసికొని రమ్ము అని చెప్పి,

**"శైశవలీల సుమ్మిది విచారము మాను దురాయిగా జటా**
**కేశము ( గట్ట, నెత్తు మిరుకేల మటియ శిరంబుపై నిదే**
**నీ శిశుపాద మాన జననీ! భయలేశము లేదు తీఱె నా**
**యాశయ మీవు నీ శిశువు హాయిగ నుండుడు పోయివచ్చెదన్".**[1] సందర్శనము 50వ పద్యము

అని శివుడు కేల్దోయితో జటా కేశమున శ్రీరస్తు చిరాయురస్తనుచు" దురాయి కట్టెను. పిమ్మట నీవును నీ బిడ్డయును సుఖముగ నుండుడు నేను పోయి వచ్చెదను అని వెళ్ళిపోయెను. అంత యశోద పిల్లవానిని ముద్దాడెను.

యిక్కడ మహా భక్తుడగు శివుడు విష్ణుపాదము తన తలసోకుటయె తన కోరికగ తలంచెను. ఇది వైష్ణవ సంప్రదాయము.

శ్రీ శర్మగారు శివకేశవుల అద్వైతభావమును మనోహరముగా తీర్చిదిద్దిరి. కేశవుని దర్శించవలెనను శివుని ఉత్సుకతను, కేశవునికి శివుని దర్శించవలెననెడి కోరికను చిత్రముగా చిత్రీకరించిరి. ఎన్ని చేసినను తృప్తిగొనక మరల నా బాలగోపాలుడు శివశివాయను నామముతోనే పరితృప్తినొందుట రమ్యమైన ఘట్టము. శివకేశవుల పరస్పరదర్శనమె ఈ సందర్శనము.

మాయా వేషధారియై వచ్చిన శివునితో "మరియాదన్ గనిపట్ట వించుకయు మామా తారతమ్యమ్ములు" అని వీరు పలికించుటలో అర్థము శివునికి కేశవునికి భేదము లేదు అని చెప్పుటయే.

**"శివాయ విష్ణురూపాయ**
**శివరూపాయ విష్ణవే**
**శివస్య హృదయగ్ం విష్ణుః**
**విష్ణోశ్చహృదయగ్ం శివః"**

అను శివకేశవాభేద భావమును ప్రకటించుటకే వీరు ఈ సందర్శనం వ్రాశారు. యశోద కారణజన్మురాలు అయ్యుండియు మాయాచ్ఛాదితమైన అజ్ఞానము చేత తానొక సామాన్యురాలగు తల్లిగాను, శ్రీకృష్ణుని ఒక

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 22

సామాన్యుడగు బిడ్డడుగాను తలంచినది. ఈ అజ్ఞానచ్ఛేదనమునకు జ్ఞానప్రదాతయైన శివుడు మాయావేషధారియై వచ్చి

> **"అదితికిఁ గోసలాత్మజకు నబ్బిన భాగ్యము నీకు నబ్బెనో"**
>
> **సుదతి రో! నీ కతమ్మునసెసూ! వ్రజమిప్డు వికుంఠమయ్యె!**
>
> **... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ...**
>
> **... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ...**
>
> **... ... ... నీ సుతుని! జూచుట పుట్టువుకాలఁదన్నుటల్"[1]** సందర్శనము 2వ పద్యము

అని జెప్పి యశోదవ్యాజమున మనందరకు శివకేశవాభేద జ్ఞానమును చాటిచెప్పిరి.

ఇది ఏ పురాణాంతర్గతమైన ఘట్టమును కాదు. యశోద రూపమున మాయా పరివృతమైన అజ్ఞానాంధకారములో మునిగియున్న మనందరకు అద్వైతానుభూతిని కలిగించు జ్ఞానదీపిక. శివుడు వేరు, విష్ణువు వేరు అని భావించువారికి ఇది ఒక చక్కని కనువిప్పు కలిగించు ప్రబోధాత్మక ఘట్టము.

> **"ప్రాణములీయవచ్చిన, కృపాపరిపూర్ణు ఁడ వీవు తండ్రి! స్వ**
>
> **స్థానముఁజేరు టెల్ల సహజమ్ము భువిన్ బ్రతిజీవి, కెన్ని నా**
>
> **ళ్లైనను నిన్ను వీడ, మనసాడదుగా యిది దైవ నిర్ణయం**
>
> **బేని, భరింపఁదీఅదు సహింప, సహింపక యున్న,మానునే"[2]** సందర్శనము 47వ పద్యము

నీవు ప్రాణదానము చేయవచ్చిన దయాపరుడవు. తండ్రీ! భూలోకమున ప్రతి ప్రాణికి స్వస్థలమును చేరుట సహజము. ఎన్ని దినములున్నను నిన్ను విడుచుటకు బుద్ధి పుట్టదుగదా! నిన్ను విడుచుట దైవనిర్ణయమైనచో నీ వియోగమును సహింపక మానదు."

"స్వస్థానముఁజేరుటెల్ల సహజమ్ము భువిన్ బ్రతిజీవికి" - అనునది "ఎచ్చట బుట్టెనచ్చటికి నేగుట నైజము ప్రాణికోటికిన్ అను పోతన మహాకవి సూక్తికి ఛాయ.పుట్టిన ప్రతి ప్రాణి స్వస్థానము చేరుననుమాట సహజమని చెప్పుచు జీవాత్మ పరమాత్మ వేరు వేరు కాదు. రెండు ఒక్కటే. జీవుడు చివరకు పరమాత్మలో ఐక్యమొందుచున్నాడను అద్వైతస్థితిని తెలియజెప్పిరి.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 9
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 21

వీరి కల్పలత కావ్యమునకు తమ అభిప్రాయమును వెలిబుచ్చుచు, ఉభయభాషా ప్రవీణ, వేదాంతపారీణ, కవిశేఖర శ్రీమిన్నికంటి గురునాథశర్మగారు ఈ విధంగా వ్రాసియుండిరి.

"సందర్శనము" తెలుగు బలుకు బళ్ళతోనెంత రమణీయముగానున్నది! ఏల పెక్కులు:- ఎదురు తగులని గమనము. రసము జిప్పిలు కవనము.

**"పలుకులు పచ్చకప్పురపుఁబల్కులు - ధారలు కమ్మియచ్చు బా**
**రలు రసముల్ సుధారసతరంగము - లయ్యితి వృత్తముల్ జనా**
**వళి హృదయాత్తముల్ - సుపదబంధము లబ్జ సుమాను బంధముల్**
**భళి! గురుజాడ వంశ్య కవివర్యుని కావ్యము లార్య సేవ్యముల్."**[1] అని పేర్కొనిరి.

మదరాసు విశ్వవిద్యాలయాంధ్ర శాఖాధ్యక్షులు, శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు ఈ కల్పలత కావ్యానికి తమ అభిప్రాయమును వెలిబుచ్చుచు, "సందర్శనమున దివ్యమగు త్రివర్ణ చిత్రముతో గూడ యశోద మాటలు, కృష్ణుని చేష్ట, శివుని పలుకులు నను ముత్తెఱుంగుల పద్యముల ముప్పురను కన్నులయెదుట కట్టినట్లుగా ఉండి, మనమున హత్తుకొన్నవి. 'శ్రీ వాగ్దేవి వాత్సల్యము' బడసిన కవి యీ శీర్షికలో

| | | | |
|---|---|---|---|
| శ్రీ | - | లక్ష్మీదేవి | శ్రీ వాగ్దేవి ... ... ... దేవీ త్రయాత్మకము |
| వాక్ | - | సరస్వతీదేవి | శ్రీ వాగ్దేవి ... ... ... సరస్వతీపరము - శోభాయుక్తమైన వాగ్దేవత. |
| దేవి | - | దుర్గాదేవి | |

ఆమె అమేయ వాత్సల్యమును ననుపమేయముగా జిత్రించియున్నాడు."[2] అని వ్రాసిరి.

శ్రీ శర్మగారు కల్పలత లోని "సందర్శనము" అను ఈ ఖండకావ్యమును తన తండ్రి గారైన శ్రీ త్రయంబకేశ్వరునికి అంకితమిచ్చుచు ఈ కావ్యప్రారంభములో,

**"తనకున్ గాలముఁజేరువౌ టెఱిగిచెంతన్ రామనామమ్ము సే**
**య నియోగించి వినంగజెప్పఁగదవయ్యా! నాటి సందర్శనం**
**బని వాత్సల్యమునిండ భక్తి వివశుండై పిల్చి నన్ బల్కు మ**
**జ్జనకుండైన త్రియంబకేశ్వరునకీ 'సందర్శనం'బిచ్చెదన్."**[3] అని చెప్పిరి.

---

1. శ్రీ మిన్నికంటి గురునాథశర్మ పండితాభిప్రాయము, శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత : పుట 8
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పండితాభిప్రాయము పుట : 13
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - సమర్పణ

దీనికి మూలకారణం తమ తండ్రి, ఆనాటి దశరథమహారాజు రామచంద్రునియందు ఎలాంటి వాత్సల్యం కురిపించిరో అలాంటి ప్రేమ వాత్సల్యాలను తన మీద కురిపించటం.వీరు తాను రాఘవుడై తనతండ్రిని దశరథునిగా చేసి రామ నామాన్ని కోరిన తండ్రికి రామదర్శనం చేయించారు. ఆయన కోరిక మేరకు శివకేశవాభేదమైన ఈ కల్పను ఆయనకు చదివి వినిపించి తండ్రికి దైవ సందర్శన' మిప్పించిరి.అంత్య కాలములో మా తాతగారిని " రాఘవా! ఒకసారి రామనామం విన్పింపు" మని తండ్రి అడిగారు. అందుకై వీరు శ్రీరామచంద్రుల పటాన్ని వారికి చూపి రామనామం చెవిలో జపించారు. ఆయన తన్మయుడై నీవు వ్రాసిన సందర్శన ఖండికను వినిపించవయ్యా అని కోరారు. ఈ "సందర్శనము" వినిపించగానే కన్నుల బాష్పములతో ఆనందించి వారు అంతిమ శ్వాస విడిచిరి. ఆ విధముగా ఆయనకు మనస్సులో శివకేశవాభేద స్థితి కల్గింపచేసారు. ఇక్కడ ఒక విచిత్రమున్నది. మా తాతగారు కేశవులు (వీరరాఘవశర్మ) వారి తండ్రి శివులు (త్రయంబకేశ్వరులు) ఈ శివకేశవులిరువురు, ఈ సందర్శన శ్రవణం చేత ఆయన కావ్యగానం చేత ఈయన, శివకేశవాద్వైత స్థితిని అనుభవించారు.

## 3.3 వాత్సల్యము: -

**"తన ప్రాణమ్మునకంటెఁబ్రాణమని కాదా! రామనామమ్ము కం**
**టెను, నీ రాఘువు ముద్దుపల్కుల వియెంతేఁ బ్రీతి పాత్రములం**
**చును, విన్పింపఁగఁగోతె, నంత్య దశలో శుద్ధాంత రంగుండు, మ**
**జ్జనకున్ గొల్తు (త్రియంబకేశ్వరుని 'వాత్సల్య' ప్రదానమ్మునన్".**[1] కృతి సమర్పణ పద్యము పుట 25

రామనామము కంటెను రాఘవుఁడనగు నా ముద్దుమాటలు తనకు ప్రీతి పాత్రములగుటచే అవసానకాలమున (మరణకాలంలో) నా మాటలు విన్పింపుమని కోరెను. కావున పరిశుద్ధ మనస్కుడగు త్ర్యయంబకేశ్వరుడను నా తండ్రికి ఈ 'వాత్సల్య' ఖండకావ్యమును సమర్పించి సేవ చేయుదును అని శ్రీ శర్మగారు ఈ వాత్సల్య కావ్యఖండికను తన తండ్రికి సమర్పణ జేసిరి.

వీరు రచించిన వాత్సల్య ఘట్టము చదువుచున్నప్పుడు మనస్సు భక్తితో ఉప్పొంగుటయే గాక, శ్రీదేవీ ప్రత్యక్ష దర్శనమగును. అంతగా హృదయమునకు హత్తుకొనునట్లు ఈ ఖండికను తీర్చిదిద్దిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 25

ఒకనాటి ప్రాతఃకాలమున తల్లిదండ్రులు తమ యింటి పనిలో మునిగి యుండి యిలువేల్పైన దేవికి పాలు నివేదన చేయుమని తమ బాలుని కాజ్ఞాపింప, ఆ బాలుడు శ్రీదేవీ విగ్రహ సన్నిధికి పాలగిన్నెతో వచ్చి " తల్లిదండ్రులు గృహకార్యవ్యగ్రులైయుండిరి. నీ కృపావలము నాపై జిల్కు ... ... ... చల్లని తల్లివంచు నెదజాలిగలట్టి మహాత్మురాల వంచు అందరు చెప్పుకొందురు. ఈ నులివెచ్చని పాలు ప్రీతితో దెచ్చితిని.

**" మిక్కిలి చిక్కనై, మిసిమి మీగడ గట్టిన యావు పాలివే**
**చక్కెర జేర్చి తెచ్చితిని సాపడ రాగదవమ్మ నిన్నిదే**
**మ్రొక్కెద ( జేతులెత్తి దయపొంపిరివో(గనుమూయునంతలో**
**గ్రక్కున(ద్రావ(గావలె, తిరమ్మగు నీ దయ కానరావలెన్."[1]** వాత్సల్యము 4వ పద్యము

మీగడ గట్టి మిక్కిలి చిక్కనైన ఆవుపాలివిగో! పంచదార వేసి దెచ్చితిని. త్రాగుటకు రమ్ము. ఇదిగో చేతులెత్తి నిన్ను నమస్కరించెదను. నేను కన్నుమూసి తెఱచునంతలో గ్రక్కున త్రాగుటకు రావలెను. స్థిరమగు నీ దయ చూపవలెను.

'కనుమూయునంతలో గ్రక్కున త్రాగ(గావలె' అని ప్రయోగించుట మనోహరముగానున్నది. తల్లి తన పిల్లలు పాలు త్రాగుటకు మారాము చేయుచున్నప్పుడు కన్నులు మూసికొని తెఱచునంతలో త్రాగుమనును. అట్లే వీరును ఆ తల్లిని ప్రేమతో పాలు త్రాగుమనుట వాత్సల్య రసముత్పన్నమైనది. భగవంతుడు భక్తికి కట్టుబడునను విషయము, వాత్సల్య భక్తి ఆవిష్కరింపబడినది.

ప్రాణము నీరసించుచున్నది. ఇంటిలో దెచ్చు ప్రతి వస్తువు, పదార్థము నీకు నివేదన యొసగిగాని గ్రహింపము కదా! కావున "గ్రక్కున పాలు ద్రావు మీ" తల్లిదండ్రులొసగిన గ్రహించెడుదానవు. ఇటులేల? ఆలస్యము చేయుచుంటివి నాపై కోపమా! నేను పసివాడను. తెలిసియో! తెలియకయో తప్పులు చేసిన క్షమింపుము. చాల దయగల్గిన తల్లివంద్రు నీ పాపడగాని, నేను పెఱవాడను గాదు గదమ్మ, నేను ఎంగిలి సేయలేదు. నాచేతి స్పర్శతో ఈ పాలకేమైన కలుషత్వంబంటెనో యేమో! నీవు మౌనము వహించుట వలన నా అనర్హ త దెలియుచున్నది. నిన్ను పస్తుపెట్టితిని. ఇక ఇంటికి వెళ్ళుట ఎట్లు? పాపడను నీవే ప్రేమతో అనుగ్రహింపదగును. శిక్షింపదగును. నాకున్ శరణమ్ముత్వత్పదయుగ్మమే" అని ఆమె పాదములపై బడి ఆక్రోశించును. "తల్లీ! దయన్గనిరావా! అని శీర్షమును కొట్టుకొనును.[2] ఆమె దర్శనమునకై మనస్సున తహ తహలాడును.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 28
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 29

"వర భద్రాభయ మాతృపాదముల నాప్లావించె దోడ్తో నిరం
తర చింతా యుత బాష్పవారి, నతడున్మత్తుండునై మేని యం
బర మిట్టట్టుల జార్చుచున్ దుడిచె బాష్పస్నాత పాదాబ్జముల్
శిరముం బాసి తొఱంగు పూవుల సమర్పించెన్ శుగావిష్టుఁడై."[1] వాత్సల్యము 13వ పద్యము

వరములను, శుభములను, అభయమును ఒసగు అమ్మవారి పాదపద్మములను బాలుడు ఏడ్చుచు ఉన్మత్తుడై దుఃఖావేశమున కార్చు కన్నీటితో కడిగెను. తనయొంటి మీద నుండి జాఱిన వస్త్రముతో కన్నీట కడిగిన పాదములను తుడిచెను. తన తలలో నుండి జాఱిన పూవులతో పాదములను పూజించెను. కాళ్ళు కడుగుట, తడియొత్తుట, పూలతో పూజించుట - ఇది బుద్ధిపూర్వకముగా జరిగినదిగాదు. అప్రయత్నంగా జరిగినది. మనము ప్రయత్నపూర్వకముగా చేసినను చేయకపోయినను అది భగవంతుడు స్వీకరించి అనుగ్రహించునను దానికిది ఉదాహరణ. అట్లే దేవి వీరిని అనుగ్రహించి ప్రత్యక్షమైనది.

"చిఱునవ్వుల్ దళుకొత్తు చంద్రకళయో! చెల్వారు సౌందర్యమో!
కరపాద ద్యుతి పుష్పితాంబుజ లసత్కాసారమో! కాక తొ
ల్కరి మబ్బున్ గడద్రోయునట్టి మెఱుపో! లావణ్యపుంజంబొ! స
త్కరుణ శ్రీకరమూల కందమున సాక్షాత్కారయై దేవియున్."[2] వాత్సల్యము 14వ పద్యము

చిఱునవ్వులొలికించు చంద్రకళయో, కళకళలాడు సౌందర్యమో, వికసించిన పద్మములున్న పద్మాకరమో, తొల్కరి మేఘము నుండి వెడలు మెఱుపో, ముఖకాంతిరాశియో, దయారాశియో యనునట్లుగా దేవి ప్రత్యక్షమయ్యెను.

దేవి విగ్రహము నుండి కాంతులు మొదట పైకి పెల్లుబికినవి. తరువాత సాగినవి. అటుపిమ్మట ఆకారమేర్పడ హస్తము అభయమొసగినది. ఆ తల్లి చిరునవ్వులొలికించుచు నా చిన్నారి! పొన్నారి! శీఘ్రమే పాలిచ్చుటకు రారా! కోపమిక నాపైనేలరా! నాయనా!

"బాలకా! పాలివిగో! యని
చాలస్మరించితివి గానఁ జనుదెంచితి పా
లేలా! యీయవు జాగిది
యేలా! తేతెమ్ము! పలుకవేలా యనుచున్!"[3] వాత్సల్యము 16వ పద్యము

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 30
2. పైదే
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 31

దేవీ దర్శనానందమున తన్మయత నొందుట చేత బాలుడు బాహ్యస్మృతి లేకుండెను.పలుకకుండెను. కావుననే పలుకవేలా అని దేవి యనుచున్నది. వీరు అట్టి తన్మయతానుభూతి కలవారు కనుకనే బాలుని ఈ స్థితిని చిత్రింపగలిగిరి. ఈ విధముగా బాలుని తన చేతులతో నెత్తి ఓదార్చి, వాత్సల్యముతో పాలన్నియు త్రావగా సగమ్ము పాల కొఱకై దీనాస్యుడై ప్రార్థించినాడు. "ప్రతి నిత్యము పాలలో సగము గైకొని అందు సగము నిచ్చుదానవు. నా ఆకలి ఎట్లు తీరును? అకాలమందు పాలెవరు ఈయగలరు? అని పలికెను.అంత దేవి నిష్ఠుర వాక్యములేల పలికెదు? అధికమైన ఆకలితో నీ ఆకలి సంగతి మరచి త్రాగితిని" అనగా

**... ... ... ... ... ... "జననీ! దురదృష్టము నాదె, యీ మన**
**స్తాపము నేరికిందెలుపఁజాలుదు, నెవ్వరికైన ప్రాణముల్**
**తీపియ నీదు పాలబడితిన్ నను బ్రోచిన బ్రోవ కుండినన్**
**నీ పదయుగ్మముల్ విడువనేరను నీ దయ! యెట్లు చేసెదో!"[1]** వాత్సల్యము 21వ పద్యము

తల్లీ! నా హృదయములోని పరితాపమును ఎంతని చెప్పుదును ఏమయినను సరే. ఇదిగో నీ పాదములు పట్టుకొంటిని. ఇంక నా పాలు నాకిచ్చి ఇచ్చట నుండి మఱి కదలుము. అమాయక బాలుడననియెగదా నన్ను ఇట్లు మాయ జేసెదవు. నీ మధురోక్తులును తెలిసినవి. నీ ప్రయత్నము వలన లాభము లేదు. " నా పాలిచ్చి యీ స్థానమున్గదలంగానగు అని స్థిర విగ్రహము పాలిచ్చియు గదలదు. పాలివ్వకయు గదలదు. ఇట్లనుట వీరి బాల్యచేష్ట ఇక్కడ వ్యక్తమగుచున్నది. ఒక పిల్లవాడు తల్లి దగ్గరచేయు మారాము, పట్టుదల స్వభావోక్తి సహజముగా ఇక్కడ వర్ణింపబడినవి.

అని చెప్పి దేవి పాదపద్మములను గట్టిగ పట్టుకొని కన్నుల నుండి కన్నీరు దొన దొన కార్చెడు పిల్లవానిని చూచి ఏమి చేయుటకు తోచక వెఱగుపడినదై పూర్వము బ్రహ్మ విష్ణు మహేశ్వరులను పసిపాపలునుగ ఏ స్త్రీ చేసెనో ఆ అనసూయాదేవి వలెను, ఏ స్త్రీ కృష్ణునకు ప్రేమతో పాలిచ్చి పెంచినదో ఆ యశోద వలెను, దేవి వాత్సల్యముతో బాలుని నిండుగా కౌగిలించుకొనగా స్తనముల పాలు కారదొడగెను.

**"స్తనయుగ్మంబున, ధారఁ గట్టెడి, పయస్రావమ్మునిండించి పా**
**త్ర నొసంగన్ గ్రహియించి, బాలుడు వెసన్, ద్రావంగ, నల్లంతఁ దీ**
**యని సారస్వతమున్ స్రవించెను, బ్రవాహంబై ముఖాబ్జంబు నం**
**దున దేవీ కరుణా కటాక్ష మది చిందుల్ ద్రొక్కుచున్ బొంగగా".[2]** వాత్సల్యము 25వ పద్యము

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత – పుట : 32
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత – పుట : 33

దేవి తన స్తనముల నుండి ప్రవహించు పయోధారలతో పాత్రను నింపి బాలునకిచ్చెను. దానిని బాలుడు తీసికొని వేగమె త్రాగెను.అతని ముఖ పద్మముపై దేవి దయతో చూచు తన కడకంటి చూపులను ప్రసరింపజేయుచుండెను. బాలుడు ఆ పాలు త్రాగిన పిమ్మట ఆతని ముఖము నుండి సారస్వతము (కవిత్వము) ప్రవాహముగా ప్రవహించెను.

**"మాతా! మంజుల వాగ్విలాస కవితా మాధుర్య దాన ప్రభా**
**వాతీతా! సకలార్తి సంహరణ విద్యాన్వీత! సచ్చిచ్చుఖో**
**పేతా! సర్వజగచ్ఛివంకర దయా విఖ్యాత! త్రైవిష్టప**
**ఖ్యాతా మేయ మహత్త్వ సంకలిత! మాయాతీత! సత్యస్థితా!"[1]** వాత్సల్యము 26వ పద్యము

అమ్మా! మంజులమైన వాగ్విలాసమైన కవితా మాధుర్యమును ప్రసాదించినదానవు. సకల దు:ఖములను పోగొట్టు విద్యాన్వీతవు. సచ్చిదానందస్వరూపవు. సర్వప్రపంచమునకు శుభము లొసగుచు, అమేయ మహిమాన్వితవు. సత్యస్థితవు.నా జీవితము ధన్యమైనది. నీ స్తన్యపానము చేత నన్ను సారస్వతాస్థాన మూర్ధన్యుని జేసితివి. కారణము " నీదు క్షీరమె కవిత్వం బౌట పల్కించితౌ". నీ పాలు కవిత్వమగుటచే అవి త్రాగిననేను కవిత్వం చెప్పగలిగాను అని చెప్పుట.

**"అమ్మా! నీ మహిమమ్మెఱుంగనగునే! యామ్నాయముల్ సర్వశా**
**స్త్రమ్ముల్ నీవ కదమ్మ! నీ కరుణ లేశంబైన యార్జించు పు**
**ణ్యమ్మున్నన్ వచియించుటబ్రమొకో కావ్యమ్ముల్! భవత్ పాద ప**
**ద్మమ్ముల్ నమ్మితి భక్త కల్పక లతాంత శ్రీ! దయన్ బ్రోవుమా!"[2]** వాత్సల్యము 28వ పద్యము

అమ్మా! నీ మహిమ తెలిసికొన శక్యమగునా? వేదములును, శాస్త్రములును నీవె గదా! నీ దయ కొంచెముగానైనను సంపాదించు పుణ్యము చేసికొంటిని. ఆ పుణ్యవశమున కావ్యములు రచించుటలో ఆశ్చర్యమేమున్నది? నీ పాదములను నమ్ముకొంటిని. భక్తుల కోరికల దీర్చు కల్పవృక్ష పుష్పశోభలు గలదానా! నన్ను దయతో రక్షింపుము.

ఇక్కడ "అన్యథా శరణాన్నాస్తి త్వమేవ శరణం మమ" భావము స్పష్టీకరించబడినది.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 33
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 34

మా కల్పనల సంగతి చెప్పుటకు చాల చిత్రముగనుండును. నీవు శబ్ద స్వరూపవు. అనంతమైన ఈ కవిత్వలత నీ దయచేత ప్రాకును. నాకు దివ్యమైన కంఠస్వరమిచ్చుటచే కవిత్వము నాకు కరతలామలకము. మూడు లోకములను సృష్టించిన నీకు ఇదియొక వింతయా!

ఈ ఘట్టము నందు దేవీస్తన్యమును గ్రోలి సారస్వతాస్థానమూర్ధన్యుడైనవారు శ్రీ శర్మగారే. వీరు తనకు కవిత్వమే గాక కంఠమాధురి గూడ దేవీదత్తము అని అనుచున్నారు. కవితకు కంఠమాధురి కవిత్వసాధకమని వీరి సిద్ధాంతము.

అమ్మా! నిజము చెప్పెదను. హృదయములో ఎక్కడను లేని కోరికలుదయించుచున్నవి. ఆ కోరికలలో ఒక కోరిక మాత్రము నన్ను ఊరకే శ్రమ పెట్టుచున్నది. బహుజన్మల వాసన ఫలించుట చేత ఈ భూమిపై విశాలమైనసంసారమనెడి ఈ పాదునందు తీగలు అనెడి జన్మములు బాగుగా చిగిర్చి నాలుగు దిక్కుల పొదలై దారులు మూయుచున్నవి.మోక్షమార్గమును కనబడకుండ చేయుచున్నవి. ఇట్టి యీ జన్మలతలు నశించి పోవుకాలము ఎప్పుడు వచ్చునో సెలవిమ్ము. జన్మము నశించి మోక్షము కలుగు కాలమును సెలవిమ్మని దేవిని కవి బాలుని ముఖమున ప్రార్థించుచున్నాడు. వీరు ఆధ్యాత్మిక చింతన గలవారనుటకీ పద్యము నొక ఉదాహరణగా చెప్పవచ్చును.

ఇంక ఎప్పుడు నీ పదమ్ములు గ్రహింతును? నీ కృపాకటాక్షమెప్పటికి లభించును నీ వాగమృతమును త్రాగుటకు బోసెదవు. నిన్ను జూచుటకీ కన్నులు చాలుటలేదు. కావున ఛీ ఈ తుచ్ఛ శరీరము ఏమిటి అని యనిపించుచున్నది.

**"వ్యాప్తంబైన చరాచరప్రతతి కీ వాధారమమ్మా! త్రయీ**
**గుప్తంబైన భవత్ ప్రభావమును వాక్కుల్ పల్కు లేవంట సం**
**ప్రాప్తంబైన పదార్థముల్ గొనుచు నారాధించు కొంచుందు, సం**
**తృప్తిన్ నీ పిలుపెప్డు వచ్చు నపుడే యేతెంతు నిశ్చింతయై".[1]** వాత్సల్యము 33వ పద్యము

అమ్మా! నీ దర్శనముచే నా హృదయములో ఆవరించిన తమోగుణము తొలగిపోయి జ్ఞానోదయమైనది. నేను ఆశ్రయించిన సద్గురుని దయయో, పూర్వజన్మసంచితమైన పుణ్యవిశేషమో ఏమయిన నేమి నన్ను కాపాడుము అని పలికెను. ఇక్కడ గురువుగాని పుణ్యము గాని ఉపాసకుని ఉపాస్యదేవత కడకు చేర్చుటకు సాధనమని భావము.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 35

ఈ విధముగా స్తోత్రము చేయుచు దేవికి సాష్టాంగ ప్రణామము చేయుచున్న బాలుని తన చేతులతో పట్టుకొని కౌగలించుకొని ముద్దాడెను. తాను చనుబాలీయగా ప్రవాహమై కదలిన కవితాధార ఇప్పుడు ఆ తల్లిని స్తోత్రమును చేయుటచే సఫలమై చైతన్యవంతమైనది.

**"సకల స్థావరజంగమాత్మక ప్రపంచంబెల్ల శక్తిస్వరూ**
**పకమై భాసిలు లోన శక్తి కదలింపన్ బల్కు భక్తుండు, బా**
**లకుడైనన్ సతియైన వృద్ధుడయినన్ లక్ష్యమ్మె ప్రాధాన్య, మిం**
**తకు పూర్వార్జిత పుణ్యలేశమునఁజైతన్య స్థితిన్ గాంచెడిన్."[1]** వాత్సల్యము 36వ పద్యము

చరాచరాత్మకమైన ఈ ప్రపంచమంతయు శక్తిస్వరూపమైనది. లోపల శక్తి కదిలించినచో భక్తుడు పలుకును. పిల్లవాడుగాని పెద్దవాడుగాని స్త్రీ గాని ఎల్లరకు లక్ష్యము ప్రధానము. దీనికంతకు కారణము పూర్వజన్మలో సంపాదించుకున్న పుణ్యము దానిచేతనే ఇట్టి చైతన్యమనెడి జ్ఞానమును పొందుచున్నాడు.

ఈ ఘట్టమును స్పృశించుచు శ్రీ దువ్వూరి వేంకట రమణ శాస్త్రి గారు కల్పలత కావ్య ఉపోద్ఘాతము నందు"వాత్సల్య ఖండమందలి దేవీ స్తన్యము గ్రోలిన బాలుడు కవియేయేమో"[2] అని పల్కిరి.

ఆంధ్రశాఖాధ్యక్షులైన శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారు తమ అభిప్రాయమును వెలిబుచ్చుచు, " వీనిలో 'సందర్శనము' 'వాత్సల్యము' అను శీర్షికలు గల కావ్య ఖండికలను తమ పితృదేవునకును, 'కల్పలత' యను దానిని పితృదేవతలకును కృతి సమర్పణ చేసి ఈ కవి పితౄణమును దీర్చికొని, నేటికాలమునందపురూపమైన యాస్తిక బుద్ధిని ప్రకటించుకొనెను. సందర్శనము నందు యశోద మాతృవాత్సల్యమున శివకేశవుల యన్యోన్యారాధత్వమును, వాత్సల్యము నందుబాలుని మౌగ్ధ్యమును ద్రవిడ శిశువును మహాకవిగా నొనరించిన శ్రీ దేవీ స్తన్యపాన ప్రభావమును రాఘవశర్మగారు రసవంతముగా చిత్రీకరించిరి అని వ్రాసిరి.[3]

'విద్యారత్న' శ్రీ ఆకిలి శ్రీరామశర్మగారు కల్పలతాభినందనములో, "రససిద్ధులగు కవీశ్వరులు సర్వోత్కృష్టులై వెలయుచున్నారని భర్తృహరి పల్కిన పలుకు అక్షరములా పరమసత్యము. కవి తన అనుభూతిని భావుకుల మనస్సున అచ్చు గ్రుద్దినట్లు స్ఫురింపజేయుటకు బ్రయత్నించును. అతడుతన

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 35
2. శ్రీ దువ్వూరి వేంకట రమణశాస్త్రి గారు పీఠిక - కల్పలత పుట : 4
3. శ్రీ ఖండవల్లి లక్ష్మీ రంజనం గారు అభిప్రాయము - కల్పలత పుట : 12

పునఃపరిభావితమగు విషయమును సంపూర్ణముగ నితరుల మనఃఫలకముల ప్రతిబింబితమగునట్లు చేయదగిన శబ్దబ్రహ్మపుటావిష్కరణకై తపించును. తపస్సిద్ధి గల యుపాసకుడందు కృతకృత్యుడగును. రసామ్నాయ మహితుడగునట్టి రచయితయే రససిద్ధుడు. అతడే వాఙ్మయాకాశమున ధ్రువస్థాయి నందుకొన గలవాడు. దీనికనుగుణముగా కలము నడిపిన వాడు మా గురుజాడ రాఘవశర్మ. వీరి కల్పలత నిజమునకు సర్వథా కవితా కల్పలతయే”[1] అని వాకృచ్చిరి.

‘సరసకవి’ - ‘సాహిత్యరత్న’ శ్రీ మోచర్ల రామకృష్ణయ్య గారు తమ అభినందనను తెలియజేయుచు, కల్పలతయందలి ‘సందర్శనము’ ‘వాత్సల్యము’ నా హృదయము నెక్కువగా ఆకర్షించినవి. ఆ రెంటి రచనా సంవిధానము మిక్కిలి హృదయంగమము. బాలకృష్ణునింగూర్చి యాదిభిక్షువు యశోదతో బలికిన పలుకులలో

**“విశ్వమంతట నెక్కటి వెలుగు వెలుగు**
**ముని మనో గహ్వరముల గ్రమ్మిన వెలుంగు**
**నేఁడు నీ యింటి బిడ్డయై నీకుఁగనుల**
**పండువయ్యెను నీవెంత భాగ్యవతివొ!”**

**“తిరిపెమునకేమి! పది యిండ్లు తిరిగితెత్తు**
**నీల మణి వోలె నీయింట డోలనూగు**
**బాలకునిఁ జూచుటయె నాదుపాలికమృత**
**భిక్ష మొసగుము కన్నుల విందు నేఁడు.”**

ఈ రెండు పద్యములు నాడెందమును బందికొన్నవి. “వాత్సల్యము అను ఖండములోని గాథ సౌందర్యలహరి లోని”

**“తవస్తన్యం మన్యే ధరణి ధరకన్యే హృదయతః**
**పయః పారావారం పరివహతి సారస్వతమివ**
**దయావత్యా దత్తం ద్రవిడ శిశురాస్వాద్య తవ య**
**త్కవీనాం ప్రౌఢానా మజని కమనీయః కవయితా.”[2]** సౌందర్యలహరి 75వ శ్లోకము

---

1. ‘విద్యారత్న’ శ్రీ ఆకిలి శ్రీరామ శర్మగారు కల్పలతాభిప్రాయము - కల్పలత పుట : 6
2. శ్రీ శంకరాచార్యకృత సౌందర్యలహరి - 75వ శ్లోకము పుట : 60

అను శ్లోకం పుటర్థమునకు మూదలయై రుచిరమై యొప్పారుచున్నది[1] అని వ్రాసిరి.

ఈ శ్లోకమునకు అర్థమును పరిశీలించినచో, "తల్లీ! నీ చనుబాలనుచూచి నేను నీ హృదయమందలి పాలకడలి పైకి కావ్యనాటకాది రూపమై ప్రవహించుచున్న వాఙ్మయమునుగా నెన్నెదను. కాదేని నీవిచ్చిన చనుబాలను ద్రావి అఱవకుఱ్ఱడు (శ్రీశంకరులు) గడుసరులగు కవుల నడుమ సర్వజగన్మోహకుడైన కవిగా అయ్యెనో కదా!" అని అర్థము.

శ్రీ శర్మగారికి ఆది శంకరులు గురువు. వారు ఆరాధించు వారిలో వీరొకరు. అందువలననే ఆదిశంకర విరచితమైన సౌందర్యలహరి గాథను తమ కల్పలతలో ఆయువు పట్టుచేయటమే గాక దేవీ స్తన్యపానచిత్తయైన తమ మనస్సు మనోహరమైన కవితాకల్పలతను చేకూర్చి తల్లి అనుగ్రహము కలిగి సారస్వతాస్థాన మూర్ధన్యుని జేసినదను భావమును వ్యక్తీకరించిరి.

## 3.4 పోతనామాత్యుడు: -

కవులు సర్వజ్ఞులు, క్రాంత దర్శనులు. నిద్రాణమైయున్న జాతిని మేల్కొల్పి భావ్యభ్యుదయమునకు మార్గమును సూచింపగల సమర్థులు. వారి భావములు నిత్య సత్యములు. సార్వకాలికములు. సార్వజనీనములు. సర్వజనాదరణీయములు. "సత్యం శివం సుందరం" అనునదే కవుల కాదర్శము. "నా నృషిః కురుతే కావ్యం" "కవయః క్రాంతదర్శినః"[2] అని గదా! కావుననే ఋషి కాని వాడు కావ్యము వ్రాయజాలడనునది నిత్య సత్యము. వ్యాసవాల్మీకాది మహర్షులేనాడో గతించినా, వారి అమృత స్వరూపములైన కావ్యములు ఈనాటికి చిరస్థాయిగా నిలచి యుండుటకు కారణము. వారి రచనలు సార్వజనీనములై నిత్య సత్య విలసితములగుటయే.

అద్యతనాంధ్ర కవికుల గురువులగు తిరుపతి వేంకట కవులాంధ్ర దేశములో ముఖ్యముగా మన బృందావనపుర యువకులలో, కవితా పిపాసను రేకెత్తించుచున్ననాడు శ్రీ గురుజాడ రాఘవశర్మగారొక నవయువకుడు. వేంకట శాస్త్రిగారి దర్శనమాత్రముననే కవితలల్లనేర్చి పెద్దల మన్ననలందగల్గిరి. ఇది నేర్చినంత లభ్యమౌ విద్యగాదు. పూర్వజన్మ సంస్కారముండవలెను గదా!

1. 'సాహిత్యరత్న' శ్రీ మోచర్ల రామకృష్ణయ్య గారి అభిప్రాయము - కల్పలత పుట : 5
2. శిరోమణి సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి వివరణ కావ్యాలంకార సంగ్రహము పుట : 89

శ్రీ మదాంధ్ర మహాభాగవత కర్తయగు పోతన ఒకచోట

"పలికెడి ది భాగవతమట
పలికించు విభుండు రామభద్రుండట నేఁ
బలికిన భవహర మగునట
పలికెద వేఱొండు గాథ పలుకగనేలా!"[1] పీఠిక 18వ పద్యము

అని చెబితే వీరు

"పోతన సత్కవిత్వము పోతన యుక్తియు, భక్తి, శక్తియున్
పోతన పాండితీ గరిమ, పూత చరిత్రుని, భూరి సద్గుణ
వ్రాతము లేమి సెప్ప! రఘు రాము ననుగ్రహ పాత్రుడౌ సుఖో
పేతుని, చిచ్చుఖాత్ముని, సువేదుని నామది నెన్నుదున్ సదా".[2] పోతనామాత్యుడు 3వ పద్యము

అని చెప్పుటయే గాక ఈ కల్పలత ఖండకావ్యములో 'పోతనామాత్యుడు' అనే శీర్షిక క్రింద పోతనపై తనకు గల భక్తి భావమును ప్రకటించిరి.దీనికి భాగవతములోని భీష్మస్తవము, ప్రహ్లాదకథ, నరకాసుర వధ, వామన చరిత్ర మున్నగు కథా 'ఘట్టములు' ఈ ఖండికా రచనకు ఆధారములు.

కవిశేఖర శ్రీ గురుజాడ రాఘవశర్మగారు కౌండిన్యస గోత్రులు. ఈయనకు పోతన సగోత్రుడు కావుననే మొదటి పద్యములోనే

"చక్రమ్మునన్ భష్మసమయింప ననుకంప
గుప్పించు, లంఘించు, కులుకు, పలుకు
మందార మకరంద మాధురీ సంప దు
న్మత్త భక్తిని హత్తుమాటతేట
అని మొన నబలచే నరి, హరి, నందంద
నొప్పించు, మెప్పించు, నొప్పుచొప్పు
నడకల, గడుసు పోకడల, నింతింతయై
వ్యాపించు, భావ సంపదల పొందు

1. శ్రీ బమ్మెర పోతనామాత్యుడు - శ్రీ మదాంధ్ర మహాభాగవతము పుట : 3
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 40

**విమల గాంధర్వ నృత్యగీతముల మేళ**

**నమ్ము గావించు వేణు గానంపు సొంపు**

**బ్రహ్మకూకటి ముట్టించు పలుకుఁ జిలుకు**

**పూజ్యతేజో విరాజు, మా పోతరాజు."[1]** పోతనామాత్యుడు 1వ పద్యము

విమలసద్గుణ శాలికి రమ్మహాలికో ద్యోగికి భోగికిసమత యోగికి త్యాగికి, వీతరాగికి సాగిలి మ్రొక్కెదను అంటారు. దీనియందు వీరి కృష్ణ భక్తి వెల్లడియగుచున్నది.

ఈ పోతనామాత్యుడను ఖండికపై అభిప్రాయము వ్రాయుచు శ్రీనిడుదవోలు వేంకట రావుగారు, "శ్రీ శర్మగారు పోతనామాత్యునియందు లీనమై తన కవితా శక్తిచే నాభక్తాగ్రేసరుని "బ్రహ్మ కూకటి ముట్టించు పలుకు జిలుకు, పూజ్యతేజో విరాజు మా పోతరాజును హృదయఫలకములయందు ప్రత్యక్షము చేసియున్నాడు. అనన్య సాధ్యమగు పోతనను నాతని సూక్తులతో ప్రశంసించుట యాతనికి నైవేద్యము, నిత్య సంస్మరణ పూత హృదయభావములతో పోతననుగూర్చి యీ కవి చేసిన రచన యాతని కవిశేఖరత్వమును సార్థకమునొనర్చుచున్నది[2] అని వ్రాసిరి.

ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతం గారు వీరిని గురించి పలుకుచు " పోతన భక్తితో బాటు ఆయనపలుకు బడులు కూడ శర్మకు అబ్బినవి. భక్తితో కవితను సార్థకము చేసికొన్న చరితార్థుడు మా రాఘవశర్మ"[3] అన్నారు.

శ్రీ శర్మగారు పదునాల్గు పదునైదేళ్ళ ప్రాయముననే వెణుతురుమిల్లి సత్యనారాయణ గారికి జంటకవులై అష్టావధాన శతావధానములు చేయవలెననెడి కుతూహలము ఆశయములతో వీరి కవితా తపస్సు ప్రారంభమైనది. వీరికి పోతనామాత్యుడాదర్శ గురువు. భాగవతమే వీరికి ఉత్తేజాన్నిచ్చిన ప్రధాన గ్రంథము అని వీరే స్వయముగా చెప్పుకొనిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత - పుట : 39
2. శ్రీ నిడదవోలు వేంకటరావు గారు పండితాభిప్రాయము - కల్పలత పుట : 14
3. శ్రీ పింగళి లక్ష్మీకాంతం గారు పరిచయము - కల్పలత పుట : 3

"శ్రీకౌండిన్యస గోత్రుడ
శ్రీ కృష్ణ పదారవింద సేవకుఁడ, బుధ
శ్లోకుండు పోతరాజు మ
హాకవి చరణాశ్రయు డనయా రాఘవుడన్"[1]

"భాగవతమె వేద పరమార్ధదము నాకు
భాగవతులె నాకు పరమగురులు
భాగవతపు వేల్పు పరగ నా యిలువేల్పు
భాగవత పదమ్ము పరమ పదము"

అని వీరి సిద్ధాంతము. ఎందరో మహానుభావులు భగవదారాధకులున్నను భాగవతాగ్రగణ్యుండైన పోతన మహాకవి యొక్కడే వీరి తలంపునకు వచ్చుటకు కేవలము గురుభావనయే కారణమై ఉండును. పోతన

"కాటుక కంటినీరు చను గట్టు పయింపబడ నేల నేడ్చెదో
కైటభదైత్య మర్దనుని గాదిలి కోడల యో మదంబ యో
హాటక గర్భురాణి నిను నాకటికిన్ గొనిపోయి యల్ల క
ర్ణాట కిరాట కీచకుల కమ్మ త్రిశుద్ధిగ నమ్ము భారతీ!"[2] శ్రీ మదాంధ్ర మహా భాగవతము

అని శారదాదేవిని ఓదార్చుచున్న పోతన కవిని ఈ కవి ఈ విధముగా ప్రత్యక్షము గావించుకొనెను.

"వెఱవకు తల్లి నీ విడిన భిక్షయె భాగవతమ్ము దీని ము
ష్కరులకు నేదియో కడుపు కక్కురితిన్ బలివెట్ట నింక నా
తురపడకంచు, వాణియెదఁదోగెడి కాటుక కంటినీరు పై
చెఱగుననద్ది, బాసయిడు సిద్ధకవిన్ నినుఁగాంతు పోతనా!"[3] పోతనామాత్యుడు 4వ పద్యము

అట్లే

"ఇమ్మను జేశ్వరాధములకిచ్చి పురంబులు వాహనం బులున్
సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని చొక్కి శరీరము వాసి కాలు చే
సమ్మెట వ్రేటులంబడక సమ్మతితో హరికిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరాజొకడు భాగవతంబు జగద్ధితంబుగన్"[4] మహాభాగవతం పీఠిక 13వ పద్యము

1. శ్రీ దువ్వూరి వేంకట రమణ శాస్త్రి గారి ఆశీః శ్రీ వాసుదేవనామ శతకము పుట : 5
2. శ్రీ బమ్మెర పోతనామాత్యుడు - శ్రీ మదాంధ్ర మహాభాగవతము పుట : 24
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 40
4. శ్రీ బమ్మెర పోతనామాత్యుడు - శ్రీ మదాంధ్ర మహాభాగవతము పుట : 3

అని పోతన చెప్పిన పద్యము నాధారముగా చేసికొని

"నరపతులిచ్చు మన్నన జనమ్ములొసంగు యశోధనమ్ము లా
భరణమ్ములున్ బురమ్ములును వాహనముల్ కనకమ్ము దివ్య సుం
దర తరలాక్షులున్ మదికి నచ్చవు, మెచ్చవు, భక్తి మోక్ష వి
స్ఫురణము దక్క యొండు సుఖమున్ మదిఁగోరవు తృప్తిఁబోతనా"[1]

పోతనామాత్యుడు 5వ పద్యము

"బాల రసాలసాల నవపల్లవ కోమల కావ్యకన్యకన్"

అని వ్రాస్తే అదే ఒరవడిలో వీరును,

"బాలరసాల సాల నవ పల్లవ కోమల కావ్య కన్య నీ
జాలక, యే నృపాలునకు సద్గతి గల్గగ రామ చంద్ర భూ
పాలున కార్తరక్షణ కృపా పరిపాలునకిచ్చి, మోక్షల
క్ష్మీ లలనన్ వశీకృతగ జేసికొనన్ జనియించితే! కవీ!"[2] పోతనామాత్యుడు 6వ పద్యము

శ్రీ మదాంధ్ర మహా భాగవతములో పోతన

"భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు
శూలికైన దమ్మి చూలికైన
విబుధ జనులవలన విన్నంతగన్నంత
దెలియవచ్చినంత తేట పఱతు"[3] కృతిపతి నిర్ణయము 19వ పద్యము

ఇదే భావాన్ని ఆవిష్కరించుచు శ్రీ శర్మగారు

"పలుకుట చిత్రమౌఁదెలిసి భాగవతోపనిషద్ రహస్యముల్
సులువుగఁ దమ్మి చూలికిని శూలికినైన బుధాళి పల్కులన్
దెలియగ వచ్చినంత కననేరిచి జీర్ణముగొన్న యంత యాం
ధ్రుల కొక భిక్ష ( బెట్టిన నినున్ దెలియన్ వశమయ్యె! పోతనా!"[4]

పోతనామాత్యుడు 7వ పద్యము

అని చెప్పిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 40
2. పైదే
3. శ్రీ బమ్మెర పోతనామాత్యుడు - శ్రీ మదాంధ్ర మహాభాగవతము పుట : 3
4. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 41

శ్రీ శర్మగారి కల్పలత కావ్య ఖండికకు తమభిప్రాయమును వెలిబుచ్చుచు శ్రీ ఆకిలి శ్రీరామ శర్మగారు, "పోతన పలుకుబళ్ళనే పుణికి పుచ్చుకొని పద్యములల్లుట ప్రౌఢికి పరాకాష్ఠ. అట్టి రచన యందాతని పద సంస్మరణము చేయుటలోని విశేషము. పోతన పద సంపద కన్న మిన్నయగు పద సంపద సమకూర్చుకొనుట ఎట్టి వానికిని దుర్ఘటమను ప్రహ్వాభావము గూడ సూచించుటకే ... ... ... ... ... ... జయన్తితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః" అని పలికిరి.

ఈ సందర్భములోనే వీరు ఓ కవిశేఖరా!

**"ధన్యంబైనది ధన్యమైన దహహో! ధన్యంబు నీ జీవితం**
**బన్యాలోచనలేల పూర్వకృత పుణ్యంబిట్లుగా పండె, సా**
**జన్యాన్వీత! త్వదీయ కల్పలతచే సారస్వతాస్థాన మూ**
**ర్ధన్యత్వంబును చూఱగొంటివి రసార్ద్రస్వాంతు లగ్గింపగాన్."**

**"కలిగెన్ లోతగు భావసంపదయు, బల్కన్ నేర్పు, నెన్నేసి జ**
**న్మల పున్నెమ్ము ఫలోన్ముఖంబయి సుధా మాధుర్య చైతన్య ధా**
**రలు స్వాదందరస ప్రవాహమయి జాఱన్ సర్వ విద్వద్విని**
**ర్మల హృత్పద్మములెల్ల విచ్చి విరివారన్ బల్కితో సత్కవీ!"[1]**

అను పద్య రాజములతో ప్రశంసించిరి.

శ్రీ శర్మగారు పోతన పదసంపదను భావసంపదనే గాక పోతన కవికిని, భాగవత కథానాయకుడగు కృష్ణునితో గల తాదాత్మ్యభావమును జీర్ణింపజేసికొన్నవారు. కల్పలతలో ఈ ఖండికలో,

**"చిన్నతనంపు నంద సుతు చేష్టలె నెమ్మనమందు నాటెనో**
**యన్నిటికేమి? యా చలిది యన్నముఁబచ్చడి యూరగాయలున్**
**వెన్నలు మెక్కుచున్ జలువ వెన్నెలఁదిమ్మరె దీవుఁపిన్నలన్**
**చిన్నవు నీవు, పెద్దలనుఁబెద్దవు, తత్త్వము, దెల్పఁబోతనా!"[2]** పోతనామాత్యుడు

కృష్ణుని బాల్య చేష్టలు మనస్సులో నాటుకొనిపోయినవి. వాటన్నింటికంటె చలిదియన్నము, ఊరగాయలును వెన్నను తినుచు చల్లని వెన్నెలలో తిరిగెదవు. తత్త్వమును దెలుపుటలో నీవు చిన్నవారిలో

1. 'విద్యారత్న' శ్రీ ఆకిలి శ్రీరామశర్మగారు - పండితాభిప్రాయము కల్పలత పుట : 7
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 42

చిన్నవాడవు. పెద్దవారిలో పెద్దవాడవు. అని చెప్పిరి. బాలకృష్ణుని బాల్య స్వరూపమును తెలుపుటలో ఎంత చాకచక్యము కలదో పరమాత్మతత్త్వమును తెలుపుటలో నీవు గొప్ప అద్వైతివి సుమా! అని తరువాత పద్యములో ఆవిష్కరించినారు.

**"తనయందున్ నిఖిల ప్రపంచమున, సత్యంబౌ పరబ్రహ్మమున్**
**గని, యానందముచే, నొడల్ మఱచి, పల్కన్ లేని, పాల్గారువా**
**నిని, దండించెడి గట్టి గుండె గల,తండ్రిన్, బల్కెదే! మారువ**
**ల్కని, యద్వైతి విధాన, నీవునొక ప్రహ్లాదుండవే! పోతనా!"**[1] పోతనామాత్యుడు

ప్రహ్లాదుడు పరమాత్మ దర్శనమైన అద్వైతి. "నీవునొక ప్రహ్లాదుండవే" అని యనుటచే పోతనయు పరమాత్మ దర్శనమందిన అద్వైతి యని వీరి అభిప్రాయమై ఉండును.

పోతన విరచిత శ్రీ మదాంధ్ర మహా భాగవతములోని గజేంద్రమోక్షము ఘట్టమును చదువని వారు ఆనందాబ్ధిలో ఓలలాడని వారుండరు. వీరుభక్త్యావేశులై,

**"అలవైకుంఠ పురంబునన్ గలుగు సౌధాంతర్మహాభాగముల్**
**కలయం ద్రిమ్మఱి, యున్కి కన్పడక బల్కన్ లేక యున్నంత, స**
**వ్వల, పర్యంక రమా వినోది, యగు రూపం, బక్షరాకారమై**
**తెలుపన్ దెల్గున రూపు దాల్చినటులెంతే పల్కితే పోతనా".**[2] పోతనామాత్యుడు

అని పలికిరి.

పోతన విరచిత భాగవతము సర్వకాల సర్వావస్థలయందు నిలిచి ఉండునని, అది నిలిచియున్నంత కాలము పోతనయు, పోతనచే వ్రాయబడిన పద్యములు నిలిచి యుండునని చిన్నవారు, పెద్దవారును ప్రతి దినము దైవప్రార్థనా పద్యముల సందర్భములో "ఎవ్వనిచే జనించు" ఇత్యాది పద్యములను తలంచుదురని, తత్పూర్వకముగా పోతన నిత్యము స్మరింపబడు వాడని పల్కిరి.

**"భ్రాంతి తొలంగఁగర్మ విసరమ్మును గ్రక్కున నుక్కడంప నిం**
**తింత యనంగరాని గ్రహియింపఁగ రాని ప్రధాన తత్త్వమే**
**యంతటఁదేట తెన్గున ముదావహమై గ్రహియింపఁబల్కు, నీ**
**వింతటి వాడవంచు వచియింపగ, నెవ్వడు చాలు!పోతనా!"**[3] పోతనామాత్యుడు

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 42
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 45
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 46

భ్రాంతి తొలగిపోయి కర్మసమూహమును నశింపజేయునట్లుగా గ్రహించటానికి శక్యము కానిది, గొప్పది, ప్రధానమైనది. సంతోషకరమైన తత్త్వవిషయమును తేట తెనుగులో స్పష్టముగా అర్థమగునట్లు చెప్పెడి నీవు ఇంతటి వాడివని చెప్పుట ఎవరికి సాధ్యము." పోతన శక్తి యుక్తులు విని ఆనందించి తరించవలసినదే గాని ఇంత శక్తియుక్తులు గలవాడని చెప్పటం ఎవరివల్ల సాధ్యంకాదు. ఇంత అంత అని వర్ణింప శక్యము గాదనుట. అంత గొప్పమేధాసంపత్తి, భావ సంపత్తి, భక్తి సంపత్తి గలవాడని చెప్పుట పోతనకు పోతనయే సాటి అని వీరి అభిప్రాయము.

**"ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీ యుర్విం బురాణావళుల్**
**తెనుగుం జేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టి దో**
**తెనుగుం జేయరు" మున్ను భాగవతమున్ దీనిందెనింగించి నా**
**జననంబున్ సఫలంబుఁజేసెదఁబునర్జన్మంబు లేకుండగన్."[1]**

పీఠిక కృతిపతి నిర్ణయము 21వ పద్యము

**"లలిత స్కంధము గృష్ణ మూలము శుకాలాపాభిరామంబు మం**
**జులతా శోభితమున్ సువర్ణ సుమనస్సు జ్ఞేయమున్ సుందరో**
**జ్జ్వల వృత్తంబు మహాఫలంబు విమల వ్యాసాల వాలంబు నై**
**వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వుర్విన్ సద్ద్విజశ్రేయమై."[2]**

పీఠిక కృతిపతి నిర్ణయము 22వ పద్యము

అని చెబితే అదే భావముతో

**"లలితంబై రసవంతమై సహృదయాహ్లాదప్రదంబై విరా**
**జిలు నీ కావ్య పుట ప్రదీపిక గదా శ్రీ కృష్ణ లీలా చరి**
**త్రలు కృష్ణాహ్వయ దివ్య తారక పరబ్రహ్మమ్ము నీ యింటిలో**
**పల స్వేచ్ఛన్ విహరించి పల్కుట మహాభాగ్యంబహెూ! పోతనా!"[3]**

పోతనామాత్యుడు 29వ పద్యము

---

1. శ్రీ మదాంధ్ర మహా భాగవతము పీఠిక కృతిపతి నిర్ణయము 21, 22 పద్యాలు పుట 4
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 46

పోతనా! నీ కావ్యమగు భాగవతము సహృదయాహ్లాదప్రదమైనది. ఈ కావ్యమందలి ప్రతి పుట శ్రీ కృష్ణలీలలును, చరిత్రలును, శ్రీ కృష్ణ తారక మంత్రమును పరబ్రహ్మమై నీ యింటిలో స్వేచ్ఛగా విహరించినవి. కావుననే పలుక గలిగినావని అట్లు పలుక గలుగుట మహాభాగ్యమని చెప్పిరి. ఇది పోతన పరముగా.

ఇక వీరి పరముగా చెప్పాలంటే శ్రీ శర్మగారు నిరంతర నిర్వ్యాజ శ్రీ కృష్ణోపాసకులు. ఎందరో మహనీయుల పాదపంకజసేవా మహాభాగ్యము నంద గల్గిన అదృష్టవంతులు. తృప్తియే వీరికి గల మహా భాగ్యము. భక్తియే వీరి నిత్య భుక్తి. కావుననే శ్రీకృష్ణుని దర్శన భాగమునంది వీరి గృహములో కృష్ణుడు విహరించినాడు గనుకనే ఇట్టి కల్పలత మహాకావ్యము వెలువడెను. కల్పలత కావ్యమునకు పరిచయమును వ్రాస్తూ, "ఇతడు పరమ పవిత్రుడైన జీవి. నిరంతర పారమార్థిక చింతన జీవ యాత్రను సాగించు నిత్య సంతుష్టి. భక్త్యావేశపూరిత హృదయుడు. హృదయము భావ భరితమైనపుడు ముక్త కంఠముతో పద్యగానము చేయుచు తన్ను తానే మరచు భక్తిలోలుడు. మరియు నీతని భక్తి విస్తృతవ్యాప్తిగలది. పూజ్యత గల విషయములన్నియు నితనికి ఆరాధనీయములే. అందుచేతనే యితడు ఒక భగవద్భక్తుడే గాక గురుభక్తుడు, దేశ భక్తుడు, గాంధి భక్తుడు, పితృభక్తుడు, మాతృభక్తుడు, గోత్ర భక్తుడుగా నెగడి భక్తిమయ జీవియై కాలము గడుపుచున్నాడు. ఇట్టి వానికి పుణ్యవశమున కవితా విద్య గూడ లభించినది గనుక అర్చనీయులైన వారినెల్ల పద్యములతో నర్చించి తన కవిత్వమునకు సార్థకతను, తన జన్మకు సఫలతను ఆర్జించుకొనుచున్నాడు. విశేషించి యితనికి కృష్ణభక్తిమెండు. దానినిబట్టియే పోతన కవీశ్వరుని యందును అసాధారణ భక్తి కలవాడయ్యెను. "పోతనామాత్యుడనునది ఆ భక్త కవి చక్రవర్తికి ఇతడు సమర్పించిన ఉపహారము. పోతన నుండి తాను గ్రహించిన శబ్దభిక్షనే నూత్నరుచిరాహారముగా పచనము చేసి భాగవత కర్తకు నివేదించుటలో ఇతడు చూపిన పద్యశిల్ప నైపుణి ప్రశంసాపాత్రముగా నున్నది.[1] అని వ్రాసిరి.

దీనిని బట్టి వీరు ఎంతటి శ్రీకృష్ణోపాసకులో పోతనయందు వీరికి ఎంతటి గౌరవ భక్తిభావములున్నవో స్పష్టమగుచున్నవి.

1. శ్రీ పింగళి లక్ష్మీకాంతం గారి పరిచయము - కల్పలత పుట : 3

## 3.5 గోపికా హృదయము: -

శ్రీ శర్మగారు స్వయముగా శ్రీకృష్ణోపాసకులు. కావున తాను కూడ ఒక గోపికయై తాదాత్మ్యము జెంది శ్రీకృష్ణుని యందలి అనన్యభక్తిని వెలయించిన ఘట్టము గోపికా హృదయము. గోపిక తన హృదయము వలన శ్రీ కృష్ణుని ధ్యానించుచు తానతనితో అద్వైత భావము (ఐక్యము) నొందగోరి యిట్లనుచుండును. కావుననే ప్రతి పద్యమునను భక్తియు అద్వైత స్థితియు గోచరించును.

ఓకృష్ణా! చెయ్యి విదిలించుకొని చివాలున లేచి ఎక్కడికో వెళ్ళి పోయెదవేమి? నా పయిని౯క కోపమా? నిలిచి మాట్లాడు. నా హృదయ పద్మము నుండి నిర్భయముగా దాటిపోగలవా? నా పై నీ బల పౌరుషములు ప్రకటితములగునట్లు చేయుము. అని చెప్పుటలో శ్రీకృష్ణునితో పోట్లాడియైనను గోపిక వానిని తన హృదయమునందే నిలుపుకొనుటకు ప్రయత్నించుచున్నది.

**"ప్రియుల మనః ప్రవృత్తుల నెఱింగియు, సైపగలేవటోయి!నీ**
**కయి తొలి జన్మలెన్ని యిటు వ్యర్థము లాయె గదయ్య! యింక నే**
**మయినదొ ఆయెఁజేరితివి, హాయిగ సౌఖ్యము లొందరాదె, ని**
**ర్భయముగ దాచి యుంతు సుకరంబుగ ఱెప్పల తల్పుమూసియున్."[1]**

గోపికా హృదయము 2వ పద్యము

ప్రియులు తమ ప్రియురాండ్ర యెడ ఎట్టి సహనభావముతో మెలగుదురో వారి మనఃప్రవృత్తి తెలిసినవాడవయ్యును వారు ఏదైన తప్పుచేసినచో క్షమింపలేవా? నీ కొఱకుగాను గడచిన ఎన్నో జన్మములను ఈ విధముగా వ్యర్థము గావించుకొంటిని. ఇంక అయిపోయినదేదో అయిపోయినది. దగ్గఱకు వచ్చిన నీవు హాయిగా సుఖింపవచ్చునుగదా! ఱెప్పలనెడి తలుపులను మూసి నిన్ను నిర్భయముగ దాచియుంచెదను అని అనుట ధ్యానించి అద్వైత భావన నందెదను. అని అర్థము. "నీకయి తొలి జన్మలెన్ని యిటువ్యర్థములాయె గదయ్య!"అనుటలో మునులు ఎన్నో జన్మములెత్తి వ్యర్థములు కాగా తుదకు అద్వైత సిద్ధికై గోపికలుగా జన్మించిరను పూర్వగాథ ద్యోతకమగుచున్నది.

ఈ పద్యము నందు ఉపాసకోపాస్యులకు ప్రేయసీ ప్రియ సంబంధము వ్యక్తమగుచున్నది. ఈ సంబంధమె అద్వైత స్థితికి సులభమైనది. కావుననే లౌకికమగు నాయికానాయకుల విషయము, అలౌకికమైన అద్వైత భావమును పొందుగోరు యోగి విషయమును వ్యక్తములగుచున్నవి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 49

**"దయగలవాడవంట, ధనధాన్యములేవియుఁ గోరవంట భ**
**క్తియ నినుఁ గట్టునంట, యిల దీనుల పాలిటి భాగ్యమంట, సం**
**శయము లడంతువంట, మనసా నెఱనమ్మిన వీడవంట, యే**
**మయ! గుణమేమి లేని యటులక్కట, మాటికి మచ్చుఁ జల్లెదే!"[1]** గోపికా హృదయము 4వ పద్యము

నీవు దయగలవాడవని అంటారు. ధనధాన్యములు ఏవి కోరవంటారు. భక్తియె నిన్ను బంధింపగలదందురు. భూలోకములో నీవు దీనుల పాలిటి భాగ్యదేవతవందురు. సంశయములను పోగొట్టెదవందురు. నిన్ను మనసార నమ్మినచో విడిచి పెట్టవందురు. ఏమయ్యా! ఇన్ని సద్గుణములుండియు ఏ సద్గుణములు లేని వాడివలె మాటిమాటికి మాయచేసెదవేమి? ఇక్కడ మాయ అనగా చిత్తవిక్షేపము. ఈ చిత్తచాంచల్యము కలుగుటకు కారణము భగవంతుడు మాయకప్పుటయే కారణము.

ఆ గోపిక ఇంకను ఇట్లనుచున్నది. నేను పైకి మాట్లాడు మాటలు గావు. ఇదంతయు సత్యము.నేను చెప్పుకొనుట న్యాయము గాదు. ఉన్నట్లుండి క్షణక్షణము అట్లు పోవనేల? నిత్యము నా హృదయమున నివశించువాడవే గదా! నా హృదయభావము నీకు తెలియదా? ఇట్లనుట వలన చిత్త విక్షేపము కలుగుచున్నది.అని అది కలుగుట వలన ధ్యానమునకు విఘ్నములు కలుగునని తద్వారా అద్వైత స్థితి నొందుటకు ఆటంకము కలుగునని అర్థము.

**"నయమొ! ప్రియమ్మొ! యింక విడనాడకు, నా హృదయాంతరాళని**
**శ్చయమిదె, నిన్నెగా కితరసంగతి నొల్ల, మదీయ జీవితా**
**శయమది నీవ, నీ కొఱకె, సర్వసమర్పణ, జేసితిన్ దయా**
**మయ! యిక లోనికిన్ మఱలుమా! చలియింపకయేకమైసదా!"[2]** గోపికా హృదయము 5వ పద్యము

గోపిక, తన్ను నమ్ముకొన్న వారిని విడువకుండుట నీతి. తనను ప్రేమించువారిని ప్రేమించుట ప్రీతికరమైన విషయము. కావున నీవు నీతిని బట్టి గాని ప్రేమను బట్టిగాని నన్ను విడిచి పెట్టకుము. నీ సాంగత్యమునభిలషించు దానను గాని మరి యొండు కాదు. సర్వము నీకే సమర్పణ చేసితిని. ఓ దయామయ! లోనికి వచ్చి శాశ్వతముగా నిశ్చలముగా నాతో ఐక్యమందుము. అని వేడుకొని ఇక లాభములేదని తలచి నిందించుట ప్రారంభించినది.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 49
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 50

వినియు విననట్టి నీకు విన్పింపగలవారు లేరు. నీవు చూచియు చూడనట్లుంటివి. నీకు చూపింపగలవారు లేరు. నేను మాట్లాడు మాటలను గ్రహించియు గ్రహింపనట్లున్న నిన్ను మాట్లాడించగలవారు లేరు. ఏమన్నను ప్రయోజనమున్నదా? నీకు గుణమా! అభిమానమా! సంప్రదాయమా! ఇది విపరీతము విచిత్రమును కూడ. ఎందువలననగా భగవత్స్వరూపమును చిన్న చిన్న వాక్యములతో చెప్పుచు అనగా భగవద్రూపము ఇది కాదు, ఇది కాదు అనుచు ప్రపంచములోని అన్ని వస్తువులను త్రోసివేయగా మిగిలినట్టి 'నేను' ఒక్కడను అద్వితీయుడను అని చెప్పుకొనుచున్నట్టి నీవు మాటిమాటికి నా వెంటనే తిరుగుచు మనస్సును సంతోష పెట్టుచున్నప్పుడు ఆ మనస్సు నుండి ఎట్లు పోగలవు? నేను నిన్ను వరియించిన దానికి ఇది సత్ఫలితమా?

అని గోపిక పలుకుటలో భగవతత్త్వమును పూర్తిగా తెలిసికొని ధ్యానించి, అద్వైత భావమునొంది ఆనందించుచున్న నా హృదయమిప్పుడు భగవంతునికి దూరమగుచున్నదేమి? ధ్యానించిన ధ్యానమునకిది యా ఫలము? అని అలౌకికార్థము.

అందరిని విడిచి పెట్టి నిన్నే సేవింపగా నీవు కూడ మనస్సును కొంత సంతోషపెట్టి ఇప్పుడీవిధముగా విడిచి వెళ్ళిపోవుట భావ్యము కాదు. మన ప్రేమకిది ఫలమునుగాదు అని ఒక ప్రేయసి తన ప్రియునితో అనెడి అర్థము. ఇది లౌకికార్థములో చెప్పుకోవచ్చును.

**"గోకుల సార్వభౌమ! యనఁ గూడదుగా నిను లేశమైన నీ**
**పోకడలన్నియున్ విరియఁ బోసిన వెన్నెలలట్లు, లోకముల్**
**వాకొనఁ జేకొనన్ గలుగు, భాగ్యము నాయదెయన్న, నింతలో**
**నాకనుఁ బ్రామి, పోఁదలచినన్ జననిత్తునె! మేలుకొంటిగా!"[1]** గోపికా హృదయము 8వ పద్యము

గోకులమునకు సార్వభౌముడవైన ఓ కృష్ణా! మరియు గోపికలందఱికును పతివైన ఓ కృష్ణా! నీవు చక్రవర్తివి గావున ఏమియు అనరాదు. మఱియు నేను పతివ్రతను గావున భర్తవగు నీవు ఎట్టి పనులు చేసినను నిన్ను ఏమియు అనరాదు. నీ ప్రవర్తనలన్నియూ విరియబోసిన వెన్నెల వలె లోకము చెప్పుకొనుచున్నది. "భాగ్యము నా యదె" అని అనుకొనగానే ఇంతలోనే నన్ను మాయజేసి పోదలచిన నిన్ను నేను పోనిత్తునా? మేలుకొనియుంటిని గదా! అని పలుకుటలో ఇక్కడ నిద్రించుట మాయ, అజ్ఞానము.

1,. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 50

మేలుకొంటిని అని పలుకుట జ్ఞానమునొందితిని అని అర్థము. మాయ అజ్ఞానమునంటుకొని యుండునుగాని, జ్ఞానము నంటుకొని యుండదు. కావున నీ మాయలు నన్ను అంటజాలవు సుమా! అని హెచ్చరిక చేయుచున్నది.

అంతేకాదు శ్రీ శర్మగారు ఆ గోపికచేత చక్కని ఉపమాలంకారములో ఈ మాయకు ఉదాహరణలతో తమ భావమును విప్పిచెప్పిరి. ఓ మాయిక ప్రభూ! చేతిలోనున్న వెన్న తనకే తెలియకుండా కరిగిపోయినట్లును, దిట్టమైన ఏనుగు వెలగపండును మ్రింగి అందలి గుజ్జు ఏ కొంచెము మిగులనీయకుండా పడవేసినట్లును నాకు తెలియకుండా పారిపోవుట ఎందులకు? నీవుచేసే ఈ ప్రయత్నమును నేను సహింపజాలను అని చెప్పుచున్నది. ఇక్కడ గట్టిగనున్న వెన్న ద్రవమగుట, వెలగకాయ లోపలి గుజ్జు మాయమై వెలగకాయ మాదిరిగానే ఉండుట మాయకు ఉదాహరణలు.

ఇక్కడ వీరు తెలియకుండా జారిపోవుటను కరగిపోయిన వెన్నతోనూ, ఏనుగు మ్రింగి పడవేసిన వెలగపండుతోనూ పోల్చిచెప్పుటచేత ఉపమాలంకారమయ్యెను.

**"నీకున్ నాకును భేదమింత కలదే! నీలోన నేనుంటి నీ**
**వో కన్పట్టకయుంటి, నాహృదయ విద్యుద్గహ్వారంబందు నేఁ**
**బ్రాకారావృత దేవళంబ, నడుమన్ భాసిల్లు దైవంబ, వీ**
**వేకారత కాదనన్ గలుగువాఁడేయున్న భాషింపుమా॥"**[1] గోపికా హృదయము 10వ పద్యము

నీకును నాకును భేదము కొంచమైనలేదు. నీవు సర్వ వ్యాపివి అనిచెప్పుట నీలో నేను ఉంటిని. నా హృదయ గుహ విద్యుద్దీపముల కాంతులతో కూడియున్నది గాన అందు నీవు కనబడకుండా ఉంటివి. ఇక నేనంటావా! నా శరీరము ప్రాకారములు గల మందిరము అనగా దేవాలయము. దీని గర్భాలయములో ప్రకాశించు దేవుడవు నీవు. నీవు ఏకాకారుడవు కావని చెప్పగలవారెవ్వరు? నీలో నేనున్నాను. నాలో నీవున్నావు. మన ఇరువురకు భేదములేదు అని చెప్పుట. ఇది అద్వైతము. జీవాత్మ వేరు, పరమాత్మ వేరు కాదు. జీవాత్మ పరమాత్మ ఒక్కటే అని చెప్పుట. "దేవో దేవాలయ ప్రోక్తః జీవో దేవస్సనాతనః" అనే భావాన్ని దీనిలో నిక్షిప్తంచేసిరి.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 51

**“నీవున్ నేనను భేదముండువరకింతే! నీవు నీవౌదు,నే**
**నో వేఱైతిని గాన,నేనయితి, నయ్యో! నీవునేనేకమై**
**యే వైరుధ్యము లేక తొంటివలె, హాయిన్ వే మహానందమం**
**దే వర్తించెడి భాగ్యమింకఁగలదోయీ ! చెప్పు మీ జన్మలో॥”[1]** గోపికా హృదయము 11వ పద్యము

నీవును, నేనును అను భేదమున్నంత వరకు అనగా చిత్త విక్షేపము వలన జీవుడు వేరు, పరమాత్మవేరను భావనతో పరితపించినంత కాలము అంతా ఇంతే! ఆ స్థితిలో నీవు నీవే నేను నేనే. అనగా జీవుడు జీవుడే. పరమాత్మ పరమాత్మయే. ఇక్కడ వీరివురకు భేదము గలదు గాన అద్వైతముగాదు. ఎటువంటి విరుద్ధ భావము లేకుండా సృష్టికి పూర్వమువలె నీవును నేనును ఒకటియై మహానందముగా నుండెడి అదృష్టము ఈ జన్మలో కలుగునో కలుగదో చెప్పుము.

ప్రేయసీ ప్రియుల నడుమ పొరపొచ్చములుండరాదు. అవి ఉన్నంత కాలము ఎవరికివారే అయిపోవుదురు. అట్లుగాక ఏ విరుద్ధ భావము లేకుండా అభేదభావముతో హాయిగా నుండి మహానందమును పొందు అదృష్టము ఈ జన్మలో నున్నదో లేదో చెప్పుమని ప్రేయసియగు గోపిక తన ప్రియుడగు శ్రీకృష్ణుని అడుగుచున్నది. ఇది లౌకికార్థము. లౌకికార్థములోను, అలౌకికార్థములోను కూడ అభేదభావమె ఆనందమునకు మూలము.

**“ఈ వేదాంతము ఁజెప్పి ,చెప్పి మఱి నీవే యాశ్రయంబంచు సం**
**భావింపందగు, వస్తువీవనుచు లోపం బెంచరాదందు, నే**
**వేవో! ధర్మములన్ని మా కొఱకే మ్రోయించెన్ గదా! లోకమా**
**హా! విజ్ఞాన మికిట్టులుండవలదా! యాత్మీయమౌ వస్తులన్.”[2]** గోపికా హృదయము 12వ పద్యము

ఈ ఉపనిషదర్థమును చెప్పి, భర్తయె, భార్యకు ఆశ్రయము గారవింపదగినవాడు. ఆతని లోపములెంచరాదు అనుచు ఏవేవో ధర్మాలను లోకము స్త్రీల కొఱకు నూరిపోసినది. ఆహా! భార్యలు భర్తలయెడ మెలగినట్లే, భర్తలు గూడ ఆత్మీయులైన యాడువారి పట్ల మెలగవలయునను జ్ఞానము భర్తలకు ఉండవలయును గదా! అని లౌకికార్థము.

లోకములోని ప్రాజ్ఞులు మా వంటి భక్తుల కొఱకు ఉపనిషదర్థమును చెప్పి, చెప్పి జీవునికి పరమాత్మయె ఆధారము. భావింపదగిన వస్తువు. ఆతడు కంటికి కనబడుటలేదను లోపమునెంచరాదు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 51
2. పైదే

అనగా ఆ పరమాత్మ లేడను నాస్తిక వాదము పనికిరాదు. పరమాత్మ అంతట నున్నాడను వేదాంతార్థమును చెప్పుచుందురు. పరమాత్మ జీవునకు ఆత్మీయుడు. జీవుడు పరమాత్మకు ఆత్మీయుడు. కావున జీవునకు పరమాత్మజ్ఞానముండ వలసిన ఆవశ్యకతగలదు. అనగా ఆధ్యాత్మిక విషయమైన విజ్ఞానము ఈ విధంగా ఉండవలెనని అలౌకికార్థము.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు

> **"అనన్యాశ్చింతయంతో మాం యే జనాఃపర్యుపాసతే**
> **తేషాం నిత్యాభి యుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్"[1]** నవమోధ్యాయః 22వ శ్లో॥

అని చెప్పినట్లుగా దైవభక్తితోను, అద్వైత భావము నొందు నిశ్చయ జ్ఞానము తోను రాగద్వేషములు లేకుండా తమకుల ధర్మములను నీకు ఎవరు అర్పించుదురో వాని యోగక్షేమములు సర్వము నీవే చూతువను గీతావాక్యములు సత్యములె మా యోగము ఇట్టిదా? నీలోనే సంయోగము పొందవలెను గనుక ఆ విషయమును నీవే తెలియజేయవలయును.

నిశ్చలమైన బుద్ధిని పరమాత్మయందే నిలిపి ఆత్మతో క్రీడించు స్వభావము గలవాడు ధన్యుడు అని అందరు అందురు. ఈ వేదాంతార్థము నాకు తెలియనిది గాదు. ఇప్పటి నా స్థితి తెలిసినవారు యోగులు కాని, జోగులు కాని ఇట్లా చెప్పరు. ఆర్తత్రాణపారీణ! కోరిన వారికి నీవు అభయమునీయవా! "నాకు నీవుఁగావగతి, గాకెవ్వారి కన్‌రక్షకుల్' అని హృన్నీరేజ భద్రాసనా! నీ వాత్సల్యమును ఎచ్చట దాచి యుంచితివి? నీవు

> **"తెలియంజాలని దొడ్డవాడవట! యేదో!"నేను" లేకెట్లు నిన్**
> **బలుకం జాలు జగమ్ము, నిల్వనొక కొంపా! గోడియా! నీకు, నా**
> **వలనన్ గా ప్రకటీకృతంబయితి, విశ్వంబెల్ల పేరొంది, నీ**
> **కిలనాధారమునేన, నాకు మఱి నీవే! యెవ్వరేమనన్".[2]** గోపికా హృదయము 17వ పద్యము

ఇక్కడ తెలియంజాలని దొడ్డవాడనుటలో అర్థము అవాఙ్మానసగోచరుడని అర్థము. "నేను" అనునది లేనిచో అనగా జీవుడు లేనిచో నీవు అనగా పరమాత్మ ఉండడు. జీవుడు లేకుండా అంతటా

1. శ్రీ మద్భగవద్గీత నవమోధ్యాయః - రాజవిద్యా రాజగుహ్య యోగః - 22వ శ్లోకము
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 53

పరమాత్మయేయున్నచో వర్ణించువాడుండడు. వర్ణింపబడువాడుండడు. నా వలననే నీకు నివాస స్థలము లభించినది. ఇట్లు చెప్పుటలో పరమాత్మ జీవుని హృదయగుహలో నివసించునని చెప్పుట నా మూలముననే గదా నీవు ప్రకటింపబడితివి. జీవుడు సృష్టింపబడుటచేత ధ్యానించువాడు, ధ్యానింపదగినవాడగుచున్నాడు. నీకు ఆధారము నేను. నాకాధారము నీవు. ఈ విషయము సర్వులకు విదితమే.

**"నా యత్నంబది లేనెలేదుగద! లోనంజేరిప్రేరేచి, యే**
**వో! యాడించిన యాటలాడితినె, యేవో పల్కితిన్ విప్పగా**
**నీ యత్నంబది, సాకు, జుట్టగఁ బ్రయత్నింతే! హరీ! నన్నిటుల్**
**త్రోయంబూనకు, త్రోసిరాజనకు, నిర్దోషింజుమీ సాక్షిగా"[1]** గోపికా హృదయము 18వ పద్యము

దేనికిని నా ప్రయత్నము లేనేలేదు. నీవు నా లోపల జేరి నన్ను ప్రేరేపించి ఏవో ఆడించెదవు. నేను ఆడెదను. నీవు చెప్పెదవు. నేను అనెదను. ఇది నీవు ఆడించు మర నీవెట్లా ఆడిస్తే అట్లా ఆడునది. కావున నీవు చేసియు నేను చేసినట్లు సాకు చెప్పబూనకుము. త్రోసిరాజనకు. నేను దోషరహితను. ఇట్లనుటకు సాక్ష్యముగలదు. (అది హరి యేనేమో!) అది నీవు నా హృదయమందుడుటయే.

చాలు చాలు ఇంక ఆ ఆశలు కట్టి పెట్టుము. నామాటలు త్వరగా వినుము. యోగ్యతను నిలబెట్టుము. నా లోటు ఏమైనా ఉన్నచో నీవే సరిదిద్దవలయును. నాలోపలనె నీవు ఉన్నావుగదా! ఇంకా సందేహమెందులకు? నిన్ను ఒక్క అడుగు కూడా కదలనివ్వను.

**"నాహృదయంబెఱుంగు, నిజనాథుఁడెవండిక నీవుగాక, సం**
**దేహము, లో గలంచి, యెటుఁ ద్రిప్ప, నటుల్ సుడివారి నిల్చితిన్**
**దేహ మశాశ్వతం బదియు దీఱినచోఁ దఱియించుటెట్లు! దా**
**సోహమటంచు "సోహ" మనుచున్ రమియించెద నేకమై సదా!"[2]**

గోపికా హృదయము 20వ పద్యము

నీవు తప్ప నా హృదయమెఱుగునట్టి నాథుడు ఎవ్వడున్నాడు? సందేహము నా హృదయమును కలతపెట్టి త్రిప్పుటచే కలతనొందితిని. శరీరము అశాశ్వతము. నిత్యము కానిది. అనగా నశించునది. ఈ శరీరము నశించినచో నిన్ను చేరుట ఎట్లు? 'దాసోహ' మని అనుచు నీలో ఐక్యమై "సోహం" అనుచు

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 53
2. పైదే

శాశ్వతముగ ఆనందమందెదను. అని వర్ణించిరి. ఇక్కడ భగవంతుడును, భక్తుడును ఒండొరులయందు నిష్ఠితులని వీరు సూచించుట యుక్తియుక్తముగానున్నది. శైలి సలక్షణమై ద్రాక్షాపాకమై అక్కడక్కడ గడుసు పోకడలు కలిగి ఒప్పుచున్నది.[1] అని శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారు తమ అభిప్రాయమును వెల్లడించిరి.

ఈ విధముగా శ్రీ శర్మగారు ఒక గోపికగా శ్రీ కృష్ణునితో తాదాత్మ్యమునొందిరి. ఇక్కడ శ్రీ రాఘవశర్మగారి భక్తిహృదయము ఆవిష్కరించబడినది.

## 3.6 వేఁడికోలు: -

భక్తులైన శ్రీ శర్మగారు భగవంతుని ఈ విధముగా ప్రార్థించుచున్నారు.

> **"అంతటనున్నవాడు హృదయాంతరమందుఁ జెలంగువాడు, కా**
> **లాంతర భేదమున్ గన కహర్నిశమున్ వెలుగొందు వా, డి కిం**
> **తంత యనంగరాక, యణువై, ఘనమేరువునై, జగమ్మునై**
> **వింతలు సేయువాడు, కనువిచ్చిన మూసిన ( దోచు నీ యెడన్".[1]**

వేఁడికోలు 1వ పద్యము

భగవంతుడు సర్వత్ర వ్యాపించి యున్నవాడు. హృదయములోపల ప్రకాశించువాడు. కాలభేదము లేక ఎల్లప్పుడు రాత్రింబవళ్ళు ప్రకాశించువాడు. ఇంత అంత అని చెప్పుటకు వీలుగాని వాడు. అణువైనవాడు. గొప్ప మేరువైనవాడు. జగమంతా తానే అయి వింతలు సేయువాడు. అట్టి భగవంతుడు ఇప్పుడు కన్ను తెఱచినను మూసినను కనబడును. అని వర్ణించిరి. ఇది వీరి యెక్క భక్తి విశేషమునకు నిదర్శనము.

కంటికి కనబడనిది, మనస్సునకు గోచరింపనిదియైన వైకుంఠము ఎచ్చటనున్నది? లక్ష్మీదేవితో స్థిరముగ నివాసమా? జగత్పాలనా నటనాసూత్రధారుడవు. ఆనంద స్వరూపుడవు. నీ సాన్నిధ్యము ఎక్కడ లభించును? చాల జన్మజన్మములకైనా లభించునా? నీవే మా కొరకు లేచి రావలయును. కాని నన్ను రప్పింప దలచి శ్రమ పెట్టక నా దగ్గరకు రమ్ము. నాకు శుభము కలుగును. నా హృదయపద్మము నీకు నివాస స్థలము. నన్ను నీ వాడనుగా తలచి నాతో కలసి యున్నచో నా జీవితము సుఖముగానుండును.

1. శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం గారు – పండితాభిప్రాయము కల్పలత పుట 12
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 57

ఎందులకు నన్ను ఈ విధముగా బాధించెదవు? ఇక్కడ అక్కడ అనక ఎక్కడికో పారిపోవుచున్నావు. దాగుడుమూతలాడుచున్నావు. ఆలోచింపగా పిల్లికి చెలగాటము, ఎలుకకు ప్రాణసంకటము అన్నట్లుగా ఉన్నది. నామీద కొంచెము దయజూపుము. నిన్ను పట్టుకొందును.

> **"ఎందుకు మాయమర్మముల నిందటి బిడ్డలఁగన్నుఁబ్రామ, నా**
> **నందము, మాటిమాటికొక నాటకమాడెద వాసఁజూపి, తృ**
> **ప్తిందనియింపఁజేయ కొక, తీపియెదో! కలదంచుఁజూపి నీ**
> **క్రిందకు, లాగికొందువరరే! బహుచిత్రము నీ విలాసముల్".[1]** వేఁడికోలు 5వ పద్యము

జనులందరు నీ బిడ్డలు . నీ బిడ్డలను వంచించుట నీకు ఆనందమా?మాటిమాటికి ఏదో ఒక ఆశ పెట్టి నాటకమాడెదవు. మానవులకు తృప్తి కలిగింపక, ఏదో ఒకమాధుర్యము కలదని చూపించి నీ దగ్గఱకు లాగుకొందువు. ఆహా! నీ విలాసములు బహుచిత్రములు. అనగా మాయకు లోబడచేయునని అర్థము.

ఇందు శ్రీ శర్మగారు భగవంతుడు జగన్నాటక సూత్రధారి అను విషయాన్ని స్పష్టము చేయుచుండిరి. మనుష్యులు ఆశాజీవులు. దానివెంట పరుగిడుట మానవనైజము. అది నెరవేరినపుడు ఆనందించుట, నెరవేరనపుడు దుఃఖించుట సహజము. కోరికలు దుఃఖానికి హేతువులు.

> **"నాకయి నీవురాక, కరుణన్ గనబోక యుపేక్ష సేయుచో**
> **నాకు ఁ బనేది చెప్పు, మొకనాటికి వీడని, కంఠ శోషతో ఁ**
> **బ్రాకఁగ లాభమే! చెవిటి వానికి శంఖపుమ్రోత యట్టులెం**
> **దాక పఠింపు, మోరిమి గనన్ గ్రహియింతువ! యెన్నినాళ్ళకో!"[2]** వేఁడికోలు 6వ పద్యము

నీవు నాకొరకు రాకుండా, నాపై దయచూపకుండ నన్ను ఉపేక్ష చేసినచో నేను చేయగల దేమున్నది చెప్పు. చెవిటి వాని దగ్గర శంఖమూదినట్లుగా ఎప్పుడు మానకుండా కంఠమెండిపోవునట్లుగా ఎంత ప్రాకులాడినను ఏమి లాభము? ఎంతవరకు ఓపిక పట్టను చెప్పు. ఎన్నినాళ్ళకు నన్ను అనుగ్రహింతువు?

నీవు నాదగ్గరకు రాకుండుటచే ఎన్నో జన్మములు ఈ విధముగానే వ్యర్థములయిపోయినవి. "గలండు వీడొకడు, నిన్నే నమ్ముకొన్నాడటంచన్నా! మేలగు బుద్ధి, నీకొదవెనయ్యా! వీడొకడున్నాడు. నిన్ను నమ్ముకొని

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 58
2. పైదే

యున్నాడను తలంపు నీకెన్నడైనా కలిగినదా? దాచకుండా చెప్పు! అట్లు చెప్పనిచో నేను నీయెడ విశ్వాసముతో నుండదగునా? చెప్పు.

నేను నిన్నే కోరిసేవింతును గదా! నాక్షేమమాలోచించు వాడున్నచో వానిని కదలనియ్యక పట్టుకొందును. అట్టివాడీ ప్రపంచమున నీవొక్కడవు తప్ప ఇతరులు లేరని వింటిని. ఆ మాటలకు ఆశ్చర్యమొందిన వాడనై ఎటుల ఏవిధముగానో అని అది తిరిగి చెప్పలేక ఊరకొంటిని. అయినను నేను నీతో ఒక విన్నపము చేయుటకు కూడ సాహసింపజాలను. నీ రూపము నాకన్నులార వీక్షింతును. అమితానందంబుతో పొంగి పట్టుకొనుటకు ప్రయత్నింతును. ఓ కృష్ణా! నీవు ఎటువంటి పనినైనను సమకూర్పగలవు. అంతయు నీ అధీనమైయుండును.

**"ఐనన్, నీమది కొక్క విన్నపము, సేయంజాల, రూపంబెదో**
**కానన్ వచ్చిన, లెస్స ( గా దెలిసి; నాకండ్లార వీక్షింతు న**
**త్యానందంబున ( బొంగి పట్టుకొన(గా యత్నింతు, నీకెల్ల, స్వా**
**ధీనంబౌ, నెటువంటి కార్యమను సంధింపంగ(కృష్ణప్రభూ!"[1]** వేఁడికోలు 9వ పద్యము

అని వీరు శ్రీకృష్ణుని దర్శనమిమ్మని ప్రార్థనములు చేయుటకిష్టపడక దర్శనమునకై వేచియున్నారు. ప్రార్థనలు చేసినా ఆ పరమాత్మ తాను అనుగ్రహించదలచినప్పుడే అనుగ్రహించును. ఆ సమయమునకై వేచియుండవలెనను పరిజ్ఞానముకల వ్యక్తిగా గోచరించుచుండిరి.

కవి సామ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు కల్పలత కావ్యఖండికకు తమ అభిప్రాయమును వెలిబుచ్చుచు "ఇందులో వేఁడికోలు అన్న శీర్షికతోడి పద్యాలు చాలా హృదయంగమంగా ఉన్నాయి. వీరి కవిత్వానికి పరాకాష్ఠగా ఉన్నవి. హృదయావేదన దీనియందు మిక్కిలి రమ్యముగా ఉన్నది"[2] అని వ్రాసిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 58

## 3.7 శ్రద్ధాంజలి: -

ఈ ఖండకావ్యమును కళాప్రపూర్ణ శతావధాని చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు దివంగతులైనపుడు వ్రాసినది. ఇటువంటి వాటిని ఆంగ్లభాషలో Elegy స్మృతిగీతము అందురు.

కళాప్రపూర్ణుడైన వెంకట శాస్త్రిగారు తెలుగు పలుకుబడికే బంగారు కొండ. ఔర! ఇతడిప్పుడు కఱగిపోయెను గదా! ఈయన మహానుభావుడు. కాలవశముగా కరిగిపోయిన ఈ బంగారు కొండ బహురూపములు తాల్చినప్పటికి ఏకాత్మకమగుటతో ఈ శక్తికి వినాశములేదు. ఈ కవి ఆంధ్రమాతకు కీర్తిని సంపాదించినవాడు. కామేశ్వరి జిహ్వాపై నటియించుట చేత సర్వకామములును తీఱినవి. సత్కవీశ్వర! ఏ విషయమునను మీకు లోటులేదు. అని చెప్పుటచేత వీరు కామేశ్వరీ ఉపాసకులుగా తెలియుచున్నది.

**"తిరుపతి వేంకటేశ్వరుఁలె, దేశికులైచనఁలేరు ఁజెంది రెం**
**దఱో మన వేంకటేశ్వ రు ఁడెదంగొనఁదా, నతఁడేయనన్ బ్రభా**
**కరుఁడన, విశ్వనాధుడనఁగాంతుఁడనన్ శివరాముడంచు నం**
**దరి యెడ నన్నిరూపుల ఁ గనందగు నాతడు వేంకటేశు ఁడే!"**[1] శ్రద్ధాంజలి 3వ పద్యము

ఈ పద్యమునందు తిరుపతి వేంకట కవులకు శిష్యులై కీర్తిమంతులైనవారు పేర్కొనబడిరి. శ్రీ కాటూరి వెంకటేశ్వరరావుగారు, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, విశ్వనాథ సత్యనారాయణగారు, పింగళి లక్ష్మీ కాంతంగారు, వేలూరి శివరామ శాస్త్రిగారు పేర్కొనబడిరి. ఇంతమంది శిష్యుల యందును ఇన్ని రూపులతో వెలిగిన అతడు సర్వ వ్యాపియైన విష్ణుమూర్తియే యగును. అందువలననే వీరు ఆతడు నిజముగా వేంకటేశ్వరుడే అని చెప్పుచున్నారు.

**"తిరుపతి వేంకటేశ్వరుఁడె, దేవుడెగా కవినిప్పుడంతటన్**
**గరము కలమ్ము ఁ బూను మొనగాడగు నే కవికైన, వేంకటే**
**శ్వరుని ఁదలంపకే కలము సాగదు, నూగదు, చేతఁబట్టి , తా**
**నుఱవడి చాళ్ళువెట్టగ మహోదయమౌ, తెనుగుంబొలమ్మునన్"**[2] శ్రద్ధాంజలి 4వ పద్యము

ఇప్పుడు కలియుగములో అంతటా తిరుపతి క్షేత్ర నివాసియగు వెంకటేశ్వరుడే దేవుడు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 61
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 62

ప్రాయసగాంధ్రలో కూడ మొనగాడు వేంకటేశ్వరుడే ఏ కవికైనను మహానుభావుడైన శ్రీ వెంకటశాస్త్రిగారిని తలచుకొననిదే కవిత్వ రచన సాగదు. కుదరదు. అని కవి చెప్పుటలో అర్థము వీరు సాక్షాత్తు ఈ కలియుగ వేంకటేశ్వరులే ఈ వేంకటశాస్త్రి అని చెప్పుట.

చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు కాలవేది. రాబోయే విషయములు అనగా జరగబోయే విషయములుకూడా తెలిసినవారు జ్యోతిశ్శాస్త్రము నందుదిట్ట. ఒక మాటవినగానే ఇతడు కవీంద్రుడై జీవించునని ఆశీర్వదించి పంపును. వారి వాక్శుద్ధిచే ఆయన్న మాట జరిగి తీరునట.

**"ఏనుంగు నెక్కినట్లే పచియింతురిం**

**తింత లేసి కవీంద్రు లెవని కతన**

**రామశబ్ద మెఱుంగ రాని సామాన్యుడున్**

**కవిత నల్లఁ గ నేర్చెనెవనికతన**

**అష్టావధాన, శతావధానమ్ములుఁ**

**బ్రాకె నింటింట, నెవ్వానికతన**

**అర్హత లేకయే యాశింతు రితరు, లా**

**స్థాన కవిపదమెవ్వాని కతన**

**కవియె సుఖి, చిరంజీవి, మేల్ కవి యటంచు**

**సుకరముగఁ బల్కు పద్య సాధకులు తఱచు**

**కూన రాగమ్ముఁ దీతు రెవ్వాని కతన**

**నట్టి కవిభోజుఁడిప్పుడేపట్టుఁ జేరె!"[1]** శ్రద్ధాంజలి 6వ పద్యము

ఇందు శ్రీ వేంకట శాస్త్రిగారి గొప్పదనము వివరించబడినది. వీరి వలన కనీసము రామశబ్దము కూడ నెఱుగని సామాన్య జనుడుగూడ కవిత్వము చెప్పగలిగెనట. పూర్వము అష్టావధాన, శతావధానములు రాజాస్థానములందున్నవి. ఇప్పుడు ఇంటింటికి ప్రాకెనట. అనర్హులైన వారు కూడ ఆస్థానకవి గౌరవమును కాంక్షింతురట. పద్యరచనము సాధించువారు వీరివలననే అందు ఆసక్తి గలవారై కూన రాగములు దీయ నేర్చిరట. అట్టి శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రియను కవి భోజుడు ఇప్పుడు ఎక్కడకేగెనని వీరు ప్రశ్నించుచుండిరి.

**"పద్యమల్లి నట్టి వాడెల్ల కవిగాడు**

**సత్కవీంద్రుఁ డనఁగ శతావధాని**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 62

చెలగి నీవు చేయు చేవ్రాలు క్రిందనీ

"శతావధాని" బిరుదు సార్థకంబ"[1] శ్రద్ధాంజలి 8వ పద్యము

శ్రీ చెళ్ళ పిళ్ళ వేంకట శాస్త్రిగారు చేవ్రాలు వ్రాసి దానిక్రింద "శతావధాని" అని వ్రాసికొనెడివారు. ఆ బిరుదు వీరికి సార్థకమైనది. వీరు భారతామ్నాయమును నాటకములుగ వ్రాసిరి. అందలి పలుకుబడి పదునైనది. హృదయమును కదిలింపజేయునది. ఈ రచనతో వీరు ఆంధ్ర భాషను పునరుద్ధరించిరి. వీరు వ్రాసిన పాండవోద్యోగములోని "జెండాపై కపిరాజు" అను పద్యము మరియొక కవి వ్రాయలేడు. జెండాపై కపిరాజులేడు అను వాక్యమును వారికి అనుసంధించినచో ఈ కపిరాజు శ్రీ వేంకట శాస్త్రి గారని స్ఫురించును. వీరు హనుమంతుని వంటి వారని, హనుమంతుడు లవణ సముద్రమును లంఘించినట్లు వెంకట శాస్త్రిగారు ఆంధ్రకవిత్వజలనిధిని తరించినవారు. అంతటి మహానుభావుడైన కవి మన కింక లేరు గదాయని వీరుతమ సంతాపమును వెలిబుచ్చిరి.

శ్రీ నిడదవోలు వేంకటరావుగారు కల్పలత కావ్యఖండికకు తమ అభిప్రాయమును వెలిబుచ్చుచు "శ్రద్ధాంజలి యందు కవి పరమేష్ఠి యందు కవికి గల గౌరవము సువ్యక్తము చేయుచున్నది[2] అని వ్రాసిరి. నిజముగానే వీరికి శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారంటే ఎంత గురుభావనయో తెలియుచున్నది.

## 3.8 గ్రహస్తవము: -

భూమి, నిప్పు, నీరు, గాలి, ఆకాశము అనెడి పంచ భూతముల కలయికచే ఏర్పడునదే ప్రకృతి. ఇవి లేకుండా ఏ ప్రాణులు జీవింపజాలవు. నేల నివాసమును, పంటలు పండించుకొను అవకాశమును గల్పించగా, నిప్పు వెలుగు, ఉష్ణశక్తిని, బ్రతుకుటకవసరమైన సామర్థ్యమును ప్రసాదించును. నీరు త్రాగుటకేగాక పంటలకును ఆధారభూతమగును. ఇక గాలి ప్రాణశక్తిని ప్రసాదించును. ఆకాశము వీటన్నిటిని మించి సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు మొదలగు వాటికి నెలవై గ్రహగతులకు అనుకూలముగా ఉన్నది. వీనిలో ఏది సరిగా లేకున్నను మానవుల మనుగడ దుర్భరమగును. ఆయా గ్రహాలకు సంబంధించిన వస్తువులతోనే మానవ మనుగడ సాధ్యమగును.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 63
2. శ్రీ నిడదవోలు వేంకటరావు గారు అభిప్రాయము కల్పలత పుట : 13

గ్రహములు తొమ్మిది. సూర్యుడు, చంద్రుడు, కుజుడు, రాహువు, బృహస్పతి, శని, బుధుడు, కేతువు, శుక్రుడు. ఈ తొమ్మిది గ్రహాల ప్రభావం మానవునిపై ఉండును. ఈ గ్రహాల సంపుటిని మార్చగలిగినది ప్రదేశము. అనగా ఒకే సమయమునకు ఎంతమందియో మనుష్యులు గాని, పశువులు గాని జన్మించవచ్చును. కాని వారు జన్మించిన స్థలమును బట్టి ఆ గ్రహసంపుటి మారుచుండును. ఈ గ్రహగతుల ననుసరించే మానవుల ఆరోగ్య అనారోగ్యములు, కష్టసుఖాలు సంభవిస్తూ ఉంటాయి. గ్రహ అనుకూలము లేనిదే జీవితము రాణించదు.

ప్రతి జీవికి ప్రకృతియే ఆదిమాత - గురువు. మానవుడు గాని పశుపక్షులు గాని ప్రకృతిలోని ప్రతి జీవి తన నిత్య జీవిత విషయాలను ప్రకృతి నుండే నేర్చుకొనుచున్నాడు. పక్షులకు కోయిల వంటి వాటికి మామిడి చిగుళ్ళను తినమని, కుహూ కుహూ అని కూయమని చెప్పినది ఎవరు? జంతువులకు గడ్డి తినమని - గాలి పీల్చుకో మని బోధించినదెవరు? అట్లే మనుష్యులకు కూడా శరీరము నిర్మితమైన దగ్గర నుండి మనుగడ సాగించుట వరకు ప్రతిదీ ప్రకృతి నుండియే నేర్చుకొనుచున్నాడు. కావున ప్రకృతియే ప్రథమ గురువు.

గురువు బ్రహ్మ, గురువు విష్ణువు, గురువు మహేశ్వరుడు. గురువే పరబ్రహ్మము. అని చెప్పబడినది. బ్రహ్మ,విష్ణు, మహేశ్వర రూపమైన పరబ్రహ్మము ప్రకృతిలోని చైతన్యశక్తి.

ఈ గురువులు మూడురకాలుగా ఉంటారు. తాను నేర్చుకున్న విషయాన్ని బోధించేవారు తల్లిదండ్రులు గురువులు. భగవంతుడు మనకు ప్రబోధించుట రెండవరకము. ఆత్మ రూపమైన ప్రబోధాన్ని పొంది ప్రకృతి నుండి చైతన్యము పొంది, ప్రకృతిని ఆరాధించి మనకు వచ్చిన సమస్యను ప్రకృతితో ముడి పెట్టుకొని చూడటం మూడవ రకం. ప్రకృతి మహా గురువు. దీనిని మనకనుగుణముగా మలచుకోవటము, ఆరాధించి పదిమందికి దానిని పంచి ఇవ్వటం. ఇట్లా చేయుట జన్మాంతర సుకృతము.

శ్రీ గురుజాడ రాఘవ శర్మగారు జ్యోతిష శాస్త్ర విద్వాంసులు. ఎంతో మంది జాతకములను నిశిత పరిశీలన చేసిన వ్యక్తి. వారి జాతకమును కూడా ప్రతి క్షణం పరిశీలించుకొనుచు ఎట్లాంటి క్లిష్ట సమస్యలెదురైనా అది గ్రహబలమని నమ్మి తన జాతకాన్ని తన కృషి - తనలోని మొండితనము, తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండి తనకనుగుణముగా మార్చుకోగలిగిరి. ఏ వ్యక్తియైనా శ్రమపడి - తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నప్పుడు తన జీవితాన్నే అంకితము చేసినప్పుడు అది మంచి

ఫలితాన్నే ఇస్తుంది. దానికి భగవచ్ఛక్తి తోడైనప్పుడు మరింత రాణిస్తుంది. ఒక వ్యక్తి యొక్క గమనాన్ని శాసించగల శక్తి దైవానికే ఉంటుంది గాని మానవునికి కాదు. అటువంటి దైవశక్తి, ఉపాసనాబలము తోడై శ్రీ శర్మగారు జ్యోతిశ్శాస్త్రములో గ్రహాలకు ఎదురీదగలిగినారు. వారిలోని ధైర్యము, గుండె నిబ్బరము, గ్రహాల అనుకూలము తమకి ఉంటుందను అచంచలమైన ఆత్మవిశ్వాసము వారిని అగ్రశ్రేణికి చెందిన జ్యోతిశ్శాస్త్ర పండితులనుఁజేసినది. అందువలననే వారు తమ కల్పలత కావ్యఖండికలో "గ్రహస్తవము" అనే పేరుతో ప్రత్యేకముగా ఒక స్థానమునిచ్చి నవగ్రహములను స్తుతించుచూ వారి యనుగ్రహము తమకెల్ల కాలము ఉండవలెనని ప్రార్ధన జేయుచు ఏఏ గ్రహములు ఏఏ ఫలితములనిచ్చునో వివరించుచు ఈ గ్రహస్తవ ఖండికను తీర్చిదిద్దిరి. ఇది వీరి జ్యోతిష వైదుష్యానికొక నిదర్శనము.

సూర్యుని స్తుతించుచు,

**"అహమున్ సేయు విధాత, జీవులకు ప్రాణాధారమౌ వేల్పు, ప**
**ద్మహితుండాశ్రిత బాంధవుండు, శుభకర్మప్రోక్తయున్, సాక్షియున్**
**గ్రహరాట్ మిత్రుడు, నాత్మకారకుడునై రాజిల్లు సూర్యుం, డను**
**గ్రహమున్ గూర్చుత నాపయిన్ నిరతమున్ రాజ్యప్రదుండై ధరన్"[1]** గ్రహస్తవము 1వ పద్యము

పగలును చేయువాడు జీవులు జీవించుటకు ఆధారమైన వాడు, అనగా వారిలోని చైతన్య స్వరూపుడు, పద్మములకు స్నేహితుడు సూర్యోదయమైనంతనే పద్మములు వికసించుకొనును. ఆశ్రయించిన వారికి బంధువు. శుభకర్మలు చేయించువాడు. కర్మలకు సాక్షీభూతుడు. గ్రహములన్నింటికీ రాజు. ఆత్మకారకుడై ప్రకాశించువాడై ఎల్లప్పుడు నన్ను అనుగ్రహించుగాక అని ప్రార్థించిరి. వీరు వృశ్చిక లగ్న జాతకులు. సూర్యుడితనికి రాజ్యాధిపతి.

అహమున్ సేయు విధాత అని చెప్పుటలో సృష్టికర్తయైన బ్రహ్మ ఇతడే. జీవులకు ప్రాణాధారమైనవాడు అని చెప్పుటలో ఆ సృష్టిని కొనసాగించే విష్ణువు ఇతడే అని చెప్పుట. జీవులకు శక్తి ప్రదాత సూర్యుడే. జీవులకు ప్రాణాధారమైన ఆక్సిజన్ ఆ సూర్యుని నుండే వెలువడును. కావుననే మనుష్యులు గాని, జంతువులు గాని, వృక్షములు గాని సూర్యరశ్మి తగలనిదే జీవించలేవు. సకల జనులకు, జీవులకు సాక్షీభూతుడు. వీరు కూడ సూర్యుని బ్రహ్మ విష్ణు మహేశ్వర రూపమైన ఏక స్వరూపముగా భావించిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 67

చంద్రుని స్తుతించుచు,

**"అమృతకరుండు, సస్యములకాదరువున్, సిరి, పాడి, పంట, సౌ**
**ఖ్యమును, శుభమ్ము, సత్కవిత, నాయువు, సంతతి, స్వీయమాతృసౌ**
**ఖ్యము, నొడగూర్చు, రేవెలుఁగునై వెలుగొందు కళాప్రపూర్ణుఁడు**
**ల్లమువికసింప ( గాంతులఁజెలంగ ననున్ దయనేలుగావుతన్"**[1] గ్రహస్తవము 2వ పద్యము

చంద్రుడు అమృతమయమైన కిరణములు గలవాడు. పైరులకు ఆధారమైనవాడు. పాడి, పంట, సంపద, సౌఖ్యము, శుభము, సత్కవిత్వము, ఆయువు, సంతానము, తల్లికి సౌఖ్యము వీనిని కలిగించువాడు. షోడశకళాప్రపూర్ణుడగు చంద్రుడు హృదయము వికసించునట్లు, కాంతులతిశయించునట్లు నన్ను దయతో పాలించుగాక.

ఇక కుజుని స్తుతిస్తూ,

**"అధికారమ్ము బలమ్ము ( దేజమును శౌర్యమ్మున్ మహాధైర్యమున్**
**బృథివిన్ సోదరవృద్ధియున్ గ్రహములున్ వేదప్రబోధ స్థితిన్**
**రథ దివ్యాశ్వభటాదికమ్ములొసగూర్చన్ భౌముడస్మన్ మనో**
**రథ మీడేర్చు సదా జయప్రదుఁడునై, రాజ్యప్రదుండై భువిన్"**[2] గ్రహస్తవము 3వ పద్యము

కుజుడు మన జాతకములో బాగుంటే అతడు అధికారమును, బలమును, తేజమును, శౌర్యమును, ధైర్యమును, సోదరవృద్ధి కలిగించుట, ఇండ్లును, వేదవిజ్ఞానమును, రథ, గజ, తురగ భటాదులను ఇచ్చుట చేయును. అట్టి కుజుడు భూమిపై ఎప్పుడు రాజ్యము నిచ్చుచు మా కోరికను నెరవేర్చుగాక అని వ్రాసిరి.

రాహు గ్రహాన్ని స్తుతిస్తూ,

**"వాపీకూప తటాకముల్, వనములున్, భాగ్యము, సంచారమున్**
**రూపున్, బ్రజ్ఞయు, ధీ యశమ్ము, మహదారోగ్యమ్ము సౌధాళి, భా**
**షా పాండిత్య మొసంగు రాహువిల సూక్ష్మజ్ఞాన సంపత్తు మేల్**
**ప్రాపున్ గూర్చుత సర్వశక్తి యుతుఁడై రంజింపఁజేయన్ ననున్"**[3] గ్రహస్తవము 4వ పద్యము

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత 1, 2, 3 పద్యాలు పుట : 67

మన జాతకములో రాహువు బాగుంటే దిగుడుబావులను, చెఱువులను, తోటలను, భాగ్యమును, దేశ సంచారమును, సౌందర్యమును, ప్రజ్ఞను, బుద్ధిని, కీర్తిని, ఆరోగ్యమును, మేడలను, పాండిత్యమును ఇచ్చును. అట్టి రాహువు సూక్ష్మజ్ఞాన సంపత్తి పొసగునుగాక. మేలైన ఆశ్రయమిచ్చును గాక. సర్వశక్తిమంతుడనగు నన్ను సంతోషపెట్టును గాక అని స్తుతించిరి.

బృహస్పతిని స్తుతిస్తూ,

**"గురుతర బుద్ధి సంపద, యకుంఠిత దీక్ష, సుతాది బాంధవుల్**
**సురుచిర భోగభాగ్యములు, శుద్ధ మనమ్ము, గృహాది సౌఖ్యముల్**
**సిరియును, బాడిపంటయు ప్రసిద్ధ కవిత్వము, ప్రాణమిచ్చు స**
**ద్గురుఁడిడుగాత నాకు దయతో ప్రతినిత్యమభీష్ట సంపదల్"[1]** గ్రహస్తవము 5వ పద్యము

బృహస్పతి బాగున్నచో గొప్ప తెలివితేటలను, మొక్కవోని దీక్షను, పుత్రులు మున్నగు బంధువులను, భోగభాగ్యములను, పరిశుద్ధమైన మనస్సును, గృహము మొదలగు సౌఖ్యములను, సంపదను, పాడిపంటలను, ప్రసిద్ధమైన కవిత్వమును, ప్రాణమును అనగా జీవనమును ఇచ్చునట్టి బృహస్పతి నాకు నిత్యము ఇష్టసంపదల నొసగు గాత అని స్తుతించిరి.

శనిని స్తవము చేయుచు,

**"తఱుగని పాడిపంటయును, దాలిమి, యోజన విష్ణుభక్తియున్**
**స్థిరతర భూమి సంపదయు, దేహపటుత్వము, సుప్రభుత్వమున్**
**దిరమగు నాయువున్, సకల తీర్థ నివాసము, త్యాగమిచ్చు భా**
**స్కరసుతుఁడస్మదీయ మగుకామితముల్ నెరవేర్చుగావుతన్"[2]** గ్రహస్తవము 6వ పద్యము

శని తఱుగని పాడిని, పంటను, ఓర్పును, ఆలోచనమును, విష్ణుభక్తిని, స్థిరసంపదయైన భూమిని, దేహపాటవమును, అధికారమును, స్థిరమైన ఆయువును, పుణ్యతీర్థమునందలి నివాసమును, త్యాగమును ఇచ్చునట్టి సూర్యపుత్రుడగు శని మా కోరికలను నెరవేర్చుగాత.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 68
2. పైదే

బుధుని స్తుతిస్తూ,

**"నీతివిశారదుండు, ధరణీ సుర పూజిత పండితుండు, శ్రీ**
**మాతుల కారకుండు, బుధమాన్యుడు, మాంత్రిక తత్త్వవేదియున్**
**జ్యోతిష శాస్త్రవేత్త యగుచున్ విలసిల్లు బుధుండు, జ్ఞానము**
**ద్యోతకమై తరించెడి, సుయోగ మొసంగుత నాకు నిత్యమున్"[1]** గ్రహస్తవము 7వ పద్యము

నీతి వేత్తయు, బ్రాహ్మణులచే పూజింపబడు పండితుడును, సంపదలనిచ్చువాడు, మేనమామలకు వృద్ధికలిగించువాడును, విద్వాంసులచేత గౌరవింపబడదగినవాడును, మంత్రవేత్తయు, జ్యోతిషశాస్త్ర పండితుడునగు బుధుడు ఎప్పుడును నాకు జ్ఞానమును వృద్ధి చేసి తరించెడు సుయోగము నిచ్చుగాక.

కేతువుని స్తుతిస్తూ,

**"ఘనమౌ, సద్గురు దేవపూజన, నమస్కారమ్ము, మృష్టాన్న భో**
**జనమున్, దీర్ఘనివాసమున్, భువన సంచారమ్ము, శ్రీశైవ, భ**
**క్తి, నిడంగాగల, కేతు వెప్పుఁడను రక్తిన్ బ్రోచుతన్ నిత్యము**
**క్తి నిధానంబగు, జ్ఞానమిచ్చి ననుఁదృప్తిన్ దేలియాడించుచున్"[2]** గ్రహస్తవము 8వ పద్యము

సద్గురువును, దేవుని పూజించి నమస్కరించుటయు, మంచి భోజనము, పుణ్యతీర్థ నివాసము, దేశ సంచారము, శివభక్తి వీని నిచ్చునట్టి కేతువు శాశ్వత ముక్తికై జ్ఞానమిచ్చి నన్ను సంతృప్తిని జేయుచు తనను అనురాగముతో రక్షించునుగాక అని ప్రార్థించిరి.

శుక్ర స్తవము జేయుచు,

**"సురపుర భోగభాగ్యములు, సుందరచందన దివ్య భూషణాం**
**బరములు, సత్కవిత్వము, శుభమ్ము, యశమ్మును, భర్మహర్మ్యముల్**
**సురుచిర సత్కళత్ర, సుతులున్ సమకూర్చెడి, భార్గవుండు, భా**
**సురముగ నిష్టమూర్తి యగుచున్ ననుఁబ్రోచు నభీష్ట సంపదన్"[3]** గ్రహస్తవము 9వ పద్యము

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత 1, 2, 3 పద్యాలు పుట 68

దివ్య భోగములను, భాగ్యములను, చందనమును, భూషణములను, దివ్యాంబరములను, సత్కవిత్వమును, శుభమును, యశస్సును, బంగారమును, మేడలను, సత్కళత్రమును, సత్సంతానమును సమకూర్చెడి శుక్రుడు అనుకూలుడై ఇష్టసంపదలనొసగి రక్షించుఁగాత.

ఒక్కొక్క గ్రహమును, ఆ గ్రహము చేయు శుభాశుభములను వివరించుచు, ఒక్కొక్క గ్రహము ఏయే లాభములు చేకూరుస్తాయో చెప్పటమేగాక తొమ్మిది గ్రహముల అనుగ్రహము మనకు ఉండాలని, ఉంటుందని సూచిస్తూ, అంతటితో తృప్తి చెందక చివర

**"భువనములన్ సృజింపఁగ సుపోషణఁజేయ లయంబొనర్పనౌ**
**రవియు, శశాంకుడున్, గుజుఁడు, రాహువు, దేవగురుండు, సౌరి కై**
**రవహిత సూనుడున్, శిఖియు, రాజిత భార్గవుడున్ సమస్త వై**
**భావము లొసంగి ప్రోచుత కృపన్ ననుఁదా మనుకూలదృక్కులన్"**[1] గ్రహస్తవము 10వ పద్యము

లోకములను సృష్టించుటకును, పోషించుటకును, నశింపజేయుటకు సమర్థులైన సూర్యుడు, చంద్రుడు, కుజుడు, రాహువు, దేవగురువు, సూర్య పుత్రుడైన శని కలువలకు హితుడైన చంద్రుని కుమారుడైన బుధుడు, కేతువు అనుకూల దృష్టులతో చూచుచూ సమస్త సంపదలనొసగి దయతో నన్ను కాపాడుదురు గాక! అని అంటారు.

కల్పలత కావ్య ఖండికలో ఈ విధముగా నవగ్రహస్తుతి వేరువేరుగా చేయటమే గాక "సర్వగ్రహరూప" అను నామానికి అర్థవివరణ గావించుచు శ్రీ వాసుదేవ నామ శతకములో,

**"శనియంచున్ బుధుడంచున్ ( గేతువనుచున్ జంద్రుడటంచున్ గుజుం**
**డనుచున్ రాహువటంచు శుక్రుడునటంచాదిత్యుఁడంచున్ గురుం**
**డనుచున్ భేదము మోదమున్ గనుదురోయాగాములున్ నీవె నా**
**యన! సర్వగ్రహరూప! నిన్ దలఁతుఁ గృష్ణా! వాసుదేవ ప్రభూ!"**[2]

శ్రీవాసుదేవ నామ శతకం 126వ పద్యం

శనియని, బుధుడని, కేతువనుచు, చంద్రుడని, కుజుడని, రాహువని, శుక్రుడని, ఆదిత్యుడని, గురుడను ఈ బేధములన్నీ ఆనందముతో చూచెదను. ఈ అన్ని గ్రహాల రూపములలో వచ్చువాడవునీవే. నీవు సర్వగ్రహ రూపుడవు. అట్టి నిన్ను దలతును అంటారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 69
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ వాసుదేవ నామ శతకము పుట 72

"గ్రహచారమ్ము దలంచి కాఁగలుగు కార్యంబూహకుందెచ్చి యీ
గ్రహరూపంబగు నిన్ను లోఁదెలియ నేరన్ లేమయో నీ యను
గ్రహమున్నన్ గ్రహదోషముల్ దొలగి భద్రంబబ్బునట్లౌట బ్ర
తృహమున్ గొల్చెద నిన్నుఁదృప్తిగొని, కృష్ణా! వాసుదేవప్రభూ!"[1]

శ్రీవాసుదేవ నామ శతకం 127వ పద్యం

ఓ కృష్ణా! గ్రహచారము తలచుకొని కాగల కార్యమును ఊహలలోనికిఁదెచ్చుకొని ఈ గ్రహరూపమైన నిన్ను లోపల తెలియలేమయ్యో! నీ అనుగ్రహమున్నచో గ్రహదోషములు తొలగి శుభములు కల్గును. అట్లగుట చేత తృప్తిగా నిన్ను ప్రతిరోజు కొలిచెదను. అని అంటారు. దీని వలన నవగ్రహ రూపములలో వెలుగొందు పరమాత్మ అన్ని స్వరూపములు ఒక్కడే అని చెప్పటము. తనలో వెలుగొందు ఆత్మస్వరూపమైనవాడు ఆ పరమాత్మయే అని గ్రహించిన యోగిపుంగవులు.

కల్పలతకు తమ అభిప్రాయమును వ్రాయుచు, శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు, "రాఘవ శర్మ ప్రాత క్రొత్తల నిందు రమణీయముగ సమ్మేళనము చేసినందులకు నవగ్రహస్తవమొక తార్కాణం. ప్రాచీనులలో పదునైదవ శతాబ్దినొక్క గౌరన మాత్రము ప్రత్యేకముగా నవగ్రహస్తవమొనరించినట్లు తెలియుచున్నది. ఈ వెనుక కీర్తిశేషులు విక్రమదేవవర్మ మహారాజుగారొక నవగ్రహస్తవమును రచించియున్నారు. కానీ నవీన భావుకులలో నెవ్వరును దీనిని ప్రత్యేకముగా రచియించినట్లు గానరాదు. రాఘవశర్మ రచనము ప్రాచీనుడగు గౌరన రచనతో తులతూగుచున్నది. పితృదేవతాళి కీ కావ్యమును సమర్పించుట ప్రాచీన సంప్రదాయమే.[2] అని పేర్కొనిరి.

శ్రీ గురుజాడ రాఘవశర్మగారి జాతకమును పరిశీలించిన వాస్తు జ్యోతిష విద్వాన్ కీ॥శే॥ శ్రీ వీరుభొట్ల ఘంటయ్యశాస్త్రి గారి శిష్యులు అద్దేపల్లి కృష్ణమూర్తి గారి కుమారులునైన శ్రీ అద్దేపల్లి వేంకట రమణగారు చెప్పిన వివరములివి[3].

"జ్యోతిశ్శాస్త్రమును అనేక కోణాలలో అనేక విధాలుగా పరిశీలన చేయవచ్చును. హైందవ సంప్రదాయములో పరాశరునికి ఎక్కువ విలువ ఉన్నది. కారణము మిగిలిన శాస్త్రాలు దుఃఖ కర్మ విమోచనములను పూర్తిస్థాయిలో అందించలేదు. కాని పరాశరసంహితలో మానవుని కర్మవిమోచనానికి

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ వాసుదేవ నామ శతకము పుట 72
2. శ్రీ నిడదవోలు వేంకటరావు గారి అభిప్రాయము - కల్పలత పుట 13
3. శ్రీ గురుజాడ రాఘవశర్మగారి జాతకమును గూర్చి శ్రీ అద్దేపల్లి వేంకట రమణ గారితో ముఖాముఖీ చర్చ - మచిలీపట్టణము ది. 24-4-2010.

కావలసిన పద్ధతులన్ని మనకు ఋషులు అందించినారు.

"శ్రీ శర్మగారి జాతకములో తను భావములో శని ఉండుట వలన లగ్నాధిపతియైన కుజుడు అష్టమములో ఉండుట వలన రవిచంద్రులు కుంభములో ఉండుటవలన మనిషి చామనఛాయ రంగు కలిగి నిర్మలమైన, నిష్కల్మషమైన మనస్సు కలిగిన వారగుదురు. నిరంతర శ్రమజీవి. అధికారముతో గూడిన కష్టపడే మనస్తత్వము. పది మందికి ఉపయోగపడే విధముగా ముఖవర్చస్సు కలిగి ఉంటారు. ముక్కుకొనదేరి పొడవుగా ఉండును. వృశ్చికలగ్నాత్ ద్వితీయ పంచమాధిపతియైన గురుడు లాభకారకుడు. చంద్రుడు లాభకారకుడు. రవిలాభకారకుడు. వీరి జాతకములో గురు ప్రభావం అధికము. వీరి జాతకములో శని, రవి, చంద్ర, కుజ, బుధ, కేతు బలాలు ఉండుట వలన చేసే ప్రతి పని చాలా సూక్ష్మముగా ఆలోచించి చేస్తారు. దానికి ఈ ఆరు గ్రహాల ఆనుకూల్యత. గ్రహసంచారము కారణము.

ద్వితీయములో రవి వాక్కు : వీరి వాక్కు చాలా స్వచ్ఛముగా సత్యమునకు దగ్గరగా చాలా పరుషముగా ఉండును.

ధనము:ధనము విషయములో ఎంత సంపాదించుకుంటే అంత ఖర్చు అగును. నిల్వచేయలేరు. తనకిది కావాలని దాచిపెట్టలేరు. వీరి తరువాత ఆడపిల్లలు ఉన్నారు".[1]

వీరి జతకము పరిశీలించి చెప్పిన వేంకటరమణగారు శర్మగారిని చూడటం జరగలేదు. వీరు చెప్పిన విషయము అక్షరాల సత్యములు. వీరు చామనచాయ రంగు, ముక్కు పొడవు. నిష్కల్మష హృదయము. వాక్కు సత్యమునే పలికేవారు. ఎప్పుడు అబద్ధమాడేవారు కాదు. ఎదుటి వ్యక్తి అబద్ధము చెప్పున్నాడంటే అది గ్రహించి విరుచుకుపడి దబదబ దులిపేసెడివారు. మాటా చాలా పరుషముగా ఉండెడిది. అది ప్రేమతో అభిమానముతో కూడినదే. కాని వారిమనస్తత్వము తెలిసిన వారికి గాని అర్ధమయ్యేది కాదు. శని, రవి, చంద్ర, కుజ, బుధ, కేతు, బలాలు ఉండటము వలననే గావున ఈ నవగ్రహస్తోత్రము వ్రాయాలని తలంపునకు వచ్చియుండును. ప్రతి విషయము సూక్ష్మముగా పరిశీలన చేసేవారు.

ధనము విషయములో నిల్వచేసినది లేదు. ఎంతో దారిద్ర్యమునునుభవించారు. వీరి తరువాత ఇద్దరు చెల్లెళ్ళున్నారు. "మాతృస్థానములో రవిచంద్రులు ఉండుట వలన తల్లిదండ్రుల మీద సమాన

1. శ్రీ గురుజాడ రాఘవశర్మగారి జాతకమును గూర్చి శ్రీ అద్దేపల్లి వేంకట రమణ గారితో ముఖముఖీ చర్చ - మచిలీపట్టణము ది. 24-4-2010.

ప్రేమ గౌరవాలు ఉంటాయి అని చెప్పిరి. మాతృకారకుడైన చంద్రుడు శనిలో ఉండటము వలన తల్లిగారు చామనచాయతో చాలా అందముగా ఉంటారు. సాధారణముగా లోకంలో పిల్లలకి కొంత మందికి తల్లి అంటే ఎక్కువ ప్రేమను కనబరచేవారు. కొంతమంది తండ్రి అంటే ఎక్కువ ప్రేమను కనబరచేవారుగా కన్పిస్తు ఉంటారు. వీరికి తల్లిదండ్రి ఇద్దరన్నను సమాన ప్రేమ. గురు భావంతో ఆరాధించారు. బాల్యములో వీరి ఊహాపోహలకు తల్లిదండ్రుల ప్రభావమే కారణము. వీరు జీవితములో ఏది సాధించారనినా తల్లిదండ్రులే స్ఫూర్తి ప్రదాతలు"[1].

ఇది యదార్ధ విషయము. మాతాత గారికి తల్లిదండ్రులంటే అమితమైన ప్రేమ, గురుభావము. వారే ఒకచోట

> **"జన్మతరియింప నుత్తమ జన్మ మొసగి**
> **నట్టి గురుజాడ వంశ విఖ్యాత యశులు**
> **వేంకమాంబ త్రయంబకుల్ స్వీయమాన్య**
> **మాతృ పితృమూర్తులీ గురు మండలిని స్మ**
> **రింతు, సంతతమున్, శుభశ్రీల మనుప"[2]**

అని వ్రాసికొనిరి. అన్ని జన్మములలోనికి మానవజన్మ ఉత్తమమైనది. అందులోను బ్రాహ్మణ జన్మ ఉత్తమోత్తమమైనది. అట్టి జన్మ తరింప జేయుటకు ఉత్తమ జన్మని ప్రసాదించిన గురుజాడ వంశమునకే ప్రఖ్యాతమైన యశస్సు నార్జించి పెట్టిన తల్లి వేంకమాంబ గారిని, తండ్రియైన త్ర్యయంబకేశ్వరులను తన మాతృ పితృమూర్తులైన గురువులను ఎల్లప్పుడు స్మరిస్తాను అంటారు. అంతేగాదు తల్లిదండ్రులను ప్రాథమిక గురువులుగా భావించినవారు. శుభశ్రీలు పొందుతాము అంటారు. దీనినిబట్టి తల్లిదండ్రులంటే ఎంత గురుభావమో వ్యక్తమగుచున్నది. అంతేగాక నవవిధ ఖండికలు గల తమ కల్పలత కావ్యములోని సందర్శన ఘట్టమును తండ్రి అంత్యకాలములో కోరగా విన్పించి రామ సందర్శన భాగ్యమును కలిగించుటయే గాక ఈ భాగమును తండ్రికి సమర్పించుచున్నానని తన తండ్రి

> **"అని వాత్సల్యమునిండ భక్తి వివశుండై పిల్చినన్ బల్కుమ**
> **జ్జనకుండైన త్ర్యయంబకేశ్వరున కీ 'సందర్శనం' బిచ్చెదన్"[3]** సందర్శన సమర్పణ పద్యము

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మగారి జాతకమును గూర్చి శ్రీ అద్దేపల్లి వేంకట రమణ గారితో ముఖముఖీ చర్చ - మచిలీపట్టణము ది. 24-4-2010.
2. శ్రీ గురుజాడ రాఘవశర్మగారి వ్రాతప్రతి
3. శ్రీ గురుజాడ రాఘవశర్మగారి కల్పలత పుట 7

భక్తి వివశులమై పిలిస్తే ఁ బల్కు నని నమ్మినవారు. 'వాత్సల్యము నిండ' అంటారు. తమపై తండ్రికి ఎంత వాత్సల్యమో! అటువంటి తన తండ్రియైన త్ర్యయంబకేశ్వరునికి సమర్పణ చేయుదును అని వ్రాసిరి.

"మాతృదేవోభవ"

"పితృదేవోభవ"

"ఆచార్యదేవోభవ" అనే త్రయాత్మకమైన భావన వీరిలో పొడగట్టును. వ్రాసినది శివుని కథ. తండ్రి కోరినది రామ దర్శనము. సందర్శన ఘట్టములోని ఇతివృత్తము శివునకు కేశవునకు భేదములేదు అని చెప్పుట. ఇట్టి అద్వైతమును ప్రతిపాదించిన శ్రీ శర్మగారు నిజమునకు ఒక యోగి పుంగవులు. ఈ యోగతత్త్వము అలవరచు కోవాలంటే లభ్యమగునది కాదు. జన్మాంతర సుకృతము. వీరికి "రాహువు శుక్రుడు గురుస్థానములో ఉండుట వలన ఇటువంటి యోగతత్త్వము అలవడినది. అదియు గాక ఇట్లా రాహువు శుక్రుడు గురుస్థానములో ఉన్నవారు అవసరములు ఎన్నివచ్చినా తాను కష్టాల్నే నమ్ముకొని, కష్టములోనే సుఖము ఉన్నదని, సుఖములోనే సుఖము కలుగుట వింతకాదనే భావము అలవరచుకొనిన ఆత్మ యోగి"[1] అని శ్రీ అద్దేపల్లి వేంకట రమణ గారు సెలవిచ్చిరి. ఇదియు వీరిపట్ల నిజమే. జీవితములో ఎన్ని కష్టాలు, ఒడిదుడుకులు ఎదురైనా చలించని ఆత్మ ధైర్యము గలవారు.

శ్రీ శర్మగారు 1930-9-5న రాయవేలూరు సెంట్రలు జైలులో బంధింపబడి యున్న సమయములో తన గ్రహచారము ఎట్లా ఉన్నదో తెలిసినవారు గనుకనే "స్వాతంత్ర్య పథము"లో ఈ విధముగా వ్రాసికొనినారు.

**మ॥ "గ్రహచారమ్ము లెఱుంగుదున్, గ్రహగతిన్ గార్యమ్ములూహింతు, స**
**త్సహవాసంబున, గొంతనేర్చితినిబో, సద్విద్య, యా విద్యచే**
**గ్రహదోషంబులడంగునే! తెలిసియున్ రాజాధిరాజైన, నీ**
**గ్రహచారమ్మున లొంగి కట్టువడు, స్వప్రారబ్ధకర్మంబులన్"[2]** స్వాతంత్ర్యపథము 1వ లేఖ

శ్రీ శర్మగారు జ్యోతిశ్శాస్త్రమునాకలింపు చేసుకొనినవారు గావున తాను గ్రహచారము తెలియుదును. గ్రహగతుల వలన చేయవలసిన కార్యములేమియో ఊహించుకొనగలను. మంచి సహవాసము వలన కొంత నేర్చుకొన్నాను.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మగారి జాతకమును గూర్చి శ్రీ అద్దేపల్లి వేంకట రమణ గారితో ముఖాముఖీ చర్చ - మచిలీపట్టణము ది. 24-4-2010.
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము - పుట 26

ఆ విద్య వలన గ్రహదోషములు పోవునా? రాజాధిరాజైన గ్రహచారమును తెలిసికొని దానికి కట్టుబడి ప్రవర్తించవలెను గాని తన ప్రారబ్ధ కర్మమును దాట శక్యము కాదని చెప్పుచున్నాను.మరి తెలిసి ప్రయోజనమేమంటే తెలిసికొనుట వలన కొంత జాగ్రత్త వహించుటకు అవకాశమున్నది. ఏదైనా పూజా పునస్కారములు చేసికొనుట వలన ఆ గ్రహచారము యొక్క తీవ్రస్థితి కొంత తగ్గును.

ఏలినాటి శని మనిషిని ఎంతో బాధిస్తుంది. ఆరోగ్యము, ధనక్షయము, లోకులచేత బాధపడటం - అనేక రకాలుగా ఉంటుందని మా తాతగారు చెప్పేవారు.

**"పదునాల్గు వత్సరంబులు**
**వదలెన్ శని తనువు జేరి వాని ఫలమ్మున్**
**హృదయమెఱుంగును, లోకం**
**బిదియని, వెక్కిరించు, నేమనగవలెన్"[1]** రాయవేలూరు జైలు 1వ లేఖ

ఆయన జాతకములో పదునాలుగు సంవత్సరములు ఏలినాటి శని వదలిపోయినదిట. వాని ఫలితము ఎట్లా అనుభవించామో నా హృదయానికి తెలుసును. ఇది తెలియని లోకము అది ఇదియని వెక్కిరించును.

**"తల్లిదండ్రులు నమ్మరు, తనయు మనసు**
**భార్య సందేహపడు, వేరు భావమూని**
**బంధుమిత్రుల పరిహాస భావమమరు**
**నకట! యీ గ్రహచార మహాత్మ్యమేమో"[2]** రాయవేలూరు జైలు 1వ లేఖ

గ్రహచారము బాగుండకపోతే ఎంత స్థితికి వెడుతుందంటే కుమారుని మనస్సు తల్లిదండ్రులుకూడా తెలిసికోలేరు. భార్య మనస్సులో వేరే భావము పెట్టుకొని సందేహపడును. బంధుమిత్రులు కూడా పరిహాసము చేయుదురు. అయ్యో! ఈ గ్రహచారమహాత్మ్యమేమో కదా! అని వాపోతారు.

"కుజుడు వక్రించి ఎనిమిదవ ఇంట ఉండుట వలన ఎలర్జీ మచ్చలు పడి బాధపడతారు. సప్తమ స్థానము భార్యస్థానము. వీరి భార్య భర్తకనుకూలవతి. వీరు భార్యపట్ల ప్రేమానురాగాలు గలిగి సేవ చేసే స్వభావం గలవారు. తన కష్టసుఖాలను భార్యతో పంచుకోవటమే గాక భార్య కష్టసుఖాలను కూడ విని పరిష్కార మొనర్చెడివారు. అష్టమ స్థానము కేతువు, కుజుడు. కుజుడు వక్రించి ఉండుట వలన జైలు

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము - పుట 26
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము - పుట 27

బాధలు, పోట్లాటలు, శరీరముపై లాఠీ దెబ్బలు వగైరా ఉంటాయి. గురుడు వ్యయ మందుండుట వలన అనేక ఉద్యోగాలు నిర్వహిస్తారు. ఒకటి అని నిలకడగా ఉండదు. ఎన్ని గ్రంథాలు వ్రాసినా వాటికి గుర్తింపు లభించదు. ఎవరైనా చెప్పి వెలుగులోకి తీసికొని రావాలి"[1] అని చెప్పిరి. శ్రీ శర్మగారు ఆంధ్రదేశమంతా తిరిగి ఎందఱో జాతీయ నాయకులు వ్రాసిన గేయాలను ఏర్చికూర్చి 592 పేజీల జాతీయగేయాల సంపుటిని తయారు చేసిరి. దానిని ముద్రించే శక్తి లేదు. వీరు చేసిన కృషిని తెలిసికొని డాక్టరు బెజవాడ గోపాలరెడ్డిగారు, దేవులపల్లి రామానుజరావు గారు వంటి ప్రముఖులు ఆ గ్రంథము ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ద్వారా అచ్చువేయించినారు. స్వాతంత్ర్యోద్యమములో ఉప్పుసత్యాగ్రహములో పాల్గొని తొమ్మిది మాసములు జైలు శిక్షననుభవించారు. బందరులో కోనేరు సెంటరు కుండుపై జండా ప్రతిష్ఠించడంలో పాల్గొని లాఠీ దెబ్బలకి గురియైనారు. భార్యపట్ల ఎంతో ప్రేమానురాగాలు గల వ్యక్తి. వీరే తమ "స్వాతంత్ర్యపథము"లో రాయ వేలూరు సెంట్రల్ జైలులో ఉన్నప్పుడు బందెగొన్న భర్త భావము ఎట్లా ఉండునో తనను ఉద్దేశించే ఈ విధముగా వ్రాసిరి.

కట్టు కొనుటకు బట్ట, తినుటకు సరిగా కూడుకూడలేదు భారతీయులకు. ఈ సమయములో ప్రాణప్రదమైన నిన్ను విడచిపెట్టి యీ బందిఖానాలో కట్టబడితిని. భారతావనిలో పుట్టితిని గాన మాతృదేశ ఋణమును తీర్చుకోవలెనని కంకణము జేపట్టితిని. ఈ విధముగా మాతృదేశ సేవ చేయవలెనని నిశ్చయించుకొంటిని. ఇది అతి కఠినమైనదని ఆలోచింపకు. తూలనాడకు నన్ను క్షమింపమని వేడుకొనుచున్నాను. జరిగిపోయిన దానిని గూర్చి తలంపకు. నేను చేసినపని అన్యాయమే.

సీ॥ "పవళింపగా శయ్యపై జేరి యొత్తి గి
ల్లితినో లేదో కౌగిలింతు వెదుట
పఠియింపగా నొక్క బంతిసాగునోలేదొ
వీనుల విందు గావింతు పల్కి
భుజియింప ( గోరి, యాపోసనమిడితినో
లేదో, నీ వడ్డించు లీల జూతు
ఆలోచనమ్ము సేయ దలంచితినొ లేదొ
తలపులన్నింట నీ తలపె నిలచు"

1. శ్రీ గురుజాడ రాఘవశర్మగారి జాతకమును గూర్చి శ్రీ అద్దేపల్లి వేంకట రమణ గారితో ముఖాముఖీ చర్చ - మచిలీపట్టణము ది. 24-4-2010.

ఆ॥ "నిదురకనుల నులిమి, నిలచి చూచితొ లేదొ
నీదు రూపెయెదుట నిలచినవ్వ
మనము దూరమైన మనసులు దూరమా
కాలమెప్డు మనల గలుపునోకద"

గీ॥ "నీవు నాకయి మిగులవాపోవు దేమొ
నాల్గు గోడల మధ్య యొంటరిగ లేను
నాట్య మాడుచు నీ తోడ నవ్వుకొనుచు
నుందు భావప్రపంచమ్మునందు రేల"[1]. రాయవేలూరు జైలు 7వ లేఖ

నిదురించుటకు శయ్యపై చేరగానే ఎట్టఎదుటగా ప్రత్యక్షమగునట. చదువుదామని ఒక్క పంక్తి చదువుతారోలేదో పల్కి వీనుల విందు చేయునట. తిందామని ఔపోసన పట్టగానే ఆమె వడ్డించులీల కన్పించునట. ఆలోచనకు రాగానే అన్ని ఆలోచనలలో ఆమె నిలచునట. నిదురపోవుచున్న కనులు నులిమికొని నిలచి చూచినచో ఆమె రూపమే నవ్వుతు నిలబడినట్లు తోచునట, శరీరములు దూరమైనమనసులు దూరము కాదుకదా! కాలము మనలను తిరిగి ఒకచోటికి ఎప్పుడు చేర్చునోకదా! అని విరహవేదన ననుభవించిరి. నీవు నా కొరకై మిగుల బాధనొందెదవేమో! నేను నాలుగు గోడల మధ్య ఒంటరిగాలేను. రాత్రిపూట భావప్రపంచములో నీతో నాట్యమాడుచు నవ్వుకొనుచుఉంటాను అంటారు. దీనిని బట్టి వీరికి భార్యపైగల ప్రేమానురాగాలు వ్యక్తమగుచున్నవి.

స్వాతంత్ర్యోద్యమములో తిరుగుతున్నా తన కష్ట సుఖాలకు తోడు ఆమె కష్టసుఖాలలో కూడ పాలుపంచుకొనేవారు. జాతక రీత్యా ఆమె తనకంటె ముందే కాలం చేస్తారని తెలిసినా పుట్టిన ప్రతి ప్రాణి గిట్టక మానదను వేదాంతమును జీర్ణించుకొన్నవారు గావున ఎంతో గుండె నిబ్బరము కలిగి ఉండిరి. అయినను మానస వీధిలో కలత చెంది పోయిన పన్నెండవ రోజు "సతీ మల్లికాంబస్మృతి" అను పేరుతో పన్నెండు పద్యములు వ్రాసిరి. ఇదంతయు ఆమెపై గల అనురాగమునే వ్యక్తము చేయును. జీవితము చివరలో చాలా సంవత్సరములు కాళ్ళకు ఎలర్జీ వచ్చి బాధపడిరి.

"వీరి జాతకములో రవి చైతన్యము, ఆలోచనా సరళిలో సూక్ష్మ శక్తి అందించ గలిగినవాడు. ఇది అధికారముతో కూడి ఉంటుంది. మనిషి వెన్నుపూసను నిట్టనిలువుగా నిలబెట్ట గలిగిన వాడు అనగా అధికారముతో తనకు తానుగా నిలబడగలవాడు గాని ఒకరి క్రింద చేతులు గట్టుకొని నిలబడేవాడు కాదు అని చెప్పిరి. తను కారకుడైన రవి చంద్రునితో కలిసి కుంభరాశిలో, శని ఆధిపత్యము క్రింద ఉండుట

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము - పుట 40

వలన, మనిషి పొడవు, చామన ఛాయ కోలముఖము, కండ్లల్లో కాంతితో కూడిన ధైర్యము రవి శని స్థానములో ఉండుట వలన తనకు కావలసిన పని కష్టపడి సాధించుకొని విజయం పొందే దాకా నిద్రపోరు. వృశ్చికలగ్నం అగుట వలన మొండితనం, ఎన్ని కష్టాలు వచ్చినా అనుకున్న పని సాధించడానికి రూపకల్పన చేస్తారు. శత్రువుల మీద సమయము చూసి విజయము సాధిస్తారు".

"గురుడు వ్యయకారుడై శుక్రుని స్థానములో ఉండుట వలన ఎన్నో గ్రంథాలు ఆవిష్కరణ చేస్తారు"[1]. వీరు వాసుదేవ నామ శతకము, కల్పలత, అంజలి, స్వాతంత్ర్య పథము, నవకాళి, కాళరాత్రి మొదలగు ఎన్నో గ్రంథాలు వ్రాసిరి. వీటన్నిటికి గురుబలమే కారణము".

"కేతువు ఎనిమిదవ స్థానము - ఆయుర్దాయ భావము. వీరి జీవితముపై భార్య ప్రభావం ఎక్కువగా ఉండును. ఆమె చేసిన పూజాపునస్కారములు, పుణ్య వ్రతాలు పతివ్రతాలక్షణాల ప్రభావం వీరిపై ఎక్కువగా ఉంటుంది. కుజుడు అష్టమాధిపతి అగుటవలన శత్రు, ఆయుర్దాయ భాగాల మీద, భార్య యొక్క మాంగల్య భావము మీద కుజ సంబంధమున్నది. ఈ కుజుడు వక్రించుట వలన అందరిని తనకనుకూలముగా మలచుకోగలిగారు. వీరికి పదకొండు సంవత్సరములకే వివాహమగుటకు కారణము కుజుడు వక్రించుటము వలననే. శని వృశ్చిక స్థానములో ఉండుట వలన శని అనగా పాదభాగము. అందువలన కాళ్ళకు ఎలర్జీ వచ్చినది. ఇక్కడ కుజుని రోగం కాళ్ళకు వచ్చినది. లగ్నములో శని ద్వితీయంలో రాహువు అష్టమములో కుజుడు ఉండుటవలన శరీరముపై మచ్చలు తెలుస్తాయి దెబ్బలు తగిలిన మచ్చలు. ఇవి పుట్టుకతో వచ్చినవి కావు." అని రమణగారు తెలిపిరి.

"1952సం॥ నుండి 1959 సంవత్సరము వరకు కేతువు అష్టమ స్థానములో ఉండుట వలన ఒక పాపశక్తిగాని, దైవశక్తిగాని వీరిలో ప్రేరేపించి జ్యోతిశ్శాస్త్రము నభ్యసించాలనే సంకల్పము కలిగి ఉండును. వీరి భార్య మల్లికాంబగారి జాతకమును పరిశీలించినచో కేతుమహర్దశలో ఈమె జననము. శుక్రుడులో కుజుడు ఉండగా రజస్వల అయినారు. షుమారు రజస్వల కాకపూర్వమే 7,8 సం॥ల వయస్సులో శుక్రుడులో శుక్రుడు ఉండగా వివాహము చేసికొనినారు."[1] అని చెప్పారు. ఇది నిజమే మా తాతగారికి 11 సం॥ వయస్సు బామ్మగారికి 7 సం॥ వయస్సులో వివాహమైనది అని చెప్పేవారు.

"శుక్రుడులో రాహువు ఉండటము వలన శరీర పై భాగములో దుస్తులు ధరించకుండా కేవలము కొల్లాయి తో తిరిగిన పరిస్థితి ఉండు"[1] నని చెప్పిరి. 1921 సం॥లో సహాయ నిరాకరణోద్యమ సమయానికి తాను చేస్తున్న ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి కాంగ్రెస్ ఉద్యమ ప్రచారములో ప్రవేశించిరి.

పూర్తిగా తెల్ల దుస్తులు కట్టుకోవటం అనగా ఖద్దరు ధారణకు శుక్రుడే కారణము.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మగారి జాతకమును గూర్చి శ్రీ అద్దేపల్లి వేంకట రమణ గారితో ముఖాముఖీ చర్చ - మచిలీపట్టణము ది. 24-4-2010.

"లగ్నములో శని ఉండట వలన మనిషి పొడుగు, కాళ్ళు పొడుగ్గా ఉండి త్వరగా లేవరు.లేస్తే చాలా వేగముగా పని ముగిస్తారు. ప్రారంభించినపుడు వీరు చేసే పని నిదానముగా కనిపిస్తుంది. కానిఆ పని నేరవేర్చుకొనడం, చేరవలసిన గమ్యం త్వరగా చేరడం ఉంటుంది. శనిలో శని ఉండటం వలన కాలు ఆగదు. విపరీతముగా తిరుగుడు. కేతు మహర్దశలో 1916 సం॥ నుండి 1935 సంవత్సరము వరకు విపరీతముగా తిరుగుతారు."[2] అని వీరి జాతకమును పరిశీలించిన శ్రీ అద్దేపల్లి వేంకటరమణగారు చెప్పిరి. శ్రీ శర్మగారు 1921 సం॥లో త్రివిధ బహిష్కారము క్రింద తమ ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి కాంగ్రెస్ ఉద్యమ ప్రచారములో పాల్గొని, 1927 సంవత్సరము దాకా బందరు కలంకారీ కార్ఖానా లో విద్యాలయ మేనేజరుగా ఉండి 1922 సం॥లో బొంబాయిలో ఖద్దరు ప్రదర్శనలో పాల్గొనిరి. 1927 సం॥ జులైలో బెంగుళూరు - దక్షిణ భారత ఖాదీ ప్రదర్శనలో పాల్గొని మహాత్మాగాంధీ గారిచే బంగారు పతకమును, ప్రశంసా పత్రమును గ్రహించారు. 1928 సం॥ జనవరి ఎనిమిదవ తేదీన చెన్నపురిలో జరిగిన అఖిల భారత ఖాదీ ప్రదర్శనలో పాల్గొని, సువర్ణ పతకం గ్రహించారు. 1930 సం॥ మే 16 వ తేదీన దండి ఉప్పు సత్యాగ్రహములో పాల్గొని, రాజమండ్రి - రాయవేలూరు జైళ్ళల్లో తొమ్మిది మాసాలు కారాగార శిక్ష ననుభవించారు. 1928 సం॥ జనవరి 8 వ తేదీ నుండి 1933 సంవత్సరము ఆగష్టు 31 వ తేదీ వరకు చెన్నపురి రాష్ట్ర సహకార యూనియన్ వారి ఆధ్వర్యములో నడుపబడుచున్న గుడ్లవల్లేరు గ్రామ పునర్నిర్మాణ సంఘ సూపర్‌వైజర్‌గా కాంగ్రెస్ ప్రచారము చేశారు. 1941 సం॥ సెప్టెంబరు 12వ తేదీ నుండి 1950వ సంవత్సరము డిశెంబరు 31వ తేదీ వరకు అఖిల భారత చర్ఖాసంఘము బందరులో క్యాషియర్, ఎకౌంటెంట్‌గా పని చేశారు.

"1959 సంవత్సరము నుండి శుక్రుడులో శుక్రుడు ఇరవై సంవత్సరములు శుక్రమహర్దశ 1979 వ సంవత్సరము వరకు ఇక్కడ ప్రశాంతముగా జీవనం గడుపుతారు. బాహ్య శరీరాకర్షణ కి విలువ ఇస్తారు. రవిచంద్రులు చతుర్థంలో ఉండుట వలన తల్లిదండ్రుల వస్తువులు వెండి గాని బంగారం గాని ఉంగరం లాంటి వస్తువులు వీరు ధరించి ఉండాలి. రవిలో శని - రవిలో కేతువు వలన పశుసంపద ఉంటుంది. వీరు వేసిన జాతక చక్రము (తనది)ను పరిశీలించిన, చక్రముతో బాటు దశ అంతర్దశలు, తనకు పరిచయమున్న విజ్ఞులతో చర్చించి మూడు రకములుగా వేసినట్లుగా, ఈ దశ అంతర్దశల విభాగములో సూక్ష్మస్థాయి కోసం శ్రమించినట్లుగా తెలియుచున్నది. వాస్తవానికి అతి దగ్గరగా ఉండటానికి ఇవి సహకరించాయి. 20-6-1979 సం॥ నుండి తన జీవితం ఎట్లా ఉంటుందో అని జాతక చక్రం వేసికొని చూచుకున్నారు. ఇదియు జ్యోతిశ్శాస్త్ర ప్రకారం మూడు రకాలుగా వేసికొని పరిశీలన చేసికొనేవారు. వీరి స్వభావం చెప్పినది మూర్ఖంగా నమ్మకుండా వివిధ పరిష్కార మార్గాలు చర్చించుకొని అన్వయించుకొని, సత్యానికి దగ్గరగా ఉండటానికి ఎంతో తాపత్రయ పడేవారు."[1] అని వీరి కుటుంబ జాతక చక్రములున్న వ్రాతప్రతిని పరిశీలన చేసిన శ్రీ అద్దేపల్లి రమణగారు చెప్పిన మాటలు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మగారి జాతకమును గూర్చి శ్రీ అద్దేపల్లి వేంకట రమణ గారితో ముఖాముఖీ చర్చ - మచిలీపట్టణము ది. 24-4-2010.

## 3.9 కల్పలత: -

"కవిశేఖర" శ్రీ గురుజాడ రాఘవశర్మగారి కల్పలత ఇట్టి ఖండకావ్యసంపుటి. ఇందు 'వినతి' మొదలు 'కల్పలత' వరకు తొమ్మిది భావఖండములు గలవు. అన్నియు రసగుచ్ఛములనదగినవి. వీని భావములు, పోకడలునుదాత్తములై తమ తమ పేరు నన్వర్థము చేసికొనుచున్నవి. యువక హృదయముల సమ్మోహపరచి ఉద్రేకము వెంట పర్వులెత్తించునవిగాక, ఈ రచనలు వినయ వివేచనలకు శ్రద్ధాసక్తులకు, శాంతి, సత్ప్రవర్తనలకు భక్తిప్రబోధములకు పాదులు కట్టునవై సాహిత్య ప్రయోజనము సాధించుచున్నవనవచ్చును. కనుకనే " కింకిం న సాధయతి కల్పలతేవ విద్యా" యను ముఖ శీర్షికతో నీ కవి యీ పొత్తమును వెలువరించినాడు."[1] అని కల్పలత కావ్య ఖండికకు తమ అభిప్రాయమును వ్రాయుచు మహాకవి గడియారం వేంకట శేషశాస్త్రి గారు వ్రాసియుండిరి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవి మధ్వ శ్రీకాశీకృష్ణాచార్యులు గారు, ఈ కావ్యానికి తమ ఆశీస్సులనందిస్తూ

**"కల్పలతా కల్పము మా**
**కల్పలతా కవిత మాదు కల్పలతకు మా**
**కల్పలత సాటియని నా**
**యల్పజ్ఞత దోచెనట! యనన్వయమగుటన్".**[2] అని వ్రాసిరి.

శ్రీ శర్మగారు తొమ్మిదవ భాగమైన కల్పలత ఖండకావ్య ప్రారంభములోనే ఈ భాగమును పితృదేవతలకర్పించినట్లు కృతి సమర్పణ పద్యమును వ్రాసిరి.

**"కొలిచినఁగల్గు దేవతలకున్ దయ, యా పితృదేవతావళిన్**
**దలచిన వంశవృద్ధియగుఁదామరతంపరవోలె ఁదట్టమై**
**మొలిచిన వంశ భూజమటు పూచిన తంగెడు భంగి మాకొలం**
**బెలమి వహింప ఁ 'గల్పలత' నిచ్చెద మా పితృదేవతాళికిన్."**[3] కృతిసమర్పణ పద్యము

---

1. శ్రీ గడియారం వేంకట శేషశాస్త్రి గారు అభిప్రాయం - కల్పలత పుట : 3
2. మధ్వశ్రీ కాశీ కృష్ణాచార్యులుగారు అభిప్రాయం - కల్పలత పుట : 2
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కల్పలత కృతి సమర్పణ పద్యము

సేవించినచో దేవతలకు దయగలుగునని, పితృదేవతలను తలచుకొన్నంత మాత్రముననే తామరతంపరగ వంశవృద్ధియగునని, దట్టముగ మొలచిన వంశవృక్షము వలె అనగా వెదురు చెట్టు వలె, పూచిన తంగెడు వలె, మా వంశము వికసమందుటకు గాను మా పితృదేవతలకు ఈ కల్పలత సమర్పించెదను అని వ్రాసిరి.

అది అర్ధరాత్రి సమయము. పక్షులును, చెట్లును గూడ నెమ్మదిగా నిద్రలో మునిగి మాటుమణగినట్లుగా శాంతిగానున్నవి. ఆకాశమున నక్షత్రములు నిశ్చలముగా నుండెను. అట్టి సమయమున ఇంటిలో ఒక్కడు ఒక ప్రక్కకు ఒదిగి పరుండెను. అతడు ఆవిధముగా నిద్రించుచు వేగమే మేలుకొని నిద్రతో సగము మూతబడుచున్న కన్నులను పూర్తిగా తెఱచి నాలుగు మూలల పాఱచూచి ఒళ్ళు తెలిసి - ఇదంతయు స్వప్నమని గ్రహించినవాడై తల్లితో ఇట్లు చెప్పనారంభించెను. అమ్మా! నేనొక కలగంటిని. అది ఆలోచింపగా భయమును, ఆశ్చర్యమును కలుగజేయుచున్నది. యువకుడగు విష్ణుభక్తుడొకడు నిద్రించుచున్న నన్ను తట్టి - "లే, స్త్రీ యొకతె కనుటకు కష్టపడుచున్నది. నా వెంట రా, రా ఆమెను రక్షించుటకై నేను త్వరగ పోవుచున్నాను." అని అనెను. ఆ వైష్ణవ యువకుడు కలలో కనబడినవాడు ఎట్లా ఉన్నాడో ఇక్కడ చక్కగా వర్ణించిరి.

**"తెల్లని నామమున్ సరిగదీర్చిన కస్తూరి బొట్టు మోమును**
**త్ఫుల్ల సరోజనేత్ర యుగమున్, జిరుబొజ్జయు, నీలికాంతి రం**
**జిల్లెడి, మేనునై, కనకచేలము దాలిచి, వేత్ర పాణియై**
**తల్లి ! 'యతండు, కన్మొఱఁగిఁతాఁజనెఁదూరుపు మోముగా వెసన్".**[1]కల్పలత 4 వ పద్యం

మోమున తెల్లని నామము పెట్టుకొని నడుమ తిరుమణి పెట్టుకొనెను. కన్నులు వికసించిన పద్మములవంటివి. చిన్న బొజ్జగలవాడు, నల్లని శరీరచ్ఛాయ గలవాడు, బంగారు వస్త్రము ధరించినవాడు, చేతిలో బెత్తము పట్టుగొన్నవాడు, ఆయన ప్రాఙ్ముఖుడై కంటికగపడకుండా గబగబ వెళ్ళినాడు. కలయో! వైష్ణవ మాయయో తెలియుటలేదు. ఆ రూపము స్పష్టముగా కన్నులగట్టినట్లు, ఆమాటలు చెవులలో మారుమ్రోగినట్లుగా హృదయము చలించుచున్నది. పురుడు పోసికొనుటకు పుట్టింటికేగిన కోడలిని తలచుకొంటే గుండె చెదరుచున్నది. అని భయపడుచున్న కుమారుని ఓదార్చుచు తల్లి ఇట్లు పలికెను:

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కల్పలత పుట : 75

**"భయపడనేల తండ్రి ! మన పాలిటి దైవము నేటి కీ విధన్**
**దయ బ్రసరింప నీకు బ్రియదర్శనమిచ్చి యనుగ్రహించె ని**
**శ్చయముగ నెద్దియో శుభము, సన్నిహితంబయి యుండె స్వప్నమా**
**రయ, మన వంశ భూజము, ఫలప్రదమౌ నటుగాను పించెడిన్."**[1] కల్పలత 8వ పద్యం

నాయనా ! తండ్రీ! భయపడుటమెందులకు? దైవము మనపాలిట ఈ విధముగా ప్రసన్నుడై దర్శనమిచ్చి అనుగ్రహించెను. నిశ్చయముగా ఏదియో శుభము కలుగబోవుచున్నది. నీ స్వప్నవృత్తాంతము వినగా మన వంశభూజము ఫలప్రదమగుచున్నట్లు కనిపించుచున్నది. ఆ కరుణాయత్తైక చిత్తుడైన లక్ష్మీనారాయణుడాది నుండి మనకు సేమమే చేకూర్చుచో ఈనాడిట్టుల అనుగ్రహించుట వింతయా? ఇంతకు పూర్వము సంతానము కొరకై నేపడిన బాధలు చెప్పశక్యమా?

**"కన్నకన్న వేల్పుల మ్రొక్క, విన్న విన్న**
**వ్రతము లెల్లనునోచ, తీర్థముల గ్రుంక**
**ప్రాయ ముడిగె డి వేళ నాపాలిపంట**
**వగుచు గడుపున బడితివో యన్న నీవు".**[2] కల్పలత 10వ పద్యం

తెలిసిన వేల్పులందరికి మ్రొక్కినాను. విన్నటువంటి వ్రతములన్నీ నోచినను, తీర్థముల స్నానమాడినాను. ప్రాయముడిగెడివేళ నా పాలిపంటవై కడుపున బడితివీవు. సంతానము లేకచాలా కాలము బాధపడుచున్న నీ తండ్రి చివరకుకుమారుని ముఖమునుచూడకయె ఆ దు:ఖభారముతో కన్నులు మూసెను. దైవాన్ని నిందించుచు (ఆ దు:ఖభారముతో) నిన్ను ఏవిధముగా గర్భమున దాల్చితినో వినుము కుమారా ! తాను శరీరము విడుచుట నిశ్చయమని తలంచి అవసానపు గడియ సమీపించుట తెలిసికొని ప్రక్కపై కనులబాష్పములు కురియునట్లు విలపించుచున్న నన్ను చూచి మీ జనకుండు ఈ విధముగా పలికెను. 'విచారమునొందెదవేల బేలవై?

**"మనకున్ వంశము నిల్ప పుత్రుఁడుదయింపన్ వచ్చు నీ గర్భమం**
**దున, నిప్పట్టున వేఅఱయైన, నొక దత్తుందెచ్చి వంశాబ్ధి చం**
**ద్రుని గావించి పితౄణమున్ గడుపు, మార్యుల్ మెచ్చిదీవింప నా**
**తనయున్ గన్నుల జూచుకొమ్ము! మదివంతల్ మాను, నేఁబోయెదన్".**[3] కల్పలత 13వ పద్యం

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కల్పలత పుట : 76
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కల్పలత పుట : 77
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కల్పలత పుట : 78

మనకు వంశమును నిల్పు పుత్రుడుదయింపవచ్చును. అట్లుగాక వేఱయిన ఒక దత్తుని దెచ్చుకొని వంశాబ్ధి చంద్రుని గావించుకొని పితృఋణమును దీర్పుము. ఆ తనయుని కన్నులార చూచికొనుమని, తాను బోయెదనని పల్కుచు అసువులు బాసెను. నాయనా ! ఈశ్వరేచ్ఛతో నిన్నుకంటిని. భగవంతుడు మనయందుండి నిన్ను ఈ విధముగా ప్రసాదించినాడు. నా తొలినోము పంటవై । నా కనుదోయి వెలుంగువైన నిన్ను ప్రీతితో పెంచి పెద్దజేసి, పెండ్లి యొనర్చితిని. నీ భార్య నీవు చిలుకాగోరువంకలై గృహమున కోరికలీడేరునట్లు జీవించుచుండిరి.

**"కుతుకమీరగూర, కోడలి కడుపును**
**పండె, నంకతలము నిండె నాకు**
**చిట్టి మనుమరాండ్రజిన్నారి మనుమల**
**తోడ, నిల్లు దోసతోట యయ్యె".[1]** కల్పలత 16వ పద్యం

కోడలి కడుపుగూడ పండి, చిట్టిమనుమలు, మనుమరాండ్రతో ఇట్లు ఇల్లు దోసతోట అయ్యెను. పెద్దమనుమడు నీ తండ్రి పేరుగలవాడు. నీ పెద్ద కోడలు పుట్టినింట దౌహృదము నిండి, నీరాడు తరుణమాయెను. నేడో, రేపు శుభవార్త వచ్చును.

**"కలలు కల్లలుగావోయి, వలదుభీతి**
**నాకు మునిమనుమండును, నీకుమనుమ**
**డుదయమందుట తథ్యము, సదయుడైన**
**నాటి దేవుండు నేడు నున్నాడు కాడె!"[2]** కల్పలత 18వ పద్యం

కలలు అబద్ధములు గావు. భయమువద్దు. నాకు మునిమనుమడు,నీకు మనుమడు కలుగుట తథ్యము. నాటి దేవుడు మనపట్ల నున్నాడు. పూర్వజన్మలో ఏ తపము చేసితిమో ! చాల చిత్రముగానున్నది. ఈ విధముగా కలలో కన్పడుట ఎంతవారికి ఆశ్చర్యము కల్గును. నీ పౌత్రుని శుభంకరుడైన ఇలువేల్పు పేర పిల్చికొందుము. ఆయన దయవలన కలకాలము మన గోత్రము విస్తరించును. అని చెప్పి మన గృహము ఎటువంటిదో విను చెబుతాను అని,

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కల్పలత పుట : 78
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కల్పలత పుట : 79

"ద్వారమ్ముఁ దెఱువ ప్రత్యక్ష దర్శనమిచ్చి
క్రీగంటఁగను చెన్న కేశవుడండు
అనుదిన ఘట సహస్రాభిషేకోత్సవుం
డేలు పూర్వాశసోమేశ్వరుండు
తరతరంబుల నుండి తరుగని మన పాలి
పంట కామేశ్వరి యింటివేల్పు
ప్రాభవరక్షణా పరతంత్రమై, యెల్ల
దిశల నిల్చెడి పితృదేవతాళి
ప్రకటితానందభోగ సంపత్కటాక్ష
వీక్షణ ప్రసారముల గావించుచుండ
నీకు భయమేల నా తండ్రి! నిఖిల రక్ష
ణమ్ము గల్గిన యట్టి గృహమ్ము మనది!"[1] కల్పలత 20వ పద్యం

ద్వారము తెఱువగానే కనుచూపుమేరలో చెన్నవేశవ స్వామి ప్రత్యక్ష దర్శనమొసగును. ఎల్లప్పుడు సహస్రఘటాభిషేకోత్సవములతో వెలుగు సోమేశ్వరుడు, తరతరములనుండి తఱుగని మన పాలిపంటయైన కామేశ్వరీదేవిమన ఇంటి ఇలవేల్పు. సమస్త దిశల నిల్చి పితృదేవతా సమూహములతో వారి కటాక్షవీక్షణములతో రక్షించుచున్న మన గృహములో 'నీకు భయమేల? ఎన్నో మాటలుమాట్లాడుట ఎందులకు? ఈ స్వప్నము మంచి ఫలితమునిచ్చును. శుభప్రదము" అని పలువిధములుగా తల్లి కుమారునకు దెలుపుచుండగా తూర్పు తెలతెలవారెను.

"మునిమనుమడు కల్గెను, స
ర్ధ నిశీధము నందు నీకు తల్లీ !" యనుచున్
మనుజుడెవండో వాకిట
వినుచును నున్నట్టి వార్త వీనుల బడియెన్".[2] కల్పలత 22వ పద్యం

తల్లీ ! నీకు అర్థరాత్రి సమయమున మునిమనుమడు కల్గెను. అని ఒక మనుష్యుడు ఎవరో వాకిట నిలబడి చెప్పుచున్న మాట చెవికి వినబడెను.

అని ఈ విధముగా కల్పలత భాగమును రచించిరి. ఇక్కడ చెప్పిన చెన్నవేశవస్వామి ఈశ్వరుని

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కల్పలత పుట : 80
2. పైదే

ఆలయమును పసుమఱ్ఱు వీరి జన్మస్థానమైన గ్రామములో ఈ నాటికిని ఎదురుబదురుగా గలవు. వీరి యిండ్ల మధ్యలోనే గలదు.వీరి తాతగారి పేరు ఆదినారాయణ శర్మగారు.

వీరు ఈ ఖండకావ్య సంపుటికి కల్పలత అను పేరు పెట్టుటకొక రహస్యము గలదు.

శ్రీ రాఘవశర్మగారికి అనేక మంది ఆడపిల్లలు మగపిల్లలు సంతానము కలిగి నిలుచుట లేదు. వీరి భార్యకి చాలా సుస్తీ చేసినది. వీరు ఈ కల్పలత కావ్యాన్ని వ్రాసి వారు దేవతలకు, పితృదేవతలకు సమర్పణ చేసిన తరువాతనే భార్య (మా బామ్మగారు) పునరుజ్జీవితులైరని, తరువాత సంతానము కలిగి అందులోను అష్టమ సంతానము ప్రస్తుతము వారి పుత్రులైన చిరంజీవి గారు (మానాన్నగారు)అని అది సాక్షాత్తు వారి ఉపాసకులైన శ్రీ కృష్ణుడే తమ గర్భమున ఉదయించినట్లుగా తృప్తిచెందిరి.ఈ విషయమును వారేమాతో ముచ్చటించుటయేగాక తమ కల్పలత ఖండకావ్యములో కృతి సమర్పణ పద్యములలో తెలియజేసిరి.

**"శ్రీకృష్ణా ! యిదె ! కల్ప ల**
**తా కృతి వర్ధిల్లె నీ కృపామృత దృష్టిన్**
**జే కొనుము, సమర్పించెద**
**నీ కృతి నీ దివ్య పాద నీరజయుగళిన్".[1]** కృతిసమర్పణ పద్యము 1

**"గత జన్మంబుల నీ యను గ్రహముగల్గన్ లబ్ధమో ! యేమో ! గీ**
**ష్పతివై, శారదవై, సహస్రముఖవై భాషింపనానందరా**
**జితమౌ జీవిత కల్పవల్లి చిగిరించెన్ బూచెనిండార, శా**
**శ్వతమౌ కల్పలతా ప్రసూనములు దేవా ! నీవకై కొమ్మివే !"[2]** కృతిసమర్పణ పద్యము 2

**"పితృదేవుండవు, మాతవున్ గురుడవీవే ! సచ్చిదానంద సం**
**స్థితి, జేకూరభవత్పదాబ్జములఁదండ్రీ ! చేర్చెదన్ సత్కృపా**
**మతినందించిన, కావ్యకల్పలత, రెమ్మల్ కొమ్మలున్ బ్రాకి సం**
**తతసర్వార్థ సమున్నతంబయి చిరస్థాయిన్ బ్రకాశింపగన్".[3]** కృతిసమర్పణ పద్యము 3

పై రెండవ పద్యములో చెప్పిన జీవితకల్పవల్లి మా బామ్మగారు. వారు ఆశించిన కావ్యకల్పలత

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కల్పలత కృతి సమర్పణ పద్యములు 1, 2, 3

రెమ్మలు కొమ్మలు ప్రాకి సర్వార్థసమున్నతంబగుననునట్లుగానే వారి యిల్లు మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమడు, మునిమనుమరాండ్రతో తులతూగుచూ దోసతోటయయ్యెను.

సప్తసంతానములలో కావ్యరచననొకటిగా చెప్పుదురు. అదినిజమనిపించును. కావ్యమునకు, కవివాక్కుకు అంతటి మనోహరమైన శక్తియుండునని అనిపించును.నవవిధ ఖండికలను రచించి మొత్తము ఖండకావ్యమునకు కల్పలత అని పేరు పెట్టిరి. ఈ కల్పలత కావ్య ప్రారంభములోనే

**"పవనమాలి పెంచి వెలయించెనొ నల్లడలన్ బ్రసిద్ధ**
**దావనమంచు నాతెనుఁగునాట ( జిగిర్చెను మొగ్గదాల్చెనె**
**త్తావుల ( జిమ్మ విచ్చెను; ముదంబుగ కల్పలతా ప్రసూనముల్**
**తీవకు ( దీవపూచె ( సమదృష్టి రసజ్ఞులు ప్రేమ ( జేకొనన్".[1]** కల్పలత ప్రారంభము

అని జెప్పిరి. వీరి యింటి పేరు బృందావనము అని పెట్టుకొనిరి. తెనుగు భాష యనిన పరమప్రీతి. ఆయన ఇష్ట దైవము శ్రీకృష్ణుడు. నవవిధఖండికలనే పుష్పాలతో సమర్పణ చేస్తున్నాను అనే కావ్యసూచన "కల్పలతా ప్రసూనములు తీవకుఁదీవ పూచె" అని రసజ్ఞులు ప్రేమతో ఆస్వాదించండి అని, ఈ పూవులనెత్తావి చిమ్మ విచ్చెను అని చెప్పుటలో శ్రీ కృష్ణుని కరుణామయదృక్కులు అందరిపై ప్రసరించునని చెప్పుట.

మహెూపాధ్యాయ, తర్కవేదాంతసార్వభౌమ బ్రహ్మశ్రీ మండలీక వేంకటశాస్త్రిగారు వీరి కల్పలతా కావ్యమునకు తమ ఆశీస్సులనందజేయుచు "మీ సహజమగు మృదుమధుర కవితాశైలికి తోడుగ, భక్తిరసముప్పొంగ జేయు, మీ కావ్యకల్పలత యే సహృదయుల మనః పద్మముల వికసింప నానంద ఫలములనీయకుండును. మీ ఇష్టదైవతములగు దయాసముద్రులు శ్రీ కృష్ణ భగవానులు అపారకృపామతి యగు శ్రీమాతయు, మీ బృందావన సౌరభములునల్దిక్కుల వ్యాపింపఁజేయుదురు గాత."[2] అని వ్రాసిరి.

వీరు భిన్న భిన్న శీర్షికలతో ఈ గ్రంథము రచించుట విశేషము. ఇవి ఒక దానితో నొకటి సమన్వయము నొందుచున్నవి.

ఈ కల్పలతా ఖండకావ్యమునకు తమ అభిప్రాయమును వ్రాస్తూ, శ్రీ ఆకిలి శ్రీరామశర్మగారు ఇట్లు వ్రాసిరి:

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - కల్పలత ప్రారంభము
2. తర్క వేదాంత సార్వభౌమ బ్రహ్మశ్రీ మండలీక వేంకట శాస్త్రి గారి అభిప్రాయము - కల్పలత పుట : 1

"ఈ కవి విభిన్న శీర్షికలతో ఈ గ్రంథము రచించినను అఖండమగు కావ్యముంబోలె ఈ శీర్షికలు పరస్పర సాపేక్షకములై, అబ్బురముల గూర్చుట ఇందలి విశేషము."

భగవత్సందర్శనమునకు సాధనము భక్తి. అట్టి వాత్సల్య భక్తియైనచో మిక్కిలి మెఱుగు. అట్టి వాత్సల్యభక్తియు, ప్రణయభక్తియు వెలయించిన భక్తుడు 'పోతనామాత్యుడు'గా పొడగట్టినాడు. భాగవతము నందలి యతని గోపికలు వారి చర్యలు వెంటనే స్ఫురించి "గోపికాహృదయము" ఆవిష్కరింపబడి పిమ్మట గోపికాహృదయస్థుడగు భగవానుని "వేడికోలు" సాగినది. ఆదిలోను భగవత్సందర్శనమునట్లే అంత్యమునను (స్వప్నగత) భగవత్సందర్శనము తోడనే కల్పలత కితిశ్రీ చెప్పబడినది. చూచితిరా వివిధ విషయములకెట్టి యానుపూర్వమమరినదో."[1]

ఆంధ్ర సారస్వత పరిషత్ కార్యదర్శి, సాహిత్యవిశారద, విమర్శక శిరోమణి శ్రీకోన వేంకటరామశర్మగారు ఈ కల్పలతకి అభిప్రాయము వ్రాయుచు, ఆలంకారికులు చెప్పిన కావ్యప్రయోజనములిందు గనబడుచున్నవి అని చెప్పటమే గాక "అనప్రేక్షతార్థవిశేషాక్షర రచనైవ బంధచ్ఛాయేతి సేదం సేదయ: సహృదయానాం" అని ధ్వని కర్త చెప్పినట్లు పరిపాకముం బడసిన బంధచ్ఛాయ పద్యరూపమందునని తెలియనగుచున్నవి. ఆ పద్యబంధమున సంగీతవిధికలదు. శిల్పగానములు సమరసములై కవితయందు భాసించును. ఉపాస్తిరమ్యత కవియందెట్లు భాసించుచున్నదో యవగతము, జేసికొనునపుడే సహృదయత్వము అభివ్యక్తమగును." మీ కల్పలతయందీ సహృదయత్వమభివ్యక్తమౌటచే నాంధ్ర సారస్వత పరిషద్విచక్షులు, మిమ్ముల కవిశేఖరాంకునొనర్చుట (ముదావహము). సమంజసము."[2] అని వ్రాసిరి.

ఈ విధముగా కల్పలత కావ్యఖండిక వీరిని కవిత్వాకాశములో కవిశేఖరులను జేసినది.

1. "విద్యారత్న" శ్రీ ఆకిలి శ్రీరామ శర్మగారు కల్పలతాభినందనము - కల్పలత పుట : 6
2. "సాహిత్యవిశారద" శ్రీ కోన వెంకటరాయశర్మ గారి అభిప్రాయము - కల్పలత పుట : 4

# అనువాదములు - భక్తిసాహిత్యము

# 4. అనువాదములు - భక్తిసాహిత్యము

## 4.1 ముకుందమాల: -

ముకుంద అనగా మోక్షప్రదాతయగు శ్రీకృష్ణ పరమాత్ముడు. ఆయన కర్పించిన మాల ముకుందమాల. దీనిని శ్రీకుల శేఖరమహారాజు రచించిరి. ఈ కవి మహాజ్ఞానులని, యాళ్వారులని, దక్షిణ దేశమందు ప్రసిద్ధిగన్న పన్నిదఆళ్వారులలో నొకరు. ఈయన కేరళ దేశమున (మలబారు) కోళపురము (తిరువక్కంజలము)ను రాజధానిగా నేలిన మహారాజు. ఇతని తండ్రి పేరు దృఢవృత మహారాజు.

**శ్లో॥ "కుంభే పునర్వసౌ జాతం కేరళే కోళ పట్టణే**
**కౌస్తుభాంశం ధరాధీశం కులశేఖర మాశ్రయే."**[1] ముకుందమాల 2వ శ్లోకము

కేరళ దేశములో కోళపత్తనమందు (కళ్ళికోట), కుంభ మాస పునర్వసు నక్షత్రమునందు, కౌస్తుభాంశమున నవతరించిన శ్రీ కులశేఖర భూపతి కలియుగము 28 వ సంవత్సరము, పరాభవ నామ సంవత్సర కుంభ మాసమున దృఢవ్రతుడను పుణ్యపురుషునకు శ్రీ కులశేఖరాళ్వారులు జనించిరని ప్రతీతి. తండ్రి వానప్రస్థము స్వీకరించిన పిమ్మట కులశేఖరుడు దిగ్విజయము గావించి, తన భక్తి తత్త్వమును ప్రజలకు బోధించి సంసార తరుణోపాయమును జూపినాడు.

ఈ భక్తాగ్రగణ్యుడు శ్రీకృష్ణ నామమను కరదీపికచే మానవ హృదయాగారమున జ్ఞానజ్యోతిని వెలిగించి తన కుమారీ రత్నముతో సహా, రాజ్యలక్ష్మిని, శ్రీరంగనాథునకర్పించి యరువది యేడవ యేట మన్నారు కోవెలలో శ్రీరాజగోపాల స్వామి సన్నిధిని పరమపదమొంది ధన్యజీవుడైనాడు. ఈ భక్తాగ్రగణ్యుని భక్తి పారవశ్యము, మృదుమధుర వచో వైఖరి, యనర్గళ కవితా సంపత్తియు నీ ముకుంద మాలయందు, ప్రతి శ్లోకమందును ద్యోతకమగుచుండును. తాను తరించుటయేగాక విశ్వశ్రేయము గోరి, శ్రీకృష్ణ మంత్రమునే జన్మసాఫల్య మంత్రముగ నుపదేశించిన సహృదయుడు నిరంతర భగవన్నామ సంకీర్తనము చేతను, శ్రీరంగక్షేత్ర సందర్శనము చేతను, నవిరళ పురాణ కాలక్షేపముల చేతను తన ప్రజలు జీవిత సార్థక్యము నొందవలెనని యా మహనీయుని ఆశయము.[2]

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - ముకుందమాల పుట : 1
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - ముకుందమాల పుట : 9

శ్రీ మన్నారాయణుని స్వరూప రూపగుణ విభూతులను ప్రతిపాదించెడు ప్రమాణగ్రంథముల యందు గీతలలో భగవద్గీత వలె స్తోత్రములలో "ముకుందమాల" యా సేతు హిమాచలము మహావ్యాప్తి గాంచి సత్సంప్రదాయవర్తనులగు ఆస్తిక మహాశయులచేతను, పరమ విశ్వాసపూర్వకముగా పఠన పాఠనాదులచేత బరిగ్రహింప బడుచుండుట సర్వులకు విదితమే. అర్థ విశేషమును బట్టియేగాక మార్దవము మాధుర్యము మొదలగు వానిం బట్టియు గీర్వాణ భాషా గ్రంథమైనను, ఈ స్తోత్ర రత్నము బహుభాషలలోనికి అనువదింపబడినది.ఆంధ్రభాషయందును దీనిననేకులనేక రీతుల (పద్యములు గాను, పాటలు గాను) ననువదించి యున్నవారు. వారిలో శ్రీ 'కవిశేఖర' గురుజాడ రాఘవశర్మగారొకరు. పరమ భాగవతోత్తములగు కులశేఖరులెట్లు నిస్స్వార్థముగా సకలచేతనోజ్జీవమునకై గీర్వాణ భాషయందీ స్తోత్రమును రచించిరో పరమ భక్తాగ్రగణ్యులగు శ్రీ శర్మగారును అట్లే సంసారార్ణవపతితులైన యస్మదాదులు గూడ సుఖముగా దరించు నట్లీయాంధ్రీకరణమును గావించియున్నవారని నా యభిప్రాయము" అని ముకుందమాలకు ఆశీస్సుల నందించిన శతావధాని సంపన్ముడుంబ సింగరాచార్యులు పేర్కొన్నారు.[1]

ముకుందమాలకు ఆశీస్సులందించిన శతావధాని శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారు, " దీనిని చాలమంది తెలుగున కనువదించిరి. ఆయనువాదకులలో శ్రీ గురుజాడ వీరరాఘవ శర్మగారొకరు. వీరి యనువాదము చాలా భాగము నేను వింటిని.నిర్దుష్టముగను, ప్రసాదగుణోపేతముగను, ధారాళముగను, మూలానుసరణముగను నున్నదనుటకు సందియములేదు. ఇది సూత్రప్రాయమగు నా యభిప్రాయము." అని పేర్కొనియుండిరి.[2]

ముకుందమాలకు "అభినందనము"తెలియజేయుచు శ్రీగడియారం వెంకట శేష శాస్త్రి గారు, "ఆయన హృదయమెంత విశుద్ధమో, రచనయంత ప్రబుధము.సహజము సరళము. అనువాదమే యైనను ముకుందమాల స్వతంత్ర రచనకేమాత్రము దీసిపోదు. ఆయన్నకిది తమ్ముడు వలెనన్ని విధముల నందగించినది" అని పేర్కొనియుండిరి.[3]

ఆంధ్రీకరణము మృదుమధుర పద భూయిష్ఠమై గంభీరార్థ గర్భితమై మూల గ్రంథమునకు ఛాయవలెనొప్పును. నిర్దోషమును, నిఖిల సంపన్నమునై "మూలగ్రంథములోని సర్వవిశేషములను వీరు

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - ముకుందమాల పుట : 3
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - ముకుందమాల పుట : 4
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - ముకుందమాల అభినందనము పుట : 5

బహు శ్రద్ధా విశ్వాసములతోఁబరిశోధించి గ్రహించియున్న వా" రని నిరూపించుచున్నయది.

సకల శాస్త్రవేత్తలైన శ్రీ కులశేఖరులేదేనొక యభిప్రాయముతో గాక, యూరక ప్రయోగింపరను విశ్వాసముతో మూలగ్రంథములోని ప్రతి నామమును మార్పు గావింపక ఒక్కొక్కటియు విడువక వీరును తమ యాంధ్రీకరణమందు గూర్చి యున్నవారు.[1] అని ఆశీస్సులనందించుచు శతావధాని సంపన్ముడుంబ సింగరాచార్యులు తెలియజేసిరి.

భావమును వ్యక్తీకరించునపుడు ఒక చిన్న శ్లోకమును పెద్ద పద్యము గాను పెద్ద శ్లోకమును చిన్న పద్యము గాను అనువదించుటచే వీరికి తమ రచనయందెంత స్వాధీనత కలదో స్పష్టమగుచున్నది.

**శ్లో॥ "శ్రీ వల్లభేతి వరదేతి దయా పరేతి**
**భక్త ప్రియేతి భవలుంఠన కోవిదేతి**
**నాథేతి నాగ శయనేతి జగన్నివాసే**
**త్యాలాపనం ప్రతి పదం కురుమే ముకుంద".[2]** ముకుందమాల 1వ శ్లోకము

అను శ్లోక భావమును ఒక కంద పద్యములో నిమిడ్చిరి.

**కం॥ "శ్రీ వల్లభ! భవలుంఠన**
**కోవిద! భక్తప్రియా! ముకుందా! త్రైలో**
**క్యావాస! దయాపర! నా**
**ధా! వరదా! నాగశయన! యనియననిమ్మా!"**

**శ్లో॥ "దివివా భువివా మమాస్తువాసో**
**నరకేవా నరకాంతక! ప్రకామమ్**
**అవధీరిత శారదార విందౌ**
**చరణౌ తే మరణే ఽపి చింతయామి".[3]** ముకుందమాల 6వ శ్లోకము

అను చిన్న శ్లోకమును చంపకమాలలో విపులీకరించిరి.

1. శ్రీ సంపన్ముడుంబ సింగరాచార్యులు ఆశీస్సులు శ్రీ గురుజాడ రాఘవశర్మ - ముకుందమాల పుట : 2
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - ముకుందమాల పుట : 2
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - ముకుందమాల పుట : 5

**"తమదయ! నాకిఁకన్ దివిజధామ నివాసమొ నారక ప్రవా**
**సమొ, నరలోక వాసమొ యొసంగిన మిమ్మెటు రట్టుసేయునం**
**తిమ సమయాన (గూడ నవధీరిత సుందర శారదారవిం**
**దములగు మీ పదమ్ములె సదా నరకాంతక! సంస్మరించెదన్"**

**"జిహ్వేకీర్తయకేశవం; మురరింపుం చేతో! భజ; శ్రీధరం**
**పాణి ద్వంద్వ ! సమర్చయా ౨ చ్యుత కథా శ్రోత్రద్వయ ! త్వం**
**కృష్ణం లోకయ లోచన ద్వయ! హరేర్గచ్ఛాంఘ్రియుగ్మా2లయం**
**జిఘ్రఘ్రాణ ! ముకుంద పాదతులసీం; మూర్ధ! న్నమాధోక్షజమ్."[1]** ముకుందమాల 16వ శ్లోకము

**"మురవైరిన్ భజియింపు, కేశవుని సంబోధింపు; మర్చింపు శ్రీ**
**ధరు, భక్తిన్ విను మచ్యుతున్ బలుకు గాథల్, కృ ష్ణు వీక్షింపు మొం**
**టరిగా ; మ్రొక్కు మధోక్షజున్ శిరముతోడన్, శ్రీహరిన్ గొల్చుమం**
**దిరమున్ జేరు, ముకుంద పాద తులసిన్ వేవాసనల్ చూడుమా!"[2]** పద్యము 16

ఈ విధముగా తెనిగించినను తృప్తిచెందక పాఠాంతరము కూడా వ్రాసిరి.

**"కేశవు గూరిచి కీర్తింపుమో జిహ్వ! మురహరునికఁభజింపుమమనంబ**
**చేదోయి సంధిల్లి శ్రీధరు (బూజింపు, శ్రోత్రముల్ వినుఁడియచ్యుత కథాళి**
**లోచనముల్ సమాలోకింపుఁడీ! కృష్ణ, హరినిలయము జేరుమా! పదమ్మ!**
**శ్రీముకుందుని పదశ్రీ తులసీ దివ్యవాసనల్ నాసికా! పఱచి చూడు"**

**"భక్తిచే నధోక్షజు దివ్యపాద సరసి**
**జములకున్ శిరమా! నమస్కారమిడుమ!**
**హరియొసంగు శరీరమా యథిపుసేవ**
**కొఱకు నర్పించుటది మేలుకొఱకు గాదె!"[3]** పద్యము 16

అని ఒక సీస పద్యములో తనివితీర అనువదించిరి. ఈ విధముగా అనువదించునప్పుడు అర్థము చెడిపోకుండ మూలమునకు భంగము కలుగకుండ జాగ్రత్తపడిరి. ముకుందమాల అనువాదమునకు అభినందనలు తెలియ జేయుచు శ్రీ మిన్నికంటి గురునాధశర్మ గారు ఈ విధముగా తెలియజేసిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - ముకుందమాల పుట : 11
2. పైదే
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - ముకుందమాల పుట : 12

"జిహ్వేకీర్తయ వంటి వృత్తమును యతి ప్రాసలు గల యావృత్తములోనే వ్రాయుట యెవ్వరికైన మిక్కిలి కష్టము. కుదించి వ్రాయవచ్చుగాని యప్పుడు దాని యందలి యందముమందమగును. కావుననే వీరు కుదించిన బస్తాను చేయక ధారాళముగా వ్రాసిరి. పెద్దపొట్టగల సీసమెత్తుకొనిరి. పొట్టనింపిరి. కాని యించుక సందుంచుకొని "హరి యొసంగు శరీర" "మాతనికే యిచ్చుట మేలుగదా!" యని యందలి గుట్టును బైటబెట్టి తృప్తిపడిరి".[1]

**"హే గోపాలక! హే కృపాజలనిధే! హే సింధు కన్యాపతే!**
**హే కంసాంతక! హే గజేంద్ర కరుణాపారీణ! హే మాధవా!**
**హే రామానుజ! హే జగత్త్రయగురో! హే పుండరీకాక్ష! మాం**
**హే గోపీజననాథ! పాలయపరం జానామి! నత్వాం వినా!"[2]** ముకుందమాల 21వ శ్లోకము

అను శ్లోకమును

**"ఓ గోపాలక! యో కృపాజలనిధీ! యో సింధు కన్యాపతీ!**
**యోగిధ్యేయ! గజేంద్ర రక్ష! వరదా! యో పుండరీకాక్ష! రా**
**రా! గోపీ జననాథ! కంసహార! శ్రీరామానుజా! దిక్కు నీ**
**వేగా! నన్గనుమీ! జగత్రయ గురూ! కృష్ణా హరీ! మాధవా!"** ముకుందమాల 21వపద్యము

అని "పరం జానామి నత్వాంవినా" అను దానిని "నీవే" అను సేవార్థముతో గతార్థముంజేసిరి.

తెలుగులో యతిప్రాసలు, కవి వ్యుత్పత్తిని, ధారను, శబ్దశుద్ధిని యొక్క నిమిషములో బట్టి ఇచ్చును. వీరి అన్ని పద్యములు వీనికి లక్ష్యములే. ఇందులకొక ఉదాహరణ.

**"నాస్థాధర్మే నవసునిచయే నైవ కామోపభోగే**
**యద్యద్భవ్యం భవతు భగవన్ ! పూర్వకర్మాను రూపమ్**
**ఏతత్ప్రార్థ్యం మమబహుమతం జన్మజన్మాంతరేపి**
**త్వత్పాదాం భోరుహ యుగగతా నిశ్చలా భక్తిరస్తు."[3]** ముకుందమాల 5వ శ్లోకము

అను శ్లోకమును ఈ విధముగా తెనిగించిరి.

---

1. శ్రీ వేదాంతపారీణ శ్రీ మిన్నికంటి గురునాథ శర్మ అభిప్రాయము ముకుందమాల పుట : 6
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - ముకుందమాల పుట : 15
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - ముకుందమాల పుట : 4

"క్రమమౌ ధర్మము, కాంచనాది వసువో, కామోపభోగమ్మొ । లే
శముఁగోరన్, లభియించు దామవియె నిచ్చల్ పూర్వకర్మానులే
పముగన్, గాఁ గలకార్యముల్, మిగులనే బ్రార్థింతునా జన్మజ
న్మములన్, నిశ్చలభక్తిగోరి, భగవన్ ! త్వత్పాద పద్మమ్ములన్" ముకుందమాల 5వ పద్యము

అర్థసిద్ధి శబ్దశుద్ధితో సంబద్ధము. ధార తైల ధారయేగాక పంచదార పాకము ద్రాక్షాపాకము సైతము చేయును. రసము జాలువారుచుండును.

శ్లో॥ "కృష్ణ! త్వదీయ పదపంకజ పంజరాన్త
మద్యైవమే విశతు మానస రాజహంసః
ప్రాణ ప్రయాణ సమయే కఫవాత పిత్తైః
కంఠావరోధన విధౌ స్మరణం కుతస్తే" [1] ముకుందమాల 7వ శ్లోకము

"మానవ జీవితము బుద్బుదప్రాయము కఫవాత పిత్తములు కంఠములో నడ్డుపడినప్పుడు అవసాన కాలమందు శ్రీహరిస్మరణ కలుగునో కలుగదో యిపుడే స్మరింపుడనియు, సంసార సాగరము దాటుటకు విష్ణువనే నావకంటే గత్యంతరము లేదనియు, నందుచే సత్సాంగత్యము, సత్కథా శ్రవణము, దుర్జన పరిత్యాగము. "అంతే నారాయణ స్మృతిః" యనునట్టి స్థితిని పొందుటకు శ్రీహరి పాదారవిందము లందలి నిరంతరస్మరణ, మొదలగునవి భక్తి భూమికలుగా వర్ణించినాడు.[2]

శ్రీశర్మగారి అనువాదము నిర్దుష్టముగాను, ప్రసాదగుణోపేతముగాను, ధారాళముగాను మూలానుసరణముగాను ఉన్నది అనుటలో సందేహములేదు. దీనికొక ఉదాహరణ శ్రీకులశేఖరులు,

శ్లో॥ "ధ్యాయంతియే విష్ణుమనంత మవ్యయం
హృత్పద్మ మధ్యే సతతం వ్యవస్థితమ్
సమాహితానాం సతతా ఉభయ ప్రదం
తేయాంతి సిద్ధిం పరమాంచ వైష్ణవీమ్."[3] ముకుందమాల 38వ శ్లోకము

అని చెప్పిన శ్లోకమును వీరు ఈ విధముగా తెనిగించిరి.

---

1, 2 శ్రీ గురుజాడ రాఘవశర్మ - ముకుందమాల పుట : 5

3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - ముకుందమాల పుట : 25

**"పదిలముగా మనమ్ము బిగఁబట్టి సునిశ్చల భక్తి నెవ్వఁడేన్**
**హృదయ సరోజ మధ్య కృత నిత్య నివాసు, ననంతు, నవ్యయున్**
**ముదమున ( గొల్చు నయ్యనఘు ( బ్రోచెడి విష్ణుడు సంతతాభయ**
**ప్రదుఁడయి నిత్య నవ్య సుఖ వైష్ణవ సత్పదపీఠి (జేర్చుచున్"** ముకుందమాల38వ పద్యము

ఈ విధముగా వీరు సంస్కృతములో భాష, భావం, శైలి అతి మనోహరంగా ఉండే కులశేఖరాళ్వారుల ముకుందమాలను మధురంగా ఆంధ్రీకరించారు. పద్యాలు కూడా అర్థంచేసికోలేని వారి కోసం తాత్పర్యాలు కూడా వ్రాశారు.

శ్రీ శర్మగారి శతజయంత్యుత్సవ సంచికలో శ్రీ కూచిభట్ల చంద్రశేఖరశర్మగారు వీరిని గూర్చి వ్రాస్తూ, "శర్మగారు కృష్ణభక్తులు. ఉపాసకులున్ను. మాట్లాడే సమయంలో కూడా ఎక్కువగా కృష్ణనామ స్మరణం చేస్తుండేవారు. అందుకనే గావును "ముకుందమాల"ను తెలుగు పద్యాల్లో మధురంగా అనువదించి తెలుగువారికి విందుచేశారు"[1] అని కీర్తించారు.

కీర్తిశేషులు పువ్వాడ శేషగిరిరావుగారి కుమారులైన శ్రీ పువ్వాడ తిక్కనసోమయాజిగారు కూడా వీరి శత జయంత్యుత్సవ సంచికకు వ్యాసం వ్రాస్తూ, "ముకుందమాలను కూడా శ్రీ రాఘవశర్మగారు పద్యాలలో అతి రమ్యంగాను, రసభరితంగాను అనువదించారు. అది కూడ శ్రీకృష్ణ భక్తి తత్త్వ ప్రతిపాదకమే" కవిగా వీరు ధన్యులైనారని చెప్పవచ్చు. ఎందుకంటే ఏది వ్రాసినా శ్రీ కృష్ణపరమాత్మని పాదారవింద సమర్చనా పుష్పమై భక్తిరస పుష్కలమై పాఠకులకు పారమార్థిక మార్గదర్శకమై చెలువారింది" అని వ్రాసిరి[2].

శ్రీ శర్మగారు కూడా "ముకుందమాల" ప్రస్తావనలో ఈ గ్రంథమునందు ప్రదిపాదింపబడిన భక్తి ప్రబోధ ప్రభావమే నన్నీ ప్రయత్నమునకు బ్రేరేచినది. ముకుందమాలాను వాదములు పలురూపములుగ ప్రచారములో నున్నను ఎవతి పుష్ప సమర్పణము వలన వారికే ఫలము గదా! శ్రీ రామాయణ కర్తలెందరు లేరు? యెవరికి వారే భగవత్పరముగా పుష్పములర్పించి తరింతురని నా యాశయము. ప్రధానము హృదయ పుష్పము[3] (పద్మము).

1,2 పువ్వాడ తిక్కన సోమయాజి "గురుజాడ వారిని గుఱించి" శ్రీ గురుజాడ రాఘవశర్మ శతజయంత్యుత్సవ సంచిక, పుట 32
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - ముకుందమాల పుట : 11

**"కమలానాథా ! మదీయ మానసము లోకంబెల్ల శోధించె, భ**
**క్తి మరందమ్ము స్రవించు హృద్వనజమున్ దీవ్యద్భవత్పాదప**
**ద్మములం దర్పణ సేయుదున్ గొను భవత్సాన్నిధ్యమున్జేరి, జ**
**న్మము సాఫల్యము నొందు పూజయిదె, కృష్ణా! వాసుదేవ ప్రభూ !"[1]**

వాసుదేవనామ శతకం 10వ పద్యం

అని జన్మ సార్ధక్యము నొందు పూజ యిదె అనే భావమును స్పష్ట పరచిరి.

## 4.2 శ్రీసూక్తమ్: -

శ్రీ సూక్తమును గూర్చి మనకు ప్రస్తావన వచ్చినప్పుడు ముందుగా అగ్నిహోత్రుని స్మరించవలసిన ఆవశ్యకత గలదు. కారణము అగ్ని మనకు ప్రత్యక్ష దైవము. దేవతలందరి స్వరూపము అగ్నిహోత్రుడు గావున వివాహాది శుభకార్యములందు ప్రత్యక్షసాక్షీభూతుడుగా అగ్ని మనకు దర్శనమిచ్చుచున్నాడు. దేవతలందరు అగ్నిహోత్రుడే ముఖముగా కలవారు కావుననే 'అగ్ని ముఖావైదేవాః' అని అందురు. అనగా మనము ఏ దేవత పేరుతో మంత్రము నుచ్చరించి హోమద్రవ్యమును అగ్ని హోత్రములో వేయుదుమో ఆ ద్రవ్యమునా దేవతకు అగ్నిహోత్రుడందించును. కావున అగ్నిహోత్రుని మనము ప్రసన్నుని చేసికొనినచో అతడు లక్ష్మీదేవికి మనయందనుగ్రహము కలుగునట్లుగా చేయును. కావున ఎవరైతే శ్రీ సూక్తము నందలి పదునైదు ఋక్కులతో ప్రతిరోజు ఆవునేతితో హోమము చేయుదురో వారికి లక్ష్మీదేవి సకల సంపదలనొసంగును. కావున సంపదలు కోరువారు ఈ విధముగా హోమము చేయవలెనని చెప్పబడియున్నది. లక్ష్మీదేవి అనుగ్రహము నాయందు కల్గునట్లు చేయుమని అగ్నిని ప్రార్ధించుటయే శ్రీ సూక్తము నందలి ముఖ్యోద్దేశ్యము[2].

శ్రీ గురుజాడ రాఘవశర్మగారు శ్రీ విశ్వావసు ఫాల్గుణ శుద్ధ శుక్రస్థిరవారములు అనగా 25-2-1966, 26-2-1966సం॥లో తమ బృందావనములో శ్రీ సూక్తమునందలి ఋక్కులను చక్కని తేటతెనుగు పద్యములలో అనువదించిరి.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవనామ శతకం పుట 16
2. శ్రీ శివలెంక ఉమామహేశ్వర అయ్యవారు సువాసినీ పూజ పుట 3

**1. ఋక్॥ హిరణ్యవర్ణాంహరిణీం। సువర్ణరజతస్రజాం।**

**చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం। జాతవేదోమ ఆవహ॥**

ఓ అగ్నిదేవా! చంద్రుని వలె పదియారు వన్నెల పసిడి ఛాయలతో వెలుగొందుచున్నట్టిది, సువర్ణమూర్తియునైన లక్ష్మీదేవి నన్ను అనుగ్రహించునట్లుగా చేయుము. మఱియు ఈ తల్లి సువర్ణ రజిత మాలికలతో సర్వేంద్రియములకు చల్లదనము కల్పించుచున్నది. ఇచ్చట బంగారు రజిత స్రక్కులు అని చెప్పుటచేత శుభాక్షరములతో కూడినది. రజిత స్రక్కులనుటచేత చంద్రుని వలె తెల్లనైనవి స్వచ్ఛమైనవి. అనగా సాత్త్వికగుణ ప్రధానములైన మంత్రమాలికలు అని అర్థము స్ఫురించును. ఈ భావమును శ్రీ శర్మగారు,

**చ॥ "మిలమిల కాంతులన్ మెఱయు మేలిమి బంగరు మేన ( బచ్చనై**
**జెలువము మేలి వెన్నెలలు జిందెడు చల్లని మోము దమ్మియున్**
**వెలయగళమ్మునన్ బసిడివెండియ పూల పసందు మాలలున్**
**గలుగు సువర్ణమూర్తియగు! కల్మిల తల్లిని లచ్చి (గొల్చెదన్"[1]**

సంపదలకు నెలవైన లక్ష్మీదేవి శరీరపు కాంతి, మిలమిల మెఱయు బంగారపు వన్నెయట. ఇక ముఖము స్వచ్ఛమైన వెన్నెల జిందు చల్లని తామరపూవు. ఇక కంఠ సీమ నలంకరించినవి పసిడివెండియ పూల పసందుల మాలలు. ఇవి అన్నియు స్వచ్ఛదనమును, కాంతిని చల్లదనమును ప్రసాదించునవి. కంఠసీమ నలంకరించిన పసిడి వెండియ పూల పసందుల మాలలు సాత్త్వికగుణ ప్రధానమైన మంత్ర మాలికలుగా చెప్పవచ్చును.

**2. ఋక్॥ తాంమ ఆవహ జాతవేదో లక్ష్మీ మనపగా మినీమ్**

**యస్యాం హిరణ్యం విందేయంగా మశ్వం పురుషానహమ్**

ఓ అగ్నిదేవా! ధర్మమార్గమున నడుచు ఆ మహాలక్ష్మి గోవులు, అశ్వములు, సత్సంతానము మొదలగు సంపదలు నాకనుగ్రహించునట్లు చేయుము. అని అర్థము. ఇచ్చట గోవులనగా ఇంద్రియములనియు హిరణ్యమనగా అక్షరజ్ఞానమనియు చెప్పుకొనినచో, ఇంద్రియనిగ్రహము కలిగి న్యాయ మార్గములో లభించెడి సంపదలనిమ్మని ఆ తల్లిని కోరదగియున్నది. సంపద, మామూలు బంగారము గాదు. అక్షరసంపదే నిజమైన

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము పుట : 9

సంపద. కావున అట్టి నిజమైన సంపద కలిగినపుడు మానవుడు సన్మార్గములో ప్రవర్తించునట్లు చేయును. ధనమనే సంపద మానవుని చెడు మార్గములో నడిపించుట కవకాశమున్నదిగాని అక్షర సంపద జ్ఞానమొసగి సన్మార్గగామిని చేయును. దానికి

చ॥ **"నిరుపమ సత్కృపానిలయ నీ కనుసన్న వెలుంగు నిత్యమున్**
**స్థిరతర భూరి సంపదలు ధేనువు లశ్వములున్ సుహృద్వరుల్**
**తఱుగని పుత్రపౌత్రులును తావక పాదములాశ్రయింతునే**
**యరమరజెందనీయక గృహమ్మున నిల్వుమ లక్ష్మినిచ్చలున్"[1]**

ఓతల్లీ! నిత్యము నీవు కరుణా కటాక్షవీక్షణములు కలిగి స్థిరతరమైన గొప్పసంపదలైన ధేనువులు, అశ్వములను, సుహృద్వరులను, తఱుగని పుత్ర పౌత్రులను ప్రసాదింతువు. నీ పాదముల నాశ్రయింతును. ఏ అరమరికలు లేకుండా నాగృహములో నివసింపుము అంటారు.

**3. ఋక్॥ అశ్వపూర్వాం రథమధ్యాం హస్తినాద ప్రబోధినీం**
**శ్రియందేవీముపహ్వయే శ్రీర్మాదేవీ జుషతాం**

లక్ష్మీదేవి మేలుజాతి గుఱ్ఱములతో కూడిన రథముయందు ఆసీనురాలైనట్టిది. ఏనుగుల ఘీంకారములచే మేల్కొలుపబడిన లక్ష్మీదేవి నన్ను అనుగ్రహించుగాక. ఇచ్చట అశ్వములనగా ఇంద్రియములు. రథమనగా మనస్సు. మనస్సు చేత ప్రేరేపింపబడినవై ఇంద్రియములు పనిచేయును. మనస్సు సన్మార్గములో ఆలోచించిన ఇంద్రియములు చేయు పనులు సన్మార్గగామియై ఉండును. అటువంటి మనస్సునందు స్థిరముగాఉన్న దేవి అని అర్థము. ఏనుగు లక్ష్మీప్రదము. దాని ఘీంకారము మంగళనాదము. మంగళఘోషతో ఆ తల్లి ప్రబోధింపబడుచున్నదని అర్థము. దీని భావమును మరింత వైభవముగా వివరించిరి.

మ॥ **"అమితోత్సాహము సత్త్వమున్ గలుగు దివ్యాశ్వమ్ములున్ పూర్వ భా**
**గమునన్ భాసిలి తేరుమధ్యమున శృంగారైక సచ్చిత్ స్వరూ**
**పముగా వెల్గ కరుల్ కరమ్ముల జయ ధ్వానమ్ములన్ జేయ సే**
**వ్యముగున్ నిన్నె సమీప లక్ష్మిగ మదిన్ బ్రార్థింతు న శ్రాంతమున్"[2]**

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము పుట : 9
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము పుట : 10

ఎంతో ఉత్సాహము గలిగిన సత్త్వము గలిగిన దివ్యమైన అశ్వములు పూర్వభాగములో భాసిల్లుచుండగా, రథమధ్యభాగములో శృంగారైక సచ్చిత్ స్వరూపముగా నీవువెలుగుచుండగా ఏనుగులు తమ తొండములచే జయజయ ధ్వానమ్ములు చేయుచుండగా ఎల్లప్పుడు నా మనస్సులో నిన్నే సేవించుచున్నానను భావనతో సమీప లక్ష్మిగా ప్రార్థింతును అంటారు. ఇక్కడ శ్రీ శర్మగారు రథ మధ్యములో ఆసీనురాలైన ఆ తల్లి సత్ చిత్ రూపస్థిత. రథ పూర్వభాగములోనున్నవి దివ్యమైన అశ్వములు. మనస్సనెడి పగ్గములు ఏనుగులు జయజయ ధ్వానములు సేయుచుండగా సమీపలక్ష్మిగా అనగా గజలక్ష్మిగా నిన్ను ప్రార్థింతును అని అర్థము.

**4. ఋక్ కాంసో ఉ స్మితాం హిరణ్య ప్రాకారామార్ద్రా జ్వలంతీం**
**తృప్తాం తర్పయంతీం**
**పద్మేస్థితాంపద్మవర్ణాంతామి హెూపహ్వయే శ్రియం**

కంచువలె తెల్లనైన చిరునగవుతో కూడిన లక్ష్మీదేవి బంగారు ప్రాకారములతో కూడిన మందిర మధ్యము నందుండెడి తల్లి. దయార్ద్రహృదయము కలిగినదియై సువర్ణకాంతులీనుచు భక్తులొనర్చెడి పూజలచేత సంతృప్తి చెందుచు భక్తులకు సకల సంపదలిచ్చి సంతృప్తి బరచుచు పద్మాసనమునందాసీనురాలైన తల్లిని ప్రార్థించుచున్నానని అర్థము. దీనికి శ్రీ శర్మగారు,

**మ॥ "స్థిరపద్మాసనమందు పద్మమయకాంతిన్ వెల్గుచున్ మోమునన్**
**దొరలన్ జిర్నగవుల్ సువర్ణమయకాంతుల్ చుట్టు ప్రాకారమై**
**పరిసేవింపగ(బాలసంద్రపు తడిన్ భాసిల్లి యిష్టార్థముల్**
**సరితీర్పంగల పూర్ణరూపిణి మహాలక్ష్మి కటాక్షింపుమీ!"[1]**

స్థిరమైన పద్మాసనములో పద్మమయమైన కాంతితో వెల్గుచు, మోము నందు చిరునగవులు చిందుచు, సువర్ణమయ కాంతులు చుట్టు ప్రాకారములుగా పరిక్రమించగా, పాల సముద్రపు తడితో భాసిల్లుచుండగా కోరిన కోరికలు తీర్చగల పూర్ణస్వరూపమైన ఓ మహాలక్ష్మీ కటాక్షించుము అంటారు.

ఋక్ నందున్న భావము తగ్గకుండా యథాతథముగా ననువదించిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము పుట : 10

5. ఋక్॥ "చంద్రాం ప్రభాసాం యశసాజ్వలంతీం
శ్రియంలోకే దేవ జుష్టాముదారాం
తాం పద్మినీ మీం శరణమహం ప్రపద్యే ఽ
లక్ష్మీర్మేనశ్యతాం త్వాం వృణే॥"

పండువెన్నెల వలె చల్లని కాంతులతో కూడి లోకములోని ప్రజలందరకు సకల సంపదలనొసగెడి ఔదార్యము కలిగి పద్మమునందాసీనురాలైయున్న ఓ మహాలక్ష్మీ! నేను నిన్ను శరణుగోరుచున్నాను. నీ రాక వలన నాయందలి అలక్ష్మి తొలగిపోవునుగాక! అలక్ష్మి యనగా దారిద్ర్యము. దీనికి వీరు

శా॥ "రాకాపూర్ణ సుధాకరుల్ బలెయశఃప్రాచుర్య కాంతుల్ దిశల్
ప్రాకన్ లోకములున్ మహేంద్రుడును సంభావించి సేవింపఁగా
ఈ కార్యమ్మున బొల్చు పద్మినివి మత్ హృద్పద్మమున్ జేరి వే
పోకార్పంగదె నాదు లేమి జననీ! భోగార్థ సంధాయినీ!"[1]

పౌర్ణమి నాటి పూర్ణ చంద్రునివలె యశస్సు యొక్క కాంతులు దిశలన్ని ప్రాకగా, లోకములన్ని మహేంద్రుడు సంభావించి గౌరవించగా ఈ కారముతో నొప్పు పద్మినివి. నా హృదయ పద్మములో ప్రవేశించి నా దారిద్ర్యమును పోగొట్టుము. నీవు భోగార్థ సంధాయినివి. అని అంటారు.

6. ఋక్ ఆదిత్యవర్ణే తపసో ఽ ధిజాతో వనస్పతి స్తవవృక్షో ఽ థ బిల్వః
తస్యఫలానితపసానుదన్తు మాయా ఽ న్తరాయాశ్చ బాహ్యా అలక్ష్మీః

ఓ మహాలక్ష్మీ! నీ తపోబలమువలన పువ్వులు లేకుండగనే కాయలుకాచు మారేడు చెట్టు జనించినది. దాని ఫలములు నా దారిద్ర్యమును పోగొట్టునుగాక! అని అర్థము. అనగా మారేడు చెట్టు పూలు లేకుండగానే యెట్లు కాయలు కాయుచున్నదో అట్లాగే లక్ష్మీదేవి కారణము లేకుండగనే సకల సంపదల నొసంగును.

మ॥ "లలితానంద ఫలప్రదాయినిగ బిల్వంబుద్భవించెన్ తపః
ఫలమై స్ఫాటిక సూర్యకాంతుల కరాబ్జంబందునన్ నీ కృపా
కలనన్ శ్రీ ఫలముల్ ముదంబొసగుచున్ గామ్యార్థముల్ గూర్చి చిం
తలపెల్లార్చి హరించుగాక బహిరంతర్వ్యాప్త దారిద్ర్యముల్"[2]

1, 2. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము పుట : 10

లలితానందఫల ప్రదాయినిగా మారేడు చెట్టు జనించినది. నీ తపఃఫలమై స్ఫటికమువలె స్వచ్ఛమైన సూర్యకాంతులను ప్రసరించుచు నీ కృపాకలనచే మారేడు ఫలములు ముదమును కలిగించుచు కామ్యార్థముల్ దీర్చి, చింతలనుఁదీర్చి దారిద్ర్యములను హరించునుగాక అంటారు.

**7. ఋక్ ఉపైతుమాం దేవసఖఃకీర్తిశ్చ మణినాసహ**
**ప్రాదుర్భూతో ఽస్మి రాష్ట్రేస్మిన్ కీర్తిమృద్ధింద దా తుమే**

అమ్మా! మహాలక్ష్మీ! పరమేశ్వరుని సఖుడైన కుబేరుడు నన్ను అనుగ్రహించునట్లు చేయుము. నీ దయతో నిండిన రాష్ట్రమునందు నేను జన్మించితిని. నాకు కీర్తిసంపదల నొసగుము. ఇదే భావమును శ్రీ శర్మగారు,

**మ॥ "అలఘు ప్రాభవకీర్తి మండితసుధల్ వ్యాపింపమాణిక్య కాం**
**తులు జిమ్మన్, గృహమందునన్ నవనిధుల్ తూగాడగా నీదు ని**
**స్తులరాజ్యంబున జన్మమెత్తినటు సంతోషింతు నాపై మహో**
**జ్జ్వల కీర్తిన్ సకలార్థ సంపదల నింపన్ వేడెదన్ భార్గవీ."[1]**

ఓ భార్గవీ! అనగా ఓ మహాలక్ష్మీ! అంతులేని కీర్తి సుధలు వ్యాపింపగా మాణిక్య కాంతులు జిమ్ముచుండగా గృహమునందు నవనిధులు నిండగా నీ నిస్తుల రాజ్యములో జన్మమెత్తినట్లు సంతోషింతును. నా పై మహోజ్జ్వలమైన కీర్తిని, సకలార్థ సంపదలను నింపమని వేడుకొనెదను అంటారు.

**8.ఋక్ క్షుత్పిపాసామలాంజ్యేష్ఠామలక్ష్మీం నాశయామ్యహం**
**అభూతి మసమృద్ధించ సర్వాంనిర్ణుదమే గృహాత్**

అమ్మా! ఆకలి, దప్పికలచే కలుషితమైన అలక్ష్మి నాయింట్లో నశించుగాక! నా యింట నాదారిద్ర్యము, అసంతృప్తి లేకుండునట్లు చేయుము తల్లీ! దీనికి వీరు

**మ॥ "అమ్మా! ఆకలిదప్పలాదిగ మనోవ్యాధి స్వరూపంపు పె**
**ద్దమ్మన్ బైటికి బంప జాలెదు మదీయమ్మా గృహమ్మున్ బ్రవే**
**శమ్మున్ జెందు నిమేషమందు మదభీష్టమ్ముల్ సమృద్ధినొగనన్**
**రమ్మా! లేముల బాప మా గృహము నిండన్ సర్వసంపత్తులన్"[2]**

1, 2. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము పుట : 11

అమ్మా! నా యొక్క గృహమునందున్న ఆకలిదప్పులు మొదలైన మనోవ్యాధి స్వరూపాన్నంతటిని బైటికి పంపజాలెదవు. నా అభీష్టము సమృద్ధిగా నెరవేర్చుటకు రమ్ము. మా గృహమునందు లేమిని పోగొట్టి సర్వస్వంపత్తులను కలుగ జేయుటకు రమ్ము.

**9.ఋక్ గంధద్వారాందురాధర్షాం నిత్యపుష్టాం కరీషిణీం**
**ఈశ్వరీగ్ం సర్వభూతానాం తామిహోపహ్వయే శ్రియం**

సువాసనలతో కూడినదియు, అభాగ్యులు దరి జేర శక్యము కానిదియు, శాశ్వతమైన పుష్టిని కలిగించునదియు, సర్వభూతములకు అధిదేవతయునగు లక్ష్మీదేవి నన్ను అనుగ్రహింపవలసినదిగా కోరుచున్నాను. దీనికి శ్రీ శర్మగారు

**"తఱుఁగని పాడి పంటలకు తావు సుగంధము జిమ్ము శ్రీ వసుం**
**ధరవుగ ప్రాణికోటి నిరతమ్ముమనన్ బరిరక్షసేయు యీ**
**శాశ్వరివి యెవారికేని సులభమ్ముగ లొంగని పుణ్యధాత్రివిన్**
**కరము గ్రహించి సౌఖ్యపడగా హరిణీ! కృపనింపు నాపయిన్"[1]**

తఱుగని పాడి పంటలకు నిలయమైనదానివి. సుగంధము జిమ్ము వసుంధరవుగ ప్రాణికోటి ఎల్లప్పుడు జీవించుటకు పరిరక్షజేయు ఈశాశ్వరివి. ఎవ్వరికైన సులభముగా లొంగని పుణ్యధాత్రివి. నన్ను అనుగ్రహించి సౌఖ్యమొందునట్లు ఓ హరిణీ! నాపై దయనింపుము.

**10. ఋక్ మనసఃకామ మాకూతిం వాచస్సత్యమశీమహి**
**పశూనాం రూపమన్నస్య మయిశ్రీశ్శ్రయతాంయశః**

తల్లీ! మనోవాంఛాఫలసిద్ధి, సంకల్ప సిద్ధి, సత్యవాక్కు, సకలసంపదలు, సర్వాధారమైన అన్నము, కీర్తి వీనిని నాకనుగ్రహింపుము. దీనికి వీరు

**మ॥ "కలుగుంగాత మదిన్ శుభేచ్ఛ, శుభసంకల్పమ్ములున్ వాక్కునన్**
**వెలయున్ గావుతసత్యమున్ బశువులున్ మృష్టాన్నముల్ మాగృహ**
**మ్ముల శోభిల్లుత కీర్తిసంపద ధనమ్మున్ ధాన్యముల్ నిండ ని**
**స్తుల భోగమ్ములఁదేలియాడఁగ స్తుతింతున్ నిన్నె శ్రీ భార్గవీ!"[2]**

---

1, 2. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము పుట : 12

ఓ శ్రీభార్గవీ! మనస్సులో శుభవాంఛా ఫలసిద్ధి కలుగుగాక. శుభసంకల్పములు, వాక్కులో సత్యమునే పలుకుట, పశువులు, మృష్టాన్నము, మా గృహములో శోభిల్లునట్లు, కీర్తి, సంపద, ధనము, ధాన్యములు నిండుగా భోగమ్ముల దేలియాడునట్లుగా నిన్నే స్తుతించెదను అంటారు.

**11. ఋక్ కర్దమేన ప్రజాభూతామయి సంభవకర్దమ**
**శ్రియం వాసయమేకులే మాతరం పద్మమాలినీం**

లక్ష్మీపుత్రుడవైన ఓ కర్దమ మహర్షీ! నీవు మమ్ములననుగ్రహించి జగన్మాతయైన మహాలక్ష్మీ మా యింట స్థిరముగా నుండునట్లు చేయుము దేవా! దీనికి శ్రీ శర్మగారు,

**ఉ॥ "ధారుణి యోగ్య పుత్రుని కతమ్మునఁదల్లి సుఖించుఁగీర్తివి**
**స్తారమగున్ సుపుత్రవతి తా కమలాసతి కర్దమున్ గనన్**
**పేరు వహించెనంట కృప నింపుమ కర్దమ పద్మమాలికా**
**ధారిణి లక్ష్మితోడ నిరతమ్ము వసింపుమ మద్గృహమ్మునన్".[1]**

భూమి మీద యోగ్యుడైన పుత్రుని వలన తల్లి సుఖించును. కీర్తి విస్తారమగును. సుపుత్రవతి, కమలాసతి కర్దముని కనగానే పేరు పొందెనట. తల్లీ! నా పై దయ జూపుము. కర్దమ పద్మమాలికలను ధరించి లక్ష్మీదేవితో నా గృహమునందెల్ల కాలము వసింపుము. అని అంటారు.

**12. ఋక్ ఆపస్సృజంతు స్నిగ్ధాని చిక్లీత వసమేగృహే**
**నిచ దేవీం మాతరం శ్రియం వాసయమే గృహే**

లక్ష్మీ పుత్రుడవైన ఓ చిక్లీత మహర్షీ! స్నేహార్ద్రచిత్తుడవై నీవు మా ప్రార్థన నాలకించి మాయింటి యందు సకల శుభములు జరుగునట్లనుగ్రహించి లక్ష్మీదేవి మా యింట స్థిరముగా నుండునట్లొనర్చుము. దీనికి వీరు

**శా॥ "చైతన్యము విరాజిల్లన్ బ్రకృనిచ్చన్ వారుణీ దేవతల్**
**ప్రీతిన్ వీడకనుగ్రహింతురుగ వారిన్ నిల్పు మా యింట చి**
**క్లీతా! క్లేశవిదారి! నీ జనని లక్ష్మీదేవితో నీవునున్**
**చేతో మోదము గొల్ప మా గృహము లక్ష్మీవాసమున్ జేయుమా!"[2]**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము పుట : 12
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము పుట : 13

చైతన్యము విరాజిల్లునట్లు వారుణీదేవతలు ప్రీతితో విడిచి పెట్టక అనుగ్రహింతురు. వాని మా ఇంట నిల్పుము. చిక్లీతా! క్లేశవిదారిణీ! నీ జనని లక్ష్మీదేవితో కలిసి నీవు మనస్సున కానందము కలిగించునట్లుగా మా గృహమును లక్ష్మీవాసముగా చేయుము.

**13. ఋక్** **ఆర్ద్రాం పుష్కరిణీం పుష్టిం పింగళాం పద్మమాలినీం**
**చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదోమ ఆవహ**

ఓ అగ్నిదేవా! స్నేహార్ద్రచిత్తయు కరుణ రసమునకు పవిత్రమైన కోనేరు వలె ఉన్నట్టియు పుష్టిస్వరూపిణియైనట్టియు సకల లోకములను సంతోషపరచ గలిగినదియు, పద్మమాలికలను ధరించినట్టియు, సువర్ణమయి అయిన శ్రీ మహాలక్ష్మి నా యింట నిలకడగా నుండునట్లు చేయుము. దీనికి వీరు,

**చ॥** **"చెలువుగ దిగ్గజమ్ములభిషేకమొనర్పగఁబద్మమాలికల్**
**గళమున సొంపులీనగ జలమ్ముల జారిన పచ్చనైన క్రొ**
**త్తళుకులమేన సుందరత దార్ఢ్యము గల్గియు చంద్రకాంతులన్**
**వెలయు సువర్ణమూర్తినిదె వేడెద మద్గృహ సీమ వర్తిలన్"**

ఏనుగులు ప్రీతితో అభిషేకము చేయుచుండగా పద్మమాలికలు గళమున అందమునివ్వగా, నీటితో జారిన పచ్చనైన క్రొత్తళుకులు శరీరమునకందము కల్గించగా చంద్రకాంతులతో ప్రకాశించు సువర్ణమూర్తిని నా గృహసీమలందు వర్తిల్లమని వేడెదను అంటారు.

**14. ఋక్** **ఆర్ద్రాంయఃకరిణీం యష్టిం సువర్ణాం హేమమాలినీం**
**సూర్యాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదోమ ఆవహ**

ఓ అగ్నిదేవా! దయారసముతో కూడినది బంగారము వంటి శరీరముతో ఒప్పుచున్నదియు, సూర్యబింబము వలె ప్రకాశించునదియు సువర్ణ మాలికలచే నలంకరింపబడినదియు అయిన సువర్ణమయమైన మహాలక్ష్మి మా యింట నెల్లకాలము నివసించునట్లొనర్పుము.

**చ॥** **"వెలయ గళమ్మునందుఁగనువిందుగ ఁబొందగు హేమమాలికల్**
**తళతళ పాలసంద్రపు జలమ్ములలేచు, సువర్ణ దేహకాం**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము పుట : 13

తులపయి, సూర్యకాంతులును దోప, కరమ్మున రమ్యమలయున్
గలుగు సువర్ణమూర్తియనగా జెలువారెడు లక్ష్మిఁగొల్చెదన్."[1]

కంఠసీమ యందు కనువిందు జేయుచు హేమమాలికలు తళతళ పాలసముద్రపు జలమ్ముల లేచు, సువర్ణ దేహకాంతులపై సూర్యకాంతులు ప్రసరింపగా, చేతిలో రుద్రాక్షమాల కలిగి అందమొప్పునట్లుగా నున్న లక్ష్మీదేవిని గొల్చెదను.

**15.ఋక్** **తాంమ ఆవహజాతవేదో లక్ష్మీమనపగామినీం యస్యాం హిరణ్యం**
**ప్రభూతంగావో, దాస్యో ఽ శ్వాన్ విన్దేయం పురుషానహం**

ఏ మహాలక్ష్మి నన్ననుగ్రహించి నా యింట నుండునో నా యింట సకల సంపదలు స్థిరముగా నుండును. ఓ అగ్నిదేవా! అట్టి సన్మార్గ ప్రాప్తురాలైన శ్రీ మహాలక్ష్మి నా యింట స్థిరముగా నుండునట్లు చేయవలసినదిగా కోరుచున్నాను.

**ఉ॥** **"నీ కరుణా కటాక్షములనింపెదగావుత మద్గృహమ్మునన్**
**బ్రాకగ, నశ్వగోగణ ధనమ్ములు, ధాన్యము, పుత్ర సంపదా**
**నీకము, మిత్రులున్ విడువ నీకతిరమ్ముగ, సర్వసౌఖ్యముల్**
**సేకుఱ, సత్కళానిలయ శ్రీ జయలక్ష్మీ! యనుగ్రహింపుమా!"[2]**

నీ కరుణా కటాక్షములతో మద్గృహమ్మున అశ్వగణము, గోగణము, ధనమ్ములు, ధాన్యము, పుత్రసంపద, మిత్రులు వీటిని విడువక స్థిరమైన సర్వసౌఖ్యములు చేకూరునట్లుగా సత్కళలకు నిలయమైన శ్రీ జయలక్ష్మీ! నన్ననుగ్రహింపుము! అని ఈ విధముగా శ్రీ సూక్తము పదునైదు ఋక్కులకు చక్కని భావముతో గూడిన పద్యములలో తెనిగించి లక్ష్మీదేవి అనుగ్రహమునకు పాత్రులైరి. చివరగా ఫలశ్రుతి

**శ్లో॥** **నక్రోధో నచమాత్సర్యం నీలోభోనా ఽ శుభామతిః**
**భవంతి కృత పుణ్యానాం భక్తానాం శ్రీ సూక్తం జపేత్సదా**

అమ్మా! నీ మంత్రజపము చేయు పుణ్యాత్ములకు క్రోధము గాని, మాత్సర్యము గాని, లోభముగాని, పాపబుద్ధిగాని, ఎప్పటికీ కలుగవు, అను భావమును చక్కగా పద్యములో తీర్చిదిద్దిరి.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము పుట : 13
2. పైదే
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము పుట : 14

మ॥ “స్థిరసంకల్పముతో జపించు జపముల్ శ్రీ సూక్తమున్ భక్తిత
త్పరతన్ వారలనింక గ్రోధమును, మాత్సర్యమ్మునున్ లోభముల్
దరియన్‌రావు, మనమ్మునందశుభచింతావృత్తులున్ దోపకే
స్థిరపుణ్యమ్ములభింప నొందెదరు లక్ష్మీ దివ్యసౌభాగ్యముల్.”[1]

స్థిరమైన సంకల్పముతో భక్తితో లక్ష్మీ మంత్రమును జపించువారికి శ్రీ సూక్తము పఠించువారికి క్రోధము, మాత్సర్యము, లోభము దరికి జేరవు. మనస్సునందు అశుభమైన ఆలోచనలు, పనులు తోచవు. స్థిరమైన పుణ్యము లక్ష్మీదివ్య సౌభాగ్యములు నొందెదరు.

ఈ విధముగా శ్రీ గురుజాడ రాఘవ శర్మగారు శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము నావిష్కరించుటయేగాక శ్రీ సూక్తము పదునైదు ఋక్కులకు చక్కని పద్యములు వ్రాసి ఫలశ్రుతి చెప్పి జన్మ చరితార్థము చేసికొనిరి.

## 4.3 శ్రీ గాయత్రీ మంత్రార్థము: -

“వేద ప్రచోదితమే గాయత్రీమంత్రము. వైదిక సాహిత్యమున గాయత్రీ మంత్రమునకు మహోన్నత స్థానముగలదు. దీనినర్థసమేతముగ జపించి యార్య మహర్షులు తరించిరి. గాయత్రీ మంత్ర జపము భారతీయులకు పరంపర సిద్ధము. ఇందాధ్యాత్మిక పరమ రహస్యమిమిడియున్నది. అందువలన పూర్వులు దీనిని మంత్రమని నుడివి యుందురు. “గాయంతం త్రాయతే ఇతి గాయత్రీ” నిత్యము జపించువానిని రక్షించునది కావున దీనికి గాయత్రియని పేరు.ఈ మంత్రము యజుర్వేదమునందలి ముప్పది యాఱవ యధ్యాయమున మూడవ మంత్రము. దీనికి గాయత్రి, సావిత్రి, గురుమంత్రము అని పేర్లు గలవు. గాయత్రీమంత్రము నందు మూడు పాదములు గలవు. దీనిని జపించు తఱిఁగనీసము ముమ్మారు జపింపవలయునని పెద్దలు చెప్పుదురు. ప్రాఁజదువులందు నుడువబడిన ఛందములో గాయత్రీ ఛందమొకటి. ఇందు పాదమున కెనిమిది అక్షరములు, మొత్తము మంత్రమున మూడు పాదములుండును. కావున నీ మంత్రము గాయత్రీ ఛందమున నుడువఁబడుటచే దీనికి గాయత్రీ మంత్రమని పేరువచ్చి యుండవచ్చును. ఈ మంత్రానికి గల రెండవ పేరు సావిత్రి. సవితృ శబ్దమునకు సర్వజగదుత్పాదకుఁడనియు, సర్వైశ్వర్య సంపన్నుఁడనియు నర్థము.సవితృనామ విఖ్యాతుఁడైన పరమాత్మ వర్ణనమిందుఁబూర్తిఁగాగాననగుట నీ మంత్రమునకు సావిత్రియని పేరువచ్చియుండును. ఈ మంత్రమునకధిదేవత సవిత. అందుచే దానిని

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము పుట : 14

సావిత్రియని పిలుచుచున్నారని కొందఱందురు".[1] "దీనికి గల మూఁడవ నామము గురుమంత్రము. జగమునకాది గురువగు పరమేశ్వరుని వర్ణన మిందుఁబరిపూర్ణముగఁజేయ బడి యుండుట వలన దీనికి గురుమంత్రమని పేరు వచ్చియుండును.యజ్ఞోపవీత సంస్కారమున గురువులు తమ యంతేవాసులకీ మంత్రము నుపదేశించుట వలన గురుమంత్రమని దీనికి పేరు వచ్చినదని వైదిక వాఙ్మయవేత్తలు కొందఱందురు.[2]

ఇక మంత్రమనగానేమి? మంత్రమన రహస్యము. జీవ ప్రకృతి పురుషుల రహస్యముతో పాటు సర్వసృష్టి రహస్యమిందు పొందు పఱుపఁబడుటచే వేద ఋక్కులకు మంత్రములని పేరు కలిగినది. జపమనగా "దదర్థభావనమ్" అనగా నర్థమును జింతించుటయగును. వేదాధ్యయన మొనర్చి దాని యర్థము నెఱుగనివాడు స్థాణువువంటి వాఁడు. బరువుమోయు నెద్దువంటివాఁడు. అట్లు గాక యర్థము నెఱుంగువాడు సర్వసుఖముల ననుభవించును. పాపరహితుఁడై నిరతిశయానందము నొందును. కావునఁబ్రణవమును వీడక గాయత్రీ మంత్రార్థము నెఱింగి జపించు వారియాత్మయు మనమునుఁబవిత్రములై స్థైర్యమునుఁబొందును. ప్రణవము గాయత్రీ మంత్రమునకుఁ బ్రాణము.[3]

శ్రీ గురుజాడ రాఘవ శర్మగారు నిరంతరము గాయత్రీ మంత్ర జపము నాచరించుటయే గాక దాని అర్థమును నిశిత పరిశీలన జేసి ఆ భావమును జీర్ణింపజేసికొనినవారు. అందువలననే గాయత్రీ మంత్రమునకు విడివిడిగా పద్యములలో ఆ భావమును మనోహరముగా వివరించిరి. 5-10-1956 సం॥లో శ్రీ గాయత్రీ పీఠం - శంకరమఠం - గొడుగుపేట - బందరులో శ్రీ గాయత్రీ శరత్కాల జయ రాత్ర మహోత్సవముల సందర్భములో ఉపన్యసిస్తూ,

శా॥ **"శ్రేయో దాయకమౌ భవచ్చరణ రాజీవమ్ములర్థింతు తం**
**డ్రీ! యీ జన్మ తరింపనౌపురుషు కీర్తింపంగనౌ నట్టి శ్రీ**
**గాయత్రీ ప్రతిపాద్య వస్తువగు సుజ్ఞానమ్ము నీవే! వరా**
**మ్నాయోపాసిత! సద్గురూత్తముఁడ! కృష్ణాశ్రీజగన్మోహనా!"[4]**

1. ముమ్మన్నేని లక్ష్మీనారాయణ వ్యాఖ్యాత గాయత్రీ మహామంత్రము పుట 5
2. ముమ్మన్నేని లక్ష్మీనారాయణ వ్యాఖ్యాత గాయత్రీ మహామంత్రము పుట 6
3. ముమ్మన్నేని లక్ష్మీనారాయణ వ్యాఖ్యాత గాయత్రీ మహామంత్రము పుట 7
4. శ్రీ గురుజాడ రాఘవ శర్మ వ్రాత ప్రతి

ఓ కృష్ణా! శ్రేయోదాయకమైన నీ చరణ రాజీవమ్ములను నేను జన్మతరింప జేసికొనుటకై శ్రీ గాయత్రీ ప్రతిపాద్య వస్తువైన సుజ్ఞానము నీవే కావున, వేద ప్రతిపాదితమైన సద్గురూత్తముడవు నీవే అను జ్ఞానమును కలుగజేయుము అంటారు.అంతేగాక శ్రీ గాయత్రీ స్వరూపము అవాఙ్మానసగోచరము,అక్షరాత్మకం, తేజోమయాత్మకం, సృష్టిస్థితిలయ స్వరూపకంగా, బ్రాహ్మీ, మహేశ్వరి వైష్ణవిగా ప్రాతర్మధ్యాహ్న సాయంసమయములయందాయా కళలలో ఆయా శక్తులతో ఆయా వివిధ స్వరూపాలతో ప్రకాశించుచున్నది. ఉదయం బ్రాహ్మీ విజ్ఞానదాయినిగా, మధ్యాహ్నము శక్తి సమన్విత మహేశ్వరిగా, సాయంత్రము పుష్టిసమన్విత వైష్ణవిగా ప్రకాశించుచున్నది. ఈ శక్తిత్రయ సమిష్టియే శ్రీ గాయత్రి. ముందు సరస్వతి విద్య - విజ్ఞానము - స్ఫూర్తి - తమోహరము - శారద తరువాత దుర్గశక్తి సర్వశక్తియుతం.

**శ్లో॥ "శివశ్శక్త్యాయుక్తోయది భవతి శక్తఃప్రభవితుం**
**నచేదేవం దేవో నఖలుకుశలః స్పన్దితుమపి,**
**అతస్త్వా మారాధ్యాం హరిహర విరిఞ్చాదిభిరపి**
**ప్రణన్తుం స్తోతుంవా కధమకృత పుణ్యః ప్రభవతి".[1]** సౌందర్యలహరి 1వశ్లో॥

అన్నారు శ్రీ శంకరభగవత్పాదులు.

**శా॥ "సౌందర్యాఖిలమూర్తి! శక్తియుతుఁడై సర్వమ్ముసృష్టింపఁడా**
**నెందే శక్తుండగున్ శివుండటులకాదే నిన్‌గనన్ బోడు, తా**
**స్పందింపందగు శక్తి శ్రీ హరిహర బ్రహ్మాది సేవ్యంబ! యా**
**నందంబొందిస్తుతింప, మ్రొక్కఁగల పుణ్యంబున్నె! నాబోంట్లకున్."**

అది కదలనిది శక్తి సర్వవ్యాపకం. సృష్టిహేతుభూతం. అశక్తులంటాము. అశక్తులు ఎవరుకారు అందరము ఆరాధించేది ఆ శక్తినే.

లక్ష్మీ! మహాలక్ష్మీ, కళా స్వరూపము. ఐశ్వర్యస్వరూపము. అష్టైశ్వర్యప్రదాయిని. భోగ ప్రదాయిని. ఆనందదాయిని. అది జన్మాంతర సుకృతంవల్లగాని అనుగ్రహము కల్గదు.దీపం జ్యోతిఃపరబ్రహ్మ. మహాలక్ష్మీ స్వరూపము. ఇట్టి శక్తిత్రయము యొక్క సమిష్టి గాయత్రి. అట్టి గాయత్రి అక్షరాత్మకం అన్నాము. క్షరం నాశనం. అక్షరం నాశనం లేనిది. శాశ్వతం. సత్‌చిత్ ఆనందస్వరూపం. అట్టి గాయత్రి చతుర్వింశత్యక్షరములుగా

1. శ్రీ శంకరాచార్య విరచిత సౌందర్యలహరి పుట : 3
2. శ్రీ గురుజాడ రాఘవ శర్మ వ్రాతప్రతి

ఉపాసన - త్రిపదగా చతుష్పదగా దీక్షలో. అట్టి చతుర్వింశతి అక్షర గాయత్రి, చతుర్వింశతి అక్షరములు ప్రధానముగా చెప్పినారు. అదిగాక దశపదగా విభజించినారు.తత్, సవితుః, వరేణ్యం, భర్గః, ధియః, నః, ప్రచోదయాత్ అని ఉపన్యసించిరి[1]. వీటికి ఒక్కొక్కదానికి విడివిడిగా పద్యములలో వివరించిరి.

**<u>తత్:</u>** **"తతోవైనిష్పత్తిః సభువిమతిమాన్ పండిత వరః**
**విజానన్ గుహ్యం యో మరణ జీవనయోస్తదఖిలం**
**అనంతే సంసారే విచరత భయాసక్తి రహిత**
**స్తధా నిర్మాణం వైనిజగతి విధీనాంప్రకురుత".**

జీవుని పుట్టుక, గిట్టుటలో గల ఆంతర్యాన్ని అర్థంచేసికోవడానికి ఉపయోగపడేదే తత్. దీని ద్వారా వచ్చే జ్ఞానమే జీవులు సత్క్రమ మార్గములో చరించుటకు ప్రేరేపిస్తుంది.[2]

దీనికి శ్రీ శర్మగారు,

**మ॥** **"స్థలనిర్దేశములేక యెల్లెండల వ్యాప్తంబై, వాఙ్మనం**
**బుల, కింతింతయనంగరానిదయి సంపూర్ణంబునై,సూక్ష్మమై**
**వెలయంగాదగు తత్పదార్థమని, నీవేతత్ స్వరూపస్థితిన్**
**దలపన్, నిల్పనెఱుంగ సేయగదె! కృష్ణా శ్రీ జగన్మోహనా"[3]**

ఓ కృష్ణా! ఇక్కడ ఉంటావు అక్కడ ఉండవు అను మాట లేక అన్నిచోట్ల వ్యాప్తమై యుండువాడవు. వాక్కునకు, మనస్సునకు అందని వాడవు ఇంత అని చెప్పుటకు వీలుకాని వాడవు. సంపూర్ణముగా, సూక్ష్మముగా వెలయు 'తత్' పదార్థమని అది నీవేనని ఆ తత్స్వరూపస్థితిని తలచుకొనుట శక్యమా! ఆ స్థితిని నిల్పి నాకు తెలియునట్లు చేయుమా! అని అంటారు.

**సవితుఃశ్లో॥** **"సవితుస్తు పదం వతనోతిద్రువం**
**మనుజో బలవాన్ సవితేత్ర భవేత్**
**విషయా అనుభూయం పరిస్థితయోవై**
**సదాత్మన్ ఏవగణోదితిసః"**

---

1. శ్రీ గురుజాడ రాఘవ శర్మ వ్రాతప్రతి
2. జయన్తి సుబ్రహ్మణ్యశాస్త్రి సంకలనం యజుర్వేద సంధ్యావందనము పుట : 33
3. పైదే

భావము: - ఈ పదమునకు సవిత్రుడని, అంటే సూర్యుడు అని అర్థము. సూర్యుడంటే వెలుగు. ఈ వెలుగుకు ఆధారభూతమైనదే సవితు. వెలుగంటే జ్ఞానము. మంచిచెడుల శుభాశుభాల తారతమ్యాన్ని తెలుసుకోగల జ్ఞానము. అజ్ఞానాంధకారాన్ని పోగొట్టి జ్ఞానమనే వెలుగులోనికి నడిపిస్తుంది. యుక్తాయుక్తవిచక్షణా జ్ఞానాన్ని కలుగజేస్తుంది. సవితుః అనగా వెలుగును ప్రసాదించేదని భావము.[1]

దీనికి శ్రీ శర్మగారు,

**మ॥ "జగముల్ సర్వము పుట్టునెచ్చట, నెటన్‌సంవృద్ధినొందున్, లయం**
**బగునెత్తావున, నేది కారణమొ యీ యా సర్వలోకాళి, కొ**
**ప్పగు నావస్తువె, సర్వమై, సవితృరూపంబై, ప్రకాశింపఁజే**
**యగ, శోభిల్లు, పరున్ నినున్‌దలతుఁగృష్ణా! శ్రీ జగన్మోహనా".[2]**

ఓ కృష్ణా! ఈ లోకములన్ని ఎక్కడ పుట్టునో, ఎక్కడ వృద్ధిచెందునో, ఎక్కడ లయమగునో, ఏది కారణమగునో ఆ ఈ సర్వలోకములకొప్పగు వస్తువు సర్వము సవితృరూపమై ప్రకాశింపగజేయునో, శోభిల్లఁజేయు నిన్ను దలతును అంటారు. ఇక్కడ సృష్టి స్థితిలయకారుడైన ఆ పరమాత్మ సవితృరూపకముగా వెలుగొందుచున్నాడని అర్థము.

**వరేణ్యం శ్లో॥ "వేణ్యాంచ ప్రకటయతి వ్రేష్ఠత్వమనిశం**
**సదేపశ్యేచ్ఛ్రేష్ఠం మననమపిశ్రేష్ఠస్యవిదధేత్**
**తథాలోకే శ్రేష్ఠం సరళమనసా కర్మచ భజేత్**
**తదిత్థం శ్రేష్ఠత్వం వ్రజతి మనుజఃశోభిత గుణైః"[3]**

భావం: ఉన్నత భావాలను కలుగజేసేది "వరేణ్యం" చూచుటలోను, వినుటలోను, తాకుటలోను అన్ని ఊహలయందును ఉన్నతమైన వాటిని గ్రహించాలనే తపన భావమును కలుగజేస్తుంది.[3]

**మ॥ "పరమార్థంబులె కోరఁదామనుభవింపన్ జేయుచున్ మోక్షత**
**త్పరులన్ వర్ధిలు సర్వలోకములకాధారుండునై, జీవమై**
**పరుఁడై, భూరి వరేణ్యుఁడైసకులమున్ బ్రాపింపఁగా జేయునిన్**
**స్మరియింతున్, ఫలదాతవీవయని, కృష్ణా! శ్రీ జగన్మోహనా!"[4]**

---

1. జయన్తి సుబ్రహ్మణ్యశాస్త్రి సంకలనం యజుర్వేద సంధ్యావందనము పుట : 34
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి
3. జయన్తి సుబ్రహ్మణ్యశాస్త్రి సంకలనం యజుర్వేద సంధ్యావందనము పుట : 34
4. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

ఓ కృష్ణా! నేను పరమార్ధంబులు కోరను. తామే అనుభవింప జేయును. మోక్షతత్పరులగు వారివలన లోకము వర్ధిల్లును. సర్వలోకములకు ఆధారుడవై, జీవమై, పరుడై ఁ భూరి వరేణ్యడవై ప్రాపింపగాఁజేయు ఫలదాతవీవు అని స్మరియింతును అంటారు.

భర్గః : - శ్లో॥ "భర్గో వ్యాహరతి పదం హి నితరాంలోకః సులోకోభవేత్
పాపేపాపవినాశనేత్వ విరతం దత్తావధానో వసేత్
దృష్ట్వాదుష్కృతి దుర్విపాక నిచయంతే భ్యోజజుగుప్సేద్దిచ
తన్నాశాయ విధీయతాంచ సతతం సంఘర్షణే భిస్సహ"

భావము: - ఉత్తిష్ఠ జాగ్రత్త అనే భావాలను కలుగజేస్తుంది. జీవులు తమ జన్మపట్ల జాగరూకులై ప్రవర్తించవలెనని ఉద్భోదిస్తుంది. పాపములు చేయకుండ, పశ్చాత్తాప బుద్ధితో మసలుకోవాలనీ, సద్బుద్ధిని అలవర్చుకోవాలనీ, సదా జాగరూకులై ప్రవర్తించాలనీ హెచ్చరిస్తుంది.

స్వయంప్రకాశుఁడై, ఆనంద స్వరూపుఁడై పొందింప జేయువాడు సద్గురుడు. శివాయగురవేనమః దీనికి శ్రీ శర్మగారు

మ॥ "అకలంకంబగు స్వప్రకాశమున, భూతాంతర్గత జ్యోతియై
సకలమ్మున్ వెలిగించి భాసిలుచు, యీ సర్వమ్ము వ్యాపించి, పా
యక, యజ్ఞాన తమస్సు బోనడచి దివ్యానంద సంపత్ ప్రదా
యకుడౌ, భర్గునినున్ స్మరించెదను, కృష్ణా! శ్రీ జగన్మోహనా!"

ఓ కృష్ణా! శ్రీ జగన్మోహనా! ఎటువంటి కళంకము లేకుండా స్వప్రకాశముతో జీవులందంతర్గత జ్యోతిగా వెలుగుచు సమస్తమును వెలుగునట్లుగా చేసి భాసిల్లుచు, ఈ ప్రపంచము నంతా వ్యాపించి అజ్ఞానమనెడి తమస్సును పోగొట్టునట్లుగా నడచుకొనుచు దివ్యానంద సంపత్ప్రదాయకుడైన భర్గుని నిన్ను స్మరించెదను అంటారు.

దేవస్య: - "దేవస్యేతితి వ్యాకలోత్యమరతాం మర్త్యోపి సంప్రాప్యతే
దేవానా మివశుద్ధ దృష్టి కరుణా త్సేవాప చారాద్భువి
నిస్స్వార్థం పరమార్ధకర్మ కరణాద్దీనాయదానాత్త ధా
బాహ్యా భ్యంతర మస్యదేవ భువనం సంయుజ్యతే చైవహి"

---

1. జయన్తి సుబ్రహ్మణ్యశాస్త్రి సంకలనం యజుర్వేద సంధ్యావందనము పుట : 35
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి
3. జయన్తి సుబ్రహ్మణ్యశాస్త్రి సంకలనం యజుర్వేద సంధ్యావందనము పుట : 36

భావము: - మరణము లేనిదని భావము. మానవులు మంచి గుణములతో మహాత్ములే అవుతారు. దీనికై పలు సత్కర్మలు చేయవలసి ఉంటుంది. పరోపకారత్వము, కపటము లేకుండుట, యితరులకు సేవచేయుట, దానధర్మములనొసంగుట, పెద్దలను గౌరవించుట, ధర్మాధర్మములను తెలిసికొని ప్రవర్తించుట మున్నగు సద్గుణములతో ప్రవర్తించువాడు మరణమును కూడా జయించి అమరుడగును[1].

దీనికి శర్మగారు,

**"పతియున్, సద్గతి నీవెగాక, యొరులెవ్వారీ జగంబందు, శా**
**శ్వతమై, సర్వవికారశూన్యమయి, నాశంబేమియున్ లేక, సం**
**తత తేజస్సుల, సర్వలోకముల, నానందింపగాఁజేయు నిన్**
**సతమర్థించెద, దేవదేవుఁడని, కృష్ణా! శ్రీ జగన్మోహనా!"[2]**

ఓ కృష్ణా! శ్రీ జగన్మోహనా! పతియు, సద్గతియునీవె. ఇతరులెవ్వరు ఈ లోకములో శాశ్వతముగా, సర్వము వికార శూన్యమై, నాశనమేమియు లేకుండా, ఎల్లప్పుడు తేజస్సుతో లోకాలన్నింటిని ఆనందింప జేయు నిన్ను దేవదేవుడవని ఎల్లప్పుడు అర్థించెదను.

అని ఇంతవరకు చెప్పి మిగిలిన వాటిని విరించలేదు. గాయత్రీమంత్రమంతటిని

**"ఓం తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్యధీమహి**
**ధియో యోనఃప్రచోదయాత్"** దీనిని ఒక్క పద్యములో వివరించిరి.

**"ఎది జీవాంతః కరణైక వృత్తుల సదా సృష్టించి, మాయించు, నె**
**య్యది శబ్దప్రతిపాద్యమై, పురుష జీవైక్యాను సంధాయి యో**
**యెది బుద్ధీంద్రియచోదకమ్మునయి తానే సర్వమో, అట్టినిన్**
**మది ధ్యానించెద, సద్వితీయునిగ 'కృష్ణా! శ్రీ జగన్మోహనా!"[3]**

ఓ కృష్ణా! జగన్మోహనా! ఏది ఒక జీవుని అంతఃకరణైక వృత్తులను సృష్టింపచేయుట లయింపజేయుట చేయునో, అనగా జీవులందుండెడి పరమాత్మ స్వరూపము సృష్టిస్థితిలయలు చేయు ఆత్మస్వరూపమో,

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3 పద్యాలు.

ఏది శబ్దప్రతిపాదితమై, జీవాత్మ పరమాత్మలో ఐక్యమునొందించునో ఏది మన బుద్ధిని ప్రచోదితము చేయునో ఇవన్ని చేయు సర్వము నీవే అయిన నిన్ను అద్వితీయునిగ మదిలో ధ్యానించెదను అంటారు. ఇక్కడ జీవాత్మ పరమాత్మ వేరుకాదు. ఇరువురు నొక్కటే అనుట. జీవుడు ఈ శరీరమును చాలించిన తరువాత పరమాత్మలో ఐక్యమునొందించునో భావము జీవైక్యానుసంధానము. జీవునిలో నున్న ఆత్మ - పరమాత్మగనుక మన బుద్ధిని ప్రేరేపించుచున్నాడు. సర్వము తానే అయినవాడు అద్వితీయుడు ఇట్టి అద్వైతభావమును జీర్ణించుకున్నవారు శ్రీ శర్మగారు.

ఇదే సభలో శ్రీ గాయత్రీ ధ్యాన శ్లోకము

**శ్లో॥ "ముక్తావిద్రుమహేమనీల ధవళచ్ఛాయైర్ముఖై స్త్రీక్షణై**
**ర్యుక్తామిన్దునిబద్ధరత్నమకుటాం, తత్త్వార్థవర్ణాత్మికామ్**
**గాయత్రీం వరదా భయాంకుశాకశాం-శుభ్రం కపాలంగదామ్**
**శంఖచక్రమధారవిందయుగళం హస్తైర్వహన్తీం భజే!"**

పైశ్లోకముపై ఈ విధముగా ఉపన్యసించిరి.

"గాయత్రీ ధ్యానశ్లోకమును గురించి చెప్పితే ఈనాడే గాక యింకా యెన్నో రోజులు చెప్పవచ్చు. శ్రీ గాయత్రీ తత్త్వమట్టిది.సకల శక్తి సమన్వితం 1.ఆత్మశక్తి: సంపత్ పరాపరలక్షణము దేవానాం ధామం 2. జీవశక్తి: భ్రాజస్సు 3.మనఃశక్తి: బుద్ధిశక్తి 4. ప్రాణశక్తి: సహస్సు 5. క్రియాశక్తి, క్రియాకలాపశక్తి ఓజస్సు 6. బలమసి విశ్వశక్తి 7. విశ్వాయువు ఓజఃశుక్రస్యకారణం 8. సర్వశక్తి: విజ్ఞానశక్తి 9. సర్వాయుః 10. ఆత్మసదసదాత్మకం. అభిభూః= ఓం

ఇటుల తేజస్సుల ప్రకాశింపఁజేయు సావిత్రిగా, విద్యారూపముగా, జ్ఞానరూపంగా సరస్వతిగా మోక్షస్వరూపంగా, శ్రీః మహాలక్ష్మీగా వ్యష్టిగా ఆధేయము సమిష్టిగా ఆధారముగా ప్రకటగా గుప్తముగానున్న శ్రీ గాయత్రీ తత్త్వం అనిర్వాచ్యముగా నాబోటివానిని ఉద్ధరింపజేసేది మూర్తి. అట్టి మూర్తి ధ్యానం చూద్దాం.

1.ఓజోశక్తి 2.సహశ్శక్తి 3.రోదినీశక్తి బలమసి 4. నాదస్థానం భ్రాజోసి 5. దేవానాంధామం:శక్తిస్థానం 6. విశ్వ (సర్వశక్తి) 7. విశ్వాయుః వ్యాపినీశక్తి 8. సర్వమసి కాలాత్మకము 9. సర్వాయుః పరిపూర్ణము

1. జయన్తి సుబ్రహ్మణ్యశాస్త్రి సంకలనం యజుర్వేద సంధ్యావందనము పుట : 36

1. కిరీటము :   ఇందునిబద్ధ రత్నమకుటాం అమృతాంశుడు రత్నాధి దేవత. మృత్యుంజయత్వము. స్వయంప్రకాశం. ప్రధానము సూర్యుడుగా కలది. చంద్రుడు - ఆనందమయము.

2. తలలు:   చూచేవి - ఊహచేసేవి. జ్ఞానముచే చూచేవి. జీవుడు జ్ఞానయుతుడై, ప్రాణముచేత యింద్రియముల సంబంధం కలిగి యింద్రియములద్వారా, ప్రపంచకము చూచుచున్నాడు.

వ్యక్తి సమిష్టి జీవుడు: ఆదిదేవుడు ఆదిత్యుడు వ్యష్టిసమిష్టి జ్ఞానం - ఆదిత్యం. వ్యష్టి సమిష్టి అధిష్టాత్రి: సావిత్రి ఇంద్రియాత్మకం. దుర్గ: దుర్గాలు, కోటలు, తధీశుడు. మహేశుడు వ్యష్టిసమిష్టి యింద్రియాధిష్ఠాతృదేవత దుర్గః తదధిపతి మహేశః ముక్తః

జ్ఞానమునకు విద్యాశక్తి: తచ్ఛక్తియుతుడు, గణపతి విద్రుమము. సమిష్టి వ్యష్టి ప్రాణాధిష్టాత్రి రాధా ప్రాణశక్తి హేమః హేమం ప్రాణస్వరూపం శక్తి: అంబిక.

వ్యష్టి సమిష్టి సంపదధిష్టాత్రి : లక్ష్మి : తచ్ఛక్తి యుతుడు విష్ణువు. నీలం - సర్వవ్యాపకం.

పంచాయతనం చెప్పవచ్చు. సౌర, శైవ, శాక, గాణాపత్య, వైష్ణవ దర్శనములు త్రీక్షణైః : త్రినేత్రములు కలది. సూర్యచంద్ర అగ్నులు తేజస్స్వరూపము తెలిసికొనేవాళ్ళు.

తత్త్వార్ధ వర్ణాత్మకాం: అక్షరరూపములు, నాశనరహితము, శాశ్వతం మాతృక జననం - మాతృకా స్వరూపం. ఏబది అక్షరములు కలది.

దానిక్రియలు:   హస్తములందలి ఆయుధముల బట్టి క్రియలు జ్ఞేయం

వరదాం:   ధర్మార్థకామమోక్షాలు. అడిగిందల్లా యిచ్చేది.

అభయం:   ఆత్మ వస్తువునకు భిన్నముకానిది. రెండవది లేనిది.

అద్వైతం:   సంస్కృతి నుంచి పుట్టుక నుంచి లేవదీసేది.

హంసః తానే ఐక్య చెప్పబడుచున్నది.

<u>అంకుశః:</u> ఇంద్రియములను మదించిన యేనుగులను, బుద్ధిని నిగ్రహించేది అంకుశమనే అంతరింద్రియ బహిరింద్రియ నిగ్రహము కలిగిస్తుంది.

కశాం: కొరడా చెర్నాకోల. దుష్టసంకల్పాలనే గుఱ్ఱములను తోలే కొరడా.

శుభ్రం - కపాలం: బొచ్చె (సగంకుండ). విశుద్ధజ్ఞానం అనే అన్నము పెట్టె అన్నపూర్ణ. అత్యంతామలక భోజనము తృప్తి.

గదాం: కలిగిన జ్ఞానమును వెనుకకులాగే యింద్రియాలు అనే శత్రువులను భ్రాంతి అనే శత్రువును నాశనం చేసేది. జ్ఞానం విచారణ అనేగద.

శంఖం: భ్రాంతి నశించగానే సాయమయమై భాసించుతుంది. శబ్దం. శబ్ద బ్రహ్మ. నాద బ్రహ్మ సర్వ వాక్యానువర్తి.

చక్రం: స్వప్రకాం - దర్శనయోగ్యం. సుదర్శనం - సంవిత్ స్థానం. దర్శనము. జ్ఞానం శుద్ధ విద్య. దర్శనం, చక్రం. క్రియాహేతువు. పైకిలాగేది. సకల క్రియాపహేత్వము.

అరవింద యుగళం: వికసించిన రెండు శుద్ధ పద్మములు నిష్క్రియలు. ఆనందం - సౌఖ్యం, చిచ్ఛక్తి. చైతన్యం. చైతన్య ప్రతిపాద్యం అయింది. వికారరహితమైన జీవాత్మ - పరమాత్మ గాయత్రి - తరింపజేసేది.

ఇట్టి శ్రీ గాయత్రీ అనుష్ఠానము ఎంత విధియో అంత కష్టము. జ్ఞేయము. ఇదివరకు చెప్పబడిన స్వరూపములో శిరస్సులు ఆయుధములు ప్రతిచోట - ధ్యానధారణలు వేరు. వాటివాటి మంత్రాలు తత్ఫలితాలు వేఱు. అనంతమైన మోక్షము సాయుజ్యవినియోగః అనిచెప్పే గాయత్రి స్వరూపం తెలుసుననుకొనుట కంటె తల్లీ అని నమస్కారం పెట్టగా పెట్టగా కొన్ని జన్మలకు జ్ఞానము యిచ్చునేమో నాబోటి వానికి భక్తితో"[1]. అని తమ ఉపన్యాసమును ముగించిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

## 4.4 శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము: -

“శ్రీ మన్నారాయణుడు సమస్త చరాచర ప్రపంచ నిర్మాత. ఆయన సచ్చిదానంద స్వరూపుడు. సకల కల్యాణ గుణాకారుడు. సమస్త ఫల ప్రదాత, సర్వేశ్వరుడు.

మహాలక్ష్మి ఆయనకు మంగళ స్వరూపిణి. సర్వవ్యాపిని. పురుషకార స్వరూపిణి. అటువంటి లక్ష్మీనారాయణులను ఆరాధించుటకు మన మహర్షులు కర్మ, జ్ఞాన, భక్తి అను మూడు యోగములను సూచించిరి. ప్రపంచమంతయు శ్రీ లక్ష్మీనారాయణ సంకల్పమునకు అధీనమైనదే. చతుర్విధ పురుషార్థపూరితమైనదే. ధర్మార్థకామమోక్షములనెడు చతుర్విధ పురుషార్థములు భగవంతుని చరణారవింద యుగళములను ఆశ్రయించుట వలననే సాధ్యము. భగవదారాధనలో భక్తి మార్గము ముఖ్యమైనది. ఇది మోక్షము పొందు వరకు ఆచరించవలసినదే. దీనికి కర్మ జ్ఞానయోగములు రెండును అంగములు. ఇవి చాలా కాలము అనుష్ఠించిన కాని ఫలము చేకూరదు.

కర్మజ్ఞాన భక్తియోగాదులను ఆచరించలేనివారు, సంసార సముద్రములో కొట్టుమిట్టాడుచు నీవు తప్ప నాకు మరొక గతి లేదు. నీవే నా రక్షకుడివి, నీవే నా ఈ కష్టనష్టాలను పోగొట్టి నాకు తగిన ప్రాప్తమైన సుఖమునీయగలవాడవు. నా సమస్త రక్షణ భారము నీదే ననియు “అన్యథాశరణం నాస్తి, త్వమేవ శరణం మమ” అని సంస్కృత భాషలో చెప్పినట్లుగా,

పోతన్న “నీవే తప్ప ఇతఃపరంబెరుగ” అని చెప్పినట్లుగా శరణాగతి, సర్వసమర్పణ భావంతో ఎవరైనా భగవంతుని ప్రసన్నుని చేసికోవచ్చును. భగవద్దయా విశేషమునకై ఇట్లు అనుష్ఠించుట చాలా ఉత్తమోత్తమమైనది. మోక్షార్థులు ఈ మార్గము ననుష్ఠించుట మిక్కిలి యుక్తము. భగవత్సేవ చేయుట దీనికి ప్రథమ సోపానము”.[1]

మానవ జన్మ ఎత్తిన మనము సర్వసమర్పణ బుద్ధితో ఆ భగవానుని సేవించుట ముఖ్యము. దీనికి మనలోని సత్త్వ రజ స్తమో గుణములను వీడి భగవంతుడు మనలను కాపాడునను ప్రగాఢ విశ్వాసముతో సర్వము అర్పించినపుడు ఆ దేవదేవుని అనుగ్రహము తప్పక లభించును. శ్రీ లక్ష్మీనారాయణుడు గొప్ప ఫలప్రదాత భక్తులకు మోక్షమీయగలడు. దైవతములకే దైవతమైన ఆ దేవదేవుని పట్టమహిషి మనకు

1. శ్రీమాన్ అగ్నిహోత్రం యోగానంద నరసింహాచార్య, శశీభావ వ్యాఖ్యాత శ్రీ స్తుతిః పుట : 10

పునర్జన్మరహితమైన మోక్షఫలమును స్వామి ద్వారా ప్రసాదింపజేయగలదు. “లక్ష్మీం శరణమహంప్రపద్యే.

శ్రీ గురుజాడ రాఘవ శర్మగారు శ్రీ లక్ష్మీజయన్తి సందర్భముగా 13-3-1966 వ సం॥లో “శ్రీ లక్ష్మీదివ్యగుణ వైశిష్ట్యము” అను పేరుతో ఆ మహాలక్ష్మిని ఈ విధముగా స్తుతించిరి.

**“అమ్మా! సకల కళానిల**
**యమ్మా! పాల్కడలిపట్టి! యాశ్రిత జనభా**
**గ్యమ్మా! శ్రీ నారాయణు**
**కొమ్మా! మాయమ్మా లక్ష్మి! కొలచెదనమ్మా!”[1]**

సకల కళలకు నిలయమైన పాల్కడలి పట్టియైన శ్రీ నారాయణుని భార్యయైన లక్ష్మీదేవి ఆశ్రితజన భాగ్యము. అట్టి ఓ మహాలక్ష్మీ!

శా॥ **“శ్రీ కల్యాణమయ స్వరూపిణి! జగచ్ఛ్రేయోభి సంవర్ధినీ!**
**లోకారాధిత దివ్య చిన్మయ కళల్ దూగాడు సమ్మోహితా**
**స్తోకానందరస స్వరూపిణి! జనస్తోత్ర ప్రమోదాత్త శీ**
**లా! కారుణ్య విలాస సంపద మహాలక్ష్మీ! కటాక్షింపుమీ!”[2]** శ్రీ మహాలక్ష్మీ స్తవము 1వ పద్యము

మహాలక్ష్మి ‘శ్రీ’ స్వరూపమైన శుభప్రదమైన స్వరూపిణి. జగచ్ఛ్రేయస్సు చేకూర్చునది. దివ్యమైన కళలతో విరాజిల్లు లోకారాధిత. అస్తోకానంద రసస్వరూపిణి. జనులచేత స్తోత్రములచేనానంద పరవశు రాలగు కారుణ్య విలాస సంపద స్వరూపమైనది. అట్టి ఓ మహాలక్ష్మీ నన్ను అనుగ్రహింపుమని కోరుచున్నారు.

ఓ తల్లీ! నీ కనుగొల్కులందున ప్రశాంతము, ప్రమోదము రంజిల్లును. నీ నవ్వులనెడి కాంతులతో దిక్కులందలి గాఢాంధకారమును పోగొట్టి హాయిని గూర్చెదవు. ఓ సత్కృపావల్లీ! శ్రీ మహాలక్ష్మీ! నేను నీకు నమస్కారము లర్పించెదను.

ఓ మహాలక్ష్మీ! నీ రమ్య ప్రతిభా విలాసము చేత మా దారిద్ర్యాంధతను పోగొట్టి నీ కరుణా కటాక్ష శ్రీలచేత భోగభాగ్యములను ప్రసాదించెదవు. నన్ను కటాక్షింపుమీ! అంటారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీదివ్యగుణ వైశిష్ట్యము 1, 2 పద్యాలు - పుట 3

మహాలక్ష్మి శుభప్రదము, కల్యాణ ప్రదము. కేవలము తన కడగంటి చూపులచేతనే దారిద్ర్యాంధతను పోగొట్టునట. అట్లా ఖ్యాతి గడించిన దానివి గావున "సత్కారుణ్యామృతవైభవాన్విత కటాక్ష శ్రీ బ్రసాదింపమేలౌ!" నా పై కూడ నీ కారుణ్యామృత వైభవ కటాక్షశ్రీలను ప్రసాదించమని కోరుచున్నారు.

భక్తులు శ్రీ మహాలక్ష్మిని,

**"శ్రీశుండంచు, రమాధవుండనుచు, లక్ష్మీకాంతుఁడంచెంతయేన్**
**బ్రాశస్త్యమ్ము వహించె నీ వలన, మా నారాయణుండమ్మరో!**
**లేశమ్మున్ గనకున్న, నీ విల మహా క్లేశమ్ములే కాదె! యే**
**లా! శంకింప, త్వదీయ సత్కృప మహాలక్ష్మీ! మహా భాగ్యముల్."**[1] శ్రీ మహాలక్ష్మీ స్తవము 4వ పద్యము

ఓ మహాలక్ష్మీ! మా నారాయణుడు శ్రీశుడు, రమాధవుడు, లక్ష్మీకాంతుడని నీ వలన ఎంతో ప్రాశస్త్యము వహించెను. నీవు లేశమాత్రముగానైనా చూడకున్న ఇక్కడ అన్ని గొప్ప క్లేశములేగదా! ఇంక సందేహమెందులకు? నీ యొక్క సత్కృపను మహాభాగ్యములను ప్రసాదింపుము అంటారు. లోకములో సహజముగా స్త్రీ పేరు ముందు చెప్పి, పురుషుని పేరు తరువాత చెప్పుట జరుగును. దానిని ఈ విధముగా పార్వతీపరమేశ్వరులు, లక్ష్మీనారాయణులు, చెప్పు దానిని మహాలక్ష్మి వలననే నారాయణునికి ఖ్యాతి గలిగినదిట. శ్రీశుడు అనగా లక్ష్మీదేవి భర్త'రమాధవుడు' లక్ష్మీదేవి భర్త 'లక్ష్మీకాంతుడు' అన్నప్పుడు కూడ లక్ష్మీదేవి భర్త అని ఖ్యాతి గడించినదానవు. అని అంటారు.

శ్రీ మాన్ వేదాంత దేశిక విరచిత శ్రీ స్తుతిః 'శశీ' భావవ్యాఖ్యాత శ్రీమాన్ అగ్నిహోత్రం యోగానంద నరసింహాచార్య ప్రారంభ శ్లోకమునకు వ్యాఖ్యానము వ్రాస్తూ, "ఈ స్తోత్రమున స్తుతింపబడిన దేవతామూర్తి పద్మావతీదేవి. ఆమె సప్తగిరీశుని ప్రియసహచరి. సకల భువన ప్రార్థనాకామధేనువు. నిత్యానపాయిని. ఆమె శ్రీః, లక్ష్మీ,పద్మా, జలధితనయా, రమా, మా, మంగళదేవతా అనెడి అనంత నామరూప విభవ. దేవతలకే ఆదిదేవుడు, పవిత్రములకే పవిత్రమూర్తియైన నారాయణునకే మంగళములు కల్గించు మంగళదేవతయామె. 'అణోరణీయాన్ మహతోమహీయాన్' అని భగవానుని సర్వాంతర్యామిత్వమును సూచించినవి వేదములు. వాచామగోచరమగు అమ్మ ప్రభావమును వేదములు "ఈశ్వరీగ్ంసర్వభూతానాం" అని చెప్పియున్నవి."[2] అని వ్రాసిరి. అట్టి మంగళదేవతయైన లక్ష్మీదేవి స్వరూపము శ్రీకారము. నీదైన శుభమైన శ్రీకారమును

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీదివ్యగుణ వైశిష్ట్యము - పుట 3
2. శ్రీమాన్ అగ్నిహోత్రం యోగానంద నరసింహాచార్య, శశీభావ వ్యాఖ్యాత శ్రీ స్తుతిః పుట : 10

తలంచినంత మాత్రముననే దారిద్ర్యాది పాపౌఘములు తొలగిపోయి స్థిరమైన ఐహిక సుఖములు సంపూర్ణశ్రేయములు చేకూరును గదా! ఓ మహాలక్ష్మీ కటాక్షింపుము. కేవలము ధనము ఒక్కటి ఉన్నంత మాత్రమున అతడు భోగికాడు. అనువైన సర్వభోగములు చేకూరినవాడే సకలాష్టైశ్వర్య సంపన్నుడు. అట్టి ఐశ్వర్యప్రదాయినివి నీవు. వానిచే నీ కరుణా కటాక్ష వీక్షణముల చేత అష్టైశ్వర్యములు పొందినవాడు చల్లగా హాయిని పొందును. ఓ మహాలక్ష్మీ! అట్టి కృపాంకూరములను శ్రీదేవి! అనుగ్రహింపుమా! అంటారు.

శ్రీ మహాలక్ష్మీ ఆవిర్భావము నీవిధముగా స్తుతించుచున్నారు. జన్మించుటతోనే సుకృతములు ఫలించునని చెప్పుదురు. నేటి నీ పుట్టుక కూడ పూర్వజన్మ కృతపుణ్యఫలము.

**"…. …. …. …. …. …. …. …. … … … … … … … … … …**
**…. …. …. …. …. …. …. …. … … … … … …పాలవెల్లువల్**
**పట్టు కులాన ఁబాల్కడలి పట్టి సిరుల్ దొలకాడ ఁ బుట్టి చే**
**పట్టితి శ్రీ హరిన్ యనుగు ఁబట్టిగ… … … … … … … …** "[1] శ్రీ మహాలక్ష్మీ స్తవము 7వ పద్యము

పాలసముద్రములో సిరిసంపదలు తొలకాడ పాలసముద్రుని పుత్రికగ పుట్టితివి. శ్రీహరిని చేపట్టితివి. ఈమె జన్మస్థానము పాలసముద్రము. కనుక దానిని బట్టియే ఈమె వైభవము తెలియుచున్నది. అనుభావమై ఉండును.

లక్ష్మీదేవి పాలసముద్రము నుండి వెలువడిన వైనమును వీరు ప్రత్యక్షముగా దర్శించినట్లుగా ఈ క్రింది పద్యములో వర్ణించిరి.

**"క్రమ్మిన చిమ్మచీకటుల గ్రక్కున ఁ జీల్చి భయమ్ము వాపి లో**
**కమ్ములు కన్నులందెఱచి కన్గొన హాయిని గూర్చి పాలసం**
**ద్రమ్మున నుండి పెల్లుబుకు నాటి త్వదీయ శరీర కాంతి పుం**
**జమ్ములు వెల్లులీనఁగ ప్రసన్న కళానిధి లక్ష్మీ నిన్నెదన్"**[2] శ్రీ లక్ష్మీ స్తవము 8వ పద్యము

అంతటా వ్యాపించిన దట్టమైన చీకట్లను ఒక్కసారి పోగొట్టి, భయమ్ము దీర్చి, లోకములన్ని కన్నులు దెరచి హాయిగా చూస్తుండగా పాలసముద్రము నుండి పెల్లుబుకు ఆనాటి నీ శరీరకాంతి పుంజములు వెల్లులను ప్రసాదింపగా సకలకళానిధియైన లక్ష్మీ! నిన్నుప్రార్థించెదను అంటారు. చల్లని వెన్ను కల్గిన

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీదివ్యగుణ వైశిష్ట్యము 1, 2 పద్యాలు పుట 4

ప్రసన్న హృదయాబ్జవు నీవు. నీ వెంబడి వరములిచ్చు కల్ప వృక్షము, కామధేనువు, ఐరావతము, అశ్వములు, సొబగు దీర్చిన అప్సరసలు వెలువడినాయి. కాని సుకృతము 'లక్ష్మీ' స్వరూపము దాల్చి అవతరించెను. అదృష్టవు నీవు. దేవవ్రాతము సంతసమొందునట్లుగా విద్యుత్ప్రభా సంపదలు తళతళమను కాంతులతో శృంగారముప్పొంగగా మేలైన క్షీరవారాశియందు నీవావిర్భావము నొందితివి. ఓ జగన్మాతా! సుఖోపేత! అట్టి నిన్ను సంభావింతును అంటారు. తల్లీ! జగత్కల్యాణీ! శ్రీ భార్గవీ! నీవు దివ్య శృంగార ప్రౌఢ విలాస రూపిణివి. "ధృతి" ధైర్యవంతురాలవు. పవిత్రరూపిణివి. నీ కృపాకటాక్షములచే సర్వసంపత్కరమై విరాజిల్లు సర్వాభీష్టములు ఫలప్రదంబగును. మాతా! నీవు దారిద్ర్యమును హరించుదానవు గదా!

> **"అవిరళ భక్తలోక హృదయాంతరవర్తిని, దేవమాన్య! భా**
> **ర్గవముని పూజితా! సకలరాజ్య సమర్చిత పాదయుగ్మ రా**
> **ఘువకవిసన్నుతా! సకల కార్య జయప్రద! కార్యాకారిణీ!**
> **ప్రవిమలరూపిణీ! ననుగృపన్ గనుమీ! జయలక్ష్మీ! భార్గవీ!"**[1] శ్రీ మహాలక్ష్మీ స్తవము 12వ పద్యము

నీవు భక్తుల హృదయాలందుండెడిదానవు. దేవతలచేత గౌరవింపబడుదానవు. భార్గవముని పూజితురాలవు. రాఘవుడను కవి చేత సమస్తము పాదపద్మములందర్పణ చేయబడినదానవు. సకల కార్యజయప్రదవు. కార్యాకారిణివి. ప్రవిమల రూపిణివి. అట్టి ఓ జయలక్ష్మీ! భార్గవీ! నన్ను దయతో అనుగ్రహింపుము. మాతా! నిన్ను స్తోత్రము చేయుచున్నాను. గ్రహించుము. సర్వసౌభాగ్యములను కలుగజేయుదానవు. విష్ణుసతివి. విజయముల నొసగు దానవు. భగవతీ! ఆనందమను సంపదచేత వైభవము నొందినదానవు. దివ్యప్రాభవోపేతమైన కీర్తివిరాజన్మణివి. మోహపాశినివి. జగన్మోహినివి. ఓ మహాదేవీ! ఎల్లప్పుడు పుత్రికాపుత్రులను గృహసౌఖ్యము నీ కృపవలన గలుగునని ఎంతవారైనా గుర్తెఱుగరుగదా! సత్కృపతో మా అజ్ఞానమును పోగొట్టుము తల్లీ! నీవు మాయాచ్ఛేదినివి అంటారు. మనుష్యులలో ఉండే అజ్ఞానమును పోగొట్టునది అని అర్థము. ఈ జగత్తంతా మిథ్య. ఇది శాశ్వతముగాదు. ఈ శరీరము ఎప్పటికైనా నశించునది అను జ్ఞానమును కలిగించునది. ఓ తల్లీ! దేహి అని అర్థించువారికి ఈ జన్మలో ఎవ్వరికైన లోటు లేకుండా జరుగదు. సందేహమెందులకు? నీ దయగలవారిపట్ల నోటివెంట 'దేహి' అను పలుకు వినుటనేరమా? అట్లుగాక నిన్నే దాసోహమని శరణు కోరి హాయిగా సుఖమనుభవించెదను. కృపా సముద్రురాలవైన నీ ముఖాబ్జము నందు 'నాస్తి' అను పల్కు వినబడనేరదు. అంతకంటె మించి ఎల్లప్పుడు

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీదివ్యగుణ వైశిష్ట్యము పుట 5

స్వస్థత చేకూఱును. నీవు ప్రసన్న హృదబ్జవు, మంగళాంగవు. అమ్మా! నన్ను పరులపై ఆధారపడి బ్రతకనీయకుమని ప్రార్థనఁజేతును. ఓ తల్లీ! భార్గవీ! నీదయ గలిగిన వారికి కనీసము తినడానికి తిండి, కట్టుకోవటానికి బట్టలకు లోపములేకుండా నీవు సాకుదువట. ఇతరుల దగ్గర చేయి సాచినచో సుస్థిరమైన గొప్ప సంపదలు కలుగును. పరుల దగ్గర నీచముగా చెయ్యిచాచే స్థితిని కలిగించకుండా నన్ను అనుగ్రహింపుము. ఓ తల్లి నీవు కొంచెము కూడా నిర్ణయము తీసికోకుండా అవినీతులకు భయపడక ఏ దుర్ణయ కార్యమందైనను ఉదరము నింపుకొనుటకు తలదూర్చెదరు. నీవు సంపూర్ణ ఫల ప్రదాయినివి. నీ కృప అమూల్యము. సౌవర్ణరుచులు వర్షించే బంగారుతల్లివి. నీవే లక్ష్మివి అంటారు. ఇక్కడ లక్ష్మీదేవి ఆగ్రహ, అనుగ్రహాలు ఎట్లా ఉంటాయో చెప్తున్నారు. ఆమె అనుగ్రహము కలిగినచో మనపై సౌవర్ణరుచులను వర్షింపగలదు. ఆగ్రహము కలిగినచో అవినీతుల బారిన పడి ఆ డబ్బు అనేక దారులు తొక్కించగలదు. నీవు కేవలము వెన్ను విదల్చినంత మాత్రముననే సుధామయ వస్తు సంపదలన్ని ప్రభవించును. శ్రీ మహావిష్ణువు నీ మూర్తి కనుపింపగనే నీ పాణిని గ్రహించెను. నీవు జగద్విమోహినివి గనుక అన్ని చోట్ల వర్ధిల్లుదానవు. తల్లీ! నా విన్నపము నాలకించి నాపై దయననుగ్రహింపుము. ఓ తల్లీ! తరతమ భేదములు లేకుండా అందరికి అందము చందమును బంచిపెట్టు సంపన్న కుటుంబినివి. ఈ భూమిపై ఆపదలోనున్నవారికి సుప్రసన్నవు. విద్వన్నుతవు. వేదసన్నుతవు. కృపాపరిపూర్ణవు. జగత్తు అంటే నీ కంటే వేరేలేదు. మమ్ములననుగ్రహింపుము.

**"వెన్నెల దొంతరల్ దొరలు విస్తృతమౌ చిరునవ్వులన్ సదా**
**వెన్నెలరేనితోడ ప్రభవించిన వెన్నను మించు మేనితో**
**వెన్నెల చిన్నవాని కరపద్మము బట్టుననంగతల్లి వీ**
**వెన్నఁ గృపాప్రసన్నవుగదే! కవిమన్ననగొమ్ము భార్గవీ!"**[1] శ్రీ మహాలక్ష్మీ స్తవము 21వ పద్యము

ఓ భార్గవీ! విస్తృతమైన నీ చిరునవ్వులందు ఎల్లప్పుడు వెన్నెల దొంతరలు దొరలుచుండును. నీవు చంద్రుని తోడపుట్టినదానవు. వెన్నను మించు మేనిగల దానవు. వన్నెల చిన్నవాడైన మన్మథుని పద్మములవంటి కరములను పట్టుకొను ననంగతల్లివి. నీవు కృపాప్రసన్నవు. ఈ కవియైన రాఘవుని మన్ననగొమ్ము అని అంటారు. వెన్నెల ఎంత స్వచ్ఛముగా ఉండునో ఆ తల్లి చిరునవ్వు అంత స్వచ్ఛముగా ఉన్నది అనుట చిరునవ్వులను వెన్నెలతో బోల్చుట కవి సమయము. ఆమె కృపా ప్రసన్న గావున వెన్నెలతో పోల్చిచెప్పిరి.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీదివ్యగుణ వైశిష్ట్యము పుట 6

మహేంద్రుడు భక్తితో దివ్యసింహాసనమునర్పించెనట. దిగ్గజములు పూర్ణకుంభములతో నభిషేకముచేయగా వసంతుడు సంతోషముతో ఫలపుష్పములనర్పించెనట. వేదవిద్వత్కోటి భక్తి పూర్వకముగా స్వస్తి వాచకములు పలుకగా గంధర్వ కాంతలు పరవశులై మంగళగానములు పాడగా, భూదేవి భక్తితో అభిషేకయోగ్యమైన ఓషధులనర్పించెనట. గోగణమంతయు సంతోషముప్పొంగగా పొదుగుల గవ్యములను వర్షించినాయి. పాలకడలి రాజు పట్టుచీరలు ఇవ్వగా వరుణుడు మాల్యములనుగూర్చగా, విశ్వకర్మ వివిధ భూషణములు ఇవ్వగా శారదరమ్యమైన హారములివ్వగా పద్మభవుడు ప్రేమతో పద్మములివ్వగా నాగగణము మణికుండలములు పెట్టగా, అందమైన సుందరముఖారవింద మొప్పునట్లు సిగ్గులొలుకుచుండగా, చిరునవ్వులు చిందులాడగా క్రొత్త చెలువములతో కులుకుచు బంగారు మేనుతో తల్లి చేతితో పూదండ పట్టుకొని హరికంఠ సీమనలంకరించెను. అని లక్ష్మీనారాయణుల వివాహ ఘట్టమును వర్ణించిరి.

బ్రహ్మతో చేయు సంభాషణల యందు వాక్కునిండా అమృతమును వర్షించునట. జగద్వల్లభుని పాణిని గ్రహించు సమయములో ఆమె మనస్సు ఉప్పొంగి పరవశించునట. సర్వజ్ఞమూర్తియైన శ్రీమన్నారాయణునితో కలిసియుండుటయే జన్మధన్యమని తలంచెదవు. నీ వాలు చూపులయందు దివ్యనిధులు దొరలి పొంగి పొర్లుతున్నాయా అనునట్లుండును నీ చూపుల తూపులు. ఇక ముద్దులొల్కెడి చిఱునవ్వుమోము చూచినంతనె శ్రమను పోగొట్టుకున్నామను సంతోషము కలుగును. ఓమాయమ్మ! అమృతపదమగు నీ మృదు పదము సోకిన ఎట్టి గృహమైన ధన్యముగదా! అంటారు. మనోహరమైన వర్ణన. ఆమె శ్రీ లక్ష్మీదేవి సర్వాలంకార భూషితురాలు. ఎవరెవరు ఏ ఏ ఆభరణములిస్తే ధరిస్తుందో వర్ణించి - ఇక ఆమె వాక్కు నిండా అమృతము, ఆమె హృదయమునిండా నారాయణుడు, వాలుచూపులయందు దివ్యనిధులు వర్షించుచు చిఱునవ్వుతో చిందులు వైచుచు మృదువైన ఆమె పాదములు సోకిన ఎటువంటి గృహమైన అమృతపదమేనట.

లోకములో సాధారణముగా శుచిశుభ్రము ఉన్నచోట లక్ష్మీప్రదముగా ఉంది అంటారు. ఇల్లు శుభ్రముగా అలికి ముగ్గులు పెట్టినచోట లక్ష్మి తాండవిస్తోంది అంటారు. అట్లాగే భార్యాభర్తలు సంతోషముగా కలకాలము సుఖముగా ఉండాలని పార్వతీపరమేశ్వరులులాగా, లక్ష్మీనారాయణులలాగా వర్ధిల్లండని అంటారు. పురాణముల యందు స్త్రీకి ప్రత్యేక గౌరవస్థానము ఈయబడినది. ఈ విషయమును

శా॥ "శ్రీనారాయణు ( డెట్టి వాడో గ్రహియించెన్ లోకమీనాడు ల
క్ష్మీనారాయణు ( డన్న పేరు ( గొనె వాసిన్ నీకరాబ్జమ్ము ( జే
బూనన్ మన్ననగల్గె నిద్దఱికి తత్పూర్వమ్ము దామోదరుం
డైనాడంట యశోదపట్టి యిక ధ్యేయం బెల్ల మీరిద్దఱున్"[1] శ్రీ మహాలక్ష్మీ స్తవము 24వ పద్యము

మా నారాయణుడెట్టి వాడో నిన్ను గ్రహించినాడు. నీ పాణిగ్రహించుట వలన లోకములో ఈనాడు లక్ష్మీనారాయణుడను ఖ్యాతి వహించె. ఇద్దఱికి మన్ననగల్గెను. ఇంతకు పూర్వము యశోద బిడ్డడుగా దామోదరుడైనాడట అంటారు.

భార్య వలన భర్తకు ఖ్యాతి కలుగుట బిడ్డల వలన తల్లిదండ్రులకు ఖ్యాతి గల్గుట లోకసహజము. పరస్పరము ఒకరివలన ఒకరికి పేరు వచ్చును. ఇదే భావము. వ్యాజనిందాస్తుతిలో శ్రీకాసుల పురుషోత్తమ కవి,

"ఆలు నిర్వాహకురాలు భూదేవియై
యఖిల భారకు ( డనునాఖ్య ( దెచ్చె
నిష్ట సంపన్ను రాలిందిర భార్యయై
కామితార్థదు ( డన్న ఘనత ( దెచ్చె (
గమలగర్భు ( డు సృష్టికర్త తనూజుడై
బహుకుటుంబికు ( డన్న బలిమి ( దెచ్చె (
గలుష విధ్వంసిని గంగ కుమారియై
పతిత పావను ( డన్న ప్రతిభ దెచ్చె
నాండ్రు బిడ్డలు దెచ్చు ప్రఖ్యాతిగాని
మొదటి నుండియు నీవు దామోదరు ( డవె
చిత్ర చిత్ర ప్రభావ దాక్షిణ్యభావ
హత విమత జీవ శ్రీకాకుళాంధ్ర దేవ"![2] ఆంధ్రనాయక శతకము 26వ పద్యము

ఈ పద్యపుఛాయలు కన్పట్టుచున్నవి.

ఆండ్రు బిడ్డలు దెచ్చు ప్రఖ్యాతియే గాని మొదటి నుండి నీవు దామోదరుడివే అంటారు పురుషోత్తమకవి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీదివ్యగుణ వైశిష్ట్యము పుట 8
2. శ్రీ కాసుల పురుషోత్తమకవి ఆంధ్రనాయక శతకము - పుట 13

ఓ తల్లీ! నీవు సామ్రాజ్యైక సంధాయినివి. అక్షయమైన శంఖచక్రములను హస్తములందు ధరించి ఫల్గుణీ నక్షత్రములో సర్వదేవతలు కొలుచుచుండగా లోకముల నుద్ధరించుటకై ప్రసన్నమైన కాంతులుచిందించుచు క్షీరాంబుధిలో ఆవిర్భావము నొందితివి. అని లక్ష్మీదేవిని కనుల ముందు సాక్షాత్కరింపజేసిరి. పూర్వజన్మలో తులసీదళములతో పూజచేస్తే లక్ష్మీదేవి అనుగ్రహము కలుగునట. ఆ మహాలక్ష్మి కల్యాణమయిట! ఎవ్వరైనను అమితమైన భక్తితో తమ భర్తగా, తమ తండ్రిగా భావించి నారాయణుని పూజ చేయుదురో, స్థిరమైన తల్లిగా లక్ష్మిని మనోధ్యేయముగాతలతురో వారికి శ్రేయస్సు కలిగి, దీర్ఘాయువు కలిగి ఎల్లప్పుడు సంపదలు కలిగి హాయిగా సుఖింతురు అని లక్ష్మీ వైభవమునుద్ఘాటించిరి.

ఏదైనా పూజాకార్యక్రమము చేయునపుడు మనము పూజ ముగించిన తరువాత సకలము శ్రీమన్నారాయణార్పణమస్తు అని ఎట్లా చేసినదంతా ఆ భగవంతునికే చెందాలని భావిస్తామో అట్లాగే శ్రీ శర్మగారు ఈ లక్ష్మీవైభవమును చెప్పి చివర స్వస్తివాచకముఁబల్కిరి.

> **"తనుహృద్భాషల నింద్రియ ప్రతతి చేతన్ బుద్ధిచే నంత రా**
> **త్మను స్వాభావిక శక్తియౌ ప్రకృతి చేతన్ బ్రేరణన్ బొంది నే**
> **ననిశమ్మున్ బచలించు చుండు సకల వ్యాపారముల్ నీకె య**
> **ర్పణ గావింతు గ్రహింపుమయ్య కరుణాపారీణా నారాయణా!"**[1] శ్రీ మహాలక్ష్మీ స్తవము - స్వస్తి

ఓ నారాయణా! నేను మనసా వాచాకర్మణా చేసే ప్రతి పని అంతరాత్మలో స్వాభావిక శక్తియైన ప్రకృతి చేత ప్రేరణ పొంది చేయుచుందును. నేను చేసే అన్ని పనులు నీకే అర్పణ గావించెదను. ఓ కరుణాపారీణా! గ్రహింపుమయ్యా! అని వేడుకొనిరి. దీనిలో వీరి భక్తి భావము ద్యోతకమగుచున్నది. మనస్సులో బుద్ధి పుట్టించువాడు ఆ పని గూర్చి మాటాడించు వాడు, చేయించువాడు అన్ని ఆ పరమాత్మయే. కావుననే చేయు ప్రతిపని నీ సంకల్పము లేనిదే జరుగదు అను భావన. కనుక ఆ భగవంతునికే అర్పిస్తాననుట సర్వసమర్పణము. ఇట్టిది నిష్కల్మషమైన భక్తి. ఇటువంటి భక్తిగలవారు శ్రీ గురుజాడ.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ లక్ష్మీదివ్యగుణ వైశిష్ట్యము పుట 9

## 4.5 శ్రీ వాసుదేవనామ శతకము: -

తెనుగు సాహిత్య చరిత్రలో శతక క్రియకు ఒక ప్రత్యేక స్థానముగలదు. పద్యసంఖ్య, మకుట నియమము, ఏ పద్యమున కాపద్యమే భావయుతమై ఉండుట మున్నగు లక్షణములతో ప్రాచీన కాలమునుండి నేటి వరకు అవిచ్ఛిన్నముగా సాగుతున్న ఏకైక ప్రక్రియ.

శతకము అనగా నూరు పద్యాలుగల గ్రంథమని అర్థము. తెలుగు భాషలో ఉన్నన్ని శతకములు మరి ఏ ఇతర భాషలలోను కన్పట్టవు. సాధారణముగా శతకములలో నూరు లేక నూట ఎనిమిది పద్యాలుండటం సహజము.

"భగవన్నుతి ఋగ్వేదకాలమునుండి కనిపిస్తున్నది. లౌకిక సంస్కృతములో మయూరుని "సూర్యశతకము", శంకర భగవత్పాదుల "శివానందలహరి" "సౌందర్యలహరి" ప్రాకృతభాషలో గాథాసప్తశతి ప్రసిద్ధములు. తమిళ కన్నడాలలో కూడా శతకములున్నాయి. కన్నడంలోని "త్రైలోక్య చూడామణి" మకుటం గల శతకం తెలుగు రచనకు ప్రేరణగావచ్చునని ప్రసిద్ధ విమర్శకులు పేర్కొన్నారు[1].

తెలుగున భక్తి శతకములు ప్రధాన స్థానము నాక్రమించును. ఒక్క బ్రహ్మపైన తప్ప, తక్కిన దేవతలందరి మీదను శతకములు గలవు. హైందవ మతమును గూర్చియేగాక బుద్ధుని గూర్చి మహమ్మదును గూర్చి, క్రీస్తును గూర్చి శతకములు గలవు. వీనిలో యధావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకము, ధూర్జటి శ్రీ కాళహస్తీశ్వర శతకము, గోపన్న దాశరథీ శతకము, శేషప్ప నరసింహ శతకము ఈనాటికిని పఠనీయములై యున్నవి[2]. ఈ కోవలోనికి చేరదగినది శ్రీ శర్మగారు రచించిన వాసుదేవ నామ శతకము.

శ్రీ శర్మగారు శ్రీ కృష్ణాష్టోత్తర శతనామములను సరించి యొక్కొక్క పద్యమునందొక్కొక్క నామార్థమును వివరించుచు వ్రాసిన భక్తిశతకము శ్రీ వాసుదేవనామశతకము. ఈ శతకము నామూలాగ్రముగా పరిశీలించినచో వీరి అనన్యమైన శ్రీ కృష్ణ భక్తి వెల్లడియగును. ఈ వాసుదేవ నామ శతకమునకు తమ ఆశీస్సులనందజేయుచు శ్రీ దువ్వూరి వేంకట రమణశాస్త్రి గారు, "శారదా కృపా కటాక్షమున సహజమై యలవడిన కవితాధారను, భగవదర్పితము గావించుటయే పరమధర్మముగా నెంచుకున్న శర్మగారి సత్వ శుద్ధియు, నాధ్యాత్మిక దృష్టియు, హెచ్చుగా మెచ్చుకొనదగినది. అయ్యవి పుణ్యావాసనాలభ్యములు. శర్మగారి భక్తి తత్పరత యసాధారణము.

1. శ్రీ దువ్వూరి వేంకట రమణశాస్త్రి ఆశీస్సులు శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 3

అది వీరి కవితా ప్రసంగములందును, నితర ప్రవృత్తులందును నడుగడుగుననను గోచరించుచునే యుండును" అని వ్రాసిరి. ఇది అక్షర సత్యము వీరి కృష్ణభక్తి ప్రతి పద్యము నందు ప్రస్ఫుటమగును. ఈ శతక ప్రారంభములోనే ప్రార్థనలో,

**"శతకం బొక్కటి గూర్పనెంచితి దయాస్వాంతుడవై పల్కఁజే**
**సితివా ! నీకును బేరు, దాసఫలమున్ జేకూరు నాకింక, నం**
**చిత భక్తిన్ బలియింప నబ్బును జయశ్రీ జన్మమున్ జెందు, ధ**
**న్యత, పూజించెద నామమంజరులఁగృష్ణా! వాసుదేవ ప్రభూ!"**[1]

వాసుదేవనామ శతకం ప్రార్థన 1వ పద్యము

వీరు శతక రచనకు పూనుకొనుటతోనే పల్కించువాడవు నీవే. అట్లా పలికించితివనుకో నీకు పేరువచ్చును. నాజన్మ ధన్యతబొందును. అందరు పూలతో పూజిస్తే నేను నామములను మంజరులతో పూజిస్తాననిరి. తన ప్రయత్నముతో ఈ శతకమును వ్రాస్తున్నానని చెప్పలేదు. ఈ విధముగా శ్రీ కృష్ణాష్టోత్తర శతనామములు ఒక్కొక్కదానిని ఒక్కొక్క పద్యరూపములో ఆయనను వర్ణించుట కేవలము భగవత్సంకల్పము అని చెప్పుట. తెలుగు భాషలోభక్తి శతకములనేకములు గలవు. కాని భగవన్నామములకు అర్థ వివరణ గావించుచు వ్రాసిన శతకములు అంతగా కనబడవు. శ్రీశర్మగారు, శ్రీమద్భాగవతము, శ్రీమద్భగవద్గీత మొదలైన గ్రంథముల సారమును ఒంట బట్టించుకొని శ్రీకృష్ణ భక్తిలోలురై తాము ఆ ఆనందాబ్ధిలో ఓలలాడుటయేగాక, ఈ శతకము చదివిన పాఠకుని గూడ శ్రీ కృష్ణ భక్తి తన్మయులను జేయుదురు. ఎంత నాస్తికునికైనను ఈ శతకము చదివిన పిమ్మట భక్తి కలుగకపోదు. వారు దీనిలో శ్రీకృష్ణుని రూప గుణ లీలా విశేషములను నామ వైశిష్ట్యమును తెలియజేయుచు, తమ దాసభక్తిని వెల్లడిచేసిరి. భగవంతుడు దేనికి కట్టుబడినా కట్టుబడకపోయినా భక్తికి కట్టుబడునని - నమ్మిన భక్తుని రక్షించి దీరుననను విషయమును మనోహరముగా స్పష్టీకరించిరి.

ఈ వాసుదేవనామ శతకమునకు ఆశీస్సులు అందజేయుచు శ్రీ దువ్వూరి వేంకట రమణ శాస్త్రిగారు, "తెలుగున భగవత్పరములగు శతకములు పెక్కులు గలవు గాని, భగవన్నామావళికర్థ వివరణము గావించు శతకములంతగా గానరావు. నామాను సంధాన పూర్వకంబులగు దేవపూజా విధానములందు నాయానామములకు మూలములై లీలారూపములగు దివ్య చరితములసారము సయితము తప్పక స్మరణ

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 15

పదవికి దెచ్చుకొనదగినదని తోడి వారలకు నివేదించు తలంపుతో నొక్కొక్క పద్యముననొక్కొక్క నామమును సంఘటించి తదర్థమును వివరించు నియమమును దఱచుగా బాటించుచు వీరీ శతకము రచించుట మిక్కిలి సఫలమని నాఅభిప్రాయము"[1] అని వ్రాసిరి. శ్రీ చెళ్ళ పిళ్ళ వెంకట శాస్త్రిగారు తమ అభిప్రాయమును వ్రాయుచు, "చక్కని శైలిలో వ్యర్థపదములు లేక మృదు మధురమైన పద్ధతిలో నించుమించు కదళీపాకములోనున్నది. ఇయ్యది పండితులకే గాక, పామరులకు గూడ హృద్యముగానున్నది. కవి సహజధారకలవాడు. పూర్వాచార పరాయణుడు, మిగులభక్తుడు. ఆయా యంశములీ శతకమునందు సర్వత్ర స్ఫురించుచుండును"[1] అని వ్రాసిరి.

శ్రీ శర్మగారు వాసుదేవనామ శతకమును ఆ శ్రీ కృష్ణునికే అంకితమిచ్చుచు,

**"కరుణన్ జే కొనుమీ! సుం**
**దరమగు శ్రీ వాసుదేవ నామ శతకమున్**
**వరలు తమిది భవదష్టో**
**త్తరశత నామాభి వర్ణితము శ్రీకృష్ణా!"[2]** వాసుదేవనామ శతకము పుట 11

ఓ కృష్ణా! నీ అష్టోత్తర శతనామములచే అభివర్ణితమైన ఈ వాసుదేవ నామ శతకమును దయతో స్వీకరింపుము. అని పలికి,

**"ఒకయేగానికొ పేరు పెంపెసఁగగానో కోరి మందాత్ములై**
**యొక సామాన్యుని కంకితం బిడగ సుద్యోగింతురే, కావ్యక**
**న్యకలన్ గొందఱు, వారు నిన్నెఱియరయ్యా వాంఛితార్థ ప్రదా**
**యకుఁగా మోక్షపద ప్రదాతవుగఁగృష్ణా! వాసుదేవ ప్రభూ!"[3]**

శ్రీవాసుదేవ నామ శతకము 9వ పద్యము

ఓ కృష్ణా! ఒకరికంటె మించి ఇంకొకరు పేరు తెచ్చుకోవాలనో ఏమో, మందాత్ములై తమ కావ్య కన్యకను ఒక సామాన్యునకంకితమీయవలెనని కొందఱు ప్రయత్నింతురు.నిన్ను వాంఛితార్థప్రదాయకుడవని, మోక్షపదప్రదాతవని తెలియరయ్యా! అని పలుకుటలో భాగవతగురువైన పోతన సిద్ధాంతమునే తన

1. శ్రీ దువ్వూరి వేంకట రమణశాస్త్రి ఆశీస్సులు శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 7
2. శ్రీ చెళ్ళ పిళ్ళ వేంకట శాస్త్రి అభిప్రాయము శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 9
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 11

పరమోపాదేయముగా భావించిరని తెలియుచున్నది. కవులందరి వలె వీరును ఎంతో దారిద్ర్యము ననుభవించిరి. అయినను తమ కావ్య కన్యకను అమ్ముకొనక నమ్మిన ఆ శ్రీకృష్ణ పరమాత్మయే అన్నము పెట్టునని జీవితాంతము ఆ నమ్మకముతో జీవనము గడిపిన వ్యక్తి వీరు.

> **"పదియేండ్లాయెఁ గదయ్య, నీ విదియుసన్ బల్కించి, యీ నాఁటికి**
> **య్యది నీపేర జగాన, వెల్వడగజేయం గల్గితీవంచు, నెం**
> **చెద నీ చేతకుఁదృప్తిఁజెందెద భవచ్చిత్తమ్ము, నా భాగ్య, మె**
> **య్యది, నీ గీచిన గీటు దాఁటునిలఁగృష్ణా! వాసుదేవ ప్రభూ!"[1]**

శ్రీవాసుదేవ నామ శతకము ప్రార్థన 2వపద్యము

అని ఈ పద్యమును వ్రాయుటను బట్టి ఈ శతకము వెలువడిన పది సంవత్సరముల తర్వాత అది ప్రపంచములోనికి వెలుగులోనికి వచ్చినదని తెలియుచున్నది. అప్పుడు కూడ లేమిలో మనము భగవంతుని నిందిస్తాము. కరుణించలేదని బాధచెందుతాము. కాని వీరు ఆ భగవంతుని దయకు ఎదురుచూచే చూపులు వీరి ఓర్పును, భక్తిని వెల్లడిచేయుచున్నవి. వీరు, ఎన్ని కష్టాలు వచ్చిన భగవంతుడు గీచిన గీటు దాటలేదని తెలియుచున్నది. శ్రీకృష్ణాష్టోత్తర శతనామములను వర్ణించుచు ఆ జగద్గురుని కటాక్షము కలుగునని ఎదురుచూసి ఎదురుచూసి విసిగి,

> **"మదికాశ్చర్యము గల్గు నాస్థితి వచింపన్ లో విచారింప ము**
> **ప్పది యార్వత్సరముల్ వెసన్ గడచె నీ పాదద్వయిన్ గొల్చు సం**
> **పద యీ నాఁటికిఁగల్గదే, యెపుడు సంప్రాప్తించు నీ సేవ, యె**
> **య్యది గత్యంతరమో, యిఁకన్ దెలుపు ! కృష్ణా! వాసుదేవ ప్రభూ!"[2]**

వాసుదేవ నామ శతకము 70వ పద్యము

నాకు చాలా ఆశ్చర్యము కలుగుచున్నది. నా స్థితి నేనే ఆలోచించుకుంటే ఆరు సంవత్సరముల వయస్సు గడిచిపోయినది. నీ పాదద్వయిని గొల్చే అదృష్టము ఈనాటికి కలుగలేదు. నీ సేవ చేసికొను భాగ్యము ఎప్పుడు కల్గును? ఏది గత్యంతరమో నాకు తెలుపుము. అని చెప్పుట చేత ముప్పది ఆరు సంవత్సరముల వయస్సులో ఈ శతకమును రచించి యుందురు అని తెలియుచున్నది.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 3
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 43

**"స్తుతి సేయందగు ప్రాజ్ఞకోటికి నమస్సుల్ జేసెదన్, నీ సదా**

**శ్రిత వాత్సల్యము, దివ్యపూజ్య విబుధాశీర్వాదమున్ గూడి, సం**

**తత మాధుర్య సుధాప్రవాహ కవితాధారా ప్రసాదమ్ము, లు**

**న్నతిఁ జేకూర్చునుఁగాక నాకెపుడుఁ గృష్ణా! వాసుదేవ ప్రభూ!"[1]**

శ్రీ వాసుదేవ నామ శతకము ప్రార్థన 3వ పద్యము

శ్రీకృష్ణుడు ఎల్లప్పుడు చూపే వాత్సల్యము, దివ్యపూజ్యులైన పండితాశీర్వచనములు గూడి సంతత మాధుర్య సుధాప్రవాహ కవితాధారా ప్రసాదమ్ములు నాకెల్లప్పుడు ఉన్నతిని జేకూర్చునుగాక! అని నమ్మిన వీరు భగవంతుని అనుగ్రహము తప్పక కల్గునని విశ్వసించిరి. కృతి శ్రీకారంతో ఆరంభమైతే మంగళదాయకంగా ఉంటుందని ప్రాచీన లాక్షణికుల అభిప్రాయము.[2]

ఏ కావ్యమునైనా భగవత్ప్రార్థనతోనే ప్రారంభము చేయుట సంప్రదాయము. వీరు ఈ శతకములో శ్రీకారముతో ప్రారంభించుటయేగాక

**"శ్రీకృష్ణా! యనిఁపిల్తుఁబేర్కొనుదుఁదండ్రీయంచుఁబ్రార్థింతుఁద**

**ల్లీ! కారుణ్యకటాక్ష వీక్షణము లోలింగూర్పుమంచున్; గురూ!**

**సాకల్యంబుగ జ్ఞానమిమ్మని నమస్కారము లర్పింతు న**

**య్యా! కల్యాణ గుణాభిరామ జయకృష్ణా! వాసుదేవ ప్రభూ!"[3]**

శ్రీ వాసుదేవ నామ శతకము 1వ పద్యము

శ్రీ కృష్ణా! అని పిలుతును. దండ్రీ! యని పేర్కొనుదును. తల్లీ! కారుణ్య కటాక్ష వీక్షణములు దయతో ప్రసాదించమని ప్రార్థిస్తాను. గురూ! నాకు దీనికి కావలసిన జ్ఞానమిమ్మని నమస్కారములర్పింతును. అని చెప్పుటలో తల్లి, తండ్రి, గురువు, దైవము ఆ శ్రీకృష్ణ పరమాత్మయే అని నమ్మిరి. శ్రీకృష్ణా! యని తండ్రిని పిలిస్తే దానికి కారుణ్యకటాక్ష వీక్షణములతో బిడ్డల ఆలనాపాలనా చూడమని తల్లి అనుగ్రహిస్తే దానికి కావలసిన జ్ఞానజ్యోతిని ప్రసాదించువాడే గురువు. ఆ జగద్గురువు శ్రీకృష్ణుడే అని నమ్మిరి. శ్రీకృష్ణుడు ఈ నమ్మకముతో నున్నవారిని తరింపజేయుననుటకీ పద్యము ఉదాహరణ: -

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 4
2. కాకుమాను అప్పకవి "అప్పకవీయం", 2-358
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 12

“శృంగారంబగు నీదు పాదయుగమున్ హృత్పీఠిపై భక్తుఁడె
బ్భంగిన్ నిల్పి తలంచుఁదత్సదృశరూపంబెత్తి సాక్షాత్కరిం
పంగాఁబూనుటదేమి యచ్చెరువుఁనీ వాత్సల్యసారమ్ము లె
న్నంగా నౌనొకొ! భక్తవశ్యుఁడవు, కృష్ణా! వాసుదేవ ప్రభూ!”[1]

శ్రీ వాసుదేవ నామ శతకము 2వ పద్యము

ఓ కృష్ణా! వాసుదేవ ప్రభూ! శృంగారమైన నీ పాదయుగమును హృత్పీఠిపై నిల్పి ఎవరు తలంచుదురో వారికి తత్సదృశరూపముతో సాక్షాత్కరింతువు. ఇది ఆశ్చర్యము కాదు. నీ వాత్సల్యమెన్నునట్టిదిగాదు. నీవు భక్తవశ్యుడవు కదా! అని చెప్పిరి.

శ్రీ శర్మగారు భక్తితో గణనాథుని చూచి, వాణికి, కామేశ్వరికి మ్రొక్కి, రాముని సేవించి, సువర్చలారమణుని పూజించి, శ్రీనారసింహుని ప్రార్థించి, శివుని నుతించెదను అని చెప్పి యా రూపములలో వెలుగొందు వాడివి నీవే కదా! నీవు సర్వాత్మకమూర్తివి. అట్టి నిన్ను నేను ప్రార్థింతుననిరి. భగవంతుని మనము వేరువేరు పేర్లతో, వేరు వేరు రూపములలో ఆరాధించినను ఆ అన్ని రూపములలో వెలుగొందు పరమాత్మ ఒక్కడే అనే అద్వైత భావమును వెలిబుచ్చిరి.

శ్రీ శర్మగారు గోత్రభక్తులు, గురుభక్తులు. తల్లిదండ్రులను సాక్షాత్ దైవ స్వరూపులుగా భావించినవారు.

“కరుణాశ్రీయగు వేంకమాంబ జననిన్ గౌండిన్య గోత్రోద్భవున్
గురుజాడాన్వయుఁడౌ, త్రియంబకగురున్ బూజ్యున్ మురారి స్ఫుర
ద్వరపాదార్చను మత్పితామహుని నిత్యంబాది నారాయణున్
స్మరియింతున్ గురుదైవతమ్ములని, కృష్ణా! వాసుదేవప్రభూ!”[2]

శ్రీ వాసుదేవ నామ శతకము 7వ పద్యము

“అరయన్ సద్గురు భాస్కరోదయముచే సజ్ఞానపుంజీఁకటుల్
పరువెత్తున్ వెలిలోన వెల్గెడిని దివ్యజ్ఞానపుంజ్యోతి యీ
శ్వర విష్ణ్వంబుజ సంభవాదులు పరబ్రహ్మంబు నా సద్గురం
డరయన్ వారికి నీ క భేదమిల। కృష్ణా! వాసుదేవప్రభూ!”[3]

శ్రీ వాసుదేవ నామ శతకము 6వ పద్యము

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 12
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 15
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 14

ఓ కృష్ణా! వాసుదేవ ప్రభూ! సద్గురువైన భాస్కరుని రాక తో అజ్ఞానపు చీకటులు తొలగును. లోపల వెల్గెడి దివ్యమైన జ్ఞానజ్యోతి ఈశ్వర విష్ణ్వంబుజ సంభవాదులు పరబ్రహ్మంబు అని సద్గురువుకి తెలియును. అట్టి సద్గురువును తెలిసికున్నవారికి నీకు భేదము లేదు. అని చెప్పుట చేత బ్రహ్మ, విష్ణు, మహేశ్వర త్రిమూర్త్యాత్మక స్వరూపుడవు నీవు అని చెప్పుట.

కమలనాథా! అను నామమునకు అర్థ వివరణ గావించుచు

**"కమలనాథా ! మదీయమానసములోకంబెల్ల శోధించె, భ**
**క్తిమరందమ్ము స్రవించు హృద్వనజమున్ దివ్యద్భవత్పాద ప**
**ద్మములందర్పణ సేయుదున్ గొను భవత్సాన్నిధ్యమున్ జేరి, జ**
**న్మము సాఫల్యము నొందు పూజయిదె, కృష్ణా! వాసుదేవ ప్రభూ!"[1]**

శ్రీ వాసుదేవ నామ శతకము 10వ పద్యము

ఓ కృష్ణా! కమలనాథా! నా మనస్సు లోకమంతా పరిశోధన చేసినది. భక్తి మకరందమును స్రవించు నా హృదయపద్మమును నీ సన్నిధానము జేరి నీ పాదపద్మములందర్పణ జేయుదును. జన్మసాఫల్యము నొందు పూజయిదే! అని వ్రాయుట చేత వీరి మనసా వాచా కర్మణా చేయు ప్రతి క్రియ కూడ భగవంతునికే అర్పణము. సర్వము భగవంతునికే అర్పించుట అనగా సర్వసమర్పణ బుద్ధి కన్పట్టుచున్నది.

'శ్రీవత్సకౌస్తుభధారి' అను నామాన్ని వివరించుచూ

**"ఇభరాజున్ గరుణించి ద్రౌపదిఁగృపాదృష్టిన్ విలోకించి మేల్**
**శుభమర్పించి, కుచేలునేలితని, వించున్ నిన్నె శ్రీవత్స కౌ**
**స్తుభధారిన్ శరణంటి మంటి నిఁక నెందున్ లోటులేదయ్య నా**
**కభయంబైన వరం బొసంగుమిఁక గృష్ణా! వాసుదేవ ప్రభూ!"[2]**

శ్రీ వాసుదేవ నామ శతకము 22వ పద్యము

అని నీవు గజరాజుని కరుణించావు. ద్రౌపదిపై కృపాదృష్టిని ప్రసరించావు. కుచేలునేలితివి. నేను శరణు కోరుతున్నాను. ఇకనాకు లోటు లేదు. ఎందుకనగా శరణన్నవారిని రక్షించితీరాలి గదా! కావున నాకభయమైన వరమొసగుమనిరి. దీని వలన శరణాగత భావము వ్యక్తమగుచున్నది.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 16
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 19

మానవుల పుణ్యాపాపకర్మలను బట్టి భగవంతుని గుర్తెరుగుట అది తేలికగా సాధ్యము కాదు. అట్లా అది వారు తెలిసికోలేక పోవటం పూర్వజన్మకర్మము. దానిని వీరు,

**"సకలమ్మున్ భవదీయ శాసనమునన్ సాగున్, నరున్ రిత్తకో**
**రిక లొక్కుమ్మడి ముంచి వైచుతతి వేతే దారియున్ దోఁచి, తో**
**పక వర్తించునతండు, నిత్య పదమున్ బ్రాపించు, పుణ్యుండ వీ**
**వకదా! నిన్గనరేమి? కర్మమిది! కృష్ణా! వాసుదేవ ప్రభూ!"[1]**

శ్రీ వాసుదేవ నామ శతకము 20వ పద్యము

ఈ సృష్టి అంతయు నీ శాసనముతోనే సాగును. మానవుని కోరికలొక్కసారిగా ముంచివైచే సమయములో వేరే దారి కనబడక తనకు తోచిన మార్గములో నడచును. నిత్య పద ప్రాప్తిని కలిగించువాడవు నీవు గదా! అట్టి నిన్ను చూడరేమి? అని ప్రశ్నించుటలో ఇది వారి పూర్వజన్మప్రారబ్ధము సుమా! అని చెప్పుట. అట్లు తెలిసికొనలేక పోవుట కూడా నీ మాయే అని ధ్వని. ఇదే తరువాత పద్యములో 'లీలామానుషవిగ్రహ' అను నామాన్ని వివరిస్తూ,

**"లీలామానుష విగ్రహా ! తెలియగాలేరా భవాదుల్, భవ**
**ల్లీలాసంగతి, దొంగబూచి తన మేలే నీకు భక్తాళితో**
**వాలాయమ్మగు, నీదురూపుఁగనిపింపన్ జేయఁగారాఁగదే**
**చాలుంచాలు, నుపేక్షసేయకుము, కృష్ణా! వాసుదేవప్రభూ!"[2]**

శ్రీ వాసుదేవ నామ శతకము 21వ పద్యము

శ్రీ కృష్ణుడు లీలా మానుషవిగ్రహుడు అనే భావాన్ని చాలా మనోహరంగా వివరించిరి. భక్తులతో దోబూచి ఆటలు ఆడుకుంటాడట. భక్తుల భక్తిని పరీక్షించిగాని వారి భక్తిని అంగీకరింపడని అర్ధము.

**"గృహణచ్ఛన్న శశాంక తుల్య నిజ భక్త శ్రేణి ప్రారబ్ధ క**
**ర్మహరింపందగు శక్తిగలిగియు, మహాత్మా! పూతనా జీవితా**
**పహరా! కర్మతొలంగసేయకయె, లేవంటిసి, చేపట్టి, ప్ర**
**త్యహమున్ జూపెదు, నీ వినోదములు, కృష్ణా! వాసుదేవప్రభూ!"[3]**

శ్రీ వాసుదేవ నామ శతకము 32వ పద్యము

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 18
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 19
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 24

భగవానుడు భక్తుల ప్రారబ్ధకర్మలను హరింపఁజేయగల శక్తి కలిగియు హరింపజేయడు. వారిని పడిపోతున్నా చేయి పట్టుకొని లేవదీసి ప్రతిరోజు ఆయన లీలావినోదములు చూపెట్టును. అనగా పూర్వజన్మ సంచితమైన పాపము ననుభవింపజేయును. కాబట్టి ఎంతటివారికి కర్మ అనుభవింపకదప్పదని చెప్పుచుండిరి.

బహుజన్మలనుండి సంపాదించుకొన్న పుణ్యసంచయము వలననే పరమాత్మ పాదసరోరుహములను గొలిచే భాగ్యమబ్బునని ఇహసౌఖ్యములు అశాశ్వతములని

**"ఇహసౌఖ్యంబు లశాశ్వతమ్ములని గాదే సచ్చిదానంద వి**
**గ్రహా! నీ పాదసరోరుహమ్ముఁగొలువన్ గాంక్షించు భక్తుండహో!**
**బహుజన్మార్జిత పుణ్యసంచయమునన్ బ్రాప్తించు నీ సేవ యో**
**యహి పర్యంక! రమా విలోల, హరి! కృష్ణా! వాసుదేవ ప్రభూ!"[1]**

శ్రీ వాసుదేవ నామ శతకము 35వ పద్యము

అని నొక్కివక్కాణించుచున్నారు.

చిన్న పిల్లలు తినడానికి ఏదైనా పెట్టినప్పుడు తినడము కంటే ఒళ్ళంతా పులుముకోవడం ఎక్కువగా చూస్తాము. బాలకృష్ణుని విషయములో వారు నవనీత విలిప్తాంగాయనమః అను నామాన్ని పద్యరూపములో వివరిస్తూ, శ్రీ కృష్ణుని బాల్య చేష్టను మనోహరముగా కన్నులకు కట్టినట్లు వర్ణించిరి.

**"తనయా! పాలిదె, డించివత్తుఁజనుబాల్ ద్రావంగనౌనిప్డె,చి**
**ల్కిన వెన్నన్, సరిదీయనీయ" వను, తల్లిన్‌లోఁజనన్ జూచి, కి**
**న్కను, భాండమ్ము విదల్చి, వెన్నదిని వేగన్ బాఱునిన్ గాంచెదన్**
**దనువెల్ల న్నవనీతలిప్తునిగఁగృష్ణా ! వాసుదేవప్రభూ "![2]**

శ్రీ వాసుదేవ నామ శతకము 36వ పద్యము

ఇది ఎంతో సహజసిద్ధముగానున్నది.

గీతాచార్యుడు భగవద్గీతలో

**"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దృష్కృతామ్,**
**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే"[3]** 8వ శ్లోకము

అని చెప్పినట్లుగా ధర్మానికి గ్లాని సంభవించి అధర్మం ప్రబలినపుడు భగవంతుడు ఏదో ఒక రూపములో అవతరించును. అట్లా చేసే బ్రహ్మవునీవే సుమా! అంటున్నారు ఈ పద్యములో

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 26
2. పైదే
3. భగవద్గీత చతుర్థాధ్యాయః - జ్ఞానకర్మసన్యాసయోగః - పుట 63

**"స్వమతాచారము వీడిపోఁబరమతాచారమ్ములే, స్వీయధ**
**ర్మములై ప్రాకిఁయధర్మమెల్లెడల గ్రమ్మన్ ధర్మ సంరక్షణా**
**ర్థమిలన్ నీ వవతారమెత్తి మరలన్ ధర్మప్రతిష్ఠాపనో**
**ద్యమమున్ బూనె దజుండవయ్యుభువిఁగృష్ణా! వాసుదేవ ప్రభూ!"[1]**

శ్రీ వాసుదేవ నామ శతకము 68వ పద్యము

ఓ కృష్ణా! తమ తమ ధర్మములనాచరింపక, పరమత ధర్మములనే అనుష్ఠించుచు అధర్మము అంతా ప్రబలగా ధర్మ సంరక్షణార్థమ్ము ఈ భూమిపై అవతారమెత్తి బ్రహ్మవై మరల ధర్మప్రతిష్టాపన చేయుటకే పూనెదవు.

శ్రీకృష్ణుడు తనను పల్కించు వాగ్రూపశక్తి అని అనుచున్నారు.

**"నిను వేదంబులు యిట్టి వాఁడవని వర్ణింపన్ బ్రయత్నించి, యం**
**తనవాఙ్మానస గోచరుండనుచు నానందమ్ముటంచున్, నిరం**
**జనుఁడంచున్ వచియించి, యాగె, నికనే శక్తుండనే నీవెటుల్**
**నను బల్కించెదొ, యట్లె పల్కెదను గృష్ణా! వాసుదేవప్రభూ!"[2]**

శ్రీ వాసుదేవ నామ శతకము 69వ పద్యము

ఓ కృష్ణా, నిన్ను వేదములు యిట్టివాడివని వర్ణించుటకు ప్రయత్నించి, అంతట అవాఙ్మానసగోచరుడు, ఆనందమ్ము, నిరంజనుడని వచియించి యాగెను. ఇక నేను వర్ణించుటకు శక్తుండనా? నీవెటుల నను పల్కించెదవో అట్లే పల్కెదను. అని చెప్పుటలో శ్రీ శర్మగారి శ్రీకృష్ణభక్తి వెల్లడియగుచున్నది. తనను పలికించువాడు ఆ పరమాత్మయే సర్వము ఆయనే అని నమ్ముట వీరి భక్తికి తార్కాణము. కేవలము పలికించుటయే గాదు ఆయనను కొలువవలెనన్న ధ్యానము చేయవలెనన్న ఆయన దయలేనిదే జరుగదని నమ్మిన వ్యక్తి వీరు.

**"ధ్యానం బేమియు నిల్వదే ! మఱి పర ధ్యానంబె మెండయ్యె, నా**
**లో, నాకే కడు సిగ్గునౌ, నెటులనిల్చున్ నీ పద ధ్యాన మీ**
**వే, నా సద్గురుమూర్తి, వీవుగనగా నేలోపమున్ రా, దికే**
**మైనన్ నీదయ, యేమి చేసెదవొ! కృష్ణా! వాసుదేవప్రభూ!"[3]**

శ్రీ వాసుదేవ నామ శతకము 71వ పద్యము

అని అంటారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 42
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 43
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 44

భగవంతునిపై పూర్తివిశ్వాసము ఉంచాలి. ఆయన రక్షించు తీరునను పూర్తి నమ్మకం కలిగినపుడే రక్షించునను భావాన్ని ద్వారకానాయకా! అను నామానికి అర్థమును వివరిస్తూ,

**"నినుభక్తిన్ మది నమ్మియుండవలె నెందే ప్రోచుటే పాటి, దీన**
**జనులెప్డేని విపత్పరంపరల గృష్ణా! ద్వారకా నాయకా!**
**యని పిల్వంగ ననుక్షణం బభయమీయన్ వత్తువేవేగ, నా**
**యన! నీవెంత దయా సముద్రుడవొ! కృష్ణా!వాసుదేవ ప్రభూ!"[1]**

శ్రీ వాసుదేవ నామ శతకము 76వ పద్యము

ఓ కృష్ణా! ద్వారకా నాయకా! నిన్ను భక్తితో నమ్మియుండవలెను గాని, నీవు రక్షించుటెంతపని దీనజనులు విపత్పరంపరలు కలిగినపుడు కృష్ణా! ద్వారకానాయకా అని పిలువగానే అనుక్షణమభయ మివ్వవలెనని వేగముగావత్తువు కదా! నాయనా! నీవెంత దయాసముద్రుడవో కదా! అని పలుకుతూ కుబ్జాకృష్ణాంబరధారి అనునామాన్ని వివరించు సందర్భములో,

**"ఆకారమ్ము; గులమ్ము ; సంపదలె కావయ్యా నినుంజేర నీ**
**లోకంబందొక భక్తివస్తువది చాలున్ నిన్నుమెప్పింప ము**
**న్నాకుబ్జన్ గరుణించి యేలితివికాదా! గంధమీయంగ! గు**
**బ్జా। గృష్ణాంబరధారి నిన్ దలతుఁగృష్ణా! వాసుదేవప్రభూ!"[2]**

శ్రీ వాసుదేవ నామ శతకము 82వ పద్యము

నిన్నుజేరుటకు అందము, కులము, సంపదలు ఇవి గాదే కావలసినది. భక్తి అను వస్తువది ఉండినచాలు నిన్ను మెప్పించుటకు ఇంతకుముందు కుబ్జను, గంధమిచ్చి కరుణతో ఏలితివి కదా! నిన్ను కుబ్జా కృష్ణాంబరధారివిగాఁదలతును అంటారు. ఇక్కడ కూడ వీరి కృష్ణ భక్తి వెల్లడియగుచున్నది.

ఇంకొకచోట శ్రీ శర్మగారు మధురాతిమధురమైన పదార్థములన్నింటిలోనికి నీ నామమె మధురమైనది అంటారు.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 46
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 49

**"దధిమాధర్యము మేలు, మేలు మధువున్ ద్రాక్షాఫలంబంతకున్**
**మధురంబౌ, మఱికండచక్కెరల, యా మాధుర్యమింకేమనన్**
**బృథివిన్ పెన్మధురంపు వస్తువులలో శ్రేష్ఠముగాఁజాటెదన్**
**మధురానాథ! త్వదీయ నామసుధ; కృష్ణావాసుదేవప్రభూ!"[1]**

శ్రీ వాసుదేవ నామ శతకము 75వ పద్యము

మధురనాథ! పెరుగుమాధుర్యమైనది. అంతకంటే తేనె మధురమైనది. అంతకంటె ద్రాక్షాఫలము మధురమైనది. అంతకంటె చక్కెర మాధుర్యమధికమైనది. భూమి పై అధికమైన మాధుర్యముగల వస్తువులలో నీ నామసుధ తప్ప వేరే మధురమైనది లేదు.

"మధురాకృతయే" అను నామాన్ని వివరించుచు,

**"మధురనాథ! త్వదీయ వాక్కుల సుధా మాధుర్య మొల్కున్ గడున్**
**మధుపచ్ఛాయఁదిరస్కరించుకురులన్ మాధుర్యమే గుల్కెడిన్**
**బ్రథిత ప్రస్ఫుట వేణునాదమును నౌరా! చిల్కు మాధుర్య మి**
**ట్లథిపా ! నీ మధురాకృతిన్ గనెద ఁగృష్ణా! వాసుదేవప్రభూ!"[2]**

శ్రీ వాసుదేవ నామ శతకము 43వ పద్యము

ఓ మధురనాథ! నీ యొక్క వాక్కులందు సుధామాధుర్యమొల్కును. తుమ్మెదల ఛాయను తిరస్కరించు కురులు కూడ మాధుర్యమునే బల్కును. ఔరా! వేణునాదము మాధుర్యమునే బల్కును. వీటన్నింటికంటె మధురమైన నీ మధురాకృతిని చూచెదను.

వీరి ఈ మధురమైన పద్యములందు మధురాష్టక భావముద్యోతకమగుచున్నది. జగద్వల్లభుడైన శ్రీకృష్ణ పరమాత్మ స్వరూపము దర్శించిన వానికి మధురమే. ఆయన రూపము, గుణము, నామము అన్ని మధురమే. ఆ సుధా మాధుర్యములో నుండి వెలువడిన వీరి పద్యములు అత్యంత భక్తి సంయుతమైన మధురగుళికలు. వీరి మధుర భక్తి అనన్యసాధ్యము. ఇంతటి భక్తిరసైక లోలురు గనుకనే శ్రీకృష్ణుని రూపగుణ సౌందర్యములను ఈ శతకము మొత్తము పై ఆరు పద్యములలో వర్ణించినను తనివి తీరలేదేమో. భక్తిరసైకలోలురికి తృప్తిఎక్కడిది?

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 46
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 30

"శంఖచక్రగదాబ్జాయ" అను నమాన్ని వివరిస్తూ,

**"నిగమస్తుత్య పదాబ్జుఁబీతవససున్ శ్రీవక్షునిన్, శంఖ చ**
**క్ర గదాబ్జాది యుతున్ జతుర్భుజుని మేఘశ్యాముఁగంజాక్షు, సో**
**యగపున్ బెన్గని; రత్నమండిత కిరీటాలంకృతున్ నిన్నుఁగా**
**నఁగనౌ,వారలె; ధన్యజీవనులు, కృష్ణా! వాసుదేవ ప్రభు!"[1]**

శ్రీ వాసుదేవ నామ శతకము 26వ పద్యము

వేదవేదాంతములచేత స్తుతింపబడినవానిని, పీత వస్త్రధారిని, శ్రీవక్షుని, శంఖ, చక్ర,గదాధరుని, చతుర్భుజుని, మేఘశ్యాముని, కంజాక్షుని, రత్నమండిత కిరీటాలంకృతుని నిన్ను చూడగలిగినవారలె ధన్యులు అంటారు.

"తమాలశ్యామలాకారున్" అను నామాన్ని వివరిస్తూ,

**"పసిబాలున్, గరుణార్ద్రచిత్తు, వరగోపాలప్రభున్ వాక్సుధా**
**రసమున్ గుల్కెడివాని, పింఛముతలన్ రాజిల్లు వానిం బ్రఫు**
**ల్లసరోజాక్షునిఁబీతవస్త్రు ని తమాల శ్యామలా కారునిన్**
**వసుదేవాత్మజునిన్ దలంచెదనుఁగృష్ణా ! వాసుదేవప్రభూ!"[2]**

శ్రీ వాసుదేవ నామ శతకము 54వ పద్యము

ఓ కృష్ణా! పసిబాలుని, దయార్ధ్రచిత్తుని, గోపాలనామధేయుని, వాక్సుధారసము జిల్కెడువానిని, పింఛము తలపై రాజిల్లువానిని, విశాలనయములు గలవానిని, పీతవస్త్రుని, తమాలశ్యామలాకారుని వసుదేవునికుమారుడైన నిన్ను తలంచెదను.

**"ఘననీలాభ్రశరీరు,ఁ బీతవససున్ గంజాక్షు, మందస్మితా**
**నను, నుత్తంసిత బర్హిబర్హు, మురళీనాదైకలోలున్, రమా**
**వనజాతా యత లోచనాశ్రిత మహావక్షున్ మనశ్చోరునిన్**
**వనమాలిన్, నిను ఁగాంచుటెన్నఁటికో! కృష్ణావాసుదేవప్రభూ!"[3]**

శ్రీ వాసుదేవ నామ శతకము 63వ పద్యము

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 21
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 35
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 40

శ్రీకృష్ణుని రూపమును ఇక్కడ కన్నులకు కట్టినట్లు వర్ణించిరి. మేఘచ్ఛాయను బోలిన శరీరచ్ఛాయ గలిగినవాడుట. కంజాక్షుడు, మందస్మితాననము గలవాడు. మురళీనాదైకలోలుడు. వనమాలి, అని వర్ణించి అట్టి నిన్ను ఎన్నాళ్ళకు చూచెదనో గదా! అంటారు.

"బృందావనీ మధ్యసంచారు" అనే నామాన్ని వివరిస్తూ,

**"శ్రీ రాజీవ దళాయతాక్షుఁగరుణాసింధున్ ఘనశ్యామలా**
**కారున్, బర్హకృతావతంసు, మురళీగానామృతాస్వాదు, నా**
**భీరక్షేమ విధాయిఁజితవసనున్ బృందావనీమధ్య సం**
**చారున్, గోపకిశోరునిన్ దలఁతుఁగృష్ణా! వాసుదేవప్రభూ!"[1]**

శ్రీ వాసుదేవ నామ శతకము 78వ పద్యము

రాజీవ దళాయతాక్షుడు, కరుణాసింధువు ఘనశ్యామలాకారుడు, బృందావన మధ్యసంచారుడు, గోపకిశోరుడు, మురళీగానామృతాస్వాదుడు అయిన శ్రీకృష్ణుని తలంచెదను అంటారు.

'కంసారి' అను నామాన్ని వివరిస్తూ,

**"కమలేశా! కమలాక్ష! కౌస్తుభమణి గ్రైవేయ కోద్భాసితా**
**కమనీయాసన! కాంచనాంబరధరా! కల్యాణదా! భక్తహృ**
**త్కమలాగారవిహార! కామజనకా! కంసారి! కారుణ్య ర**
**త్నమ! కాపాడు!కటాక్షమొల్కి యికఁగృష్ణా! వాసుదేవప్రభూ!"[2]**

శ్రీ వాసుదేవ నామ శతకము 87వ పద్యము

కౌస్తుంభమణి గ్రైవేయకోద్భాసితుడు, కమనీయమైన ఆననము గలవాడు, శుభములనిచ్చువాడు, కామజనకుడు, కంసారి, కారుణ్యరత్నము, కాంచనాబరధరుడు అయిన ఓ కృష్ణా! కటాక్షమొసగి కాపాడుమా! అంటారు.

"విదురాక్రూరవరప్రదాన" అను నామాన్ని వివరిస్తూ

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 47
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 52

**"విదురాక్రూరవరప్రదాన నిపుణా! వేదాంతవేద్యా! రమా**
**స్పద! నీలాభ్రశరీర! వేణుముదితా! బ్రహ్మార్చితా! వల్లవీ**
**వదనాంభోరుహ చంచరీక! కరుణావారాశి! భక్తప్రియా!**
**యదువీరా! యమునా విహార! హరి! కృష్ణా! వాసుదేవ ప్రభూ!"[1]**

శ్రీ వాసుదేవ నామ శతకము 94వ పద్యము

కృష్ణుడు వేదాంతవేద్యుడట. రమాస్పదుడు, బ్రహ్మార్చితుడు, కరుణావారాశి, భక్తప్రియుడు, యదువీరుడు, యమునావిహారి. ఇట్లు ఎన్నో విధములుగా శ్రీకృష్ణుని రూపగుణ సౌందర్యమును తనివితీర వర్ణించిరి. ప్రతి పద్యమున వీరి కృష్ణభక్తి పారవశ్యము పరవళ్ళు త్రొక్కుచున్నది.

## 4.6 అంజలి: -

'కవిశేఖర' శ్రీ గురుజాడ రాఘవశర్మగారి గురుపరంపరలో ముఖ్యులైనవారు శ్రీశ్రీశ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ మచ్ఛంకర భగవత్పాద ప్రతిష్ఠిత శ్రీ కాంచీ కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ మచ్చంద్రశేఖరేంద్ర సరస్వతీయతీంద్రులు. వీరంటే వారికి అమితమైన గురుభావము. శ్రీ శర్మగారు రచించిన 'అంజలి' కావ్యమును పరిశీలించినచో ఈ విషయము సుస్పష్టమగును.

ఈ కావ్య ప్రారంభములోనే

**"శ్రీరాజీవదళాయతాక్షి! మృదులస్మేరా! జగన్మోహినీ!**
**కారుణ్యామృతవర్షిణీ! సకలలోక క్షేమ సంధాయినీ!**
**ధీరోదాత్త మనీషి ధీకుహర సద్దీపాంకురా! భూరిసం**
**సారోత్తారక చంద్రశేఖర మనః సంపూజ్య కామాంబికా!"[1]** అంజలి 1 వ పద్యము

చంద్రశేఖరుల మనస్సునందుండెడి తల్లిని వీరు దర్శించగల్గిరి. ఆ తల్లి కామాక్షి ! కామ్యార్థసంధాయిని. శివనిత్య నూతన కళలతో వెలుగొందె శ్రీ రాజరాజేశ్వరి శ్రీమచ్ఛంకర చంద్రశేఖరుల తపశ్శ్రీ రూపిణి ఆమె శాంకరి అని వర్ణించిరి. ఆ తల్లి ఇంకా ఎటువంటిదో చూడండి.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వాసుదేవ నామ శతకము పుట : 55
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ అంజలి పుట : 1

**"ఘన తాపత్రయహారిణీ! దురితసంఘశ్రేణి సంహారిణీ!**

**జనతాభీష్ట వరప్రదాయిని! మహా జాజ్జ్వల్య తేజఃస్వరూ**

**పిణి! సచ్చిద్ఘనరూపిణీ! మునిమనో వేదాంత సంచారిణీ!**

**జననీ! సద్గురు చంద్రశేఖర మనః సంకల్ప సద్రూపిణీ!"[1]** అంజలి 6 వ పద్యము

చంద్రశేఖరులమనః సంకల్పరూపిణియైన అమ్మ అన్ని పాపములను పోగొట్టేది. జనుల కోరిన కోరికల దీర్చేది. మునిమనో వేదాంత సంచారిణి. మహాజాజ్జ్వల్య తేజ స్స్వరూపిణి. ధర్మాభిసంవర్ధిని. కరుణా రూపిణి, సృష్టికారిణి, జగత్కల్యాణ సంధాత్రి. నిఖిలభక్తోద్ధారిణి. ఈ తల్లి కామాక్షీ దేవి ఎల్లప్పుడు అద్వైతానంద రసప్రపూర్ణులైన శ్రీ చంద్రశేఖరులహృదయ పద్మమునందు శోభిల్లు తల్లి.

"సంతతాద్వైతానంద రసప్రపూర్ణగురుహృత్పద్మస్థితా!శోభితా!"[2] అని వర్ణించిరి. చంద్రశేఖరులను దర్శించిన వీరు ధన్యులు. అంతేగాక చంద్రశేఖర హృదయ పద్మస్థితమైన కామాక్షి దేవిని దర్శింపగల్గుట విశేషము.

**"అమ్మా! శారద! తొలి జ**

**న్మమ్మున నీ పాదరజము, మామక ఘన శీ**

**ర్షమ్మున దాకఁగ జిహ్వా**

**గ్రమ్మున నమృతాక్షరములు కదలెఁగదమ్మా!"[2]** కల్పలత వినతి 1 వ పద్యము

వీరే కల్పలతలో 'వినతి' ఖండికలో ఆ తల్లి అనుగ్రహము కలిగినందుననే తాను కవిత్వ వ్రాయగలిగానని చెప్పుకొనిరి.

ధర్మమునకు గ్లాని సంభవించినపుడు భగవంతుడు ఏదో ఒక రూపములో అవతరించును. "ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" అని గీతాకారుడు చెప్పినట్లుగా ధర్మప్రతిష్ఠాపనకై అవతరించిన కారణజన్ములు శ్రీ చంద్రశేఖర యతీంద్రులు.

**"కారణ జన్ముఁడై సుకృత కల్పకమౌచు తపః ఫలమ్ము నా**

**దారగఁబండువాడగుచు నాపదలన్ దురపిల్లు లోకమున్**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ అంజలి పుట : 1
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ కల్పలత పుట : 3

**భూరి కృపాకటాక్షముల బ్రోవనిటన్ దయజేసినట్టి, సు**

**శ్రీ రమణీయ మూర్తిని, స్మరింతు, యతీంద్రుని, చంద్రశేఖరున్!"**[1] అంజలి 10 వ పద్యము

ఆపదలతో తల్లడిల్లు లోకమును తన కృపాకటాక్షములచేత పోగొట్టుటకు కారణజన్ములై అవతరించిన సుశ్రీ రమణీయమూర్తియైన శ్రీ చంద్రశేఖర యతీంద్రులను స్మరింతును అని చెప్పుటలో శ్రీ శర్మగారికి చంద్రశేఖరుల పట్లగల భక్తి గౌరవములు వెల్లడియగుచున్నవి. వీరు ఇంకను ఎంతటి శక్తి సంపన్నులో చూడండి. శ్రీ చంద్రశేఖర యతీంద్రులు కనువిచ్చినంతనే జగమునకు మేలుకలుగునట. శాంతి కలుగునట. ప్రజానీకము ఘోర సంసారమనెడి సాగరమున మునిగి తపిస్తూ పాపములను పోగొట్టుమని ప్రార్థింపగా వారి కృపాకటాక్ష వీక్షణములచేతనే పోగొట్టుదురని వారిని దర్శింప దరి జేరుదురట. మహాత్ములను దర్శించి నంతమాత్రముననే పాపములు తొలగి పోవుననుటకిది దృష్టాంతము.

శ్రీ మచ్చంద్రశేఖర యతీంద్రులు సార్థక నామధేయులనుచున్నారు.

**"మీ రమృత స్వరూపులరు, మీవరనామమె సార్థకమ్మునై**

**తారకమౌచు సంసరణ తాపము దీర్చు సుధామృతమ్మునై**

**సారెకు సంస్మరింతురు, ప్రసన్నత బ్రోతురటంచు జీవనా**

**ధారమటంచు భక్తులిల, ధన్యులు శ్రీకర చంద్రశేఖరా!"** అంజలి 12 వ పద్యము

మీ స్వరూపమే అమృతమయము. మీ పేరే సార్థక నామధేయము. చంద్రుడు అమృతమునకు చల్లదనమునకు ప్రతీకగనుక వీరు చంద్రశేఖరులు గనుక వీరి పేరు తలంచినంత మాత్రముననే తాపము దీర్చి ప్రసన్నతతో బ్రోచుదురని, వీరే తమ జీవనాధారమని భక్తులు తలంచుదురట.

కవిశేఖర శ్రీ గురజాడ రాఘవశర్మగారు సందర్శించిన శ్రీ చంద్రశేఖరుల స్వరూప సందర్శనము:

**"కటిపై మూపున యోగి చిహ్నమనఁగా! గాషాయ వస్త్రమ్ము, సం**

**దిట దండమ్మెలమిన్ గమండలమునున్ గీలించి హస్తమ్మునన్**

**నిటలంబందు విభూతిఁదీర్చి తులసిన్ శీర్షమ్మునన్ దాల్చి ది**

**క్తటులన్ గాంతులుక్రమ్మ, సాగు, మిము సందర్శించుటల్ భాగ్యముల్"**[2]అంజలి26వ పద్యము

కటి ప్రదేశముపై మూపున యోగి చిహ్నమైన కాషాయ వస్త్రమ్ము, చంకలో దండము, ఆ ప్రక్క

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ అంజలి పుట : 3
2. పైదే
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ అంజలి పుట : 9

చేతిలో కమండలము ధరించి, ఫాలమందు విభూతి తీర్చిదిద్దుకొని, తలపై తులసిమాలను ధరించి దిక్కులంతట కాంతులు విరజిమ్ముచు సాగు మిమ్ములను దర్శించుట అదృష్టము అని శ్రీ శర్మగారు భావించిరి. వారేగాదు వారితో నేను (రాజరాజేశ్వరి) కూడా కాంచీపురము వెళ్ళుట వారిని దర్శించుకొనే భాగ్యము కలుగుట పూర్వజన్మ సుకృతము.

శ్రీ చంద్రశేఖరుల దర్శించుట వారితో సంభాషించుట పాద ప్రక్షాళనములు ఎల్లప్పుడు లింగార్చనలు. తీర్థములను సేవించుట, ప్రసాద సేవనము ఇవి పుణ్య విశేషము గల వారికే లభ్యమగును.

శ్రీ శర్మగారు భక్తిపారవశ్యమైన హృదయంతో వీరి సందర్శనమునకు పులకితులై

**"సంతతానందలహరి విశ్రాంతి గొనుచు**
**బ్రహ్మలోకమ్ము నుండి కేవలము భార**
**తమ్ముఁదరియింప దైవమ్ము నాగ**
**నవతరించితె! సంయమీంద్రా! జగాన"[1]** అంజలి 28 వ పద్యము

ఓ సంయమీంద్రా! ఆనందలహరిలో విశ్రాంతి గొనుచు కేవలము భారతావనిని తరియింపజేయుటకై అనునట్లుగా బ్రహ్మలోకమునుండి అవతరించితిరా! అని శర్మగారు పలికిరి.

శ్రీ చంద్రశేఖరులనుగాంచినంతనే భక్తశ్రేణి

**"అమితోత్సాహముతో బిగించి తనుమధ్యంబుత్తరీయాన, దే**
**హమదెల్లన్ బులకింప భక్తి పరతన్ సాష్టాంగ దండ ప్రణా**
**మమునన్ వ్రాలుచు పాహిమాం శరణు హేమాంపాహి శ్రీ సద్గురూ**
**త్తమ! దేవా! యని ప్రార్థనల్ సలుపు భక్తిశ్రేణి గదా!"[2]** అంజలి 13 వ పద్యము

అమితోత్సాహముతో నడుము భాగమున ఉత్తరీయమును బిగించి దేహము పులకరింపగా భక్తి పరవశత్వముతో "పాహిమాం శరణు హేమాంపాహి" శ్రీ సద్గురూత్తమ! దేవా! అని సాష్టాంగదండ ప్రణామములు సలుపుదురని వర్ణించిరి.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ అంజలి పుట : 9
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ అంజలి పుట : 3

ఇదియు నేను చూచుట తటస్థించినది. వీరు కనబడగానే అందరు సాష్టాంగ నమస్కారమునే చేసెడివారు.

శ్రీ చంద్రశేఖర యతీంద్రులు ఆసేతు శీతాచల మధ్యస్థ భారత దేశమంతయు పాదచారియై సంచరించారు. ఆ విషయమును

**"ఆ సేతు దివ్య హిమాచల మధ్యస్థ**
**భారతమున్ గన్న పాదచారి**
**పట్టణారణ్య పర్వత భాగముల జుట్టి**
**ప్రాంజలిగొను ప్రజారంజకుండు**
**సంగీత సాహిత్య సత్కళావిదుల, స**
**మ్మానమ్ముగొను కళాజ్ఞానమూర్తి**
**స్వరలయా న్వితమైన స్వస్తివాచకములఁ**
**దన్మయుఁడౌ మహాద్వైతమూర్తి**

**తనకు ఁబ్రతి బంధకమ్మాయె ధర్మపత్ని**
**దర్శనం బీయ స్వేచ్ఛ నందఁటి కటంచు**
**సన్యసించిన, శ్రీరామచంద్రమూర్తి!**
**తఱలి వచ్చితె! చంద్రశేఖర యతీంద్ర!"**[1] అని కీర్తించిరి. అంజలి 15 వ పద్యము

శ్రీ శర్మగారు చంద్రశేఖరులను త్రేతాయుగ శ్రీరామచంద్రమూర్తే ఈ యుగ (కలియుగ) యతీంద్ర దివ్యమూర్తిగా అవతరించినట్లుగా భావించిరి.

క్రమముగా వేదోద్ధరణకై ఆర్తితో చేయు బ్రాహ్మణుల ప్రార్థనలు విన్నారా! అన్న పానీయాదులు కఱవాయెను. పోషించడను ప్రజాఘోష విన్నారా! రాజు లేడు. ఇది ప్రజారాజ్యమ్ము - ప్రజల మేలు కోరి పాలించడను ప్రజావాంఛ విన్నారా! అని నిత్యము కలహవార్నిధిలో మునిగి సౌఖ్యమెరుగని శుష్కదుష్కాల మందు భారతావని నుద్ధరింపగా నూరూరు పాదచారిగా వెడలిన మహానుభావునిగా దర్శించిరి.

శ్రీ చంద్రశేఖరులను శ్రీ శర్మగారు సాక్షాత్తు ప్రత్యక్ష దక్షిణామూర్తి స్వరూపముగా కళ్ళకుకట్టినట్లు వర్ణించిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ అంజలి పుట : 5

"నామజపమెమేటి నీమమ్ము, శ్రీరామ
నామమ్ము వ్రాయ(బుణ్యము లభించు
శ్రీహర దేవాభిషేకమ్ము(సకల దు
రితహరణమ్ము(సు శ్రీ కరమ్ము
దినము గీతామృత దివ్యపానమ్ము, తా
పత్రయహరము, శుభప్రదమ్ము
ఉపనిష ద్విజ్ఞాన యోగమ్ము, భవతార
కమ్ము (బ్రత్యక్ష మోక్షప్రదమ్ము
ప్రతినిమేషమ్ము, శ్రీ భగవంతు దివ్య
సంస్మరణ ముఖ్య, మిహపర సాధకమ్ము
తెలిసి సేవింపుడనుచు, సందేశమొసగు
పురుషు(బ్రత్యక్ష దక్షిణామూర్తి (దలతు!"[1]

నామ జపము వలన పుణ్యము లభించునని, శ్రీహర దేవాభిషేకమ్ము వలన సమస్త పాపములు తొలగునని, గీతామృతపానముచే తాపత్రయ హరమగునని, ఉపనిష ద్విజ్ఞానయోగమ్ము ప్రత్యక్షమోక్షమొసంగునని, ప్రతినిముషము భగవంతుని దివ్య సంస్మరణ ముఖ్యమని అదియే ఇహపర సాధకమని, అది తెలిసి సేవించడని సందేశమొసగు పురుషుని సాక్షాత్తు ప్రత్యక్ష దక్షిణామూర్తిని స్మరింతును. అని చెప్పుటలో శ్రీ చంద్రశేఖరుల సందేశ సారమును శ్రీ శర్మగారు పుక్కిట బట్టినట్లుగా ఒంటిన జీర్ణించుకున్నట్లుగా తెలియుచున్నది.

శ్రీ శర్మగారు చంద్రశేఖరులను సాక్షాత్తు శంకరపూజ్య పాదులుగా భావనచేయుచున్నారు. శ్రీ శంకరాచార్యులు దేశదేశాలు తిరిగి తమ శక్తిపీఠాలను స్థాపించి ఆయా ప్రాంతములనుద్ధరించినట్లే శ్రీచంద్రశేఖరులు కూడా

"అక్షీణోజ్జ్వల శక్తి భారతమునం దాయా ప్రదేశాలు,పు
ణ్య క్షేత్రమ్ములుగాగ నాలయములన్ స్థాపించి పాపౌఘమున్
బ్రక్షాళించిరి యాదిశంకరులె యవ్వానిన్‌గనన్ సాగితే!
సాక్షాచ్ఛంకర పూజ్యపాదులయి, దీక్షన్ దేశదేశమ్ములన్"[1] అంజలి 18వ పద్యము

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ అంజలి 1, 2 పద్యాలు పుట : 6

ఆ ధర్మప్రతిష్ఠాపనకై మరల అవతరించిన శంకరులుగా వీరుభావించిరి. లేకపోతే శ్రమను పోగొట్టి, పాపాలనణచు తీర్థంబిది అని దేవాలయములివి, పుణ్యప్రదేశము లివి, మహర్షులు తపశ్శక్తి చేత ప్రతిష్ఠించిన తావులివ్వి పుణ్యము చేకూర్చిన తావులివ్వి, వ్రతములు, యజ్ఞమ్ములు, దానధర్మమ్ములను జేసిన 'తావులివ్వి చూచుటకు రండని చూపించు ప్రజ్ఞ పూర్వజన్మవాసనలున్న వానికే గాని మరియొకరికి లభింపదని వీరి భావము.

శ్రీ చంద్రశేఖరులు ఎంతటి మహిమాన్వితులో వివరించి, వారి సన్నిధానము మిక్కిలి ఆనందమును చేకూర్చునని చెప్పుచున్నారు.

> **"చేయుచునుంద్రు, రామాయణ భారత**
> **భాగవత గ్రంథ పఠన మొకట**
> **పరవశులయి రామభజనల, నామ కీ**
> **ర్తనలఁజేసెడి భక్తజనము లొకట**
> **భక్తియై దేవతోపాసనా జపములన్**
> **గావించు దీక్షాజనమ్ములొకట**
> **మోదమ్మునన్ ఫలపుష్పాదికమ్ము శ్రీ**
> **వారి కందించు సద్భక్తులొకట**
> **తెప్ప వాల్పక శ్రీవారు ప్రీతి నెఱపు**
> **నర్చనాదికముల మగ్నుగులైన వార**
> **లచటి నా బాల గోపాల, మరయ మీదు**
> **సన్నిధానమె, ఆనందద స్థలము మాకు".[1]** అంజలి 20వ పద్యము

శ్రీవారి సన్నిధికి చేరినంతనే ఒక ప్రక్క రామాయణ, భారత, భాగవత గ్రంథపఠనములు, ఒకప్రక్క పరవశులయి రామభజనను చేయు భక్తజనులు ఒక ప్రక్క భక్తితో దేవతోపాసనా విధిని జపములను గావించు దీక్షాజనము, ఇంకొక ప్రక్క ఆనందముతో ఫల పుష్పాదికములను శ్రీవారికందిచ్చు సద్భక్తులు. అచ్చట ఆ బాలగోపాలము తెప్పవాల్చకుండా శ్రీవారు ప్రీతితో చేయు అర్చనాదికములలో నిమగ్నులై ఉందురు అని వర్ణించిరి. దీనినిబట్టి వారు కొలువైయున్న స్థలము ఎంతటి ఆధ్యాత్మిక భావాన్ని, శాంతిని కలిగిస్తుందో తెలియుచున్నది.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ అంజలి పుట : 7

శ్రీ శర్మగారు ఇటువంటి మహామహిమాన్వితులైన శ్రీ చంద్రశేఖరుల అవ్యాజ కృపాకటాక్షములకు పాత్రుండనైతినని, అది తమ పూర్వజన్మసుకృత విశేషమని, తాను వీర రాఘవుడనని, గురుజాడ వంశములో కౌండిన్యస గోత్రములో ఉద్భవించితినని[1] చెప్పుకొనుటయే కాక తాను నివసించిన స్థలము బృందావనము అదియె మచిలీపట్టణము అని దాని యొక్క వైభవమును కూడ కీర్తించిరి. దీనిని బట్టి వారికి బందరు పట్టణముపై గల అభిమానము వ్యక్తమగుచున్నది.

**"కలరిచ్చోటఁగలారు మున్నిట కళాకారుల్ యతీంద్రుల్, మహో**
**జ్జ్వల శక్తి ప్రతిభా సమన్వితులు, శాస్త్ర జ్ఞాన సంపన్న మూ**
**ర్తులు, మా బృందావన రమ్య పట్టణము నందున్, సర్వసంపత్కళా**
**నిలయంబి నగరమ్ము, దీనిఁగనుగొంటే! యోగిరాట్చంద్రమా!"[1]**

ఓ యోగిరాట్చంద్రమా! మా బృందావన రమ్య పట్టణమునందు ఇంతకుముందు ఎందరో కళాకారులు, యతీంద్రులు మహోజ్జ్వల ప్రతిభాశక్తి సమన్వితులు, శాస్త్రజ్ఞాన సంపన్నులు కలరు. ఈ పట్టణము సర్వసంపదలకు, కళలకు నిలయమైనది. దీనిని జూచితిరా! అని ఏమి తెలియనట్లు ప్రశ్నించుచుండిరి.

శ్రీ చంద్రశేఖరులు మచిలీపట్టణము లోని శంకరమఠమునకు వచ్చుట నాల్గయిదు రోజులు వారి ఉపన్యాసములు, వారి గజారోహణము నా బాల్యములో చూసినట్లుగా ఇప్పటికి గుర్తు ఉన్నది.

కృష్ణామండలి భక్తులు, అకలంకోజ్జ్వల దివ్యతేజునకు దివ్యానంద చిన్మూర్తికి, సకల ప్రాభవకీర్తి చంద్రులైన శ్రీ చంద్రశేఖర యతీంద్రులకు కనకదుర్గాంబ సత్కృపాకలన చేత విజయవాడలో వజ్రకిరీటము పెట్టి జాజ్వల్య దివ్యకళాశోభితమూర్తియై వెలయునట్లుగా చేసిరి. ఇది నిజముగా భక్తకోటి చేసికొన్న పుణ్యములు. అవి ఫలించినాయి.

శ్రీ చంద్రశేఖరుల పాదమహిమ గొప్పదని తలంచిన శ్రీ శర్మగారు కృష్ణాజిల్లాలోని ప్రముఖ దేవాలయాలను వాటి వైభవమును వర్ణిస్తూ, వాటి పూర్వవైభవము ఏ మాత్రమైన తగ్గియున్నచో వానిని చూచి పునరుద్ధరింపవలసినదని తమ గురువులను ఈ విధముగా వేడుకొనుచున్నారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ అంజలి పుట : 7

**"కరుణా ప్రపూర్ణ శ్రీ కనకదుర్గాదేవి**

**వేంచేసినట్టి శ్రీ విజయవాడ**

**లలితయోగానంద లక్ష్మీ నృసింహ దే**

**వాలయ స్థలము, వేదాచలమ్ము**

**భరతనాట్య కళాచతురుడు సిద్ధేంద్ర స**

**ద్గురు పీఠ నిలయమ్ము కూచిపూడి**

**అభినయశాస్త్ర విద్యాప్రవీణుండు, వర**

**దయ్యవిద్యానిలయమ్ము, మువ్వ**

**అపరదక్షిణ కాశియనఁగ, నాగేశ్వరు**

**లీలాస్థలము కదళీపురమ్ము**

**మ్రొక్కుబడులనందు పుణ్య సుబ్రహ్మణ్య**

**మూర్తి దేవళము శ్రీ మోపిదేవి**

**భాసురమణి, మహిషాసురమర్దనీ**

**దేవీ నిలయము ధాత్రి శివగంగ**

**విమల కృష్ణాబ్ధి సంగమ పవిత్రస్థలము**

**హంసలదీవి, కృష్ణాలయమ్ము**

**కలవు దేవతా నిలయముల్ కలవు సత్క**

**ళాస్థలములు, కృష్ణామండలమున, తొంటి**

**వైభవము తగ్గియున్న యవ్వాని గాంచి**

**శ్రీ గురూత్తమ! పునరుద్ధరింపరయ్య!"[1]** అంజలి 25 వ పద్యము

కరుణాప్రపూర్ణ శ్రీ కనకదుర్గాదేవి వేంచేసినట్టి పవిత్రస్థలము విజయవాడ. యోగానంద లక్ష్మీ నృసింహస్థలము వేదాద్రి. భరతనాట్య కళలో చతురుడైన శ్రీ సిద్ధేంద్రయోగి సద్గురు పీఠమున్న స్థలము కూచిపూడి. అభినయ శాస్త్ర విద్యా ప్రవీణుడు వరదయ్య విద్యానిలయమైనది మువ్వ. అపరదక్షిణ కాశిగా మినుతి కెక్కిన నాగేశ్వరుని లీలాస్థలము కదళీపురము. అనగా పెదకళ్ళేపల్లి. మ్రొక్కుబడులందుకొను పుణ్య సుబ్రహ్మణ్యస్వామి దేవళము గలది శ్రీ మోపిదేవి. భాసురమణి మహిషాసురమర్దనీ దేవినిలయమైన భూమి శివగంగ. విమలమైన కృష్ణానదీ సంగమ పవిత్ర స్థలము హంసలదీవి. ఇది శ్రీ కృష్ణునికి నిలయమైనది. కృష్ణామండలమున ఎన్నో దేవతానిలయములు, సత్కళాస్థలములు గలవు. అని వర్ణించి మీ పాదముల

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ అంజలి పుట : 8

స్పర్శచే వీటిని పునరుద్ధరింపజేయమని ప్రార్థించిరి. అట్టి మహా మహిమాన్వితులు శ్రీ చంద్రశేఖరులు. ఈ విధముగా శ్రీ శర్మగారికి శ్రీ మచ్చంద్రశేఖరేంద్ర సరస్వతీ యతీంద్రుల పట్ల గల గురుభావము వ్యక్తమగుచున్నది.

## 4.7 శ్రీ సువర్చలాంజనేయమ్: -

శ్రీ శర్మగారు శ్రీ కృష్ణోపాసకులే గాక శ్రీ సువర్చలా సమేత ఆంజనేయస్వామిని కూడ భక్తితో సేవించి తరించిన మహాత్ములు. వీరి గురువులు, దేశికోత్తములు బ్రహ్మశ్రీ భాగవతుల అన్నపూర్ణశాస్త్రి గారి వద్ద శిష్యరికం చేసినందువలన తెనాలిలో వేంచేసిన ఆంజనేయుని సేవచేసికొను భాగ్యము కలిగినదని వీరే ఈ గ్రంథములో చెప్పుకొనిరి.

**"శ్రీ రంజిల్ల, సువర్చలాసతి, యధిష్ఠింపంగ౹జెంతన్. మహా**
**ధీరున్, వీరవరేణ్యు, భాస్కర ప్రభా దేదీప్యునిన్, మన్మధా**
**కారున్, రాఘవకార్యదక్షు, త్రిజగత్ కల్యాణు, త్రైలోక్య సం**
**చారున్, గొల్తు, పవిత్ర భాగవత వంశస్వామియౌ, భక్త లో**
**కారాధ్యైక, తెనాలి పంచముఖదేవా! శ్రీ హనూమత్ప్రభూ!"[1]** శ్రీ సువర్చలాంజనేయమ్

సువర్చలాసతిని చెంతనిలుపుకున్న వానిని, మహాధీరుని, వీరవరేణ్యుని, సూర్యకాంతి సమభాసుని, మన్మధాకారుని, రాఘవ కార్యదక్షుని, త్రిలోక ప్రభుని, త్రైలోక్య సంచారుని, భాగవతుల అన్నపూర్ణ శాస్త్రి గారి వంశస్వామియు నైన తెనాలి పంచముఖ దేవుని గొల్చెదనుఅని ప్రార్థించిరి.

ఈ స్వామిని సేవించుట జన్మాంతర పుణ్యమని భావించుట వీరిభక్తికి నిదర్శనము.

**"అది జన్మాంతర పుణ్యలబ్ధమయి లభ్యంబాయెగా, నిర్వదె**
**న్మిది వర్షమ్ములు, నీ మహోత్సవములన్ సేవించు భాగ్యమ్ము, యే**
**బదియేండ్లాయెగ నాటి నీ రచనలబ్బా! నేడు ముద్రించుట**
**య్యది చే కూరె, తెనాలి పంచముఖదేవా! శ్రీ హనూమత్ప్రభూ!"[2]**

శ్రీ సువర్చలాంజనేయమ్

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - శ్రీ సువర్చలాంజనేయమ్ పుట : 1
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - శ్రీ సువర్చలాంజనేయమ్ పుట : 19

వీరే చెప్పుకొనిన ఈ పద్యము వలన ఇరువది ఎనిమిది సంవత్సరములు ఆంజనేయ స్వామి సేవ చేసినట్లుగా తెలియుచున్నది. ఈ గ్రంథము వ్రాసిన ఏబది సంవత్సరములకు ముద్రించే భాగ్యము కలిగినదని చెప్పుకొనిరి.

**“శ్రీరామ ప్రభు పాదపద్మయుగళీ సేవా పరాధీను, సీ**

**తారామామణి, గారవించు, ప్రియభక్తశ్రేష్ఠు, శ్రీవానరా**

**కారున్, సుందరుధీరు, నీ చరణ యుగ్మం బాత్మలో నిల్పి,ని**

**న్నారాధింతు, తెనాలి పంచముఖ దేవా! శ్రీ హనుమత్ప్రభూ!”[1]**

శ్రీ సువర్చలాంజనేయమ్ 2వ పద్యము

ఓ తెనాలి పంచముఖి శ్రీ హనుమత్ప్రభూ! శ్రీరాముని పాద పద్మ యుగళములను సేవించుటయందే ఆసక్తి గలవానిని, సీతారామామణిని గారవించు ప్రియ భక్త శ్రేష్ఠుని, వానరాకారుడైనవానిని, సుందరమైన వానిని, ధీరుని, నీ చరణ కమలములను మనస్సునందు నిల్పు కొని నిన్నారాధింతును.

అని చెప్పుటలో ఆంజనేయుని గుణగణములను ఇచ్చుటకీర్తించిరి.

**“సములలౌయెవ్వని సత్కృపా మహిమచే సంసిద్ధియౌ నిత్య సౌ**

**ఖ్యములా, భాగవతాన్వయున్ నిఖిల యోగ జ్ఞాను, సస్మత్గురూ**

**త్తము, నీ భక్తుల సన్నపూర్ణు, విలసత్ పాదాబ్జ యుగ్మంబు, ని**

**త్యముఁబూజింతు,తెనాలి పంచముఖదేవా! శ్రీ హనుమత్ప్రభూ!”[2]**

శ్రీ సువర్చలాంజనేయమ్ 7వ పద్యము

నీతో సమానమై, ఎవని సత్కృపా మహిమచే నిత్య సౌఖ్యములు, ఆనందసిద్ధి కలుగునో, ఆ భాగవతాన్వయుని, నిఖిల యోగజ్ఞానుని, నీ భక్తుడు, నాగురువునైన అన్నపూర్ణుని, ప్రకాశించుచున్న వారి పాదాబ్జములను నిత్యము పూజింతును.

అని చెప్పుటలో శ్రీ శర్మగారికి తమ గురువుల పట్ల ఎంతటి భక్తి, గౌరవాదరములు గలవో తెలియుచున్నది. అంతే గాదు, వీరి గురువు తండ్రి, తాతగారు అందరు ఆంజనేయోపాసకులే అని తెలియుచున్నది.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - శ్రీ సువర్చలాంజనేయమ్ పుట : 6
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - శ్రీ సువర్చలాంజనేయమ్ పుట : 7

**"మును పన్నయ్య మహామహుండుఁదమినిన్ బూజించి, యర్థించె, పే**

**ర్మిని, నీ సేవయొనర్చె వారి సుతుఁడౌ శ్రీ దక్షిణామూర్తి, యా**

**ఘను పుణ్యాత్మజు డన్నపూర్ణగురు డా కైంకర్యమున్‌జేయ, పా**

**వన! నిన్గంటి, తెనాలి పంచముఖదేవా! శ్రీ హనుమత్ప్రభూ!"[1]**

శ్రీ సువర్చలాంజనేయమ్ 8వ పద్యము

ఓ తెనాలి పంచముఖదేవా! శ్రీ హనుమత్ప్రభూ!పూర్వము పన్నయ్య అను మహామహుడు ప్రేమతో నిన్ను పూజించి అర్థించెను. వారికుమారుడైన శ్రీ దక్షిణామూర్తియు నీ సేవయొనర్చెను. ఆ పుణ్యమూర్తి ఆత్మజుడైన అన్నపూర్ణగురువులు ఆ కైంకర్యము చేయ పావన! నేను నిన్ను చూచాను. అని చెప్పిరి.దీనిలో వీరి నిగర్వి తనము స్పష్టమగుచున్నది. మంచిగురువు లభించటము కూడ పూర్వజన్మసుకృతమే. నీ భక్తుడు మా గురువులు. మా గురువులు నీయందు అమితమైన భక్తిగలవారు కనుకనే అటువంటివారు మాకు గురువులుగా లభించి మేము సేవ చేసికొనే భాగ్యము, తద్వారా నిన్ను సందర్శించే భాగ్యము కలిగినదని చెప్పిరి. నిజముగా ఓ పంచముఖ ఆంజనేయా! నీవు గొప్ప దయాసముద్రుడివి.

**"తనివిందీరక మాటిమాటికి, భవత్ సందర్శనోత్సాహులై**

**చనుచున్ బోవుచునున్న భక్తులఁగటాక్ష శ్రీల వర్షించి, పా**

**యని సౌఖ్యంబు లొసంగునిన్ దలతునయ్యా! ఆంజనేయా! కృపా**

**వన! శ్రీ దివ్యతెనాలి పంచముఖ దేవా! శ్రీ హనుమత్ప్రభూ!"[2]**

శ్రీ సువర్చలాంజనేయమ్ 9వ పద్యము

తృప్తిదీరక మాటిమాటికి నిన్ను సందర్శించవలెనను ఉత్సాహముతో బోవుచున్న భక్తులపై కటాక్షశ్రీలను వర్షించి అంతులేని సౌఖ్యములొసంగు నిన్ను తలంచెదను.అంటారు. సందర్శించినంత మాత్రముననే భక్తులపై కటాక్షశ్రీలను వర్షించునట.

అంతేగాదు ఆంజనేయస్వామి ఉద్భవమందిన సమయమును గూడ వర్ణించిరి. అది వైశాఖమాసము కృష్ణదశమి శనివారము రోజున, కర్కటాంశలో కుంభరాశిలో, కౌండిన్యస గోత్రములో బ్రాహ్మణులు, మునులు ప్రార్థింపగా దైవాంశతో దివ్యద్దీప్తితో వైష్ణవ భక్తితో కపిరూపములో భాస్వద్దీర్ఘవాలమ్ము కలిగి అంజనాసతికి జన్మించితివి. అని వ్రాసిరి. శ్రీ శర్మగారిది కూడ కౌండిన్యస గోత్రమే. కుంభరాశిలో జననమే. నీవు పుట్టిన

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - శ్రీ సువర్చలాంజనేయమ్ 1, 2 పద్యాలు పుట : 7

గోత్రములో జన్మించినవాడను గనుక నాకు నీయందు ఇంతటి భక్తి ఒనగూడినదను భావము అయిఉండును. దీనివలన వీరి గోత్ర భక్తి వెల్లడియగుచున్నది.

శ్రీ ఆంజనేయుని ఉద్భవము జరుగగానే ప్రకృతి పులకరించిపోయినదట.

**"పవనాత్మజ! ధాత్రి నీవవతరింపన్ దివ్యపుష్పంబులన్**
**జవులూ రంగల మాధురీఫలములన్ సంతోషమేపారఁదె**
**చ్చె, వసంతుడు, మహోన్నతిన్ బ్రకృతి నిన్‌సేవించి, పూజించె, వై**
**భవమున్ జెంది, తెనాలి పంచముఖదేవా! శ్రీ హనుమత్ప్రభూ!"**[1]

శ్రీ సువర్చలాంజనేయమ్ 12వ పద్యము

ఓ హనుమత్ప్రభూ! నీవు పవనకుమారుడివి. ధాత్రి పై నీవు అవతరింపగానే దివ్య పుష్పములను, చవులూరించు మధుర ఫలములను సంతోషముప్పొంగునట్లుగా వసంతుడు తెచ్చెను. ప్రకృతి వైభవముగా, మహోన్నతముగా నిన్ను సేవించి పూజించెను.

ఆంజనేయస్వామిది ప్రకృతి అంశయే. ఆయన పవనకుమారుడు. గనుక ఈయన ఉద్భవమందిన వెంటనే ప్రకృతి పులకరించుట, దివ్యపుష్పములను, చవులూరించు మధురఫలములను వసంతుడు తెచ్చెనని వర్ణించుట సహజసిద్ధముగానున్నది. శ్రీ శర్మగారి ఈ పద్యప్రారంభములోనే "పవనాత్మజ" అనుటలోనే ఈ ధ్వని స్ఫురించుచున్నది.

**"పటు రోషంబున, వజ్రినిన్ మరల జెంపన్ గొట్ట నీ తండ్రి, యం**
**తటఁగోపమ్మున సర్వజీవ గణ ప్రాణాల్ బిగ్గ పట్టంగ, సం**
**కటమున్ జెందె, జగమ్ము నిన్నుఁగొలువంగాఁబ్రాణముల్ దక్కె**
**ప్పటి యట్లంత, తెనాలి పంచముఖదేవా! శ్రీ హనుమత్ప్రభూ!"**[2]

శ్రీ సువర్చలాంజనేయమ్ 17వ పద్యము

ఓ తెనాలి పంచముఖదేవా! శ్రీ హనుమత్ప్రభూ! ఎంతో రోషముతో నీ తండ్రి వజ్రిని చెంప మీద కొట్టగా అతడు కోపముతో సర్వజీవుల ప్రాణాలు బిగపట్టగా లోకమంతా సంకటస్థితిలో పడెను. నిన్ను

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - శ్రీ సువర్చలాంజనేయమ్ పుట : 8
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - శ్రీ సువర్చలాంజనేయమ్ పుట : 9

ప్రార్థింపగా ఎప్పటివలె ప్రాణములు దక్కెను అని చెప్పిరి. ఏదైనా సంకటస్థితి అనగా ప్రాణాపాయస్థితి సంభవించినపుడు ఆంజనేయుని స్మరించినంత మాత్రముననే అది తొలగిపోయి ప్రాణరక్షణ కలుగునని తెలియుచున్నది.

**"బలమున్ దేజము, నాయువున్ ఘనమహాభాగ్యంబులున్ ధీ యశో**
**బలమున్ సౌఖ్యము, సర్వసంపదల, నా బ్రహ్మాదులాయావర!**
**మ్ముల దీవించిరి, స్వార్థతన్ దలచి, సంపూర్ణున్, గుణాతీతు,ని**
**న్న లఘున్ దివ్య తెనాలి పంచముఖదేవా! శ్రీ 'హనుమత్ప్రభూ!"**[1]

శ్రీ సువర్చలాంజనేయమ్ 18వ పద్యము

ఓ హనుమత్ప్రభూ! నీకు బలమును, తేజమును, ఆయువును, గొప్ప భాగ్యములను, బుద్ధి బలమును, యశస్సును, సౌఖ్యమును, సర్వసంపదలను ఆయా వరములను ఆ బ్రహ్మాదులిచ్చి దీవించిరి. సంపూర్ణుడు, గుణాతీతుడు, అలఘుడైన నిన్ను స్వార్థముతో తలచి ప్రార్థించిరి. అని చెప్పిరి. ఇక్కడ ఆంజనేయుడు సకల దేవతా స్వరూపుడని భావము. దేవతలందరు తమ తమ శక్తులను ఆతనికి ధారవోసిరి. కనుకనే హనుమంతుని ప్రార్థించినంతనే భయము, జాడ్యము, రోగములు తొలగిపోవును.

**"బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వమరోగతా**
**అజాడ్యం వాక్పటు త్వంచ హనూమస్మరణాభవేత్."**

అంతేగాక ఆయన సకల శాస్త్రపారంగతుడు.

**"అమరేంద్రస్తుత! భానుదిక్కుగనుచున్, హస్తాద్రిపై నొక్క పా**
**దమునున్ బూర్ణగిరిన్ మరొండు, నిడి విద్యన్ నేర్వగా గోరమో**
**దమునన్ నేర్పె, నినుండు నీకు వడి శాస్త్రంబుల్ సమస్తమ్ము, బా**
**ల్యమునన్ దివ్య తెనాలి పంచముఖదేవా! శ్రీ హనుమత్ప్రభూ!"**[2]

శ్రీ సువర్చలాంజనేయమ్ 19వ పద్యము

ఓ తెనాలి పంచముఖ దేవా! శ్రీ హనుమత్ప్రభూ! అమరేంద్రస్తుత! సూర్యుని దిక్కుచూస్తూ హస్తాద్రి పై ఒక పాదము పెట్టి, పూర్ణ గిరిపై మరొక పాదమును బెట్టి సూర్యుడు సమస్త శాస్త్రములు నీకు బాల్యములోనే

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - శ్రీ సువర్చలాంజనేయమ్ 1, 2 పద్యాలు పుట : 9

నేర్పెను. అని చెప్పుటచేత ఆంజనేయుడు సకల శాస్త్ర పారంగతుడు అని తెలియుచున్నది. అందువలననే ఆదిత్యుడు తన కుమార్తె అయినటువంటి దానిని, తేజస్సు, సౌందర్యము, సద్గుణములు కలిగిన సువర్చలా రమణి నీకే చెందాలని శుభలగ్నములో, దుందుభిస్వనములు మ్రోయగా వివాహము చేసెనని కల్యాణ ఘట్టమును వర్ణించిరి.

"పరిపూర్ణ సస్యసంభరితమౌ యవని మం
డలము కల్యాణ మంటపముగాఁగ!
చిత్రవర్ణాభిరంజితమైన గగనమ్ము
కడలు ముట్టిన మేలు కట్టుగాగ!
తగసప్తకుల పర్వతమ్ములు వేదిక
పై మ్రోయు మేటి స్తంభములుగాగ!
తారకల్ సుందర తోరణమ్ములుఁగాగ
సకల గ్రహములు దీపికలు గాగ
గీర్వాణులున్ గార్యనిర్వాహకులు గాగ
దమిఁత్రిమూర్తులు ప్రవర్తకులు గాగ
మానిత వేదముల్ మంత్రమ్ములును గాగ
సర్వజీవులును, ప్రేక్షకులుగాగ
అప్సరస్త్రీలు నాట్యమ్ము సల్పఁగ,నార
దాదులు మేటి గాయకులు గాగ
అమరకాంతలు దివ్యసుమములు వర్షింప
శుభముగా, సురలు దుందుభులుమ్రోయ
మంగళయున్ గౌరి, మంగళహారతి
బట్ట, సరస్వతి పాట బాడ
పుణ్యజగద్ధేతు భూత విఖ్యాతమై
యొప్పు కల్యాణ మహెూత్సవమున
ప్రకటనాశక్తి సువర్చలా, ప్రియసతీ
మణి నీవు, పాణిగ్రహణముఁజేసి
నిండ వర్షించితి, నిఖిల జగములగ
ల్యాణ సంపదల సర్వాత్మవయ్యు

దేవతామౌనిగేయ! ఉద్దీప్యవజ్ర
కాయ! రాఘవకార్యధౌరేయ!పూజ్య
శ్రీ సువర్చలాప్రియ! వరశ్రీ తెనాలి
నిలయ! శ్రీ పంచవక్త్రాంజనేయ! దేవ!”[1]

శ్రీ సువర్చలాంజనేయమ్ 21వ పద్యము

పరిపూర్ణమైన పంటపొలములతో కూడిన అవని కల్యాణమంటపముకాగా, చిత్ర విచిత్ర వర్ణములతో నొప్పు ఆకాశము సముద్రమునంటిన మేలు కట్టుకాగా, సప్తకుల పర్వతములు వేదికపై మ్రోయు కల్యాణ మంటప స్తంభములు కాగా, నక్షత్రములు సుందరమైన తోరణములుకాగా, గ్రహములన్ని దీపికలుకాగా, గీర్వాణులు కార్యనిర్వాహకులు కాగా, బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు ప్రవర్తకులు కాగా, వేదములు మంత్రములు కాగా, సర్వజీవులును ప్రేక్షకులుకాగా, అప్సరస్త్రీలు నాట్యము చేయగా, నారదాదులు గాయకులు కాగా, శుభముగా దేవకాంతలు దివ్యసుమములు వర్షింపగా దేవతలు దుందుభిస్వనములు చేయగా, మంగళమైన గౌరి మంగళహారతి పట్టగా, సరస్వతీదేవి పాట పాడగా, ప్రకటనా శక్తి గల సువర్చలా ప్రియ సతీమణినీవు సమస్త జగముల కల్యాణ సంపదలు కలిగించ నిండుగా వర్షించుటకై పాణిగ్రహణము చేసికొంటివి. అని శ్రీ సువర్చలాంజనేయుని కల్యాణ ఘట్టమును మనోహరముగా తీర్చిదిద్దిరి. అంతేగాదు ఒక గేయాన్ని కూడ రచించిరి.

## శ్రీసువర్చలామనుమత్కల్యాణము

| | | |
|---|---|---|
| పల్లవి॥ | “వెడలిరి శ్రీపంచవక్త్రులు । శ్రీ సువర్చలా ప్రియులు। | |
| | శ్రీ సువర్చలా రమణులు । | ॥వెడలిరి॥ |
| అనుపల్లవి॥ | వెడలిరి, శ్రీ హనుమత్పంచ । వక్త్రులు, భక్తులు | |
| | సంతసపడుచు, బ్రహ్మానందము, జడిగొన - కల్యాణమునకు | ॥వెడలిరి॥ |
| చరణము॥ | తడయక ఛత్రముసుశేఁణుడు బట్టి నిల్వగసం | |
| | దడిసేయుచును, మాగధుడు, పరాకులుఁదెల్ప | ॥వెడలిరి॥ |
| 2. | ఆవలివలచామరమ్ము - లంది, మైంధుడు, నీలుడు వీవ | |
| | త్రోవ దీయుచు, గంధమాదనుడు తొలగు తొలగుడని కేకలువైవ | ॥వెడలిరి॥ |

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - శ్రీ సువర్చలాంజనేయమ్ పుట : 11

3. ద్వివిధుడు బహువిధ - స్తోత్రపాఠములు
వినుతిసేయుచుండ - దండ।
ప్రవిమలపాదులనుగొని పవనుడందించుచుండ ॥వెడలిరి॥

4. హితము గోరెడి, పురో -తుడౌ, యా
వృద్ధజాంబవంతుడు దరి నిల్వ ॥వెడలిరి॥
మతిమంతుడు వినతుడు భుజావలం
బనము బట్టి వెనువెంట నడువగను ॥వెడలిరి॥

5. శరభనీల గంధమాదనులు, దు
ర్ధరుడు వేగవంతుడును, గవయుడున్
వరుసప్రహస్త గవాక్ష నల గజుల్
దండనాధులై - ముందు నడుగిడన్ ॥వెడలిరి॥

6. పృధుడున్ సుముఖుడు - జ్యోతిర్ముఖుడున్
ఋషభుడు, రుంద్రగ్రీవుడు, కేసరి
దధిముఖుడున్ - సంపాతి సేవలతో
దక్షిణమున నధిపతులై నిల్వగ ॥వెడలిరి॥

7. వర మారీచుడు - కేసరిరంహుడు
తరుణుడు గోముఖుడాదియే
గురు మంత్రులు వెనువెంట భద్రముగ
తరుణ మెరిగి, యాలోచన లీయగ ॥వెడలిరి॥

8. వరుస, సువేశుడు - హరిలో ముండును
విద్వద్దంష్ట్రుడు, తవళి యాది, న
ల్గురు కోశాధపు లుత్తరమున నే
మరక, జాగరూకత కనిపెట్టగ ॥వెడలిరి॥

9. అనవరతము శ్రీ సుగ్రీవా దు
లరంగర - క్షకులై దరి నిల్వగ
తేజోమయమూర్తి యగుచు ఉ
ష్ట్రారూఢుండై। యొయ్యారముగ ॥వెడలిరి॥

10. తన్ను గొలుచు వారల త - ప్పక దయ
దలచు శ్రీ తెనాలీ పురి నిలయుడు"[1]

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - శ్రీ సువర్చలాంజనేయమ్ పుట : 16

**శ్రీ అన్నపూర్ణగురు ప్రభువు, దివ్య సుం**

**దరుడు, హరిహరుఁడానందముగా** **॥వెడలిరి॥**

**పంచవక్త్రులు - కల్యాణమునకు**

**శ్రీ సువర్చలా ప్రియులు - ఆనందముగా[1] ॥వెడలిరి॥** శ్రీ సువర్చలాంజనేయమ్ పుట 16

**సంకీర్తనాస్తవములుగా మేలుకొలుపు పాట**

**మేలుకో। మనుమంత। మేలుకో। భగవంత।**

**మమ్మేలేటి దొరవీవు। మేలుకో॥[2]** శ్రీ సువర్చలాంజనేయమ్ పుట 12

**దివ్యసుందరమూర్తి వాడేరా.[3]**

**అని, శ్రీరామదూతా ! రావే! నాదాతా!**

**కామితఫలదాత! ఘనయోగీంద్రనుత ॥ రావే॥[4]** శ్రీ సువర్చలాంజనేయమ్ పుట 17

అని గేయములు వ్రాసిరి. దీనిని బట్టి కూడ వీరు గురువులకు వలె ఎంతటి హనుమదుపాసకులో తెలియుచున్నది.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - శ్రీ సువర్చలాంజనేయమ్ పుట : 16
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - శ్రీ సువర్చలాంజనేయమ్ పుట : 12
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - శ్రీ సువర్చలాంజనేయమ్ పుట : 13
4. శ్రీ గురుజాడ రాఘవశర్మ - శ్రీ సువర్చలాంజనేయమ్ పుట : 17

# జాతీయోద్యమ స్ఫూర్తి

# జాతీయోద్యమ స్ఫూర్తి

హృదయం భావ పరిపూర్ణమై వెల్లివిరిసినప్పుడు కవుల వాక్కులకు అమోఘ శక్తి లభించి కవిత అమృతప్రాయమౌతుంది. ఆయా భావాలు సహజ ఛందో బద్ధములై అక్షరాకృతిని పొందుతాయి. అంతర్గర్భితమైన ప్రజాశక్తిని ప్రజ్జ్వలింపజేసి, కర్తవ్యతా ప్రబోధము చేసి జాతిని ఉత్తేజపరుస్తాయి. స్వాతంత్ర్య సిద్ధికి పూర్వము యావద్భారతములోను, ముఖ్యంగా ఆంధ్రదేశంలో అట్టి మహాకవుల ప్రబోధాత్మక గేయాలు, పద్యాలు విజయ దుందుభులుగా మ్రోగాయి.

లోకోత్తర చరిత్రుడైన మహాత్మాగాంధీ గారారంభించిన అసహాయోద్యమము నుండి స్వరాజ్య సంపాదన వరకు గాంధీ గారి ఆదేశానుసారము కోట్లకొలది జనులు మాతృదేశారాధన తత్పరులై సర్వస్వము త్యాగము చేసి, స్వాతంత్ర్య సమరమున ఆహుతులైరి. 1921 సం॥ లో గాంధీగారు ఆంధ్ర దేశంలో కాలూనినంతనే వారి శంఖారావము విని కవులు, రచయితలు పండితులనేకులు వీరావేశముతో ప్రజలనుఱ్ఱుతలూగించిరి. ఆంధ్రావనిలో 1921 సం॥ నుండి 1947 సం॥ ల మధ్య పెక్కండ్రు కవులు రచించిన అనేక పద్యాలను గేయాలను ఏర్చి కూర్చి "జాతీయగీతాలు" అను పేర 592 పుటల సంకలన గ్రంథముగా రూపుదిద్దారు శ్రీ గురుజాడ రాఘవ శర్మగారు.

## 5.1 జాతీయ గీతములు: -

మహాత్మాగాంధీ గారిమీద, మాతృదేశం మీద వీరికి గల అకుంఠిత భక్తి యే "జాతీయగీతాలు" అను ఈ గేయ సంకలన గ్రంథమును వెలువరించుటకు కారణము. ఈ బృహత్కార్య నిర్వహణమున దాదాపు ముప్పది సంవత్సరములు అహోరాత్రములు కష్టించి పనిచేసిరి. ఆంధ్ర ప్రాంతంలో చాలమంది కవులను కలిసికొన్నారు. చాలా గ్రంథాలయాలను సందర్శించారు.స్వాతంత్రోద్యమంలో అసువులు బాసిన కొంతమంది ఇండ్లకు వెళ్ళి వారి కుటుంబ సభ్యుల నుండి మూలపడి ఉన్న వాటిని, అచ్చు పడక పాత కాగితాల కట్టలలో పడి ఉన్న కొన్నింటిని సేకరించారు. అసలు తామా కవితలు వ్రాశామనే విషయమే కొంతమంది కవులు మరచిపోయారు.అట్లాంటి వారు కూడా వీరు కోరగానే జ్ఞాపకం చేసికొని కొన్నింటిని వ్రాసి ఇచ్చారు. దీని కోసం కొన్ని వందల ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపిరి. దాదాపు రోజుకి ఇరవై ఉత్తరాల చొప్పున ఎవరి సహాయం లేకుండా వీరే వ్రాసి కొనెడివారు.వీలైనన్ని చోట్లకు వెళ్ళివచ్చి విస్మృతి పథంలో

పడిపోయిన వాటిని కూడా కొన్నింటిని బయటకు తీయగలిగారు. కొన్ని కర పత్రములు వేసి పత్రికలలో విజ్ఞప్తులు చేసి "ప్రజారథం" మొదలగు పత్రికల ద్వారా ప్రచారం గావించి, శ్రీయుతులు దేవులపల్లి రామానుజారావు, దాశరథి, కేశవపంతుల లక్ష్మీనరసింహశాస్త్రి, కోదాటి నారాయణరావు ప్రభృతులను కలిసికొని తెలంగాణా రచయితల రచనలను కూడా కొన్నింటిని సంపాదించారు. ఈ అన్వేషణ సమయంలోనే ప్రఖ్యాత స్వాతంత్ర్య సమరయోధులు నిష్కళంక దేశభక్తులునైన శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణరావు గారి ఫోటో మానూరు రామకృష్ణారావు గారి చేత డ్రాయింగ్ వ్రాయించి ప్రపంచానికందించిన కీర్తి శ్రీ శర్మగారికే దక్కుతుంది. లాఠీచార్జీలో చెయ్యి విరిగిన నాటి ఫోటో అది. అదే నేడు పత్రికలలో ప్రచురింపబడుచున్నది. టి.వి.లో ప్రసారమగుచున్నది కూడ ఆ ప్రతిరూపమే. అంతేగాదు ఆనాటి జాతీయగీతాలు ఏ బాణిలో పాడేవారో తెలిసికొనుటకు ఆల్ఇండియా రేడియో వారు వీరి దగ్గరికి వచ్చి ట్యూన్ వారిచేత పాడించుకొని రికార్డు చేసికొని వెళ్ళేవారు. ఆ గేయాలే నేటికిని పునఃప్రసారితాలగుట జగమెరిగిన సత్యము.

శ్రీ శర్మగారు తాను సేకరించిన గేయాల వలన ఒక విచిత్రమైన విషయం బైటపడిందని "ప్రజారథం" పత్రిక ఇంటర్వ్యూలో తెలిపి ఉండిరి. ఆ రోజులలో భోగంమేళాలంటూ ఉండేవి కదూ! స్వాతంత్ర్య సమర సమయంలో ఆ బృందాలలో కొందరు జావళీలు వగైరాలు పాడటం మానివేసి వారి నాట్యానికి తాళాలకు సరిపోయేటట్లు దేశభక్తి గేయాలు వ్రాయించుకొని పాడటం మొదలు పెట్టారట. అట్లాంటి వాటిని కూడ కొన్నింటిని "సేకరించాను" అని వీరు చెప్పారు. తాను కూర్చిన ఈ గేయ సంకలన గ్రంథాన్ని భరతమాత పాదారవిందముల కర్పణ చేయుచు నిట్లు పలికిరి.

**పల్లవి : "జాతీయ గీతసం - గీతం వినండి, వి**
**ఖ్యాత కవీంద్ర హృ - ద్గీతా రసామృతం ॥జాతీయగీతం॥**
**పల్లవి : స్వాతంత్ర్య సమరాన - జాతి మేల్కొలిపి - ఉగ్రూతలుగించినదండి**
**వీర వ్రాతము నడిపించెనండి**
**వైరి వ్రాతము నెట్టె సుమండి**
**రాజ్యం! చేతి కందించిన దండి**
**స్వీయ జాతికి ప్రాణము సుండి**
**వీర, జాతీయ స్ఫూర్తి, విఖ్యాత విజయ కీర్తి**
**వీతి హెూత్రుని ఖ్యాతి, వెలయించె, నిజశక్తి! ॥జాతీయగీతం॥**

గీ॥ డెబ్బదియు, నాలుగేండ్లు నిండెను గదయ్యె
తరలు నేడును, సత్కవితా స్రవంతి
తెలియజాలనెందులకొ జాతీయ వీర
గీతముల పొందు పరచు, గిల్గింత నాకు

గీ॥ ఉడుకు చున్నది, రక్తమిప్పడును మరల
భరత దాస్య విముక్తికై పాటుపడిన
దేశ భక్తుల హృదయ ముత్తేజ పరుప
నెంచి, గీతామృతము చిందించినట్టి
కవుల వాగ్విభూతి, దలచి, కాంచిలోన ॥జాతీయగీతం॥

గీ॥ విమల విఖ్యాత కవులగేయముల నుండి
యేర్చికూర్చిన యట్టి జాతీయ గీత
ముల సమర్పింతు సద్భక్తి పూర్వకముగ
పొందుగా మాతృపాదార విందములకు"[1] ॥జాతీయగీతం॥

సమర్పణ పద్యము

ఈ జాతీయ గేయ, పద్యముల వ్రాత ప్రతిని ఎంతో భద్రముగా నుంచి అచ్చువేయుటకు శక్తిలేక దాచి ఉంచిరి. అదే సమయములో మా యింట అగ్ని ప్రమాదము సంభవించి ముందు తలుపులకు, కిటికీలకు కూడ నిప్పు అంటుకున్నది. విచిత్రమేమంటే మా తాతగారు తన విలువైన వస్తువులను కూడ విడిచిపెట్టి ఈ వ్రాత ప్రతులను, మఱికొన్ని సాహిత్య గ్రంథాల వ్రాత ప్రతులను పరిరక్షించిరి. ఈ విషయము నెఱిగిన ప్రముఖ జాతీయవాది, కవి పండితుడునైన శ్రీ బెజవాడ గోపాలరెడ్డి గారు ఈ వ్రాత ప్రతిని తెప్పించుకొని ఆమూలాగ్రముగా చదివి, వీరు చేసిన కృషిని ప్రశంసించుటయే కాక, వారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి అధ్యక్షులైనందున ఈ గ్రంథమును అకాడమీ పక్షమున అచ్చువేసి వెలువరించి వారు చేసిన ఈ కృషికి బహుమానముగా 3000 -రు॥లు పారితోషికముగానిచ్చి సన్మానము చేసిరి. ఈ జాతీయగీతాలు సేకరించి ఒక బృహత్సంకలనంగా ప్రకటించిన శర్మగారిని ప్రశంసిస్తూ "ఆనాటి జాతీయతా ప్రాణవాయువులను పీల్చిన అనేకమంది యువకులలో శ్రీ గురుజాడ రాఘవ శర్మగారును ఒకరు. పాఠశాలమాని, ఖద్దరు ప్రచారకులై, గాంధీజీని అన్ని విధములుగా అనుసరించిన వారిలో ముఖ్యులై నిలిచారు. తగిన కవితాశక్తి యుక్తి గలదు. అందువల్ల సొంతముగ జాతీయగీతముల రచించుటయే గాక ఆనాటి సాహిత్య సేకరణకై కృషి సల్పి జిల్లాలు తిరిగి ఎంతో సామాగ్రిని చేకూర్చిరి. ఈ సామాగ్రికి చారిత్రకమైన

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - జాతీయ గీతాలు పుట : 74

విలువ గలదు. ఆనాడు ఏ పద్యములు ఏ పాటలు ప్రజలను కార్యోన్ముఖుల చేసినవో అర్థముకాగలదు.ఈ పాటలన్నీ అన్ని జిల్లాలలో ప్రచారములో లేవు. కొన్ని బహుళ వ్యాప్తి పొందినవి. మరికొన్ని స్థానికములే కాని ఇంచుమించు ఏబది సంవత్సరములు గడచిన కాలములో ఆనాటి సామాగ్రిని సేకరించుట తేలికైన పని కాదు. అన్ని విధముల తగిన వారే ఈ పనికి ఉద్యుక్తులగుట మన అదృష్టము"[1] అని వ్రాసిరి.

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు వీరి జాతీయగీతములకు ఉపోద్ఘాతము వ్రాయుచు "శ్రీరాఘవ శర్మగారు చేసిన ఈ పని పరదేశములోనైనచో శిరసావహింపబడెడిది.ఒక వాల్టేరు, ఒక కార్లైల్, ఒక గోర్కి చేసిన పనుల వంటి పనిగా దీనిని పరిగణించెడివారు. ఈయన పాతిక ముప్పది యేండ్లు బహు శ్రమపడి, తాను పడిన శ్రమనంతటి నీ గ్రంథరూపమున వెలువరించెను. ఎనుబది పుటల పరిచయము వ్రాసెను. ఆంధ్ర ప్రదేశములోని ఆనాటి మహోద్యమములో తాను స్వయముగా పాల్గొనెను. స్వయముగా కవి. అట్టివాని ఈ పరిశ్రమ విశిష్టమైనదని చెప్పవలయును. శర్మగారు 30 ఏండ్లు శ్రమ పడినారు గదా ఆయనకు మూడువేలిచ్చినారట. నిజము మాటాడినచో ఆయనకు ముప్పది వేలీయవలెను''.[2] అని వీరు చేసిన కృషిని ప్రశంసించినారు.

జాతి నిద్రాణమై యున్ననాడు అణగియున్న ప్రజాశక్తిని ప్రజ్వలింపజేసి జనానీకమును కర్తవ్యోన్ముఖులను చేసి దేశభక్తి శిక్షణ చేత జాతిని సమైక్యపరచి, ఒక్కమాట విన్పింపగల, ఒక్క త్రాటిపై నడిపింపగల, ఒక మహానాయకుడుద్భవించును. వాని మహా ప్రబోధ వాయు ప్రసారములచే జాతి స్వార్థము విస్మరించి, ఒడలు మరచి సర్వము దేశమున కర్పించుటకై సంసిద్ధమగును. అట్టి సమయమున జాతిని ఉత్తేజపరుపగల గేయముల ఆవశ్యకము కలిగి మహాకవుల హృదయము నుండి వెలువడిన

**"వేలుకొనుమీ భరత పుత్రుడ**
**మేలుకొనుమీ! సచ్చరిత్రుడ**
**మేలుకొనవయ్యా! వత్సా మేలుకో!"[3]** (మంగిపూడి) రచయిత జాతీయగీతములు పుట 8

వంటి గేయాల ద్వారా జనులు చైతన్యవంతులై స్వాతంత్ర్య సమర దుందుభి మ్రోయించు సదవకాశము లభించినది.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ బెజవాడ గోపాలరెడ్డి గారి అభిప్రాయము - జాతీయగీతములు పుట 7
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ విశ్వనాథ సత్యనారాయణ గారి అభిప్రాయము - జాతీయగీతములు పుట 3
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ జాతీయగీతములు పుట 8

ఈ గేయములలో కొన్ని సార్వకాలికములు, కొన్ని తాత్కాలికములు కూడ కలవు. ఈ తాత్కాలికములు, సైతము విజ్ఞాన ప్రదములై, ఉత్తమ ధ్యేయములతో నొప్పారుచున్నవి. ఈ ఉత్తేజకరములగు సూక్తులు, ప్రబోధములలో స్వరాజ్యసముపార్జనకు, జాతిమనుగడకే గాక, మోక్షసాధనకు సంపత్తిగా కూడ వినియోగపడునవి కొన్ని గలవు. గీతాసారమే సాధన ఇందు కర్మఫల త్యాగము సర్వార్పణ ముఖ్యములు. అనాసక్త యోగము, దీక్ష, స్వాతంత్ర్య సముపార్జనకు సాధనములు. ఇందు స్వార్ధము లేదు. త్యాగమే ధ్యేయము. పరశ్రేయస్సే ఆనందము. ఈ సోపానముల నధిష్ఠింపజేయు ప్రయత్నములే జాతీయగీతముల ప్రయోజనములు. అని వారే జాతీయగీతముల గ్రంధములో పేర్కొనిరి.[1]

ఈ ధ్యేయ సాధనమున పారతంత్ర్య సుఖములను పటాపంచలు చేసి స్వాతంత్ర్య యజ్ఞ హోతలుగా నిలబడిన మహామహులెందరో గలరు. ఎందరో కవులు పాటలు, పద్యములు గేయములుగానము చేసినారు. శ్రీ బలిజేపల్లి, తుమ్మల, జాషువా, దువ్వూరి, బసవరాజు, గరిమెళ్ళ, జగన్నాధదాసు, మంగిపూడి, అబ్బూరి, కోడేటి, దాశరధి, కాళోజి, గురుజాడరాఘవ శర్మ మొదలగు వారి సేవ మరువరానిది. ఈ సమయములోనే గాంధీ గారి ఆత్మకథ, మొదలగు గ్రంధాలు వెలసినవి. స్వరాజ్య సమస్య, నవకాళి, స్వరాజ్య ఢంకా, స్వరాజ్య నవనీతము, స్వరాజ్య తాంబూలము మొదలగు ఖండ కావ్యములను వెలువరించిన కవులెందరో గలరు.

'కవిశేఖర' శ్రీ గురుజాడ రాఘవ శర్మగారు జాతీయగీతాలు, బాపూజీ, నవకాళీ, 'స్వాతంత్ర్య పథము', "ఎందరో మహానుభావులు స్వాతంత్ర్య సమరయజ్ఞంలో" మొదలగు వాటిని రచించి 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి" జననియు జన్మభూమియు స్వర్గము కంటెను మాననీయముల్ అను మాటను నిజము చేయుటకు కంకణం కట్టుకొని, మాతృమూర్తి ఋణము దీర్చుకొనిరి.

వీరు రచించిన జాతీయగీతములు అను సంకలన గ్రంధములో ఆనాటి కవులు వ్రాసిన గేయములను పద్యాలు గేయములుగా పాడుకొనే వాటిని జాతీయగీతములుగా సేకరించి వివిధ సందర్భములలో వ్రాసిన వాటిని పధ్నాలుగు భాగములుగా విభజించిరి.

| | | |
|---|---|---|
| 1. భారత జనని | 2. జాతీయజండా | 3. తిలక్ నిర్యాణము |
| 4. పాంచాల పరాభవము | 5. మహాత్మాగాంధీ | 6. అసహాయోద్యమము |

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ జాతీయగీతములు పుట 8

7. రాట్నము - ఖద్దరు   8. మద్యపాన నిషేధము   9. హరిజనోద్యమము
10. స్వాతంత్ర్యసమరము   11. జైలు కడగండ్లు   12. స్వాతంత్ర్యము
13. మహాత్ముని దివ్యస్మృతి   14. మంగళహారతి

దాదాపు వీటిలో అన్ని సందర్భాలలో వీరు వ్రాసిన గేయాలు ఎన్నోకలవు.

భారత జననిని కీర్తిస్తూ వ్రాసిన గేయాలు కలవు. ఎందఱో మహా కవులు ఆ తల్లిని నోటి నిండా కీర్తిస్తూ గానం చేశారు. బంకించంద్రచటర్జీ వందేమాతరం వందేమాతరం అని రవీంద్రనాధ టాగూర్ జనగణమన అధినాయక జయహే అని, గరిమెళ్ళ సత్యనారాయణ గారు "వందనమిదె గైకొనుమీ భారత జనని" దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు "జయ జయ ప్రియ భారత జనయిత్రీ - దివ్యధాత్రి" అని మల్లాది రామ చంద్రశాస్త్రి గారు "జయ జయ భారత జనయిత్రి జయ జయ దివ్య జ్ఞాన ప్రదాత్రి" అని వ్రాస్తే శ్రీ గురుజాడ రాఘవ శర్మగారు "జయ జయ భారత జననీ పావనీ సకలానంద దాయినీ" అని కీర్తించారు.

1919 వ సం॥లో మాంటేగ్ చెమ్స్ ఫర్డ్ సంస్కరణలు బ్రిటిషు వారిచే నామోదింపబడి ప్రవేశపెట్టబడినవి. 11-11-1918 యుద్ధానంతరము బ్రిటిషు ప్రభుత్వము ఆపద్ధర్మముగా ప్రవేశపెట్టిన ఆర్డినెన్సులకు బదులుగా 1919సం॥ మార్చి నెలలో "రౌలటు" చట్టము ప్రవేశపెట్టిరి. ఈ చట్టము క్రింద నెట్టి వారినైన నేర విచారణ యేకారణము లేకయే, అనుమానించినచో బంధింపవచ్చును. చివరికి ఉరికంబమునకైన ఎక్కించవచ్చును. ఈ ఘోరవార్త దేశమును దద్దరిల్ల చేసినది.

మహాతపస్సంపన్నులకు నిలయమైన భరతఖండము కాలవశమున పరాధీనమై నిర్వీర్యము నిస్తేజమునై, నిరాయుధము, నిర్విణ్ణమునై కొనయూపిరితో నల్లాడుచు ముక్త కంఠముతో విలపించిన మహార్తనాదము జగదేక మూర్తియైన పరమేశ్వరునకందినది. సమస్త భారతీయులలోను మహాగ్ని ప్రజ్వరిల్లినది."[1]

"ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" అని గీతాకారుడు చెప్పినట్లుగా ఒక దేశము నందుగ్లాని సంభవించినపుడు ఒక ఆపద్బాంధవుడు, ఒక ఋషిపుంగవుడు, ఒక సత్యసంకల్పుడు, ఒక అహింసామూర్తి ధర్మజ్యోతియై సామాన్య మానవుని రూపమున జన్మించి, దేశమునుద్ధరించు కాలమాసన్నమైనది. వెంటనే భారతావని కేడు గడయై మహాత్మాగాంధీ, భారత చక్రధారిగ నవతరించెను."[2]

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ జాతీయగీతములు పుట 21
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ జాతీయగీతములు పుట 23

మహాత్మాగాంధీ 06-4-1920 వ తేదీన రౌలట్ చట్టమును ప్రతిఘటించుచు దేశమంతటను 'హర్తాళములు, ఊరేగింపులు, సభలు, సమావేశములు జరుపవలసినదిగా ఆదేశించిన ప్రకారము దేశమంతయు పాటించినది. పంజాబులో జలియన్ వాలాబాగ్ లో ది.13-04-1920 వ తేదీన జరిగిన సమావేశములో క్రిక్కిరిసిన సభలో జనులను ప్రభుత్వపుటండతో "డయ్యరు" సేనాని ప్రపంచములో ఇదివరకెన్నడు కనీవినీ ఎరుగని ఘోరకృత్యము లొనర్చినాడు. వేలకొలది జనమును బంధించి, బాధించి పొట్టలపై బ్రాకించి, తమ యొద్దనున్న మందుగుండు సామాను పూర్తియగు వరకు మారణహోమం గావించి, సతీమ తల్లులను సైతము అవమానముల పాలుజేసెను.[1] ఆనాడు జరిపిన ఘోరకృత్యములకు చలించిన శ్రీ శర్మగారు 'పాంచాలి' అనే పేరుతో వ్రాసిన పద్యములు పాషాణహృదయమునైన కదలించివేయును.

"డైయరు రాక్షసుండటు హడావిడిగా చనుదెంచి, నోటికిన్
గూయగ రాని, పెన్ మొఱటు కూతలఁగూయుచు, మానహీనమున్
జేయగా సాహసించె, నవినీతుల నూరక నింక సైపఁగా
న్యాయమె? శక్తి గల్గిన యనాథలమే! యిట్టు మిన్నకుండగన్".[2] జాతీయగీతాలు పద్యము 1

అని వాపోతారు.

"క్రమతన్ మా మగవారలొక్కరునుగా, గ్రామాంతరంబందుగా
ర్యములన్ ముగ్గి చరించువేళ, పటుధైర్యస్థైర్యులై, వే పరా
క్రమమున్ జూపఁగా సాహసించి రిక ధర్మంబేదొ యోజింపు!
మానముగోల్పోయిన ప్రాణమేటికిక యెన్నాళ్ళీ ప్రజాపీడనల్".[3] జాతీయగీతాలు పద్యము 6

"డయ్యరై" నను మరివాని యయ్యయైన
"యెడయ" రైనను మరివాని యొడయడైన
సిగ్గు విడిచేసినట్టి దుష్కృత ఫలమ్ము
లనుభవింపక యున్నె! నాయాన, తల్లి!"[4] జాతీయగీతాలు పద్యము 7

డయ్యరు చేసిన అకృత్యములు వివరించి, డయ్యరు గాని వాని అయ్య గానీ చేసిన అకృత్యములకు ఫలము అనుభవింపక తప్పదు అని ఎలుగెత్తి చాటిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ జాతీయగీతములు పుట 23
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ జాతీయగీతములు పద్యము పుట 115
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ జాతీయగీతములు పద్యము పుట 116
4. పైదే

స్వాతంత్ర్య స్థాపన కొరకు శక్తివంతమైన పోరాటమవసరమైనది. ప్రభుత్వము నెదిరించి స్వాతంత్ర్యము సాధింపవలెననిన సమిష్టి శాసనోల్లంఘన మొకటియే శరణ్యము. నాటి జలియన్‌వాలాబాగ్ దురంతములకు ప్రతిక్రియగా 1920 సం॥ ఏప్రిల్ 6వ తేదీన దేశమంతటను ఉప్పుసత్యాగ్రహము ప్రారంభించుటకు మహాత్మాగాంధీ గారి ఆదేశమైనది. బందరు, చిన్నాపురం, తాళ్ళపాలెం లలో ప్రత్యేక శిబిరములు నిర్మింపబడి కృష్ణా జిల్లా సత్యాగ్రహములు జట్టులు జట్టులుగా శాసనోల్లంఘనమునకు పంపబడిరి. చాలమందిని నిర్ణీత స్థలమునకు చేరకమునుపే అరెస్టు చేసింది ప్రభుత్వము. ఊరూర, పట్టణముల, సత్యాగ్రహములు, గేయములు పాడుచు జండాలతో ఊరేగింపులు, సభలు జరిపిరి. ది. 21-04-1930 సం॥న బందరులో డాక్టరు పట్టాభి, చెఱకువాడ నరసింహం, స్వామి నారాయణానంద, అయ్యదేవర కాళేశ్వరరావు, గంపలగూడెం జమిందారు కోటగిరి వేంకటకృష్ణారావు గార్లకు శిక్ష విధించిరి. నాడు వీరావేశముతో సత్యాగ్రహియైన శర్మగారు పరవళ్ళు ద్రొక్కుచు

1. "వింటివా! బ్రిటిషు వీరుల ధైర్యము - తంటాలు పడి
పట్టిరంట - బాపూజిని! అర్ధరాత్రి - ఒంటిగంటకు ॥వింటివా॥

జైత్రయాత్ర వేగసాగించి, సాగించి,
చేరె! గాంధీజి కరాడీ
బడలి! నిద్రచెందెను సేన తోడి
అర్ధ! రాత్రి తోడనె తెల్లవాడి
సేన! వెలిగించె టార్చి, పైబడి
లేవ! పనియున్నదయ్య, నాతోడి,
అనగ, బంది చేసితిమని, బాపూజిని, పట్టిరంటా ॥వింటివా॥

2. పడలేమీ సైతాను బాధ
ఇంక గడియకు ప్రాణకంటకమగుచుండె
తాటి గెలలు నరికి త్రాగుడు నిషేధించ
తరలిన మా పైకి వీడు నిషేధించ
దాడిచేసి నూట నలుభై మూడు
వెంట నోటికి తగిలించి నాడు
న్యాయమెట్టిదో గుర్తెరుగలేడు

ధైవమేటికి సైచె నీకీడు
మమ్ము హద్దు పద్దులేని అల్లరిగుంపంటాడు. ॥పడలేమీ సైతాను బాధ॥

3. ఉప్పు చేద్దాము పదండి
ప్రాణమర్పించియైన, స్వరాజ్యమిచ్చునట్టి "[1] (ఉప్పు)

అని ఎలుగెత్తి నిర్భీకులై పాడిరి.

గాంధీగారు ఆరంభించిన అసహాయోద్యమములో భాగమైన త్రివిధ బహిష్కారోద్యమములు (కోర్టు, శాసనసభలు పాఠశాలలు బహిష్కరణ) అనంతరము వ్యక్తి, సమిష్టి ఉప్పు సత్యాగ్రహములు, తదుపరి వ్యక్తి, సమిష్టి శాసనోల్లంఘనములు చివరకు క్విట్ ఇండియా ఉద్యమము అనునవి క్రమక్రమముగా జాతిని మేల్కొలిపి, ఉద్ధరించిన బహుముఖోద్యమములు. అందు అలసట విశ్రాంతి ఎరుగని శాంతి సైనికుడిగా, ఉపన్యాసకునిగా కార్యకర్తగా శ్రమించి జీవితమును సార్ధకము చేసికొన్న పుణ్యజీవి శర్మగారు. గాంధీ ఉద్యమములో అంగరఖా విడిచి పదియేండ్లు పూజనీయులు శ్రీ యుతులు పట్టాభి, ముట్నూరి, కౌతా చెఱకు వాడలకు సన్నిహితుడై దేశ సేవకుడుగా దేశమాత యొక్క దాస్య విముక్తికై అమితోల్లాసమున కారాగారమున కురికిన త్యాగమూర్తి. ఆజన్మార్జిత పరోపకార బుద్ధియే వీరిచే సహకారోద్యమ సేవ చేయించినది. కృష్ణాజిల్లాలో శర్మగారు పాల్గొనని కాంగ్రెస్ సభ అప్పటిలో లేదు. గేయములతో వాలంటీర్లను వీరావేశముతో నడిపించిన వీరుడు. రాజకీయ దోషిగా బంధింపబడి న్యాయాధికారికి గేయములతో వాఙ్మూల మిచ్చిన అవక్రపరాక్రమ విరాజితుడు.

"అది 1930 ఏప్రిల్ 6వ తేదీ. ఆ రోజు తోట నరసయ్య నాయుడు గారిని ఉప్పు సత్యాగ్రహ కారణంగా ఒక సంవత్సరమున్నర కఠిన శిక్ష విధించి శర్మ గారున్న బందరు సబ్ జైలునకు తీసికొని వచ్చిరి. దీనికి ముందురోజు పుట్టుభోగి, వితరణశీలి, విద్యావినయ సంపన్నుడగు పురాణం సూరి శాస్త్రి గారిని కాంగ్రెస్ సత్యాగ్రహ శిబిరమునకు తమ భవనము నిచ్చినందులకు ఆరుమాసములు కఠిన శిక్ష విధించి శర్మగారున్న గదిలోనే ఉంచినారు. ఆ రాత్రి జైల్లో - మండు వేసవి కాలం- దుమ్ము, ధూళి, పురుగు పుట్ర యేముందో భగవంతునికే తెలియాలి. కటిక రాత్రి గడిచి తెల్లవారినది. పగలు ఉప్పు

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ జాతీయగీతములు పుట 36

సత్యాగ్రహిగా కోర్టులో సబ్ మేజిస్ట్రేటు అడిగిన ప్రశ్నలకు వీరు ఆశువుగా వీరావేశముతో శ్రావ్యముగా పాడుచు చెప్పిన సమాధానమిట్లు సాగినది".[1]

ప్రశ్న : "రాఘవశర్మగారూ ! మీరున్నూ పదిమంది కలిసి బందరు కరగ్రహారమున ఉప్పు చేశారట. నిజమేనా?

సమాధానము : ఎక్కడ పదిమంది అండీ ?

పల్లె పట్టణముల - పిల్లాజెల్లా కలసి బందరు రేవున మేము

ఉప్పు ! కొల్లగ వండ జేరాము

సంద్రపు ! నీళ్ళు తెచ్చి కాచినాము

ప్రశ్న : శాసనాధిక్కారము కాదా ?

సమాధానము : చట్టముల్లంఘించియే కాచినాము

కాని చల్లని ఈ ప్రభుత్వము

సైపనొల్లక పడద్రోసి - నోరు కట్టెనయ్యే

ఉప్పుసేయుట మానమింక (దాన)

చప్పన రాజ్యమస్తంగతము పొందు

నూట నలభై మూడు - లాటీగర చేకొని

నాటకమాడ దలంచె

డెబ్బది । నాలుగొకటి జేర్చి పెంచి

మనల సూటిగ బట్టగనెంచె

వీని ధాటి మనము వే గ్రహించి

చట్టము నీట గల్పితిమి, లంఘించి

ఉప్పునీట గల్పితి ముల్లంఘించి

రెప్పపాటు సైపము బ్రిటిషు పాలనము ముగిసె" ॥నడుములుగట్టి పదండీ॥

"ఎన్ని సెక్షనులున్న సున్న - వీనినెగురతన్ని గూల్చుదాము మనము

దీని కన్న మర్మము లేదు గనుము ॥

గాంధీ పన్నిన త్రోవిదియ జనుము ॥

దానగూలు బ్రిటీషు పాలనము ।

అపుడె తెల్లవారి బ్రతుకు తెల్లవారునింక

గడియసైపగలే మింగ్లాండు ప్రభుత్వము"[2] ॥నడుములుగట్టి పదండీ॥

(సమిష్టి శాసనోల్లంఘనమున ఇంకా చాలగేయాలు వ్రాసిరి)

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ జాతీయగీతములు పుట 39
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ జాతీయగీతములు పుట 40

అని ఇచ్చిన గేయ వాఙ్మూలమునకు 9 మాసములు కఠిన శిక్ష విధించి, బందరు సబ్‌జైలు గదిలో నుంచిరి. మూడవరోజు శ్రీ తోట నరసయ్యానాయ్డు గారిని అరెస్టు చేసి తీసికొని రాగా వీరి ముగ్గురిని ( శ్రీ శర్మగారు, సూరి శాస్త్రి గారు, నరసయ్యగారు) కలిపి మధ్యాహ్నము ఒక జీపులో ఏపూరు రైలుస్టేషన్‌కు (ఇప్పటి నూజివీడు స్టేషన్) పోలీస్ కాపలాతో చేతులకు బేడీలు వేయకుండానే తీసికొని వెళ్ళారు. రైలు వచ్చుటకు వ్యవధి ఉన్నదని చుట్టూ మూగిన జనాన్ని జాతీయ గీతాలు పాడి శ్రీ శర్మగారు ఉద్బోధించారు. రైలు వచ్చిన తరువాత రాజమండ్రి స్టేషనుకు అటునుంచి జైలుకు తీసికొని వెళ్ళి జైలువార్డరు కప్పగించగా వారిని కోరంటైనులో ఉంచిరి. తరువాత వీరిని రాజమండ్రి జైలునుండి రాయవేలూరు జైలుకు మార్చిరి.

ది. 06-05-1930వ తేదీన కాంగ్రెస్ వారి ఆదేశానుసారము బందరు రాబర్టుసన్‌పేట కుండుపై జండా కట్టుటకు పట్టణ కాంగ్రెస్ సంఘ కార్యదర్శి శ్రీతత్త్వానంద స్వామిని, గురుజాడ రాఘవశర్మను నియమింపగా వీరిద్దరు కొందరు వాలంటీర్లతో కలిసి జాతీయ జండాబూని, వీధులవెంట గీతాలాపన చేయుచు, కుండు దగ్గరకు చేరునప్పటికి జన సమూహము క్రమంగా కుండు చుట్టు నిండింది. పోలీసు వారు కూడా లాటీలతో సిద్ధమై ఉన్నారు. వెంటనే తత్త్వానంద స్వామి, శ్రీగురుజాడ రాఘవశర్మగారలు మెట్లెక్కి కుండుపై జండా ప్రతిష్ఠించినారో లేదో బలియురగు పోలీసులు వచ్చి వీరిరువురిని మోది జెండాలాగి, క్రిందికి త్రోసి బంధించారు. ఇంతలో అచటనే సిద్ధముగా నున్న యువకులు ఒకరి వెంట మరియొకరు పైకి ఎక్కుచుండిరి. అందులో అగ్రగాములగు టి.పి.ఆళ్వారు, గేయకవి చలసాని నాగభూషణ తాడికొండ వీరభద్రయ్య, సాయం వరదదాసు, చెరువు సుబ్బారావు మొదలగు వారిని నిచ్చెన ఎక్కటమే తడవుగా పోలీసులు లాటీలతో మోది, చుట్టూగల పల్లమునకు నెట్టి పడవేసిరి. ఆ పోలీసుల హడావిడి, జనం యొక్క కోలాహలం ఎప్పుడు చెవికి సోకినాయో తోట నరసయ్య నాయ్డు ఏనుగుపై లంఘించు ఉగ్రసింహము వలె జన సంద్రాన్ని దాటుచు, పోలీసులనవతలకు నెట్టుచూ, జండా చేబూని గబగబ నిచ్చెన మెట్లెక్కి జాతీయ జండా ప్రతిష్ఠించినాడోలేదో జయజయధ్వానాలు మిన్ను ముట్టినవి. ఇంతలో బలిష్ఠులగు 16 మంది పోలీసులు లాఠీలతో తాము కూడా నిచ్చెన మెట్లెక్కి అతని వీపు, శిరస్సు, భుజాలు, కాళ్ళు ఒకటేమిటి శరీరమంతటా టపటపా బాదిరి. జండా గుంజ బోయిరి. కాని అతడు సందివ్వలేదు. రెండు చేతుల జండా పట్టుకొన్న అతని భుజదండాలపై నెత్తురుగారునట్లు చితకపొడిచారు. నోట 'బాపూజీ' అనే ఆర్తనాదం ప్రతిధ్వనించుటయే గాని నరసయ్యానాయుడు జండా వీడలేదు. లాఠీలతో వ్రేళ్ళపై చితకబాదగా వ్రేళ్ళు సందిచ్చుటతో జండా పోలీసులకు చిక్కినది. పోలీసులు అతనిని క్రిందకు లాగి లాఠీలతో మోది పడవేయగా స్పృహ తప్పి పడి ఉన్నాడు.

ఎక్కడో కొన ఊపిరితో ప్రాణం కొట్టుకుంటోంది. ఆ దయా దాక్షిణ్యములు లేని పోలీసు వారి బీభత్స దృశ్యమును చుట్టూ మూగిన జనమే గాక, చుట్టు ప్రక్కల ఇండ్ల కప్పులపై, మేడలపై నుంచి, డాబాలపై నుంచి అనేకులు వీక్షించిరి. ఈ దుష్కార్యమును చూడలేక ప్రజలు హాహాకారాలు చేసిరి. ఈ ప్రజాఘోష పట్టణమంతటా వ్యాపింపగా పురపాలక సంఘాధ్యక్షుడు, బారిష్టరు శ్రీ శీలం జగన్నాథరావు నాయుడు గారు ఈ వార్తను వినగానే మున్సిపల్ పాలక వర్గ సమావేశము నేర్పరచి, ధీరుడు, జాతీయ భావోల్లసితుడు, వీర మానిసి గావున కుండుపై జండా ప్రతిష్ఠించుటకు తీర్మానము చేయించినారు. మరునాడు బ్యాండు మేళముతో కుండుపై జండా ప్రతిష్ఠ జయప్రదముగా జరిగినది. నాడు శర్మగారు పాడిన గీతము:

**"కుండుపై జాతీయజండా ప్రతిష్ఠింప**
**రండోయి! రండు! రారండు![1]**
**జండా యెత్తర - జాతికి ముక్తిర**
**నిండగు శక్తిర - నిల్పర కీర్తిర**
**దండిగ వైరులు, గుండులు పేల్చిన** ॥జండా॥ జాతీయగీతాలు పుట 16

**చెండుచు - నెత్తురు, కండలు రాల్చిన**
**జండా యెత్తర! జాతికి ముక్తిర**
**ప్రాణముండి, యభిమానముండి, నిజ**
**ప్రాణములైనన్ బలియొసంగి - మన**
**జండా యెత్తర! జాతికి ముక్తిర!"[2]**

## 5.2 స్వాతంత్ర్యపథము: -

శ్రీ శర్మగారి గళము నుండి జాలువారిన మరికొన్ని జండా గేయములు:

**"ఇదియే జాతీయ జండా**
**జాతికిది యే ప్రాణము మానమిదియె**

**1. ఇదియె స్వరాజ్య ధ్వజము - అదుము ఫరంగీలహజము**
**కదనమునకు దీనిబట్టి - కదలు శాంతి ప్రతిన బట్టి** ॥ఇదియె॥

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ జాతీయగీతములు పుట 16
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 10

2. దేశదాస్యము బాపు - దీనదరిద్రత బాపు

దేశద్రోహుల మాపు - దీన, ప్రతాపము చూపు ॥ఇదియె॥

3. మతములన్నిటికి, స - మ్మతము దీని క్రీడ

హితము కూడ శాంతి - యుతముగ పోరాడ ॥ఇదియె॥

4. హిందువులందెఱ్ఱనై - ఇస్లాము మతమందు

పొందుగ పచ్చనై, యా - నందమును గూర్చు ॥ఇదియె॥

5. ధవళమై, యితర - మతమ్ములకై వెలుగు

అవిరళ భాగ్యభో - గ్యములనీయ గలుగు ॥ఇదియె॥

6. కోట్ల ధనము జనము - కొట్టి పొట్టను బెట్టు

కాటకముల నెట్టు - రాట్నము గలట్టి ॥ఇదియె॥

7. భారత జాతీయ - వీర రక్తమోడ్చి

చేరి నిర్మించు - స్వ - రాజ్య సౌధము దాల్చు ॥ఇదియె॥

8. భారత దేశము, స్వపరి - పాలన గలదనినమ్ము

నిరుపమానమైన కీర్తి - నిండి వెలుగు నిజమ్ము"[1] ॥ఇదియె॥

1930 సం॥లో మోహనరాగం ఆది తాళంలో ఇంకొక గేయాన్ని వ్రాసిరి.

"జండా ! జయ జయ భారత - పూర్ణ స్వరాజ్యజండా

దండిగ ముప్పది - రెండు కోట్ల జను

లండజేరి కొలు - వుండగ వెల్గెడి ॥జండా॥

1. ముక్కాకల నారితేరినారు

చిక్కనీయరరి కరముల వీరు

లెక్క సేయ రరివర్గము విసరు

ఉక్కుగుండ్ల కెద - నిత్తురెదుర్తురు ॥జండా॥

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 8

2. నిరంకుశత, ధి - క్కరించి వంచి
పరాధీనతా పాశము ద్రెంచి
బిరాన స్వేచ్ఛా - పథిచరించి
స్వరాజ్య మందిర - మలంకరించు ॥జండా॥

3. ఆర్య సమ్మతములైన సాహసౌ
దార్య గుణమ్ముల - హరిత వర్ణమై
స్థైర్య, శాంతి, స - త్యముల ధవళమై
ధైర్య త్యాగములను కేసరియౌ ॥జండా॥

4. పెను దారిద్ర్యము - బాపగ దీన
జన శరణ్య - వజ్రాయుధమైన
అనాదియై, కామధేనువైన
ఘన వర్ణిని - రాట్న లక్ష్మీగల్గిన ॥జండా॥

5. త్రివర్ణయుతమై - త్రిభువన హితయై
దివిజస్తుతమై - తేజోయుతమై
భువిఁ బవిత్రమై - ముక్తి దాత్రియై
కవిజననుతమైకనదగు జాతీయ ॥జండా॥

6. సత్యాహింసా - సాధనములగొని
సత్యాగ్రహ కవచము మెయిబూని
సత్యప్రేమ సు సరణుల శాంతిని
నిత్యము తిరముగ నిల్ప నిల్తురని ॥జండా॥

7. కాయము బుద్బుద - ప్రాయము, హేయము
ధ్యేయము మాకు సం, పూర్ణ స్వరాజ్యము
పాయని యశము జగాన నింపెదము
నీ యాజ్ఞల శిరసా వహించెదము" ॥జండా॥

జండా ! జయ జయ భారత - పూర్ణ స్వరాజ్య జండా"[1] స్వాతంత్ర్యపథము పుట 10

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 10

ఢిల్లీ కోటపై జండా ప్రతిష్ఠించిన సందర్భములో

మ॥ "అదె ఢిల్లీ పుర కోటలో నడుమ, సౌధాగ్రంబునన్ స్వేచ్ఛమై
కదలెన్ దివ్య సుదర్శనంబనగ, చక్రంబొండు భాసిల్లన
య్యదె, జాతీయ పతాకయెల్లరును 'జోహారుల్ సమర్పింపగా
సుదినంబియ్యది, చేరరండు, తరియించున్ జన్మలీనాటితో"[1]

అని జన్మ ధన్యమైనట్లుగా భావించిరి.

స్వాతంత్ర్య వినువీధిలో హాయిగా ఎగురనిమ్ము అనుచు,

"చే నెగుర వేయరా - జాతీయ జండా
హాయిగా స్వాతంత్ర్య - వాయువులోన

దీనికై గద మహా - ధీరులు వీరులు
ప్రాణ ధనమ్ములు - బలి ఇచ్చినారు ॥చేనెగుర॥

స్వతంత్ర జాతికిది - చక్కని వెలుగు
జాతి పేరు జగాన - స్థాపింపగలుగు ॥చేనెగుర॥

దీనికై గద దేశ - దేశములఁబోరి
మానమ్ము నిల్పి - సరి - మానవులైరి ॥చేనెగుర॥

దండి యశోకుని - ధర్మ చక్రాన
నిండుగా వెల్గేటి - నీ జాతి జండా[2] ॥చేనెగుర॥

విహరింపనిమ్మా - విహరింపనిమ్మా
స్వాతంత్ర్య వినువీధి - జాతీయజండా ॥విహరింపనిమ్మా॥

1. విశ్వవిఖ్యాతిగా - విజయనాదాలతో
విశ్వమోహనముగా - వెలసిన జండా
వీర భారత జాతి - వెలిగిన జండా ॥విహరింపనిమ్మా॥

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 11

2. మూడు రంగులతోడి - ముచ్చట గూడి
తోడునీడయి ధర్మ - చక్రమ్ము గూడి
క్రీడించు నీ యండ - ప్రియమైన జండా ॥విహరింపనిమ్మా॥

3. వీరుల రక్తమ్ము - ధారవోసి, యరి
వీరులనోడించి - పేర్గొన్న జండా
భారత వీరుల - జాతీయ జండా ॥విహరింపనిమ్మా॥

4. సాహస త్యాగాలు - శాంతి సత్యాలు
ఆత్మవిశ్వాసాలు - ఔదార్యభావాలు
చక్కగా పాలించు - జాతీయజండా ॥విహరింపనిమ్మా॥

5. సేతుశీతాచల - స్థిర భరత జాతి
ఖ్యాతి నిల్పిన యట్టి - జాతీయ జండా
స్వాతంత్ర్య భారత - జాతీయ జండా"[1] ॥విహరింపనిమ్మా॥

1948 ఆగష్టు 15 వ తేదీన ఈ గేయం వ్రాసిరి.

ఆడనీరా ! యెగిరి - ఆడనీరా ! విప్పి
హాయిగా, భారత - జాతీయ జండా ॥ఆడనీరా॥

1. మబ్బు మసకలేని - మంచి మార్గాన
తబ్బిబ్బు లేని, స్వాతంత్ర్య పీఠాన ॥ఆడనీరా॥

2. పరజాతి చేతి లో - పలజిక్కి నలిగె
మరల విచ్చలవిడి - మసలగా, గలిగె ॥ఆడనీరా॥

3. వీరాధివీరుల - వేడి నెత్తురులపై
విజయస్తంభాలపై - వెలసిన జండా ॥ఆడనీరా॥

4. ధర్మ చక్రములతోడ - ధైర్యంపు నీడ
తాత్రివర్ణంబయి - తాండవించే జండా ॥ఆడనీరా॥

1 శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 12

5. సాహసత్యాగాలు - శాంతి సత్యాలు
ఆత్మవిశ్వాసాలు - ఔదార్య భావాలు ॥ఆడనీరా॥

6. ఈడుగా, జోడుగా - తోడి దేశాలలో
కూడ ముచ్చటలతో - క్రీడించు జండా ॥ఆడనీరా॥

7. సేతు శీతాచల - స్థిర భరత జాతి
ఖ్యాతి నిల్పిన మన - జాతీయ జండా"[1] ॥ఆడనీరా॥

రామరాజ్యమని చెప్పదగిన మన భారతదేశంలో ఐకమత్యం సన్నగిల్లి స్వతంత్ర్య రాజ్యములు ఏర్పడి, ఆయా రాజ్యాధిపతులు పరస్పర విజయ కాంక్షులై తమ జాతిని, ధన, మన, సర్వస్వమును మట్టు పెట్టుకొనిన ఒక అయోమయ, అజ్ఞానాంధకార స్థితిలో పరదేశీయుల అదను తీసికొని ఎన్నో ఉపాయముల బన్ని క్రమక్రమముగా పంచచేరి రాజ్యాధికారమును హస్తగతం చేసికొని జాతిని వశపరుచుకొనినారు. ఆ సందర్భములో

"తెలియుము దేశచరిత్ర
తెలిసి దేశ దాస్యము బాపు - మో భరతపుత్రా ॥తెలియుము॥

1. పదహారువందల - పండ్రెండవయేట
భారతదేశ కర్మమున - వీడు మొదట బందరు పట్టణమున
చల్లని పాదం పెట్టెను - వర్తకమున
కనుచు పట్టణంబులకు - శీఘ్రముగం
తరలి వర్తక - దొంగతనమున।
కొంత రాజ్యము హ - రించెను, మన।
దేశీయ। ప్రభువుల - జీల్చి, కయ్యమున।
నౌకరి। పక్షము - జేరి - రాజ్యమున।
కొంత। భాగము హ - రించె లంచమున।
ఇట్లే భరత దేశమంత - పర ప్రభుత పాలాయె
తెలియుము, దేశ చరిత్ర - తెలిసి
దేశ దాస్యము బాపుమో ! భరతపుత్ర"[2] స్వాతంత్ర్యపథము పుట 14

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 13
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 14

అను గేయము ద్వారా జాతిని మేల్కొల్పిరి.

ఈస్టు ఇండియా కంపెనీ అనుసరించిన క్రూరకృత్యములతో దేశపరిశ్రమలకు ముప్పు వాటిల్లినది. నూలు వస్త్రములు నేయునేతగాండ్రకు సరియైన నూలు విడుదల లేక ఉత్పత్తికి తగిన ప్రోత్సాహము లభింపక క్రమ క్రమముగా రాట్నములు మూలపడినవి. దేశమున గల విద్యావంతులు సయితము విదేశ విద్యా వ్యామోహితులైనారు. విదేశ వస్త్రవ్యామోహముచే కట్టుబట్టకు కూడా పరదేశములపై నాధారపడవలసిన అగత్యమేర్పడినది. దీనికి కోట్లకొలది ధనము ఖర్చు అగుచుండెను. ఈ కోట్ల కొలది ధన ప్రవాహము నాపినచో దేశము పురోభివృద్ధి నంది కోట్లకొలది జనమునకు జీవనోపాధికి మార్గము లేర్పడునని ఈ గృహలక్ష్మియగు రాట్నము ప్రాముఖ్యమును చాటి రాట్నలక్ష్మియే మరల గృహలక్ష్మి కావలయునని, దారిద్ర్యముతో అలమటించు పేద ప్రజానీకమునకు నాడే జీవనోపాధి కలిగి, దేశము స్వయం పోషకమై సౌఖ్యవంతమగునని మహాత్ముడు ఉద్బోధించెను. స్వదేశ వస్త్రదీక్షతో బాటు విదేశ వస్త్ర బహిష్కరణ సాగినచో శీఘ్ర స్వరాజ్య ప్రాప్తియగునని బోధించి, తాను నిరంతర చర్ఖా దేవతో పాసియై ప్రజలు కూడ ఆ వ్రత దీక్ష పూనునట్లు శ్రమ పడెను. ఈ సందర్భంలో శ్రీ శర్మగారి, కలం నుండి జాలు వారిన గేయం -

"వడుకుమురా! వడుకుమురా!
నీ దేశోద్ధరణకు - తెరగదిరా!
కలిమి, బలిమి - యీ కదురే గదరా!
క్రమ్మర రాజ్యం బొసగు సూత్రముర ॥వడుకుమురా॥

వడుకుమురా! వడుకుమురా!
వడి వడి - స్వేచ్ఛా - వాయువు పీల్చి ॥వడుకుమురా॥

1. తెలివిగలిగి లే-వడుకుమురా-నీ-దేశోద్ధరణకు తెరగిదిరా
కలిమి-బలిమి-యీ-కదురే గదరా! క్రమ్మఱ రాజ్యం బొసగు-సూత్రముర॥వడుకుమురా॥

2. ధర్మసూత్రముల - దారముదీయగ
మర్మములను - విధ్వంసము సేయగ
నిర్మలమగు శాం - తిని వెదజల్లగ
ఒర్మి గల్గిమా - నసమున వడిగా"[1] ॥వడుకుమురా॥

1 శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 61

3. పరాధారమౌ - బ్రతుకెందుకురా!

బిరాన నీ శక్తిని దెలియుమురా!

స్వరాజ్యమిదె నీ - రాట్న చక్రమున

సాధింపగ - శాంతిని నహింసా పథమున"[1] ॥వడుకుమురా॥

కట్టుబట్ట, తినతిండి సరిగలేని పేదకార్మిక కర్షక జనము తరతరాలుగా మద్యపానరతులై యిల్లు, ఒళ్ళు గుల్ల చేసికొని అధోగతి పాలగుట, కల్లు సారాయిలకై కోట్లకొలది ధనము దుర్వ్యయమగుట గుర్తించి సాగించిన ఉద్బోధ.

## త్రాగుడు పిశాచమా! ఇంక తరలి పొమ్మా!

"మొగలాయి పాదుషాల గులాములుగ చేసి స్వైరవిహారమ్ము సల్పినావు

సంపదోన్మత్త రాజ కిరీటముల దించి లీవిగా, నాటకాలాడించినావు

ఆంగ్లేయ దేశ మర్యాద, యటంచు మా యించి పాలించినావు

లాలించి, పేదల రక్తమాంసమ్ముల ద్రావి తాండవరూపు దాల్చినావు

ఎంతమాయా స్వరూపిణి విపుడు దెలిసె

నౌరనీ గుట్టూ, మా పొలిమేర విడచి

వెడలు మిట నుండి, యింక, త్రాగుడు పిశాచ

మా నిశాచర! పెనుభూతమా! వెడలుమ"[1]

"పరప్రభుత్వము క్రింద పడియుండుటన్ జాతినిన్ సాగనంపగా నేరదయ్యె

చిరదాస్యమున జిక్కి దెఱువమి కన్నులునిన్ రూపుమాపగా నేరదయ్యె

పెద్దల మాటల పెడచెవిన్ బెట్టుటన్ నీ ద్రోహమెరుగగా నేరరైరి

దేశ దారిద్ర్య విధిన్ నీ స్వభావమ్ములెంత చెప్పిన తలకెక్కవయ్యె"

ఇపుడు, స్వాతంత్ర్యమున్ గడియించినారు

భరతఖండాన నిల్వగా పాడిగాదు

కదలు మిట నుండి యాశల వదలుమింక

త్రాగుడు పిశాచమా! యింక తరలిపొమ్ము!"[2]

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 61
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 111

గాంధీజీ నాయకత్వమున, భారత స్వాతంత్ర్య సమరమున దుమికి ఎందరో మహానుభావులు పడరాని కడగండ్ల మ్రగ్గి ఆస్తిపాస్తుల పోగొట్టుకొని యిల్లు, వాకిళ్ళు వదలి సంసారముల త్యజించి తుదకు జైలు కేగి అచ్చట ప్రభుత్వము పెట్టు బాధలు భరించి కృశించినారు. ఎందరో వికలాంగులై ఎందరో లాఠీ పోటులకు దెబ్బలు తిని, ప్రాణములతో నిలబడిరి. అట్టి లాఠీ పోటులకు గురియైన ప్రముఖులలో మా తాతగారైన శ్రీ గురుజాడ రాఘవ శర్మ కూడ ఒకరు.

వారు రాయవేలూరు - సెంట్రల్ జైలులో ఉన్నప్పుడు జైలు జీవితమును ఈ విధంగా వర్ణించిరి.

"శ్రమయను మాట లేదు, బహుశాంతము జీవితమిచ్చటన్, బరి
శ్రమయను మాట లేదు, సుకరమ్ము దినమ్ము, రవంతబుచ్చ, యో
గ్యమగు తపోవనమ్మె, మరియాదల నేర్చెడి పాఠశాల నా
భ్రమ గలిగించు నేరికిది రమ్య సుఖంబగు బందె, సొమ్మురా!

అనుభవమ్మునకున్ మించినట్టి వస్తు
వెన్ని వత్సరముల్ మని యున్న సున్న
దొరకదది దొరికినన్ వెంట దొరకు ముక్తి
సొమ్మిట వెదకిన నమరు సుమ్ము"[1]

"బయటకలవారికిది, పెదబందె కాని
లోన గలవారికిది, స్వర్గలోకమరయ
వేఱె చెప్పగవలెనె, మా విధమి కిట్టి
ఎంత యానందమున్, గనివిని యెరుగము" 2వ లేఖ

"పగలు మిత్రుల మాటల బాయు ప్రొద్దు
కలత నిద్దురచే రాత్రి కాలమరుగు
గుహలు జేరిన దాదిగా కునుకు వచ్చు
నంతకును, ప్రొద్దు పుచ్చుటే, యధిక భరము"[2] 2వ లేఖ

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 26
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 27

"సందె వడంగ, మమ్ముగల సాధనపుం గుహలందునుంతు, రా
"నందముతోడ జీవితమునన్ గల భాగ్యములందలంచి మే
ముందుము రేలప్రొద్దు ననెయుండెడి యిల్వెడలింతురంద ఱిన్
విందొనరింతు మంత సరవిన్ గడతీరిచి నిత్యకృత్యముల్" 2వ లేఖ

"మేనులు పొంగి పర్వులిడి మిత్రులు కల్పిత వర్షధారలన్
స్నానమొనర్చు వేళ నెకసక్కెము లాడెడు వేళ నొండొరుల్
బూని పెనుంగు వేళ తమ పుట్టి మునింగినయట్టు లాత్రతన్
స్నానజలమ్ము వేగగొనుచందము నందము నోలలాడుటల్
కానగరాని సంతసము కల్గునె, యిచ్చటి స్నాన ఘట్టమున్" 2వ లేఖ

"వాలఖిల్యులబోలె యశ్వత్థ వృక్ష
ముల, సమీపమునన్, ప్రొద్దుపొడుచు తోన
పలు విధంబుల నాసన ప్రకరణముల
యోగ సాధన లిచట, చేయుదురు, మించి" 2వ లేఖ

"కొందఱు పర్వులెత్తుదురు, కొందరు బొజ్జలనూపుకొంచు, నీ
బందె(బ్రదక్షిణమ్ము సలుపన్ జనుచుందురు, కొందరిండ్లలో
వందన మాచరింతురు ప్రభాతములందిను గూర్చి కష్టమున్
గొందఱు చేతురిట్లు తమకుందగునట్లు శరీరవృద్ధికే
చందము నచ్చునో యటులసాధనలన్ బచరింతురిచ్చటన్" 2వ లేఖ

"ఆహా ! బారులు దీర్చి, వృక్షముల ఛాయన్, విందుగావించుచున్
స్నేహాందోళిక నోలలాడుదురు కంటే ! వీరి యానంద మీ
యూహాపోహల కందజాలనిది సద్యోముక్తిగా దోచు సం
దేహంబేల ! సుఖంబు నుంటిమిట రద్దిరవ్వలేకుండగన్"[1] 2వ లేఖ

"గంట గంటకు మ్రోగెడి గంటలిచట
కాలమున్ దెల్పు ! రేల బగళ్ళయందు
నిశల ప్రతి పావుగంటకున్ నియతి మ్రోగు
చుండు గంటల వేళ విసుంగు లేక
వార్డరులు హెచ్చరికల దెల్పంగ విందు"[2] 3వ లేఖ

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 28
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 29

"లాలిత రాజమందిరమున్ బ్రతి నిత్యము మేళవించు వై
తాళికు లట్ల పెండ్లియగు తావుల మ్రోగెడి మేళమట్ల బా
కాలను నూదుచుండ్రు ప్రతి కార్యము గూరిచి యందునీ యుషః
కాలపు మేలుకొల్పు వినగా సరిగా ప్రతి జీవి మేల్కొనున్"[1] 3వ లేఖ

"కూడు గుడ్డ యొసంగి కాపాడు షరతు
బూని తెచ్చెను మమ్ము ప్రభుత్వమిటకు
జేయుచున్నార లిచట రాజసేవ మాకు
నౌకరుల గూర్చి సేవలొందంగ దినము" 4వ లేఖ

"ఉచిత భోజనముల మాకు నుచిత వైద్య
శాలలు గలవు మంగలి చాకలియును
గసవునూడ్చెడి చౌక నౌకరులు గలరు
కనుమ వీరి మా తోడి దొంగలెయటంచు" 4వ లేఖ

"చక్కనౌ కార మాకు నొసంగి నార
లద్దె లడుగరు మేముండు నంత వరకు
బుద్ధిపుట్టిన సున్నము బూయ బాగొ
నర్తు రీ యందమైన యొంటరి గృహాలు"[2] 4వ లేఖ

"ఎందఱో పండితుల్ కవులింకెందఱు భోగులు త్యాగులండిరీ
బందియ నొక్కరొక్కరు లవంబునికేరికి దీసి పోవరా
నందముతోడ వీరి గనినన్ దరిజేరిన బల్కరించినన్
దుందుడు కెల్ల మాను పరితోషము గల్గు సు విద్యయబ్బెడున్."[2] 4వ లేఖ

బ్రిటీషు ప్రభుత్వము పెట్టిన బాధలను రాజమండ్రి జైలులో అనుభవించిన కష్టములను కళ్ళకు గట్టినట్లుగా గేయముల రచించి ప్రజల నుత్తేజితులను చేసిరి.

"ఇదిగో! దివాలా ప్రభుత్వం
వ్రేళ్ళతో - కదిలి కూలింది దిగో
కనుము - దీని సత్త్వం ॥ఇదిగో॥

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 29
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 33

1. అంతులేని మనల నెంత మందిని బట్టి
గంతులేని బ్రతుకుతాడు
త్రావ ముంత సప్లయి చేయలేడు
మల్ల సుంత యివ్వలేని వాడు
తొడుగ బొంతలెన్నియ్య గలాడు
తన పంతము నిల్ప చూస్తాడు
కళ్ళకు గంతలు కట్టి యాడ్తాడు
ప్రజ్ఞ సుంత - దెలియు శక్తి శూన్యము వీనికి ॥ఇదిగో॥

2. ఎన్నాళ్ళు సైచిన సున్న వీడికి జాలి, తిన్నగ కూడు నీరీడు
పురుగులన్నపు ముద్దలిస్తాడు
మేకులన్నపు ముద్దలిస్తాడు
ఉప్పుడన్నపు సుద్దలిస్తాడు
వాసనన్నము మంచిదంటాడు
దీనికి మిన్నలేదట మంచి కూడు
జిహ్వాలన్నీ కట్టాడు యీ పాడు
కూడు కన్న - నీరేపాన - కము, ప్రాణాధారము ॥ఇదిగో॥
యూనియను జాకు - బూని బ్యాండు మేళం
తోను ఊరేగింపు జేసి
జైలుఖానా లెదుట నిల్పజేసి
మాకు లేనిపోనట్టి రాకాసి
ప్రభువు నేనెయనుచు తిరుగు నిస్సీ
మనము వీని లెక్క గొనము వాసి
యనుచు ప్రాణములను తలపోసి
మొన్న దీన ప్రదర్శనము - తెచ్చె - మెచ్చెనెవడు ॥ఇదిగో॥

దేవతా పులుసు 4. కుళ్ళిపోయిన చచ్చు - కూరలు - ముల్లంగి -
ఉల్లిపాయలు, గలిజేరు -
వంగపేళ్ళు, చీడ తోటకూర
చిరివేళ్ళు, వెంపాలి, గోంగూర
పెద్ద పల్లెకూడు, బూజుమామిడి
టెంకల్, వెల్లుల్లి పచ్చిబొప్పాయి
ఉప్పుగల్లు, చిటికెడు - తెల్లకారం

చిన్న పల్లెకుడు - నూరుడు పప్పు
తలపయొుళ్ళు ఝుల్లని - నీళ్ళు గారు
పుచ్చు నల్లచింత పండు శేరు
కలిపి నీళ్ళు జేర్చి, యిట్టి సారం
ఇనుప కళ్ళాలగాచి యాధరు
వుగ నిచ్చు దేవతా పులుసు - యితని శక్తి దెలుసు[1] ॥ఇదిగో॥

1946 సం॥లో శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ కి అఖండ విజయం లభించి, రాజ్యాంగ పరిషత్తులో కాంగ్రెస్ అభ్యర్థులు సభ్యులుగా ఎన్నుకోబడిరి. ఈ లోగా నవకాళీలో జరిగిన ఘోరకృత్యములు విని, మహాత్మాగాంధీ అచ్చటికి వెళ్ళి హిందూ మహమ్మదీయుల సఖ్యతకెంతో పాటుపడిరి. అచ్చట హిందువులను మహమ్మదీయులు పెట్టిన ఘోరకృత్యము లింతింత యని వర్ణింపనలవిగాదు.

1947 సం॥లో ఆగష్టు 15 వ తేదీన భారతదేశానికి స్వాతంత్ర్యము సిద్ధించినది. ఈ సందర్భములో

"నేడుగా తమమేని నెత్తురు లోడ్చి
రాజశ్రీని చేకొన్న యట్టి దినము
నేడుగా జగతి బానిస జాతియను పేరు
పోగొట్టుకొన్నట్టి పుణ్యదినము
నేడుగా యెన్నడు వీడని దాస్య శృం
ఖలములద్రెంచిన ఘన దినమ్ము
నేడుగా పరజాతినిన్ ద్రోసిరాజని
యాటగట్టించిన యట్టి దినము
నేడుగా దేశమాత పున్నెము లభించి
ఖండ ఖండాంతరముల నఖండయశము
బడయు దివ్యముహూర్తమీ పర్వమందు
జేరుడి స్వతంత్ర భారత వీరులార".[2]

తరువాత భారతదేశము రిపబ్లిక్‌గా రూపొందిన సందర్భములో

"ఎన్నాళ్ల కెన్నాళ్లకు - కడగండ్లు - ఈడేరె ! మా తల్లికి
కన్నుల పండువయ్యె - మన భరత - కన్న సంతానమునకు !"[3]

అని హర్ష పులకాంకితులయ్యారు.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 22
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 97
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 114

## 5.3 గాంధేయవాది: -

లోకోత్తర పురుషుడైన మహాత్మాగాంధీ గారు 1921 సం॥ నుండి 1947 సం॥ వరకు సాగిన అహింసాయుత భారత స్వాతంత్ర్య సమరమునకు నేత. వీరి నాయకత్వంలో తోడుగా నిలిచిన అతిరథులు, మహారథులు, మహాభోగులు, త్యాగులు, దేశ సేవాపరాయణులు ఎందఱోగలరు.

అట్టి వారిలో శ్రీ గురుజాడ రాఘవశర్మగారొకరు. వీరు గాంధేయవాది. గాంధీ గారి అడుగుజాడలలోనే అహింసాయుత మార్గములోనే నడిచిన వీరులు. వీరు గాంధీగారిని గూర్చి 'బాపూజీ' అను గ్రంధములో,

సీ॥ "మిన్ను విఱిగి, యెంత మీద బడ్డ
రవంత కదలని యచల సంకల్పమూర్తి!
కంఠముత్తరించు, కరకు తురకనైన
దాసోహమనిపించు, దండి తపసి
ప్రాణ పరీక్ష యందైనను,
బాసాడి తప్పని నిత్య, సత్యవ్రతుండు
చంపదగిన యట్టి శాత్రువు నైనను
క్షమియింపదగు, నహింసావ్రతుండు

గీ॥ ఎఱిగియో, యెఱుగకయొ, తానెదిరిచేయు
దొసగులన్ విప్పి, శిక్ష నొందుచు, దనంత
ధర్మము బ్రతిష్ఠజేసెడి, కర్మయోగి
యైన గాంధి మహాత్ముని నభినుతింతు"[1] బాపూజీ, పద్యం1

అంటారు. ఇంతటితో తృప్తి చెందక భారత జాతికి ప్రాణము ధనము సర్వస్వము గాంధీయే ఇతడు లేకపోతే భారత ధరిత్రి లేదు అని అంజలి ఘటిస్తారు.

"బోసి నవ్వుల మంచి ముత్యాల నొలి
కించు తాత, మన్నన గన్న నేత యితడు
ఒక్కడయ్యు జాతినొక్క పెట్టున
లేవదీసిన యసమాన ధీరుడితడు

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - బాపూజీ పుట 7

బక్క జిక్కియు తపః ప్రాభవంబున

శాంతి స్థాపించు ఘన తపఃశాలి యితడు

తామానవుండయ్యు, వ్యామోహమున్

ద్రెంచి పరము సాధించిన ప్రాజ్ఞుడితడు

గీ॥ ఇతడె, జాతికి ప్రాణ మింకితడె ధనము,

బంధుడీతడె, సద్దయాసింధు డితడె

యితడు లేకున్న లేదు భారత ధరిత్రి

యట్టి గాంధీ మహాత్ముని నభినుతింతు."[1] బాపూజీ, పద్యం 3

గాంధీ మహాత్మునిలోని సంకల్ప బలాన్ని, అహింసా, సత్య వ్రతాలను అక్షరాల పుణికి పుచ్చుకొని వారి అడుగు జాడలలోనే పయనించినవారు కవిశేఖరులు. 11-2-1899 సం॥లో జన్మించిన శ్రీ శర్మ గారికి 1916 సం॥లో బందరులో ఆంధ్ర జాతీయ కళాశాలకు హోమ్‌రూల్ ఉద్యమ ప్రచార సందర్భముగా అరండేలు వాడియా గారలతో విచ్చేసిన డా॥అనీబిసెంట్ చేసిన మహోపన్యాసము వీరినుత్తేజపరచినది. పంజాబు దురంతాల అనంతరం కలకత్తాలో జరుగబోవు అత్యవసర కాంగ్రెస్ మహాసభలో అసహాయోద్యమ తీర్మానము ప్రవేశ పెట్టుటకు షౌకతాలీ గారిని వెంటబెట్టుకొని దేశ పర్యటన గావించుచు గాంధీజీ విజయవాడకు వచ్చిరి. ఆ ఉపన్యాసము దానిని తెలుగున అనువదించిన ఆంధ్రరత్న శ్రీ దుగ్గిరాల వారి గంభీర వాగ్విలాసము వీరిని ఆకర్షించినది. తత్ఫలితంగా కలకత్తా కాంగ్రెస్ తీర్మానించిన త్రివిధ బహిష్కార ఉద్యమం క్రింద 1920సం॥లో వీరు పనిచేయుచున్న పాఠశాలా ఉద్యోగానికి రాజీనామా చేసి ఖద్దరు ధరించి నాయకమణియైన డాక్టరు పట్టాభి గారిని దర్శించి, కాంగ్రెస్ ఉద్యమంలో చేరిరి. తరువాత 1921 సం॥లో మార్చి 31 వ తేదీన ఏప్రిల్ 1వ తేదీన విజయవాడలో జరిగిన గాంధీ గారి ఉపన్యాసములు వీరిని ఉత్తేజితులను చేయడమే గాక స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనుటకు నాందియైనది.

"మహాత్మాగాంధీ దర్శనమె పావనము" (మంగిపూడి)

"జగద్రక్షకుడు గాంధీ మహాత్ముడు" (కొండపల్లి)

"గాంధి మహాత్ముడు - భారతమాత

నీ ముద్దు కొడుకుండంగ - భారతమాత

మాకేమియును భయము లేదు - భారతమాత

మాకేమియును కొదువ లేదు - భారతమాత" (కొండపల్లి)

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - స్వాతంత్ర్యపథము పుట 63

వంటి గేయాలు, బందరు నోబుల్ కళాశాలలో చదువుచున్న సమయములో జాతీయోద్యమ ప్రభావానికి లోనైన అద్వితీయ అకళంక దేశభక్తుడు జాతీయగేయ కవి సార్వభౌముడు శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ గారు వ్రాసిన "మా కొద్దీ తెల్లదొరతనము" అని ముప్పది తొమ్మిది చరణాలు గల గేయము ఆంధ్రదేశాన్నంతటిని ఉఱ్ఱూతలూగించినది. తమిళ దేశంలో శ్రీ సుబ్రహ్మణ్య భారతి వలె భారతదేశంలో శ్రీ గరిమెళ్ళ గానం చేసిన స్వీయ కవితల్ని శ్రీ శర్మగారు కంఠస్థం చేసి స్వయంగా తాను గానం చేస్తూ అంకితభావంతో ఈ జాతీయోద్యమాన్ని పల్లెలలోనూ, పట్టణాలలోను, సైకిల్ మీద తిరుగుతు ప్రచారం చేసినారు. తత్ఫలితము 9 నెలలు కఠినకారాగార శిక్ష.

గాంధీజీ స్వదేశీ వస్త్రదీక్ష తో బాటు, విదేశ వస్త్ర బహిష్కరణ సాగినచో వేగమే స్వరాజ్యమును సంపాదించ వచ్చునని బోధించి, తాను నిరంతర చర్ఖా దేవతోపాసియై ప్రతి యింట రాట్నము వడుకునట్లుగా వ్రతదీక్ష పూనునట్లు చేసిరి.శ్రీ శర్మగారు కూడా ప్రతిరోజు ఎంత సమయమైనను రాట్నము వడకనిదే భోజనము చేసేవారు కాదుట.

"వడుకుమురా ! వడుకుమురా !
వడి వడి స్వేచ్ఛావాయువు బిల్చి ॥వడుకుమురి॥
నీ దేశోద్ధరణకు। తెరగదిరా
తెలివిగలిగి వే - వడుకుమురా ॥వడుకుమురి॥
కలిమి బలిమి - యీా, కదురే గదరా
క్రమ్మర రాజ్యంబొసగు సూత్రముర"[1] ॥వడుకుమురి॥

అను గేయాలతో ప్రజలను దీక్షాబద్ధులను చేయుటయే గాక తన జాతి మోక్షమే తన మోక్షమని తన ప్రాణమిచ్చెడి మానవుండు

"ఈ లోక కల్యాణమే జాతి కల్యాణ మ
టంచు నాహుతి యగునదియె జాతి
పరమత సహనమే స్వమతోద్ధరణ మంచు
నడ్డి కాపాడెడు నదియె మతము
స్వీయ దేశపు వృద్ధిదృష్టి నొందక ప్రక్క
దేశ వృద్ధి గోరు దేశ మదియ

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - స్వాతంత్ర్యపథము పుట 61

||గీ||   "సంకుచిత స్వల్ప భావదాస్యముల పట్టు
వడక నిజసత్య ధైర్యకవచముల గొని
ధర్మ రక్షణకై ముందు దారి చూప
వెడలి రండయ్య! భారత వీరులార!"[1]   స్వాతంత్ర్య పథము పుట 60

అని ప్రజలకు ఉద్బోధించుచు,

"ఖద్దరెవ్వని భుజస్కంధమ్ము ధరించునో
వారి జన్మమే పావనమ్ము
రాట్నమెవ్వరి యింట రంజిల్లున్ దిర్గు
నో వారి గేహమే పావనమ్ము
చేతి పనులెచట చెలగి వృద్ధిని జెందునో
వారి దేశమే పావనమ్ము
సత్యమ్ము ప్రేమ యే జాతి ధర్మములౌచు
బరగు నా జాతియే పావనమ్ము."[2]   బాపూజీ పుట 5

అని నమ్మి నడచుకొనిరి. దీనిని బట్టి గాంధీ గారి యందు వీరికి ఎంతటి గురు భావం గలదో వ్యక్తమగుచున్నది.

బందరు ఆంధ్రజాతీయ కళాశాలలో డైయింగ్ & ప్రింటింగ్ విభాగానికి వీరు 1921 సం|| నుండి 1927 సం|| వరకు మేనేజరుగా వ్యవహరిస్తూ పల్నాడు తాలూకా మాచర్ల నుండి షుమారు నూరుమంది మగ్గాల వారిని, మగ్గాలను తీసికొని వచ్చి బట్టలు నేయించి, నేతబట్టలకు రంగులు వేయించి, కలంకారీ పనులను ప్రవేశపెట్టిరి. ఇదే బందరు పట్టణానికి, కలంకారీ వస్త్రాలకు ఖ్యాతిని దెచ్చిపెట్టిరి.వీరి కృషిని గుర్తించి శ్రీశర్మగారికి మహాత్మాగాంధీ స్వహస్తములతో స్వర్ణ పతకమును బహూకరించిరి.

"ధారుణి నహింసయె పరమ ధర్మమనుచు
తాల్మి బోధించు జ్ఞాన ప్రదాత యతడు
పావన ఖ్యాతి ధాత్రి మా భరత మాత
కన్న బంగారు తండ్రి మా గాంధి తండ్రి
సన్నుతించెద భక్తి నంజలి ఘటించి"[3]

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - స్వాతంత్ర్యపథము పుట 60
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - బాపూజీ పుట 5
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - బాపూజీ పుట 8

అని అంటారు. 'బాపూజీ' అను కావ్యఖండికలో గాంధీజీని ఆరోజున ప్రతి స్వాతంత్ర్య సమర వీరుడు గురువుగా, తండ్రిగా భావించి కొలిచారు. ప్రతి వీరుడు గాంధీమాట రామాజ్ఞగా, సంకల్పము కార్యరూపముగా, సందేశము వేద వాక్యముగా, ఆయన నిలిచిన స్థలము మంచి క్షేత్రముగా, ఆయనతో సంబంధము స్వర్గతుల్యముగా, ఆయన సాన్నిధ్యము దొరకకపోతే జన్మ వృధాగా భావించిరి. ఇంకా

**"మూగవాడేయననౌ, గాంధి యంచు**
**రెండక్షరంబుల పల్కనట్టివాడు**
**గ్రుడ్డివాడగు, గాంధి రూపంబు గనకున్న**
**యతని పటము జూడనట్టివాడు**
**బధిరుడగును, గాంధిబల్కు స్వయముగా**
**వినకున్న యంత్రాన విననివాడు**
**హృదయమ్ము లేనివాడేయగు, గాంధి**
**మహాత్మ్యమ్ము దెలియలేనట్టివాడు**
**భారతీయుడు కాడింకవాడు, గాంధి**
**పుట్టినది నేను పుట్టిన పుణ్యభూమి**
**భరత ఖండమెయని గర్వపడనివాడు,**
**మిగిలె నీ తృప్తి నీవు లేమిని మహాత్మ!"[1]**

ఆధునికమైన ఈ యంత్ర యుగంలో హింసాపద్ధతులందే విశ్వాసం కలిగి, నిరంతర హింసాకాండలో, తాండవ మాడే జాతులకు అహింసా ప్రబోధాన్నందిచ్చి అహింసా దిగ్విజయం, ప్రపంచాన చాటటం కొరకై, మహాత్ముణ్ణి, భారతావని, కోరి తెచ్చుకున్నట్లు కనిపిస్తుంది.

మహాత్ముడు కోరింది నిజంగా ఈ స్థూల స్వాతంత్ర్యం కాదు. ఈ స్వాతంత్ర్యం కొరకే కాదు ఆయన ఉద్యమాన్ని సాగించినది. తన సత్యమార్గాన్వేషణలో, అహింసా ప్రబోధంతో భారతావనికి స్వరాజ్యం సంపాదించడం, ఆయన జీవితాశయాలలో నొకటి. ఆయన అభిలషించినది ఆత్మస్వారాజ్యం. ఈ సత్యాహింసా సాధనాలతోనే ఆయన ఆశయాన్ని చిట్టచివర వరకు సాధించినది.[2]

బాల్యమాదిగ, జీవితమంతా, తదన్వేషణార్థము నన్నట్లు దక్షిణాఫ్రికాలో, ప్రారంభించిన, యుద్యమాన్ని, జన్మభూమియైన భారత వర్షంలో సాధించి కృతార్థుడైనాడు.[3]

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - బాపూజీ పుట 14
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - నవకాళి తొలి పలుకు పుట 3
3. పైదే

జర్మనీ ఘోర మారణ సాధనముల నిర్మించి, దాని సహాయమున లోకమును స్వాధీనమొనర్చుకొన జూచెను. జపాను దానిననుసరించెను. శేషించిన లోకమంతయు నొక్కటి రెండు మహా యుద్ధములు సలిపి, హింసామార్గము యొక్క నిష్ఫలత్వమును వెల్లడించినవి. అట్టి తరి మహాత్ముడు అహింసామార్గము నవలంభించి, బ్రిటీషు సామ్రాజ్యముతో సత్యాగ్రహ సంగ్రామము సలిపి, 25 సంవత్సరములు జరిగిన పోరాటములో ఒక ఆంగ్లేయునైన చంపక, తానును తన యనుచరులును, మహా కష్టములననుభవించి, తుదకు శత్రుత్వ సంహారము గావించి, స్వరాజ్యము సంపాదించి, ఉభయ జాతులును సమాన హోదాగల మిత్రులవలె "Common wealth" ప్రజాస్వామిక సభ్యులుగ నుండి, లోకశ్రేయస్సునకై పాటుబడుచున్నారు. బర్మా, సిలోను, పాకిస్తానులకు గూడ స్వరాజ్యము లభించినది. ఫ్రాన్స్, ఇటలీ, హాలెండులు ఏ పోరాటముసల్పక గాంధీ మార్గము ననుసరించి తమ సామ్రాజ్యముల విచ్ఛిత్తు గావించుకొనుచున్నారు. ఆఖరుకు రష్యా కూడ స్టాలిన్ జన్మదినమున లోక శాంతి బహుమతులు నెలకొల్పింది.

ఇండియాలో, మహమ్మదీయులు, సత్యాగ్రహ సమరమున జేరకుండుట చేతను యితర మహమ్మదీయ దేశములు ఐరోపా మహా సంగ్రామమునకు దూరముగా నుండుట చేతను హింసామార్గము యొక్క నిష్ప్రయోజనము వారికి బోధపడలేదు. అందుచేతనే జిన్నాగారు, హింసామార్గమున, అహింసాపరులగు హిందువులను బాధించి పాకిస్థానమును వృద్ధిచేసికొనజూచెను. కలకత్తాకును, పశ్చిమ పాకిస్థానమునకు మార్గమును సంపాదింపగోరి కలకత్తాలో హిందువులను ఖూనీ చేయించి యచ్చట విఫలుడయ్యెను. కలకత్తాలో హిందువులధికమగుటచే, నోడితినని తలచి, తూర్పు బంగాళములోని నవకాళీలో హింసాకాండము మొదలిడెను. అందు కొంత విజయము గలిగినదని తలచి దక్షిణ భారతములో గూడ మహమ్మదీయు లెక్కువగా నున్నచోట, హింసలు చేసి, శాంత స్వభావముగల, దాక్షిణాత్యులను జూచెను గాని ఇంతలో బీహారులో 'నవకాళీ బదలా' అని హిందువులు హింసాక్రియకు మొదలిడి,నవకాళీకికొన్ని రెట్లు ముస్లిముల నంతమొందించిరి. జిన్నాగారు హిందువులధికముగానున్న రాష్ట్రముల, తన ఉద్యమము విరమించి, పశ్చిమ పంజాబులో వధలను, స్త్రీల అపహరణములును ప్రారంభించెను. ప్రతి క్రియ ముస్లిముల వధలు, పశ్చిమపంజాబులో కంటె, నిను మిక్కిలిగ జరిగెను. ముస్లిం స్త్రీలు హిందూస్త్రీలకంటె నెక్కువగా అపహరింపబడిరి. అంతటితో జిన్నాగారికి హింసా పద్ధతుల నిష్ప్రయోజకత్వము రుజువయినది.[1]

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - నవకాళి తొలి పలుకు పుట 6

అప్పుడు మహాత్ముడు తన యుద్యమమును ప్రారంభించి ముస్లిముల హృదయ పరివర్తనకై ప్రయత్నించెను. కొంతవరకు పని సాగినది. కాని యది స్థిరముగ ముస్లిముల హృదయమున నెలకొనుటకై ఆత్మ బలి గావించుకొనవలసి వచ్చెను. 'ఏసు' సిలువపై పాపులనుద్ధరించుటకు బలియైనట్లు, మహాత్ముడు తననే బలిగా సమర్పించెను. జిన్నాయునును అంతరించెను. మత ద్వేషములకు అతీతమైన స్వరాజ్యమును స్థాపించుటకు మార్గమేర్పడెను. ఇదియే గాంధీ బలియొక్క అంతరార్థము[1].

ఈ ఘట్టమును శ్రీ శర్మగారు పాఠకుల హృదయములు కదలించునట్లు మృదు మధురముగా వర్ణించిరి.

స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న దగ్గర నుండి దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించే వరకు, గాంధీజీ వలె ఒంటి మీద చొక్కా లేకుండా కేవలం ధోవతి - ఉత్తరీయంతోనే ఉద్యమాన్ని వాడవాడలా ప్రచారం చేశారు. గాంధీజీ సిద్ధాంతాలే గాదు ఆయన రూపమే తన శరీరంలో జీర్ణించుకున్న వ్యక్తి గురుజాడ. కనుకనే ప్రళయ దారుణ దుస్సహంగా రక్తం వెల్లువలా ప్రవహించిన నవకాళికి అహింసాయాత్రకు వెళ్ళిన మహాత్ముని రూపం ఇట్లా వర్ణించారు:

> **"బలహీనంబుగ దోచుమేను,మొల (త్రిప్పంజాలు వస్త్రమ్ము**
> **నామొలపైనన్ గడియార, మొప్పగు నురమ్మున్, దాల్చకే పాదర**
> **క్షలు; చేఁగఱ్ఱయు ( గళ్ళజోడుగని సాగన్ వచ్చెనాజాను బా**
> **హుల సమ్మోహన విగ్రహుండు కనుమోహెూ! బ్రహ్మతేజోనిధిన్"**

ఇట్లా బొమ్మ గీసినట్లు వర్ణించ గలగడం సామాన్యకవులకు సాధ్యం గాదు. అని శ్రీ చిఱ్ఱాపూరి శివరామకృష్ణ శర్మగారు తమ వ్యాసంలో పేర్కొని యుండిరి."[2]

హిందువులైనా, ముస్లిములైనా అందరు భరతమాత ముద్దు బిడ్డలేనను భావన చక్కగా వ్యక్తీకరించిరి.

> **"హైందవులైననేమిఁక, మహమ్మదు సంతతియైననేమి మే**
> **మందరమొక్కటేకద! గృహమ్మున నీ కృపఁబుట్టి, పెర్గి, యా**
> **నందమునన్ జరించితిమె నాడును నేడును లేనియట్టి యీ**
> **చిందరవందరల్ కఱకుసేతలిసీ! యెటుదాపురించెనో."[3]** నవకాళి పుట 3

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - నవకాళి పున్నవ లక్ష్మీనారాయణ గారి పరిచయము పుట 6
2. శ్రీ డా॥ సి.హెచ్. చిఱ్ఱాపూరి శివరామకృష్ణ 'కీర్తి' 'శేషులు' శ్రీ రాఘవశర్మ గారు - శ్రీ గురుజాడ రాఘవశర్మ శతజయంత్యుత్సవ సంచిక పుట 48.
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - నవకాళి పుట 3

అని బాధ పడటమేగాక, ఇంత దుర్మార్గం జరుగుతుంటే చూస్తూ దేవుడేం చేస్తున్నాడని ప్రశ్నిస్తున్న తీరు చూస్తే కవిగా వీరు పడుతున్న ఆవేదన వ్యక్తమగుచున్నది. సీస పద్యంలో ఎంత కరుణ రసాత్మకంగా వ్రాశారో

సీ॥ "ఇచ్చోటనే కదా! హిందూ పతివ్రతా
స్త్రీల మానమ్ము హరించినారు
ఈతావుననె కదా! యింతింత లేసి బా
లికల బాలుర! దస్కరించి నారు
ఇచ్చోటనే కదా! యింటింట కగ్గి ర
గిల్చి సపాటమ్ము (గూల్చినారు
ఈ పట్టుననె జీవనోపాధిగా దాచు
కొన్న యాస్తుల (త గొల్ల గొట్టినారు.
గీ॥ ఏమనందుము! కటా కటా! యిట్టి ఘోర
నరక మిс(కనున్నె! 'నవకాళి' ధరణి గాక
సాటిమానవు ( డను బుద్ధి, జాలి లేదే!
దేశ దౌర్భాగ్య మిది గాక, దేవు(డెచట?"[1]

ముస్లిముల మధ్యతిరుగుతు వాళ్ళతో ఉంటూ వాళ్ళిచ్చినదే తింటూ శాంతి సందేశం అందించిన గాంధీజీని,

"వైరి గృహాల రాత్రులనివాసము; వారలొసంగు పండ్లె యా
హారము, చెట్టు నీడల విహారము, వెన్నెల రాత్రులందు సం
చారములూర నూరను బ్రచార మహింస గురించి, హైందవా
చారమునన్ మహాత్ముడు విచారములేకయె యాత్రమై చనెన్".[2] నవకాళి పుట 9

అని వర్ణించిరి. "అడుగడు దేశ సైనిక సహాయమొసంగెద మన్న(గూడ" అంటూ ప్రభుత్వం రక్షణ కల్పిస్తానన్నా వద్దని ధైర్యంగా గాంధీజీ జనం మధ్య తిరిగారు అని కీర్తించారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - నవకాళి పుట 6
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - నవకాళి పుట 9

"భయము రవంత లేదు, మరి దర్గమటన్న యళంకులేదు, ని
శ్చయములవంతవీడదు ప్రశాంత ముఖమ్మది మారబోదు, సం
శయమది లేనేలేదు, తన సాధనలన్ సడలింపలేదు ని
ర్భయముగ, శాంతి దూతగ ( బురమ్ములు బల్లెలు ( జొచ్చియేగెడిన్"[1]

అని చెప్పుటయే గాక, జనం మధ్య ప్రభుత్వ రక్షణలో తిరిగేవారు నాయకులు కాదన్న గాంధీ సిద్ధాంతం కవి చక్కగా వర్ణించారిక్కడ.

"క్షమ కవచమ్ము, కార్ముకము సత్యమహింసలె చూడనీ శరీ
రమె రథ, మందు జీవు (డె తిరమ్ము గదా రథికుండు బుద్ధియు
త్తమ రథచోదకుండు, బెడిదంబగు కామగుణాదిశత్రు వ
ర్గమును జయించి, ధర్మము జగమ్మున నిల్పుటె పూరుషార్థముల్".[2]

మనిషి తాను జేయు ప్రతి కార్యము లోకహితం కోసమే చేసినచో జీవితం సార్ధకత చెందుతుంది. మనలో ఉండే అహంకారమును విడచి, స్వార్థము లేకుండా లోకరక్షణ విధియని తలంచి ప్రతిక్షణము నడచుకొనినచో మేలు అని ఉద్భోదిస్తూ

"కోపం బూనుట పాడిగా దెవరికిన్, గోపమ్మె తా శత్రువై
తోపం జేయదు యుక్త కార్యమదియేదో, తానెవారో, వెసన్
పాపమ్మేయొడిగట్టి, స్వీయ కృత పాపావిద్ధుడై, లోకమున్
దూ పట్టన్ శునకాదులంబలెనె సందుంగొందులన్ ద్రుందుబో"[3]

తన కోపమే తనకు శత్రువు అని చెబుతు బయట శత్రువులను జయించాలంటే ముందు అంతః శత్రువులను జయిస్తే బాగుంటుందంటారు.

"తనకేదో యపరాధమున్ సలిపెనీతండంచు ( గ్రుద్ధాత్ము(డై
కనులున్ గాన( డెఱుంగ ( డించుకయు యుక్తాయుక్త కార్యంబెదో
తనకుంగీడొనరింప (జాలు, తనయంతః శత్రువౌ కోపమున్
గని, కోపింపక, బైటి శత్రువు పయిన్ గాల్దవ్వమేలౌనొకో!"[4]

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - నవకాళి పుట 9
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - నవకాళి పుట 12
3. పైదే
4. శ్రీ గురుజాడ రాఘవశర్మ - నవకాళి పుట 13

ఈ విధముగా పసికూనలను మొగ్గలనుద్రుంచినట్లు ఖండిస్తున్నారు మీ యిండ్లలో పాపలు, బిడ్డలు లేరే? అని ప్రశ్నిస్తున్నారు.

ఆత్మ తత్వాన్ని ఎఱిగిన వీరు

**"కనగా (జంపగరాని వాడెవఁడో యీ కాయంబునందుండె, నా**
**తని ప్రేరేపణ నాటలాడెనని చైతన్యము లేనట్టి వీ**
**నిని దున్మాడిన, వానిఁజంపినటులౌనే! రూపమున్ లేకయుం**
**డెనుగా, జీవులలో నభేదముగ ( గంటే! యాత్మతత్వంబిలన్[1]"**

అని చెప్పుటచేత శరీరాలు వేరు కాని ఈ శరీరాలన్నింట ఉన్న చైతన్య శక్తి అదే పరమాత్మశక్తి ఒకటే సుమా అని బోధిస్తున్నారు. కాలము సమీపించినపుడు ఎవరికి వారు భార్యాబిడ్డలను వీడి కాలములో లీనమౌతారు. బ్రతికింపగలవారు లేరు. ప్రకృతి ధర్మమిది. దీనినాపుట సాధ్యము గాదు. అట్టి తరి ఈ బేధాలెందుకు? పుట్టినవాడు తానెవడో ! తన జన్మ రహస్యమేదియో తెలియనట్లే, పుట్టిన ప్రతివాడు చనిపోతాడని తెలిసియు తాను చావబోడు. ఇదే విధముగా ప్రాణికి చావు పుట్టుకలు అన్నింట సమానమే. ఈ సమానత్వ భావన తెలిసికొని ఖేదములు లేకుండా తాను ఈ లోకానికి సేవచేయుటకు పంపిన ఒక సేవకుడనని గుర్తెరిగి తన ధర్మమును విడిచిపెట్టక ఏ జీవికిని హాని కలిగించకుండా ఓర్పుతో సేవ చేసి తరించుట ఉత్తమము" అని మహాత్ముడు పల్లెపల్లెకు తిరుగుచు నిద్రాహారములు మాని చేసిన అహింసాయుత ధర్మప్రబోధతో జనులందరు "తద్దృశామృతమయాశీర్వాదస్నాతులైరి."

**సీ॥ "సంజనొకనాడు బయట, వృక్షంపు నీడ**
**శాంత రసముట్టిపడ నహింసావ్రతుండు**
**పన్యసింపంగ విని, యొక బాలకుండు**
**కన్నుగవనశ్రులొల్కగా ( గదల కచట**
**నిలచి తలపోయ దొడగె, సంజలి ఘటించి[2]"**

ఇందు జెప్పబడిన బాలకుండు శ్రీ శర్మగారేనేమో. తరువాత ఆ బాలకుడు అతడు మహాత్ముడు, అతడు కాలు మోపిన ఈ భూమి పవిత్ర స్థలము. అతడు నిర్మలామృతమయమూర్తి అతని దయాదృష్టి

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - నవకాళి పుట 13
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - నవకాళి పుట 14

సోకి జీవితము సార్థకమైనది అని భావించిఆ మహాత్ముని పాదరజము శిరస్సునఁ దాల్చి తరింతునని చేతితో గాంధీ పాదము మోపిన స్థలములో నున్న మట్టిని పై వస్త్రములో గట్టిగా గట్టుకొని ఇంటికి వెళ్ళి అమ్మా! మహాత్ముడట, మన హైందవులను బ్రతికించటానికి ఇక్కడికి దైవము పంపెనట పల్లె పల్లెకు సంచరించుచు ఇట కేతెంచెను. అమ్మా! నిజమ్ము! నమ్ముమ! మహాత్ముల పాదరజమ్ము సోకి రాయి స్త్రీగా మాఱెను కదా! "శిలా సదృక్ష చిత్తమ్ముల మార్చుటేమియరుదా! ఇదిగో వారి పాద ధూళి తీసుకొని వచ్చితిని. శిరమ్మున దాల్చుము॥ అని పలుకు పుత్రుని కౌగిలించుకుని, ప్రేమతో శిరమ్ము మూర్కొనుచు, హృదయముప్పొంగగా, ఆ మహాత్ముని చూసే భాగ్యమబ్బినదని పాదధూళి శిరమునందుఁ దాల్చెను. ఇట్లా అహింసా ప్రబోధము జేయుచు గాంధీ మహాత్ముడు పల్లె పల్లెకు, దిరుగుతు, వారి వెంట జనులు సంచరించుటను ద్వాపర యుగములో శ్రీకృష్ణుని చుట్టూరా గోపికలు సంచరించిన భావన కలిగించిరి. ఇందు వీరి కృష్ణభక్తి వెల్లడియగుచున్నది. శ్రీకృష్ణుడు గీతలో చెప్పినట్లుగా, "పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"[1] అను నట్లుగా ధర్మ సంస్థాపన కొరకు గాంధీ రూపములో అవతరించినవాడు సాక్షాత్తు శ్రీ కృష్ణుడే అని వీరు భావించారని తెలియుచున్నది. ఆ పద్యమిది.

సీ॥ "హింసాది పాప భూయిష్ఠులు వార, ల
హింసా ఉ_గమ పరమహంస యితఁడు
జలతారు జిలుగు వస్త్రధరులు వారలు
ధవళ కౌపీన సుందరు ( డతండు
మధ్యమాంసాహారమత్తులు వారలు
సాత్త్వికాహార భోజనుఁడితండు
సాయుధ భీకరకాయులు వారలు
ద్దీపితశాంత స్వరూపుఁడితడు

గీ॥ తామసులు వార, లితడు సత్త్వస్వభావుఁ
డజ్ఞాలలవార, లీతడు ప్రాజ్ఞతముఁడు
సత్యధనుఁడీతడును, వారసత్య రతులు,
దైవమితఁడేమొ; వారు తద్భక్తులైరి.[2]"

1. భగవద్గీత చతుర్థోధ్యాయః - జ్ఞానకర్మ సన్యాసయోగః పుట 63
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - నవకాళి పుట 16

తేటతెల్లగా చెప్పుచున్న ఆ మహాత్ముని ప్రియమైన దివ్యోపదేశమును ఆ పల్లీ పట్టణవాసులందఱు విని, ఏసుక్రీస్తో, అల్లాయో, బుద్ధుడో అని ఆనందముప్పొంగగా, తెలిసియో, తెలియకయో ఈ విధముగా హింసకు పాల్పడితిమి. మీ ఉక్తి సుధారసములతో దురితమంతయు పోగొట్టి మా జన్మ పావనమగునట్లు చేయుము. జరిగిన వానిని క్షమించుము అని పాదములపై బడిరి.

**"కుత్తుకనుత్తరింపఁదమకున్ మనసాడక, లోన బత్తిరే**
**కెత్త, మహాత్ము సన్నిధికి నేగి, తురుష్కులు, వే కటారులున్**
**గత్తులు ప్రోవువెట్టి పదకంజములన్ బడి, సైపుమంచు**
**జేయెత్తి నమస్కరించి, నుతియించిరి గాంధిని, నాత్మబంధునిన్ "[1]**

మహాత్ముని హితబోధతో అందరి హృదయములు శాంతిని చెందగా హిందువులు మహమ్మదీయులు మరల స్నేహముతో నౌకాళిలో కలసి జీవించిరి. అని శర్మగారు ఈ కావ్యానికి చక్కని పరిష్కారము నిచ్చిరి.

**"ఈ నవకాళి నీ వలననేగద! నేడు సజీవమయ్యె, స్వ**
**ప్రాణములొడ్డి కాచిన దయామయ! యానవకాళివీవె సు**
**మ్మా! నవకాళి పాలి, పరమాత్మవు, నాత్మవు, నీవులేని నా**
**డానవకాళి 'కాళికి', విహారము, హారము 'కాళి' యే సుమా!"[2]**

వీరి నవకాళి కావ్యంలో తెలుగు నుడికారము, సొగసులు అందంగా ఒదిగాయనడానికి ఈ క్రింది పద్యాన్ని ఉదాహరణగా పేర్కొనవచ్చును.

**"ఒకరైనన్ మునునేడుగాని కలరేమో! తెల్పరే! యుట్టిగ**
**ట్టుక వ్రేలాడుదు మెప్పుడన్న మొనగాండ్రున్ జల్ల (గా జారిపో"**
**వక యున్నారలె! యేరుగాని సహజంబౌ ప్రాణికిన్ జావు పు**
**ట్టుక, లన్నింట సమంబటంచు(గను పట్టున్ లో విచారించినన్"[3]**

స్వతంత్ర భారతపిత, నవభారత భాగ్యవిధాత, భారతీయ జీవన దాతయగు మహాత్మాగాంధీగారు 30-01-1948 సాయంత్రము ఢిల్లీలో ప్రార్థన సమయమున ఒకమతోన్మాది పిస్తోలు గుండునకు గురియై

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - నవకాళి పుట 17
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - నవకాళి పుట 18
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - నవకాళి పుట 14

నేలకొరిగిన దుర్దినమున భారతీయులు గుండెలు బ్రద్ధలై దిక్కులేని పసిబిడ్డలవలె శోకించిరి. ఆ సమయములో శ్రీ శర్మగారు

**"కూలిపోయినది యీ కులమత బేధాల**
**పోరులై మన వట భూరుహమ్ము**
**రాలిపోయినది స్వార్థపరత్వముంగాంచి**
**పరువు మీరిన యట్టి పండుటాకు**
**ఆరిపోయినది విద్యావిహీనత జూచి**
**తేజరిల్లిన యట్టి దివ్యకాంతి**
**ముంచిపోయినది యీ ముజ్జగంబులు శోక**
**మున దేల కరము కార్మొగులుచాయ**
**లిట్టి శక్తిలోన నే భూతములలోన**
**నెట్టి యణువు లోన నిముడుకొనియె**
**ఆ మహాత్మ జీవమా పరంధాముని**
**యింత యూపి రకట యెవరికెఱుక"[1]**

అని దురపిల్లిరి.

**"కట్టా! యెట్టి దురంతకార్యము వినంగా సిగ్గగున్ మాకె, హా!**
**"పొట్టన్ బెట్టుకొనంగ జాలిరి మహాత్మున్ భారతీయుల్, మనం**
**బెట్టాశించెనొ! యిట్టి దుష్కృతిక" టం చింటింట దేశాల దూ**
**పట్టన్ మేము శిరమ్ములెత్తుకొని యెబ్బంగిన్ మనంజాలనొ?"[2]**

"నీ సాన్నిధ్యములేని జన్మ వృథ తండ్రీ! మాకు దిక్కేరికిన్"

**"బాపూజీ బాపూజీ" యన్న పల్కెవిందు**
**"గాంధీకీజయి" యనుమాటె కానుపించు**
**గాంధి రూప పటంబంత గాంతు; గాని**
**భౌతిక స్వరూపమిక, కానబడదు, పడదు."[3]**

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - స్వాతంత్ర్యపథము పుట 67
2. పైదే
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - స్వాతంత్ర్యపథము పుట 68

అని ఎన్నో పద్యాలు "సత్యస్మృతి" అను శీర్షికతో వ్రాయడమేగాక ఈయన శోకము గేయమై ప్రవహించినది.

"నీ చేతులెట్లాడెరా! మన గాంధినిన్ జంప, మనసొచ్చెరా
నీచ! నీచే జాతికి తీరని - నింద కొడి గట్టితివిరా ॥నీ చేతు॥

1. ఇట్టి వాడింత వరకు, జగతిలో - పుట్టనే లేదు కదరా
నీ! పుట్టేమి ముగ్గినదిరా - గాంధిని - పొట్టను బెట్టుకొనగ ॥నీ చేతు॥

2. నేల బ్రాకే చీమకైన, పైన - నింగి నెగిరే పక్షికైన
నీటఁగదిలే ప్రాణికైన - దలపనేరడే, చెఱుపెన్నడైన ॥నీ చేతు॥

3. ఈశుడని బుద్ధుడని - యేసు క్రీస్తేయని
దేశ దేశాల వారు దర్శించి - తీర్థమై కూడినారే ॥నీ చేతు॥

4. తిట్టిన తిట్టడెపుడు, మరల నిన్ దీవించి పంపుగదరా
నిన్ గొట్టిన గొట్టడకట! వైరులకు గోట్లధనము గుప్పెరా ॥నీ చేతు॥

5. కట్ట బట్ట లేని జాతి, మానమ్ము - కాపాడి - రక్షించెరా
కడజాతివానినైన, తండ్రిగా - కౌగలించు కొనియెరా ॥నీ చేతు॥

6. ఊయిరా! నీ గుండె, చంపితివి - రాజ్యమిచ్చిన తండ్రినే!
హాయిగా ననుభవింప - గా లేక - పోయితివి, మాతృద్రోహీ"[1] ॥నీ చేతు॥

అని విలపించిన ఇట్టి గాంధేయవాదులింకెందరో, "జాతస్యమరణం ధ్రువం" పుట్టిన ప్రతి ప్రాణి చనిపోవక తప్పదని తెలిసికొని,

"శాంతి గొను గాక! నీయాత్మ శాంతమూర్తి
నిత్యము గాక! నీజ్యోతి సత్యమూర్తి
నీదు సూత్రముల్ జగమున నిండుగాక
అవ్యయుడవౌదు గాక, మహాత్మా గాంధి
కాంచెదవు గాక! సత్యలోకమ్ము నీవ"[2]

అని శాంతి వచనములు పలికిన మహా మనీషి శ్రీ శర్మగారు.

లాఠీ దెబ్బలకు అలసి సొలసిన శ్రీ శర్మగారు 1947 సం॥ ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్యము రాగానే సేదదీరిన వైనము ఈ పద్యములో కన్పట్టును.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - స్వాతంత్ర్యపథము పుట 69
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - స్వాతంత్ర్యపథము పుట 68

"నేడుగా తమ మేని నెత్తురులోడ్చి

రాజశ్రీని జేకొన్నయట్టి దినము

నేడుగా జగతి బానిసజాతి యను పేరు

పోగొట్టుకొన్నట్టి పుణ్య దినము

నేడుగా ఎన్నడు వీడని దాస్య శృం

ఖలముల ద్రెంచిన ఘన దినమ్ము

నేడుగా పరజాతినిన్ ద్రోసి రాజని

యాట గట్టించిన యట్టి దినము"

గీ॥ "నేడుగా దేశమాత పున్నెము ఫలించి

ఖండ ఖండాంతరముల సఖండ యశము

బడసినట్టి దినమ్ము సంబరముతోడ

జేరుడి, స్వతంత్ర భారత వీరులారా"[1]

చనిపోయిన వారిని స్మరించుకోవడం - శ్రద్ధాంజలి ఘటించడం వారు దేశానికి చేసిన సేవలను గుర్తుకుతెచ్చుకోవడం మన భారతదేశము నందలి సాంప్రదాయము. అది మన సంస్కృతికి ఆలవాలము. దానిని వీరు చక్కగా పాటించిరి. స్వాతంత్ర్యం సంపాదించుకున్న రోజున మన నాయకులు పడిన కష్టములు, చేసిన త్యాగ నిరతి తలంచుకొనుటయే గాక వారిని సంస్మరించుచు

"దివ్య మోహనునాజ్ఞ దీక్షా గృహమ్ముల

సలిపిన ఘనతపః శక్తి ఫలము

లాఠీలకును వెన్క లాగకయె శిరమ్ము

లొగ్గి సహించిన యోర్పు ఫలము

అన్న వస్త్రములీక యున్న బందెలగుంది

చేసిన కఠినోపవాస ఫలము

అకట తుపాకీగుండ్లకు ప్రాణమొడ్డి

యంగవిహీనులగు జనాకాంక్ష ఫలము

గీ॥ కాక యీనాటి యీ మహత్కార్యమునకు

జేరగల్గుదుమె! వారి శిథిల జీవి

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - స్వాతంత్ర్యపథము పుట 97

**తమె పునాదిగ గటు సౌధమున వీరి**

**సంస్మరింపుడీ ! పుణ్యవాసరమునందు."[1]**

అని చెప్పుటయే గాక, ఎంతో మంది నాయకులు వారీ దేశానికి చేసిన సేవ స్మరించుకొని, అజ్ఞాతముగా చనిపోయిన వీరులకు అశ్రు తర్పణమిచ్చిరి.

**"ఏనాడు పుట్టిరో యేనాడు గిట్టిరో**

**శయనించిరిట కీర్తిచంద్రికలను**

**ఏనాడు కట్టిరో యేనాడు పట్టిరో**

**దీక్ష సిద్ధించే నీ కక్షయందు**

**ఏనాడు వ్రాసిరో యేనాడు చేసిరో**

**దానముల్ పండెనీ స్థానమందు**

**ఏనాడు కోరిరో యేనాడు పోరిరో**

**యశమిట నిల్చె స్వర్ణాక్షరముల**

**అట్టి యజ్ఞాత వీరుల గట్టి చరిత**

**జెప్ప శక్యమె! స్మారక చిహ్నమిదిగో।**

**రాల్చుమీ! భక్తినశ్రుతర్పణము లింత**

**వారలకు నేడు స్వాతంత్ర్య వాసరమున॥"[2]**

ఈ విధముగా శ్రీ శర్మ గారు గాంధీ భక్తులు.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - స్వాతంత్ర్యపథము పుట 98
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ - స్వాతంత్ర్యపథము పుట 103

## 5.4 ఆంధ్ర దేశాభిమాని: -

శ్రీ గురుజాడ రాఘవ శర్మ గారికి ఆంధ్రదేశమంటే అపారమైన అనురాగము. "ఆంధ్రప్రతిభ" అనే ఖండికలో పద్యాలు ఎంతో హృద్యమంగా వర్ణించిరి.

**"స్వాతంత్ర్యమంత్రరాజము నుగ్గు పాలతో**
**త్రాగిన రాజు మా 'భోగరాజు'**
**ధైర్య సాహస గుణోదార గుణమ్ములా**
**టల నేర్చు బంటు మా 'టంగుటూరి'**
**కొండ విలుగ జంకుగొంకెలుగనట్టి యౌ**
**దార్య భుజము మ్రోయు దండి 'కొండ'**
**కోయని పిలచిన కోటాన కోట్ల నా**
**కర్షించు మంత్రిశిఖామణి 'గిరి'**
**కర్మయోగమె జీవిత ధర్మమని, వి**
**రాగియై తపియించు నాయోగి 'బులుసు'**
**యిట్టి వారెందరినొ గన్న నీవెంత ధన్య**
**వాంధ్రమాత! నమస్కారమమ్మా! నీకు"[1]**

ఇక్కడ వీరి హృదయము ఆవిష్కరింపబడినది.

ఆంధ్ర దేశము నందున్న ప్రజలకు మాతృభాష ఆంధ్రము అనగా తెలుగు గావున ఆ తెలుగు తల్లికి ఇట్లు జోహారులర్పించారు.

**"గౌతమీ కృష్ణవేణి తుంగభద్ర పె**
**న్నా నదుల్ పాఱు మాగాణి గడ్డ**
**భ్రమరాంబ, కనకదుర్గా దేవి, వెంకన్న**
**పొత్తిళ్ళ బెంచిన ముద్దుబిడ్డ**
**నాగార్జున, విజయనగర, వినూత్న క**
**ళా సరస్వతుల విలాస భూమి**

1. డా॥ మాదిరాజు రామలింగేశ్వరరావుగారు "కవిశేఖర శ్రీ గురుజాడ రాఘవశర్మ" - శ్రీ గురుజాడ రాఘవశర్మ శతజయంత్యుత్సవ సంచిక పుట 24

**నన్నయ్య యజ్వ, తిక్కన్న, పోతన్నాది**
**కవుల వాగ్వల్లి బంగారు తల్లి**
**కృష్ణరాయ మహీజాని, విష్ణువర్ధ**
**నాది నృపబాహు దండంబులందు నలరి**
**మఱల స్వేచ్ఛా ప్రపూర్ణయై మాన్యయైన**
**ఆంధ్రమాతకు భక్తి జోహారులిడుదు॥"**[1]

## 5.5 ఆంధ్ర భాషాభిమాని: -

ఆంధ్రభాష - ఆంధ్ర దేశము అంటే ఎంత అభిమానమో ఈ క్రింది పద్యములు వెల్లడించును.

**"ఏనాంధ్రుండను, పుట్టిపెర్గితి కదోయి! ఆంధ్ర దేశాననే**
**నా నోటన్ వినుదెల్ల, కాంచునది యాంధ్రమ్మోయి! ఈ దేశమం**
**తా నా దేశమె, స్వీయరక్తమది, ఆంధ్రంబే కదాయంచు, లో**
**నానందింపని వాడొకండుకలడే? ఆంధ్రేతరుండున్ వినా॥"**[2]

**"తెలుగుదేశమేనాయది, తెనుగువాడ**
**తెనుగు తల్లి యనుంగు చేతులను బెరిగి**
**తెలివి గొంటిని మంటిని, తెనుగు తల్లి**
**పేరు నిలుపు 'టెయాశ' యూపిరి జెలంగ"**[3]

ఇంతటితో తృప్తి చెందక పంచదశ ప్రదేశములతో విరాజిల్లే భారతమాతనిట్లు గేయంలో కీర్తించిరి.

**పల్లవి॥ "నమో భరతమాతా! మాతా! నమో రాష్ట్ర మాతా!**
**నమఃపూజ్యమాతా! మాతా! నమః పారిజాతా!**
**అను పల్లవి॥ నమో! హిమాచల మేరు - నగ శిఖరోన్నతఖ్యాత నమో" ॥భరతమాత॥**

కేవలం పంచదశ ప్రదేశ విరాజితమైన భారతమాతను కీర్తించటమే గాక, గున్న ఏన్గుల - కొండ కన్నె - అస్సామ్ అని అస్సామ్ రాష్ట్రమును, విద్యా నలందా - బీహారు మాయీ అని బీహార్ రాష్ట్రమును, మంగళ మహాలక్ష్మి - మహారాష్ట్రమని మహారాష్ట్ర ప్రదేశ్‌ను , శిక్షణా దక్ష - శేముషీ గుజరాత్ అని

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - స్వాతంత్ర్యపథము పుట 81
2. పైదే
3. శ్రీ గురుజాడ రాఘవశర్మ - స్వాతంత్ర్యపథము పుట 82

గుజరాత్ రాష్ట్రమును, ప్రకృతి సుందరీ - విలసిత కాశ్మీర్ అని జమ్మూ - కాశ్మీర్‌ను కళాసుందరీ - కేరళ నారీ అని కేరళ రాష్ట్రమును, భారతీ- సుమధ్య కాంచనదామం అని మధ్య ప్రదేశ్‌ను, మేధారాజిత - ద్రావిడదేశమ్ అని ద్రావిడ దేశమును, హాటక ఖని - కర్ణాట ప్రదేశమ్‌అని (మైసూర్) కర్ణాటక రాష్ట్రమును, ధాన్య లక్ష్మీ - మాన్య ఒరిస్సా అని ఒరిస్సా రాష్ట్రమును, పౌరుష జాతీయ - పాంచాల కిశోర్ అని పంజాబ్ ప్రదేశమును, వీర ఝాన్సీ - విహారస్థాన్ అని రాజస్థాన్‌ను, పవిత్ర కాశీ - పాపవినాశీ అని ఉత్తరప్రదేశ్‌ను, విప్లవ రంగ - విశ్రుత వంగ అని పశ్చిమ వంగను కీర్తించి,

**“తేనె పల్కుల - తెనుంగు బిడ్డ - ఆంధ్రప్రదేశ్”**

**లలిత కళల - పో - త్తిళ్ళబిడ్డరా**
**రాయలేలు, వ - జ్రాల గడ్డరా**
**నాగార్జున, శ్రీ - శైలమల్లన**
**తిరుపతి వెంకన - దేశంబిదిరా**
**రామభద్ర దు - ర్గాంబ, యిల్లురా।**
**నారసింహ, హనుమయ్య రక్షరా।**
**కృష్ణగౌతమీ - నిత్యప్రాణమురు।**
**త్యాగరాజు, పో - తన్న, తిక్కన**
**మల్లమ, రుద్రమ - మంత్రి యుగంధర్**
**తాండ్రపాపయ, ప్రతాపరుద్రుడు**
**తెలుగు బిడ్డల - వెలుగు నెలవురా**
**జిలిబిలి పల్కుల - తెలుగు ప్రదేశం**
**నమో! భరతమాతా! మాతా! నమో! రాష్ట్రమాతా!”**[1] అని ఈ విధముగా పదిహేను రాష్ట్రాల గొప్పతనాన్ని గేయంలో కీర్తించిరి.

“భారతీయ సంస్కృతిపై వారికి ఎంతో మక్కువ. వారి దృష్టిలో భారతీయ సంస్కృతి లక్ష్యం ఆత్మసాక్షాత్కారము ప్రపంచ సంస్కృతిలో భారతీయ సంస్కృతి చెక్కుచెదరకుండా ఉండటానికి ధార్మికత కారణమని వారి ధృఢవిశ్వాసం. భారతీయ సంస్కృతిలో మతం పట్ల సమ్మేళనాత్మక దృక్పథం అనేది సమకాలీన భారతీయ సమాజానికి చాలా అవసరం అని ఆయన తన ఆవేదనను పలుసార్లు వ్యక్తం చేసేవారు. పురుషార్థాలు అనేవి ఎప్పుడైనా ఏ కాలంలోనైనా మానవునికి మార్గదర్శకం కావాలనేవారు”. అని వీరితో ముఖాముఖి సంభాషణలో శ్రీ జంధ్యాల రాధాకృష్ణ గారు తెలియజేసిరి.[2]

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - స్వాతంత్ర్యపథము పుట 125
2. శ్రీ డా॥ జంధ్యాల రాధాకృష్ణ “ఉత్తమ గురువు” - శ్రీ గురుజాడ రాఘవశర్మ శతజయంత్యుత్సవ సంచిక పుట 56

## 5.6 తోటి నాయకాభిమాని: -

### 1. కోడేటి రంగాచార్యులుగారు: -

జాతీయ వీరధీరకవి శ్రీ కోడేటి రంగాచార్యులుగారు పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం తాలూకా, లంకల కోడేరులో 1900 సం॥లో జన్మించిరి. తండ్రిపేరు నరసింహాచార్యులు. వీరు సామాన్యగృహస్థులు. తరువాత విశాఖజిల్లా తుని పట్టణ నివాసిగా పేరు పొందినారు. 1921సం॥ నుండి మహాత్మాగాంధీ ప్రారంభించిన ఖాదీ, స్వదేశీయ వస్తు ప్రచారములో సేవకులుగా పనిచేసిరి. వందల కొలది స్త్రీలకు రాట్నములు, యేకులు సప్లయి చేసి నూలు వడుకు కార్యక్రమమునకు దోహదమిచ్చిరి. మారుమూలపల్లెటూళ్ళ ప్రజానీకానికి వార్తల ద్వారా ఉత్తేజపరుచు పత్రికలు పుస్తక భాండాగారములు అవసరమని “విద్యానంద పుస్తక భాండాగారము”ను స్థాపించి విశ్వదాత శ్రీ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి అభిమానము చూరగొని, వారి ఆంధ్ర పత్రికయే గాక మిగిలిన దిన వారపత్రికలన్నింటిని భాండాగారమునకు తెప్పించి పుస్తక పత్రిక పాఠకుల కెంతయో భాషాసేవ చేసినారు. పత్రికరాగానే దానిలోని ముఖ్య విషయములను సంక్షిప్తముగా పెద్ద అక్షరములతో అట్టపై వ్రాసి భాండాగారము ముందుకట్టి పఠన శ్రమకూడా లేకుండా వార్తలు వెంటనే వ్యాప్తి నొందించే తేలిక మార్గములనెన్నింటినో చేబట్టి భాండాగారమును బహుజనాకర్షణ స్థానముగా రూపొందించినారు[1].

శ్రీ కోడేటి రాంగాచార్యులుగారు ప్రఖ్యాతకవి, పండితుడు, నటకుడు, నాటకకర్త , ఏకసంధాగ్రాహి, సంగీత సాహిత్యముల కృషి చేసినాడు. హరికథా ప్రవచనములలో దిట్ట. బహుముఖభాషాజ్ఞాని. జాతీయ సేవా దురంధరుడు. అందరికీ సన్నిహితబంధువుగా ప్రజాహిత కార్యకర్తగా అతని జాతీయాభిమానము అందరిని ఆకర్షించినది. వీరు స్థానిక నాటక సంఘ సభ్యులు. సహజోల్లాసహృదయుడు. ప్రఖ్యాత కవి మండనుడు. జగద్విఖ్యాత హాస్యరస సుధాకరులగు శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి ప్రియ శిష్యులు. వీరి నాటకములను ప్రదర్శించు కార్యమును చేబట్టిన సంగీత సాహిత్యాభిమాని. “శ్యమంతకోపాఖ్యానము” మొదలగు ఖండకావ్యముల నెన్నో వ్రాసిన భాషాజ్ఞాని. ఆశుధారగా పద్యాలుగాని, గేయాలుగాని ధారళముగా వెలువరించే వాక్సుధానిధి. వ్రాయసగాడు. వీరి గేయాలు ప్రజలెందరినో ఉత్తేజితులను చేశాయి. వారే స్వయముగా హరికథలు వ్రాసి ఎంతోమంది శ్రోతలను తన నవరస సుధామృతము నోలలాడించు కథకులు. హరికథగా వ్రాసి ప్రచారముచేసిన గాంధేయుడు. లలితకళా హృదయుడు. హార్మోనియం స్వయముగా వ్రాయించుటయందేమి, ప్రదర్శించుట యందేమి చాకచక్యముగలవారు. ఏకసంధాగ్రాహి. శ్రీ పానుగంటివారి

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ “ఎందఱో మహనీయులు - భారత స్వాతంత్ర్య సమర యజ్ఞంలో” పుట 47

'సాక్షి' ఉపన్యాసములు నాలుగు భాగములు కంఠస్థము. ఎక్కడ అడిగితే అక్కడ తడుముకోకుండా అప్పటికప్పుడు యుపన్యసింపగల తీక్ష్ణమేధాసంపత్తిగలవారు. 1930సం॥లో అసహాయోద్యమ సత్యాగ్రహములో వీరు శ్రీ శర్మగారు రాజమండ్రి జైలులోనే కలియుట జరిగినది. ఒకసారి జైల్లో ఉండగానే రంగాచార్లుగారూ! ఒకసారి పానుగంటి "తోలుబొమ్మలు" వాచా ప్రదర్శింపగలరా! అని అడుగగా, గంగాప్రవాహంగా, అనర్గళధారతో మమ్ముల్నందర్ని ముంచెత్తి, దిగ్భ్రమ చెందునట్లు చేసిన మేధాసంపద గలవారు[1]. 1930సం॥లో నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహములో శ్రీ బులుసు సాంబమూర్తి, శ్రీ కళా వెంకట్రావు, డాక్టరు బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యం, వెన్నేటి సత్యనారాయణగార్ల ఆధిపత్యము క్రింద జరిగిన ఉప్పు సత్యాగ్రహ చరిత్రను బుఱ్ఱకథగా రెండుభాగాలుగా వ్రాశారు. అంతేగాక హరిజనోద్యమ ప్రచారమునకు బుఱ్ఱకథలెన్నో వెలువరించిన కవి. వీరి అనుపమాన ధైర్యసాహసత్యాగమున కొక ఉదంతమిచట నుదహరించెదను. 1932 సం॥లో సత్యాగ్రహులను బ్రిటీషు ప్రభుత్వము విచక్షణ లేకుండా సహింపరాని బాధలు పెట్టింది. ఆసమయములో పెద్దాపురంలో, తోటలో విందు ఏర్పాటుచేసి పట్టణములో అనేక మంది పెద్దలు, స్త్రీ పురుషులను ఆహ్వానింప అక్కడ విందారగించు సమయములో కఠిన పాషాణ హృదయుడు కర్కోటకుడు అని పేరొందిన డిప్యూటి సూపరింటెండెంటు "ముస్తపాలీఖాన్" క్రింద, డప్పుల సుబ్బారావు అని పేరుపొందిన పోలీసు సబ్‌యినస్పెక్టరు జనము మధ్య ప్రవేశించి తీవ్రమైన లాఠీ చార్జీ చేసినాడు. చాలామందికి గాయాలు తగలగా, మన రంగాచార్యులుగారు వారి జులుంధాటికి పరిగెత్తక, నిలబడగా నిర్ధాక్షిణ్యముగా చేసిన లాఠీఛార్జీకి వారి మోచేయి విరిగి స్పృహతప్పారు[2]. చాలాకాలము కోలుకొనలేకపోయిరి. కాని ఆ చేయిపట్టిన నాటి ఉద్యమ ప్రచారములో ఆయన చేవ, ధైర్యము ఏ మాత్రము తరుగలేదు. వీరు ఆ జన్మ బ్రహ్మచారి నడి వయస్సులో వారు ఆశించిన స్వాతంత్ర్యమును చూడకయే దేశమాత ఒడిలో దీర్ఘవిశ్రాంతి తీసికొన్నారు. అట్టి జాతీయ ధీరవీర సాహితీయోధులు శ్రీ కోడేటి రంగాచార్యులుగారు.

## 2. జాతీయ గేయకవి సార్వభౌమ గరిమెళ్ళ: -

"భరత ఖండమ్ము - చక్కని పాడియావు" అను గీతికి శ్రీ 'చిలకమర్తి' స్ఫూర్తికి వచ్చినట్లు "మాకొద్దీ తెల్లదొరతనము" అనే వీర విప్లవ గీతమనేసరికి గేయకవి సార్వభౌమ గరిమెళ్ళ సత్యనారాయణ గారు స్ఫురణకు వస్తారు. అసహాయోద్యమ ప్రచారములో స్వీయగానములతో ప్రజలనుఱ్ఱూతలూగించిన కవులలో శ్రీ గరిమెళ్ళ ముఖ్యులు. వీరు ఆంధ్రదేశమున ఉత్తరమున కళింగాంధ్రమున శ్రీకాకుళంజిల్లా, నరసన్నపేట

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ "ఎందఱో మహనీయులు - భారత స్వాతంత్ర్య సమర యజ్ఞంలో" పుట 49
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ "ఎందఱో మహనీయులు - భారత స్వాతంత్ర్య సమర యజ్ఞంలో" పుట 50

తాలూకా గోనెపాడు గ్రామం శివారు ప్రియాగ్రహారం వీరు జన్మించిన పుణ్యభూమి. గరిమెళ్ళ సూరయ్యగారు వీరితాతగారు. తల్లి సూరమ్మగారు. తండ్రి వెంకట నరసింహంగారు. వీరు 1893సం॥లో జన్మించిరి. వీరికి ముగ్గురు చెల్లెండ్రు, నలుగురు తమ్ములు. వీరి ప్రాథమిక విద్య స్వస్థానమగు ప్రియాగ్రహారములోను, తదుపరి ఉన్నత విద్య విజయనగరం, మచిలీపట్టణములలోసాగినది. బారిష్టరు శ్రీ కన్నపల్లి లక్ష్మీనరసింహంగారి ధన సహాయముతో పట్టభద్రులు కాగలిగినారు. మొట్టమొదటగా గంజాం జిల్లాలో గుమాస్తాగిరి. దీనితో చేరిన వెంటనే వీరిలో జాతీయ భావము అంకురించినది. దానితో దానికి స్వస్తి చెప్పి రాజమండ్రిలోని ట్రయినింగ్ కళాశాలలో ఎల్.టి. ట్రయినింగ్ క్లాసులో చేరారు[1]. 1929 సం॥లో అసహాయోద్యమ తీర్మానము ఆమోదింపబడుటతో మహాత్మాగాంధీ గారి శంఖారావం మన సత్యనారాయణ గారి చెవికిసోకి, ట్రైయినింగ్ కళాశాల ఆవరణదాటి, ప్రభుత్వాన్ని ఉద్దేశించి, "మాకొద్దీ తెల్లదొరతనము" అంటూ ప్రబోధగీతం పాడనారంభించిరి. శ్రీ గాంధీజి బ్రిటిషు ప్రభుత్వాన్ని ఉద్దేశించి "We don't Tolerate this satanic Government" అనే విప్లవ సందేశానికి గరిమెళ్ళ "దండాలండోయ్ మేముండలేమండోయి బాబు! ఈ సైతాను ప్రభుతనింక - సాగనీమండోయి బాబు" అనేగీతం మారు మ్రోగింది. అసహాయోద్యమము భారతావని నల్గడల వ్యాప్తిచెంది ఆ బాలగోపాలానికి వీరావేశగీతం పల్లవ పాటయై ఉఝ్ఝూతలూగించినది. 1921 మార్చి 31, ఏప్రిల్1వ తేదీ విజయవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కార్యనిర్వాహక సభకు లక్షలాది జనులు, నాయకుల దర్శనార్థము తీర్థప్రజగా వచ్చారు. గరిమెళ్ళ వారి "మా కొద్దీ తెల్లదొరతనము" పాట విని ప్రభుత్వము ఒక సంవత్సరము జైలు శిక్ష విధించినది. జైలులో ఉన్నప్పుడు గేయాలు వ్రాసికొని, కంఠస్థము చేసికొని, జైలునుండి విడుదలకాగానే పాటలు పాడుచు ప్రచారము సాగింపగా, మరల బంధించి కోర్టులో మేజిస్ట్రేటు ముందు నిలబెట్టి మీపైనేరము మోపబడినది. దానికి మీ సమాధానమేమని ప్రశ్నింపగా, ఏమాత్రము తడుముకొనక ఇదిగో నా వాఙ్మూలం వినండి. వ్రాసుకొనండి అని,

**"కూలిపోతున్నది - కూలిపోతున్నది**
**మూలమట్టముతోటి - కూలిపోతున్నది. ప్రభుత్వం**
**కూకటి వ్రేళ్ళతో కూలిపోతున్నది - మూర్ఖప్రభుత్వం"[2].**

అని బిట్టరచు వారికి రెండున్నర సంవత్సరములు కఠిన శిక్ష విధించి జైలుకు పంపినది. 1922 సం॥లో

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ "ఎందఱో మహనీయులు - భారత స్వాతంత్ర్య సమర యజ్ఞంలో" పుట 3
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ "ఎందఱో మహనీయులు - భారత స్వాతంత్ర్య సమర యజ్ఞంలో" పుట 5

జైలులో ఉండగా వారి తండ్రిగారు మరణించిరి. సత్యనారాయణగారు జైలునుండి వచ్చుటకు వీలులేక, ప్రభుత్వానికి క్షమాపణ చెప్పుకొనుట కిష్టపడక వారి తాతగారికి వేదాంతపరంగా ఉత్తరం వ్రాశారు. 1924 సం॥లో వీరు జైలులో ఉండగానే తాతగారు కూడా మరణించారు. జైలుశిక్ష పూర్తిచేసికొని విడుదల అయినప్పుడు వారికి లభించిన గౌరవము అమోఘము. తరువాత భార్య చనిపోయింది. ఉన్న ఆస్తులు అమ్మి, అప్పులు తీర్చి పునర్వివాహము చేసికొన్నారు. మొదటి భార్యకు ఇద్దరు కుమార్తెలు. రెండవ భార్యకు యిద్దరు కుమార్తెలు.

**"కర్మణ్యేవాధికారస్తు - మాఫలేషు కదాచన**
**మాకర్మఫలహేతుర్భూర్మాతే సంగోస్త్వకర్మణి"** భగవద్గీత

అను గీతావాక్యానుసరణిని జీవితమునింక ఏ చింతకు తావీయక దారిద్ర్యమును జీవితము పొడవునా అనుభవిస్తూనే జీవితమును దేశమాత కంకితము చేసిన ధీరుడు కర్మవీరుడు గరిమెళ్ళ. సత్యనారాయణగారు అంత స్ఫురద్రూపికారు. కురూపియు కారు. చామనఛాయ రంగు పైకి మోటు మనిషిగా కనపడతారు. 5 అడుగుల 4 అంగుళములు ఎత్తు గలిగి పలుచని శరీరము. పెద్దనుదురు. తీర్చిన కళ్ళు. గంభీరమైన చూపు, కోటేరు వంటి ముక్కు. కావిరంగు ముతక ఖద్దరు పంచె ఆయన వేషం. మితభాషి. కంచుకంఠస్వరం. బరంపురం కారాఖిల్లీ నోట, అనునాసికధ్వని. మిళితమైన వాక్కు. నిష్కల్మషమైన నవ్వుమొగం. వారిలో ఆవేశం వెల్లివిరుస్తుంది. ఎడమచేతిని నడుమున ఆన్చి తలవంచుకొని రాజమండ్రి యిన్నీసుపేటలోని యింటి యెత్తు అరుగులపై పచార్లు చేస్తుంటే దేవుడిచ్చిన దార్ఢ్యము బాగుంది అనుటకు ఒక్కమాటలో చెప్పాలంటే గజయీతగాడితడు[1].

"మా కొద్దీ తెల్లదొరతనము" అనే పాట గరిమెళ్ళకు మరపురానీయని మంచికోట. మనస్సున చెరిగిపోనీయని బాట. తెనుగునాట జాతీయ కవిత్వమునకు ఒరవడి పెట్టిన ప్రముఖకవి గణములో గరిమెళ్ళ వారొక మణిపూస. వీరి గేయములబాణి తరువాత కవులకు ఒరవడి దిద్ది గేయకవులుకాగలిగిరి. వీరు ఒక జానపద గేయ ప్రబోధ నాయకమణి. భావమునకు తగిన ఫణతి, ఫణతికి తగినట్టు శబ్దము, తీర్చిన తెలుగు నుడికారములతో గేయ ప్రవాహము స్రవింపఁజేసినాడు. ఆ జాతీయ వీర రసావాహినిలో ముగ్ధులై ఉత్తేజితులు గాని ఆంధ్రులు లేరు. ఆంధ్రేతరులు కూడా ఉండరనుట అతిశయోక్తి గాదు. గరిమెళ్ళ వాల్మీకి ముఖాబ్జమునుండి గంగా ప్రవాహముగా వెలువడిన వీర విహార గేయాలు విని వీరిని "గేయ వాఙ్మయ

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ "ఎందఱో మహనీయులు - భారత స్వాతంత్ర్య సమర యజ్ఞంలో" పుట 6

చక్రవర్తి" అన్నారు పెద్దలు. ఒకసారి గాంధీగారే వీరి గేయాలు విని తన్మయులై 'భలే' అన్నారు. ఈయన గళమెత్తి 'రారాపోదాము - రాజ్యమేలుదాము".

**"కొయ్యడ - కొయ్యడ - ఇలాగరారా!**
**కోటి యింతలు సెపుతా! నోరయ్యో! కొయ్యాడ!"[1]**

అనేపాట వాడేసరికి ఒడలు మరచి జన ప్రవాహము నిలచిపోయేది. భరతనాట్యం చేసేది. జనం రాకపోకలు ఎక్కడకక్కడ స్థంభించిపోయేవి. అట్టి సమ్మోహనాస్త్ర గేయముల బాణి పలుకు తీరువేరు. తారాస్థాయి నందుకొన్న వీరిపాట, గాంధీ గారు విని ఆశ్చర్యానంద చిత్తులై మిగతా కవిగణానికి "యీ బాణిలో సరిపడ జాతీయ గేయాలు వ్రాయుడని సందేశమిచ్చారు. అది గరిమెళ్ళకు గాంధీగారొసగిన ధృవపత్రము.

"ఎంతటో మహనీయులు భారత స్వాతంత్ర్య సమర యజ్ఞంలో" అనే గ్రంథానికి మున్నుడి వ్రాస్తూ డా॥ చల్లా రాధాకృష్ణశర్మగారు, "ఏ సందర్భములో ఏ మాట వాడితే శక్తిమంతంగా సముచితముగా ఉంటుందో, ఆ విషయం ఆయనకు ఉగ్గుతో అలవడినదిగా గోచరిస్తుంది. గరిమెళ్ళ గీతాలు సహజ సౌందర్యోపేతములు. సహజత్వం లోపించిన గీతం నిర్గంధకుసుమం. గీతం సహజ సుందరముగా గానానుకూలముగా ఉండాలి. సన్నివేశాన్ని గాని భావాన్ని గాని కళ్ళకు కట్టే మాటలు గీతంలో అందాలు దిద్దుకోవాలి ఈ లక్షణాలన్నీ ఆయన గీతాలలో పుష్కలంగా ఉన్నాయి. "మట్టి కొట్టి పోతాడు", "చూడియావుల కడుపు", "ప్రేమదీపం", సైతానుప్రభుత" మొదలైన పదబంధాలు కోకొల్లలు. వీటివలన ఆయా గీతాలకు జిగి, బిగి కలిగినాయనడం సత్య సన్నిహితం".

గరిమెళ్ళ భరింపరాని కష్టాలను అనుభవించారు. గృహలక్ష్మి మాస పత్రికకు సంపాదకుడుగా పనిచేశారు. కొన్నాళ్ళు ఆంధ్రప్రభ దినపత్రిక ఆఫీసులో పనిచేశారు. శ్రీ శారదా గ్రంథమాలను స్థాపించి పదునెనిమిది పుస్తకాలను చిన్న పెద్దవాటిని అచ్చువేశారు. జైలులో ఉండగా అరవం నేర్చుకొని తిరువళ్ళారు వ్రాసిన పద్యాలను తర్జుమా చేసి "ఆర్షత్రయ సర్వస్వ"మను (తిరుక్కురళ్) 1930సం॥లో ప్రకటించారు. "యతి ప్రాసలు లేని వృత్తమాలిక ఖండకావ్యాలు" అనే గ్రంథాన్ని అచ్చువేశారు. ఈయన వ్రాసిన అనేక వ్యాసాలు 1950 ప్రాంతపు త్రిలింగ పత్రికలో కనబడతాయి. "దుందుభి", "వికారి" అనే పేర్లతోవ్రాసిన వ్యాసాలు వీరివే. ద్రావిడ భాష నేర్చుకొన్నారు. 'నాలడియార్' అను నీతి గ్రంథము "ద్రావిడ భర్తృహరి"

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ "జాతీయ గేయ కవి సార్వభౌమ" గరిమెళ్ళ సత్యనారాయణగారి జీవిత చరిత్ర పుట 8

అను పేరిట తెనిగించి ప్రచురించారు. "హార్ట్ ఆఫ్ ది నేషన్స్" (Heart of the Nations) అను గ్రంథమును పద్యకావ్యముగ బుఱ్ఱకథగా వ్రాశారు. అనేక హరిజన పాటలు, స్వరాజ్య పాటలు వ్రాశారు. జరుగుబాటు లేక "కల్పకవిలాసం" అను భోజన హెూటలు నిర్వహించారు. అందుకూడ అన్నపూర్ణ వీరిని అనుగ్రహించలేదు. ఎంత దరిద్రబాధను అనుభవించారంటే, కొందరు మిత్రులు పలుకరించినపుడు, "కొందఱు త్యాగం చేయాలి, కొందఱు దారిద్ర్యంతో నశించాలి. పూర్తిగా నాశనమైనగాని దేశానికి, స్వరాజ్యం రాదు" అని అన్నారు. వీరి 60వ యేట 18-12-1962వ తేదీన పరమపదించిరి.

జాతీయ గీతముల ఉపోద్ఘాతములో శ్రీ గరిమెళ్ళను గురించి "కవి సమ్రాట్" విశ్వనాథ సత్యనారాయణగారు, "నిజానికి ఈ సర్వకవిత్వమునకు ప్రధానమైనవాడు శ్రీ గరిమెళ్ళసత్యనారాయణ గారని చెప్పవలయును. ఆయన పండితుడు. సంగీత సాహిత్యములందు గొప్పసమర్థుడు. కాళిదాసు మహాకవియైనచో ఆయన రచించిన కావ్యములలో "అభిజ్ఞాన శాకుంతలము, పరమోత్తమమైనచో, ఇతని మహా కవితాధారలో "మాకొద్దీ తెల్లదొరతనము" అన్నపాట  శాకుంతలము వంటిది. "చూడి యావులమంద - సురిగి యింటికిరాదు" యీ ఒక్కవాక్యము చాలును. ఇతరుల నాగరికత, మన నాగరికత, మనమతము, మన మతములలో నున్నమేలిమి సర్వము దీనియందు మహాధ్వనిగా నున్నది" అని వ్రాసిరి.

డా॥ తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు, శ్రీ రాఘవ శర్మగారి సంపాదకీయమున వెలువడిన జాతీయ గీతాలపై సమీక్ష వ్రాస్తూ, "ఈ సందర్భములో స్మరించవలసిన పుణ్యమూర్తి శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ. దేశనాయకుల ఉపన్యాసాల కంటె కూడా ఆయన రాసిన "మాకొద్దీ తెల్లదొరతనము" అనేపాట ఎంతగా ప్రజలను జాగృతంచేసిందో, ఉద్యమంలోకి దూకే తెగువను, వారికి కలుగ జేసిందో ఆ రోజుల్లో జీవించినవారికి అనుభవములో నున్న విషయము[1].

శ్రీ గరిమెళ్ళ తమిళ జాతీయ కవి శ్రీ సుబ్రహ్మణ్య భారతికి ఏ మాత్రము తీసుపోని ప్రతిభాశాలి. త్యాగశీలి. స్వాతంత్ర్యవీరుడు. కాని ఆ కవి వీరుడు జీవితచరమ దశలో కటిక దారిద్ర్యముతో ఏ ఆదరణ లేక కన్ను మూయడం ఆంధ్రజాతి దౌర్భాగ్యం" అనిరి. ఇటువంటి ధీర వీర శిరోమణి శ్రీ గరిమెళ్ళ.

1. డా॥ తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారి సమీక్ష శ్రీ గురుజాడ రాఘవశర్మ - గరిమెళ్ళ సత్యనారాయణగారి జీవిత చరిత్ర పుట 19

## 3. శ్రీ మహర్షి బులుసు సాంబమూర్తిగారు: -

ఆత్మగౌరవానికి, స్వాతంత్ర్య నిరతికి త్యాగశీలానికి, సాహసానికి శ్రీ బులుసు సాంబమూర్తిగారు ప్రఖ్యాతి గొన్న మహర్షి. వీరు 1886వ సం॥ మార్చి 4వ తేదీన రాజమహేంద్రవరములో దుల్లా గ్రామములో జన్మించిరి. తండ్రి పేరు సుబ్బావధానులుగారు. వీరు బి.ఏ. బి.ఎల్. ప్యాసయి విజయనగరం మహారాజా కళాశాలలో 1909 సం॥లో ఉపాధ్యాయుడుగా పనిచేశారు. కాకినాడలో న్యాయవాదిగా ఉంటూ 1919సం॥లో హోమ్‌రూల్ ఉద్యమములో చేరినారు. గాంధీగారు ఆరంభించిన అసహాయోద్యమ కారణముగా న్యాయవాద వృత్తిని విడిచి పెట్టి ఉద్యమములో పాల్గొని ప్రభుత్వముచే బంధింపబడి 23-12-1921న ఒక సంవత్సరము జైలు శిక్ష విధింపబడి రాజమండ్రి జైలుకి పంపబడిరి[1]. 1927సం॥లో నీల్ సత్యాగ్రహోద్యమమును సాగించిరి. 1928 సం॥ నుండి హిందూస్థాన్ సేవా దళాధ్యక్షులుగా భారతావనిలో, స్వయం సేవక శిక్షణ కేంద్రము లెన్నింటినో స్థాపించిరి. 1929 సం॥లో భారత దేశమునకు సైమన్ కమీషన్ బహిష్కరణోద్యమములో ప్రజాసమూహమునుత్తేజ పరచినందుకు బహుమానము ఒక సంవత్సరము శిక్షవిధింపబడి రాజమండ్రి బళ్ళారి సెంట్రల్ జైళ్ళకు పంపబడిరి. 1930 ఏప్రిల్ 19వ తేదీన ఉప్పుసత్యాగ్రహోద్యమములో పాల్గొనినందుకు అరెస్టు చేయబడి ఒక సంవత్సరము జైలు శిక్ష విధింపబడి రాజమండ్రి, చెన్నపురి, కన్ననూరు, నెల్లూరు సెంట్రల్ జైళ్ళకు పంపబడిరి. 1932 సం॥లో శాసనోల్లంఘనోద్యమములలో పాల్గొని లాఠీపోటులకు స్పృహతప్పి రెండు సంవత్సరములు కఠిన కారాగార శిక్ష ననుభవించిరి. 7-1-1932 సం॥ నుండి నెలూరు సెంట్రల్ జైలుకు పంపబడిరి. 4-12-1940 నుండి 1-11-1941 వరకు వ్యష్టి సత్యాగ్రహము క్రింద అరెస్టు చేయబడి నిర్బంధములో నుంచిరి. 1925 సం॥ నుండి 1935, 1937 సం॥ వరకు ఒక సంవత్సరము రాష్ట్ర కాంగ్రెసు సంఘాధ్యక్షులుగా, చెన్నపురి ఆంధ్ర మహిళా సభాధ్యక్షులుగాను, ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యదర్శిగా పనిచేసిరి. 1937 సం॥లో చెన్నపురి శాసనసభ స్పీకరుగా ఉండి రాష్ట్రములో ప్రతి గ్రామగ్రామానికి సంచారము చేస్తూ స్వాతంత్ర్యోద్యమములో పాల్గొనేందుకు అనేకమంది యువకులను ఉద్బోధించారు. 1923సం॥లో మహమ్మదాలీ అధ్యక్షతలో కాకినాడలో జరిగిన అఖిల భారత జాతీయ మహాసభల నిర్వహణలో కొద్ది రోజులు ముందే తన యేకైక పుత్రుడు చనిపోగా దుఃఖము మ్రింగి, గాంధీ మహాత్ముని వలె మహాసభ దిగ్విజయమొందుటకు తోడ్పడిన ధీరుడు త్యాగమూర్తి శ్రీ బులుసు సాంబమూర్తిగారు. 1926 సం॥లో గౌహతీ కాంగ్రెసులో సంపూర్ణ స్వాతంత్ర్యము కొరకు పోరాడి సంపూర్ణ స్వాతంత్ర్య సంఘాలను స్థాపించి దేశమంతా ప్రచారము చేశారు. 1958సం॥లో తనువు చాలించారు[2].

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ "ఎందరో మహనీయులు - భారత స్వాతంత్ర్య సమర యజ్ఞంలో" పుట 70
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ "ఎందరో మహనీయులు - భారత స్వాతంత్ర్య సమర యజ్ఞంలో" పుట 71

## 4. శ్రీ కళా వెంకట్రావుగారు: -

"చాణక్యుని మించిన రాజనీతిజ్ఞుడు - క్విట్ ఇండియా ఉద్యమములో రహస్యముగా రాష్ట్రవ్యాప్తికి, ప్రభుత్వానికి చిక్కకుండా తనయెత్తు బైటికి పొక్కకుండా నిర్వహించిన మంచి సమర్థుడు, రాజ్యాంగవేత్త. ఇరవై సంవత్సరాలు ఆంధ్రరాష్ట్ర రాజకీయములు తీర్చిదిద్దిన ఘనుడు వెంకట్రావుగారు. మంత్రి యుగంధరుడు గాను, అపరచాణక్యుడుగాను, ఉద్యమ నిర్వహణలో వీరిపాత్ర మరువరానిది.

వీరు 1900సం॥ జులై 7వ తేదీన అమలాపురం తాలూకా ముక్కామలలో జన్మించిరి. తండ్రి బ్రహ్మయ్యగారు. వీరు బి.ఏ. విద్యార్థిగా ఉన్నప్పుడు 1921 సం॥లో అసహాయోద్యమములోచేరి తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెసు కార్యదర్శిగా 1924 సం॥ వరకు పనిచేసిరి. 20సం॥లు కోనసీమ సహకార సెంట్రల్ బ్యాంకు కార్యదర్శిగాను బ్యాంకు అధ్యక్షులుగా కొనసాగిరి. 1922-1923 సం॥లలో అసహాహోద్యమ ప్రచారం సందర్భముగా అరెస్టు చేసి రాజమండ్రి కడలూరు జైళ్ళలో ఉంచారు. 19-4-1930 ఉప్పు సత్యాగ్రహోద్యమములో పాల్గొనినందుకు ఒక సంవత్సరము శిక్ష విధించి, రాజమండ్రి, వేలూరు, కడలూరు జైళ్ళకు పంపబడిరి"[1]. 1-2-1932 శాసనోల్లంఘనోద్యమములో విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమ ప్రచారములో ఉపన్యాసములకు పికెటింగ్‌లకు 1-2-1932సం॥లో ఐదు మాసములు కఠిన శిక్ష కెండు వందల రూపాయిలు జరిమానా విధించిరి. 21-3-1941సం॥లో వ్యక్తి సత్యాగ్రహము కారణముగా అరెస్టుచేసి ఆరుమాసములు కఠిన శిక్ష విధించి ఆలీపూరు క్యాంపు జైలుకు పంపబడి 1-9-1941సం॥న విడుదలయైనారు. 2-9-1941సం॥ నుండి 10-1-1942 సం॥ వరకు రెండు సంవత్సరముల అరు మాసములు క్విట్ ఇండియా ఉద్యమ సందర్భముగా శిక్ష విధింపబడి వేలూరు, నాగపూర్ సెంట్రల్ జైళ్ళలో బంధించిరి. 1949సం॥ నుండి 1951సం॥ వరకు భారత జాతీయ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగాను 1951సం॥లో చెన్నపురి రాష్ట్రశాసనసభ సభ్యుడుగాను 1953 సం॥లో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడుగా పనిచేసిరి. 1955సం॥లో శాసనసభా సభ్యుడుగాను, పబ్లిక్ హెల్తు ప్లానింగు శాఖా మంత్రిగాను, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థికశాఖామాత్యులుగా ఉండిరి. కాకినాడలో జరిగిన ఉప్పుసత్యాగ్రహములో వేలకొలది మందితో నిర్వహించి లాఠీపోటులు భరించి 19-4-1930వతేదీ అరెస్టు కాబడి ఒక సం॥ జైలుశిక్షననుభవించిరి. ఇట్టి మహోన్నత వ్యక్తి 1960సం॥లో మార్చినెలలో పరమపదించిరి"[2].

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ "ఎందఱో మహనీయులు - భారత స్వాతంత్ర్య సమర యజ్ఞంలో" పుట 72
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ "ఎందఱో మహనీయులు - భారత స్వాతంత్ర్య సమర యజ్ఞంలో" పుట 73

## 5. డాక్టరు బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యంగారు: -

"డాక్టరు బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం గారు 1891సం॥ అక్టోబరు 12వ తేదీన గుంటూరు జిల్లా ఫిరంగిపురములో జన్మించిరి. తదుపరి రాజమండ్రిలో నివసించిరి. వీరి తండ్రి పేరు రామశాస్త్రి. కలకత్తా వైద్య కళాశాలలో వైద్యవిద్యపూర్తి చేసికొనిరి. 1916 - 1917 సం॥లో హెూమ్‌రూలు ఉద్యమములో పాల్గొన్నారు. అసహాయోద్యమ ప్రచారము కారణముగా ఒక సంవత్సరము కఠిన శిక్ష విధింపబడి రాజమండ్రి - కడలూరు జైలుకు పంపబడిరి. 1924సం॥లో సీతానగరంలో గౌతమీ సత్యాగ్రహాశ్రమము స్థాపించిరి. 19-4-1930న ఉప్పుసత్యాగ్రహములో పాల్గొనినందుకు అరెస్టు చేయబడి ఒక సంవత్సరము శిక్షవిధించబడి వేలూరు కడలూరు జైళ్ళకు పంపబడిరి. 1932వసం॥లో వారి సత్యాగ్రహాశ్రమమును ముట్టడించి ప్రభుత్వము స్వాధీనబరుచుకొనెను. పంజాబులో ఘోర పోరాటము జరుగుతున్న సమయములో 1932 సం॥ జనవరి మొదటివారములో వీరిని అరెస్టుచేసి తీవ్ర లాఠీఛార్జిచేసిరి. ఆ కారణముగా ప్రక్క ఎముక విరిగినది. మరల 4-5-1932న అరెస్టు చేయబడి ఆరునెలలు శిక్ష విధింబడి రాజమండ్రి, కడలూరు జైలుకు పంపబడిరి. మంచి సమర్థులైన కార్యకర్తలతో సత్యాగ్రహాశ్రమము కాంగ్రెస్ పత్రిక నడిపిరి. ఆశ్రమమును ప్రభుత్వము స్వాధీనపరచుకొనడంతో పత్రిక కూడా ఆగిపోయినది. వీరు జైలులో కఠినమైన బాధలు అనుభవించుటతో క్షయవ్యాధికిలోనై 1936 సం॥ డిశెంబరు 23వ తేదీన మరణించిరి"[1].

## 6. శ్రీ వెన్నేటి సత్యనారాయణగారు: -

"శ్రీ వెన్నేటి సత్యనారాయణ గారు మంచి సౌజన్యమూర్తి, కార్యదక్షులు. వీరు 1885 సం॥లో రాజమండ్రి తాలూకాలోని కాతేరులో శ్రీ వెన్నేటి వంశములో జన్మించిరి. తండ్రి పేరు నరసింహంగారు. వీరు బి.ఏ.పాసయి ఫస్టుగ్రేడు న్యాయపరీక్షలో ఉత్తీర్ణులైరి. వీరు బి.ఏ. చదువుతుండగానే 1907 సం॥లో వందేమాతరం ఉద్యమకారణముగా రెండు సంవత్సరములు పరీక్షలలో నిలుపుచేశారు. తరువాత హెూమ్‌రూలు ఉద్యమములో దీక్షగా పనిచేసి 1921 సం॥లో తమ న్యాయవాదవృత్తిని విసర్జించి అసహాయోద్యమములో పాల్గొని ఒక సంవత్సరము కఠినకారాగారశిక్షననుభవించిరి. ఆ శిక్ష రాజమండ్రి కడలూరు జైలులో పొందిరి. ఉప్పు సత్యాగ్రహ సందర్భములో 19-4-1930 వ తేదీన అరెస్టు కాబడి ఒక సంవత్సరము శిక్ష విధింపబడి

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ "ఎందఱో మహనీయులు - భారత స్వాతంత్ర్య సమర యజ్ఞంలో" పుట 74

28-2-1931 వరకు రాజమండ్రి, కడలూరు, వేలూరు, చెన్నపురి జైళ్ళల్లో శిక్షననుభవించిరి. 4-1-1932 న గోదావరి రైల్వే స్టేషన్‌లో జరిగిన ప్రభుత్వ లాఠీచార్జీలో బాధింపబడిరి.తరువాత వీరు హరిజనోద్ధరణ, స్వదేశీ వస్త్రదీక్ష, ఖాదీ ప్రచారములో తమ జీవితమును గడుపుచూ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా, రాష్ట్రకాంగ్రెస్ సంఘకార్యదర్శిగా కూడ సేవచేసినారు".[1]

## 7. తోట నరసయ్యనాయుడు: -

భారతస్వాతంత్ర్య సంగ్రామ రంగములో పాల్గొని ఎన్నో లాఠీపోటుల భరించి తన జీవితమునే మాతృదేశ సేవకంకిత మొనరించిన జండా వీరుడు శ్రీ తోట నరసయ్యానాయుడు. 1923 సంవత్సరములో మే 1 వ తేదీన నాగపురములో జండా సత్యాగ్రహోద్యమము బయలుదేరినది. ఇది భారత దేశం నలుమూలలా విస్తరించి 1923 జులై 11 వ తేదీన పటేల్ అఖిల భారత ఉద్యమముగా దీనిని చేబట్టి సత్యాగ్రహమున ప్రవేశించి, విజయము సాధించెను. దీనితో జాతీయ జండాకొక పవిత్రత, సార్వజనీనత, గౌరవ ప్రాముఖ్యములు ఏర్పడినవి. వాలంటీయర్ల కవాతులలో, సభలలో, రథోత్సవములలో అన్నిచోట్ల జండాలేని సమావేశముకాని, జండా చేతబట్టని స్వాతంత్ర్యసమరయోధుడుగాని లేడు. ఈ జండా ప్రతిష్ఠకై ప్రాణములొడ్డి. లాఠీపోటుల బాధలు భరించి, జరిమానాలు, ఆస్తినష్టము పొందిన అనేక ఉదంతములు కలవు. 1930 సంవత్సరము ఏప్రిల్ 6వ తేదీన బందరులో కుండు (పట్టణ మధ్య భాగములో కోనేటి మధ్యగల స్తంభము) పై జండా ప్రతిష్ఠించుటకు పట్టణ కాంగ్రెసు శ్రీ గురుజాడ రాఘవ శర్మను, శ్రీ స్వామి తత్త్వానందను నియమించినది. వీరు ఆ కుండుపై నిచ్చెన మెట్లెక్కి స్తంభముపై జండా ప్రతిష్ఠించు సమయములో పోలీసులు లాఠీలతో మోది దించివైచిరి. తరువాత జండా ప్రతిష్ఠించిన టి.పి ఆళ్వారు, వరదదాసు, వీరభద్రయ్యావారు, చలసాని నాగభూషణం, చెరువు సుబ్బారావు మొదలగు వారెందరో రాగా, వారందరిని లాఠీలతో చితకబాది ప్రభుత్వం ఆవలకు నెట్టింది. ఇంతలో ఏనుగుపై లంఘించు సింహమువలె ఫైల్వాన్ వీరుడు, తోటనరసయ్య స్తంభముపై జండా ప్రతిష్ఠించి పట్టుకొని నిలబడెను.బలవంతులైన పోలీసులెందరో అతనిని లాగి లాఠీలతో మోది త్రోసి కదలింపజాలరైరి. ఆ ఎడతెగక కురియు లాఠీ దెబ్బలకు చేతిదండలు నెత్తురుగారినవి.[2]

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ "ఎందఱో మహనీయులు - భారత స్వాతంత్ర్య సమర యజ్ఞంలో" పుట 75
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ జాతీయగీతాలు - పరిచయము పుట 16

అతని నోట 'బాపూజీ' అనే స్మరణ తప్ప వేరు మాటలేదు. చివరకు పోలీసులు అతనిని పైనుంచి క్రిందకు లాగి పడవైచిరి. మరునాడు మున్సిపల్ ఛైర్మన్ శ్రీ శీలం జగన్నాధనాయుడు గారి ఉత్తర్వు తీసికొని, బ్యాండు మేళముతో కుండుపై జండా ప్రతిష్ఠ జరుపబడినది నిర్విఘ్నముగా.

ఐనంపూడి గ్రామములో చెరువుగట్టున, జమ్మిచెట్టునకు, జండా కట్టి యహర్నిశలు ఎండవానలకోర్చి పోలీసుల అవమానములను భరించి జండా సంరక్షించుకొన్న కీ॥శే॥అయినంపూడి శ్రీనివాసులు, జెండా వీరుడు శ్రీ తోట నరసయ్యానాయుడు మొదలగు వీరులెందరో చిరస్మరణీయులు.

## 8. డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు: -

"డాక్టరు పట్టాభిగారు పశ్చిమ గోదావరి జిల్లా ముఖ్యపట్టణమగు ఏలూరునకు 9 మైళ్ళ దూరమునగల "గుండుగొలను" గ్రామములో శ్రీ విక్రమ నామ సంవత్సర కార్తీక బహుళ బుధవారము 1880-11-24 రాత్రి గం॥11-00ని॥ వేళ నియోగికుటుంబములో జన్మించిరి. వీరింటి పేరు భోగరాజువారు. ఆరువేల నియోగి బ్రాహ్మణులు. కౌండిన్యస గోత్రులు. శ్రీ సుబ్రహ్మణ్యం మంగమ్మ పుణ్యదంపతులకు, ఇద్దరు పుత్రులు, యిద్దరు పుత్రికలు జన్మించిరి. అందు జ్యేష్ఠులు కామేశ్వరశాస్త్రిగారు. వారి భార్య శేషమ్మగారు. శ్రీ కామేశ్వరరావుగారి తమ్ములు మన పట్టాభిగారు. కామేశ్వరశాస్త్రి గారి కనిష్ఠ సోదరులు. ఆ గ్రామ కరణీకం భోగరాజువారిది. పట్టాభిగారి అన్నగారే గ్రామకరణం కూడ. వారి తరువాత కామేశ్వరశాస్త్రిగారి కుమారులు చి॥ రామమోహనరావు గారు గ్రామ కరణం. వీరిది సామాన్య కుటుంబము.

శ్రీ పట్టాభిగారి శరీరము పండు తమలపాకు. బంగారుఛాయ. మంచిశరీర సౌష్ఠవము. సునిశిత బుద్ధి చాకచక్యమునకు తగినట్లు చకచకా అడుగులిడు వేగపునడక, సామాన్యముగా వృద్ధాప్యము అనారోగ్య సూచకములు కాననగు నడుమువంచి ముందునకు వ్రాలుటలు, లేక ఛాతి (రొమ్ము) కసరత్తు చేసిన వస్తాదువలె, రోషమెరుగని, సత్యశీలివలె, బ్రిపై, యెదిరిపైకినురుకు మల్లవీరుని వలె విరచిన వెడదయగు (ఛాతి) రొమ్ముతో, పరులకు పరప్రభుత్వానికి తలవంచని ధీమా ప్రకటించు రాచరికపు వీక్షణతో, సముచితమై విస్పష్టమై, ఒక్కొక్కప్పుడు, భయభ్రాంతిలేక, మరియొకప్పుడు నదురు బెదురులేక యెదిరి హృదయాన్ని, స్పందించగల వచోధాటితో తీర్చినవాడి మొనవంటి సునిశిత మేధాసంపత్తితో, ప్రత్యేక వ్యక్తిత్వముగల పూజ్యులు శ్రీ పట్టాభిగారు[1]. శ్రీ శర్మగారే "స్వాతంత్ర్య పథము"లో,

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి

సీ॥ "ఎదిరిన చాణక్యునేని సందీక వా
గ్బంధన గావించు గడుసుదనము,
కటిక రాతిని నైనఁగరగించి, సారమ్ము
పిండనేర్చెడి గట్టి గుండెతనము
పోటు మానిసినైన, పొడసూప బసివట్టి
చూఱగొనెడి బుద్ధి చురుకు దనము
ఎట్టి దుర్ఘట కార్యమేని చేబట్టినన్
రయమున దీర్చు, నేర్పరితనమ్ము

గీ॥ తారతమ్య మెఱింగి, యందఱిని, సఫల
కార్యులంజేయు చాకచక్యపు దనమ్ము
బరగుఁమా భోగరాజుఁకేల్పట్టి కొనుట
మాన్య బృందావన పురమ్ము! ధన్యవీవు"[1] శ్రీ పట్టాభి 2వ పద్యము

ఎదిరించినవాడు చాణక్యుడంతవాడైన ఏ మాత్రము సందివ్వక తన వాక్ప్రసారముచే బంధించు గడుసుదనము, కటిక రాతిని కూడ గరగించి సారము పిండెడి గుండెతనము, ఎంతటివాడినైన తన బుద్ధి చాకచక్యముచే పసిగట్టెడి చురుకు దనము, ఎంతటి దుర్ఘటకార్యమునైన చేబట్టి సాధించు నేర్పరితనము, తారతమ్యములు తెలిసికొని, అందరిని సఫల కార్యులనుచేయు చాకచక్యపుదనముగల మా భోగరాజు చేయిపట్టుకొంటివి గదమ్మా! ఓ బృందావనపురమ్మ నీవు ధన్యవు అనుటలో పట్టాభిగారి సద్గుణములు తెలియుచున్నవి.

సీ॥ "ఎవ్వాని భాష్య మహింసా మహాసూత్ర
కారి బోధకు, సహకారియయ్యె
ఎవని లేఖిని ప్రాణమిడఁజన్మభూమి
యశము బ్రాకె దేశ దేశమ్ములందు
ఎవ్వని భారతిఁయింపుగా వర్షించె
తా మాతృదేశకథామృతమ్ము
ఎవ్వాని తీక్ష్ణ మే ధావిభవమ్ము
వైరి గుణమ్ముగుండెల దిగులుబఱచె"

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - స్వాతంత్ర్య పథము పుట 83

గీ॥ "ఎవడు కేలూనఁ బ్రతిచోట నెనయులక్ష్మి
ఎవడు పలికినఁ బ్రతిమాట నెనయు శక్తి
యట్టి మా భోగరాజు వంశాబ్ధి చంద్రు
డైన పట్టాభి కెప్డు జయమ్ముఁగూర్చి
మనుచు గావుత, భారతమాత సతము"॥ శ్రీ పట్టాభి 4వ పద్యము

గాంధీమహాత్ముని అహింసా సూత్రమునకు భాష్యమై సహకారి అయ్యెను. వీరి లేఖినికి ప్రాణమువచ్చి దేశదేశములందు మాతృభూమి కీర్తి విస్తరిల్లెను. వీరి కలము నుండి మాతృదేశకథామృతము వర్షించెను. వీరి తీక్షణమైన మేధాసంపత్తి వైరి గుండెలను దిగులు పఱచెను. వీరు చేయిపెడితే చాలు లక్ష్మి తాండవించును. పలికిన ప్రతి పలుకు ఒక శక్తివంతమైనది. అట్టి మా భోగరాజు వంశాబ్ధి చంద్రునకు ఎల్లప్పుడు జయమగుగాక అంటారు. గాంధీ అంతటి మహానుభావునకు భాష్యము చెప్పినవ్యక్తి. వీరి వ్రాతలు జన్మభూమి యశస్సునధికము చేసినవి. మాతృదేశకథామృతమును వర్షించిన లేఖిని, వీరి మేధాశక్తి శత్రుసమూహము నడల చేయునది అనుటలో వీరు తమ శక్తిని, జీవితమును దేశానికెంతగా ధారపోసిరో తెలియుచున్నది. పట్టాభిగారిని ఇన్ని సద్గుణములు అలంకరించినను ఆయన చాలాకాలము నాయకుడు కాలేదు. దానికి ఏమి కారణమై ఉండునో అని శర్మగారు,

"నీ పేర్సింహపు స్వప్నమై ... ... ... ... ... ... ... ... లోకమ్మునిన్"[1] శ్రీ పట్టాభి 1వ పద్యము

నీపేరు తలంచినంత మాత్రముననే భయము గొల్పుట చేతనో ఏమో, మీరు నాయకుడుగా ఉంటే తాము ఉండుటకు లోపము వస్తుందన్న భయముచేతనో ఏమో మిమ్ములను పైకిరానీక పైపై మాటలతో ప్రొద్దుబుచ్చెదరు. ఓ పట్టాభి సుధీవరా! మీకేమైనా లోటా? సమస్త లోకము మీరెటువంటివారో తెలియునుకదా! నాకు చాలా రోజులనుండి ఒక సందేహము కలవరబెట్టుచున్నది. మన రాజ్యములో నిన్నుగన్న ఒక ఆంధ్ర పుత్రుకుని నీ వంటి జాతీయ నాయకుని మన్ననసేయ లేనిది స్వరాజ్యమా? స్వతంత్ర్యమా? నీవు వుండి నాయకత్వము ఇవ్వకపోవుట ఆంధ్రావని పూర్వకర్మ అంటాను. అంటారు. ఉత్తమోత్తమమైన నాయకలక్షణాలు కలిగియున్న పట్టాభిగారికి స్వతంత్ర్యరాజ్యమేర్పడిన తరువాత నాయకుడుగా నియమింప బడకపోవుట చూచి బాధపడి,

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ - స్వాతంత్ర్య పథము పుట 86

ఆ॥ "తెలివికేమి లోటు? తెలుగు దేశమ్మున
ధనము కేమిలోటు? త్యాగమందు
నన్నియుండి మనకు, నధికారమేలేదు
యెన్నడైన వినెడి పున్నె మున్నె?" శ్రీ పట్టాభి 3వ పద్యము

తెలివి తేటలకేమి లోటు, తెలుగు దేశములో ధనమునకేమి తక్కువ. త్యాగము నందు ఏమి తక్కువ? అన్ని యుండి, అధికారమే లేదు. మీకు అధికారము ఇచ్చారు అనే మాట వినే పుణ్యము ఎప్పటికైనా కలుగుతుందా? అని విలపిస్తారు. మిమ్మల్ని చాణక్యుడనో, యుగంధరుడనో ప్రపంచం కీర్తించినది. మిమ్మల్ని ప్రజ్ఞావంతులుగా, కర్తవ్యతా జ్ఞానముతో పల్కుచుందురు. అయినను మీరెవరో మీ జ్ఞానమెట్టిదో వీరు తెలిసికోలేకుండా ఉన్నారే? మిమ్మల్ని ఎదిరించి నిలువగల వారున్నారా? రాజకీయములలో పెదవి విప్పినా, కలముచే బూనినా మీ విజ్ఞానములో, బుద్ధి సంపదలో సాటి వచ్చువారెవ్వరు? మీ దీక్ష ఎట్టిదో కనబడుచునేయున్నది అని అంటారు.

శ్రీ శర్మగారు పట్టాభి గారిని కాలము విలువతెలిసిన వ్యక్తిగా, 'కాలాయనమః' కాలజ్ఞానిగా భావించిరి.

"అమితాశ్చర్యకరమ్ము, నీదుదినచర్యల్‌గాంచగా, నెన్నిగ్రం
థములన్ వ్రాసితి, లెన్ని సంస్థలను సంస్థాపించి, పోషించితో!
శ్రమచే దేశజులింక నీ ఋణము దీర్పంజాలువారయ్య! కా
లము, ప్రాధాన్యమటంచుఁజాటగల, కాలజ్ఞుండ వీవేగదా!" శ్రీ పట్టాభి 7వ పద్యము

మీ దినచర్య పరిశీలించినచో ఎన్ని గ్రంథాలు వ్రాసితిరి. ఎన్ని సంస్థలను స్థాపించితిరి. పోషించితిరి.దేశజులు నీ ఋణము తీర్చుకోలేరు. కాలము ప్రధానము అని చాటి చెప్పిన కాలజ్ఞానివి నీవే కదా! అంటారు. పట్టాభిగారు ప్రతి నిమిషము కాలము ఎంతో విలువైనదిగా భావించేవారట. జరిగిపోయిన కాలము తిరిగి రాదని, కాలము విలువ గుర్తించినవారు.

మీకు మీరే సాటి అది నిజము. దాపరికం ఎందులకు? కలము చేత బట్టి నిల్వగలవారు నీ వాగ్విజృంభణకు ఢీ కొనగలవారు కలరే! నీవై కలిగించుకున్నపుడే వారి శక్తియుక్తులు బయల్పడును. మన ఆంధ్రుల శక్తి కాలమే తేల్చగలదు. వట్టి వాచాలురుగారు ఆంధ్రులు. తమ శక్తి ఎటువంటిదో ఎరుగరు. వీరెప్పుడు దూరదేశాల వారిని నుతింతురుగాని దేశజుల సంగతి పట్టించుకోరు. ఈ భూమిపై మన నాయకులు

రత్నాలు గదయ్యా అంటారు. మన నాయకమణి - రత్నము వంటివారు పట్టాభి గారని వీరి ఉద్దేశ్యము. మన ఆంధ్రుల భాగ్యమనగా అరువది తొమ్మిదవ ఏట నవ్యభారత వసుంధర నీ భుజపీఠమెక్కుటకు తరుణము వచ్చెను అని ఆశీస్సులనందజేసిరి.

పట్టాభి గారు సార్ధక నామధేయులట,

**"పట్టాభి! యని నీదు తండ్రి యగు సుబ్రహ్మణ్యుడేనాడో, పే**
**ర్వెట్టెన్, నీ భవితవ్యమున్ దెలిసియే! లేకున్న నిట్లౌనొకో!**
**పట్టాభి! యని సర్వలోకమనగా బట్టాభిషిక్తుండవౌ**
**టెట్టుల్ దప్పును! వీరి యాప్సితము లిట్లీడేరగానన్."** జయ్‌పట్టాభి 4వ పద్యము

వీరి తండ్రియైన సుబ్రహ్మణ్యము గారు వీరి భవిష్యత్తును తెలిసికొనియే 'పట్టాభి' అని పేరు పెట్టెనట. లేకపోతే ఇట్లగునా! పట్టాభీ! అని సర్వలోకము పిలువగా పట్టాభిషిక్తుండవౌట ఎట్లా తప్పును? వీరి కోరికలు ఈ విధముగా తీరినాయి గదా! అంటారు. తల్లిదండ్రులు పుట్టిన కాలాన్ని గుర్తించి ఆ నక్షత్రమునకు తగినపేరు పెట్టుదురు. నిజముగా గ్రహస్థితిని తెలిసికొని పెట్టిన పేరు వెనుక ఇంత రహస్యము దాగి ఉండును. ఇది శాస్త్రము తెలిసినవారు ఆలోచించే విధానము. శర్మగారు జ్యోతిష పండితులు గనుక పట్టాభి గారి జాతకమును పరిశీలించిన వారు గనుక పట్టాభి గారి పట్ల వీరు చెప్పిన శాస్త్ర ఫలితములు నిజములైనవి. పట్టాభిగారు నాయకులగుట వలన భారత జనని జన్మ సాఫల్యమయ్యేనట - జాతీయ కాంగ్రెస్ ప్రతిష్ఠను కాపాడగల వాడవు నీవేయని ఆశలు పెట్టుకొని, ఈ స్థానము నీకేయని దేశము నిల్పినది. భారతదేశ నేతగా నీ లక్ష్యమును సాధింపగదయ్యా అంటారు. కొంతమంది నాయకులు కొన్ని పదవులలంకరిస్తే, పట్టాభిగారి వంటి నాయకులను పదవులే వరిస్తాయి. ఇటువంటి వారు నాయకులైతే ఆ పదవికే వన్నె కలుగుతుంది అని చెప్పటము వీరి ఉద్దేశ్యము.

**గీ॥ "నేటికొక స్థానమబ్బెగా నీ కతమున**
**తెనుఁగు బిడ్డకు, భూరి జాతీయ సభను**
**స్థానమేగాదు మకుట మస్తకముఁగాంచు**
**భాగ్యములభించుగాక, సత్వరమె మాకు."** జయ్‌పట్టాభి 6వ పద్యము

అని నేను పల్కిన మాటలు సత్యములైనవి. మీరు భారతావనికి అధ్యక్షుండవైతిరె! పట్టాభిషక్తులై

ఘన శోభతో వెలుగొందు సమయము రావాలని ఆకాంక్షించెదను అంటారు. పట్టాభిగారు వీరు ఆశించినట్లే నాయకులైన తరువాత స్వాగత వచనములు పల్కిరి. తమ మచిలీ బందరు పురవాసియని ఆనందించిరి.

**"ధీరుని, నీ స్వరూపమది, దేవునికైన నెఱుంగరాదు! నీ**
**చేరిక, సింగమున్ దరికి జేరుడెగాయని భీతిఁజెంద్రు, గం**
**భీరమనంబునం దెటుల వెన్న సమృద్ధిగ దాచినావొ? నీ**
**పేరొక తీరు! ధోరణియొ వేరు కదా, కన భోగ రాణ్మణీ!"** పుట్టింట - మర్యాద 3వ పద్యము

శ్రీ శర్మగారు పట్టాభి గారితో బాగా తిరిగినవారు. వారి స్వభావము - ప్రవర్తన - తీరు తెన్నులన్ని తెలిసినవారు. మీరు ధైర్యవంతులు. మీ స్వరూపము దేవునికైన తెలిసికోవటం సాధ్యముగాదు. మీ దగ్గరికి రావటం అంటే ఒక సింహము దగ్గరికి వెళ్ళినట్లుగా భయపడతారు. మీరు గంభీరమనస్కులు. అట్టి మనంబున అవన్నియు సమృద్ధిగా ఎట్లు దాచితిరో కదా! మీ పేరొక తీరు - ధోరణి ఇంకొక తీరు. ఇది మిమ్మల్ని పరిశీలించినవారికి తెలియును. అనుట చేత పట్టాభిగారు ధీర గంభీర స్వరూపులని స్పష్టమగుచున్నది. చూచేవారు ఆయనను సమీపించటానికి భయపడినా, దగ్గరికి వెళ్ళినపుడు ఎంతో ప్రేమగా పలకరించి పంపే స్వభావం గలవారని స్పష్టమగుచున్నది. పట్టాభిగారి శారీరక సౌందర్యమును మనకు కళ్ళకు కట్టినట్లుగా చూపించుదురు.

**"కిలకిల నవ్వుమోము, నునురేగెడి ఫాలతలమ్ము, మేల్ ఛలో**
**క్తుల గురిపించు వక్త్రమును, దూసుకుపోయెడి వజ్రహస్త కౌ**
**శలము, క్షణమ్మునన్ బరవశమ్మొనరించెడి చూపు, మేఘ మం**
**డలమును జేరు యూహలు గనన్ బహు చిత్రము నీ చరిత్రముల్."**

పుట్టింట - మర్యాద 2వ పద్యము

ఆయన ముఖము కిలకిల నవ్వుతూ ఉంటుందట. కొంచెము రేగిన నుదురు భాగము, ఎప్పుడు ఛలోక్తులు విసరుచు నోరు అందరిలోనికి దూసుకుపోయెడి వజ్రహస్తకౌశలమట. ఆయన చూపు ఒక్క క్షణకాలములో పరవశమొనరించునట. ఆయన చేయు ఊహలు మేఘమండలమును జేరునట. నడవడి బహు చిత్రమయా! అంటారు. ఈ లక్షణములు ఉన్నప్పుడే వారు నాయకులు కాగలరు. అయితే రాణించగలరు.

శ్రీ శర్మగారికి పట్టాభి గారంటే అమితమైన గౌరవ భక్తిప్రపత్తులు గలవు.

ఆ॥ "నిండుగాక ఖండఖండాంతరమ్ముల
భరతదేశ కీర్తి ప్రాభవముగ
ఆంధ్రయశము భారతావని, నీ పర్య
వేక్షణమున బ్రాకి వెలయుగాక"[1] పుట్టింట - మర్యాద 8వ పద్యము

పట్టాభిగారి కీర్తి ఖండఖండాంతరమ్ముల వ్యాపించాలని కోరుకొనిరి. భారతదేశకీర్తి, ఈ భారతావనిలో ఆంధ్రులయశము నీ పర్యవేక్షణలో ప్రాకి ఖండఖండాంతరముల నిండుగాక అని ఆశించిరి.

ఆ॥ "బ్రహ్మరధము బట్ట, భారతావని యంత
రాజవీధులందు రధము పైని
జయపురాన వెడలు చక్కని నీమూర్తి
సంస్మరింత్రు, రామచంద్రుఁడనుచు."[2] పుట్టింట - మర్యాద 7వ పద్యము

పట్టాభిగారి పరిపాలనా కాలము రామరాజ్యముగా వెలుగొందాలని ఆశించిరి. వారిలో శ్రీరామచంద్రుని దర్శించిరి. భారత ప్రజలందరు రథముపై రాజవీధులందు జయజయ ధ్వానములు పల్కుతు వెడలు నీమూర్తి చూసి, బ్రహ్మరథము పట్టుదురు. రామచంద్రుడని సంస్మరింతురు అంటారు.మనసా వాచా కర్మణా ధర్మమును తప్పని వారు పట్టాభిగారు.రామచంద్రునిగా భావించుట ఎంతయో సముచితముగా నున్నది.

## 9. త్యాగశీలి - విద్యాప్రదాత శ్రీ కోపల్లె: -

శ్రీ కోపల్లె హనుమంతరావు గారు గొప్ప త్యాగశీలి. విద్యా ప్రదాత బందరు నాయకత్రయము శ్రీ పట్టాభి సీతారామయ్య గారు, శ్రీ ముట్నూరి కృష్ణారావుగారుతోబాటు శ్రీ కోపల్లె హనుమంతరావు గారొకరు. వీరు బందరు పట్టణములో ఆంధ్ర జాతీయ కళాశాలను స్థాపించి విద్యాభివృద్ధికి పాటుబడిరి.

గీ॥ "అవని కోపల్లె విమలవంశాబ్ధి చంద్ర
మాన్యశ్రీ కృష్ణరాయకుమార! ధీర
ఆంధ్రజాతీయ విద్యాలయ ప్రతిష్ఠ
జేసిన, మహానుభావ! జేజేలునీకు"॥[2]

కోపల్లె వంశాబ్ధిచంద్రుడు, శ్రీ కృష్ణరాయ కుమారులు, ధీరులు, ఆంధ్ర జాతీయ విద్యాలయమును ప్రతిష్ఠచేసిన మహానుభావులునైన శ్రీ కోపల్లె హనుమంతరావు గారికి జేజేలు పలికిరి. జీవితమును

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వతంత్ర్యపథము పుట : 88

మాతృదేశసేవకు అంకితము చేసిన సహృదయులు, త్యాగమూర్తి, జ్ఞాన దానైక సంకల్పమూర్తి. ఎంతో కష్టపడి శ్రీ ముట్నూరి కృష్ణారావు గారు, పట్టాభి సీతారామయ్యగారు, శ్రీ కోపల్లె హనుమంతరావుగారు ఈ ఆంధ్ర జాతీయకళాశాల స్థాపనకు కృషిచేసిరి. ఇది స్థాపన చేయుట సామాన్య విషయముగాదు.

**మ॥ "గత జన్మమ్ముల శ్రీ సరస్వతి కటాక్ష శ్రీ ప్రభా దివ్యరా**
**జిత ధీశాలివి! శారదా నిలయ మక్షీణోజ్జ్వల జ్ఞాన శో**
**భిత పీఠమ్మున నిల్ప! పాటు వడితే! భిక్షాటనన్ జేసి ని**
**ల్పితి, జాతీయ కళాలయమ్ము, జనముల్ మెచ్చన్ హనూమత్ప్రభూ"[1]**

పూర్వసుకృతముచే శ్రీ సరస్వతీ కటాక్షమనెడి గొప్ప కాంతులచేత ప్రకాశించు ధీశాలి గనుక ఈ భూమిపై జ్ఞానశోభితమైన శారదా పీఠమును నిల్పుటకు పాటు పడితివి. అదిగూడ డబ్బులు ఉండి ఖర్చుపెట్టి స్థాపించుటగాదు. భిక్షాటనతో పోగుచేసి ఆ విరాళముతో కళాశాల స్థాపన చేయుట,

**సీ॥ "శారదా నిలయమ్ము స్థాపింప, భిక్షుక**
**వృత్తిగైకొన్న ఉదాత్తయోగి**
**బ్రిటీషు న్యాయస్థాన వేదిక నెక్కకయె ప**
**ట్టా రూపుమాపిన వీరపురుష**
**బహు పరిశ్రమల స్థాపనజేసి కష్టముల్**
**తీర్చ పోషించు దీనబంధు**
**అస్పృశ్యతా భావ మావంత రానీక**
**సమదృష్టి మన్న ప్రసన్న హృదయ!**
**గీ॥ ప్రథిత ముట్నూరి కృష్ణరాట్పండి తునకు**
**భోగరాడ్ధీర పట్టాభి పూజితునకు**
**ప్రాణమై, కూడి, సర్వత్ర భరతమాత**
**సేవలన్ మన్న, ముగురు ప్ర సిద్ధనాయ**
**కులకు, హనుమంతరాయ, అంజలి ఘటింతు"[2]**

ఆంధ్ర జాతీయ కళాశాల స్థాపనకు భిక్షుకవృత్తినే స్వీకరించిన ఉదాత్తయోగి. బ్రిటిషు న్యాయ స్థాన వేదికను ఎక్కకుండానే తన న్యాయవాదపట్టాను రూపుమాపిన వీరపురుషుడు. ఎన్నో పరిశ్రమలు స్థాపించి

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

దీనుల కష్టాలను పోగొట్టిన దీనబంధు. మనస్సులో అస్పృశ్యతా భావము కొంచెము గూడా రానీకుండా అందరు సమానమే అనే భావనతో జీవించిన ప్రసన్న హృదయులు. శ్రీ ముట్నూరి కృష్ణారావునకు శ్రీ పట్టాభి సీతారామయ్య గారికి ప్రాణ సమానమై వారితో కలసి భారతమాతకు సేవ చేసిన ముగ్గురు నాయకులకు అంజలి ఘటిస్తాను అంటారు. దీనిని బట్టి శ్రీ శర్మగారికి వీరిపట్ల ఎంత గౌరవభావముగలదో తెలియుచున్నది. వీరి ముగ్గురి గుణగణములను శరీరమున జీర్ణింపజేసికొని వారితో సమానముగా దేశసేవ చేసిన మహనీయుడు గురుజాడ.

## 10. కళాతపస్వి - విజ్ఞానఖని శ్రీ ముట్నూరి: -

కళాతపస్వి - విజ్ఞానమే ఆయనరూపముగా మూర్తీభవించినవారు శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు. వీరు స్వాతంత్ర్యోద్యమకాలములో కృష్ణా పత్రిక సంపాదకులుగా ఉండి వీరి లేఖిని నుండి వెలువడిన సంపాదకీయాలు ప్రజలనెంతో ఉత్తేజితులను చేసినవి. బందరు పట్టణములో నాయకత్రయముగా ప్రసిద్ధి చెందినవారిలో వీరొకరు. పట్టాభి సీతారామయ్యగారితో, కోపల్లె హనుమంతరావు గారితో వీరుకూడా కలిసి ఆంధ్ర జాతీయ కళాశాల ఆవిర్భవించుటకు విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిరి. శ్రీ గురుజాడ రాఘవశర్మ వీరందరితో ఎంతో సన్నిహితముగా సంచరించుటయేగాక వారి గుణగణములను - వ్యక్తిత్వమును - వారి త్యాగనిరతిని క్షుణ్ణముగా అవగాహన చేసికొనిరి. శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు,

ఉ॥ **"ధీరుడు, రాజకీయముల తీరచిదిద్దిన తీక్షణ భావ గం**
**భీరుడు, దాస్య శృంఖలము భిన్నము సేయగ, గాంధిమార్గమున్**
**జేరిన శౌర్యధుర్యుడు ప్రసిద్ధ చరిత్రుడు, త్యాగమూర్తి, ము**
**ట్నూరి కులాబ్ధి చంద్రు, సుగుణున్, మదినెంచెద కృష్ణరాయనిన్"[1]**

ధైర్యసాహసాలు గలవారు, రాజకీయాలను తీర్చిదిద్దిన తీక్షణమైన భావాలు గల గంభీరుడు. దాస్యశృంఖలములను ఛేదించుటకు గాంధీగారి మార్గమును అనుసరించిన శౌర్యధుర్యుడు. ప్రసిద్ధ చరిత్రగలవారు. త్యాగమూర్తి, సుగుణులు అయిన శ్రీ ముట్నూరి కులాబ్ధిచంద్రులను కృష్ణరాయని తలంచెదను. అని వారిపై గల గౌరవ భావమును ప్రకటించిరి. వారి శరీర అవయవాలు ఒక్కొక్క భావాన్ని వ్యక్తం చేస్తాయి అని,

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

సీ॥ "తన మౌనముద్ర తీర్చిన ధర్మపథికుల
ముగ్ధులజేయు, చిన్ముద్రగాగ
తన నిరాఘాట లేఖిని, చిరదాస్య శృం
ఖలములద్రెంచు, ఖడ్గమ్ముగాగ
తన వాగ్విజృంభణ తరలి, శివమెత్తి, గో
దాల దూకెడి, శూరపాళి గాగ
తన వాక్ప్రసూన గంధము, పల్లె పట్నముల్
దొరలెడు కమ్మ తెమ్మెరలుగాగ
గీ॥ తనదు వాగ మృతముగ్రోలి, తన్మయతను
వ్రాలుజనములు, నిజ పదాశ్రయులుగాగ
సులువునన్ నరనరాల కెక్కించినట్టి
శౌర్య వాఙ్మూర్తి, ముట్నూరి చక్రవర్తి"[1]

శౌర్యమనెడి వాఙ్మూర్తియైన శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు చాల మౌనముగా ఉండి ధర్మ మార్గములో నడచువారిని ముగ్ధులనుజేయు చిన్ముద్రయట. ఎల్లప్పుడు నిరాఘాటముగా వ్రాయు వారి లేఖిని దాస్యశృంఖలముల ఛేదించు ఖడ్గమట. వారి వాగ్విజృంభణ శివమెత్తినర్తించు శూరపాళిట. వారి వాక్ప్రసూన గ్రంథము పల్లెలకు పట్నములకు వ్యాపింపజేయు కమ్మతెమ్మెరలుట. వారి వాగమృతము ఆస్వాదించి తన్మయులై జనము ఆయన పదములను ఆశ్రయించెడివారట. నిరక్షరాస్యులకు సైతము చాలా తేలికగా రాజకీయములను నరనరాలకెక్కించినట్టి వారట. ఆ రోజులలో ఇట్టి మహానాయకులు ఉండిరి గనుకనే ప్రజలలో చైతన్యము గలిగించి దేశభక్తి ప్రపూరితులను గావించి సంగ్రామ రంగమున నురుకునట్లుచేసిరి. మనిషి రూపమును చూసి ఆకర్షితులగుట కొంత మందికే సాధ్యము. కాని వాగ్రూపశక్తికిలోనై తన్మయులగుట ఇంకొందరికి సాధ్యము. శ్రీ ముట్నూరి వారికి తాను ధర్మ పథములో నడుచుచు ఇతరులను తన వాక్చాతుర్యముతో ముగ్ధులను చేసి తన పదాశ్రయులను చేసికొనుట అందరికి లభ్యమునది గాదు వారు

"తన దరిజేరు నెంతటివారి నాశ్చర్య
చకితులన్ జేయు, వాక్చతురమూర్తి
తన సువిస్ఫార నేత్రముల నెంతటి వారి
నూరక నిల్పు, గంభీరమూర్తి

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

తన విమర్శక, సువిధానమ్ము, జ్ఞానమ్ము
రూఢనెఱపి పల్కు ప్రౌఢమూర్తి
తన సహృదయమ్ము మందస్మిత మొరుల, నా
కర్షించు, లలితశృంగారమూర్తి
గీ॥ ఒరగు చూపుల. బెత్తమునూపుకొనుచు
రాజ వీధుల వెడలు, విలాసమూర్తి
ముగ్ధమోహన వేదాంత స్నిగ్ధమూర్తి
కీర్తి సందీప్తి, ముట్నూరి చక్రవర్తి"॥[1]

తన దగ్గరకు వచ్చిన వారిని ఎంతటివారినైన ఆశ్చర్యచకితులను చేయు వాక్చాతుర్యము గలవారట. వారి విశాలమైన కండ్లతో ఆకర్షింపచేసి ఊరకనే నిలిచేటట్లు చేయు గంభీరమూర్తిట. తన విమర్శ విధానము ఎటువంటిదంటే జ్ఞానమును దృష్టిలో పెట్టుకొని చేయునదిటగాని వ్యక్తిగత విమర్శగాదు అట్టి ప్రౌఢమూర్తిట. వారి హృదయము మంచితనము వారిచిరునవ్వులతో ఇతరులను ఆకర్షింపచేయు లలిత శృంగారమూర్తియట. ఒరగుచూపులు చూస్తూ, బెత్తమును ఊపుకొనుచు రాజవీధుల వెళ్ళు విలాసమూర్తి, ముగ్ధమోహన వేదాంతస్నిగ్ధమూర్తి, కీర్తిచే వెలుగొందు ముట్నూరి చక్రవర్తియట.

ముట్నూరి కృష్ణారావుగారిని చూడనివారికి కూడ శ్రీ శర్మ గారు తన రచనా నైపుణ్యముచే కళ్ళకు కట్టినట్లు చూపగలిగిరి. "FACE IS THE INDEX OF THE MIND" మన మనస్సులోని భావాలు మన ముఖముపై ప్రతిబింబింపజేయును అనునట్లుగా వారి హృదయగత భావాలు కేవలము చిరనవ్వుల ద్వారా వ్యక్తము చేయుట. కండ్ల యొక్క కదలిక ద్వారా వారి అభిప్రాయములు వ్యక్తముచేయుట. వారి కండ్లతో చూచిన చూపులచేతనే ఎంతటి వారిని నిలబడునట్లు చేయుట ఎంతటి ప్రసన్నమూర్తియో తెలియుచున్నది. వీటన్నిటికి తోడు జ్ఞానఖని వారు వ్యక్తిగత విమర్శకు తావివ్వక, జ్ఞాన సంబంధమైన విమర్శ చేయుట వీరి సద్విమర్శకత్వాన్ని వెల్లడి చేయుచున్నది. వీరు బెత్తము ధరించి రాజవీధుల వెళ్ళుట ఏమోగాని, శ్రీ శర్మ గారి పద్యము చదివిన పాఠకులకు వారి విగ్రహము కళ్ళకు కట్టినట్లు చూపించి, బెత్తము చేత ధరించి ధర్మ మార్గములో సంచరించున్నట్లేఉన్నది. తన కవిత్వ నైపుణ్యముతో ప్రత్యక్ష మొనరించునట్లు చేయుశక్తి వీరికి వెన్నతో బెట్టిన విద్య.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు దేశహితైక దీక్షతో కృష్ణా పత్రికను తన శబ్దచాతుర్యముతో జాతీయ ప్రబోధముతో తీర్చిదిద్దుచు మచిలీపట్టణములో హితులతో సంఘసంస్కరణలు జేయుచు జాతీయ విద్యాలయమును నెలకొల్పి, భారతదేశమును దాస్యశృంఖలముల నుండి విముక్తను జేయుటకు గాంధీజీతో కలిసి కొన్ని సంవత్సరములు కారాగారవాసము చేసిరి.

గీ॥ "హేయమనకయె, వంటవాడాయె భీము
డ లస్వరాజ్యమునిల్పు ప్రయత్నమందు
కలము చేకొన్న ముట్నూరి, గరిటె బూనె
బందెను స్వరాజ్యోద్యమ మందు దీక్ష"॥[1]

తన రాజ్యమును నిల్పుకొనుటకు హీనమైనస్థితి అని కూడ ఆలోచించక భీముడు వంటవాడయ్యెను. కలముచేకొన్న ముట్నూరి కృష్ణారావుగారు స్వరాజ్యోద్యమ మందు దీక్షగా కారాగారములో గరిటెబూనెను అని రచించిరి. ఆ రోజులలో కృష్ణాపత్రికయనిన కృష్ణారావుగారి సంపాదకీయాలన్నా చరిత్రలో ఒక ప్రత్యేక స్థానము గలదు. దీనికి దీటైన పత్రిక ఆనాడు ఇంకొకటి లేదు. వీరి లేఖినికి అంతటి అమోఘమైన శక్తిగలదు. వారి స్వభావమును వర్ణించుచు,

సీ॥ "పలుకనే పలుకడు, పల్కిన (గదలు, త్రి
భువనముల్, సంద్రమ్ము పొంగినట్లు
మోపనే మోపడు, మోపి యూపు కలాన
ప్రజల వీచు ప్రచండవాయువట్లు
కదలనే కదలడు, కదలుచువెడలు, వా
హ్యాళి, హెుయలఫించమౌళియట్లు
సంటీయడింత ప్రసంగమ్ములన్ గరు
ణించినా, ముంచు, తేనియలు జింద
చేయడింత విమర్శనల్, చేసిన, విద
లించు, సంశయగ్రంథి, ఛేదించినట్లు
తెలియరాదుగ, మౌనముద్రితులనిలో ర
హస్యమింతయు దెలియు బాహ్యాంతరముల
వెల్లివిరిసిన జ్ఞాన దీపికలు నిండ"[2]

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

గీ॥ "రూఢిగా, కృష్ణరాయ స్వరూపమింత
తెలియరాదుగ గురుకృపాకలన వెలయు
సత్య శివసుందరంబయి, సత్కళా ప్ర
పూర్ణ సచ్చిదానంద చిన్మూర్తి యతడు
ప్రథిత ముట్నూరి కృష్ణ రాయడతండు॥"[1]

శ్రీ ముట్నూరి వారు పలుకనే పలుకరు. పల్కినచో ముల్లోకములు సముద్రము పొంగినట్లు పలుకును. కాలుమోపడు. మోపినచో ప్రజలను కలంతో ప్రచండవాయువు వీచినట్లుగా కదలించి వేయును. కదలెనా తన ప్రసంగములందు కొంచెము కూడ అనవసర విషయములు చర్చింపడు, దయగలిగి తేనెలు చిందునట్లుగా ప్రసంగించి దానిలో మునుగునట్లు చేయును. విమర్శలు చేయడు. చేసినచో సంశయములను పటాపంచలు చేయును. కృష్ణారావు గారి స్వరూపమిది అని మనకు రూఢిగా తెలియదు. గురుకృప వలన వర్ధిల్లును. వారి మూర్తి సత్యము, శివము, సుందరము అను త్రయాత్మక గుణముతో మూర్తీభవించి సత్కళా ప్రపూర్ణ సచ్చిదానంద స్ఫూర్తియై వెలుగొందెను. శ్రీ ముట్నూరి కృష్ణారావుగారిలో శ్రీశర్మగారు శ్రీకృష్ణ భగవానుని దర్శించగలిగిరి. వాహ్యాళికి వెడలునపుడు హొయల పింఛమౌళియట. శ్రీ శర్మగారు ఎంతటి ఉపాసనాపరులంటే ప్రతివ్యక్తిలోను శ్రీ కృష్ణపరమాత్మను సందర్శించగల్గిరి. పైగా సత్యము, శివము, సుందరము మూడు కలబోసి శ్రీ కృష్ణారావుగా మూర్తివహించినాయట. సత్కళాప్రపూర్ణమైన సచ్చిదానంద చిన్మూర్తిట. సత్ - చిత్ - ఆనందమూర్తి. జ్యోతి స్వరూపుడైన ఆ పరమాత్ముని వీరు చూడగలిగిరి. సచ్చిదానందమూర్తియైన ముట్నూరి కృష్ణారావుగారు సాక్షాత్తు ఆ శ్రీ కృష్ణపరమాత్మయే అని చెప్పుట వీరి ఉద్దేశ్యము. భారత యుద్ధములో శ్రీ కృష్ణ పరమాత్మ ఎంతటి వారో ఈ భారత స్వాతంత్ర్య సంగ్రామ రంగములో శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు అట్టివారు. దీనిని బట్టి ముట్నూరి కృష్ణారావుగారు ఎంతటి మహానుభావులో తెలియుచున్నది.

## 11. ఆంధ్రకేసరి - శ్రీప్రకాశమ్: -

ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశము పంతులు గారనిన శ్రీ శర్మగారికెంతో గౌరవము. ఆయన శతవార్షికోత్సవమును దేశము చేయవలెనని గుర్తించినపుడు వారి ఆనందము వర్ణించుట తరముగాదు. మీ ఆశయములు మీసేవ ఇన్నాళ్ళకు ఫలించినవి. దివ్యకీర్తి సంకాశ! ప్రకాశధీమణి! వికాస సుహృన్మణి! నీకివే

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

మా నమస్కృతులు అంటారు. ప్రకాశం పంతులుగారి గుణగణాలను ఈ విధముగా కీర్తించిరి.

**"గంభీర నిస్స్వన కాంస్య కంఠమ్మున**
**ఖంగున మ్రోగు, వాక్ప్రౌఢిమమ్ము**
**బ్రిటిషు సింగపు జూలు, పిడికిటగొని, యధి**
**రోహించు, నిర్భయ సాహసమ్ము**
**విన్న మాత్రానఁబర్వెత్తి ఁదీన జనార్తిఁ**
**బాప లంఘించు, సంతాప గుణము**
**మరఫిరంగుల కేని, మారొడ్డి, ఱొమ్ము, పో**
**రాడు, నిర్వక్ర పరాక్రమమ్ము**
**కొంకు, జంకెన్నఁడెఱుగని, కొదమసింహ**
**రాజమనగ, నీ కేసరి, పూజనీయ!**
**స్వప్రకాశుఁడ వీవయ్య! శ్రీ ప్రకాశ**
**మా! తెనుఁగు తేడ! కొనుమ! జోహారులివిగొ"॥**[1] ఆంధ్రకేసరి - శ్రీ ప్రకాశమ్ 1వ పద్యము

శ్రీ టంగుటూరి ప్రకాశము గారి కంఠస్వరము కాంస్య కంఠమున ఖంగున మ్రోగేటటువంటి వాక్పటిమగలవారట. వారి ధైర్యసాహసాలు బ్రిటిషు వారనెడి సంగపుజూలు పిడికిట బట్టుకొని, ఎదిరించే సాహసము గలదిట. వీరు ధైర్యసాహసాలు ప్రదర్శించుటలో ఎంతటి కఠిన స్వభావము గలవారో అంతటి జాలిగుండె కూడ గలవారట. ఎవరైన దీనజనులు ఆర్తితో దుఃఖిస్తున్నారని వినగానే వారి బాధలు పోగొట్టే సంతాపగుణము గలవారట. మరఫింగులకు కూడ లొంగక, ఱొమ్ము ఎదిరించి పోరాడు పరాక్రమము గలవారట. కొంకు, జంకు అనేవి తెలియని కొదమసింహమట. ఆంధ్రులకే కేసరి. ఆంధ్రులకు పూజనీయుడవు. తెనుగుతేడ! నీవు స్వప్రకాశుడవు అంటారు. ఆ రోజులలో శ్రీ టంగుటూరి వారి ఉపన్యాసములు ఎంతో ఉత్తేజకరముగా ఉండి వారిలో దేశభక్తిని పురిగొల్పుటయేగాక, వీరి నాయకత్వము సింహసదృశమై బ్రిటిషు వారికి ఎదురొడ్డి నిలచినట్టిది. బ్రిటిషు వీరులను గడగడలాడించినది. అటువంటి ప్రకాశముగారు టంగుటూరి వంశమునకే కీర్తి ప్రతిష్ఠలు తెచ్చినవారు. ఆంధ్రుజనులందరు ఉప్పొంగి పోవునట్లుగా తమ రాష్ట్ర రాజ్యాంగమును చక్కదిద్దినవారు, ప్రజా హృదయమంటే ప్రకాశమే అను కీర్తిని గడించినవారు.

దీనిని బట్టి ప్రకాశముగారు ఎంతటి శౌర్యపరాక్రమములు గలవారో తెలియుచున్నది.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 93

## 12. అనర్గళవాక్సుధానిధి - శ్రీ చెఱుకువాడ: -

"వాక్కు దైవదత్తము. కొందరికి జన్మాంతర సంస్కారముగా, ప్రతిభ సహజ గుణమై వర్ధిల్లుతుంది. కొందరికి అభ్యాసముచే బహుముఖముగా ప్రకాశిస్తుంది. అనర్గళమైన వాక్ప్రవాహానికి నిధియైనవారు శ్రీ చెఱుకువాడ నరసింహంగారు. వీరు సామాన్యమైన ఆరువేల నియోగి కుటుంబములో గౌతమ గోత్రములో వీరి మేనమామగారైన ఘంటసాల నరసింహంగారి యింట్లో జన్మించిరి. వీరి జన్మ స్థలము కృష్ణాజిల్లా దివి తాలూకా ఘంటసాల. 1887 మార్చి 1వ తేదీన పుట్టారు. తండ్రి సామాన్య కుటుంబీకుడు. పేరు సీతారామయ్యగారు. తల్లి ఘంటసాల వారి ఆడపడుచు. ఈమె శిష్టాచారసంపత్తి శీలవతి. అనర్గళమైన వాక్సుమాలను లోకోక్తులతో వెలువరించు ఠీవిగల నారీమతల్లి. అందువలననే వాక్ఝరీ సంపద నరసింహంగారికి తల్లి నుండి సంక్రమించినదై ఉండవచ్చు. వీరు ప్రైమరీ విద్య ఘంటసాలలో పూర్తి చేసుకొని బందరు హైందవోన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పరీక్షలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైనారు. వీరికి లాయరు కావాలనే కాంక్ష కలిగి బొంబాయి హైకోర్టు యడ్వకేటు పరీక్షలో న్యాయశాస్త్రమును పూర్తిచేసికొనిరి. ద్రవ్యలోపము వలన లాయరు పట్టాపుచ్చుకొనే అదృష్టము లేకపోయినది. వీరిది తీక్ష్ణమైన మేధాసంపత్తి. న్యాయశాస్త్ర సమ్మతమగు సమాలోచన. అచంచల వాక్చమత్కృతి. సరస సముచిత శబ్ద ఝరీ స్రవించు వాక్కువ్రాత. ఏ పంక్తి వ్రాసిన, ఏ విమర్శ చేసినా యే వ్యాసమువ్రాసినా, ఏ చిన్న విషయమునైనా శోభాయమానముగా నిండార వెలువరించే వ్రాయసకాడు. మించి అనర్గళ వాక్చతురుఁడు. ఉపాధ్యాయుడుగా వీరి జీవితము ప్రారంభమై రాజకీయోపన్యాసకుడుగా, పత్రికా సంపాదకుడుగా, మంచి గ్రంథకర్తగా, మంచి వ్యవహారదక్షుడుగా, పత్రికా సంపాదకుడుగా పేరొందిన ప్రజ్ఞాశాలి. ఉన్నతాశయములతో కూడిన వారి హృదయము నివురుగప్పిన నిప్పు. ఎంతటి వారినైన ఆకర్షించు నేర్పుకూర్పు గల నిండు శబ్దజాలము వెలువరించు శక్తి జన్మతఃలభించినదనవచ్చు. వారి వచోవిలాసము పోకడ మించి యెంత వారినేని ఒకప్పుడు పాదాక్రాంతము చేయించే వాక్పటిమ ఆయనసొమ్ము".[1]

శ్రీ గురుజాడ రాఘవశర్మ శ్రీ చెఱుకువాడ నరసింహంగారిని తమ గురుదేవులుగా భావించిరి. ఆంధ్ర స్వాతంత్ర్యోద్యమములో చెఱుకువాడవారి ఉపన్యాసములు విని ఉత్తేజితులుకాని వారులేరు. వారి వాక్సుధాధార అనర్గళమై ప్రజలను సమ్మోహితులను జేయునది.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ "ఎందఱో మహనీయులు స్వాతంత్ర్య సమర యజ్ఞములో" పుట 76

సీ॥ "ఎవ్వాని సాహసోత్కృష్ట గంభీర వా
గ్ధార జాతీయ చైతన్యధార
ఎవ్వాని సహజ సాహిత్య లోకోక్తుల
పూర్వ సరస్వతీ భూషణములు
ఎవ్వాని నిర్భయహింసా సమర పరా
క్రమ మరిగజ సింహ గర్జనమ్ము
ఎవ్వాని దేశహితైక దీక్షాత్యాగ
శక్తి స్వజాతి సంచలన శక్తి
గీ॥ ఎవని వర్తన మేలి యొరవడి ప్రజకు
ప్రజకు సమ్మోహనాస్త్ర మెవ్వాని పలుకు
అట్టి శ్రీ చెఱుకువాడ వంశాబ్ధి చంద్రు
నారసింహుని కివె, నమస్కారశతము॥[1]

అనర్గళ వాక్సుధాప్రౌఢ-శ్రీ చెఱుకువాడ 1వ పద్యము

అని చెప్పి తమ గురుభక్తిని వెల్లడిజేసిరి. చెఱుకువాడ వారి సాహసోత్కృష్టమైన గంభీరవాగ్ధార జాతి జనులను చైతన్యమొనర్చు ధారట. వీరి సహజమైన సాహిత్యలోకోక్తులు సరస్వతీదేవికి భూషణములట. వీరి నిర్భయమైన అహింసా సమర పరాక్రమము శత్రుగజములకు సింహగర్జనమట. వీరి దేశహితైక దీక్షా త్యాగశక్తి తన జాతి ప్రజలనుత్తేజితులను చేయు సంచలన శక్తిట. వీరి ప్రవర్తన ప్రజకు ఒరవడి దిద్దునదిట. వీరి పలుకు ప్రజకు సమ్మోహనాస్త్రమట. అట్టి శ్రీ చెఱుకువాడ వంశాబ్ధి చంద్రునకు శతకోటి నమస్కారములంటారు.

"గురుడయి ... ... ... ... ... ... ... ... ... వినుతించి పల్కెదన్"

అను పద్యములో మాకు గురువు, ఆంధ్రమాత గారాబు బిడ్డ, లక్షల మంది ప్రజలు తలలు వంచి పాదాభి వందనమొనర్తురు. అవలీలగా వారి మృదూక్తులచేత మనస్సులు కరుగునట్లుపన్యసించు నేర్పు, సొంపు నింపుగల నుడికారముతో గూడిన వాగ్ఝరి ప్రజలనాకర్షించునని చెప్పిరి. స్వాతంత్ర్యోద్యమ కాలములో ప్రజలు ఈయనను ఎంతగా అభిమానించెడివారో, ఎంతటి వాక్ప్రౌఢి గలవారో ఎంత మృదు భాషియో తెలియుచున్నది.

శ్రీ చెఱుకువాడ వారు ఒనరించిన సేవనిట్లు శ్లాఘించిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 95

సీ॥ "చాటినాడవుగ శ్రీ జాతీయ విద్యాధి

దేవతా సహజసందీప్తి తృప్తి

వ్యాప్తినొందించితివయ్య జీవితపు భీ

మా మాతృకవచ సంపత్తి శక్తి

కరతలామలకముగా తెల్పితివి రాజ

కీయము లెన్నొ జాతీయ ఫణతి।

ఒనర జాటితివి శాసనసభాకార్య ని

ర్వాహక నైజస్వభావ విధుల।

కృష్ణరాయని భావ మూహించి, మించి

భోగ రాట్సూక్తి నైజనైపుణి గ్రహించి

భావ విప్లవ నవ్య ప్రబంధ మల్లి

ముంచెదు, జనాళి వాగ్ధార మోహపరచి"[1]॥

అనర్గళ వాక్సుధాప్రౌఢ - శ్రీ చెఱుకువాడ 3వ పద్యము

వీరు తమ భావాల పరంపరను మనస్సులో నూహించుకొని, అంతకంటెను భోగరాజు పట్టాభి సీతారామయ్యగారి నిజనైపుణ్యమును గ్రహించుకొని, భావవిప్లవమనెడు క్రొత్త ప్రబంధమునల్లి జనులందరిని తన ముగ్ధమనోహరమైన వాగ్ధారతో మోహపడునట్లు చేసి, జాతీయ విద్యాదీప్తులను, జీవితభీమా శక్తి, సంపత్తిని జాతీయఫణతిలో రాజకీయములనెన్నో, శాసనసభా కార్యనిర్వాహక విధులను "స్వరాజ్య దర్పణము", "శాసన సభ్యులు" అను గ్రంథముల ద్వారా ప్రజలలో చాటిచెప్పిరి. వారు మూర్తీభవించిన రాజకీయ పరిజ్ఞాన బోధామృతములో లోకోక్తులు, స్వానుభవ వాక్చమత్కృతులు ప్రజలనుఱ్ఱూతలూగించేవి.

"పన్ను లొసంగు దేశజులపైఁబడి, పీలిచి పిప్పి జేసి, సం

పన్నులు, పేదలంచనక భారత మెల్లను బందెజేసె, నా

పన్నులఁగాచు, డీ ప్రభుత పట్టు సడల్పుడి, పట్టుదప్పు, మీ

పన్నుల గట్టకున్న, నిలువన్ గతిగాన" దటంచుఁ బల్కెదొ"॥[2]

అనర్గళ వాక్సుధాప్రౌఢ - శ్రీ చెఱుకువాడ 4వ పద్యము

బ్రిటిషు ప్రభుత్వము పన్నులుకట్టే దేశజుల మీదబడి పీల్చి వారిని పిప్పిజేసి, ధనవంతులు పేదలనికూడ ఆలోచించక భారత దేశమంతటిని పెద్ద బందిఖనాగా చేసెను. ఆపన్నులను గాచుడు. ఈ ప్రభుత్వము పట్టుసడల్పుడు. మీ పన్నులు గట్టకపోయిన నిలుచుటకు గతిలేదు. అని పల్కుచున్నావు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 96

ఊొమ్ము బాదుకొనుచు, కొంకె కట్టుపయి హస్తములు ఒక్కటిగా హత్తుకొనుచు నిల్వెత్తుగాలేచి, మడమలెత్తి త్రివిక్రమునివలె కంఠస్వరము పెంచి, ప్రచండమైన వాగ్ధారతో అందరిని ముగ్ధులను చేయునట. దీనిని బట్టి వారు ఎంతటి ఉపన్యాస చాతుర్యముగల వారో తెలియుచున్నది.

**మ॥ "దరియన్ ఖద్దరుధారివై, పురముతోల్తన్, పదిన్నాల్వనెం**
**బరు, "అచ్చాడి స్వదేశి" యంచనిరి, భీమాడిండిమాయంచు, ఈ**
**శ్వరచంద్రాయని వీర విక్రమ వచోవాచస్పతీ యంచుఁబి**
**ల్తురు గాంధేయుఁడవంచు నిన్నుగని సంతోషమ్మునన్ పొంగుచున్"[1]**

అనర్గళ వాక్సుధాప్రౌఢ - శ్రీ చెఱుకువాడ 6వ పద్యము

చెఱుకువాడ నరసింహంగారు గాంధీమార్గములో నడచినవారు. ఆయన మాట తు.చ. తప్పకుండా పాటించినవారు ఖద్దరు వస్త్రములనే అందులోను పధ్నాల్గవ నెంబరు వస్త్రములనే ధరించారట. "అచ్చాడి స్వదేశి" అని పిలిచిరట. ఇంకా భీమా ఢిండిమా అని ఈశ్వరచంద్రా అని వీర విక్రమ వచోవాచస్పతీయని, గాంధేయుడని వీరిని కీర్తించిరట. ఇట్లా గాంధీజి అడుగు జాడలలో నడచి గాంధేయులనిపించుకొన్న వారెంత మందియో గలరు. శ్రీ శర్మగారు కూడా గొప్ప గాంధేయవాదియే గదా!

1910వ సం॥లో శ్రీ బిపిన్‌చంద్రపాల్ గారి ప్రబోధమున ప్రఖ్యాత విద్యావేత్త, జాతీయ భావసంపన్నులునైన శ్రీ కోపల్లె హనుమంతరావుగారు, శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు, డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్య గారలచే స్థాపించబడిన బందరులోని ఆంధ్రాజాతీయ కళాశాలకు, ఒక జాతీయ భావానుభవ ఘటికుడగు ఉపాధ్యాయుడు కావాలని, శ్రీ చెఱకువారినచట ఉపాధ్యాయునిగా నియమించిరి. ఈ నియమింబడుటకు ముందు సేవాగ్రాం వెళ్ళి, గాంధీజీని దర్శించి, అహింస, స్వదేశి, మానవసేవ, ఖద్దరు మెదలగు ముఖ్యాంశముల హృద్గతము చేసికొన్న కర్మ దీక్షితుడు శ్రీ చెఱకువాడ వారు. సేవాగ్రాం నుంచి బందరు వచ్చిన తరువాత ఆయన వేషము, ముతక ఖద్దరు ధారణ చూచి మహానాయకులు కూడా నరసింహం గారిని 14 వ నెంబరు స్వదేశీ అని హేళన చేసేవారు.

ఈ రాఘవ శర్మ గారికి శ్రీ చెఱకువాడ వారితో 1-10-1921 సం॥నుండి సహవాసమేర్పడి, ఒక ఇంట్లోనే కాపురముండుటచే భోజన సమయములో తప్ప మిగతా సమయమంతా వెంటనంటి ప్రచారములో వారితో పాల్గొనే అదృష్టము కలిగినది. బైట ప్రచారమునకు వెళ్ళి రాత్రి ఇంటికి వచ్చిన తరువాత 1924

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 96బి

సం॥ ఏప్రిల్ నుండి రాత్రి పదిగంటల సమయము నుండి ఒక ఉర్దూ పండితుడు, మహమ్మదీయుని వద్ద ఉర్దూపాఠ్యపఠనములు పూర్తి చేసుకొనేవారు. ఉర్దూ భాషను తెలుగు భాషలోనికి అనువాదము చేయు శక్తి కూడా లభించినది.చెఱుకువాడ వారు జైలులో ఉండగా ఉర్దూ - ఇంగ్లీషు నిఘంటువు ఆధారంగా భాషాసేవయే గాక జ్యోతిషము కూడా కొంత అభ్యాసము చేసారు. అట్లా వారికి ఉర్దూ, జ్యోతిషములలో మంచి అనుభవము చేకూరినది.[1]

1922 సం॥ నుండి 5-6-1924 సం॥వరకు శ్రీ రాఘవ శర్మగారు బందరు పట్టణ కాంగ్రెసు కార్యదర్శి. చెఱుకువాడ వారు జిల్లా కాంగ్రెసు కార్యదర్శి. శ్రీ రాఘవ శర్మకు చెఱుకువాడ వారితో శరీరభేదమెఱుగని అనుయాయులుగా, ఇంటా-బైటా ప్రచారములో పాల్గొనే సదవకాశము లభించినది. ఈ సాహచర్యమే అమూల్యమగు శక్తి ప్రతిభ చేకూర్చినది. ఆనాటి కార్యకర్తలుగా వీరు చేసిన సేవ మరువరానిది. స్వచ్ఛంద సేవకుల ప్రమాణ పత్రములు మూడు భాగములుగా సప్లయి చేసి ప్రతిన క్రింద సంతకము చేసి ఒకటి జిల్లా కేంద్రమునకు, ఒకటి రాష్ట్ర కాంగ్రెసునకు పంపవలెను. ఇది జీవితమునకు, త్యాగమునకు బాసటగా నిలిచే జాతీయ సేవకుని దీక్షా పత్రమది.

ఆ పత్రముపై చేవ్రాలు పెట్టుటకు యెంతవారలు ముందుకు రాలేదు. ఆ ప్రతిజ్ఞ ఏమిటనగా, 'I dont ask any remuneration to my Family, if Iam shot dead.' "నా జీవితము గుండు దెబ్బకు గురియై నేను మరణించినప్పటికి నేను నాకుటుంబ పోషణ కేమాత్రము ప్రతిఫలము అర్థించను." అని అవి దీక్షా దినములు. ఇట్టి ప్రతిజ్ఞా పత్రముపై ముందు బందరు పట్టణ కాంగ్రెసు జిల్లా కార్యదర్శిగా శ్రీ రాఘవశర్మగారు కాంగ్రెసు జిల్లా కార్యదర్శిగా శ్రీ చెఱుకువాడవారు సంతకము పెట్టి తరువాత వారికి ఆదర్శప్రాయులైనారు. ఇట్టివి ఆనాటి కార్యకర్తల సేవాదీక్షలు.

చెఱుకువాడ వారు, రాఘవ శర్మ, తాడికొండ వీరభద్ర అయ్యావారలు బందరు చుట్టుప్రక్క ఐదు గ్రామాలలో పెడన, కప్పలదొడ్డి, మల్లవోలు, రాయవరం మొదలైన గ్రామాలలో 6000 చేనేత మగ్గాలుండేవి.వారు మిల్లునూలు నేత చేకొనక రాట్నపు నూలుతో నేత నేసినచో దేశానికి కావలసినంత ఖద్దరు అంది మహాత్ముడాశించిన స్వదేశీయ పరిశ్రమలకు బలము చేకూరునని ఆ నేతవారలకు హితబోధ చేసి ఖద్దరు నేతకు త్రిప్పుటకు సమావేశములు జరిపిరి. ఈ సమయములో ఎంతో కష్టపడాల్సివచ్చినది.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ "ఎందఱో మహనీయులు స్వాతంత్ర్య సమర యజ్ఞములో" పుట 94

బందరులో బందరుకాలువ (బోట్ల కాలువ) ఫిరంగి దిబ్బ సమీపమున ఆగిపోవును. ఈ ప్రదేశములో ప్రతి సాయంకాలము పెద్దలెందరో ముఖ్యముగా డాక్టరు పట్టాభిగారు, చెఱుకువాడ వారు, గురుజాడ రాఘవ శర్మగారు, స్వామి తత్త్వానంద, అయ్యంకి వెంకట రమణయ్యగారు మొదలగు వారెందరో సమావేశమై ఆనాటి రాజకీయ విషయాలెన్నిటినో చర్చించటం జరిగేది. వ్యర్థముగా ఊహాపోహలకు తావిచ్చేవారుకాదు. ఇవి తరువాత ఖండాంతర విషయాలను గురించి Bombay chronicle మొదలగు పత్రికలలో వచ్చేవి. వార పత్రికలైన పట్టాభి గారి జన్మభూమిలోను, ముట్నూరి వారి కృష్ణా పత్రిక లోను వెలువరించుట వలన ప్రజలకు స్వీయరాజ్యాంగ విషయాలను గూర్చి తెలిసికొనుటకు అవకాశముండేది. చెఱుకువాడ వారు ఏకసంధాగ్రాహి గనుక మరునాటి సభలో వాటిని తేటతెల్లముగా గంభీరోపన్యాసము చేసేసరికి శ్రోతలను రాజకీయమార్గోన్ముఖులను చేసినట్లయ్యేను.

ఈ విధముగా మహాత్మాగాంధీ ప్రారంభించిన అహింసాపూర్వక సత్యాగ్రహోద్యమములో సామాన్య ప్రజానీకానికి తన అనర్గళ గంభీరోపన్యాసములతో ఉత్తేజపరచి చేసిన దేశసేవ మరువరానిది.

## 13. ఆంధ్రరత్న - శ్రీదుగ్గిరాల: -

చీరాల - పేరాల అని చెప్పగానే, "రామదండు" అని తలచుకోగానే స్మృతిపథములో మెలగువారు "ఆంధ్రరత్న" శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు. శ్రీ శర్మగారు,

**సీ॥ "మాటిమాటికిని "శ్రీమద్రమారమణగో**
**విందు" యన్ ధీరతావేశభక్తి**
**గీతగోవింద సంగీత సమ్మోహ ప్ర**
**వంతి, ముంచెత్తు, విభ్రాంతసూక్తి**
**జాతీయ రుచుల, హాస్యప్రసంగాల, జ**
**నాళి నవ్వించు, ఊహా ప్రసక్తి**
**శృంగార భావలవంగీ కురంగీ ప్ర**
**సంగాల విలుచు, అభంగరక్తి**

**గీ॥ మోహనాస్త్రమ్ము రూపమ్ము, మొక్కవోని**
**ఆంధ్రసంస్కృతికిమ్ము ఆహ్లాద సహృద**

**యమ్ము, తీర్చిన 'ఆంధ్రరత్నము' దుగ్గి**

**రాల కులమానికమ్ము, గోపాలకృష్ణు**

**నభినుతించెద సుమ్ము నేనహరహమ్ము."[1]** ఆంధ్రరత్న - శ్రీ దుగ్గిరాల 1 వ పద్యము

అని అంటారు. మాటిమాటికి "శ్రీమద్రమారమణగోవింద" అని ఆవేశముతో పలుకుతుంటారట. ఎల్లప్పుడు గీతగోవింద సంగీత సమ్మోహనాస్త్ర బంధితులను చేస్తూ ఉంటారట. జాతీయ రుచులతో, హాస్య ప్రసంగాలతో జనాళిని నవ్విస్తూంటారట. వీరి రూపము జనులందరిచేత ఆకర్షింపబడునటువంటిదిట. ఆంధ్ర సంస్కృతికి మొక్కవోని ఆహ్లాద సహృదయమ్ము తీర్చిన ఆంధ్రరత్నమ్మట. దుగ్గిరాల కులమునకే తలమానికమట.అటువంటి శ్రీ గోపాలకృష్ణుని నేనెల్లప్పుడు అభినుతించెదను. అని అంటారు. ఇక్కడ శ్రీ శర్మగారి భక్తితత్త్వము వెల్లడి యగుచున్నది. జనులందరి చేత సమ్మోహింపజేయు రూపము - గీత గోవింద సంగీత సమ్మోహ స్రవంతిలో ముంచెత్తింపచేయుట - వీరి పేరు సాక్షాత్తు శ్రీ గోపాలకృష్ణుడగుట - ఆ శ్రీకృష్ణుడే సాక్షాత్తుగా ఈ గోపాలకృష్ణయ్య అనే భావములో ఉండిరి. వీరిలో ఆ శ్రీకృష్ణుని చూడగల్గిరి. అందరిలోను పరమాత్మ ఉంటాడు సరే. అది చూడగలుగుట భక్తునికి తప్ప అన్యునికి సాధ్యముగాదు. వీరు నిజమునకు గోపాలకృష్ణ భక్తులగుట వలననే ఈ విధముగా చెప్పగలిగిరి.

శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి రూపమునిట్లు వర్ణించిరి.

**"తలపై, ఖద్దరుకావిపాగ, మెడనందంబొప్ప, రుద్రాక్ష మా**

**లలు, వీకన్ భుజమంటుచున్, గటిని, వ్రేలాడంగన్ సంచి యు**

**జ్జ్వల ఫాలమ్మున, నెఱ్ఱనౌ తిలకమొప్పన్ గఱ్ఱచేబూని ల**

**క్షలుగా, మూగ జనమ్మునన్ గదలు, దీక్షాదక్షునిన్ గందుమే."**

ఆంధ్రరత్న - శ్రీ దుగ్గిరాల 2వ పద్యము

శ్రీ దుగ్గిరాలవారు ఖద్దరు అందులోను గోధుమ రంగులోనున్న తలపాగా ధరించి, మెడలో అందమొప్పునట్లుగా రుద్రాక్షమాలలు ధరించి, భజమునకు తగులుచు కటి ప్రదేశములో వ్రేలాడునట్లుగా ఒక సంచి తగిలించుకొని, ఫాల భాగములో ఎఱ్ఱని తిలకమును ధరించి, చేతిలో కఱ్ఱ పట్టుకొని, లక్షలమంది జనము ఆయన చుట్టూ మూగగా కదలి వెళ్ళిపోవుచున్న దీక్షాదక్షుడు అని వర్ణించిరి. శ్రీ దుగ్గిరాల వారిని చూడని వారికి ఈ పద్యము చదివినంత కళ్ళకు కట్టినట్లు దృగ్గోచరమగును. అట్లు చూపించగల నైపుణ్యము గలవారు శ్రీ శర్మగారు. వారు నిర్మించిన రామదండు గూర్చి,

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 94

**"రామచంద్రుండు లేనట్టి, రాచనగరు**
**పగిది చీరాల పేరాల, పాడువెట్టి**
**ప్రభుతనెదిరించి, నిర్మించె 'రామనగరు'**
**వీరభారత జాతీయ విప్లవ ప్ర**
**చండ నాయకమణి "రామదండుగూర్చి"**

ఆంధ్రరత్న - శ్రీ దుగ్గిరాల 3వ పద్యము

శ్రీరాముడు లేనట్టి రాచనగరు వలె చీరాల పేరాల పాడువెట్టగా ప్రభుత్వాన్ని ఎదిరించి మరల'రామనగరు' నిర్మించెను. 'రామదండును గూర్చిన వీర భారత జాతీయ విప్లవ ప్రచండ నాయకమణి శ్రీ గోపాలకృష్ణయ్య. వీరి నాయకత్వంలో చీరాల పేరాల పన్నుల నిరాకరణోద్యమం సాగింది. యావత్ భారత జాతినే కదలించి వేసింది.

**"కాకల్ తీరగ, వీర సైనికుల, శిక్షాదక్షులంజేసి, లో**
**న్రేకెత్తన్ నిజమానసాబ్జములు, భూరి త్యాగ వీర ప్రశో**
**భా కాంతుల్ చెలరేగ, జాతింగదలింపంజాలు, ధీరా! నమో**
**వాకమ్ముల్ పచరింతు, ముందడుగు, మోపన్, నీ పవిత్రావనిన్"[1]**

ఆంధ్రరత్న - శ్రీ దుగ్గిరాల 4వ పద్యము

ఈ పవిత్రమైన భారత దేశములో కాలుపెట్టగానే ఎంతోమంది వీరసైనికులను శిక్షాదక్షులను చేసి వారిలో దేశభక్తి  పురిగొల్పి త్యాగ వీర ప్రశోభా కాంతులు చెలరేగగా జాతినే కదలించి వేసిన ఓ దుగ్గిరాల ధీరా! నీకు నా నామోవాకములు అంటారు. చీరాల పేరాల సైనికులను ఒక్క త్రాటిపై నడిపించి వారిలో దేశభక్తి జాతీయాతాభావములు పెల్లుబుకునట్లుగాఁజేసి, ఎందరో సైనికులను సుశిక్షితులను చేసి నడిపించిన నాయక మణి శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు. వీరి నాయకత్వ లక్షణాలచే మొత్తము భారత జాతినే కదలించివేసిరి.

## 14. 'దేశభక్త' - శ్రీ కొండా వెంకటప్పయ్య: -

దేశము నిర్వీర్యము, నిస్తేజము అయినప్పుడు, బ్రతుకు భారమై మానవతా విధ్వంసము జరిగినప్పుడు, ధర్మనిందితమైన మార్గాచరణమే ముఖ్యమని, తమ జాతీయాభిమానము విస్తృతముగా నిల్పుకొనుటకు ధీరులైనవారు, మహాత్ములైనవారు ఈ భూమిపై ఉద్భవింతురట. అట్టి మహాత్ములలో

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 95

నొకరు శ్రీ దేశభక్త కొండా వెంకటప్పయ్యగారు. వీరి నాయకత్వములో పెదనందిపాడులో ఉప్పు సత్యాగ్రహము జరిగినది. వీరు శ్రీ కోటయామాత్య పుత్రులు. బుచ్చమ కుమారులు మృదు సత్యవాక్యరసభావులు.

**"సుచరిత్రుండవు, న్యాయవాదనల దక్షుండైతివయ్యా! యని**
**ర్వచనీయంబగు, సాధానాతతికి కార్యస్థానమైసాగె, మా**
**'మచిలీ బందరు' నీదు బాల్యమున, నీమంబొప్ప, యోగ్యంబగున్**
**రచనల్ గూర్చితి, సంప్రదాయమగు మార్గంబింతయున్ వీడకే".[1]**

దేశభక్త - 3వ పద్యము

మీరు సచరిత్రులు. నాయవాదనల దక్షులు. మీ బాల్యములో మా బందరుపట్టణము అనిర్వచనీయమైన కార్యసాధనకు స్థానమైనది. నీమముతో యోగ్యమైన రచనలు చేసితిరి. సంప్రదాయ మార్గమును విడిచిపెట్టకుండా సంచరించితిరి. భక్తుల హృదయాలందుండెడి ఓ కృపాసాగరా! మీ జీవితము నిస్వార్ధముగా సర్వమానవ కల్యాణార్ధము వినియోగించి, సాధించిన ముక్తుండవు అంటారు. వీరి జీవితమంతా స్వాతంత్ర్య సంగ్రామములోనే గడచిపోయినది.

కాకలు తీరిన ఆంధ్రయోధులను విస్తృత సంఖ్యలో స్వీకరించి ప్రజానీకమును నడిపించు నిన్నుఁజూచి గాంధీజీ 'కొండాజీ' అనుచు, ఉత్తమ చరిత్ర గలవాడవని, ధీనిధివని, దండికొండవని నిన్ను అభిమానించును. అని చెప్పిరి. గాంధీజీ ప్రధాన నాయకుడై, మిగిలిన వారిని సమర్ధులు, ఉత్తమోత్తములని భావించి ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్క మహాత్ముని నాయకునిగా తీర్చి దిద్దెను. అట్టివారిలో పెదనందిపాడు ప్రాంతానికి శ్రీ దేశభక్త కొండా వెంకటప్పయ్యగారు. వీరి నాయకత్వములో ప్రజలు ఎట్లా నడచిరో,

**సీ॥ "బెదరించి యదలించు, బ్రిటిషుసింగపుఁజూలు**
**బట్టియాటాడఁగన్పట్టువార,**
**పరవళ్ళుద్రొక్కెడి బానిసోద్యోగుల**
**యాట గట్టింప, వెన్నాడువారు**
**బానిస చిహ్నమౌ, యూనియన్ జాకుఁస్వ**
**స్థానమీయకె, దింపబూనువారు**
**తఱలి విదేశ వస్త్రములకు నగ్ని యం**
**టించి, దహించి, క్రీడించువారు**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 89

**నేల యీనినయట్లు, సందీక ప్రజలు**
**సాగిరాంధ్ర సత్యాగ్రహ సమరభూమి**
**ధీరులై స్వీయరాజ్యంబు చూఱగొనఁగ**
**ఆంధ్రనాయక! నీ యానననుసరించి."[1]**

దేశభక్త - 6వ పద్యము

ఓ ఆంధ్రనాయకా! నీ ఆజ్ఞననుసరించి సత్యాగ్రహులు తమ రాజ్యమును రక్షించుకొనుటకు ధైర్యము గలవారై బ్రిటిషు సింగమును అదలించి, బెదరించి, పట్టుకొని ఆట్లాడువారు కొంతమంది. పరవళ్ళు త్రొక్కుచున్న బానిసోద్యోగుల ఆట గట్టించువారు వారిని వెంబడించువారు బానిస చిహ్నమైన యూనియన్ జాకు స్థానములో తమకు స్థానమివ్వలేదని దానిని దింపివేయువారు, విదేశ వస్త్రములను అగ్నికాహుతి చేసి క్రీడించువారు నేల ఈనినయట్లు సందీక ప్రజలు సాగిరి.

కరణములు శిస్తుదస్తు వసూలు చేయకుండా దస్త్రములు కట్టగట్టి విసిరిరట. జప్తు చేసిన ఆస్తి చౌకగా వేలము వేయుటకు పాట పాడగా పాట పాడుటకు ఎవడు రావడము లేదుట. ఏ వస్తువులనైనా బైటికి తీసుకొని వెళ్దామంటే కాడి క్రిందకు యెద్దు కదలి రావడం లేదుట. నిప్పు, నీరు, పాలు, ఉప్పు కూడా దొరకట్లేదుట. బాలుడు కూడ పలకరించడానికి ఇష్టపడుట లేదుట. ప్రజలందరు శ్రీ వేంకటప్పయ్యగారి నాయకత్వములో తమ నాయకుడని ఆంధ్రదేశమంతా ఉప్పొంగి పోవునట్లు బ్రిటీషు పాలన స్తంభింపజేయుటకు పెదనందిపాడు ప్రజలందరు వీర కంకణములుఁదాల్చిరి.అని వర్ణించిరి. ఒక నాయకుని ఆధిపత్యము క్రింద కనుసన్నలలో ఆనాటి ప్రజలు ఎట్లా నడచుకొనిరో చక్కగా కళ్ళకు కట్టినట్లు వర్ణించిరి.

బ్రిటీషు వారు చేసిన అకృత్యములనిట్లు వర్ణించిరి.

**సీ॥ "చూడియావుల దనుమాడి భక్షించు, రా**
**క్షససేన ధాటికి, కదలిపోక!**
**మానినీ సతులవమానింప వెడలు, మూ**
**ర్ఖులకు,లొంగక, శాంతి గోలుపోక**
**కట్టెదుటన్ కొల్లగొట్టు యాస్తుల కాగ్ర**
**హింప, క హింస యొక్కింత విడక**
**రేయి బవలు దద్దరిల్లు నటుల్ సేన**
**ప్రేల్చు మ్రోతలకుఁగంపింపఁబోక**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 90

గీ॥ "నాయికుల యానపై౯పెదనందిపాడు
శాసనోల్లంఘనమున౯బ్రశంసనొందె
అపర 'బార్డోలి'యనమన మాంధ్రభూమి
ప్రబల యశమందె, నీ యాధిపత్యమంది."[1]

దేశభక్త - 9వ పద్యము

కొండా వెంకటప్పయ్య గారి ఆధిపత్యములో బ్రిటీషువారు చూడియావులను చంపి భక్షించు రాక్షససేన కూడ ఇట్టి వారి ధాటికి కదలిపోకుండా నిలిచి ఉన్నారట. స్త్రీలను అవమానించు మూర్ఖులకు లొంగిపోకుండా, శాంతిని కోల్పోవకుండా నిలబడ్డారట. కట్టెదుట ఆస్తులను కొల్లగొట్టుటకు పోతుంటే వాటికి కోపగించుకొని హింసకు పాల్పడకుండా - అహింస కొంచెమైనా విడువకుండా, రాత్రింబవళ్ళు సేనలు ప్రేల్చు మ్రోతలకు దద్దరిల్లి కంపించకుండగా, నాయకుల ఆజ్ఞపై పెదనందిపాడు శాసనోల్లంఘన ఉద్యమము చరిత్రలో ప్రసిద్ధి గనెను. మన ఆంధ్రభూమి అపర బార్డోలి అని ప్రఖ్యాతి వహించెను.

రాజతంత్రజ్ఞుడు, ప్రాజ్ఞుడు, ఘనుడు పట్టాభి సీతారామయ్యగారు కార్యదర్శికాగా, శారదా నిలయుడు, సంఘ సంస్కర్తయైన శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారు చేయూతనీయగా చీరాల వీరుడు, ధీరుడైన శ్రీ గోపాల కృష్ణయ్యగారు అండదండగానుండగా, ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశము పంతులు గారు వెనువెంట తోడుగా రాగా, కన్నెగంటి సూర్యనారాయణ, శరణు రామస్వామిచౌదరి, గుళ్ళపల్లి పున్నయ్యశాస్త్రి మొదలగు ఎందరో నాయకులు వెంటరాగా, కర్తపురి మండలావనికి గద్దెనెక్కిన మా తెన్గుతేడ! నీకు జోహారు!

గీ॥ "ఆంధ్రనాయకరత్న! జోహారు నీకు
ధీరమణి!దేశభక్త!జోహారునీకు
అమల గుణ!సత్యభాష! జోహారునీకు
త్యాగధన!నిష్కళంక!జోహారునీకు".[2]

దేశభక్త - 12వ పద్యము

అంటారు. ఇట్టిది వీరితోటి నాయకులందుండెడి అభిమానము.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 91
2. శ్రీ గురుజాడ రాఘవశర్మ స్వాతంత్ర్యపథము పుట 92

## 15. శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు : -

భారత జాతీయ రాష్ట్రపతి మాన్యశ్రీ డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ పండితులను గురించి శ్రీ రాఘవశర్మ,

శ్రీమాన్,

**"శ్రవణ పేయంబయి, భువన మోహనమయి**
**ప్రవహించు వాణీస్రవంతి, సతము**
**శ్రమ నివారకమయి సమయ విస్ఫూర్తియై**
**సంతసమిడు సాహచర్యమెలమి**
**ఆదర్శ పథముల, వేదాంత వీధుల**
**ఆనందలహరి, విహారమెపుడు**
**హాయిగా, ప్రజహృదయాల రంజిల్లెడి**
**భారతావనీ పరిపాలనమ్ము**
**కీర్తిమండిత వినుత! విస్తృత సుగీత**
**భరత జాతీయ హృదయ సుస్థిర కిరీట**
**ధారివైన రాధాకృష్ణ! భూరిధిషణ**
**వినుత! నీకగు జయము, దిగ్విజయమెపుడు"[1]**

శ్రీ రాధాకృష్ణ పండితుల వాణీ స్రవంతి శ్రవణ పేయము, భువన మోహనమట. ఆయనతోడి సాహచర్యము శ్రమనివారకము. సమయ విస్ఫూర్తియై ఆనందము కలుగునట. ఆయన ఎప్పుడు ఆదర్శ పథములందు, వేదాంత వీధులందు విహారము జేయుచు ఆనందలహరిలో నోలలాడునట. ప్రజా హృదయాల రంజిల్లెడి భారతావనీ పరిపాలనమట. అట్టి రాధాకృష్ణ పండితున కెప్పుడు జయమగుగాక అంటారు.

భారత ధాత్రియందు శుభకల్యాణపరంపరలు నిత్యము వెల్గునటుల వారి పరిపాలన విద్యుత్ప్రాభవోపేతమై, జనతా సౌఖ్య ప్రదంబౌచు సాగవలెనని కోరుకుంటారు. శ్రీ రాధాకృష్ణ పండితులు రాష్ట్రపతియౌనాటికి జవహరలాల్ నెహ్రూకి తెలిసి సాక్షాత్తు శ్రీ కృష్ణుడే ఈతడు అని, శ్రీ భువన ఖ్యాతిగడించి నట్టి జనతా పూజ్యుండని, తమ రాష్ట్రాధిపతి, మాన్యుడు అని మురిసిపోయెను. కాని మీ పరిపాలన సంతృప్తిగా చూడలేకపోయెను గదా! అని విలపించిరి. చెప్పుకోదగిన వారు రాజకీయ రంగములో విద్వత్పూజ్యులైనవారు ఈనాడు లేరు. మీస్వశక్తిచేత యువకులను శ్రేయోమార్గములో త్రిప్పదగును. మీరు శ్రేయోమార్గ సందర్శకులు,

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

భారత భాగ్యదాతలు, ఆంధ్రశ్రీసుపుత్రులు. ఓ రాధాకృష్ణ విద్వన్మణీ! మీరు వ్రేపల్లెలో జన్మించిరి. అంతకంటెను భారతభూమిని మీ లీలలచేత, మేధాసంపత్తితో పార్థ సారథిగా క్షేత్రమును బ్రతిష్ఠించిరి. ఓ సర్వేపల్లి కులవార్ధిచంద్రా! విద్యా పూర్ణులు, మంత్రులు సహాయము చేయగా భరతశ్రీ వెల్గునట్లుగా పాలింపుము అంటారు.

ఇక్కడ 'సర్వేపల్లి' లోని 'వ్రేపల్లె'ను తీసికొని వారి పేరులోని "రాధాకృష్ణ"ను గ్రహించి సాక్షాత్తు ఆ వ్రేపల్లెలోని శ్రీ కృష్ణుడే ఈ సర్వేపల్లి రాధాకృష్ణుడని, భారతధాత్రిని పాలించుటకవతరించెనని భావించిరి. జవహర్‌లాల్ నెహ్రూ అంతటి మహానాయకుడు వీరు రాష్ట్రపతి యైరని మురిసిపోవుట సామాన్యముగాదు కదా!

శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులను చూడగా శ్రీ శర్మ గారికి కలిగిన భావము,

గంభీరహృదయము గలిగినవారట. అంత రాష్ట్రపతి పదవిలోనున్నను, మంత్రి, సేవకులతో కూడియున్నను, తన పీఠము దిగివచ్చి కరములు జోడించి, బహుమాన పురస్సర దృష్టితో పిలువగా, అంతులేని భక్తి వారిపై కలుగగా తలవంచి నమస్కరించితిని. తమ సమీపమందలి ఆసనముపై కూర్చుండఁజేసి నన్ను నెమ్మదిగా పలుకరించి, చిఱునవ్వుతో మెల్లగా నా నివాసము, జీవించినకాలము, జీవితమును గూర్చిన విశేషములు ప్రశ్నలు వేయగా సమాధానం జెప్పితిని. నా వంశమును, పావనమైన నివాస స్థానము మచిలీపట్టణమును, శ్రీ పట్టాభి మహాశయుని సాంగత్యమును, తెనుగుఁదల్లి పదాబ్జసేవను, జాతీయానుబంధమ్మును, శారదాకటాక్ష శ్రీ విశేషమ్ములను వివరించితిని అని పద్యాలలో వ్రాసికొనిరి.

**"ప్రేరేపించి కదల్చినట్టి మధురా బృందావనీవాసుఁడౌ**
**శ్రీ రాధా రమణీ మనోహరుడు, శ్రీ కృష్ణుండు, ఢిల్లీ పురిన్**
**జేరెన్ గారణమౌటయున్ మిగుల సంసిద్ధించె దర్శింపుఁదత్**
**కారుణ్యామృత పూర్ణునిన్ మఱల రాధాకృష్ణ రూపమ్మునన్"॥**[1]

మధురా బృందావనీ వాసుడు శ్రీ రాధారమణుడైన శ్రీకృష్ణుడు ప్రేరేపించి కదల్చినాడట. వీరు ఢిల్లీకి చేరటము తటస్థించినదట. ఆ కారుణ్యామృత పూర్ణుడైన శ్రీ కృష్ణుడు మఱల రాధాకృష్ణ పండితుల రూపములో దర్శనమిచ్చినాడట. ఏమి భక్తిపారవశ్యము - హృదయము భక్తి సంయుతమై యున్నప్పుడు

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

ప్రతి వస్తువు - ప్రతిరూపములోను పరమాత్ముని చూడగలుగు అదృష్టము ఎవరికో గాని అందరికి సాధ్యము గాదు. శ్రీ శర్మగారి ఉపాసనా బలమట్టిది. ఎంతటి పండితుడైనను ఎదుటివారిలోని శక్తిని చూడగలుగుట అందరికి సాధ్యము గాదు కదా!

శ్రీ శర్మగారు వ్రాసిన గ్రంథములను, అందలి విశేషములను తెలిసికొనినారట. వీరు చెప్పిన జ్యోతిష విషయాలను గూడ శ్రద్ధగా గ్రహించినారని వ్రాసికొన్నారు. దేశమునందలి దుర్భిక్ష దారిద్ర్య దేశ స్థితులను గూర్చిన చర్చచేశారు. అవును! ఇదిగడ్డు కాలము, శత్రువులెవరో బైటవారులేరు. మనవారే శత్రువులను మాట వాస్తవము. ఇంకా తొమ్మిది నెలలు సహింపవలెను అని జాగ్రత్తలు చెప్పిరి. తమ దర్శన భాగ్యము కలిగినది. దానికి నాకృతజ్ఞతలు అని తెలిపి వెళ్ళబోవుచుండగా చేయిపట్టుకొని ఆపి, ఒకరిని పిలిచి ధనమునిచ్చి మీరు సన్మానము జేయుడని చెప్పగా వారు సన్మానించిరి. అని వారే ఒక పుస్తకములో వ్రాసికొనిరి[1].

**ఉ॥ "స్వాంతము చల్లనౌకడు రసజ్ఞుడు, ప్రాజ్ఞుడు, మించి ఖండ ఖం**
**డాంత రకీర్తిశాలి, వినయాన్వితుఁ డంచిత భర్మ్య హర్మ్య సౌ**
**ధాంతరవాసి, రాష్ట్రపతి యంతరమేడ, విశేషమేమి, ర**
**వ్వంతయులేని రాఘవుని యంతరమేడ, సమాగమంబయెన్"॥** [2]

అమృతహృదయము గలిగిన రసజ్ఞుడు, ప్రాజ్ఞుడు, ఖండఖండాంతముల ఖ్యాతిగన్నవారు, వినయాన్వితుడు, అయిన రాష్ట్రపతి రాధాకృష్ణకు, రాఘవుడునైన నాకు అంతరమెక్కడ - మేమిద్దరము ఇక్కడ సమాగమమైనాము. అని ఆశ్చర్యపోతారు.

**"నీ కారుణ్యకటాక్ష వీక్షణములున్ నీమంజువాక్కుల్ తమిన్**
**సాకన్ గల్గుఁనుపజ్ఞతాగుణము, వెంటన్ సాగి, ద్వారాంతమున్**
**వీకన్ బంపుట, నీకెచెల్లును, నిగర్వీ! ధీర! సర్వజ్ఞ! రా**
**ధాకృష్ణా! భరతావనీ హృదయనేతా! నానమోవాకముల్"**

భగవంతుని నమ్ముకున్నవారికి ఎక్కడా అవమానములంటూ జరుగవు. గౌరవములే. రాధాకృష్ణ పండితులు నిగర్వి. ధీరులు-సర్వజ్ఞులు. వారి కారుణ్యకటాక్ష వీక్షణములు, మనోహరమైన వాక్కులు ప్రేమతో

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

సాగనంపు ఉపజ్ఞతాగుణము - ద్వారము వరకు వచ్చి వీడ్కోలు చెప్పుట మీకే చెల్లును. భరతావనీ హృదయనేతా! రాధాకృష్ణా! నానమోవాకముల్ అని అంటారు. దీనిని బట్టి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులచే ఎంతగా గౌరవింపబడిరో తెలియుచున్నది.

భారత రాష్ట్రాధినేతయైన శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణతో సమాగమము కేవలము శ్రీ బృందావన వాసుదేవుడైన శ్రీ కృష్ణుని సంకల్పము మాత్రమే గాని వేరొండుగాదు.

**"ననుఁబ్రేరేచి, తృతీయ దర్శనమిడన్ యాత్రార్థమై జేరుటల్**
**ఘన సందర్శన భాగ్యమిచ్చుట, మఱింకన్ ఢిల్లీకిన్ జేర్చుటల్**
**తనివిందీఱఁగ రాష్ట్రనేతయగు, రాధాకృష్ణు దర్శించుటల్**
**మనమందూహయొనర్పఁ జిత్రము, గ్రహింపన్ నీదు సంకల్పముల్"**[1]

నన్ను ప్రేరేపించి నీ దర్శనార్థమై యాత్ర జేయుచు సందర్శన భాగ్యము కలుగచేయుట, అందులోను ఢిల్లీకి చేర్చుట, తృప్తి దీఱునట్లుగా రాష్ట్రనేతయైన రాధాకృష్ణుని దర్శించుట మనస్సులో ఒక్కసారి ఊహించుకుంటే చిత్రముగా ఉన్నది. నిజముగా ఇది నీ సంకల్పమే సుమా! అని అంటారు. మనచేత ఒక పని చేయించేవాడు, పలికించేవాడు, నడిపించేవాడు ఆ పరమాత్మయే, భగవత్సంకల్పములేనిదే ఏది చేయుట మనవల్లకాదు.

శ్రీ రాధాకృష్ణ పండిత దర్శనానంతరము వీరి కృతజ్ఞతా భావమెట్టిదో చూడుడు: -

**"సురుచిర సుప్రసన్న పరిశోభిత రమ్యకళా ప్రపూర్ణ సుం**
**దరవదనారవిందు, జనతా హితరంజిత భారతావనీ**
**స్థిరతర సౌఖ్యదాతను, సుధీవరునిన్ నిజరాష్ట్రనేతనున్**
**నిరుపమ పాండితీఘన మనీషిని గంటినిమంటి, ధన్యుడన్"**[2]

ప్రసన్నమైన సురుచిర దరహాసవదనుని, జనుల హితముగా పరిపాలించు భారతావనీ స్థిరతర సౌఖ్యదాతను సుధీవరుని, నిరుపమ పాండితీఘన మనీషిని - నిజరాష్ట్రనేతను చూచాను - నాజన్మ ధన్యమైనది అని అంటారు. మహాత్ముల సందర్శన భాగ్యము కూడ అందరికి కలుగదు. ఎక్కడో పుణ్యాత్ములకు గాని. అందువలన శ్రీ రామకృష్ణుల చూచుట వీరు తమ జన్మ ధన్యమైనట్లుగా భావించిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

# అముద్రిత గ్రంథములు

# అముద్రిత గ్రంథములు

## 6.1 ఉత్తర దక్షిణదేశ పవిత్రయాత్రా స్థలములు: -

### 1. శ్రీశైలము: -

'కవిశేఖర' శ్రీ గురుజాడ రాఘవశర్మ గారు ఉత్తర, దక్షిణ భారతదేశమునందలి ఎన్నో పవిత్ర యాత్రా స్థలములను, వివిధ దేవాలయములను సందర్శించిరి. ఆ సందర్భములో ఆయా దేవతలపై ఎన్నో పద్యకుసుమాలను రచించి సమర్పించుట జరిగినది. శ్రీ విశ్వావసు నామ సంవత్సరము ఫాల్గుణమాసములో అనగా ది. 18-3-1966 సంవత్సరములో శ్రీశైల యాత్ర చేసిరి. దానిని పద్యములలో మనోహరముగా వర్ణించిరి.

**"శ్రీశైలాభ్రనివాస! భక్తవరదా! శ్రీ చిన్మయాకార! లో**
**కేశా! ఈశా! సురేంద్రవందిత! మనఃక్లేశాపహారీ! కృపా**
**రాశీ! శ్రీ భ్రమరాంబికా హృదయపర్యంక ప్రకాశా! నభః**
**కేశా! శంకర! మల్లికార్జున! స భక్తిన్ నిన్నుఁగీర్తించెదన్"**[1]

అని శ్రీశైల మల్లికార్జున విభుని ప్రార్థించిరి. ఆయన శ్రీ శైలమనే కొండమీద నివాసముండెడివాడట. భక్తుల కోరికలు దీర్చేవాడట. దేవతలందరి చేత నమస్కరింపదగినవాడట. మనస్సులలో నుండే క్లేశాలను అపహరించువాడట. కృపాసముద్రుడట. శ్రీ భ్రమరాంబా హృదయ పర్యంకము మీద ప్రకాశించువాడట. పిమ్మట శ్రీశైల పర్వతమును చేరునపుడు దారిలో కనబడు దృశ్యముల నీరీతిగా వర్ణించిరి.

**సీ॥ "వలయ వలయమ్ములఁబ్రాకుచుఁబర్వత**
**తోరణ పంక్తులదూటి, దాటి**
**గట్టుల మిట్టల కలిన పాషాణ ని**
**ర్జల భూమి, జనపదమ్ములను మెట్టి**
**చిమ్మ చీకటి నిండగ్రమ్ము కారడవుల**
**లోతులోయలను, వాలుకల గడచి**
**కెంపు సంజాయల, గిరిశిఖరమ్ముల**
**వని పర్వులిడు, జంతుగణముఁగాంచి**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

గీ॥ జన్మకిదె చేరినాము, శ్రీశైలదేవ
తా మహాక్షేత్రమతి పవిత్రస్థలమ్ము
భాసురానంద ధామమ్ము భక్తకల్ప
కమ్ము, భ్రమరాంబికా మల్లికార్జునాత్మ
వాస లాసిత నవ్యకైలాసితమ్ము"[1]

ప్రయాణమై, వెళ్ళుచున్నప్పుడు వలయాలు వలయాలుగా ప్రాకుచున్న పర్వతపంక్తులు, అవిదాటి గట్టులుమిట్టలు దాటి పాషాణమయమైన నిర్జలభూమి, అటు పిమ్మట జనపదమ్ములు, లోయలలో చిమ్మచీకటితో నిండిన కారడవులు. గిరిశిఖరములపై కెంపు వర్ణములో భాసించు సంధ్యాకాంతి, వనములో పరుగులుపెట్టు జంతుగణమునుచూస్తే ఈ జన్మకి చేరినాము అని అనిపించినదిట. ఆ శ్రీశైలము భ్రమరాంబికా మల్లికార్జునుల ఆత్మ వాసవిలసితమైన నవ్యకైలాసమట. ఓ మల్లికార్జున ప్రభూ! రమణీయమైన నీ గిరిశిఖరమునుగాంచిన వారికి పునర్జన్మ లేదన్న లక్ష్యమే మమ్మందరని తోడితెచ్చినది. అని చెప్పి నాలో నాకే ఆశ్చర్యము కలుగుచున్నది. వైకుంఠమో, నాకలోకమో, కైలాసమో తెలిసికోలేకుండా ఉన్నాను. ఇది రమ్యతర శృంగారైకధామము. నేనే లోకములో నుంటినో తెలియకున్నాను. "స్వీయసంసారమున్ సాలోక్యంబొసగంగఁబిల్చితివె! శ్రీశైలధిపా! సత్క ృపన్" అంటారు. మనలో ఉండే మమకారమును అహంకారమును విడిచిపెట్టి నీ పదయుగ్మముల నాశ్రయించినవారికి సాయుజ్యములభించునని పల్కుదురు. దేవా! శంకరా! నీవు భక్తప్రసన్న ప్రభువుగదా! నాహృదబ్జము నీపాదసరోజ యుగ్మమునఁజేర్పుము. నీవే నా చిత్తమును గ్రహించి మదిలో జాలి చూపి నీ సేవ చేసికొనుటకనుజ్ఞనిచ్చి ఇతర ఆలోచనల నణచి, భక్తితో నిన్ను పూజించునట్లు అనుగ్రహించి నా కష్టములు పోవునట్లుగా చేసి నన్ను రక్షించుటకనుగ్రహించి దయసేయుము. నా మొర ఆలకించి జాలితో 'సరిలే!' గ్రహించినాను లేరా! నీ మనస్సు గ్రహించినాను. అభయమిచ్చినాను లేర! ఇంక నీ అభీష్టము ఫలించునను అమృతపు పల్కులు నాజన్మ సార్థకతనొందునట్లుగాఁబల్కవె! మల్లికార్జునా! అని,

శా॥ "నానాజన్మపరంపరా జనిత తీక్ష్ణ క్రూర పాపౌఘమున్
బోనాడన్ సుకృతప్రవాహ లహరీ భూత ప్రభోద్దామమై
ప్రాణుల్ ముట్టి తరింపఁబావన ధునీ, పాతాళ గంగాజల
స్థానంబందున, స్నానమాడితిమి, శ్రీశైలాంతరాళమ్మునన్"[2]

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

ఎన్నో జన్మలనుండి వచ్చే క్రూరమైన పాపాలను తన ప్రవాహలహరులచే పోగొట్టే పావన గంగా జలములో స్నానమాడితిని. ఆ గంగానది,

> **"నీలపు మేఘమాల, పయనింపగ, సొంపుగనింగి, పచ్చనై**
> **క్రాలెడి వృక్ష సంతతి, యగాధమునై, కొననున్నతంబగున్**
> **శైలతటమ్మునన్ వడిగ, జాఱు, పవిత్ర జల ప్రవాహ పా**
> **తాళ జలాశయమ్ము, భవతారిణి, పావని, గంగఁగంటిఁగా॥"[1]**

నీలమైన మేఘముల వరుసలు పయనిస్తూండగా, ఆకాశము అందముగా ఉండి, పచ్చగా ప్రకాశిస్తున్న వృక్షసమూహము, అగాధములు, ఎత్తైన శిఖర భాగములనుండి జాలువాఱు పవిత్రజలప్రవాహము పాతాళ జలాశయము పావని, భవతారిణి అయిన గంగను చూశాను అని వర్ణించిరి. ఇక్కడ ప్రకృతిని మనోహరముగా చిత్రీకరించిరి. నీలమైన మేఘాల వరుసలతో ఆకాశము అందముగా ఉన్నదని, చెట్లు పచ్చగా ప్రకాశిస్తుండగా లోయలు, ఆ కొండ శిఖరములపై నుండి పడే జలప్రవాహమును కన్నులకు కట్టినట్లు వర్ణించిరి. ఇంకను ఈ జలపాతములనంటి ఉన్నత వేగముతో, జాజ్వల్యమైన కాంతులను వెదజల్లెడి విద్యుత్కేంద్రరమ్యోన్నతస్థలిని, నిత్యము శిలా పరిశ్రమలో దీక్షాదక్షులై కార్యనిమగ్నులైన యంత్రకళా విశారదులను చూచే భాగ్యము కల్గినదనిచెప్పి, యజ్ఞయాగాది క్రతువులు గొప్పగొప్ప దినములు చేయగా సరికాదు. ఈ శరీర సుఖములను విడిచి ముముక్షుండనౌదును. శ్రీశైల శిఖరమును చూచినంత మాత్రముననే పునర్జన్మ లేనేలేదట. ఈ జగత్తులో సమస్తము నీవేయని నీ సమ్ముఖమునకు వచ్చితిని. హాయిగా నిన్ను చూచితిని. మల్లికార్జునుడవై చెలువొందెడు నిన్ను భక్తితో మల్లయ అని పిలుతురు. బిడ్డల పల్కులంటే నీకభిమానము. నీ లీలలు ఎట్లు కూర్చెదవో! చేర్చెదవో! నీ సన్నిధి మాకు శుభప్రదము. కొండపైకి వచ్చిన మమ్మందఱను ఆదుకొమ్ము. ఎప్పుడు అభీష్టము తీరునట్లుగా మనము రంజిల్లునట్లుగా సేవచేయుదుము. నీకృప జిల్కుచు మాకభయము నిమ్ము. జీవితమంతయు నీసత్కృపనొందునట్లు చేయుము. ఏదో పూర్వజన్మసుకృతమువలన నీ ఆనంద సమ్మోద సంపదనుఁగన్విందుగ నొందుటకు ఇక్కడకు పిలుచుకుని వచ్చావా! సత్కృపా సదనా! సద్భక్తులకు దివ్యమైన అభయముల నొసంగువాడు. మల్లికార్జున! నమోవాకములర్పించెదన్ అంటారు. శ్రీశైలము దర్శించవలెనను బుద్ధి కలుగుట పూర్వజన్మసుకృతమట. ఆయన ఆనంద సంపదను కన్విందుగా చూచుటకు ఆయనే పిలిపించుకున్నాడట. తన భక్తుల కోరికలు

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

నెరవేర్చుటకు భగవంతుడే వారిని తన దగ్గరకు స్వయముగా రప్పించుకొనును. అది కాకపోయినచో ఎన్ని సార్లు వెళ్ళాలని ప్రయత్నించినా వెళ్ళుటకు సాధ్యముకాదు. చూచే అదృష్టము, అవకాశమును కూడ భగవంతుడే కల్పించునని చెప్పుట భావము. ఓ మల్లయా! నీ నెత్తిమీద కాండ్రుమని ఉమ్మి వేయలేను. కపాలము జిందునట్లు భాండమును మొత్తలేను. కాళ్ళుసాచి నీపై మోపలేను. వికృతమగునట్లు విబూది పూయలేను. గ్రుక్క దిప్పుకోలేనంతగా నీమీద నీటి ప్రవాహమును నింపలేను. ఇంక నీ ఇష్టము నీకు ఏ విధముగా సేవ చేసి తరించాలో నీవే తెలియజెప్పుము అంటారు. ఇందు శివానందలహరి యందలి

శ్లో॥ **"మార్గావర్తి తపాదు కాపశుపతెరంగస్య కూర్చాయతె**
**గండూషాంబు నిషేచనంపురరిపోర్దివ్యాభిషేకాయతే**
**కించిద్భక్షిత మాంస శేష కబళం నవ్యోపహారాయతె**
**భక్తిఃకిం నకరోత్యహొవనచరో భక్తావతం సాయతె॥"[1]**

ఆహాహా! ఏమి శివభక్తి మహిమ చమత్కారము? చిరకాలము దారి నడచి ప్రాతఁగిలిపోయిన కాలి చెప్పు ఆ కాళహస్తీశ్వరునకు కనుబొమల నడిమి చోటుగా జేర్పనయ్యె. ఒక భక్తుడు పుక్కిలించి యుమిసిన నీరు ఆ త్రిపురహరునకు గంగా జలాభిషేకమయినది. సగము కొఱికి తినగా మిగిలిన మాంసఖండము ఆ జగదీశ్వరునకు మహానివేదన ద్రవ్యముగా నుపయోగపడినది. అడవులందిరుగుచు మృగాది హింసకుండైన కిరాతుండు భక్తాగ్రగణ్యుండయ్యె. ఇంత యేల? భక్తివల్ల ఏమేమికానోపదు".[1] అను శ్లోకభావము కన్పట్టుచున్నది.

దీనికి శ్రీ శర్మగారు "వీరందరు మహాభక్తులు కాబట్టి నిన్ను సేవించి తరించారు. నేను నీ భక్తుడినే అని ప్రత్యక్షముగా చెప్పకుండా వీళ్ళంతటి భక్తుడినికాను అని చెప్పటం. వీరందరు చేసిన పనులు నిజమునకు చేయగూడనివి అయినను వారు భక్తితో చేసారు. కాబట్టి నీవు వారిని తరింపజేసావు. మరి నేను ఏ పని చేస్తే నన్ను అనుగ్రహిస్తావో చెప్పు" అనుట.

**"బత్తిని నెత్తిఁగొట్టుకొని, 'పాపహరా! కృపనింపరా! యటం**
**చిత్తరి మొత్తుకొన్న నిక నింత చలింపవు పల్కరింప, వీ**
**మత్తది యేలరా! చెవిటిమల్లయవా! మొఱలెంత పెట్టఁగిం**
**చిత్తును, నల్లికుట్టదటె! చిత్తముమార్పర! మల్లికార్జునా!"[2]**

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

భక్తితో నెత్తిబాదుకుంటూ పాపహరా! కృపనింపరా అని ఎంత మొత్తుకుంటున్నా కొంచెమైనను చలింపవు. ఏమిటి మత్తు? చెముడా? ఎంత మొర పెట్టుకున్నా నల్లి కుట్టినట్లుగా కూడలేదు. అని ఒక పిల్లవాడిని తల్లి మందగించిన రీతిలో శివుని ప్రశ్నించుచున్నారు. భక్తితో ఎంత వేడినను కనికరించకపోతే విసిగి వేసారినపుడు వచ్చే మాటలేయివి. ఒక భక్తుడు భగవంతుని ఈ విధముగా అడుగగలడు. భక్తితో నిండిన హృదయముతో వేసే ప్రశ్నలకు ఉచితానుచితములుండవు. వీరి భక్తికి పరాకాష్ఠగా ఈ పద్యమును కూడ చెప్పవచ్చును.

**"అక్షీణోగ్రతపమ్మునన్ మునిఁగి, కుయ్యాలింపకున్నా వయా!**
**'భిక్షాందేహి' యటంచు బైటికెటకో, వేంచేసినావా! శివా!**
**రక్షింపన్ దొరవంచుఁగాళ్ళబడినన్ బ్రార్థింపనొక్కింత నన్**
**వీక్షింపన్ బలుకాడవే! చెవుడయా! విన్పించుకో! మల్లయా!"[1]**

ఉగ్రమైన తపస్సు చేసికొనుచు నా మొర ఆలకించుటలేదా! 'భిక్షాందేహి' అనుచు బైటికెక్కడికో వెళ్ళినావా? నీవు రక్షించేదొరవని కాళ్ళమీదబడి ప్రార్థిస్తే నన్ను చూడనైనా చూచుటలేదు, మాట్లాడుటలేదు. చెవుడా ఏమిటి? కొంచెం విన్పించుకో! అంటారు. అనగా తీవ్రమైన తపస్సులో ఉండి వినిపించుకోలేదా? లేకపోతే శ్మశాన నిలయుడవంటారు గదా! నా హృదయ గహ్వరము వీడి 'భిక్షాందేహి' అంటూ బైటికి వెళ్ళిపోయావా! బైటికి వెళ్ళిపోయావు కాబట్టే నేను చెప్పే మాటలు నీకు వినబడుటలేదు. అని భావము. తరువాత పద్యములో ఓ మల్లికార్జునా! నేను నెత్తిన నెత్తిబెట్టుకొని నా హృదయారవిందమును భక్తితో నీకొసంగుచున్నాను. నా చేతులతో నిన్ను కౌగలించు కొని నీ ఇష్టము నా ప్రాప్తమని, నీకు నాకు భేదములేదని ఇటచేరితిని. నీవు ముత్యములొలుకునట్లుగా ( బలికి ఈ పుట్టుకను కడతేర్చుము. ఇక్కడకు వచ్చుట కూడ నీ సంకల్పమే. కరుణాంతఃకరుణుడవై మొదట సంకల్పించి భాస్కరరాముని మా బృందావనమునకు పంపి మమ్ములను పిలుచుటకు పంపి సమస్త ఏర్పాట్లు చేయించి మాకాశ్చర్యము కలుగునట్లుగా ఇక్కడకు రప్పించితివి. అదియు పుత్ర మిత్ర కళత్రసమేతముగా స్వేచ్ఛగా వాహనములో పర్వతారణ్యములు వరుసగా దాటుకుంటూ విందు భోజనములు చేయుచు యాత్ర జరిగినది. "శ్రీనగమ్ము నను, సర్వంబీవయౌచున్‌శివా!" అంటారు. అక్కడ ప్రతి వ్యక్తిలోను ప్రతి క్రియలోను వీరు ఆ పరమశివుని దర్శింపగలిగిరి. కావున వీరికి ఎంతటి భక్తి కలదో తెలియుచున్నది. ఎప్పుడు ఆ శ్రీశైలమల్లికార్జునుని దర్శించిరో చెప్పుచుండిరి. శ్రీ

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

విశ్వావసు నామసంవత్సర మాఘ శుక్ల చతుర్థి రోజు భౌమవారం నాడు నిన్ను చూసే భాగ్యము కలిగినది. సకలస్థావర జంగమాత్మకమైన ఈ ప్రపంచమంతయు నీ శక్తి స్వరూపమై భాసిల్లును. నీ సహాయముతోనే పరమశివుడు ఈ విశ్వమంతయు సృష్టింపగలుగుచున్నాడు. భ్రమరాంబా తల్లి! మల్లేశ్వరీ! మా అదృష్టము వలన మిమ్ము చూడగలిగితిని. మీ సత్కృపామృతమును మాపై జిల్కగా రమ్ము! సదాశివా! శంభో! హరా! శంకర! శ్రీశైలమల్లేశ్వరా! భవపాశమ్ములడంచు. నన్ను పాలింపరమ్ము. నేను వీర రాఘవుడను. శ్రీ గురుజాడ వంశజుడను. శ్రీ కౌండిన్య సద్గోత్రుడను. అని స్తుతించిరి.

వీరి మొర ఆలకించి ఆ పరమేశ్వరుడు జ్యోతిరూపములో దర్శనంబిచ్చిరి.

**"చీకట్లన్ నగశోభమాటువడి, వీక్షింపంగ రాకెల్లడన్**
**గీకారణ్యముగాగ ( గన్పడెడి, నింగిన్ దోచే, జ్యోతిఃప్రభల్**
**సాకల్యంబుగ తారకల్ బలెను, జ్వాలా తోరణమ్ముల్ వలెన్**
**బ్రాకెన్, శ్రీనగసార్వభౌము(డొక దివ్య ద్దివ్య తేజంబనన్"**[1]

చీకట్లతో నగరశోభ మాటువడిపోయినదిట. చూచుటకు శక్యముగాకుండ చీకటి వ్యాపిస్తే ఆకాశములో నక్షత్రములవలె జ్వాలాతోరణము వలెను జ్యోతిః ప్రభలు ప్రాకినాయిట. శ్రీ నగసార్వభౌముడు ఒక దివ్యద్దివ్య తేజము వలె ఉండెనట. ఈ అర్ధరాత్రి సమయములో ఔర! ఎవరు ఈ నగసీమలో అంత కష్టపడి శ్రద్ధగా వేలకు వేలు జ్యోతులను వెల్గునట్లుగా చేసిన ప్రచండ పరాక్రమ ధైర్యశాలి అని ఆశ్చర్యపోయి, దావానలమునందు కూడ అభయము నిచ్చు శీతలమూర్తి వీవయా! అంటారు.

**"ఎండినమ్రాకులెల్ల, చలియింపక, కాలముదాపరింప(గా**
**మండెడి మంట లీనమగు, మంజుల పల్లవ కోమలా రుణా**
**ఖండపు శోభ వెల్వెడలు, కాలము, సన్నిహితంబ, సత్కళల్**
**నిండి, ప్రసన్నమౌ ప్రకృతిలీల, త్వదీయము కాదె! శంకరా!"**[2]

పరమాత్మ కాల స్వరూపుడు. ఇక్కడ శ్రీశర్మగారు శివుని కాలస్వరూపునిగా లయకారునిగా దర్శించుచున్నారు. శరీరము కృంగికృశించిన తరువాత ఎండిన ఆకువలె కాలము సమీపించినపుడు రాలి నశించును. పాంచ భౌతికమైన ఈ శరీరము భూమి మీద పడినపుడు అగ్ని అగ్నిలో కలిసిపోవును. అదియే

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

మండెడు మంట లీనమగునని చెప్పుట. ఆ అగ్నితేజస్సు ఎట్లా ఉంటుందంటే మంజులమైన పల్లవకోమలారుణా ఖండపు శోభతో బయటకు వెలువడునట. అట్లే నీరు నీటితో పృథివీతత్వం పృథివితో, ఆకాశతత్త్వము ఆకాశముతో వాయుతత్త్వము వాయువుతో లీనమగును. ఇదిప్రకృతిలీల. ఇవన్నియు నీవేకదా! అంటారు. ఈ విధముగా ప్రకృతి లీలను పరమాత్మ తత్త్వము నెఱిగినవారు.

## శ్రీశైలభ్రమరాంబాస్తవము

**"శ్రీశైలరాజతనయా!**
**శ్రీశైలాధీశురాజ్ఞి! చిన్మయగుణ సం**
**కాశోద్భాసిని! కరుణా!**
**రాశీ! నను ( బ్రోవవేగరా! భ్రమరాంబా!"[1]**

అని ప్రార్థనచేసి యశము, మేధాబలము, దార్ఢ్యము ఒసగి అక్షయ కటాక్షమిచ్చి బ్రోవుదాక్షాయణి అని పలికి

**"మా తండ్రి శుద్ధ మల్లయ**
**మాతా! నీయండదండమాన్యు ( డటె! సుఖో**
**పేతుండటె! త్రైలోక్య**
**ఖ్యాతిన్ స్థిరభూతి గాంచె గద! భ్రమరాంబా!"[2]**

మాతండ్రి మల్లికార్జునుడు 'శుద్ధమల్లయు', నీ అండదండల వలన అందరి చేత గౌరవింపబడుచున్నాడా! సుఖోపేతుడేనా! ముల్లోకములలో స్థిరమైన ఖ్యాతి గడించెను గదా! శంకరుడు నిజముగా భక్తులకు వశమైనవాడు. భక్త వశంకరుడని పల్కుచుంటే విని ఇక్కడకు వచ్చాము. ఎంత పిలిచినా పలుకడే? కాస్త మావంకకు త్రిప్పవమ్మ! అడగడము ఆలస్యము భక్తుల కోరికలను దీర్చునట. మా "యొడయుఁడమాయిక, శివుఁడేఁడ్గడ వీవర్ధాంగి, వౌటగద!" అంటారు. మాప్రభువు అమాయకుడు. నీవు అతనికి అర్ధాంగివి. సగము శరీరమునీవే. అతడు నీకు ఏడ్గడ. అనగా భర్త. ఎట్లా భరిస్తున్నావో ఏమో అనటం. అమాయికుడనుటలో అర్ధము. ఈ భార్యభర్తృ సంబంధము అను ఒక మాయ కప్పునని

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

అంతరార్ధము. కల్లయు కపటము నెఱుగని వల్లభుడేగదా! నీ వల్లభుడు. భిల్లనగాగ్రమ్మున శోభిల్లు ప్రభునికరము చేకొంటివికదా! నీ కృప భూతల కైలాసముగ అమోఘ ప్రభలను చిందుచు జ్యోతిర్మయమై చైతన్య స్థితిని పొంది శ్రీశైలముగా రూపమునొందెను. కష్టములనణచి సర్వాభీష్టములొనగూర్చు తల్లివే! జగదంబా! నీవే సృష్టించెదవు. పోషించెదవు. తుష్టియు పుష్టియు నొసంగుదువు. ఓ త్రిజగన్మంగళ! మంగళకారిణీ! శృంగారమంతయు ఈ జగత్తులో పొంగి జగన్మోహనముగ మూర్తి గొనునటులుగా ప్రోవుమా! ఎన్నో జన్మల చేసిన పుణ్యము ఫలియించి నీ అంతులేని కృపాసంపన్నతపొందుటకు నీ సన్నిధి జేర్చితివి. ఓ భ్రమరాంబా! చాలా సంతోషముగా నున్నది.

**"మాతా! నీ దివ్యపదా**

**బ్జా తమ్ముల నమ్మి కొల్చువారు భువి సుఖో**

**పేతులు, సంప్రీతులునై**

**చేతోమోదమ్ముగాంత్రు శ్రీ భ్రమరాంబా!"[1]**

నీ దివ్యమైన పదాబ్జములను నమ్మి కొల్చినవారు సంప్రీతులై ఎంతో సంతోషము నొందుదురు. చల్లనితల్లీ! నా జన్మసార్ధకమగునట్లు నీ కృపనాపైజల్లుము. నే యల్లిన అక్షరమాలను స్వీకరింపుము.

**"శ్రీకర గురుజాడాన్వయ**

**రాకాచంద్రుండ, వీరరాఘవసుకవిన్**

**శ్రీ కౌండిన్యస గోత్రుఁడ**

**శ్రీ కల్యాణమయి! కనుమ! శ్రీ భ్రమారాంబా!"[2]**

అని స్తోత్రము చేయుచు తానల్లిన అక్షరమాలను ఆ భ్రమరాంబా తల్లికి అలంకరింపఁజేసిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

## 2. బాసర సరస్వతీ క్షేత్రం: -

శ్రీ సిద్ధార్థినామ సంవత్సర పుష్యశుద్ధ తదియ స్థిరవారము ది. 22-12-1979వ తేదీన శ్రీ శర్మగారు బాసరలో వేంచేసియున్న సరస్వతీదేవిని సందర్శించినప్పుడు,

**"వింటిని నినుగూర్చి, సరవిన్ గను భాగ్యము కల్గెనేడు నీ**
**వంటి మహాత్మురాలి, మృదు భాషిణి దౌసదనమ్ము హాయిగా**
**గంటిని, తోడ మేనపులకల్ జిగురింపఁగ, నీ స్వరూపమున్**
**గంటిని, జన్మ సార్థకముగా గనుగొంటిని, మంటి నేటికిన్"[1]**

అని నిన్ను గూర్చి విన్నాను. మహాత్మురాలివైన నీ మృదుభాషిత్వము గల సదనమును చూచాను. అట్టి అదృష్టము నేడు కలిగినది. నీ స్వరూపమును చూచినంతనే మేనపులకాంకురములు కలుగుచున్నవి. నా జన్మ సార్థకమైనదని తలచితిని. ఏదో నా సుకృతమ్ము పండి నీ ఆవాసము జేరినాను. నీవు నిర్వ్యాజకృపాకటాక్షవు. వాక్సిద్ధిప్రదవు. శ్రీప్రదా! శ్రీ బాసరవాటికానిలయ! నీ దివ్య దర్శనము వలన శ్రేయోమార్గమిమ్ము. అని ప్రార్థన చేసి, ఆమె రూపమునిట్లు వర్ణించిరి.

ఉ॥ **"వీణను చేతబూని, యొకవ్రేల్ జపమాల ధరించి, యొక్కచో**
**పాణిని పుస్తకమ్ముగొని, ప్రక్కమయూరము నిల్చియాడ, తా**
**గానము చేయ, సృష్టి తన కర్ణములన్ గయిసేయవెల్గు శ్రీ**
**వాణి, విధాతృరాణి ననుబాలన సేయుత మెల్లకాలమున్"[2]**

ఒక చేతిలో వీణను ధరించి, ఒక వ్రేలితో జపమాల ధరించి ఇంకొక చేతిలో పుస్తకమును పట్టుకొని, ప్రక్కన నెమలిపురి విప్పి ఆడగా, తాను గానము చేయుచుండగా శ్రీ వాణి - విధాతృరాణి నన్ను ఎల్లకాలము కాపాడుగాక అంటారు.

ఆ తల్లి ఎంత మహిమాన్వితురాలు అంటే,

**"సరసోదారమధు ప్రసాద కవితా సారస్వతానేక స**
**ద్వరముల్ గూర్చెడు తల్లి నీవుగద, దివ్యజ్ఞాన చిద్రూప సు**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

**స్వరవర్ణాకృతి భాసమాన జననీ, ప్రార్థింతు శ్రీ రమ్య బా**

**సరధాత్రీ నిలయా! సరస్వతి, కటాక్ష శ్రీ బ్రసాదింపుమా!"[1]**

బాసర క్షేత్ర నివాసినియైన సరస్వతీ దేవి సరసమైన ఉదారమైన మధు ప్రసాద కవితా సారస్వతము అనెడి వరమునిచ్చునట. దివ్యజ్ఞాన చిద్రూపట. ఆమె ఆకృతియే సుస్వరవర్ణమట. ఓ తల్లీ! కటాక్ష శ్రీ ప్రసాదింపుమా! అంటారు. ఇట బాసరలో వేంచేసిన సరస్వతీదేవి జ్ఞాన సరస్వతియట. ఆమె హృదయముపై సంగీత సాహిత్యములు చనుబాలై, ప్రవహించగా, ఆ రసవాహినిలో ఉల్లాసముగా నిత్యనూత్న విధానముతో తేలియాడుతు దివ్యమైన సన్మృదు సుధా ధారా కవిత్వమునించిన వాగ్దేవివి.నాపద్యాంజలిని స్వీకరింపుమా! అంటారు. ఇంత మహిమాన్వితమైన ఈ తల్లి నివసించిన బాసర

**క॥** **"బాసర, భాసుర దేవీ**

**వాసమ్ము సరస్వతీ నివాసము సుమనో**

**ల్లాసము, సద్యోబుద్ధి వి**

**కాసము, జన్మార్థ సాధక నివాసమ్మున్"[2]** అంటారు.

బాసరక్షేత్రము భాసురదేవీ నివాసము, సరస్వతీ నివాసము. మనస్సునకు ఉల్లాసము కలిగించునది. ఆ తల్లిని దర్శించినంతనే బుద్ధి వికాసము కలుగును. జన్మసార్థకత నొందే నివాసము. అని వర్ణించిరి. మన ఆంధ్ర దేశములో ఆదిలాబాద్ జిల్లాలో గల బాసర క్షేత్రము ఇంత మహిమాన్వితమైనది. అందువలననే ఆంధ్రదేశం నలుమూలల నుండి కూడ జనం అక్కడకు వెళ్ళి దర్శించుకుంటారు. అంతేగాదు తమ పిల్లలకు అక్షరాభ్యాసము అక్కడే చేసుకుంటారు.

శ్రీ శర్మగారు బాసర సరస్వతిని చూచినంతనే పులకరించిపోయి ఆ తల్లి నిట్లు మనోహరముగా వర్ణించిరి.

**సీ॥** **"తెలిదమ్మి పుట్టువు గలవాని, చెలువూని**

**ముజ్జగమ్ములనేలు ముద్దరాలు,**

**లేతకెందమ్మి వెల్గిను జంట పదాల**

**హొయలు గుల్కు నడలనూగుచానఁ**

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

**మిసిమి పసిడిమేన మెరయు క్రొత్తళుకుల**
**తొడవులందూగు ముద్దులపడంతి**
**తెలిపువ్వు నవ్వు పల్కుల జిమ్ము మేలిసో**
**యగము జెల్వారు, చిర్నగుమొగమ్ము**
**లచ్చి నెచ్చెలి, మిగుల, చల్లనియెడంద**
**గ్రాలు, చదువులప్రోడ, బంగారు తల్లి**
**బాసరాగెడ్డ గొలువున్న బమ్మరాజ్ఞి**
**బత్తిమీఱగ గొల్తు సంబరము దరల"[1]**

అలతి అలతి అచ్చు తెనుగు పదాలతో బాసరసరస్వతి నలంకరించిరి. విష్ణుమూర్తి ఇల్లాలుగా మూడు లోకముల నేలు ముద్దరాలుట. లేతనైన ఎఱ్ఱ తామర వలె వెల్గులు జిందు జంటపదాలతో ఒయ్యారముగా కుల్కుచు నడలనూగుచానట. శరీరముపై పచ్చని పసిమి ఛాయతో క్రొత్తళుకుల ఆభరణములతో తులతూగు ముద్దుల పడతిట. స్వచ్ఛముగా తెల్లనైన నవ్వుతో కూడిన పలుకుల జిమ్ముచు, తెల్లనైన అందముతో చెన్నొందుచు, స్వచ్ఛమైన, తెల్లనైన చిర్నగవు మొగము కలిగి మిక్కిలి చల్లనైన హృదయముతో ప్రకాశించు చదువుల ప్రోడట.బంగారు తల్లి బాసరా గెడ్డపై కొలువున్న బమ్మరాజ్ఞి, నిన్ను సంతోషముగా భక్తితో కొల్తును అంటారు. ఇక్కడ సరస్వతీదేవిని ప్రతి అణువు స్వచ్ఛమైన తెల్లని కాంతిగా వీరు దర్శించిరి. ఆమె శుద్ధ స్ఫటిక సంకాశ. స్వచ్ఛమైన పవిత్రమైన మనస్సుతో దర్శించినపుడు ప్రత్యక్షమై తీరును. అందువలననే తరువాత పద్యములో వీరు తాను కౌండిన్యస గోత్రోద్భవుడనని, గురుకృపా భాగ్యోన్నతుండనని, వీరరాఘవుడనని నిన్ను చూచే భాగ్యము కల్గినదని చెప్పి "బాసరసంవాసిని శ్రీ సరస్వతీకొనన్ సచ్చిన్మహారూపిణీ" అని అంటారు. ఆమె సత్‌చిత్ మహారూపముతో వెలుగొందునది. ఆ సచ్చిదానంద రూపమును దర్శించిన వీరుధన్యులు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

## 3. మధురా బృందావనయాత్ర: -

శ్రీ శర్మగారు 7-8-1964 వ సంవత్సరములో మధుర బృందావనమును సందర్శించిరి.

**"శ్రీ విజయ సారథీ! భ**
**క్తావన! శ్రీ సుజనజీవనా! శ్రీ త్రిజగత్**
**పావన, శ్రీ మధురా బృం**
**దావన వాసా! మదీయ నాథా! శ్రీ కృష్ణా!"[1]**

అని ప్రార్థన చేసి విజయవాడ - నాగపూర్ రైలులో కూర్చుని నిన్ను సందర్శించే భాగ్యము కల్గినది. నేడు రానుంటిని. నీ సంకల్పమెట్టిదో తెలియనేరను. నీవు సర్వాత్ముడవు. సకల భూతాంతర్నివాసుడవు. నిజభక్త రక్షకుడవు. మా జన్మతరింపగా నీ దివ్యమూర్తిని గాంచు భాగ్యము చేకూరినది. నీవే తల్లివిదండ్రివిగదా! అంటారు. దీనివలన శ్రీ కృష్ణపరమాత్మ పై వీరికెంతటి భక్తి గలదో తెలియుచున్నది.

13-8-1964 శుక్రవారమునాడు బృందావనములోనుండగా,

**"అలుకం జెందకుమయ్య! నిన్విడచి దేశాంతర్ప్రదేశమ్ములన్**
**గలియంజుట్టి, మహాప్రసాదమటసాక్షాత్కారమౌనంచు, స్వ**
**స్థలమున్ వీడె నటంచు నెంచకు, మనశ్శాంతిన్ బ్రసాదించు, స్వ**
**స్థలి బృందావన భాగ్యమున్ గనఁగ, కృష్ణా! యిద్ది సంకల్పమేన్."[2]**

ఓ కృష్ణా! నీవు అలుకఁజెందకు. నిన్ను విడిచి, దేశముగాని దేశములన్ని కలియ జుట్టి మహాప్రసాదము అక్కడ లభించునని మా స్వస్థలము విడిచి పెట్టి వచ్చామని భావించకు. మాకు మనశ్శాంతిని ప్రసాదించు స్వస్థలమైన బృందావనమును చూసే భాగ్యము కలిగించు. ఇది నీ సంకల్పమే సుమా! అంటారు.

శ్రీ శర్మగారు తమ ఇంటికి బృందావనమని పేరు పెట్టుకొనిరి. తన ఇష్టదైవము ఆ శ్రీ కృష్ణ పరమాత్మ తమ బృందావనములోనున్నాడని విశ్వసించెడివారు. ఇప్పుడు ఈ బృందావన యాత్ర చేయుట మా బృందావనములో నీవు లేవని కాదు స్వస్థలమైన బృందావనమునకు నన్ను రప్పించుట నీ సంకల్పమే సుమా! అంటారు. భగవంతుని సంకల్పము, మనము చూచే అదృష్టము లేకపోతే అట్టి పవిత్ర స్థలమును

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

చూడాలను కోరికయున్నను వెళ్ళుట తటస్థపడదు. చూసే అదృష్టము ఉన్నప్పుడు ఏదో ఒక కారణముగా ఎవరో ఒకరి రూపములో మనలను భగవంతుడటకు చేర్చి చూసే భాగ్యమును కలిగించును. ఇట్లే మధురను చూచినపుడు కూడ, ప్రేరేపించి, త్వదీయ దర్శనము నీ బృందావనములో కలిగేటట్లుగా చేసితివి.

**"ఎఱుఁగకపోవలేదు, గురులెంతయుఁబల్కిన దివ్యవాక్కు సుం**
**దరశివమూర్తి నీవయి, సుధారససారముఁద్రావఁజేయుటల్**
**స్థిరతరబుద్ధిలేదు తవలీలఁగనుంగొని, పిమ్మటన్ హృదం**
**తరవశివర్తివౌ, నిను, సదావిడనాడను తత్స్వరూపమున్"[1]**

నేను ఎఱుగకపోలేదులే! మా గురువులు పల్కిన దివ్యమైన వాక్కు, సుందర శివమూర్తివి నీవే, సుధారస సారమును గ్రోలునట్లుగా చేయుట, నీ లీలను తెలిసికొని నా హృదయాంతరవశవర్తివియైన నిన్ను, నీ స్వరూపమును ఎప్పుడూ విడిచిపెట్టను. అది మధురాపురాంతర మహాస్థలము అచ్చట భువనమోహనమై చెలువారుచు గోపికాహృదయముఁ జీరగొనుచు వేణుగానమును పలికించితివట. నీ దివ్య సీమను చూచే భాగ్యము కల్గినది. అవి మంచి దినములు. ఓ కృష్ణా! అట్టి దినములు మరల వచ్చునా? అని మనస్సులో ఆలోచనలతో రోజులు, సంవత్సరములు జరిగిపోయినవి. వార్ధక్యము కనబడకుండానే బలము, ధనధాన్యములు నిలిచిపోయి కుటుంబము వృద్ధి చెందగా నీ దర్శనము లభించుట ఎవరికైనా, ఎప్పుడైనా పూర్వజన్మకృత పుణ్యమే.

**"విడువంజాలవు జిడ్డుగా నెపుడు, వెన్వెంటన్ మనంబంటుచున్**
**సడలంజాలవు, కోరికల్, గృహమునన్ సంసార తాపత్రయం**
**బుడుగన్ బోదు, నిమేషమే బెడదయో, యూపున్ సదాజీవునిన్**
**విడి, తద్బంధము, స్వస్వరూపమెదో, తెల్విన్‌గాంచ, యత్నించునే"[2]**

నీ లీలలు విచిత్రములు. నీవేమో నా మనస్సులో జిడ్డుగా అంటుకొనిపోయి విడిచి పెట్టనప్పటికి, కోరికలు తప్పవు. భార్యాబిడ్డలను సంసార తాపత్రయములు విడిచి పెట్టుము. నిమిషములో ఏదో కష్టము వస్తే భగవంతుడా! నీవే దిక్కు రక్షించమంటాము. ఈ లౌకికమైన విషయాలను విడిచి పెట్టి, నీవు ఎవరు, నీతో అనుబంధమేమిటి? నీ స్వరూపమేమిటి అని తెలిసికొనుటకు ప్రయత్నిస్తామా? ప్రయత్నించమని అర్థము. ఇహలోక సుఖములు శాశ్వతమను భ్రమలో పడి కొట్టుకుంటూ ఉంటాము. నీవు జిడ్డుగా మా

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

మనస్సునకంటుకొని ఉన్నప్పటికి కాని నీవు ఈ జీవునిలో అంతర్వర్తివై ఉన్నావు. ఈ జీవాత్మ, పరమాత్మ ఒక్కడే, ఈ పరమాత్మ ఆడించే ఆటే ఇది అను తెలివిని పొందటానికి ప్రయత్నించము గదా! అని అర్థము. ఏదో మహాశక్తి శరీరమును కుదించినయట్లు కర్మలంపటునిగ జేసి ఈడుస్తున్నది. ఆలోచన చేయగా తోచుట లేదు. అయ్యో! నా జన్మ సార్థక్యము గాగల మార్గము ఒకప్పుడైనా కలుగునా? జీవితములో మనస్సునకు సంతృప్తి కలుగునా? తమ గురువుల బోధనలను విని అనేకులు ధన్యులైనారు గదా! భార్యాబిడ్డలను విడిచి పెట్టకుండా, ఎన్నో తీర్థయాత్రలు చేసి, మంచివారితో సంభాషించి, పుణ్యతీర్థముల దర్శించి, సుందరమైన మందిరములను, దేవతామూర్తులను సేవించి భజనలొనర్చి ధన్యులైనవారు పుణ్యాత్ములు ఈ భూమిపై ఎంత మంది కలరు? అని మహానుభావులైనవారందరిని ఆ పవిత్రమైన మధురాస్థలములో తలచుకొనిరి. అక్కడ ఉన్న శ్రీ కృష్ణ పరమాత్మ ఎంత మహిమాన్వితుడో చెప్పి, ఆయన నివసించిన మధుర,

**"శ్రీ మధురాపురమ్ము, సురసేవిత రంజిత సర్వదేవతా**
**ధామము, స్వీయ భక్త జనతాహిత రమ్యతరు ప్రశోభితా**
**రామము, భూరి సౌఖ్యనికరమ్ము, కరమ్మిల గోప గోపికా**
**శ్రీ మహిమాన్వితమ్ము, దరిజేరితి, కృష్ణ విభు ప్రదేశమున్."[1]**

సురల చేత సేవింపబడిన, సర్వదేవతలకు నిలయమైన, భక్తులచేత, చెట్ల చేత శోభాయమానముగా వెలుగొందెడిది. సౌఖ్యమునకు నిలయము, గోపగోపికా శ్రీ మహిమాన్వితము నైన శ్రీమధురాపురమ్ము దగ్గరకుఁజేరితిని. ఇది కృష్ణుని ప్రదేశము అంటారు. అంతటి పవిత్ర స్థలమట మధుర.

అక్కడ వీరు దర్శించిన శ్రీ కృష్ణుడు శ్రీ శుభమంగళప్రదుడట. అశేషకృపావనుడట. భక్తుల హృదయాలందుడెడివాడట. సకల తీర్థములు ఆయనే. యమునా తటీ పురాధీశుడు. భోగభాగ్యజలధి. మధురాపురవాసుడు, ద్వారకాధీశుడు. రమ్య నీలమణి దీపితుడు. అట్టి కృష్ణుని చూచాను. ధన్యుడను అంటారు. కాళిందీ నది ఆయన దివ్య పాదయుగళిని సేవింపగా, గోపుర ప్రాకారాన్వితమైన దివ్య క్షేత్రములో ఎప్పుడు కల్యాణ పరంపరలుకలుగగా, ఈ భూమిపై ద్వారకాధీశుడైన శ్రీకృష్ణుడు అవతారమెత్తి మధురను సేవింపగా నేను ధన్యుడను అంటారు. ఈ బృందావన పుణ్యధామము ఎటువంటిది అంటే కృష్ణకరాంబుజ వేణుగానమోహవశవర్తులైన వ్రజమహాస్థలి. యమునానదీ తీరములో నుండి దివ్య ధామముగా పావన

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

పుణ్యతీర్థమై భాసిల్లునది. సౌఖ్యనిధానమైనది. అట్టి బృందావనమును చూడగానే మనస్సునకు సంతోషముగానున్నది. ధన్యుడనైనానని భావించారు. వీరు దర్శించిన శ్రీకృష్ణ పరమాత్మ.

**"ఘననీలాభ్ర శరీరు, పింఛధరు, శృంగారైక చిన్మూర్తిఁబా**
**వను, వ్యత్యస్త పదారవిందయుగళున్ బాంకీ బిహారున్ త్రిలో**
**కన సౌందర్య కళాస్వరూప మురళీగానామృతానంద వ**
**ర్ధను, బృందావన వాసు, కృష్ణపరమాత్మన్ గంటినే ధన్యుడన్"[1]**

నీలమేఘచ్ఛాయలో పింఛము ధరించిన శృంగారైకచిన్మూర్తి పావనుడు. వ్యత్యస్త పదారవిందయుగళుడు. బాంకీ బిహారుడు. త్రిలోకసౌందర్య కళాస్వరూపముచే మురళీగానామృతానందములో నోలలాడించువాడు. బృందావనవాసుడైన శ్రీ కృష్ణ పరమాత్మను గంటిని. నేను ధన్యుడను అనుచూ, శ్రీ కృష్ణ పరమాత్మను కళ్ళకు కట్టినట్లు వర్ణించిరి.

## 4. శ్రీ రంగనాథ్ జీ: -

ఓ రంగనాయకా! దక్షిణ దేశపు ప్రజకు దర్శనమిచ్చుట కిచ్చటనుంటివి. నీవు భక్త సంరక్షక మూర్తివి. నిన్ను ప్రార్థించిన క్షణమే అక్షయమైన కటాక్ష ధనమిచ్చి ప్రేమతో మోక్షము నొసంగువాడవు. ఉత్తరదేశవాసులందరిని ప్రయోజకులను జేసితివి. నీ స్వరూపము చూడలేరని పరిపూర్ణ కృపావంతులను జేసి, సర్వసంపత్తులు ఇచ్చుటకు వారిచే మందిరములు నిర్మింపఁజేసి ఉన్మత్తులవలె వారి మనములు నీయెడ పొంగిపొర్లునట్లుగా చేసితివి. సాక్షాత్తు శ్రీ రంగమే ఇక్కడికి తరలి వచ్చినట్లున్నది. మహోత్సవములను నిత్యానందులై నీ శుభాకారమును, కరుణావలోకనములను చూచుటకు నీ సన్నిధికి వచ్చిరి. ఓ రంగనాథ ప్రభూ! మమ్ములను ఆదుకోదగును అని శ్రీ రంగనాథ్‌జీ ని ప్రార్థించి అక్కడి సౌధముల నిర్మాణమునకు ఆశ్చర్యచకితులైరి. ఎంతో విశాల భూమిపై అందముగా దివ్యసౌధాంతరములు కట్టబడెను. భక్తులు హాయిగా నీ కృపామృతమును జూఱగొంచు సుఖింతురు. నీ పట్ల భక్తి గలిగి యుండుట పూర్వజన్మ సుకృతము గదా! అంటారు. భగవంతుని పట్ల భక్తి కలిగి ఉండటానికి కూడావారు ఏ జన్మలోనో పుణ్యము చేసికొని ఉండాలి. ఒకరు చెప్పితే అలవడేదికాదు.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

## 5. నవీనగోకుల్ - కర్నాల్: -

శ్రీ శర్మగారు 20-8-1964 సం॥లో పంజాబ్‌లో నున్న కర్నాల్‌లోని గోకులమును సందర్శించినపుడు ఇట్లు వ్రాసిరి. పంచనదుల ప్రదేశములో కర్నాలు, నవీన గోకులమను పేరుతో శాలలు ఏర్పరచి, అందు గోవులను, విశాలమైన పచ్చిక బీళ్ళను పెంచి పరిశోధన కొరకై పండితులను, పాలకవర్గమును ఏర్పరచిరి. పాలు, వెన్న, పెరుగు మొదలైనవి తయారు చేయుటకు పాలు ఆయుర్దాయమిస్తాయను వాక్యానుసారము, క్షీరములో అమూల్య సూక్ష్మగుణము, ఇంకా ఏయే మహా వస్తువులు శ్రేయోదాయకమైనవి ఉన్నాయో కనుగొనుటకు ఈ సంస్థలో యంత్రసహాయముతో నిత్యము పరిశోధనలు జరుగుచుండెను.

అక్కడ గోవులు శేర్లకొలది పాలను ఇచ్చునట. ప్రతి దినము ఇచ్చు పాలు జీవులకు సారము గల్గి పుష్టిని, తుష్టిని కలుగఁజేయును. సుఖప్రదమగును. ఇది మంచి గోకులము. దీనిని చూచినంతనే ఎవ్వరైనను పవిత్రమైన గోవులకు భక్తితో నమస్కరింపక మానరు.

**"పాడిపంటలకిమ్ము పావనపురమ్ము**
**శ్రీనివాసమ్ము బుధజనసేవితమ్ము**
**అమల గోక్షీర పరిశోధనాలయమ్ము**
**ధరణి కర్నాలు నవ్య బృందావనమ్ము"**[1]

పాడిపంటలకు నెలవైన పావనపురము. బుధజనులచేత సేవింపబడునది. స్వచ్ఛమైన గోక్షీర పరిశోధనాలయము. భూమిపై కర్నాలు నవ్యబృందావనమట. కర్నాలులోని గోకులము శ్రీ శర్మగారికి యదార్థమైన బృందావనమును తలపింపఁజేసినది.

## 6. కురుక్షేత్రమ్: -

శ్రీ శర్మగారు 21-8-1964 శుక్రవారము నాడు కురుక్షేత్రమునకు వెళ్ళినపుడు ఈ విధముగా వ్రాసిరి.

**"కౌరవ పాండవుల్ గురులు, కాంచనరత్నకిరీటి శౌరియున్**
**దీరిచినట్టి మందిరము, నిర్మలపూర్ణ జలాశయమ్ము, శృం**
**గారముఁజిల్కు మేటి తురగమ్ములు, దివ్యరథమ్ముఁబార్థుడున్**
**సారథియైన కృష్ణుని పసందగు, మందిరమున్ గనందగున్"**[2]

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

కురుక్షేత్రములో కౌరవపాండవులు, గురువులు, అర్జునునితో తీర్చిదిద్దిన మందిరము, జలాశయము, శృంగారముఁజిల్కు మేలైన గుఱ్ఱములు, దివ్యమైన రథము, పార్థుడు, సారథియైన కృష్ణుని పసందగు మందిరము ఇక్కడ చూడదగును. ఇక్కడే ధర్మక్షేత్రమైన ఈ కురుక్షేత్రములో శ్రీకృష్ణుడు కృపాపాత్రుడై పార్థునికి గీతోపదేశమ్మును చేసెను. దీనికి అర్జునుడే తగిన వాడని తలంచి చేసెను. ఇక్కడే క్షాత్ర తేజము నశించెను. శత్రువర్గము భయాందోళనలతో గురువులను, బంధువులను, చూచుచు నిలబడెను. ఇక్కడనే అసంఖ్యాకమైన భారతవీరులు బలియైరి. వారి రక్తము ఏఱులై ప్రవహించెను. భారతదేశ చరిత్రలో ప్రసిద్ధమై పవిత్రమైన స్థానము సంపాదించి, కీర్తివంతమైన పుణ్యస్థలమై విలసిల్లినది. ఢిల్లీ నగరమును సందర్శిస్తూ,

**సీ॥ "ఇచ్చోటనే కదోయీ! చిందులాడెఁబూ**
**ర్ణ కళల, మొగలు సామ్రాజ్యలక్ష్మి**
**... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ...**
**... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ...**
**... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ...**
**కరము లక్ష్మీ సరస్వతీ పురసతీమ**
**తల్లి, ఢిల్లీపురము, రాజధాని పురము"[1]**

అంటూ ఒక పెద్ద సీసమాలికను వ్రాసిరి. ఢిల్లీలో గల ద్వారసీమను శిల్పకళానిలయమును, స్థూపచయమును, రాజమందిరపు కోటను, దేవతామందిరములను, జుమ్మామసీదు, ఎర్రకోట, గాంధీసమాధి, నెహ్రూ సమాధి, ఇంద్రప్రస్థపురము ఇవన్నీ సందర్శించి నిజముగా లక్ష్మీకృపాభాసితమైన భూతల స్వర్గసీమ అని వర్ణించిరి. అంతే గాక అక్కడి సౌధములను, శాస్త్రపరిశోధనాలయమును, యంత్రాలయములు, వైద్యాలయములు, స్వేచ్ఛా విహార విశ్రాంత స్థలములు, భాండాగారములు, రక్షకభటచయము, న్యాయ సభాంతరములు, విమానమును చూచి హాయినొందని జీవియెందైన గలడా? ఇక్కడ ఢిల్లీ పట్టణమ్ము స్వర్గతుల్యము. అని వర్ణించిరి.

విమానములు ఆకాశములో సంచరించు విధము నీ విధముగా కళ్ళకు కట్టినట్లు వర్ణించిరి.

**సీ॥ "గ్రద్దలపోల్కి, యాకాశమార్గమ్మునఁ**
**బ్రాకెడి రెక్కల పక్కియనఁగ**

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

మేఘమాలలదూరి, మింట'బూరల' మ్రోతఁ
దఱలెడి, శబ్దయంత్రంబనంగఁ
వలయవలయమ్ములఁబల్లటీల్ ప్రాకుచు
నిట్టె, దుముకు, పాలపిట్టయనఁగ
మినుకు, మినుకుమంచు, మింతమబ్బుల దిబ్బ
గ్రక్కున జారెడి రిక్కయనఁగ
జనవశీకృత చపలమోహినియనంగ
బాల బాలికా తర్జనీ పటమనంగ
వీకనభ అజరాజు స్వేచ్ఛా పతాకమనఁగ
మాటికిన్ దోచు ఢిల్లీ విమాన చయము॥"[1]

సీ॥ "ఒక పరి నీదెస, నొక పరినాదెసఁ
దెఱలు, విద్యుత్ప్రభాదీపమనఁగఁ
ఒక పరి క్రిందికి, నొక పరి పైకి, దూ
సుక దాటిపోవు పిచ్చుకయనంగఁ
మాటికి మబ్బుల చాటున దాటుచు
దూటువెల్ల ముసుంగు దొంగయనంగఁ
అంతులేనట్టి, మహాకాశ వారాశి
చప్పున దాటించు తెప్పయనఁగఁ
గరుడ గంధర్వ కిన్నెర నరకోటి వా
హ్యాళి యొనర్చు వాహనమనంగ
వాయుమండలిఁజను, గాలి పటమనంగఁ
ప్రకృతి కాంతా శిరోజ పుష్పంబనంగఁ
వాయువున్ జిల్చు నభరాజు బాణమనఁగ
కానబడు మధ్య మధ్య విమానచయము॥"[2]

విమానము ఆకాశములో తిరుగుతున్నప్పుడు గ్రద్దలవలె ఆకాశమార్గములో ప్రాకుచున్న రెక్కలు గల పక్షియా అనునట్లున్నదిట. మేఘముల పంక్తులలో దూరి, ఆకాశమార్గములో బూరల మ్రోత లాగా వెలువడెడి శబ్ద యంత్రమా అనునట్లున్నదిట. వలయాకారముగా పల్లటీలు గొట్టుచు, ప్రాకుచూ,

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

దుముకుతున్నట్లుగా ఉన్నప్పుడు పాలపిట్ట యా అనునట్లున్నదిట. మినుకు మినుకు మనుచు మబ్బులచాటు నుండి ఒక్కసారిగా జారిన నక్షత్రమా అనునట్లున్నదిట. జనుల చేత ఆకర్షింపబడిన చపలచిత్తురాలైన మోహినీ అనునట్లుగా బాలబాలికలు ఎగురవేయు గాలిపటమా అనునట్లుగా ఢిల్లీలో విమానముల సముదాయము మాటిమాటికి కనబడుచున్నాయి అని వర్ణించిరి. వీరి పరిశీలనా పటిమ మెచ్చుకో దగినది. నిజముగా విమానము చూడని వ్యక్తికి - అవి ఆకాశమార్గములో సంచరించుట చూడనివారికి కళ్ళకు కట్టినట్లు వర్ణించగల - చూపగల నైపుణ్యము వీరికి గలదు. వీరి కవితా శిల్ప నైపుణ్యము మనోహరము. విమానము భూమి మీద నుండి పైకి లేచునపుడు గ్రద్దలవలె పెద్దదిగా, రెక్కలు కలిగి ఉండటము ఆకాశమార్గములో వెడుతున్నప్పుడు రెక్కలు గల పక్షియా అన్నట్లుగా అనిపించటము సహజము. ఈ విమానమే మేఘముల సమూహములోనికి దూతినపుడు ఆ శబ్దము 'బూరల' మ్రోతలుగా ఉన్నదట. మామూలుగా తిరుగుచున్నప్పుడు వచ్చే ధ్వని, మేఘములు అడ్డు వచ్చినపుడు వచ్చే ధ్వనికి తేడా గలదు. ఆ మేఘములు అడ్డువచ్చినపుడు అది బూరల ధ్వనిగా నున్నదట. అప్పుడు ఆ విమానము ఒక శబ్దమును చేయు యంత్రమనుట సహజముగా నున్నది. ఈ విమానము ఆకాశమార్గములో ఇంకా కొంచెం పైకి లేవటము కొంచెము క్రిందకి రావటము పల్లెటీలు కొట్టుచున్నట్లున్నదిట. అప్పుడు పాలపిట్టగా భ్రమించడం సహజము. ఇంకా కొంచెము పైకి వెళ్ళినపుడు ఆకాశమార్గములో మినుకు మినుకుమను నక్షత్రములాగా కనిపించడము సహజమే. దూరము ఎక్కువైన కొలది విమానము చిన్నదిగానే కనబడును. ఈ విమానము మ్రోత వినబడగానే పెద్దవాళ్ళేమిటి, చిన్నవాళ్ళేమిటి వయస్సుతో నిమిత్తము లేకుండా అందరు వీధిలోనికి వచ్చి చూచుదురు. కాబట్టి జనులందరి చేత ఆకర్షింపబడే మోహిని అనుటలో సహజత్వము కనబడుచున్నది. బాలబాలికలు ఎగురవేసే గాలిపటము - ఆకాశరాజు స్వేచ్ఛగా విహరిస్తున్న పతాకము అని ఊహించుటలో తప్పులేదు. దీని వలన వీరి నిశిత పరిశీలనా శక్తి మనము గ్రహించగలము.

అంతేగాదు ఒకసారి ఈ దిక్కున, ఇంకొకసారి ఇంకొక దిక్కున కనబడు విద్యుత్ప్రభా దీపమా అనునట్లుగా, ఒకసారి క్రిందకి, ఒకసారి పైకి దూసుకుంటూ దాటిపోవుట పిచ్చుక అనునట్లుగా, మాటిమాటికి మబ్బుల చాటుకు వెళ్ళిపోవుట ముసుగుదొంగ అనునట్లుగా, అంతులేని గొప్ప ఆకాశమనెడి సముద్రమును దాటించుటకు వేసిన తెప్ప అనునట్లుగా, గరుడులు, గంధర్వులు, కిన్నరులు, నరులు కలిసి వాహ్యాళి తిరిగెడి వాహనమా అనునట్లుగా, ఆకాశములో విహరించు గాలిపటమనునట్లుగా, ప్రకృతి అనెడి కాంత శిరస్సునందు ధరించిన పుష్పమనునట్లుగా, ఆకాశమార్గములో గాలిని చీల్చుకొని పోయే ఆకాశరాజు

బాణమనునట్లుగా, విమాన సమూహము మధ్యమధ్యలో కనబడుచున్నవి అని వర్ణించిరి. ఢిల్లీ నగరములో విమానములు సంచరించు తీరును మనోహరముగా వర్ణించిరి.

అది యమునానదీ తీరము. విభుడైన షాజహాను రాజధానిగా గ్రహించి సమస్త కళలకు నిలయమగునట్లుగా, జనులు సకలభోగములు పొందునట్లుగా, సంపదలతో వెలయునట్లుగా చేసెను. అప్పటి నుండి పాదుషాలకు గౌరవనీయమైనది. కాలవశముగా భరత ఖండములో ద్వేషము చెలరేగెను. పరస్పరము ఐకమత్యము లేక పోవుటలో కుంఫిణీ జనులు కాలుమోపిరి. బానిస జాతిగా బ్రతుకు వారలను మేల్కొలుపగా పెద్దలు నడుములు బిగించి, తమ దేశమునందభిమానము పూని, జాతిని సంఘటితము చేయాలనే ప్రయత్నములో కాంగ్రెస్ సంస్థను స్థాపించి ప్రాణము ధనము అనుమాట దలంపక త్యాగమూర్తులైరి. ప్రాణములొడ్డియైనను స్వరాజ్యమును సంపాదించాలి అను ప్రయత్నములు సఫలమయ్యెను. పరపీడన తొలగిపోయెను. స్వేచ్ఛలభించి నిత్య కల్యాణము పచ్చతోరణముగా సుఖించు దినములు సంభవించెను.

**గీ॥ "భరత జాతీయ స్వప్రభాభాసమాన**
**మౌ పతాకవెలింగె, ఢిల్లీపురాన**
**ఖండ ఖండాంతర ఖ్యాతిగాంచి మఱల**
**రాజధానిపురమ్మయె, ప్రజసుఖింప**
**శ్రీ పరాక్రమ పురము, ఢిల్లీపురమ్ము"[1]**

అని ఢిల్లీ మహానగర వైభవమును వర్ణించిరి.

## 7. లక్ష్మణపురం (లక్నో): -

శ్రీ శర్మగారు 14-9-1964 సంవత్సరములో లక్నో సందర్శించినపుడు

**చ॥ "ప్రవిమల గోమతీనది విరాజితధామము, ఉత్తరప్రదే**
**శవినుత రాజధాని, సువిశాలపథస్థలి సొరుగేరు ర**
**మ్యవనముల్ వియత్తలమునంటు పురాతన సౌధ పంక్తి, తీ**
**ర్చి వెలయు దివ్య లక్ష్మణ పురిన్ గనుగొంటి, కళానిధానమున్"[2]**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

గోమతీ నదీతీరములో విరాజిల్లునది, ఉత్తరప్రదేశ్ రాజధాని, విశాల మార్గములతో రమ్యభవనములతో, ఆకాశమునంటు సౌధ పంక్తితో వెలయు లక్ష్మణ పురిని కనుగొంటిని. అని పలికి ఆ లక్నో అనగా లక్ష్మణపురము ఎట్లా ఉంటుందో ఈ విధముగా పేర్కొనిరి.

సీ॥ "భోగలాలసులగు మొగలాయి వినుత సా
 మ్రాజ్యధినేతల మందిరమ్ము
తన్మందిరోపరిస్థలము డుల్చినయట్లు
 కనెడుగోళాకారమునను లోనఁ
ఇటుకగట్టినదయ్యు, నెటునిల్చెనో శిరో
 భాగమ్ము, కుడ్యస్థంభాలపైన
ఐమూలగా సూటిగా మూలమూలల
 సందుగొందులపైకి క్రిందసాగుఁ
పథమెఱుంగక, తికమకపడుట సహజ
మెంతవారలు, దర్శకుడింత లేక
శ్రమయనక, జనకక్ష్యాంతరములు గడచి
చూపరులు గాంత్రునిండ, లక్నోపురమ్ము"[1]

భోగలాలసులైన మొగలాయి సామ్రాజ్యాధినేతల మందిరము ఆ మందిర మధ్యభాగంలో డుల్చినట్లుగా కనబడు గోళాకారము ఇటుకతో కట్టినదైనను ప్రభావము స్తంభాలపైన, గోడలమీద ఎట్లు నిల్చెనో కదా! మూలమూలల సందుగొందుల పైకి క్రిందికి సాగు మార్గము తెలియక తికమక పడుట సహజము. దర్శకుడులేక, శ్రమ అనుకోక, వచ్చు జనము లక్నో పురమును గాంచుదురు. అని వర్ణించిరి. మిక్కిలి ఎత్తు గలిగి, ఒకటే కట్టడము చాలా పొడవు కలిగి వెడల్పు కలిగి, వింతైన కట్టడము కనువిందు చేయును. పరిశీలించి చూస్తే మనస్సు ఎక్కడికో వెళ్ళిపోయినది. ప్రశాంతమును కలిగించినది. ఈ ప్రపంచములో ఇంతటి జ్ఞానమందిరమును ఈ రోజుకి చూడలేదు. ఈ లక్ష్మణ పురములో నేడు వెలసిన క్రొత్త మందిరములను లెక్కపెట్టవచ్చును. మొగలాయి సంస్కృతీ మిళితమైన రమ్యభవనములు శిథిలమైనవి కనబడుచున్నవి గావున ఇది పురాతన పట్టణమని గుర్తించవచ్చును. వాళ్ళ సౌకర్యములు ఎప్పటికప్పుడు అవసరాలకి తగ్గట్టుగా సృష్టిచేసికొనుచు, ప్రత్యేకముగా ఈ రైల్వేశాఖవారు రైళ్ళలను రాత్రింబవళ్ళు నడుపుచున్నారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

నిత్యము ఈ సరయు తటిని వెల్గు ఈ అయోధ్యానగరములో ప్రతి గృహము రాముని మందిరమే. మనస్సునకానందము కలుగునట్లుగా భక్తులు శ్రీ సీతారాముల ఘనమౌ, పవిత్రమైన చరిత్రను గానము సేయుట వినబడును. రాముని లీలలు, ఆయన పరాక్రమము, అనుజుడు లక్ష్మణస్వామి, మునీంద్రులు, మిథిల, శంకరుల ధనుస్సు, జానకీరాముల పెండ్లి, పరశురాముని సమాగమము, శ్రీరాముని పట్టాభిషేకము మొదలైన శ్రీరాముని రమ్యమైన చరిత్రను సంస్మరింపదగును. నిత్యము శ్రమపడుదురు. ఆక్రమించుదురు. నిత్యము జీవాళికి బాధలేదో అదే అయోధ్యా నామ శబ్దార్ధము. శత్రువులు సరిహద్దు దాటి రాజాలరో అది పూజింపదగినది. దర్శింపదగినది. ఈ విధముగా అయోధ్యా పట్టణముండెను. అని వర్ణించిరి.

రామ రాజ్యములో ఈతిబాధలు లేవని కదా! అట్లే ఈ అయోధ్యానగరములో కూడ న్యాయమార్గము, ధర్మపథములో సంచరించేవారే కలరని చెప్పుచున్నారు. కష్టపడి కొందరు ఆక్రమింతురు. ప్రజలకి ఎటువంటి కష్టాలు లేవని, శత్రువులు సరిహద్దులు దాటి అయోధ్యానగరములో ప్రవేశించరని చెప్పుచున్నారు. మరల రామరాజ్యం ఎట్లా ఉండేదో చూడాలంటే ఈ అయోధ్యానగరమును దర్శించాలి. ఇది పూజనీయమైనది.

## 8. వారణాసి: -

శ్రీ శర్మగారు 12-6-1952 సంవత్సరములో కాశీ విశ్వేశ్వరుని దర్శించినపుడు ఆ క్షేత్రములోని శివుని గొప్పదనము నీ విధముగా చెప్పిరి.

> **"శ్రమగానెంచక, వీథి వీథి, జటి వేషంబూని, యెవ్వండొ, ని**
> **త్యముఁగాశీపురి దిర్గు, మౌనిజనచింత్యంబౌ పరబ్రహ్మ రూ**
> **పము, కర్ణేంద్రియమంటి, జుఱ్ఱుకొని, ద్రావంగల్గు, శ్రీరామనా**
> **మము, ప్రాణమ్ములు, బొంది వీడుతరిఁబ్రేమన్ జీవికిన్ గర్ణమూ**
> **లమునన్, దానుపదేశమిచ్చునట, యాలస్యమ్ము లేకుండగన్"**[1]

కాశీలో ఎవరో జడల ధరించి శ్రమ అనుకోకుండా వీధి వీధి తిరుగునట. ముని జనులచేత ఎల్లప్పుడు ఆరాధింపబడు పరబ్రహ్మరూపమును కర్ణేంద్రియములనంటుకొనునట్లుగా జుఱ్ఱుకొని త్రాగునట. జీవి ప్రాణములు విడుచు సమయములో శ్రీరామనామము చెవిలో ఆలస్యము చేయకుండా ఉపదేశము చేయునట. కాశీ ముక్తినిధానంబట. వరయోగి ధ్యేయ కైలాసమట. ఆ కాశీ మహా గ్రామము పాప విధ్వంసనియైన

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

గంగాభవానీ సమర్చితమైనది. దివ్యదేవతా భవనములతో విరాజితమైనది వారణాశి, సిద్ధపురుషులచేత నిర్మింపబడిన దివ్య ఘట్టములతో, తీర్థములతో విరాజిల్లునది. వారణాశి సకల శాస్త్ర పురాణములు, సంహితాలు, వేదవిద్వద్గణములచేత అలంకరింపబడినది. వారణాశి అన్నపూర్ణా, కాశీ విశాలాక్షి మొదలైన దేవతలతో కూడి పరమ శివునితో ప్రకాశిస్తున్న కాశీ పుణ్యరాశి.

కాశీలో గల మిగతా దేవతామూర్తులను ఈ విధముగా వర్ణించిరి.

**సీ॥ "కామితప్రదుఁడు, విఘ్నహరుండు శ్రీ ఢుంఠి**
**గణపతి ద్వారమ్ము కడవెలుంగ**
**లలిత స్వరూపిణి లక్ష్మీకటాక్ష వీ**
**క్షిత విశాలాక్షి, సంసేవసేయ**
**ఆనందదాయిని, అన్నపూర్ణ భవాని**
**ప్రచలిత కాలభైరవుడు నిత్యము, క్షేత్ర**
**పాలకుఁడయి నిల్వబల్మికల్మి**
**సిద్ధ దేవమునీంద్ర సంసేవితుండు**
**భస్మరుద్రాక్షమాలికా భాసితుండు**
**శాశ్వతైశ్వర్యదాయి, విశ్వేశ్వరుండు**
**దేవతా సార్వభౌముడుద్దీపితుండు**
**ప్రభ వెలుగుచుండు కాశి, శ్రీ వారణాశి"**[1]

వారణాశిలో కామితప్రదుడు విఘ్నహరుడైన శ్రీ ఢుంఠి గణపతి ద్వారము దగ్గర వెలుగుచుండును. లలిత స్వరూపిణి, లక్ష్మీ కటాక్ష వీక్షిత విశాలాక్షి సేవచేయుచుండగా, ఆనందదాయిని అన్నపూర్ణా భవాని సురుచిరమైన భిక్షనిడగా కాల భైరవుడు నిత్యము క్షేత్రపాలకుడై నిల్వగా సిద్ధులచేత, దేవతలచేత మునీంద్రుల చేత సేవింపబడు భస్మరుద్రాక్షమాలికలచే ప్రకాశించువాడు, శాశ్వతైశ్వర్యదాయి, విశ్వేశ్వరుడు దేవతాసార్వభౌముడై వెలుగుచుండును. మానవుడు తన పూర్వార్జిత పుణ్య లేశమున ఈ క్షేత్రమును దర్శించి నంతనే సంతోషము పొందును. ఈ భూమిపై కాశీ కాశీ కాశీ అని భక్తితో స్మరించినంత మాత్రముననే వారికి ముక్తి లభించును. అని కాశీ పట్టణము ఆ క్షేత్రము యొక్క విశిష్టతను చాటి చెప్పిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

## 9. గయ: -

దీ. 18-9-1964 సం॥లో శుక్రవారము నాడు గయకి వెళ్ళినపుడు ఈ విధముగా వ్రాసిరి.

మా మచిలీపట్టణములోని జనులకు చేమ,జామ అంటే బహు ఇష్టము. వాటి రుచి యందభిమానము. నేను వీటిని ఇకనుండి తినను అని నియమముగొంటిని. వీనిపై ప్రేమను విడిచి పెట్టలేనివాడు అవివేకి బంధముక్తుడై తరించునా? నేను ఈ కాశీ గయా క్షేత్రములు దర్శించుటకు వచ్చితిని. మా పాపములు విధ్వంసముచెందెను. జీవుని కోరికలనెడి మాయామోహ జంఝానిలము ఊపివేయును. శ్రేయోమార్గమునకు సంబంధించిన ప్రయత్నములు దోచునట్లు చేయదు. స్వస్వరూపమేదో బుద్ధిలో తోచజాలదు. విద్యాపూర్ణుడు కూడ రాగమును ద్వేషమును వీడజాలడుగదయ్యా! వాసనాదళిత మాయామోహపున్ వాయువులు జీవుని చుట్టివేయును. ఆగజాలవు. హృదయములో వీటినుండి తెప్పరిల్ల ప్రయత్నించినను సాగవు. ఎప్పుడూ రాగద్వేషములను త్యజించాలి. అట్లా చేయకపోయినచో మనశ్శాంతి కలుగదు.

**"అరిషడ్వర్గమునున్ దృజింపఁగల, దార్ఢ్యంబున్ గనన్‌జాలకే**
**నిరతమ్మున్ భుజియించువానినొకటేనిన్ ద్యాగమున్ సేయగా**
**దొరకొన్నన్, దరియించునందురు మహాత్ముల్ నిర్ణయింపంగబోల్**
**పరిపాటైనదియంత నొక్కటిఁదృజింపన్ బండ్లనున్ గూరలన్"[1]**

గయలో పండ్లను కూరలను ఎందుకు విడిచిపెట్టెదరో చెప్పుచున్నారు. అరిషడ్వర్గములైన కామ, క్రోధ, లోభ మోహ మద మాత్సర్యములను ఆరింటిని విడిచిపేట్టే దార్ఢ్యము సంపాదించవలెనంటే నిత్యము మనము తినే ఒకదానినైనా త్యాగము చేస్తే తరియించుదమని మహాత్ములైనవారు ఇట్లా నిర్ణయించిరి. అట్లా ఒక పండు, ఒక కాయ గూడ వదిలి పెట్టడము పరిపాటైనది. అని చెప్పిరి. మనకు బాగా ఇష్టమైన ఒక పండు, ఒక కాయగూర కనీసము మనము గయలో వదిలి దానిమీద ప్రీతిని విడిచి పెట్టగలిగినపుడు కొంచెము కొంచెము రాగద్వేషములను కూడ మనము విడిచిపెట్టడానికి ప్రయత్నించవచ్చును. అది కష్టముకాదు అని అర్థము. గయ, కారుణ్యామృతపూర్ణరూప పితృలోకమట. అట్టి గయలో ఫల్గునీతీరములో విష్ణుపాదమున భక్తితో శ్రద్ధగా వటవృక్షమూలములో శ్రాద్ధము పెట్టినచో పితృదేవతలకు దివ్యపదమ్ము చేకూఱును. తమ పితరులు గోత్రాళి దీవించుదురు. అని వ్రాసిరి. అందువలననే గయ వెళ్ళిన ప్రతివాళ్ళు గయా శ్రాద్ధం అని పిండప్రదానం చేసి వస్తారు. అట్లా చేయడం వలన పితృదేవతలు తృప్తి చెందుతారని మన విశ్వాసము.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

## 10. శ్రీ భువనేశ్వరీ - పూరీ - జగన్నాథయాత్ర: -

శ్రీ గురుజాడ రాఘవ శర్మగారు ది 17-5-1962 వ సంవత్సరములో పూరీ జగన్నాథ యాత్రా సందర్భములో

**"భానుఁడెదురేగి, యొసగె, సుస్వాగతమ్ము**
**బ్రహ్మపురమునుఁగదలి పోవంగ, భూరి**
**పర్వతమ్ములు పర్వెత్తి, ప్రక్క కొదుగ**
**మేటి వృక్షమ్ములెన్నియో, బాట, వంగి**
**నిలచి సేవింప, జనపదమ్ములు, చరాల్న**
**త్రోవఁజేయంగ, రివ్వునఁదూలి వాయు**
**దేవుఁడున్ వెన్క హాయినే తేరఁజేసి**
**నారమానందముగ, జగన్నాథ యాత్ర**
**పర్వతశ్రేణి నేత్ర పర్వం బొసంగఁ**
**జల్లనౌ పచ్చనౌ తరుచ్ఛాయ లందు**
**మించి మెయి మరపించు సమీరధీర**
**శీతలతరంగ డోలికా తీత సేవ**
**లందసాగెను, హాయి ప్రయాణమెల్ల"[1]**

అని వర్ణించిరి. సూర్యుడు ఎదురువచ్చి స్వాగతము చెప్పెనట. వృక్షము లన్నియు బాటలకిరుప్రక్కల నిలచి సేవిస్తున్నాయట. జనపదములు త్రోవ చేస్తున్నాయట. వాయుదేవుడు వెనుక హాయిగా రాగా ఆనందముగా నున్నది జగన్నాథ యాత్ర. పర్వతశ్రేణి నేత్ర పర్వముగానున్నదట. చల్లని పచ్చనైన చెట్ల నీడలు, అంతకుమించి మైమరపించు చల్లని వాయు తరంగములు ఉయ్యాలలూగుతున్నట్లుగా ప్రయాణమెల్ల హాయిగా నున్నదట. వీరి ప్రకృతి పరిశీలన అత్యంత రమణీయముగానున్నది. గాలి వీచినపుడు చెట్లు వంగుట సహజము. అది వీరు తనని సేవిస్తున్నట్లుగా భావించిరి. తూర్పుదిక్కుగా ప్రయాణమై వెళు ్ళనపుడు సూర్యుడు ఎదురుబడుట సహజము. దానిని తనకి స్వాగతము చెప్తున్నట్లుగా భావించిరి. పర్వతపంక్తులు వరుసగా అందముగా ఉండి, పచ్చని, చల్లనైన చెట్ల నీడల మధ్యలో నుండి ప్రయాణము చేయుచు వెళ్ళునపుడు చల్లనైన గాలి వీచుచున్నప్పుడు బాగున్నదని అనిపించడం సహజము. అది

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

ఉయ్యాలలూగుతున్నట్లుగా అనుభూతిని పొందిరి. ఒకసారి క్రిందకి దిగుచు, ఒకసారి పైకి వెళ్ళుచు, చకచకా వాగులను, నదులను, జంతువులను, పక్షులను, అడవిలో దాటుచు, వాహనములు, జనసమూహమును చూచుచూ దాటుకొనుచు ఎన్నో పల్లెలు పట్టణములు ఎదురై ఏవో ప్రసంగింపబోగా పేర్లు చూసీ చూడకుండా, తలలు త్రిప్పి గమ్యస్థలము చేరుటకు ఆకాశములో ప్రయాణించు విమానము వలె మా వాహనము ఆనందముతో పరుగులు బెట్టెను. అని తాము పూరీ జగన్నాథము ఎట్లు చేరిరో వర్ణించిరి. ఆ జగన్నాథుని

**"శ్రీ నీలాచలవాస, మౌని జనహృన్నీరేజ పద్మాసనా**
**శ్రీ నిర్హేతుక జాయమాన కరుణా సింధూ! సుహృల్లోక బం**
**ధూ! నిత్యాభయ వైభవాన్విత కరస్తున్, శ్రీ ప్రశస్తున్, నినున్**
**ధ్యానింతున్ దరియింప జన్మము, జగన్నాథ ప్రభూ! మద్విభూ!"**[1]

అని ధ్యానించి, భగవంతుని సంకల్పమేమిటో ఎవరు తెలిసికొనలేరట. నీ సౌందర్య విలాసభాసురమైన దేవాలయమును, గోపుర ప్రాకారములను సేవించుటకు వచ్చితిని గదా! అని నిన్ను చూచుటతో నా జన్మ సార్థకమైనది అని భావించిరి. అంతేగాక యోగీంద్రులకు కూడ ఆయన దివ్యమైన శుభప్రదమైన దర్శనము లభింపదట. అట్టితనకి కల్గినది కావున జన్మసార్థకమైనటుల భావించిరి. నీవు వాత్సల్యస్వరూపుడవు. ఎంతని కీర్తింతును, నీ భక్తుల చేత పూజలందుకొనుచు పూరీనగరీ జనాశ్రితుడవైన ఓ జగన్నాథా! మత్ప్రభూ!

**"సాక్షివి, కర్మసాక్షివి, ప్రసన్న కృపామృత దివ్యవీక్షణా**
**లక్షిత లక్షణుండవు, విలాస సమేత మనోజ్ఞ మన్మనః**
**సాక్షివి యేలుకొందు మనసా నెరనమ్మిన వారి భక్తసం**
**రక్షక! 'గోపగోగణ విరాజిత'! గోకులబాల! కృష్ణయా!"**[2]

సాక్షివి, నేను చేయు కర్మలకు సాక్షివి. ప్రసన్నమైన దయామృతమనెడి దివ్య వీక్షణములచేత విలాసముగా మనోజ్ఞమైన నా మనస్సునకు సాక్షివి. నిన్ను నమ్మిన భక్తులను సంరక్షించువాడవు. గోపకుల గోగణముచేత ప్రకాశించు గోకుల బాలుడవైన ఓ కృష్ణయా! అంటారు. శ్రీ శర్మగారు తన మనస్సాక్షియైనవాడు, తనను రక్షించువాడు, ఆ కృష్ణ పరమాత్మయనే నమ్మిరి. పూరీలో జగన్నాథునిలో కూడ తన ఇష్టదైవమునే చూడగల్గిరి. విష్ణువు వేరు కృష్ణుడు వేరు శివుడు వేరు కాదు. అన్ని రూపములలో ఉన్న ఆ పరమాత్మ

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

ఒక్కడే అని తెలిసినవారు. తరువాత పద్యములో శ్రీ భువనేశ్వరీ పురమను పీఠము మీద విరాజమానమైన ఓ లింగ రాజ! నీవు భువనైక మోహనుడవు. దయామయుడవు. దివ్య పవిత్ర లింగ రూపములో వెలుగొందువాడవని ఈ సంసార సముద్రమును దాటింపజేయుమని వేడుటకు నీదరిఁజేరితిమి. సత్కృపాదృష్టితో ఏలుము. విభవాంఛిత మన్మనః ప్రభూ! అంటారు. వీరి మనస్సులో నుండేవాడుట. పూర్వజన్మపుణ్యవశమున నిన్ను దర్శించుటకు వచ్చితిమి అని అంటారు.

## 11. శ్రీ తిరుమల శ్రీ శ్రీనివాస సన్నిధి: -

శ్రీ శర్మగారు 14-12-1963 సం॥లో తిరుమలలో వేంచేసియున్న శ్రీనివాసుని సన్నిధికేగినపుడు

> **"శ్రీపతి! శ్రీనివాస! బహుచిత్రము, నీ కృపలోఁదలంపఁగా**
> **మాపులు రేపు సంసరణ మార్గము నంబడి కొట్టుకొంచు, సం**
> **తాపము నొందు, మాదృశుల, తావకపాద సరోజయుగ్మమున్**
> **జూపఁగఁబిల్చితే! నిను, గనుంగొన భాగ్యము, వేంకటేశ్వరా!"[1]**

అంటారు. నీ దయను తలచుకోగా చాలా చిత్రముగా ఉంటుంది. రేపు మాపు అని సంసార సముద్రములో బడి కొట్టుకొనుచున్న మా వంటి వారికి మీ పాదపద్మములను చూపించుటకు పిలిచావా! నిన్ను చూసే భాగ్యము కలిగినది కదా అని తమ సంతోషమును వ్యక్తము చేస్తారు. పుత్రులు, భార్యా, మిత్రులు వీరి పోషణ సందడిలో మునిగిపోయి తాపత్రయము నొందు జీవులకు ఈ బంధములను సడలించి నీ కృపాపాత్రులగునట్లు చేయుట పూర్వజన్మ పున్నెముగా తలచి నిన్ను భక్త వరదుడవని స్తోత్రము సేయుదును.

> **"పుట్టిన దానికిన్ ఫలమపూర్వముగాఁగనుపట్టులచ్చికిన్**
> **పట్టగు నీ నివాసము కృపా పరిపూర్ణ! కనంగ బూర్వమం**
> **దెట్టిడు పుణ్యమొక్కో! లభియించెను నేటికి, నీవు నన్ను రా**
> **బట్టుటె గొప్ప, నీ పదముఁబట్టుట లేమన, వేంకటేశ్వరా!"[2]**

పుట్టిన దాని కంటే ఫలము అపూర్వముగా కనుపట్టుచున్నది. లక్ష్మీదేవికి నివాసమైన నీ పాదములు పట్టుటలేమనను? నీవు నన్ను ఇక్కడికి రప్పించడమే గొప్ప. పూర్వజన్మలో ఏమి పుణ్యము చేశానో గదా! తీరిక లేకుండానిత్యము పదిసార్లు తిరుగుతూ, మారుమూల సంసారములో మునిగియుండి, కొంచెము

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

కూడా శాంతి ఏమిటో ఎఱుగని నన్ను నీ దగ్గరి బిల్చుట ఏమి? నీ లీలలు బహు చిత్రము. ప్రేరేపించి నన్ను పిలిపించితివి గదా! నీ పదములు పట్టుకొనుటను ఏమనను? అంటారు. శ్రీ శర్మగారు తిరుమలకు వెళ్ళాలని ప్రయత్నము చేసి వెళ్ళలేదు. భగవంతుడి దయ వలన వారు చేసిన పూర్వజన్మ పుణ్య ఫలితము వలన శ్రీనివాసుని సన్నిధికి వెళ్ళుట తటస్థించినదని భావించిరి. భగవంతుడు తన భక్తుడిని చూడనెంచి అక్కడకు రప్పించెనట. అంతేగాదు నీ పదములు పట్టుకొనుటను ఏమనను అంటారు. అనగా వీరికి ఆ శ్రీనివాసుడు ప్రత్యక్షమైనాడు. తరువాత పద్యములో

> **"అనుపమ దివ్య మంగళమునై చెలువారెడు, నీ స్వరూపమున్**
> **గనుఁగొను భాగ్యమబ్బెఁజిరకాల తపఃఫలమెంతయేని, కూ**
> **ర్చునుగద, యిట్టి పుణ్యముల జాడ్కిగనుంగవభాగ్యమెల్ల, లోఁ**
> **దనియని నీదు రమ్యజనతాహితరూపము, వేంకటేశ్వరా!"[1]**

అని అనుట వలన మనకు తెలియుచున్నది. నీ దివ్యమైన మంగళ స్వరూపమును చూసే భాగ్యము కలిగినది. అని అంటారు. అది లోపల దృష్టి చెందని నీ రమ్య జనతాహిత రూపము అంటారు. నీ దివ్య మంగళ విగ్రహమును చూస్తే ఎంతసేపు చూసినా ఇంకా చూడాలనే అనిపిస్తుంది. చూశాము చాలు అని తృప్తి కలుగదు. ఆపదలో మొక్కువారి మొఱలన్నియు గ్రహించి వారిని అనుగ్రహించి సంతాపమును పోగొట్టుదువను నమ్మకముతో సమర్పణ బుద్ధితో ఎందరో భార్యాబిడ్డలతో సహా కదలి వచ్చి ఎన్నో కష్టాలు పడి నీ దరి జేరినారు. వీరందరిని రక్షించవలసినది అని అంటారు. కేవలము స్వార్థముతో తనను కాపాడుమని ప్రార్థించక లోకకల్యాణము దృష్టితో జనులందరిని కాచి రక్షించుటకు రమ్మని పిలుచుచుండిరి.

> **"వేసము దివ్యమంగళము, పేరది 'కాసులవాడవంట' నీ**
> **కోసముఁబేదవాడు, ధనికుండు, నహంకృతి వీఁడి, సన్నుతుల్**
> **జేసెడి నీ మహత్త్వము నశేష కృపాంబుధి వంచుఁజేయనౌ**
> **దోసములన్ క్షమించు, వరదుండవటంచును, వేంకటేశ్వరా!"[2]**

నీ వేషము మంగళప్రదము. పేరు కాసులవాడు. నీ కొరకు పేదవాడు ధనికుడు అను అహంకారమును విడిచి పెట్టి నీవు దయగలవాడివి, దోషములను క్షమించి, కోరిన కోర్కెలు తీర్చుదువని నుతింతురు. కలియుగ నాయకుడవు. ఆర్తిహరుడవు అని ప్రభాత వేళ కీర్తనలు పాడి తరియించెదరు. ప్రాణులకు ఏ

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

క్షణము ఎట్లా మెలగవలెనో నీవు నిర్ణయింతువు. శేషగిరీంద్రుడవైన నిత్యకల్యాణము పచ్చతోరణముగా వెలుగొందు నీ మహామహిమను నా కనువిందుగా చూసితిని ధన్యుడనైతిని. "నా ప్రాణములీవ, ప్రోవఁగదే! రాఘవుడన్ సుమి! వేంకటేశ్వరా" అంటారు. నేను నీ పద దాసుడనయ్య అని చెప్పుట అంతరార్ధము.

11-7-1964 సం॥లో శ్రీ క్రోధ నామ సంవత్సర ఆషాఢ శుద్ధ స్థిరవారము నాడు తిరుమల కేగి వీరు తోమాలసేవలో పాల్గొన్నప్పుడు, నేటికి కన్నుల పండువుగా నీ మంగళమైన దర్శనమును పొందితిని మీ పాదపద్మములను స్మరింపగనిమ్ము, నీ కృపామృతమును నాపైఁజిల్కుము అని

**"అల్పమనస్కులౌ నరులకందదు, గ్రాహ్యముకాదు, నీదు సం**
**కల్పము, నెన్నడే నితఁడొకండు, భవత్పద భక్తుఁడన్నచాల్**
**కల్పశతాలకైన నిను గాంచెడి భాగ్యము గల్గగోరెదన్**
**వేల్పులవేలుపై విజయవేంకటనాయక! వేంకటేశ్వరా!"**[1]

ఓ వేంకటేశ్వరా! అల్పమనస్కులైన మానవులకు అర్థము కాదు. నీ సంకల్పము ఏమిటో ఊహకందదు. ఎన్నడైనా ఇతడొకండు నీ పద భక్తుడు అంటే చాలు. కొన్ని సంవత్సరములకైనా నిన్ను చూసే భాగ్యము కలిగితే చాలు అని కోరుకుంటాను. నీవు వేల్పులకు వేల్పువు. విజయ వేంకట నాయకుడవు.

ఈ విధముగా శ్రీనివాసుని అనుగ్రహమునకు పాత్రులైరి.

## 12. అరసవల్లి - సూర్యనారాయణ క్షేత్రము: -

శ్రీ శర్మగారు 1-2-1982 సం॥లో అరసవల్లి క్షేత్రమును సందర్శించినపుడు ఈ విధముగా శ్రీసూర్యదేవుని స్తోత్రము జేసిరి.

**మ॥ "అలసత్వమ్ము, తమస్సుపోనడచి, దివ్యారోగ్యమీయన్, మహో**
**జ్జ్వల కాంతుల్ వెలయించి, సాకెదవయా! సప్తాశ్వముల్ బూని, ని**
**శ్చల భక్తిన్ దరియన్, ఉషారమణి, ఛాయా, పద్మినీ దేవి, య**
**ర్మిలి సేవింపగ, వెల్గెదౌ! అరసవల్లీ! సూర్యనారాయణా!"**[2]

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

శ్రీ సూర్యనారాయణుడు మనలోని అలసత్త్వము, అజ్ఞానమును పోగొట్టి దివ్యమైన ఆరోగ్యమిచ్చి మహోజ్జ్వల కాంతులతో వెలుగునట్లు సాకుదువు. సప్తాశ్వములను అధిరోహించి, నిశ్చలమైన భక్తితో ఉషారమణి, ఛాయా, పద్మినీదేవి ప్రేమతో సేవించుచుండగా వెల్గెదవు అని కీర్తించి, గత జన్మ సుకృతముచే భక్తితో నిన్ను సేవించుటకు వచ్చితిని. దుర్మతినామ సంవత్సరములో మాఘమాస శుక్ల సప్తమి రోజున నీ సన్నిధికి చేర గల్గితిని. రవిచంద్రాత్మకమైన నా హృదయహర్మ్యంబందు నేడు ఏదో కాల విశేషముగా నా కష్టములను పోగొట్టి చైతన్యవంతుని చేయ చేర్చితివిటకు తండ్రీ! నీ దాసుడను.

**మ॥ “అమితానందముతో కనుంగొనెడి, భాగ్యంబౌ, భవత్పాదప**
**ద్మములందున్ గిరణ స్రవంతి స్రవియింపన్ కాంతిపుంజమ్ములన్**
**రమణీయంబగు, నీదు దేవళము జేరన్ పండెనా కోరికల్**
**విమల ప్రాభవమండలా! అరసవల్లీ! సూర్యనారాయణా!”[1]**

ఓ అరసవల్లీ! సూర్యనారాయణ! అమితమైన ఆనందముతో నీ పాదపద్మములందు కిరణములు స్రవింపగా కాంతిపుంజములతో రమణీయమైన నీ దేవాలయమును సందర్శించగానే నా కోరికలు దీరెను. నీవు స్వచ్ఛమైన ప్రభావమైన మండలాంతర్వర్తివి.

నేను గురుజాడ రాఘవుడను రవిమహాదశయందు, ఆ రవి కుమారుడైన శని మేటి అంతర్దశను హాయిగా దాటునట్లు చేసి కరుణతో రక్షింతివి. ఓ అరసవల్లీ! సూర్యనారాయణా! ప్రేమతో నా నమస్సులు స్వీకరింపుము అంటారు.

**గీ॥ “ఓం నమో భాస్కరాయ! శ్రీయుతనమోస్తు**
**పతిత పావన, శ్రీ ఉషాపతి! నమోస్తు**
**పూత చారిత్ర ఛాయా సమేత! యనుచు**
**మ్రొక్కెదను నీకు, సాష్టాంగములను భక్తి॥”[2]**

అరసవల్లిలో శ్రీ స్వామి వారి సింహద్వారముపై ఓం నమో భగవతే భాస్కరాయ, ఓం హ్రీం సూర్యాయనమః” అని వ్రాయబడియున్నది. దానిని పద్యములో చొప్పించి భాస్కరాయ నీకు సాష్టాంగ నమస్కారములతో మ్రొక్కెదను అనుటలో వీరి భక్తి భావము వెల్లడియగుచున్నది. తరువాత గీత మాలికలో

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

ఆ సూర్యనారాయణుడెటువంటివాడో చెప్పుచున్నారు. అరసవల్లి మహా క్షేత్రమందు వెలసిన శ్రీ సూర్యనారాయణుడు దాక్షిణ్యమూర్తియట. లోకచక్షువట. కరుణావలోకనుండట. పావనుడట, త్రైలోక్యబాంధవుడట. సంతత క్షేమకరుడట. పున్నెముల ప్రోవట. గాఢ తమో హరుండట. సకల పాతకహరుడట. సౌజన్యమూర్తియట. సిద్ధవిద్యాప్రదుడట. విశుద్ధమూర్తియట. భక్తలోక శరణ్యుడట. శ్రీ అరసవల్లీ! సూర్యనారాయణ నా మనస్సాక్షివగుచు పాలనము చేయుమా! అరసవల్లీ దేవ! ప్రణతులివిగో! అంటారు. సూర్యుడు లోక బాంధవుడు. లోకములోని జనులందరికి సాక్షీభూతుడు. అట్టి సూర్యుడు తన మనస్సాక్షి వై నన్ను పాలనము చేయుము అని ప్రార్థిస్తారు. అనగా తన హృదయాంతర్వర్తివై యున్నవాడవు నీవే సుమా! అని భావము. మనము చేసే బాహ్య క్రియలకు సూర్యుడు ఎట్లా సాక్షీభూతుడో! అట్లే మన మానసిక ప్రవృత్తులకు ఆత్మస్వరూపుడుగా ఉన్న ఆ పరమాత్మ సాక్షీభూతుడు అని చెప్పుట. ఇక్కడ కూడ ఆత్మ పరమాత్మ వేరు వేరు కాదు. ఇరువురు ఒక్కటే అని చెప్పుటలో అద్వైత భావము స్ఫురించుచున్నది.

1-2-1982 సం॥లో శ్రీ కూర్మము సందర్శించినపుడు

ఉ॥ **"చేతము పొంగి పొర్లగ,వశీకృతయౌచు, జగమ్ములెల్ల, ని**
**ర్హేతుక సత్కృపన్ గని, వహించితి మూపున భారమైన, యీ**
**భూతలమున్ సదా, సకల భూతము లెంతయు సంతసింప, వి**
**ఖ్యాత దయా స్వరూప నిను నర్మిలి మ్రొక్కెదకూర్మ రూపునిన్"[1]**

మనస్సు ఆనందముతో పొంగిపొర్లునట్లుగా ఈ జగములన్నింటిని కారణము లేకుండగానే దయతో నీ మూపురమున బరువైనప్పటికి మోసితివి. ఈ భూమి మీద నివసించే ప్రాణులన్ని సంతసించునట్లుగా నీ దయా హృదయమును వెల్లడించితివి. అట్టి కూర్మరూపుని నిన్ను ప్రేమతో నమస్కరించెదను అంటారు. శ్రీ కూర్మములో నున్న విష్ణుమూర్తి కూర్మావతారములో కనబడేసరికి వీరి చిత్తము భక్తితో ఉప్పొంగి, సకల భూతములను నీ మూపున భారమైన వహించితివిగదా! అంటారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

## 13. విజయవాడ - కనకదుర్గా మల్లేశ్వరస్తవము: -

శ్రీ శర్మగారు 15-10-1961 సం॥లో విజయవాడలో శ్రీ కనకదుర్గా మల్లేశ్వరీ ఆలయములో దసరా ఉత్సవముల - కవి పండిత గోష్ఠిలో పాల్గొనినపుడు ఆదేవినిట్లు స్తుతించిరి.

**"శ్రీ విజయవాటికా - శ్రీ కనకదుర్గ!**
**శ్రీ విజయవర్గ, తో - షిత దివ్యభర్గ!**
**శ్రీ విజితసర్గ, ని - ర్జితతాపవర్గ!**
**శ్రీ విజిత గుణవర్గ - సృష్టపవర్గ॥"[1]** శ్రీ విజయవాటికా శ్రీ కనకదుర్గ!

**"శ్రీ మన్మంగళరూపిణీ! త్రిభువన క్షేమంకరీ! శాంకరీ!**
**శ్రీ మన్మంజులరత్న భూషణ కళా! చిద్రూపిణీ! తారిణీ!**
**భూమీశార్చిత పాదయుగ్మ! కరుణాపూర్ణా! అపర్ణా! ప్రపూ**
**ర్ణా! మాహేశ్వరి! తల్లి! శ్రీ కనకదుర్గా! దేవి! మల్లేశ్వరీ!"[2]**

అని కనకదుర్గా దేవిని స్తోత్రము చేసి నవరాత్రోత్సవ వైభవోజ్జ్వల మహానందముచే పవిత్రాత్ములై వినోదించు సత్కవులను, పండితులను నీ ఎదుట నిన్ను గూర్చి పలుక వలెనని నిశ్చయించుకొంటిని. ఈ పర్వవిశేషమున పలుకుటచే నా జన్మ ధన్యమైనది. అని భావించి ఆనాటి కనకదుర్గను కాళిగా భావించుచున్నారు. చేతిలో పాశాంకుశములను ధరించి కాలోగ్ర భీభత్స భండన రౌద్రాకృతిని దాల్చి దుష్టుడైన మహిషుని, భండాసురుని చండముండులను, నిశుంభుడు మొదలగు వారిని సంహారము సేయు నర్తనకాళిగా, సింహవాహినిగా దలతును అని అంటారు. దసరా నవరాత్రి మహోత్సవములలో శ్రీ కనకదుర్గాదేవిని తొమ్మిది రోజులు తొమ్మిది రకముల అలంకారములతో అలంకరించి సేవ చేయుదురు. ఒకరోజునాటి అలంకారము మహిషాసురమర్దని. ఈ రూపమును ఇచ్చుట కళ్ళకు కట్టినట్లుగా వర్ణించిరి. ఓ తల్లీ! మల్లేశ్వరీ! నీ సాన్నిధ్యములో శివుడు లోకములు సృజించుటకు అశక్తుడుగాడు. శక్తుడుగదా! సురలు మూడ ఆమె సౌందర్య విలాస వైఖరులతో నిండి పోయినదిట. ముల్లోకాలను రక్షించే దేవతవు నీవే కదా అంటారు. ఆ తల్లిని ఏదో ఒక వరమడుగక పాదపద్మములను కొల్చే శక్తిని ఇమ్మనుచున్నారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

**"హల పద్మాంకు శంఖచక్రశుభ రేఖాలంకృతంబైవిరా**
**జిలుచున్ కాంచనరత్న నూపురలసత్ శ్రీ దివ్య శోభా ప్రభో**
**జ్జ్వలమౌ, తావకపల్లవారుణ పదాబ్జాతమ్ములన్ గొల్చు, పు**
**ష్కల శక్తిన్ దయసేయుమా! కనకదుర్గాదేవి! మల్లేశ్వరీ!"[1]**

ఓ కనకదుర్గాదేవి! మల్లేశ్వరీ! హలము, పద్మము, అంకుశము, శంఖము, చక్రము మొదలగు వానిచే విరాజిల్లు కాంచనరత్న నూపురములచే ప్రకాశించు నీ పాదపద్మములను గొల్చు పుష్కల శక్తిని దయసేయుము. అని ప్రార్ధన చేసి ఆ తల్లి రూపమునిట్లు వర్ణించిరి.

**"పాణిన్ కంకణముల్, మణిస్థగిత సౌవర్ణప్రభల్ చిందు, నొ**
**డ్డాణమ్మున్ గటిఁగర్ణయుగ్మమునఁదాటంకమ్ములున్ భూషణ**
**శ్రేణుల్ కంఠమలంకరింప, ఘుసృణ శ్రీ రమ్యవస్త్రమ్ము, శ**
**ర్వాణీ మేనధరింతు, శ్రీ కనకదుర్గాదేవి! మల్లేశ్వరీ!"[2]**

ఆ కనకదుర్గాదేవి మల్లేశ్వరి చేతికి కంకణములు ధరించి అవి మణులతో సౌవర్ణ ప్రభలు చిందుతుండగా, కటి ప్రదేశములో ఒడ్డాణము, కర్ణయుగ్మమున తాటంకములు, కంఠమున ఆభరణములు, ఎఱ్ఱని వస్త్రము శరీరమున ధరింతువు.

**"సిగపై రాకిడి, చంద్రవంకయు, విరాజిల్లన్ బయిన్, నాసికన్**
**సొగసుల్ గుల్కెడు నడ్డబాస, నుదుటన్ జొక్కారు చేర్చుక్క, ము**
**జ్జగముల్ మోహవిలోలతన్ గొలుచు, నీ సౌందర్యమున్ గాంచి, చి**
**ర్నగవున్ జిల్కుమ! నా పయిన్ కనకదుర్గాదేవి! మల్లేశ్వరీ!"[3]**

ఓ తల్లీ! సిగమీద రాగిడిగా చంద్రవంక విరాజిల్లుచుండగా, ముక్కుకు అందమునొసగు అడ్డబాసను ధరించి, నుదుటిపై చేర్చుక్కతో ముల్లోకములను మోహ విలోలతను గొలుచు నీ సౌందర్యమును చూచు నా మీద చిఱునగవును ఁజిల్కుము. ఓ తల్లీ! నీవు జగములను పాలన సేయు రాజ్ఞివి. నీ సందర్శనము చేసినంత మాత్రముననే రాజ్యప్రద శక్తివిఁగూర్చుదానవు. స్వర్ణప్రాభవోద్దీప్తులింపుగ రంజిల్లెడి దివ్యమైన రత్న మకుటముచే నీ ముఖాబ్జము యొక్క సోయగమును గాంచి తరించెదను. ఠీవిగా సుందర సీమయైన విజయవాడలో ఇంద్రకీలాద్రి పైనుండి సుజనులు సేవింపగా, నీ పదసాన్నిధ్యములో కృష్ణానది

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3 పద్యాలు.

స్రవించుచుండగా, శ్రీ విద్యుత్ప్రభ చిందు దేవళములో చెల్వారు నీ మూర్తి, నీ లావణ్యము చూడవలెను. అని ఆ తల్లి మనోహరరూపమును వర్ణించి, ఆ తల్లి ఎట్లా వెల్గుతూ ఉంటుందో చెప్పుచుండిరి. కనువిందొనరించుచు, వరదాభయప్రదయై, కల్యాణివాణీ రమాఘన సేవా పరితృప్తయై, నిఖిల లోకస్తుత్యయై, భక్తులను రక్షిస్తూ, సన్మణి పీఠికా నిలయమై, సాక్షాచ్చిదానంద సౌఖ్య నిధానంబయి వెల్గుచుండునట. ఆమె రూపమే చిదానందము. ఓ తల్లీ! మల్లేశ్వరీ! పదవులు కోరను. ధనము ఇమ్మని తపించను. స్వార్థముతో కీర్తిసంపదల నార్జించవలెనని ప్రాకులాడను. ఈ భూమిపై సర్వము నీవే! నీ పద యుగ్మమును నా మదిలో నిలుపునట్లుగా చేయుమని ప్రార్థింతును. ఓ రాజరాజేశ్వరీ! తల్లీ! నీవు నిత్యాభయప్రదవు అంటారు. ధనము, కీర్తి, పదవులు ఇహలోక సౌఖ్యములు. ఇవి శాశ్వతములు గావు. నా మనస్సు నీ పదయుగ్మములందు నిలుపునట్లు చేసితివనుకో శాశ్వతమైన నీ సచ్చిదానంద రూపమునందగల్గు స్థితికి చేరవచ్చును. ఇది శాశ్వతమైనది గాని ఇహలోక సౌఖ్యములు తనకి వద్దని చెప్పుట. ఇక్కడ వీరు ఒక అద్వైతిగా గోచరించుచుండిరి. అంతటి జ్ఞానము ఒక సామాన్య మానవునికి కలుగదు. ఒక ఋషి, అద్వైతి మాత్రమే ఆ పరమాత్మ తత్త్వమును తెలిసికొనగలడు. అట్టి పరమాత్మతత్త్వము నెఱిగిన వారు శ్రీ కవిశేఖరులు. ఇదే భావమును

> "శ్రేయోదాయకమౌ త్వదీయ పదరాజీవమ్ములర్థింతు, న
> మ్మా! యీ యైహిక భోగభాగ్యములు, విద్యాపాండితీ వైభవం
> బాయుర్భాగ్యము, భూరి, సంతతి త్వదీయానుగ్రహప్రాప్తియే
> గా! యోగాత్మిక వంబికా! కనకదుర్గాదేవి! మల్లేశ్వరీ!"[1]

ఓ కనక దుర్గాదేవీ! మల్లేశ్వరీ! శ్రేయోదాయకమైన నీ పద రాజీవమ్ములనర్థింతును. ఈ యైహిక భోగభాగ్యములు, విద్య, పాండిత్యవైభవము, ఆయుర్భాయము, సంతతి ఇవన్నియు నీ అనుగ్రహముతో నేను కోరకుండగనే నీవు ప్రసాదించితివి కదా! శ్రేయోదాయకమైన శాశ్వతానందమును కలిగించు నీ పద రాజీవమ్ముల నర్థింతును అని భావము. ఆ తల్లిని మనస్సునందు నిలుపుకోగలిగినపుడు కలుగు ఆనందము వర్ణనాతీతము. దీనిని యోగులైనవారు మాత్రమే తెలిసికోగలరు. కారణము నీవు యోగాత్మికవు. సుజనులు కల్యాణాత్మకమైన నీ కథలు వినుచు జన్మసాఫల్యమునొందునట్లుగా తరింతురు. జగత్తుకు శుభములొసగుచు అవ్యాజవాత్సల్యానంద రసస్వరూపిణివిగా ఉద్భవించితివా! అంటారు. భక్తితో పరవశమైన వారు ఆ తల్లి అవ్యాజానంద రస స్వరూపమును కనకదుర్గాదేవిగా రూపు దిద్దుకున్నట్లుగా భావించిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

**"పరిపూర్ణంబయి, నిర్గుణంబగుచు, విశ్వవ్యాప్తవౌనీవు, భా**
**సురలీలన్ సగుణాకృతిన్ గనుచు, సంశోభిల్లెదౌ, సృష్టిసం**
**భరణాది క్రియలన్ ద్రిమూర్తులు, చరింపన్ త్వన్మహాశ్చర్య సృ**
**ష్టి రస్యంబులనంతముల్ విజయవాటీ స్వర్ణదుర్గాంబికా!"[1]**

ఓ విజయవాటీ స్వర్ణదుర్గాంబికా! నీవు పరిపూర్ణమై నిర్గుణంబగుచు, సగుణాకృతితో విశ్వమంతా వ్యాపించి సంశోభిల్లుదువు. సృష్టి, సంభరణాది క్రియలలో త్రిమూర్తులు తిరుగుతూ ఉండే నీ సృష్టి రహస్యములు అనంతములు, ఆశ్చర్యమును కలిగించునవి అని అంటారు. ఇక్కడ ఆ పరమాత్మ నిర్గుణుడు, నిరాకారుడు అని తెలిసిన శ్రీ శర్మగారు, సృష్టి చేయుటకు, ఆ సృష్టి కొనసాగించుటకు, లయము చేయుటకు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు చరించుచుండగా, నీ సృష్టి రహస్యములు అనంతములు. ఆశ్చర్యములు. అనగా సృష్టి స్థితి లయములు చేయు త్రిమూర్తులకు శక్తినొసంగు మూల శక్తి కారకురాలవు నీవే అని చెప్పుట. ప్రకృతి శక్తి స్వరూపిణి. ఆమెయే బ్రహ్మ విష్ణు మహేశ్వరుల రూపములో సృష్టి - స్థితి - లయము చేయుచున్నదని చెప్పుట. అటువంటి శక్తి స్వరూపవు విజయవాటీ స్వర్ణదుర్గాంబిక! అని చెప్పుట. ఇచ్చుట శ్రీ కనకదుర్గను ఒక త్రిశక్తి స్వరూపమైన దుర్గగా భావించిరి.

**"ఒక చేతన్ బసిబిడ్డనాదుకొని వేరొక్కంట, శత్రున్ వికా**
**వికలై తూలఁగఁగూల్చునట్లు, జననీ! ప్రేమాకృతీ! భక్త క**
**ల్పకవల్లీ శ్రిత రక్ష జేసెదరివర్గమ్మున్ వెసన్డుల్చి, చం**
**డిక రూపమ్మున శాంతికై, విజయవాటీ స్వర్ణదుర్గాంబికా!"[2]**

ఓ స్వర్ణ దుర్గాంబికా! ఒక చేతితో పసిబిడ్డనాదుకొని, వేరొక చేతితో శత్రువును తునాతునకలుగా కూల్చు ఓ ప్రేమాకృతీ! నీవు భక్తకల్పవల్లివి. శత్రువర్గమును వెంటనే కూల్చి శాంతిని చేకూర్చుటకై చండిక రూపమును ధరించి ఆశ్రిత జనులను రక్షించెదవు. ముల్లోకములు నీవే. ఈ భారత భూమియంతయు నీ పూర్ణప్రభానంద సంపుల్లానంత విహార భూమి. కళలతో పొంగారు ముద్దారు నీ ఇల్లాంధ్రావని. అందులో ఎంతో దివ్యభోగములచే హాయిగా వెల్గెదవు. అది నీ విడిది అంటారు. ఈ మూడులోకములలో విస్తరించియున్న అనంతమైన శక్తి ఆ తల్లియట. ఈ భారతమంతా ఆనందముతో విహరించు భూమియట. కళలతో ఉప్పొంగిపోవునట. ఆమె యిల్లు ఆంధ్రావనియట. అందులో దివ్యమైన భోగభాగ్యములతో హాయిగా వెల్గుట

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

ఆమె విడిదియట. మనోహరమైన భావన. ముల్లోకములలో వ్యాపించిన చైతన్యశక్తి ఏదో అది ఆ తల్లియే అని గుర్తెరుగుట అదే ఈ భారతము. అందులో ఆంధ్రావని ఆతల్లి విహార స్థలము - అందులో విడిది దివ్యమైన భోగ భాగ్యములు. భోగ భాగ్యములు ఆమె స్వరూపము - మరియు అవి ప్రసాదించునది ఆ తల్లియే అని చెప్పుట. ఎక్కడ సంపద ఉంటుందో అక్కడ ఆ తల్లి విరాజిల్లుతుంది. ఎక్కడ భోగములు అనగా మానవులు ఎప్పుడు సుఖములననుభవిస్తారో అదే బ్రహ్మానందముగా భావిస్తారు. కావున అది ఆ తల్లికి విడిది స్థానము. విడిది అనగా కొంచెముసేపు ఉండి వెళ్ళిపోయే స్థలము. అనగా భోగభాగ్యములు ఎల్లప్పుడు శాశ్వతముగా ఉండేవి కావు. ఈ రోజు ఉండవచ్చు. రేపు లేకపోవచ్చు. ఇవి శాశ్వతానందము నీయవని చెప్పుట. విజయవాటీ స్వర్ణదుర్గాంబిక ఎంతటి శక్తిమంతురాలో కీర్తించి దేశము ఈ దుస్థితిలో నున్నది కరుణతో గాచుటకు రమ్మని ప్రార్థించుచున్నారు.

**"క్రేళ్లుఱుకుచుండె, పాకిస్థాను మెలమెల్ల**
**మ్రింగఁగా పొంగి, కాశ్మీరుపాప**
**సాహసోద్రేకయై, సాగెనుత్తర దిశ**
**కబళింప, చైనాప్రగల్భ శక్తి**
**సాకుగాగొని భవత్ సౌజన్య భావమ్ము**
**బాధింపఁజొచ్చెఁ గోవాప్రజాళి**
**తఱివేచి, యాధిపత్యమునకై, తహతహ**
**పడుచుండిరెల్లెడ స్వార్థపరులు**

**కనవొ! ధర్మమ్ము నిల్పఁగాఁగానరావొ!**
**ప్రభువు మల్లయతోడ, సల్లాపమాడ**
**వేళకాదిది, లేచిరా! విజయవాడ**
**కనకదుర్గమ్మ! ఆంధ్రులకల్పకమ్మ!"[1]**

ఓ కనకదుర్గాదేవి! కాశ్మీరు కబళించటానికి పాకిస్థాను మెల్లమెల్లగా ప్రయత్నిస్తున్న సమయము. అట్లాగే చైనా ఉత్తరదిక్కు నుండి దేశాన్ని కబళించటానికి సాహసిస్తోంది. అదే సమయములో నీ సౌజన్యమును అదనుగా తీసికొని బాధించడానికి ప్రయత్నిస్తోంది గోవా ప్రజ. ఇదే అదనుగా తీసికొని ఈ క్లిష్ట పరిస్థితులలో స్వార్థపరులైన వారు ఎవరికి వారే ఆధిపత్యము కొఱకు తహతహలాడుట ప్రారంభించిరి. ఈ విధముగా

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

దేశ పరిస్థితి క్లిష్ట దశలో నున్నప్పుడు తల్లీ! నీవు ఆంధ్రుల కల్పవల్లివి గనుక ధర్మ సంస్థాపన చేయుటకు పూనుకోక తప్పదు. ఇప్పుడు మల్లేశ్వరునితో సల్లాపమాడు సమయము కాదు. వెంటనే లేచి మా మీద దయతో ఈ క్లిష్ట పరిస్థితిలో నున్న జనులను ఆదుకో! అని ప్రార్థిస్తున్నారు. ఇక్కడ శ్రీ శర్మగారి దేశాభిమానము వెల్లడియగుచున్నది. కేవలము తన స్వార్థము కొరకు ప్రాకులాడక దేశ దుస్థితి ఇది యని విన్నవించుకొని "సర్వేజనాః సుఖినోభవంతు" అన్నట్లుగా సమస్త ప్రజలకు శాంతిని చేకూర్చుటకు రమ్మని ఆహ్వానిస్తున్నారు.

**"అన్నమో రామచంద్రా!" యంచుకుయ్యిడు**
**దీన జనార్తి గుర్తింపలేవా!**
**వర్ణాశ్రమములు, విపర్యస్థితిన్ గ నీ**
**యవతారకారణంబరయలేవా!**
**భయభక్తిగొనక, వ్యాప్తంబగు నాస్తిక**
**తాప్రవాహము నడ్డదారిలేదా!**
**సద్యఃఫలవ్యాప్తిఁజాటుగా దోచెడి**
**వ్యాపార మరికట్టఁదోపలేదా!**
**మౌనముపహింప నిర్వీర్యమౌను జాతి**
**యాలసింపక లేచి రావమ్మ! ధర్మ**
**రూపిణి! దురిత విధ్వంసినీ! పరాకు**
**కనకదుర్గమ్మ! ఆంధ్రుల కల్పకమ్మ!"[1]**

'అన్నమో రామచంద్రా!' అనే దీనజనుల ఆర్తి గుర్తింపలేవా! వర్ణాశ్రమ ధర్మములు క్రమం తప్పిననూ, నీ అవతారకారణము తెలిసికోలేవా! భయము, భక్తిలేక వ్యాప్తమైపోవు నాస్తికతాభావమునడ్డుకొను దారి లేదా! అన్యాయార్జిత వ్యాపార మరికట్టదోచుట లేదా! నీవు మౌనము వహించినచో జాతి నిర్వీర్యమౌను ఆలస్యము చేయక లేచి రావమ్మ! నీవు ధర్మరూపిణివి! దురిత విధ్వంసినివి. ఓ కనకదుర్గమ్మ! నీవు ఆంధ్రుల కల్పకము. పరాకు ఎందులకు? అని ప్రార్థన చేసి ఈ లోకాన్ని కాపాడుటకే కదా! వివిధ ప్రాంతములందు వివిధ రూపాలలో వెలుగొందుచున్నావంటారు.

**"శ్రీ వారణాశియందావిర్భవించితి**
**'వన్నపూర్ణా!' విశాలాక్షివగుచుఁ**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

దక్షిణ దిశ, భక్తరక్షకై, మధుర, మీ
నాక్షివై, కంచికామాక్షివగుచు
శ్రీ భ్రమరాంబవై శ్రీశైలమున, దక్షి
ణాగ్రమ్మునందుఁగన్యకవు నగుచు
కాళివై యుత్తరాగ్రమున, యాంధ్రావని
మాణిక్యమకుటాయ మానమైన
విజయవాటీ పురీసింహ పీఠవగుచు
రాజ్ఞివై, లీవినుంటి, దుర్గాంబవగుచు
వెలసితివిగాదె! యిన్ని మూర్తులజగాన
కదలిరాగదె! ధర్మరక్షణకు వేగ
కనకదుర్గమ్మ! యాంధ్రులకల్పకమ్మ!"[1]

ఓ కనకదుర్గమ్మ! నీవే వారాణాశిలో 'అన్నపూర్ణ విశాలాక్షి' అనే పేరుతో ఆవిర్భవించితివి. దక్షిణ దిశలో భక్తుల రక్షించుటకై మధురలో మీనాక్షి పేరుతో, కంచిలో కామాక్షి పేరుతో శ్రీశైలమున భ్రమరాంబవై దక్షిణాగ్రమైన కన్యాకుమారిలో కన్యకగా ఉత్తరమున కాళివిగా ఆంధ్రదేశానికంతటికి మకుటాయమానమై విరాజిల్లు విజయవాటీ పురీ సింహ పీఠవగుచు, రాజ్ఞివై లీవిగా దుర్గాంబ అను పేరుతో ఈ జగత్తులో ఇన్ని మూర్తులతో వెలసితివిగదా! కావున తల్లీ! ధర్మ రక్షణ చేయుటకు వేగమే కదలిరా! భానుకోటి రుచి ప్రభవ శోభితా! విజయవాటీ స్వర్ణ దుర్గాంబికా! నీవు శత్రువిధ్వంసనము చేయుదానవు. జనులు నీ అష్టగ్రహారిష్ఠ దుర్భర బాధా భయలోలురై వాపోవుచున్నారు. నిన్ను శరణు కోరి నీ దరిజేరినారు. కరుణతో రక్షించుము. నీవు ఆశ్రిత వాత్సల్య స్వరూపిణివి. త్రిగుణరాశీభూతవు. ఓ కాత్యాయనీ! స్మితవక్త్రాబ్జ సుహాసినీ! సుజనసంజీవాత్మికా! మాతా! సకల విద్యాదాయినివి. పూజ్య పండిత విద్వత్కవి సన్నుతవు. అని స్తుతించిరి.

## 14. భద్రాచలక్షేత్రము - రామసందర్శనము: -

శ్రీ శర్మగారు 27-3-1969వ సంవత్సరములో భద్రాచల క్షేత్రమును సందర్శించినపుడు ఆ శ్రీరామునిట్లు కీర్తించిరి.

శ్రీ రఘురాముడు వైరిగుణ సంగ్రామైకభీముడు. జగత్సేమాలంకృత పూర్ణకాముడు. విజయ శ్రీమోక్ష

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

లక్ష్మీమనోధామా పావననాముడు. ఓ భద్రగిరి సీతారామ చంద్రప్రభూ! నీవు దాక్షిణ్యాంబు వారాశివి. సీతాభామామణి హృత్సరోరుహ జగచ్చక్షువు. భక్తాభీష్టప్రదుడవు. సర్వలోకహిత కల్యాణ ప్రదుడవు. ఇష్టాప్తికై నిన్ను సేవింతును అంటారు. నీ కమనీయమైన దర్శన భాగ్యము కలిగినది. శుభకల్యాణ పరంపరలు కలుగజేయుమని అర్థింతును. అని సీతారామ కల్యాణఘట్టమును కన్నులకు కట్టినట్లు మనోహరముగా వర్ణించిరి.

**మ॥ "ప్రముదంబేర్పడ, జానకీ నిజకరాబ్జంబందునన్ బద్మరా**
**గములై రాఘవుశీర్షంబందు, విడువంగా దివ్యకుందప్రసూ**
**నములై శ్యామలకాయమున్ దొరలి విన్నాణమ్ముగా నింద్రనీ**
**లములై శోభిలు రామచంద్రవిభు కల్యాణ ప్రభు యుక్త ము**
**త్యములానంద శుభమ్ములిచ్చుత జగత్కల్యాణ సంధానమై"[1]**

రామచంద్రవిభు కల్యాణ యుక్తములైన ముత్యములు జానకీ కరాబ్జమునందు పద్మరాగములై భాసించినాయట. వాటిని రాఘువు శీర్షమందు విడువగా దివ్యమైన కుందపుష్పములై భాసిల్లినాయట. అవి రాముని శ్యామల కాయముపై పడుటచే దొర్లి ఇంద్రనీలమణులుగా శోభిల్లినాయట. అట్టి ముత్యపు తలఁబ్రాలు జగత్కల్యాణ సంధానమై శుభములిచ్చు గావుత అని ఆశించిరి. ఇట్టి మహోత్సవమును కన్నులారగాంచుటకు గోపుర ప్రాకారాంచితములైన దేవాలయమును గోపన్న నిర్మింపజేసెను. పల్లెలు, పట్టణములలో శ్రీరాముని జన్మస్థలమైన అయోధ్యలో భక్తగోపన్న కట్టించిన రామ మందిరము ఆంధ్రావనిలో భద్రశైలము పై నిర్మించినదే దివ్యక్షేత్రముగా భావించి అసంఖ్యాక జనులు కొలుచుచున్నారు. అని చెప్పి, ఈ క్షేత్రము ఇంతటి ఖ్యాతి వహించుటకు కారణము ఆ గోపన్నయే యని

**"శ్రీ కంచర్ల పవిత్రవంశ విభుడున్ శ్రీరామ పాదాంబుజ**
**శ్రీ కైంకర్య విశేష భక్త హృదయున్ శ్రీరామ నామామృతా**
**స్తోకానంద రసాబ్ధిమగ్ను, గుణవంతున్ నిన్ను శ్రీరామదా**
**సా కీర్తించెద భక్తి భద్రగిరివాసా! సద్యశోభూషితా!"[2]**

కంచర్ల వంశములో జన్మించినవాడు, శ్రీరామపాదాంబుజ శ్రీకైంకర్య విశేషభక్తహృదయుడు, శ్రీరామ నామామృతాస్తోకానంద రసాబ్ధిలోలుడు, గుణవంతుడు, సద్యశోభూషితుడునైన శ్రీరామ దాసుని కీర్తించెదను

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

అంటారు. ఇట భక్తియే ప్రధానము. అందుకే కంచర్ల గోపన్న అను పేరు కంటె వ్యవహారములో భక్త రామదాసుగా ప్రసిద్ధి కెక్కినది. రాజద్రోహివని నెపముతో నిన్ను తానీష కారాగృహమందుంచెను. నీవు శ్రీరఘురాముని రాజ్యమందు పూజింపబడు భక్తశిఖామణివి. నీ పూజలు ఫలించినాయి కదా! అని ఎంతటి వారికైన జన్మాంతర కర్మ దాట వశము కాదనుచుండిరి. నీ వలననే చిరకీర్తి వహించి యుగయుగమ్ములు దాకా భద్రాద్రి స్మరణీయమైనది. నీవు ఎన్నో కష్టాలను భరించి, ఆపై సహింపలేక 'నీవేమిరా' యని నిలదీసి అడిగి, 'తగవేరా' యంచు పోరాడితివి. నీ ధీమా ఏమయ? భక్తితో రఘుస్వామిని నీహృదయాంతరమ్మున కట్టివైచితివి గదా! ఆ స్వాతంత్ర్యమూహించుటకు కూడ శక్యముగాదనిరి.

శా॥ **"అన్నా! యెంతగ సాహసించితివి గోపన్నా! గడుగ్గాయివా**
**పన్నానేక శరణ్యు శ్రీరఘువరున్ బ్రార్థించి, గాంచంగ, రా**
**కున్నన్ దెప్పితి వింక తప్పదని, తానుద్వేగియై తీర్చగా**
**మున్నీ విచ్చినయట్టి సర్వమును, రాముడెంతయున్, ధన్యుఁడౌ"**[1]

అన్నా! ఓ గోపన్నా ఎంత సాహసముము చేసితివి. నీవు గడుగ్గాయివి. ఆపదలో నున్న వారిని రక్షించువాడు శరణన్న వారిని కాపాడువాడైన శ్రీరఘురాముని ప్రార్థించగా రాకపోతే ఉద్వేగముతో దెప్పితివి. ఇంక తప్పదని తాను నీవడిగినవి సర్వము తీర్చెను. రాముడెంతటి ధన్యాత్ముడోకదా! అంటారు. నీ వంటి భక్తుడు రామునికి కలుగుటవలననే రాముని ఖ్యాతి లోకానికి విదితమగుచున్నది అను భావమైయుండును. ఈ విధముగా భద్రాచలరాముని తద్భక్తుడైన రామదాసుని పరవశులై కీర్తించిరి.

## 6.2 శ్రీ జగన్మోహన శతకము: -

శ్రీ శర్మగారు వ్రాసిన  శతకములలో శ్రీ జగన్మోహన శతకమొకటి. ప్రారంభములో,

శా॥ **"శ్రీ కల్యాణగుణ ప్రపూర్ణు, విజయశ్రీరాజితున్, శాశ్వతున్**
**లోకాధారు, సమస్తయోగి జనవంద్యున్ సచ్చిదానందు, సు**
**శ్లోకున్ సుందరు, భక్తహృత్కమలవాసున్ నిన్స్మరింతున్ వరే**
**ణ్యా! కైవల్య పద ప్రదాత! హరి!కృష్ణా!శ్రీ జగన్మోహనా!"**[2]

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

జగన్మోహనుడైన శ్రీ కృష్ణుడు కల్యాణగుణ ప్రపూర్ణుడు. శాశ్వతుడు, విజయశ్రీరాజితుడు. లోకాధారుడు, సమస్తయోగి జనులచేత నమస్కరింపదగినవాడు. సచ్చిదానందుడు, సుశ్లోకుడు, సుందరుడు, భక్తులహృదయాలలోనుండెడివాడు. వరేణ్యుడు, కైవల్యమునొసగు వాడవైన నిన్ను స్మరింతును అంటారు. ఇన్ని గుణములు గలవాడు గనుక జగన్మోహనుడు. ఓ కృష్ణా! నీవు కారుణ్యామృత పూర్ణుడవు అని పలుకగా వింటిని. తండ్రీ! సంసారాంబుధిలో పడియుంటిని. ఈ జన్మ ఎట్లు సార్థక్యము చెంది ఆధారమై నీవు కడతేర్చెదోయని నీ పాదాబ్జములను నమ్ముకొని ఆరాధించెదను. అంటారు. సంసార సముద్రములో పడి కొట్టుకుంటున్నప్పటికి వాటికి లోనుగాక, ఈ మానవజన్మ ఎత్తినందులకు సార్థక్యము ఏమిటో గ్రహించి, దానిని చేయుటకు, పరమాత్మను చేరుటకు శ్రీకృష్ణుని పాదాబ్జములే గతియని తెలిసికొని ఆరాధించిన శ్రీ కృష్ణభక్తుడుగా గోచరించుచుండిరి.

**మ॥ "అవతారంబులు, నామరూపములసంఖ్యాకమ్ము, లందున్ ద్వదీ**
**య, విలాసోదిత మూర్తులన్ని యొకటే, యాకారమున్ నామ మె**
**న్న, విభేదంబయితోఁచు నొక్కయపుఁడన్నా! సర్వదేవాత్మకుం**
**డవు, నిన్ గొల్తు, నభేదవస్తువుగఁ గృష్ణా! శ్రీ జగన్మోహనా!"[1]**

ఓ కృష్ణా! జగన్మోహనా! నీ అవతారములు, నామరూపములు అసంఖ్యాకములు. వీనిలో నీ విలాసమూర్తులన్నియు నొకటే. పేర్లు భేదములుండును. ఒక్కొక్కచోట కాని నిన్ను అభేదవస్తువుగ సర్వదేవాత్మకుడవనిఁ గొల్తును అంటారు. శ్రీకృష్ణుని దశావతారములు ఒక్కొక్క అవతారము ఒక్కొక్క ప్రయోజనము కొరకు వచ్చి లోకాన్ని ఉద్ధరించుటకు భగవంతుడు దాల్చినవి. కాని ఈ అన్ని అవతారములలోని పరమాత్మ ఒక్కడే. అట్లే రాముడని, కృష్ణుడని, విష్ణువు అని పలు పేర్లు పెట్టి పిలుచుదుము. ఈ అన్ని నామములు ఆ భగవంతునికి చెందినవే దీనిలో తేడా లేదు. చేరవలసిన గమ్యమొకటే. కాని నడిచే దారులువేరువేరు. అట్లే భగవంతుని అనేక నామములతో కీర్తిస్తాము. ఎట్లా కీర్తించినా ఆ భగవంతునే చేరతాము. అన్ని రూపములు ఆ పరమాత్మయే. ఈ ప్రపంచములో బాహ్య కైంకర్యములు చేయగలుగు గృహస్థ భక్తునకు స్థలము గావాలి, శ్రద్ధ భక్తి కావాలి. శ్రమపడి పూజాద్రవ్యములు కూర్చుకొని, ఒక మూర్తిని ఏర్పాటు చేసికొని, భార్య శ్రద్ధగా అన్ని సమకూర్చి పెడితే బంధుమిత్రుల తోడ్పాటుతో నిన్ను అర్చించగలుగుతాము. ఓ కృష్ణా! ఏది నీ రూపమొ! నీకే పువ్వు ఇష్టమో! ఎక్కడ దొరుకునో! నీ

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

కిష్టమైన మధురఫలమేదియో! అది ఎక్కడ లభ్యమగునో! ఏది నీ అర్చనా మార్గమో! ఎట్లా నీయందు ధ్యానమును నిలుపగనౌనో నీవే తెలియజేయవలయును. నీకు బాహ్యార్చనలనెన్ని చేసినను మదిలో సంతృప్తి కలుగుట లేదు. నీవు కరుణించినచో నా హృదయపీఠముపై ఆనందనాథునిగా నిలిపి సంతోషముగా స్వతంత్ర కల్పనలతో నీ పదద్వయమునర్చన చేసెదను. ఓ కృష్ణా! సంతోషమును, చిత్తశాంతిని కలుగఁజేయుము. ఈ బాహ్యపూజా విధానము లెందులకు? అనే సందేహము వలదు. పూజలను చేయుటకు, నీ కీర్తనలు స్తవము చేయుటకు వక్త్రంబును ప్రసాదించి జన్మములందుత్తమీ జన్మయైన మానవజన్మను ప్రసాదించితివి అంటారు. "జంతూనామ్ నరజన్మ దుర్లభమ్" అన్నట్లుగా ఎంతో పుణ్యము చేసికుంటేగాని మానవ జన్మ లభింపదు. అభించినను భగవంతుని చూసి కీర్తించే అదృష్టము కలుగదు. పూజ చేసే భాగ్యము లభింపదు. బుద్ధి పుట్టదు. పూర్వజన్మలో ఏమి చేస్తే లభించినదో జన్మ తరించు మార్గమునకై ఒక్కడు కూడ ఘోషింపడు. జన్మ తరియింపజేసికొను ప్రయత్నములు సలుపగా ఒక్కసారిగా విఘ్నములు వచ్చిపడును. ఈ జన్మనొందుటకు ఏమి ఫలమో కదా! అది లేదు, ఇది లేదు అని మానవుడు మిధ్యావ్యాకులుడై ఉదయము మొదలుకొని నిద్రపోవువరకు ఊరికే దుఃఖించుచు చివరకు హఠాత్తుగా అస్తమించును గాని, ఈ జన్మ తరింపజేసికొనుటకేది మార్గము అని ఆవంతయైన చింతింపడు. మానవులు చిరాయువును, మహౌన్నత్యమును కోరుకుందురు. అపురూపంబు శాశ్వతంబని ఈ దేహముపై విపరీతముగా మమకారమును పెంచుకొందురు. ఈ దేహము భూమిపై పడి కూలుట నిశ్చయము. ఈ అశాశ్వతమైన సుఖమునిచ్చు ఈ దేహాభిమానపు సిద్ధాంతములేల? ఇవి భ్రాంతి కదా! ఓ కృష్ణా! అంటారు. శ్రీ శర్మగారు గొప్ప వేదాంతి. బాహ్య ప్రపంచములో ఈ మానవులు శాశ్వతమని భ్రమ పడువాటన్నింటిని అవి శాశ్వతములు కావని, వీటి భ్రమకులోను కాకూడదని, దేహమశాశ్వతమని, పూర్వజన్మసుకృతము వలన మానవ జన్మ లభించునని, దానిని సార్థకము చేసికోవలసిన బాధ్యత మానవునిపై నున్నదని ఎఱిగిన వేదాంతి. దీనిని ఎట్లా అలవరచుకోవాలంటే,

మ॥ **"జననం బందిన వస్తు సర్వము వినాశంబందుటల్, నిశ్చయం**
**బను విజ్ఞానము రూఢిఁజేసి యెది కార్యంబింకటంచున్ మనం**
**బునఁదర్కించి, భవమ్ముఁద్రెంపెడి మహాత్ముల్ లభ్యమైనంత నో**
**య్యన సేవించియె, నిన్ గనన్ వలయుఁగృష్ణా! శ్రీ జగన్మోహనా!"[1]**

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

పుట్టినది మొదలు ప్రతి వస్తువు వినాశనమొందుట నిశ్చయము అను జ్ఞానమును రూఢి చేసికొని ఏమి చెయ్యాలి అని మనస్సులో తర్కించుకొని, ఈ భవపాశములు త్రెంపెడి మహాత్ములు లభ్యమైనచో వెంటనే వారిని సేవించి తరించి తద్వారా నిన్ను చూడవలయును.అని చెప్పిరి. శ్రీ శర్మగారు ఎంతోమంది గురువులను ఆశ్రయించి వారి దగ్గర వివిధ మంత్రములు ఉపదేశములు పొంది తద్వారా భగవంతుని దర్శించ గలుగు భాగ్యమునొందిరి. అందువలననే మానవ జన్మ ఎత్తిన మనము ఎప్పుడో ఒకప్పుడు నశించుట తథ్యము. కావున ఈ జన్మతరింప జేసికొనుటకు ముందుగా మహాత్ములైన వారిని సేవించాలి. అట్లా సేవించగా సేవించగా తరించేమార్గము వారి నుండి లభ్యమౌతుందని చెప్పుచుండిరి. అంతేగాక మంచి మార్గమేమిటో ఎట్లా తెలియాలంటే సత్సాంగత్యము చెయ్యాలి, సత్యము, దయ, శౌచము తితిక్షలను పొంది నిత్యానందము, సచ్చిత్ సుఖప్రదమైన నీ పదములందు ఎల్లప్పుడు భక్తినిల్పినచో మోక్షమొందుదురు. నా హృదయమందలి తాపమెంతయని వర్ణింతును. నా వయస్సు ముప్పది ఏడు సంవత్సరములు వృథాగా గడచిపోయినది. నా తండ్రి అయినదేదో అయిపోయినది. ఇక ముందు జీవితమైన నీ పదములను ధ్యానము చేయు నిష్ఠలో నుండునట్లుగా అనుగ్రహించుము. అట్టి వరము నాకొసంగుమని వేడి,

**మ॥ "కరుణామూర్తి! భవద్విలాసమెఱుగంగానౌనె! మాయాకృతా**
**వరణాచ్ఛాదిత దివ్యతేజమగు, నీపైఁగప్పె, వస్త్రంపుఁబెన్**
**దెరలెన్నో విడదీసికానమి, యసంతృప్తిన్ గనన్ దివ్య సుం**
**దరమూర్తిన్ గనఁజేసి తీవుదయఁగృష్ణా! శ్రీ జగన్మోహనా!"[1]**

ఓ కృష్ణా! శ్రీ జగన్మోహనా! కరుణామూర్తి! నీ విలాసములు మేము తెలిసికోతరమా! నీ మాయాకృత వరుణాచ్ఛాదితమగు దివ్య తేజమును చూడకుండా నీపై వస్త్రము వంటి ఎన్నో తెరలు కప్పినావు. అవి తొలగించి చూచుటకు అసంతృప్తి పొందగా నీవు నీ దివ్య సుందరమూర్తి కనబడేటట్లుగా చేసితివి అంటారు. అనగా భగవంతుడు ఈ జగత్తు మిథ్య ఇది శాశ్వతము అనే భ్రమ కల్పించువాడును మానవుడు సదసద్వివేకము గలిగి ఇవి అన్నియు అశాశ్వతము బ్రహ్మపదార్థమొక్కటే శాశ్వతమని తెలిసికొనినపుడు ఆ భ్రమను తొలగించువాడును ఆయనయే అని చెప్పుట. మానవుడు ఇదంతా మిథ్య అశాశ్వతము అను జ్ఞానము కలిగి తన కొరకై ఎవరు తపించుదురో వారికి తన సుందర రూపమును జూపునని చెప్పుట ఇందలి భావము. మానవుడు జన్మ తరింపఁజేసికొనుటకు

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

మ॥ "అవమానంబును, మానమున్ దనకు దానై చెప్పికోరాదు సం
భవమౌ కష్టసుఖమ్ములన్ వెలికిజెప్పన్, విప్పఁగా మేలులే
దవురాఁసర్వము నీశ్వరేచ్ఛయని, తానాహంకృతిన్ వీడిసే
యవలెన్, జన్మతరింపఁగా నరుఁడు కృష్ణా! శ్రీ జగన్మోహనా!"[1]

అవమానమును గాని, అభిమానమును గాని తనకు తానుగా చెప్పుకోరాదు. కలిగిన కష్టసుఖములను బయటకు చెప్పుకొనుట వలన మేలు లేదు. సర్వము ఈశ్వరేచ్ఛయని తాను అహంకారమును వీడి జన్మతరింప చేసికొనవలెను. నిజమూహింపగా ఎంతవారయినా తమ ప్రారబ్ధ కర్మను దాటుట శక్యము గాదు. అనుభవించియేఁదీరవలె. ప్రాజ్ఞుడైన వాడు ఇవి సాక్షిగా విజ్ఞానాత్ముడై మీ సన్నిధియందు సర్వమును త్యజియించును. అంతా నీ దయ వలననే జరుగును. నీ అనుగ్రహము లేకుండా కొంచెము కూడా జరుగదు. మానవులు తామెంత సమర్థులో తెలియక మూఢత్వముతో కొండనుఁదలక్రిందులు చేయాలని ఊహసేయుదురు. నీవు భక్తోద్ధరుణుండవుగదా! అంటారు. ఎంత గర్వముతో విఱ్ఱవీగుతున్నా నీయందు భక్తికలిగి ఉంటే చాలు నీవు రక్షిస్తావనుట. అనగా భగవంతుడు భక్తికి తప్ప దేనికి కట్టుబడడు. అని చెప్పుట. అట్టి భక్తి చేతనే శ్రీ శర్మగారు ఆ జగన్మోహనుని కట్టివేసిరి. దానికీ పద్యమే సాక్ష్యము.

మ॥ "ఇది కానిమ్మిది పోవ నిమ్మవలహాయింజెంది, ధ్యానమ్ము సే
సెద నీ కార్యము నెన్న నిమ్మని, నిరీక్షించున్ ఫలాపేక్ష, నీ
హృదయాంబోధి తరంగముల్ నిలుపనౌనే, నీ పద ద్వంద్వమున్
మదిహత్తించి, కరమ్ముబట్టుదును, కృష్ణా! శ్రీ జగన్మోహనా!"[2]

ఇది కాని, ఇది పోని అని హాయిగా ధ్యానము చేసెదను. ఈ కార్యమునెంచి ఫలాపేక్షకై నిరీక్షించుదును. నీ హృదయాంబోధి తరంగములలో నా మనస్సును నిలుపుట సాధ్యమగునా! నీ పదద్వంద్వమును మనస్సులో గట్టిగా చేతులతో పట్టుకొందును అంటారు. దీనిని బట్టి మనస్సు ప్రశాంతముగానుంచుకొని భగవంతుని యందే లగ్నము చేసినపుడు భగవంతుడు ప్రత్యక్షమై తీరునని చెప్పుట. అట్లే శ్రీ శర్మగారు ఎన్ని కష్టములు వచ్చినప్పటికి వాటిని లెక్కసేయక తమ మనస్సు ఆ శ్రీ కృష్ణుని యందే నిలుపుకొని ధ్యానించిరి. ఏది జరిగినా అది ఈశ్వరేచ్ఛగానే భావించిరి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

## 6.3 కృష్ణ శతకము: -

శ్రీ గురుజాడ రాఘవ శర్మగారు కృష్ణ శతకమును వ్రాసిరి. దాని ప్రారంభములో

**"శ్రీ రుక్మిణీ రమణ! శ్రీ**
**కారా! యదువీర! ధీర! కామిత ఫలమం**
**దారా! బృందావన సం**
**చారా! చక్రధర! విజయసారథి! కృష్ణా!"[1]**

అని ప్రార్ధన చేసి ధరపై బ్రహ్మ, విష్ణు, మహేశ్వర రూపమైన పరబ్రహ్మవు నీవే. సకలము గురుమూర్తియౌట వలన నిన్నే స్మరియింతును. ఏ దేవుడవని కొలిచినా నీవు సాదరముగా బ్రోతువట. అందువలన భేదము చూపకుండా నిన్నే కొల్తును. ఈ ప్రపంచమంతయు నీ ఆనతి పైననే నడుచుచున్నది. అట్టి సమయములో నేను వేరే అడుగనేల? నీ దయ ఎట్లో నడుపుము. ద్రౌపదికి వస్త్రములిచ్చి కాపాడితివి. గోపికలను చేపట్టితివి. కుచేలుని కష్టముల బారి నుండి కాపాడితివి. నేను తెలిసి తెలియక ఎన్నో నేరములు చేసితిని. తండ్రీ! నీవే క్షమింపదగుదువు. కారుణ్యపయోనిధివి నీవే గదా! ఓ నందుని తనయుడవైన కృష్ణా! ఏ పేరున నిన్ను పిలిచినను కాపాడెదవని బుధులు చెప్పగా వింటిని. గోపాలా! చేఁబట్టుము. నా పాలిటి దైవమీవు. ఆగమ వినుత! కృపాసముద్రుడవు. ఎవ్వరును నీ గుణములు లెక్క పెట్టలేరు. గోవులను, గోపబాలురను, గోపికలను అనురాగముతో రక్షించిన ప్రోడవీవు. నీ నామము కోరిన కోర్కెల దీర్చును. భవ మహాబ్ధిని దాటించును. 'నారాయణ' అను నీ నామము మరల మరల స్మరింతును.

**"మురళీధర! భవసాగర**
**తరుణా! జితతృష్ణ! పింఛధర! సంపన్నా**
**కరుణారస పూర్ణా! సుం**
**దర! హరి! దాసప్రసన్న! తండ్రీ! కృష్ణా!"[2]**

అని కృష్ణుని వర్ణించి, శ్రీకృష్ణుని నామము స్మరించుట భవదురితహరమట. సకల జయశ్రీ కరమట. సదా శ్రీకరము, పరిపూర్ణానందకరము అనిరి. ఫలమో, పుష్పమో, పత్రమో, జలమో మిక్కిలి భక్తితో నొసగిన దృప్తిగా స్వీకరించెదవట. ఓ కృష్ణా! భయమేలా! నాకు కలిగినదే ఇచ్చి తృప్తి పొందెదను అంటారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

"కాదని కంపముఁజెందక
లేదని భయపడక కల్గులేశమె హృదయా
మోదముతో గొనఁగా, నీ
పాదాశ్రయుఁజేయుమయ్య! పావనకృష్ణా"[1]

కాదని కంపము చెందకుండా లేదని భయపడకుండా కలిగిన కొంచెము హృదయానందముతో స్వీకరించి నీ పాదాశ్రయుని చేయుము అని ప్రార్థిస్తారు. నాకు తల్లివి తండ్రివి, దైవము, బాంధవులు, గురులు, హితులు, భ్రాతలు ముల్లోకములును నీవే. చల్లగా దయతో నేలుము. పరబ్రహ్మ అని, పరమాత్మయని, పద్మభవుడని, శంకరుడని, మాధవుడని పిలువబడెడి నిన్ను ఎట్లు తెలిసికో గలను? నానాటికి యీ జన్మము అంతులేని కష్టాలలో పడి అగాధంబయ్యెను. ఇంకా ఎప్పటికి ఈ సంసార పయోనిధిని దాటింప జేసెదవో కదా! నన్ను ఈ తాపత్రయ ఘన మహాబ్ధి నుండి దాటింపవలసినది. తేపకు తేపవలె నన్ను చేపట్టుకొని సదా కృతార్థునిఁజేయుము. నీవు ఈ భూభారము పోగొట్టి మంచి వారిని రక్షించుటకు దేవకీ వసుదేవుల గర్భములో పుట్టితివి గదా! అని అవతార రహస్యము నొకసారి గుర్తు చేసిరి. ఎట్లా పుట్టితివి. రోహిణి నక్షత్రములో శ్రావణ బహుళ అష్టమీ తిథియందు అర్ధరాత్రి సమయములో దేవకీ గర్భమున జన్మించితివి. పదునాలుగు భువనములను ఉదరమున గల నీవు దేవకి ఉదరమునఁబుట్టితివి. ఆ దేవకి సుకృతమెట్టిదో గదా! శత్రువుల పట్టణములో ధైర్యముగా కారాగారములో పుట్టి ఖలులనణచి, భూ భారముఁదీర్పగా నవతారము దాల్చిన పుణ్యాతముడవు. నీవు పుట్టినప్పుడే తండ్రికి సంకెళ్ళు వేయించావు.బందెకాన గడియలు పట్టు విడిచినాయి. త్రోవనివ్వగా యమునానదిని దాటితివి. కావలిగాయు వారలను నిద్ర ఆవహించగా అర్ధరాత్రి సమయములో యమున త్రోవ చూపగా వసుదేవుడు నిన్ను తీసికొని పోయెను. యమునానదిని దాటి నిదురజెందు సాధ్వి యశోదా రమణి శయ్యపై శాంతముగా నిన్ను జేర్చెను.

"మెల్లన వసుదేవుఁడు, వ్రే
పల్లెకుఁగొంపోయి, నిన్ను, భద్రపఱచి, రం
జిల్లుట నీ మాయకదా!
ముల్లోకములన్ భ్రమింప మోహన కృష్ణా!"[2]

మెల్లగా వసుదేవుడు శ్రీకృష్ణుని వ్రేపల్లెకు తీసుకొని పోవుట నీ మాయే కదా! ముల్లోకములను భ్రమింపఁజేయు మోహన కృష్ణుడవు అని అంటారు. పూతన పాలిండ్లను పట్టుకొని పాలు త్రాగవచ్చును. అప్పుడే ప్రాణములు లోలోపలకు పీల్చి, పోయేటట్లుగా చేసిన నీవు బాలుఁడవా! కాదు లోకపాలకుడవని అంటారు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

**"మను రుచిరా" కృష్ణా! యను**

**జననికి నోరెత్తి, భువన జాలములన్, లో**

**గనఁబఱచితివి, యశోదా**

**జననియె, కడుభాగ్యశాలి, జగతిన్ కృష్ణా!"[1]**

ఎంతో కఠినమైన తపస్సు చేసినా లభ్యముకానిది మన్ను రుచిరా! కృష్ణా! యని మందలించిన యశోదా తల్లికి నోరెత్తి భువన జాలములను కనబఱచితివి. ఈ జగత్తులో యశోదయె మిక్కిలి అదృష్టవంతురాలు. నీ నోటిలో జగమ్ములనుఁజూపు నేర్పరివి. శిరమున పింఛము మెరుస్తూ ఉండగా, చేతిలో మురళి వెలుగగా, కాళ్ళందియలున్ చిరుగజ్జెలు మ్రోగగా అందముగా నాట్యము చేయుదువు. నందుని తనయవు. యశోదా సుందరి మురిపెంపు బిడ్డవు. సుజనానందుడవు. బృందావనవాసుడవు. గోవుల బృందాన్ని పాలించువాడవు. పల్లవీ ప్రియుడవు. నీలపు శరీరముపై బంగారు వస్త్రము ధరించి తలపై శిఖిపింఛముతో, చేతిలో మురళి గొని, సంగీతాలాపన జేయగా నిన్నుఁజూడదగును. అని ఇక్కడ శ్రీ కృష్ణుని మనోహరమైన రూపమును వర్ణించిరి.

భగవంతుడు పరిశుద్ధమైన స్థలములో నుండునట. పరిశుద్ధుడైన వారి మనస్సులలో ఉండునట. కావున పతిత పావన నన్ను పరిశుద్ధునిఁజేసి ఏలుము అంటారు. శ్రీకృష్ణా! శ్రీకృష్ణాయని! గోపాలా! గోపాలా! యని శక్తికొలది స్మరింతును. నీ పాదములందు భక్తిని నిల్పి నన్ను ఎల్లప్పుడు పాలనఁజేయుము. ఎప్పటికైనను నీ పదసాన్నిధ్యమునుఁజేర్చు భక్తిశ్రద్ధల నొసగుము. నలుగురిలో నన్ను చిన్నబుచ్చక కృతార్థుని చేయుము.

**"బంధములద్రెంప, దయా**

**సింధుఁడవున్, దీనజనులఁజేపట్ట, సుహృద్**

**బాంధవుఁడవు, భువిసజ్ఞా**

**నాంధులకున్ జ్ఞానతేజమగుదువు కృష్ణా!"[2]**

ఈ బంధములను ద్రెంపుటలో దయాసింధుడవు. దీనజనులను చేపట్టుటలో సుహృద్బాంధవుడవు. ఈ భూమిపై అజ్ఞానాంధులకు జ్ఞానతేజమగుదువు. అని చెప్పి శ్రీకృష్ణుని దశావతారములను ఎంతో మధురముగా కంద పద్యములో చెప్పిరి. శ్రీ కృష్ణుని బాల్య క్రీడలు, అవతార రహస్యములు కందములో అందముగా నింపిన వైనము మనోహరము.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు

## 6.4 మేనక-విశ్వామిత్ర నృత్యనాటిక: -

శ్రీ శర్మగారు వ్రాసిన రచనలలో మేనక-విశ్వామిత్ర నృత్య నాటిక ఒకటి. కేవలము ఛందోబద్ధమైన ఖండకావ్యములు వ్రాయటమేగాక, సంస్కృత శ్లోకములను తెనుగు భాషలోనికి అనువదించినవికూడా కలవని చెప్పుకున్నాము. అంతేగాక నాటిక మేనక - విశ్వామిత్రులకు సంబంధించినది కూడ చెప్పి నాటిక ప్రక్రియలో తమకి గల అభినివేశమును చాటుకొనిరి.

ఈ నాటిక ప్రారంభములో విశ్వామిత్రుడు రంగముపై ప్రవేశించునపుడు ఆలోచనా నిమగ్నుడై ఉండును. ఆతని ఆలోచన ఏమనగా, స్వార్ధపరులు తన యున్నతి సహింపక వ్యర్ధముగా బహువిధముల బ్రహ్మత్వము కాదనుటకెవరు? ఎండనక, వాననక ఘోరతపస్సు చేసెదను. సృష్టికి ప్రతిసృష్టి చేయువాడు నా కంటె బ్రహ్మ సృష్టిలేడు. నరులు గాని, సురలు గాని, నరనారాయణులు గాని, పరమేశ్వరుడైనను సరే ఎదురు చెప్పినను లెక్కచేయను. అష్టదిగ్గజములను కూల్చెదను. బ్రహ్మర్షిగ నిల్చెదను. బ్రహ్మత్వమేదో తేల్చెదను. విశ్వము తలక్రిందైన విసుగు లేక కష్టములబడకుండా శాశ్వత పదమును గొనుటకు తపస్సు చేసెదను. బ్రహ్మత్వమెవరికో తేల్చెదను. అష్ట దిగ్బంధనము చేసి, అహరహమ్ము వాయుభక్షణ చేత తపస్సు చేసి మనస్సు దిటము చేసికొని, బ్రహ్మర్షి పదమును సాధింతును. అని తపస్సు చేసికొనుటకు నిష్ఠగా ఆసీనుడయ్యెను. ఇది మొదటి రంగము.

వెంటనే ఆకాశము నుండి మేనక అంచెలంచెలుగా భూలోకమునకు దిగుచు నృత్యము చేయుచు మనస్సులో

**గీ॥ "కౌశికుని ఘోరతపసు విఘ్నంబొనర్ప!**
**బంపు చుంటిరి, నన్ను నిలింపులార!**
**ఇలకుఁజనుచుంటి నిపుడె, మీ యిష్ట కార్య**
**సిద్ధి వెసదీఱ, స్వగృహముఁజేర్పరయ్యఁ**
**మేనకను, నాపయిన్ గరుణఁబూని మీరు"[1]**

కౌశికుని ఘోరమైన తపస్సు విఘ్నము చేయుటకు దేవతలందరు కలిసి మేనకను భూమిపైకి పంపిరి. ఆమె భూమిపైకి వచ్చిన తరువాత విశ్వామిత్రుని చుట్టూ దిరిగి నృత్యముతో ప్రదక్షిణ జేయుచు

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

మామా వాలు చూపుల కఱగి వశముగాడెవండు? మరుని వాడి తూపుల దొఱంగి వశము గాని వాడెవడు? పశుపతినైన పరాశరునైనను పరవశమొనర్చుదును. మా ముందు ప్రశాంత చిత్తుల భ్రమ పాల్సేయగ స్వశక్తి గల మా ముందు బింకములు చెల్లునా? తృటిలో ఆతని సర్వస్వమును కొల్లగొట్టుదును. నా ఇల్లే స్వర్గమనుకొనునట్లుగా చేయుదును. నా అదృష్టమున మన్మథుడు వాయుభక్షకుడైన విశ్వామిత్రుని తపస్సుకి భంగము కలుగఁజేసి నా పై దృష్టి మరల్చకుండా ఉండునా? అని

**చ॥ "ధృతిమతిమంతుడౌ ఘన జితేంద్రియుడౌ హనుమంతుఁడో మహో**
**న్నత చరితుండు భీష్ముఁడో, వినాయకుఁడో! శుకుఁడో! తలంపగా**
**నితఁడు పరాశరుండును, మహీశుడు స్త్రీలకు దాసులైన, సం**
**గతి సరిక్రొత్తగాదు, మఱి కౌశికుఁడెంతటివాఁడొ! చూచెదన్!"[1]**

ధృతిమతిమంతుడు, జితేంద్రియుడునైన హనుమంతుఁడో మహోన్నత చరిత్ర గల భీష్మాచార్యులో, వినాయకుఁడో శుక మహర్షియో! ఆలోచించగా ఇతడు పరాశరుడును మహీశుడు స్త్రీలకు దాసులైన సంగతి క్రొత్తయేమి గాదు. మఱి కౌశికుడు ఎంతటివాడో పరిశీలించెదను అని మనస్సులో తలంచి

**ఆ॥వె॥ "ఎంతకదిపి చూడ నింతయు కరుఁగడీ**
**తపసి గుండెయెంత దండిగుండెఁ**
**బొమముడిని సురేంద్రు మోహింపఁజేయుమా**
**తెలివి, యితని ముందు తెల్లవాఱె॥"[2]**

ఎంత కదిపి చూసినా కొంచెము కూడ కరుగుట లేదు. ఈ తపసి గుండె ఎంత దండి గుండె. కనుబొమలు ముడుచుకొని సురేంద్రునే మోహింపఁజేయుచున్నది. మా తెలివి ఇతనిముందు తెల్లవారి పోయినదే! ఇక మన్మథుని సహాయము కోరుట తప్ప వేరు మార్గము లేదు. అని మన్మథుని కొరకై ప్రార్థించును. ఇక్కడ ఒక గేయమును రచించిరి. మేనకా ప్రేయసీ సుమనోఫలప్రదాయకుఁడవై హాయి గూర్పుము.

**"నాయకుఁడవీవు నామనోనాయకుడవు**
**సాయపడుమా! మదీయవాంఛాఫలప్ర**
**దాయకుఁడవయి, కార్యసంధాయకుఁడవు**
**గమ్ము!ప్రార్థింతు! నే దీనురాల! రమ్ము!"[3]**

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3 పద్యాలు

నాయకుడవు నా మనోనాయకుడవు. నా వాంఛఫల ప్రదాయకమగుటకు కార్యసంధాయకుఁడవై సాయపడుము. అని గీతాలాపన చేయగానే రతీమన్మథులు నృత్యము చేయుచు ప్రత్యక్షమగుదురు. ఇంతలో మేనక కొంచెము ఆగుము. ఆగడము చేయవద్దు. అని వారించునంతలో కొంత నిదానించి పరిశీలింపగా విశ్వామిత్రునిలో క్రమక్రమముగా చలనము కనిపించును. ఆశ్చర్యము, సంతోషం ఒకసారి మేనకలో పెనవేసికున్నవి.

"ఎట్టి ధీరచిత్తుఁడోఁ తా
నిట్టె కన్నువిప్పెఁలేచె
ఎట్టులితని మెప్పించెదో
యొప్పించెదో! వెంటనంటి"[1] ॥ఆగుము సుమ సాయకా॥

అని పాట పాడుచుండును. ఇంతలో మన్మథ వికారము మాటిమాటికి విశ్వామిత్రుని ప్రేరేపింపగా లేచి కన్నులు దెరచి, నలుదిక్కుల పరికించి మేనకాదృక్కుల మోహపరవశుడై నిలువ లేక మేనక కనుసన్నలలో మెలగుచు ఆమె హస్తమును పట్టుకొన జార విడుచును. మరల ఆతడు దీనవదనుఁడై కరము బిట్టుగా

పల్లవి॥ "ఈ వసంతమెంత హాయి!
ఎంతో సంతసమ్ము గూర్చె" అను గేయమును పాడును.

అను పల్లవి॥ శ్రీ విలాసమున్ వెలార్చె
జీవితానందమొసఁగె ॥ఈ వసంతమెంత హాయి॥

చరణము॥ అదె! కనుమ! కుహూకుహూయ
టంచు పాడె కోకిలలుఁ
హాయిగ పింఛములు విప్పి
యాడె కూడి నెమలి జంట
దివ్య సౌరభము వెలార్చె
దిక్కుల మలయా నిలుండు
మేను పుల్కరించెఁ ప్రకృతి
ఆనందమునించె, నహా!"[2] ॥ఈ వసంతమెంతహాయి॥

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 గేయాలు.

అను గేయాన్ని ఆలపిస్తూ మరల ఇద్దరు కలిసి పాడుతూ వేరే బ్రహ్మత్వము లేదుగదా! కామించిన కలికితో కలసి మెలసి కష్టసుఖములొందు నాడు తప్ప వేరేలేదుకదా! నా తపఃఫలము పండెను. నాకలోక సౌఖ్యము గన ఈ త్రిలోక సుందరి లభించినది జన్మతరియించినది. అని విశ్వామిత్రుడు భావించగా, నా తపఃఫలము నిండె నాకలోక విభుని కరుణ చేత నిట్టి తాపసేందు చేతము చేజిక్కినది నేడు. అని మేనక సంతోషపడును. విశ్వామిత్రుడు, మేనక ఇద్దరు కలిసి

**"ఆనందం - బ్రహ్మానందం**
**ప్రేయసీప్రియుల - హృదయములొక్కటై**
**ప్రేమ మీఱ, త - న్మయులై పొందెడి**
**ఆనందం - బ్రహ్మానందం**
**అవాఙ్మానసా - ఆత్మానందం**
**అని పాడుకొనుచు నిష్క్రమింతురు."**[1]

తరువాత తెర లేచుసరికి పసిబిడ్డను వటపత్రము పై పరుండ బెట్టియుండును. ఒక వైపునుంచి విశ్వామిత్రుడు, ఒక వైపు నుండి మేనక ప్రయాణోన్ముఖులై యుందురు. మేనక, దేవతలందరు పంపగా వచ్చితిని. నా ప్రయత్నముచే సంపూర్ణముగా సఫలీకృతార్థురాలనైతిని. కౌశికుని ఘోరతపస్సు విఘ్నమొనర్చి, స్థిరమైన యశస్సు పొందితిని. దివికేగుచుంటిని. ఆ తపసి బిడ్డను తన హస్తములతో బెంచును. అని తలంచును. వెళ్ళుటకు ప్రయత్నించును. విశ్వామిత్రుడు తపస్సు, ప్రతిన కూడ భంగమయ్యెను. ఈ లోకములో కామినీమోహ పరవశత్వములో పడి సత్యము తెలియకుంటిని. ఇంక స్వస్థానము చేరెదను. అని పోబోవ ప్రయత్నింపగా, అందెల మ్రోత విశ్వామిత్రుని కల్లోల మానసుని జేయును. విశ్వామిత్రుడు ఆగుము మేనక పోబోకుము! అనగా నీ పసిబిడ్డను నీ యొడి చేర్చితిని కదా! అనగా గొడ్డురాలవు కాదె! నీవు ఈ పసిబిడ్డను విడిచి వెళ్ళదగునా? అని విశ్వామిత్రుడనగా బిడ్డను కన్నవాడివి గనుక పసిబిడ్డను నీకిడుట తప్పా! అని గాంధర్వ వివాహం గనుక కన్నబిడ్డ నీది అనెను. విశ్వామిత్రుడు, గాంధర్వ వివాహం గావున కన్నబిడ్డ నీదే అనగా, రాజర్షివి నీవు ఈ ధనరాశి బిడ్డ నీది అని మేనక పలుకగా, నైజమెఱుగ లేక వలచితిని. మోజుతీఱె. ఈ బిడ్డను తీసికొను. నన్ను మోసగింతువా? మొహమాటము కూడా లేకుండా! అంటే మేనక నేను సురలోకము దాన - మఱలుట నీతి. అని చెప్పెను. వెడలిపోవుచు బిడ్డను వదలలేక దగ్గరకు వెళ్ళి చూసి చిరాయువు కలిగి సఖీభవ! సుఖీభవ! అని ఆశీర్వదించును. ఇంతలో ఆకాశము నుండి ఒక వాణి వినిపించును. ఇదే చివరలో భరత వాక్యము.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

ఆ॥వె॥ "అడవిరక్షలేని యబల కాదిదిద్విజ
గణము చెంపఁబూర్ణ కళల బెఱిగి
వీరమాత యగుచు, వెలసెడి, నిజ సుతు
పేర ఖండ ఖండ విస్తృతముగ॥

ఆ॥వె॥ పేరులేని యట్టి బిడ్డకాదిది మహా
కావ్యనాయికగ జగాన వెలయు
కవికుల గురుడగు కాళిదాసుని కీర్తి
చంద్రికాకిరణ సంజాతయగుచు॥"[1]

అడవిలో రక్షణ లేకుండా నున్న అబల కాదు. ద్విజగణము పెంచగా పూర్ణ కళలతో పెరిగి వీరమాత యగుచు వెలయును. అతని కుమారుడు ఖండ ఖండాంతర ఖ్యాతిగాంచును. పేరులేనట్టి బిడ్డ కాదిది. మహా కావ్యనాయికగా, జగములో వెలయును. కవికుల గురుడగు కాళిదాసుని కీర్తి చంద్రికా కిరణ సంజాతయగును.

విశ్వామిత్రుడు మేనక చిరంజీవ! చిరంజీవ! సుఖీభవ! సుఖీభవ! అంటూ వెడలుదురు. తెరలో భరతమాతకు జై! కవికుల గురువు కాళిదాసునకు జై! 'వందేమాతరం' అను నినాదాలు వినబడును.

ఈ విధముగా శ్రీ శర్మగారు మేనకా విశ్వామిత్ర నృత్యనాటికను మనోహరముగా తీర్చిదిద్దిరి. తేలిక పదాలు పద్యాలు అనేక రాగాలు, తాళాలు గేయాలతో ఈ నాటిక వీరి సంగీత వైదుష్యానికొక నిదర్శనము.

## 6.5 భ్రమర గీతలు: -

శ్రీ మదాంధ్ర మహాభాగవతము లోనివీ భ్రమరగీతలు. శ్రీకృష్ణ విరహ వేదనఁచే తపించు గోపకామినుల నూరడింప, శ్రీ కృష్ణుడు తన సేవకుఁడును, బుద్ధిమంతుడునగు, యుద్ధవుని ద్వారా సందేశము పంప, నుద్ధవుడేగినంత, గోపకామినులు, అన్యాపదేశముగా, ప్రక్కవ్రాలిన తుమ్మెద నెపంగా పలికిన పలుకులు భ్రమరగీతలు. వీనిని పోతన్న తెలుగు భాగవతములో మృదు మధుర శైలిలో చక్కగా తీర్చిదిద్ది పలికిరి. అన్యాపదేశమనగా, తన మనోగర్భిత భావమును సూటిగా వెల్లడింపక, యన్య వస్తువుపై నారోపించి యుద్దేశించిన కర్తకు గాని, కర్త్రికిగాని హృదయరంజకముగా నాటునటుల, చాకచక్యముగా పలుకు,

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

గడుసుదనపు పోకడలు. ఇచటనారోపించబడిన వస్తువు, సామ్యమునకనువుగ నున్ననే, యీ వ్యంగ్యభావము, రసప్లావితమై జాలువారునది. ఈ సన్నివేశములో రెండు ప్రకృతులున్నవి. ఒకటి ఉద్ధవుడు. రెండు తుమ్మెద. శ్రీకృష్ణ సందేశహరుడైన యుద్ధవుడు, కేవలము కృష్ణుడోయన వేష భూషణాలంకరణమున, నభేదస్థితి నందినట్లు భావింపదగియున్నాడు.

**శా॥ "రాజీవాక్షుడు, సుందరాస్యుడు, మనోహరస్కుండు, పీతాంబరు**
**డాజానుస్థితబాహు, డంబురుహమాలాలంకృతుండుల్లస**
**ద్రాజత్కుండలు డొక్క వీరుడిచటన్ రాజిల్లుచున్నాడు, మా**
**రాజీవాక్షుని భంగినంచుగనిరా రాజాన్వయున్ గోపికల్"[1]**

పోతనామాత్యుడు శ్రీమదాంధ్ర మహాభగవతము పుట 380.

సుందర వదనారవిందం, విప్పిన కన్గవ, విశాలమైన వక్షస్థలము, బంగరువల్వ, దీర్ఘబాహువులు, వనమాలాంకృత దేహం, మకరకుండలములు, గాంచినంతనే సాక్షాత్ మా రాజీవాక్షుడు మా కృష్ణుడే యన్నట్లున్నాడని, గోపికలు దగ్గఱజేరబోయి, చిరునవ్వు నునుసిగ్గు, జంటలై మొగంబునకు, వింత చెలువొసంగ, తుమ్మెద నెపంగా పలుకసాగిరి.

ఇచ్చుట రెండవ వస్తువు తమ్మెద. రూపమా నీలం, స్ఫూర్తియా ఝుంకార నాదం, వృత్తియా, నిలుకడ లేక పూవుపూవునంగల మధువు నాస్వాదించుటయే పని. స్వభావమా చంచలం. మనఃప్రాణములర్పించి, సర్వము తనయందే డించి, నమ్మిన కుసుమకోమలులగు గోపికల విడచి, మధురాపుర కాంతల మొక్క ప్రదేశముల స్వేచ్ఛగా సంచరించి, విహరించి ఆనందించు శ్రీ కృష్ణుని స్థితి మధుప వృత్తిగా నాపాదించుటొకటి.

దేహమా మేఘశ్యామలము. పలుకా మోహ పరవశమొనర్చు నాదము. ఇచ్చుట మురళి, అచట ఝుంకారము, స్వభావమా చంచలము. నిలుకడ లేని స్థితి. భ్రమరకీటక న్యాయముగా ఉద్ధవుడే శ్రీకృష్ణుఁడై సాక్షాత్కరించినట్లున్నాడు.

ఇట్లు దరిజేరిన, యుద్ధవుని గాంచి, భ్రమరముగా భావించి తమ హృదయావేదన బట్టలేక, నిందాస్పదముగా తుమ్మెద నెపముగా సూటీపోటు మాటలు హృదయానికి నాటునట్లు మొమాలము లేకుండా సూటిగా గోపికలు పలుకసాగిరి.

---

1. పోతనామాత్యుడు శ్రీమదాంధ్ర మహాభగవతము పుట 380.

శ్రీ గురుజాడ రాఘవ శర్మ గారు శ్రీ కృష్ణుని బృందావనములో తాను ఒక గోపికయై భక్తి భావముతో చరించినవారు గావున ఆ శ్రీ కృష్ణుని యందుండెడి అవ్యాజమైన భక్తి భ్రమరగీతలుగా రూపు దిద్దుకొనియుండును. వీరి కలము నుండి వెలువడిన భ్రమరగీతలను పరిశీలిద్దాము.

శ్రీ కృష్ణుడు ఉద్ధవుని గోకులమునకు పంపగా విరహవ్యాకులితలైన గోపకాంతలు తుమ్మెదవలె అన్యాపదేశముగా ఇట్లు పల్కిరి. ఎల్లప్పుడు తమ దైవము మీరేయనుచు నిద్రాహారశయ్యాలందు కూడ భావించెడి గోపకాంతలు దుఃఖాబ్ధిలో ముంచిపోయెనని నన్ను ఎంతగా నిందిస్తున్నారో గదా! ఇన్నాళ్ళు ఎట్లుండిరో? యుద్ధవా! వారి స్వాంతములు చల్లబడునట్లుగా ఒక్కసారి వెళ్ళిరా ఓ దయామయుడవైన యుద్ధవా! నా యెడ మిక్కిలి స్నేహ భావముతో చరించుచు నాపైననే ప్రాణములెల్లనిల్పుచు, విరహదుఃఖముచే తట్టుకోలేని లేబ్రాయపు ముద్దరాండ్ర దుఃఖము పోవునట్లుగా పలికి వారలనోదార్చిరమ్ము. సందేహింపక వెళ్ళిరమ్ము. నిన్ను చూచినంతనే నిందింప ప్రయత్నింతురేమో! వింటూ నీవు ఓర్మి వహించి ప్రేమతో గోవిందుడు మీ అందరి క్షేమము తెలిసికొన గోరి నన్ను పంపెను. మీతో కలిసి చేసిన బృందారణ్య విహారములు మఱుపునకు గూడ రావటము లేదట అనుచు పలుకుము. ఉద్ధవుడు హితమిత చతురవచో నిధి, కృతబుద్ధియు, అకిల్బిషుడని. శ్రీ కృష్ణుడు పంపగా వ్రేపల్లెకు వెళ్ళెను.

నందసుతునికి మారుగా నందుని చూచి యశోద కౌగలించి సుతుని సేమమంతయు వినిపించినది. ఉద్ధవుడట తిరుగగా వ్రేతలు అతనిని చూచి,

> **"చిఱునగవున్ వెలార్చునొక చెల్వునఁజెన్నగుఁగన్నుదోయి సుం**
> **దర వదనార విందము, నెదన్ బోలుపొ వనమాల, తాల్కు బం**
> **గరు వసనమ్ము, నీల తనుకాంతులు, జానువులంటు బాహువుల్**
> **మురిపెము గొల్పు వాడొకడు, ముందట నిల్చినవాడు, కంటిరే!"[1]**

ముఖమున చిరునవ్వు చిందులాడగా స్నేహమును ప్రకటించు కన్నుల జంట, సుందరమైన వదనారవిందము, హృదయముపై వనమాల వలె బంగారు వస్త్రమ్ము, నీలంరంగులో భాసించు శరీరకాంతులు, జానువుల నంటుకొనుచు బాహువులు మురిపెము గొల్పువాడు ఒకడు ముందట నిలిచినవాడు చూచారా! ఇక్కడ పోతన్న "రాజీవాక్షుడు ... ... ... ... ... ... ... ... ... గోపికల్" అను పద్యచ్ఛాయలు కన్పట్టుచున్నవి.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

ఉద్ధవుని చూడగానే కృష్ణుడను భ్రమ కలుగు నట్లున్నది. ఈతడు మాధవుడనగా ఎంతో పోలికలు గల్గువాడు. ఈతనిని చూచినంతనే నా మది భ్రమించుచున్నది. సిగ్గు,ఆనందము కలిసి మనస్సునుల్లాస పరచుచున్నది.

**"... ... ... ... ... నెమ్మోయి నిల్ప కెమ్మోయిన్**
**వాత విధూత చూత సుమవల్లికయై వెసనూగ సాగెడిన్"[1]**

అని కళ్ళ ఎదురుగా చరించు నుద్ధవుని కనుగొనగానే మేన పులకలు మొలకెత్తగా కృష్ణ రూప భావనమున పరవశయై ఒక్క వ్రజభామిని దైవ వశముచే సమీపమునకు వెళ్ళి, మృదునాద లాలిత మనః సుమరంగమైన ఒక భృంగమును చూచి దుఃఖముఁగోపము మిళితమై గన్నుంగవ భాష్పములు స్రవింప దైన్యముగా మాట్లాడసాగెను. కమలదళాయతాక్షు చెలికానిని ఎఱుంగమా! మేము నిన్ను ప్రేమ గల తల్లిదండ్రులకుఁబ్రీతిగా మేలెఱిగించగా మీ యదూత్తముడు పంపగా వచ్చితిమి గదా! వారిని మరవండని సేమములెరిగింపగా రాజునకు ఇక్కడ వేరుగా మాన్యులు లేరుగదా! ఎఱుగని వాని వలె నటియించుచు చెంతను వ్రాలెదవు! మము దరిఁజేరగరాకు. వాని చరిత్ర లోక విదితము. పెద్దల అవసరము తీరిన తరువాత మోగమ్మును చూపరు గదా! మత్తబంభర! మధువును గ్రోలక పూవులను విడిచి వెళ్ళుట నీకు తెలియునా? ఇది చేమంతి, ఇది గులాబి, ఇది ఇందీవరము, ఇది గోరింట, ఇది తులసి, ఇది జాజి, ఇది మల్లియ. పరిశీలించగా ఈ సృష్టియంతయు సుమమయము. నీవు స్పృశించనిది ఏది? ఓ తుమ్మెదా! నీవే శౌరికి దౌత్యమును చేయుటకు తగినదానవు.

**శా॥ "విచ్చీవిచ్చని పూవుకన్నియల, తీవిన్ దవ్వులంగాంచి, క**
**న్నిచ్చన్ జేరువ చేరువై చెవికి, హాయింగూర్చు, నీ గాన సం**
**పచ్చాతుర్యముచే, మదుల్ గరచి, తద్వృత్తముగొల్లాడు, బల్**
**మ్రుచ్చున్ నిన్ మునిమ్రుచ్చు శౌరి, తన యింపున్ సూపగా నంపెనే॥"[2]**

విచ్చీవిచ్చని పూవుకన్నియల తీవిని దూరమునుండే చూచి చేరువగా చేరి చెవికి హాయిని గూర్చు నీ గాన సంపచ్చాతుర్యము మనస్సును కదలించి తద్వృత్తము గొల్లాడు మ్రుచ్చునిన్ను ముని మ్రుచ్చు శౌరి మమ్మల్ని ఓదార్చపంపెనా? చాలుచాలును. మా పదాబ్జముల చేరువకు రాకుమా! నాగరశ్రీలోలత్కచ మేచకద్యుతిని నిన్ను శ్రీశుండు మన్నించునుగాక! ఆ లావణ్య సతీకుచాగ్ర సుమనోహర ప్రసూనావళీ ధూళీధూసరితాననుండవగు నీతో మాకెందులకు? కృష్ణుడు ఏతన్మాత్రుడే? మరి నీవేమో శ్రోతృశ్రోత్ర

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

రసాయనముగా గాథావళులు ఝుంకృతీస్వాదు సంగీతాలాపము లేల జేసెదవయా? అక్కడ నీ గీతలను నాగరీచేతః ప్రీతిగ పాడెదవేని ఇష్టార్థములు చేకూఱును.

చ॥ "దొఱకిన పూవు టింట వెసదూఱి, కలట్టి మరందబిందువుల్
జుఱ జుఱ జుఱ్ఱి త్రేన్చి, గడుసుందనముట్టి పడంగఁ జెల్లరె!
దొరలెవచ్చి, దాటెదవు దొంగ వలెన్ బరులెవ్వరున్ నినున్
నెఱసులు బట్టలేరనుచు, నిక్కెడు నేరుపునీకెచెల్లెడిన్"[1]

దొరికిన పూవులన్నింటిలో దూరి దానిలో గల మరందబిందువులను జుఱజుఱ జుఱ్ఱుకొనుచు త్రాగి త్రేన్చుతూ, నీ గడుసుదనము ప్రదర్శించుదువు. దొరవలె వచ్చి దాటెదవు. దొంగవలె నిన్ను ఎవరు పట్టుకోలేరనుచు పురుగులెత్తే నేరుపు నీకే చెల్లును. తేనెలో గల మాధుర్యాన్ని పద్యములో నిజముగా త్రాగునట్లుగా చూపించిన శ్రీ శర్మగారి నేర్పు అమోఘము. ఓ చంచరీకమా! చెప్పలేని అఖండ సుఖస్థితి ఒకటి గలదు. దానిని జుఱ్ఱిగా ప్రారంభించి ఇక్కడ అక్కడ తిరుగుచూ, నీటుగోటుగా మిలమిలలాడెడు ఎండపొడ మేన కాంతులు వెదజల్లుచుండగా నిలకడ లేకుండా చరించు నీ చరిత్ర నిత్యము చూడమా! దొరికిన పూవుతో తృప్తి చెందకమత్తిలి రివ్వున ప్రక్కన గల పూవుపై వ్రాలి మఱొక్కటిఁగూడఁబొవు నీ టక్కరి వేషభాషలు తెలిసినాయి. అంటారు. ఇక్కడ తుమ్మెద సహజస్వభావ స్థితిని వర్ణించిరి. సరసాళికెంతయు మక్కువ కలిగించును. నీ స్వభావములు క్రొత్తవాని పయి మానుపరావుగదా!

ఓ తుమ్మెదా! దెసల కారులు గ్రమ్ముచు కన్నుల విందైన నీ రూపము మాటిమాటికిట్లు సుమనఃప్రమదంబగును. నీ గానము దగ్గరదగ్గరకు వచ్చుసరికి మనసు చేదికొనంగల నీదు ప్రాపు ఎవ్వరినైన భ్రమల పాల్పఱచును గదా! అని పలికి

ఎంతటి దయా సముద్రుడో! మఱెంతటి యాశ్రిత పక్షపాతియో! యెంతటి శౌర్యధుర్యుఁడో! మఱెంతటి భూరివదాన్యుడో! ఈ జగము ఇంతగా చెప్పుకొనుట ఎఱుంగకపోము. మేము మాకు అనాద్యంత పథాను వర్తచరితమ్ములు వింతలె! చెట్టుచాటు నుండి వాలినిఁగూల్చిన జెట్టియని తెలియదా! పొట్టి యాచకుడగుచు, దాతనుఁబూడ్చి పెట్టుట యెఱుంగమా! రట్టెఱుంగక నాతి ముక్కును రక్కి పంపుట తెలియదా? జగత్తులో ఇట్టి చరిత్ర గల వానిని ఏమాదరింతుము? ఇంతటి గుణఖని యని వెయినోళ్ళ మునివరేణ్యులు వర్ణింతురు.

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

భళీ! ఈ వింతలు విని భవపాశములు ద్రుంతురట! అతనిని మహాత్ములెవరెఱుంగుదురు?

**"తానె, పతి, తానె బంధువుఁ**
**దానే గురుఁడున్ సఖుండుఁదానె సకలమున్**
**దానెయని నమ్మి చేరిన**
**దీనుల వంచించు టట్టి దేవునకెతగున్."[1]**

తానే పతి, తానే బంధువు, తానే గురువు, తానే సఖుండుఁ దానే సకలము అని నమ్మి చేరువ చేరిన దీనులను వంచించుట ఆ దేవునికే తగును. వరుసలు వావులనుచు పెక్కు విధములుగా నీతులు చేటలతో చెరగెడువారు మావంటి వారిని క్రమశిక్షణలో పెట్టువారు. నమ్మిన వారి పట్ల ద్రోహమొనర్చుటఁజూచి ఈ సమయములో పలుకకుంటిని. మార్గమేది? రెంటికిని దప్పితి మెవ్వరి నింక నేమనన్. ఇచ్చట నిందాస్తుతి కన్పట్టుచున్నది. విరహవేదననునుభవించు గోపాంగనలు పైకి కృష్ణుని నిందిస్తున్నట్లుగా ఉన్నా లోపల స్తుతి గలదు. వాలిని గూల్చుట, వామనావతారములో బలిచక్రవర్తిని హతమార్చుట, శూర్పణఖ ముక్కు చెవులు కోయుట ధర్మ పద్ధతిలో న్యాయానికి అనుగుణముగా ప్రవర్తించియే చేసినాడు. కృష్ణావతారములో గోపికలు తానే పతి, తానే బంధువు, గురుడు సఖుడని భావించినారు. వంచించుట ఆదేవునికే తగును అనుట న్యాయమార్గంలో జరిగిన వంచన కాని వేరు కాదు. అని పలికి

**"భ్రమ పెట్టి మమ్ము నీ వి**
**భ్రమమున ముంపంగఁబ్రోకు! భ్రమరా! తద్వి**
**భ్రమవార్ధిమున్ను తొల్లిటి**
**భ్రమలెల్లన్ దొలఁగె నాటి ప్రమదమె మిగిలెన్"[2]**

ఓ భ్రమరా! మమ్మల్ని భ్రమ పెట్టి నీ విభ్రమమున ముంపగఁబోకు. ఆ విభ్రమ వార్ధిలో మునుగగానే తొల్లి భ్రమలన్ని తొలగిపోయెను. ఆనాటి సంతోషమే మాకు మిగిలెను. చెవిని ఇట్లు ఇల్లు గట్టుకొని శ్రీశు కథల్ వినుపింపగా వత్తువు. వినయము గప్పికొను ధూర్తుఁడవౌదువు. నీవు ధూర్తబాంధవుడవు గాన తొల్లిటి కథలు మటుమాయలు, చెల్లవని మాధవునకుఁదెల్పుము, వెళ్ళు! మనుష్యులకు తగిన దారులు ఇట్టివే గతులు సుమా! తుమ్మెదా! కదలుమ! హృదయకంజమునను చనువిచ్చినంతనే కుదురుగా తేనెను మెసవికొనుచు, అదే రొదగా ఆనందించుచు మనస్సును మనస్సుగా నుండనీయవు సుమా! ఇతరమైన

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

ఆలోచనలు చేయనీయవు. నీకిదే పదివేలు. మమ్ముల నలయింపకు! నాదవినోదషట్పదా! అనుటలో అర్థము మా హృదయమనెడి పద్మమునే నీకు నివాస స్థానముగా ఇచ్చేశాము. ఇచ్చాము గదాయని తేనెను త్రాగుతు రొద చేస్తూ మనస్సు మనస్సులో నుండనీయవు. అంటే మా మనస్సు ఇతరవాటిపై లగ్నము కావటంలేదు. నీ పై తప్పు అని చెప్పుటము.

**మ॥ "కలహంస ద్విజముఖ్యసఖ్యవిలసత్ కాసారముల్, పల్లవో**
**జ్జ్వల వల్లీ పరివేల్లితోద్విరుహరాజత్ కేళికారావముల్**
**బలభిద్రత్న వినూత్న కాంతి వలిత ప్రాసాద హర్మ్యమ్ములున్,**
**కలవా! ఇచ్చట గొల్లపల్లియల మా కాంతుండుO కాల్వెట్టునే!"[1]**

అష్టమహిషీ సమేతమైన శుద్ధాంత సీమలో రాజభోగములలోఁదేలు రాజచంద్రుడు ఈ తృణచ్ఛన్న గృహములకేల వచ్చును? ఆల మళ్ళించు ముచ్చటలేల మెచ్చు?

**"చక్కని భ్రూ విలాసములు, చల్లని చూపులు, మందహాసముల్**
**మక్కువ మాటలున్ మనసు మర్మములన్ హరియింప, ముగ్ధలై**
**చొక్కుచు, మూడు లోకముల, సుందరులున్ బడికాపులుండఁగా**
**నక్కమలాసమేతుఁడగు నా హరియూహకు మేము వత్తుమే!"[2]**

చక్కటి బొమముడి విలాసములు, చల్లని చూపులు, చిరునవ్వు, ప్రేమతో మాట్లాడు మాటలు, మనసు మర్మములు హరింపగా ముగ్ధలై చొక్కుచు మూడు లోకములలోని సుందరులును పడికాపులుండగా, ఆ కమలా సమేతుడగు హరి యూహకునైన మేము వత్తుమా? అభముశుభము తెలియని వ్రజాంగనలను కరుణించి, ఎన్నియో శుభములు గూర్చు దిట్టయని మనస్సులో నమ్మినదానికిట్లు వల్లభుడు వియోగవహ్ని శిఖలలోనికి త్రోసి, తనంతతానుగా జగత్ప్రభువై వెలుంగు చున్నాడు. వ్రేపల్లెకు తిరిగిరాడుగా! రాడు కదోయి! అనుటలో వారి విరహవేదన వ్యక్తమగుచున్నది.

**"ఇంచుక, భేదమెంచక, నిజేశ తనూజ సుహృజ్జనాళి, వ**
**ర్జించి, సుఖమ్మునెంచి నిజజీవిత మాతనిదేయటంచు, స**
**ర్పించి, తదేక చిత్తలగు, వ్రేతలు, యాతనపాలుగా, విస**
**ర్జించుట, మంచిది కాదని, వచింపఁగరాదటె! చంచరీకమా!"[3]**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2, 3 పద్యాలు.

కొంచెము కూడ భేదమెంచకుండా నిజేశతనూజ సుహృజ్జనాళి వర్జించి, సుఖముగావాలని, తమ జీవితము ఆతనిదేయని అర్పించి తదేకచిత్తలగు వ్రేతలు యాతన పాలుగావించుట, వారిని విడిచిపెట్టుట మంచిది. కాదని చెప్పవచ్చును గదా! అనుటలో గోపాంగనలు శ్రీ కృష్ణుని పట్ల ఎంతగా అనురక్తులై యుండిరో స్పష్టమగుచున్నది. భృంగాపదేశమున గోపాంగనలు ఈ విధముగా పలుకగా హరికి సందేశమ్ము గోపీతాపహరంబుగా యుద్ధవుడు వినిపించెను.

ఈ భ్రమర గీతలు

**"గేయమ్ములు, శ్రావణయుగా**
**ప్యాయమ్ములు, పరమ భాగవత జనతరణో**
**పాయమ్ములు, శ్రేయమ్ములు**
**ధ్యేయమ్ములు, భ్రమరగీత విహతారకముల్."[1]** శ్రీమదాంధ్రమహాభాగవతము, దశమస్కంధము

ఈ భ్రమర గీతలు పరమ భాగవతోత్తములకు తరణోపాయములు శ్రేయమ్ములు, ధ్యేయమ్ములు, ఇహలోకతారకములు.

## 6.6 సిద్ధేంద్రయోగి నాటకము: -

శ్రీ శర్మగారు సిద్ధేంద్రయోగి నాటకమును నాటక లక్షణాలన్ని పాటించుచు మనోహరమైన నాటకముగా తీర్చిదిద్దిరి.

**"భరతాచార్య కళాసరస్వతి కపూర్వంబౌయశో భాసమా**
**నరుచుల్ జిందు పసందగున్ దొడవులానందమ్ముగా గూర్చునే**
**ర్వరి, సిద్ధేంద్ర కవీంద్రునిందలచి ప్రారంభింతు నా యోగి రా**
**డ్వరు చారిత్రము రూపకంబగుచు విశ్వవ్యాప్తి పెంపొందగన్."[2]**

భరతముని కళా సరస్వతికి అపూర్వమైన యశస్సును, పసందగు ఆభరణములను ఆనందముగా గూర్చునేర్పరి. సిద్ధేంద్ర కవీంద్రుని తలచుకొని ఆ యోగి రాడ్వరుని చరిత్రను రూపకముగా విశ్వవ్యాప్తినొందునట్లుగా ప్రారంభింతును అని రచన ప్రారంభించిరి.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

తెర లేచుసరికి సిద్ధప్ప కీర్తన పాడుతు ఉంటాడు. మధు, నారాయణతీర్థులు ప్రవేశిస్తారు. నారాయణతీర్థులు "కోమల మలయ సమీరే" అని పాడుతు ప్రకృతి రామణీయకానికి మురిసి పోతూ ఉంటాడు. విద్య, ప్రాక్తన జన్మకర్మ పరిపాకముచే వచ్చునని ఈ విధంగా సంభాషించుకుంటూ వుంటారు. ప్రజలు కష్టించి పనిచేస్తే కాలం కలసి వస్తే కళలకు ప్రాముఖ్యత లభిస్తుంది. తద్వారా గ్రంథ ప్రాశస్త్యము పెరుగుతుంది. పండిత పామరులనకుండా అందరిని జిలిబిలి పల్కుల ఉఝ్జూతలూగించే యక్షగానాలు, భరతనాట్యాలు, నాటికలు ఇప్పుడు తప్పక ప్రజాహృదయాన్ని చూరగొంటాయి. అని మాట్లాడుకుంటూ ఉంటారు. మధు ఎవరయ్యా! నీవు అంటే లేచి వెళ్ళిపో బోతున్న సిద్ధప్ప రాయలుదయించిన సీమలో బుట్టి, బాల్యములో ఒక్కగురూత్తముని సేవ చేసి ఓపినంతగా నాట్యవిద్య నేర్చుకొని, దిరుగుచూ చివరకు కృష్ణవేణి నటియించిన చోటికి చేరుకున్నాను. చక్కని గానసంపదయు, చాతురి, లోతగుహావభావములు, నాట్యపద్ధతులునేర్చి, రాగరసానుభూతిలో నోలలాడుచు ప్రేక్షకుల మనస్సులలో నటియించెడి పుణ్యశాలురు ఈ చక్కని గెడ్డపై పుట్టుదురు. సార్థక జన్ములు వీరలే కదా! అంటాడు. తనది ఇక్కడే రాయలసీమయని సిద్ధప్ప అంటారని తమ గురువు గారి దగ్గరికి తాను కూడా వస్తాననటం, వారి గురువులు నారాయణ తీర్థులవారని తెలిసికొని మరునాడు ఆయన దగ్గరకు వెళ్ళాలని నిశ్చయము చేసికొని నిష్క్రమింతురు.

ద్వితీయరంగములో కాజ గ్రామం. నారాయణ తీర్థుల వారి గృహము. శిష్యులు మధు, నారాయణులు తరంగము పాడుచు ప్రవేశిస్తే వారితో పాటు సిద్ధప్ప పాడుచుండును. తన్మయుఁడై వింటూ పులకిత గాత్రుఁడై ఆనందబాష్పములు కారుతూండగా, ఏమి మధురానగర వర్ణన - సౌందర్యప్రాశస్త్యము - అని ఆలోచించుచుండును.

**"దయకల్గునయ్య - నీ - దాసునిపైనిక**
**దరహాసదివ్యసుం - దరముఖ గోపాల"[1]** **॥దయ॥**

అను గేయాన్ని ఆలపిస్తూ, మధురా నగరాన్ని కన్నులకు గట్టినట్లు చూపించారు. అని తృప్తి చెందాడు సిద్ధప్ప. సద్గురువు కరుణా కటాక్షములు కావాలి. శాస్త్రవాసన లేని విద్య శస్త్రాస్త్రములులేని వీర విహారము గదా! అనుకొనెను. నారాయణ తీర్థులను చూచి అభివాదమొనరించి తాము తీర్థపాదులు, సార్థక జన్ములు. నాబోటి యసమర్థుని, కృతార్థుని జేయ సమర్థులు. అనుగ్రహింపుమనగానే, ఇతడే సిద్ధప్ప అని నారాయణ తీర్థులు గ్రహించిరి. అతనిని ఒక పదం పాడుమని విని ఈతని ముఖ కవళిక, కనుముక్కుతీరు

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.

కంఠమాధురి ఈ కళకు వన్నెదెచ్చునట్లున్నది. అయినను బీజం నాటుదును. ఈ క్షేత్రమందు. ఇది ఎట్లు జగద్విఖ్యాతిగా నల్లుకొని, యశఃఫలమార్జించునో! అని తలంచి ప్రతి దినము ఈ మధు, నారాయణులతో పాటు పాఠములు వ్రాసికొని సాధన చేయి. నీది వారిది ఒక గ్రామమేగా ఇప్పుడు. అని చెప్పి నిష్క్రమించును.

తృతీయ రంగములో తీర్థులవారిల్లు - శిష్యులు పాఠాలు అప్పగించుచుందురు. మిగిలినవారు పఠించుచుందురు. సిద్ధప్ప తానువచ్చి అయిదు సంవత్సరములైనదని గురువు గారి అనుగ్రహమువలన యేదో లభ్యమైనంతవరకు విద్యలభ్యమైనది. తీర్థయాత్ర చేసివచ్చినగాని బోధ పడదీ ప్రపంచము. అందులో మొన్న మధురానగర కీర్తన విన్నప్పటినుండి మధురబోని జన్మ ఎందుకని, మనస్సు వేగిరపడుచున్నది. గురువుల సేవ చేయుకొలది గోవిందుని కనులార జూడవేడుకగుచున్నది. వెంటనేబృందావనమునకేగి మధురానగరిలో ఆ వేణుగానలోలుని తిలకించి నా ఈ జన్మ సార్థకము చేసికొనెదను. ఆ పై గంగానదిలో స్నానమాడి, కాశికా విశ్వేశ్వరుని దర్శించి కాశీఘట్టమున గల బుధు లనుగ్రహింప, యింకను కొరవడ్డ శాస్త్రములనభ్యసించెదను. అనుకొని కాశీకి వెళ్ళాను. అది చూచి కొంతమంది కొంటె కుర్రాళ్ళు ఎగతాళిగా మాట్లాడుకుంటూ వుంటారు. దీనితో ప్రథమాంకము ముగియును.

ద్వితీయాంకము ప్రథమరంగములో సుశీల ఏదో కలత నిద్రతో లేచి కళ్ళు నలుపుకొంటు వుంటుంది. వీధిలో ఒక పాట వినిపిస్తుంది. తన భర్తకు భద్రమగుగాక! ఎక్కడ ఉన్నా క్షేమం కలుగుగాక అని తలచుకొని, ఈ జీవితమే కలకదా! కల కల్లయంటారు. కాని నాకు కళగా కనిపించును. అందులో నేడీ కాలమున ఎంత విచిత్రముగా నున్నది. “సిద్ధాన్నము స్వీకరించే భాగ్యములేదూ! అన్నం వండుకొనుట యొకటి, అనుభవించడం మరొకటియు నా కర్మ పరిపక్వమయింది.” ఏమి కల! కలలోని పల్కులు బహుశా నా భర్తకు విద్య పూర్తియైయుండాలి. ఇక రావచ్చును. కాని ప్రాప్తి లేకపోవడమంటే. జీవనాధారములేదనియా? ఎట్లా! విద్యవల్ల వినయము, విత్తము సర్వము చేకూరును గదా! ......................................అది కాదు ఉద్యోగముండదనియా భయం సుఖం లేదనా! ఆ విద్య వల్ల నాకు సుఖం లేదనా! ఎట్లాగు లేదు. ఇట్టివి విడదీయటానికి సామాన్య జ్ఞానం చాలదంటారు పెద్దలు. అని ఆ కల గురించి తర్కించుకొని తండ్రీ! జగద్రక్షకా! మన్మనోనాథుని త్వరలో గాంచననుగ్రహింపుమా! అంటూ కీర్తన నాలాపనచేయును. వీధి పాటకుడు ఒక పాట పాడును. ఇది బంగారు కలయా! అనుకుంటూ నిష్క్రమించును.

---

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి.
2. పోతనామాత్యుడు శ్రీమదాంధ్ర మహాభగవతము పుట 382

ద్వితీయాంకము ద్వితీయ రంగములో కృష్ణానదీ తీరం నది యిసుక తిన్నెలు, నడచి నీరును సమీపించుచు, సిద్ధప్ప శ్రీ కృష్ణుని మధురలో సేవించానని, కాశీ క్షేత్రమున విశ్వేశ్వరుని, భవానీని దర్శించానని, గంగా నదిలో స్నానం చేసానని, తన క్షేత్రమైన కృష్ణామండలీ ప్రాంతమును జేరితిని, మధురలో పరమాత్మ పలికించిన యక్షగాన, భాగవత ప్రబంధమును అచ్చటచ్చట కాలక్షేపము జేయుచు తిరిగి ఇల్లు చేరవలెననే తలంపుతో గుంటూరు మండలి నుండి కృష్ణానదీ ఘట్టములనీ శ్రీకాకుళపు రేవున దాట వచ్చితిని. ఆవల శ్రీకాకుళ దేవాలయమును చూచి ఆ క్షేత్రమహాత్మ్యము తలంచుకొనుచు కూచిపూడికి వెళ్ళదననుకొనును. అతడు వెళ్ళిపోవును. ఇంతలో ఇద్దరు చుక్కయ్య, వెంకన్న నది ఒడ్డున ఈ దృశ్యం తిలకించుచు మాట్లాడుకొనుచుందురు. తెరలో సిద్ధప్ప కృష్ణా! నాకీ బ్రతుకు పై యాశ లేదు. అంత్యేనారాయణస్మృతిః అన్నారు. కృష్ణా! కృష్ణా! కృష్ణవేణీమ తల్లి! నా యీ జీవిత భాగమునకిక స్వస్తియేనా! ప్రభూ కృష్ణప్రభూ! అని వినిపించును. చుక్కయ్య వెంకన్నలు సిద్ధప్ప కెరటాలలో కొట్టుకొనిపోవటం చూస్తారు. అతడు ఈత కొట్టి బయటకు రావాలని ప్రయత్నించడము చూస్తారు. ఇక సిద్ధప్ప

**"దరిజేరనీవ - నా - ధారమిక నీవ**
**కరుణింపనావ, - నీ - కల్లోలసాగరము"[1] దరిజేరనీవ**

అను కీర్తన పాడుచు మధురలో హాయిగా నీ కీర్తనలు పాడుకుంటూ వుండలేక పడిపోయినట్లుగా వచ్చాను. వెంటనే నేను ఇంటికి వెళ్ళాలనే తలంపుతో వచ్చాను. విధి నన్నిటులీడ్చెనే హరీ! న్యాయమా! పాయలన్ మునిగినన్ వెలిదీయవు, సాయవమీయవు. నేను సంసారలంపటుడనై, కామాంధతచే, ధనాశచే నిన్ను మరతునని, నీ స్మరణ విడతునని యెంచకు. పరీక్షింపకు. తండ్రీ! ఈ సంసారముపైననే కాదు నాయీ ప్రాణములపైన నేయాశలేదు. నీ దయ ఇదుగో సన్యసించెద. ఆతుర సన్యాసము స్వీకరించెద. గృహస్థాశ్రమమునకిదే కడపటి ముహూర్తము. అనుగ్రహింపుము తండ్రీ! యనుగ్రహింపుము!

ఉ॥ **"ఏల! యుపేక్ష జేసెదు! పదేపదె చెప్ప! ప్రవాహమాపి, ప్రా**
**ణాలవి, నిల్వఁజేసిన, ప్రియంబగు నీ చరితామృతమ్ము, నీ**
**లీలలు, పల్లెపల్లెలు, చలింపగఁబాడెద నాడెదన్ సదా**
**కాలికి, గజ్జెకట్టుకొని, కమ్మని కంఠముతో, కృతజ్ఞతన్."[2]**

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

ఉద్ధరింపుము! నన్నీ ప్రవాహమునుండి సముద్ధరింపుము.

ఉ॥ **"నీవ యెఱుంగబోదు, కరుణించిన నాటనుగోలె, తండ్రియా**
**ద్రావనియందు నీ భరతనాట్యము, పిల్లలు, పెద్దలున్ ముదం**
**బావహిలంగ, సల్పెడు ప్రయత్నము జేయుదు, కాళ్ళగజ్జెలన్**
**లీవిగ, ధిమ్మిధిమ్మని నటింప, జనుల్ గయిసేసి పొంగగా"[1]**

అనుగ్రహింపుము దేవా! అనుగ్రహింపుము దేవా!

అని ప్రార్థించుచుండును. చూస్తుండగానే ప్రవాహపు పొంగు తగ్గటము అతడు బయటకు రావటం జరుగును.

ద్వితీయాంకము తృతీయ రంగములో నది ఒడ్డున పొడి బట్టలు కట్టుకొని సిద్ధప్ప - అతని వెంట చుక్కయ్య వెంకన్నలు వస్తూ ఉంటారు. సిద్ధప్ప జరిగినదానికి ఆశ్చర్యపోయి అంతా దేవుడి లీల ఆయన ఏది చెయ్యటానికైనా సమర్థుడు గదా! నేనీ ఆపదలో ఇట్లాంటి శపథములు చేసితినే అని ఆలోచించి యిల్లు చేరిన బంధువులు, మిత్రులు నోటికి వచ్చిన మాటలు మాట్లాదురుగదా! లోకులేమనుకుందురో! అనుకుంటుండగా స్నేహితులు ఎదురైతే భార్య క్షేమాలు అడిగి తెలుసుకొనును. ఊళ్ళో వాళ్ళ విషయాలు కూడా అడుగును. తరంగాలు ఏమన్నా గుర్తున్నాయా! అని మధు అడుగగా ఎంత మాట తీర్థుల వారి తరంగాలేమిటి? మరుపా? దేశదేశాలు ప్రాకి జీవాలు నిలుపుతున్నాయిగా అని సమాధానం చెప్పెను. సిద్ధప్ప గడ్డం పరికించి సిద్ధేంద్ర యోగిగారూ! శెలవు అని మధు నిష్క్రమించును. వీధిలో పాటకుడు

**"తెలియజాలవుర - జీవా! ముందుగతి**
**తలపోసెదవు - కొండ - తలక్రిందుసేయ, మతి"[2]** **॥తెలియ॥**

అంటూ పాట పాడుతుండును.

తృతీయాంకములో కూచిపూడిలో సువాణం వారిల్లు, శయ్యాగృహం లోపల సుశీల పూలు ముడుచుకొనుచు అద్దము చూచుకొనుచు బల్ల పైని ఫలహారములు మొదలగునవి గల పళ్ళెరములు సర్దుచుండును. గది ప్రవేశించక పూర్వము బయటనే సిద్ధప్ప భార్యను కలవబోతున్నానను ఆనందముతో

1. శ్రీ గురుజాడ రాఘవశర్మ వ్రాతప్రతి 1, 2 పద్యాలు.

ఆలోచనలు చేయును. లోపల సుశీల నాటి భర్త రాక సుదినముగా తలపోయును. ఇరువురు సరస సల్లాప సంభాషణములతో కాలము గడిపిరి. తరువాత సిద్ధప్ప కాశీలో విద్యాభ్యాసము చేయుట, యాత్రలు చేయుట వివరించి తాను చేసిన శపథమును చెప్పినాడు. అప్పుడు సుశీల అతడు ఆతుర సన్యాసము స్వీకరించినాడు కావున భర్తగా స్వీకరించటానికి వీలే లేదని గ్రహించును. సిద్ధప్ప కూడా తాను చేసిన శపథము జ్ఞప్తికిఁదెచ్చుకొని గృహస్థాశ్రమ విధి తగదని భావించి నీవు పతివ్రతవు కావున నాకు కళ్ళు తెరిపించితివని క్షమించమని వేడును. ఇప్పుడు సక్రమ సన్యాసం కర్తవ్యమని గోపాలకృష్ణుని పద రాజీవములే మన కింక పట్టుగొమ్మలు. ఇక మన యజ్ఞాత జీవిత క్షేత్రములో పాత్రలు మార్చుకోవాలి. నీవు కృష్ణుడు కావాలి. నేను సత్యభామనయ్యెద. ఈ భామాకలాపం కొరకే మనలను పుట్టించాడు. ఈ విరహ వేదనాపూర్వకమైనదే పరమాత్మ నాచే వ్రాయించిన భాగవత ప్రబంధము. మధురలో మన పాత్ర లే సృష్టించి వ్రాయించినాడు. ఇక నూరూర పల్లెపల్లెల తన పేరు చెప్పుకొని బ్రతుకమన్నాడు. ఆ కృష్ణ భక్తియే మనకిక శరణ్యము. నాతో నాడుచు పాడుచూ శ్రీ కృష్ణ లీలామృతం గ్రోలి జన్మ చరితార్థం జేసికో నేను తెనుగు నాటగల, పల్లెపల్లెల కాలికి గజ్జె కట్టుకొని, తన కథ నాడించి, పాడించెదనని అభయమిచ్చితిని గదా! ఈ భాగవత ప్రబంధం భరత నాట్య పద్ధతుల దేశదేశముల నాకర్షించునట్లుగా నా ప్రయత్నము నేను చేసెద. అన్నింటికి ప్రేరకుడై యాడించునాతడున్నాడు కదా! పద అనుకుంటూ ఇరువురు నిష్క్రమింతురు.

అగ్రహారం చెట్టునీడ - కాలక్షేపణగా చుక్కయ్య, వెంకన్న, మధు, నారాయణులు ప్రవేశింతురు. ఏవేవో సుశీలకి అన్యాయం జరిగిపోయిందని మాట్లాడుకొందురు. సద్గురు ఆశీర్వాదము వలన ఈశ్వరానుగ్రహము వలన సిద్ధప్ప మొదట భరత శాస్త్రం నేర్చిన వాడై కృష్ణామండలం ప్రవేశించక పూర్వం, కళా కోవిదులను దర్శించుచూ, మన వేదఘట్టాలు గల కొల్లూరు అగ్రహారం చేరుకున్నాడు. తరువాత సుశీలతో వివాహం జరగటం, సువాణం వారి కచేరి సావిడి సకల కళా నిలయమగుట మొదలగు విషయాలు చర్చించుకొనిరి.

చతుర్థాంకములో సువాణం వారి కచేరి సావిడి - సకల కళానిలయము సిద్ధేంద్రయోగి, వెంకట నారాయణ, మధు, చుక్కయ్య, వెంకయ్య వగైరా ప్రవేశిస్తారు.

గురువు సిద్ధేంద్రయోగి : నాయనా! వెంకట నారాయణా!

నీవేనోయి, తెనుగునాట భరతనాట్యం పేరు నిలుపగలవాడవు. అందులో ముఖ్యంగా భాగవతంలోని, సత్యభామాభినయ భాగం నీ కొఱకే వ్రాయించినట్లున్నది. వ్రాసికొను నాయనా! నీ భాగం అని భామాకలాపం చెప్పెను. మిగతా వారికి మిగతా పాత్ర పోషణలు వివరించి ఎవరెవరు ఏ వేషం వేసికోవాలో వివరించెను. కృష్ణుడు, సత్యభామ వేషాలలో చక్కగా నటిస్తారు. దానిలో సత్యభామకు ఉత్తరం వ్రాసి పంపు. కనికరము కలుగుతుదేమోనని చుక్కయ్య చెబితే కమ్మ వ్రాస్తుంది. గురువుగారు నాయనా! నారాయణా! జడ విప్పేసరికి, ఉత్తరం వ్రాసేసరికి కోడి కూసింది. మన్మథ దూషణ, చంద్రదూషణ మొదలు పెట్టిన ఇంకా మూడురాత్రులు పడుతుంది. ఇంక ఇది చాలించండి అని గురువు అంటారు. శిష్యులు భరత నాట్యం అభినయిస్తారు. గురువుగారు శిష్యులందరిని పిలిచి నేను పెద్దవాడినయ్యాను మన తెనుగు గడ్డ, అగ్రహారం పేరు నిలపండి. మన యింట పుట్టిన ప్రతి బిడ్డ కాలికి గజ్జె కట్టుకొని నృత్యం చేయాలి అని కోరును. పైనుండి పుష్ప వర్షం కురియును. చివర మంగళ వాచకం పలికిరి. దీనితో ఈ నాటకం తెర పడును.

ఈ విధముగా శ్రీ శర్మగారు సిద్ధేంద్రయోగి నాటకమును భక్తిరసమును శృంగార రసమును మేళవించి ఒక మనో హరమైన నాటకముగా తీర్చి దిద్దుటయే గాదు ఆపాత్రల సంభాషణలు గాని, పద్యాల, కీర్తనల నడకలో గాని ఆ శ్రీ కృష్ణుని కన్నులకు గట్టినట్లు పాత్రచిత్రణ గావించిరి. భక్తి రసము పొంగులు వారినది. వీరి కృష్ణ భక్తికి ఈ సిద్ధేంద్రయోగి నాటకము కూడ తార్కాణము. అడుగడుగునా హృదయము పరవశించి పరవళ్ళు త్రొక్కినది.

"కృష్ణం వందే జగద్గురుమ్."

# ఉపయుక్త గ్రంథసూచిక

## 'కవిశేఖర' శ్రీ గురుజాడ రాఘవశర్మ రచనలు – పరిశీలన

| వరుస సంఖ్య | పుస్తకము పేరు | రచయిత | ప్రచురణ సంస్థ | సంవత్సరము |
|---|---|---|---|---|
| 01. | అంజలి | గురుజాడ రాఘవశర్మ | బృందావన ప్రచురణలు, మచిలీపట్టణము | 1968 |
| 02. | అమ్మ దివ్యచరిత్ర | కందికొండ సత్యనారాయణ శాస్త్రి | బృందావన్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, మచిలీపట్టణము | 1993 |
| 03. | అప్పకవీయ భావప్రకాశిక | రావూరి దొరస్వామి | త్రివేణి పబ్లిషర్స్, మచిలీపట్టణము | 1970 |
| 04. | ఆంధ్రనాయక శతకము | కాసుల పురుషోత్తమ కవి | రాయల ముద్రణాలయము, తణుకు | 1958 |
| 05. | ఎందరో మహానీయులు స్వాతంత్ర్య సమర యజ్ఞంలో | గురుజాడ రాఘవశర్మ | బృందావన ప్రచురణలు, మచిలీపట్టణము | 1985 |
| 06. | కల్పలత | గురుజాడ రాఘవశర్మ | బృందావన ప్రచురణలు, మచిలీపట్టణము | 1967 |
| 07. | కావ్యాలంకార సంగ్రహము | సన్నిధానము సూర్య నారాయణ శాస్త్రి | యం. శేషాచలం అండ్ కంపెనీ, మచిలీపట్టణము | 1959 |
| 08. | కాళరాత్రి | గురుజాడ రాఘవశర్మ | బృందావన ప్రచురణలు, మచిలీపట్టణము | 1979 |
| 09. | గరిమెళ్ళ సత్యనారాయణ గారి జీవితచరిత్ర | గురుజాడ రాఘవశర్మ | బృందావన ప్రచురణలు, మచిలీపట్టణము | 1985 |
| 10. | గాయత్రీ మహామంత్రము | ముమ్మన్నేని లక్ష్మీ నారాయణ | ఆర్యయువక పరిషత్ సికింద్రాబాద్ ఆంధ్రప్రదేశ్ | 1979 |

| వరుస సంఖ్య | పుస్తకము పేరు | రచయిత | ప్రచురణ సంస్థ | సంవత్సరము |
|---|---|---|---|---|
| 11. | జాతీయ గీతములు | గురుజాడ రాఘవశర్మ | ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కళాభవన్ సైఫాబాద్, హైదరాబాద్ | 1973 |
| 12. | నవకాళి | గురుజాడ రాఘవశర్మ | వేంకట్రామ పేపర్ ప్రొడక్ట్స్, నారాయణ గూడ, హైదరాబాద్-29 | 1981 |
| 13. | బాపూజీ | గురుజాడ రాఘవశర్మ | బృందావన ప్రచురణలు, మచిలీపట్టణము | 1948 |
| 14. | మచిలీపట్టణ చరిత్ర | డి.వి. రాఘవరావు | విండీస్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ | 2001 |
| 15. | మానాన్నగారు | ద్వా.నా. శాస్త్రి | కిన్నెర పబ్లికేషన్స్ | 2009 |
| 16. | ముకుందమాల | గురుజాడ రాఘవశర్మ | కేశవ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ | |
| 17. | యజుర్వేద సంధ్యా వందనము | జయన్తి సుబ్రహ్మణ్య శాస్త్రి | వసుంధర పబ్లికేషన్స్ రాజమండ్రి - 3 | |
| 18. | వాసుదేవ నామ శతకము | గురుజాడ రాఘవశర్మ | యం. శేషాచలం అండ్ కో, మచిలీపట్నము | 1945 |
| 19. | శబ్దరత్నాకరము | బహుజనపల్లి సీతారామాచార్యులు | ది. మద్రాసు స్కూల్ బుక్ అండ్ లిటరేచర్ సొసైటీ, మద్రాసు | 1959 |
| 20. | శివానందలహరి | శ్రీ శంకరాచార్యకృతము | శ్రీ రామకృష్ణా ప్రింటింగ్ వర్క్సు, తెనాలి. | 1930 |
| 21. | శ్రీగురుగీత | సంకలనం: - అవధూత గణపతి సచ్చిదానంద స్వామీజీ | రాగరాగిణి ట్రస్ట్ అవధూత దత్త పీఠమ్ దత్తనగర్, మైసూర్ | 2005 |

| వరుస సంఖ్య | పుస్తకము పేరు | రచయిత | ప్రచురణ సంస్థ | సంవత్సరము |
|---|---|---|---|---|
| 22. | శ్రీస్తుతిః | అగ్నిహోత్రం యోగానంద నరసింహాచార్య | | 1995 |
| 23. | శ్రీ లక్ష్మీ దివ్యగుణ వైశిష్ట్యము | గురుజాడ రాఘవశర్మ | బృందావన ప్రచురణలు, మచిలీపట్టణము | |
| 24. | శ్రీమద్భగవద్గీత | | గీతాప్రెస్, గోరఖ్‌పూర్, ఉత్తరప్రదేశ్ | 2005 |
| 25. | శ్రీ సువర్చలాంజనేయమ్ | గురుజాడ రాఘవశర్మ | బృందావన ప్రచురణలు, మచిలీపట్టణము | 1985 |
| 26. | శ్రీ మదాంధ్రమహా భాగవతము | బమ్మెర పోతన | టి.టి.డి. ప్రచురణ | 1992 |
| 27. | సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశము | దివాకర్ల వేంకటావధాని | | |
| 28. | సతీమల్లికాంబస్మృతి | గురుజాడ రాఘవశర్మ | బృందావన ప్రచురణలు, మచిలీపట్టణము | 1983 |
| 29. | సువాసినీ పూజ | మాహేశ్వరః | శ్రీ వాణీ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, మచిలీపట్టణము | 2000 |
| 30. | సౌందర్యలహరి | శ్రీశంకరాచార్యకృతము | వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ చెన్నపురి | 1945 |

## పత్రికలు

1. ఆంధ్రపత్రిక - ఆదివారం మార్చి 23, 1980.
2. ప్రజారథం - 10 ఏప్రియల్ 1970
3. ఈనాడు, కృష్ణాజిల్లా ఎడిషన్ 9-8-1997 (స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భముగా ప్రచురించినది.)

## ముఖాముఖి

1. స్వాతంత్ర్య సమరవీర ఆవేశ కవితాధీర శ్రీ గురుజాడ రాఘవశర్మ - డా॥ ప్రసాదరావు కులపతి